# అన్నమయ్య బహుముఖ ప్రాభవం

( The Multi-Faceted Personality of Annamayya )



సంపాదకుడు

ఆచార్య చిట్రాజు గోవిందరాజు

# అన్నమయ్య బహుముఖ ప్రాభవం

## ( The Multi-Faceted Personality of Annamayya )

సంపాదకుడు

**ఆచార్య చిట్రాజు గోవిందరాజు**

ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి-517 502

నవంబర్ 2010

# అన్నమయ్య బహుముఖ ప్రాభవం

**( The Multi-Faceted Personality of Annamayya )**


సంపాదకుడు :

**ఆచార్య చిట్రాజు గోవిందరాజు**
ప్రాచ్యపరిశోధన సంస్థ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి-517 502
మొబైల్ : 09441116499



జ్యోత్స్న పబ్లికేషన్స్-3


(C) సంపాదకులు



ప్రతులకు :

**శ్రీమతి సి. నాగేశ్వరి**
నెం. 52, రెడ్ బిల్డింగ్స్
యస్.వి.యు. క్యాంపస్
తిరుపతి-517 502
ఫోన్ నెం. : 0877-2248899

ప్రథమ ముద్రణ : నవంబరు, 2010

ప్రతులు : 1000

వెల : రూ. 350/-

ముద్రణ :

సి.యన్. ప్రింటర్స్,
ప్రకాశంరోడ్, తిరుపతి
**Cell : 9848264047**

# అంకితం



సహాధ్యయనంలోనే సముద్భవించిన సఖ్యాన్ని
సజీవంగా నిలిపిన సౌమ్యధనుడు.

అన్నమయ్య మీద పరిశోధన చేయడమేగాక అన్నమయ్య
సాహిత్య సౌరభాన్ని అన్నిదిశలా వెదజల్లే అన్నమాచార్య ప్రాజెక్టుకు
అధినేతృత్వం వహించిన అతులఘనుడు.

నా అన్నమ సేవాపథంలో తోడుగా నిలిచి ప్రోత్సహించిన సన్మానసుడు.

నాలో తననూ, తనలో నన్ను చూచుకొని స్పందించే
ప్రేమార్ద్ర హృదయుడు.

మూర్తిదాల్చిన సాహిత్యమే స్ఫూర్తిగా, ఆత్మీయతానురాగాలు
భాసించే మన్మిత్రుడు.

పంచ సహస్రావధాని **డా॥మేడసాని మోహన్**కు
ఆత్మీయంగా అందిస్తున్నా

**ఈ కానుక.**

అక్షరమైన జ్ఞాపిక
**చిట్రాజు గోవిందరాజు**

# విషయానుక్రమణిక


ఆలోచనా ప్రవంతి viii

**Foreword** xii

వాఙ్మయ విరాణ్మూర్తి - అన్నమయ్య xvii

జీవిత సమగ్రదార్శనికుడు - అన్నమయ్య xx

1. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర - విశేషాలు 1
   - కేసర్లవాణి

2. అన్నమయ్య సంకీర్తనలలో ప్రతిఫలించిన వేదమంత్రాలు 18
   - టి.అనంతనారాయణ

3. అన్నమాచార్యులు - ఉపనిషత్తత్త్వాలు 34
   - టి.యస్.ఆర్.నారాయణన్

4. అన్నమయ్య సంకీర్తనలపై నాలాయిర దివ్యప్రబంధ ప్రభావం 51
   - కాసల నాగభూషణం

5. అన్నమాచార్య సంకీర్తనలలో ఆగమ విశేషాలు 64
   - వేదాంతం రాజగోపాలచక్రవర్తి

6. అన్నమయ్య సంకీర్తనలపై భగవద్గీత ప్రభావం 76
   - యం. గోవిందస్వామి నాయుడు

7. అన్నమయ్య సంకీర్తనలు - అద్వైత సంప్రదాయధోరణి 88
   - పి.వి. సుబ్బారావు

8. అన్నమయ్య - ఆధ్యాత్మికత 100
   - బూదాటి వేంకటేశ్వర్లు

9. అన్నమయ్య సంకీర్తనల్లో రామాయణ భారత కథలు 120
   - గుమ్మా సాంబశివరావు

10. అన్నమాచార్య సంకీర్తనలలో ప్రతిఫలించిన పౌరాణిక గాథలు- తాత్త్వికత - సి.లలితారాణి 134

11. అన్నమయ్య తాత్త్వికత 149
- బూదాటి వేంకటేశ్వర్లు

12. సృజనాత్మక తాత్త్వికుడు - అన్నమయ్య 164
- ఆర్వీయస్ సుందరం

13. అన్నమయ్య దర్శించిన శ్రీవేంకటేశ్వర తత్త్వవైభవం 173
- జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

14. అన్నమయ్య శృంగార సంకీర్తనలు - సామాజిక శృంగారతత్త్వం 181
- గల్లా చలపతి

15. అన్నమాచార్య సంస్కృత సంకీర్తనలు 211
- సముద్రాల లక్ష్మణయ్య

16. అన్నమయ్య సంకీర్తనల్లో స్థితిపంచకం 222
- బి.కల్పన

17. భక్తి - మూలతత్త్వం 230
- యార్లగడ్డ బాలగంగాధరరావు

18. భక్తి రస ప్రస్థానానికి అన్నమయ్య చేసిన దోహదం 250
- ముదివేడు ప్రభాకరరావు

19. అన్నమయ్య సంకీర్తనలు - భక్తియోగం 290
- ఎస్. గంగప్ప

20. అన్నమయ్య సంకీర్తనలు - భక్తిమార్గాలు 302
- జక్కంపూడి మునిరత్నం

21. అన్నమయ్య సంకీర్తనలు - విష్ణుభక్తులు 319
- ఎలవర్తి చంద్రమౌళి

22. అన్నమయ్య సంకీర్తనలు - శరణాగతి తత్త్వం 339
- పర్వతనేని సుబ్బారావు

23. అన్నమయ్య సంకీర్తనలలో జీవేశ్వర సంబంధం 353
- శేషభట్టర్ వసుమతీదేవి

24. అన్నమయ్య - నైచ్యానుసంధానం 369
- ఎలవర్తి చంద్రమౌళి

25. అన్నమయ్య సంకీర్తనల్లో దశావతారాలు 377
- డి. యువశ్రీ

26. అన్నమయ్య స్తుతించిన దేవతామూర్తులు 389
- పొన్నగంటి చిన్నవెంకటేశ్వర్లు

27. అన్నమయ్య ప్రాపంచిక దృక్పథం 409
- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

28. అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకము - వర్ణనలు 425
- గార్లపాటి దామోదర నాయుడు

29. అన్నమయ్య - హిందీకవుల భక్తి తులనాత్మక పరిశీలన 439
- భమిడిపాటి విశ్వనాథ్

30. Cultural Life as Reflected in Annamayya's Songs 446
- T. Surendra Reddy

వ్యాసకర్తల చిరునామాలు 455

# ఆలోచనా స్రవంతి

శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతటి అద్భుతదైవమో తాళ్లపాక అన్నమాచార్యులు అంతటి అద్భుతభక్తుడు, తాత్త్వికుడు. క్రీ.శ. 1408వ సంవత్సరంలో తాళ్లపాక గ్రామంలో పుట్టి తన జీవితమంతా శ్రీవేంకటేశ్వర స్వామికే సమర్పించి, తిరుమల శ్రీవారిసన్నిధిలో క్రీ.శ.1503లో ఈ మహానుభావుడు పరమ పదించాడు. ఆ పరాత్పరుని లీలావైభవాలను 32వేల సలక్షణ, శృంగార, అధ్యాత్మ సంకీర్తనలలో వర్ణించి సంగీతాత్మకంగా ఆలాపించి భారతీయ భక్తి వాఙ్మయంలో తెలుగు పదకవితా వాఙ్మయంలో, వాగ్గేయ కారుల్లో 'నభూతో నభవిష్యతి'గా ప్రసిద్ధికెక్కిన మహనీయుడు. తాళ్లపాకవారి సంకీర్తనలను వారికాలంలోనే రాగి రేకుల మీద వ్రాయించి తిరుమల ఆలయప్రాంగణంలోని తాళ్లపాక అరలో భద్రపరచడం కూడ ప్రపంచ సాహిత్య చరిత్రలో ఎక్కడాలేని ఒక అపూర్వ విషయం. భవిష్యత్తరాల వారికోసం స్వామివారికి సంబంధించిన సంకీర్తనలు శాశ్వతంగా లోకంలో నిలుపుకోవాలనే తాళ్లపాక వారి ముందుచూపు బహుప్రశంసనీయం.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1976–78వ సంవత్సరం ఎం.ఎ. తెలుగు విద్యార్థులకు అన్నమయ్య సంకీర్తనలు ప్రత్యేక పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. అప్పటి విద్యార్థి అయిన నేను అన్నమయ్య సంకీర్తనల స్థానంలో ద్రావిడభాషల తులనాత్మక సాహిత్యం చదువుకున్నాను. 1980లో 'కరుణకుమార' కథలపై ఎంఫిల్ పట్టా పొందాను. ఉగ్యోగ నిమిత్తం నాలుగేళ్లు కాళ్లు అరిగేలా తిరిగాను, ఫలితం శూన్యం. 1984లో నా పరిస్థితిని గమనించిన ఆచార్య సర్వోత్తమ రావుగారు తన పర్యవేక్షణలో 'అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవ విశేషాలు' అనే అంశంపై ఒక సంవత్సరకాలంలోనే పరిశోధన చేయించారు. అప్పటి నుండి అన్నమయ్య రచనలపై భక్తి భావాన్ని పెంచుకొని వ్యాసాలు వ్రాయడం, వాటిని వివిధ పత్రికలలో ప్రచురించడం, ఆ ప్రచురించిన వ్యాసాలను పుస్తక రూపంలోకి తీసుకురావడం జరిగింది. 1989లో ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అన్నమయ్యమీద పరిశోధనలు చేయించడం వ్యాసాలు

వ్రాయడం, సదస్సులలో పాల్గొనడం, నాకు తెలిసిన నాలుగు మంచిమాటలు అన్నమయ్య గురించి చెప్పడం మానుకోలేదు. మన విశ్వవిద్యాలయంలో అన్నమయ్యపై విస్తృతంగా పరిశోధనలు జరిగిన మాట వాస్తవమే గాని ఒక సదస్సుగూడ జరగలేదనే కొరత నా మనస్సులో మెదులుతుండేది.

తాళ్లపాక అన్నమాచార్యులు 600 సంవత్సరాల జయంతి సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు తిరుమల తిరుపతి దేవస్థానంవారు అన్నమయ్య స్వస్థలమైన తాళ్లపాక గ్రామంలో, నివాస స్థలమైన తిరుమల తిరుపతులలో అత్యంత వైభవంగా సంగీత సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంగా "ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రీసెర్చి, న్యూఢిల్లీ" వారి ఆర్థిక సహకారంతో 2009 మార్చి 12-14 తేదీలలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధనసంస్థ, తిరుపతిలో "తాళ్లపాక అన్నమా చార్యుల వైష్ణవ భక్తితత్త్వం"పై మూడు రోజుల జాతీయ సదస్సును నా సంచాలకత్వంలో నిర్వహించడమైంది. ఆ సదస్సులో పాల్గొని సమర్పించిన పత్రాలలో 30 వ్యాసాలు ముద్రణకు అర్హమైనవిగా గుర్తించనవే మీచేతిలోని ఈ పుస్తకం. ఇందులోని అభిప్రాయాలు ఆయా వ్యాసకర్తలవే.

మొదటివ్యాసం తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత విశేషాలను స్థూలంగా ఆవిష్కరిస్తుంది. ఆ తర్వాతి ఏడు వ్యాసాలు అన్నమయ్య సంకీర్తనల ద్వారా ప్రస్ఫుటమయ్యే వేదమంత్రాలు, ఉపనిషత్తత్త్వాలు, ఆగమ, భగవద్గీత, ఆళ్వారుల దివ్యప్రబంధ విశేషాలు, అద్వైత సంప్రదాయ ధోరణి వివరాలు తెలుస్తాయి. మరో 9 వ్యాసాలు అన్నమయ్య సంకీర్తనలలోని పౌరాణిక గాథలు, సృజనాత్మక తాత్త్వికత, వేంకటేశ్వర తత్త్వవైభవం, సామాజిక శృంగార తత్త్వం, స్థితిపంచకం మొదలైన అంశాలు విశ్లేషించేవిగా వున్నాయి. ఆ తర్వాతి 10 వ్యాసాలు అన్నమయ్య సంకీర్తనలలోని భక్తిరసం, భక్తియోగం, భక్తిరకాలు, విష్ణుభక్తులు శరణాగతి తత్త్వం, జీవేశ్వరసంబంధం, దశావతారాలు, వివిధ దేవతామూర్తుల విశేషాలు ఉదాహరణ పూర్వకంగా విశదీకరించేవిగా ఉన్నాయి.

చివరి మూడు వ్యాసాలు అన్నమయ్య కాలంనాటి సంస్కృతి, సామాజిక తను ఆవిష్కరిస్తాయి. ఒక వ్యాసం అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకానికి,

మరొక వ్యాసం అన్నమయ్య – హిందీ కవుల భక్తితత్త్వానికి సంబంధించినవి. చివరి వ్యాసం సంస్కృతికి సంబంధించిన ఆంగ్ల వ్యాసం.

ఈ వ్యాసాలను పుస్తకరూపంలోకి తీసుకువస్తే 'తాళ్లపాక అన్నమాచార్యుల బహుముఖ ప్రాభవం' తెలుగు ప్రపంచానకి తెలిసివస్తుందని పలువురు మిత్రుల కోరిక. అన్నమయ్య కవిపండితులకే గాక ముముక్షువులకు సైతం కొత్తదారులు చూపి భగవంతుణ్ణి గూడ తన సంకీర్తనలతో పులకింపజేశారు. అందుకే వేటూరి ప్రభాకరశాస్త్రి అన్నమయ్యను చదవనివాడు తెలుగు చదివినట్లే కాదని అన్నారు. వారి మాటలు నిజంకావాలంటే ఈ వ్యాసాలన్నీ ముద్రణ రూపంలోకి తీసుకురావాలని, తీసుకువస్తే పండిత పరిశోధకులకు, సామాన్యులకు అన్నమయ్య గొప్పతనం తెలిసే అవకాశం వుంటుందనే సదుద్దేశ్యంతోనే ఆ ప్రయత్నం చేశాను. ఈ పుస్తకాన్ని మీరు చదివి మరికొంతమంది చేత చదివిస్తారని మనఃస్ఫూర్తిగా పాఠకులను కోరుతున్నాను.

తాళ్లపాక అన్నమాచార్యులపై పరిశోధన చేయించి నాచేత అనేక వ్యాసాలును వ్రాయించిన మద్గురువర్యులు తెలుగు అధ్యయన శాఖలో విశ్రాంతాచార్యులైనా, అవిశ్రాంతంగా తరగని ఉత్సాహంతో ఉద్యోగం చేస్తున్న ఆచార్య కె. సర్వోత్తమ రావుగారికి, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో జరిగిన, జరుగుతున్న అనేక కార్యక్రమాలలో పాల్గొనే సదవకాశాన్ని కల్పించడమేగాక ఈ పుస్తకానికి అభిప్రాయం వ్రాసియిచ్చిన నా సహాధ్యాయి, ఆత్మీయ మిత్రుడు పంచసహస్రావధాని డా॥ మేడసాని మోహన్‌గారికి కృతజ్ఞతలు. నేను కోరినదే తడవుగా ఐ.సి.పి.ఆర్. వారు సదస్సు నిర్వహణకు ఒక లక్షరూపాయలు గ్రాంటు మంజూరు చేసినందులకు నా ప్రత్యేక ధన్యవాదాలు. మూడు రోజుల అన్నమయ్య జాతీయ సదస్సు పత్రాలను ముద్రించమని పదే పదే చెప్పి ప్రోత్సహించడమే గాక ఈ పుస్తకానికి ఆంగ్లంలో అభిప్రాయం వ్రాసి తన వాత్సల్యాన్ని నాపై కురిపించిన ఫిలాసఫీ విశ్రాంతాచార్యులు సి.రామయ్య గారికి, మంచిని మెచ్చుకుంటూ మా సంస్థలో జరిగే సదస్సులలో పాల్గొంటూ మంచి పత్రాలను సమర్పించడమేగాక, అభిమానంతో పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి, పుస్తక శీర్షికను సూచించి, సుదీర్ఘ అభిప్రాయం వ్రాసిన నా సహోద్యోగి,

సద్విమర్శక మిత్రులు డా॥ యం.ప్రభాకరరావుకు కృతజ్ఞతలు. సదా నా అభివృద్ధిని ఆకాంక్షించే ప్రియమిత్రులు శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ వైస్-ప్రెసిడెంట్ డా॥ ఎస్.విజయకుమార్‌కు, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య కడప రమణయ్యకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేసిన ప్రతిఒక్కరికి, సదస్సు సఫలమయ్యేందుకు సహకరించిన మా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఎన్. ప్రభాకరరావుగారికి, ప్రాచ్య పరిశోధన ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వేమూరి వేంకటరమణారెడ్డిగారికి, తదితర సిబ్బందికి, డి.టి.పి. చేసి యిచ్చిన నా పరిశోధక విద్యార్థిని జి.రమకు, అభిప్రాయాలను డి.టి.పి. చేసి పేజినేషన్ చేసి యిచ్చిన నా స్నేహితుడు శ్రీనివాసులు కుమారుడు యస్.చంద్రశేఖర్‌కు అందంగా ప్రింట్‌చేసి యిచ్చిన సి.యన్. ప్రింటర్స్ వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతాంజలులు.

రాజంపేట నివాసి, మంచికి మారుపేరు అయిన శ్రీ పోలా వెంకటరెడ్డి గారు అన్నమయ్యకు సంబంధించిన పుస్తకాన్ని సొంతఖర్చులతో ప్రచురిస్తున్నానని తెలిసి గుప్తంగా కొంత ఆర్థిక సహాయం చేశారు. ఆ విషయాన్ని నేను అక్షర రూపంలో పెట్టడం నా ధర్మంగా భావిస్తున్నాను.

నేను చేసే మంచిపనులను సదా ప్రోత్సహిస్తూ, ఇంటి వద్ద ఏ పనులు చెప్పకుండా, సదస్సుకు వచ్చిన అతిథులకు మంచి భోజనం పెట్టమని చెప్పిన చెప్పుతున్న నా శ్రీమతి సి. నాగేశ్వరికి, సుదూర ప్రాంతాల ప్రయాణాలు మానుకొని కాలేజి పనులకు మాత్రమే పరిమితమైవుంటూ ఆరోగ్యం జాగ్రత్త అంటూ హెచ్చరించే నా కుమార్తెలు శోభారాణి, జ్యోత్స్నలకు, అల్లుళ్లు ఎలవర్తి వాసు, శీనాలకు, నా గొంతు వినగానే 'తాతా' అని పలుకరించే మనుమరాలు ఎలవర్తి జాగృతికి నా ఆశీస్సులు.

**చిట్రాజు గోవిందరాజు**

తిరుపతి
11-11-2010

*C. Ramaiah*

Bharati
B-32, Nalanda Nagar
Tirupati

# Foreword

Eulogized as 'Hari Kirthanacharya', 'Padakavitapitamaha', 'Panchamagama Sarvabhauma', 'Dravidagama Sarvabhauma', Annamayya is unique in several ways. He is a devotee, a man of letters, a religious and social reformer, a philosopher and a musician of high order.

Above all, he excels as a devotee and a composer of Sankirtanas in praise of Srinivasa of Tirumala. He composed and sang the Kirtanas on the Divyamangala Vigraha of Srinivasa, His Consort, His ornaments, the Prasadas, the holy Thirthas at Tirumala, His Vahanas, the festivals associated with the temple, His chariots, on His generosity in responding to the fervent appeals of his devotees in distress. Annamayya praises the Lord as the Royal Prince established on the Hills and bestower of the boons of the magnitude of mountains to his devotees. What a compassionate Lord He is! He stands by those who are in distress; He is Krishna to Draupadhi, Narasimha to Prahlada, Narayana to Gajaraja.

As per the account of his grandson, Chinnanna, he is supposed to have composed thirty two thousand sankirtanas, but at present, we are left with nearly fourteen thousand of them only.

I would go a little out of the way and say without any offence to the Lord of the Seven Hills that it is the luck of the Lord that He

had such a versatile devotee as Sri Tallapaka Annamacharya. It is the luck of that part of Andhra Pradesh, called Tallapaka, in Pottapinadu, to have produced such a wonderful devotee, a creative composer and singer. The unique character of Annamayya is that he is writer, a composer and a singer. Further, his Sankirtanas are the products of his first hand acquaintance with the Scriptures of the Hindu tradition – the Vedas, Puranas, Itihasas and the Divya Prabandhas of Alwars. He studied them, digested them and offered them, in the form of his unique sankirtanas unparalled in the Bhakti literature. Tallapaka Annamayya, a blemishless person who transformed all the Vedas into songs of adoration (సంకీర్తనలు) and was made pure by singing them in praise of you.

> సకల వేదములు సంకీర్తనములు చేసి
> ప్రకటించి నినుబాడి పావనుండైన
> అకలంకుడు తాళ్లపాకన్నమాచార్యుడు.

Each sankirtana excels in its unique nature. Annamayya appeals to the Lord as follows : Just only one Sankirtana is enough to protect us. Let the rest remain in your Treasury.

Annamayya was endowed with the thinking mind and the feeling heart, the heart that pined for the Lord. His Kirtanas emanated from such intellectual heights that cannot be scaled and such depths of his heart that can't be fathomed.

They are literary marvels and the outcome of devotional ferver. They are the invaluable treasure that Annamayya bequeathed to the Telugus in particular and devotees in general.

Men of letters witness extremely subtle literary novelties in his Sankirtanas, philosophers discover pearls of wisdom, the musicians discern musical compositions of highest order. They are alluring to the scholars and the laity alike.

Annamayya's Sankirtanas are spiritually edifying, intellectually illuminating, morally ennobling and emotionally satisfying.

From the point of view of religion, Annamayya was a blossomed Vaishnavaite, scattering the fragrance of Vishnubhakti, from the point of view of Philosophy, he was a chiselled Visistadwitin accepting as ultimate the triple tatvas, Jiva, Prakrti and Deva - the fitst two always dependent on the last; from the point of view of devotion, he was an exemplar of Saranagati, from the point of view of literature, Telugu language acquired new grace and beauty in his Sankirtanas. He was acclaimed rightly as padakavitapithamaha; from the point of view of music, we find in him a gifted musician.

If Tirumala is the abode of all forms of wealth as Annamayya observes, his Sankirtanas are the invaluable treasure that the Telugu have inherited.

His grand son Chinnanna, pays a befitting tribute to the Sankirtanas of his grand father as follows :

Having become scriptures, scientific treatises, legends and the essences of wisdom

pathways of persons who have subdued their passions elaborate and deep meanings of hymns and morals.

becoming the works of the secret love - sports of the Lord
Venkateswara

the utterances of Annamayya will be acclaimed as novel experiments

Annamayya underwent a divine transformation. His senses were elevated to perceive the subtle and the sublime in the apparently gross and the crude. His mind was fixed on the Lord. His eyes saw God alone, his hands worshipped the Lord alone, his legs took him round the abode of the Lord, his ears were attuned to listen to the songs of adoration of the Lord; his head bowed to Murari alone, his tongue uttered the praises of the Narahari only. He was so much immersed in the service of the Lord, so much God - Intoxicated that the Lord of seven hills alone mattered to him and none else.

Impressed by the elegance of Annamayya's Sankirtanas, when Saluva Narasimha Raya of Vijayanagar, who ruled from Penugonda, requested Annamayya to sing in Praise of him, he expressed his reluctance as follows :

People do not know on account of their pride

How to eat that which is bitter with a mouth filled with the sweets of
divinity.

The mouth habituated to utter the names of Hari and Narayana,
how can it talk about the names of others.

The mouth that regularly studies the Veda, how can it sing the songs
in praise of others. (3-456).

The tongue soaked in the name of the Lord will not be inclined to sing the glories of others.

Annamayya say's we sing you O Supreme Self delightfully thirty two times melodiously.

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పది రెండువేళల రాగాలను (3-467)

The book consists of papers presented at an ICPR Seminar on **The Vaishnava Bhakti Tattva of Sri Tallapaka Annamacharya,** held from 12th to 14th March 2009 at S.V. University, Tirupati. The papers centre round different aspects of Annamacharya's Sankirtanas such as Bhakti, Indian culture, Philosophy, Religion, Saranagati and Comparative Studies of Annamayya with Mirabai, Tulasi Das, Alwars and the like. They are contributions of eminent scholars conversent with the works of Annamayya and they throw light on the central teachings of Sri Annamacharya. They are highly illuminating. Prof. Govinda Raju, the Director of the Seminar who has done commendable work on Annamacharya, has done well to publish the papers. I congratulate Prof. Raju and I commend the book to the scholarly public.

Tirupati
10-11-2010

**C. Ramaiah**
Professor of Philosophy (Retd.)
S.V. University, Tirupati

పంచసహస్రావధాని
**డా॥ మేడసాని మోహన్,** ఎం.ఏ.,పిహెచ్.డి.,
డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్ట్
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

---

# వాఙ్మయ విరాణ్మూర్తి - అన్నమయ్య

హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురు డీతడన్నమయ్య

వైకుంఠనాధుని వద్ద వడి బాడుచున్న **వాడు**
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య
ఆకశపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాడు
ఆకడీకడ తాళ్లపాక అన్నమయ్య

అంటూ అన్నమయ్యను అవతార పురుషుడిగా, కారణజన్ముడిగా తాళ్ళపాక అన్నమయ్య తరువాత పదకారులు పేర్కొన్నా ఇది అక్షరాలా సత్యం. వేదాది వాఙ్మయాన్ని, మహాభారతాదులను ఆలంబనంగా చేసుకొని మానవజీవన సాఫల్యానికి కావలసిన విజ్ఞానసామగ్రిని వ్యాసమహర్షి ఎలా అందించాడో, శ్రీవేంకటేశ్వర తత్త్వాన్ని, మహత్త్వాన్ని ఆలంబనంగా చేసుకొని అన్నమయ్య అటువంటి సామగ్రినే తన వాఙ్మయం ద్వారా మానవ సమాజాని కందించాడు. అందుకే తిక్కన మహాకవి వ్యాసమహర్షిని కూడా నారాయణుని అవతారంగానే స్తుతించినాడు.

విద్వన్మోదవిధాయి, నిర్మలవచో విస్ఫూర్తి విఖ్యాతు గృ
ష్ణద్వైపాయను నీవెఱుంగుము విభున్ నారాయణుంగా, విప
శ్చిద్వంద్యంబగు భారతాధ్యయనముం జేయంగ శక్తుండు, ధ
ర్మాద్వైతుండు సరోజలోచనుడకా కన్యుండు తద్వాచ్యుడే

(శాంతి ప.6-476)

అని తిక్కన వ్యాసమహర్షిని గూర్చి చెప్పిన మాటలు ఎంత సత్యములో అన్నమయ్య విషయంలో కూడా పై కీర్తనలోని అంశములు కూడా అంతే సత్యములు.

**"అన్నమయ్య బహుముఖప్రాభవం"** అన్న ఈ బృహత్తరవ్యాస సంపుటి అన్నమయ్య వాఙ్మయ విరాణ్మూర్తి – అన్న అంశాన్ని నిరూపిస్తూ ఉంది. భారతీయ విజ్ఞాన సర్వస్వానికి మూలకందాలైన వేదాలు, ఉపనిషత్తులు, ఆగమశాస్త్రాలు, అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలు – మొదలైన అపార గహన వాఙ్మయంలోని నిత్యసత్యాలు, ధర్మసూత్రాలు వెలికితీసి అలతి యలతి పదాలతో తన పదకవితలలో ఆవిష్కరించిన అపరవ్యాసుడు తాళ్ళపాక అన్నమయ్య. ఈ సంపుటిలో "అన్నమయ్య సంకీర్తనలలో ప్రతిఫలించిన వేదమంత్రాలు – అన్న వ్యాసం నుండి, అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు"– అన్న సముద్రాల లక్ష్మణయ్యగారి వ్యాసం వరకు ఎంతో విషయ పౌష్కల్యం, ఆర్జవం కలిగి ఉన్నాయి. ఇంకా వేదాంతం రాజగోపాలచక్రవర్తి, ఆచార్య బాలగంగాధర రావు, కల్పన, ఆచార్య పర్వతనేని సుబ్బారావు, బూదాటి వేంకటేశ్వర్లు – వంటి రచయితల వ్యాసాలు పరిశోధనల లోతులు చూపిస్తున్నాయి. భారతీయ సనాతన జీవన విధానము నుండి అధునాతన జీవనములోని దైనందిన సమస్యలను అన్నమయ్య తన కవితలలో ఎట్లు స్పృశించి, పరిష్కారములను సూచించినాడో ఈ వ్యాస సంపుటి అందిస్తూ ఉంది. వేదప్రతిపాదితములైన శ్రీవైష్ణవ సంప్రదాయ విశేషాలు, జీవులకు అంతర్ముఖీన సంస్కారాన్ని ప్రసాదించే ఉపనిషత్తుల ప్రబోధాలు, అద్వైత – అధ్యాత్మ చింతనల సారాంశాలు – అన్నీ ఈ వ్యాససంపుటిలో అక్షరబద్ధమై సాక్షాత్కరిస్తున్నాయి. మొదటగా అన్నమయ్య జీవిత విశేషాలను సముచితంగా ఉగ్గడించిన డా॥ వాణిగారి వ్యాసం ఈ సంపుటికి ఎంతో శోభను చేకూరుస్తూ

ఉంది. పదకవితా పితామహుడు, పరమ భాగవతోత్తముడు నైన అన్నమయ్యను గూర్చి రేఖామాత్రంగా నైనా ముందుగా అందరూ తెలుసుకో వలసిన అవసరం ఎంతైనా ఉంది గదా!

ఇటువంటి బృహత్తర వ్యాససంపుటిని సంగ్రథనం చేసి, పరిశోధకులకు, వాఙ్మయ జిజ్ఞాసువులకు కావలసిన సారస్వత సామగ్రిని అందిస్తూ ఉన్న ఆత్మీయ మిత్రులు ఆచార్య చిట్రాజు గోవిందరాజు సదా సర్వదా అభినందనీయులు. తన పరిశోధనా పాటవాన్ని, సారస్వత వ్యాసంగాన్ని అన్నమయ్యకు అంకితంగా సదస్సులు నిర్వహిస్తూ, వ్యాసాలు సమర్పిస్తూ ఇతోధిక సేవ చేస్తున్న మా రాజు నిజంగా పరిశోధక రంగంలో మకుటం లేని మహారాజే!

శరణంటి మాతని సమ్మంధమున జేసి
మరిగించి మము నేలి మన్నించవే
సామవేదసామగాన సప్తస్వరములను
బాముతో నీసతి నిన్నుఁ బాడినయట్టి-
ఆముకొన్న తాళ్లపాకన్నమాచార్యుల
వేమరు మెచ్చిన శ్రీవేంకట నిలయా

తిరుపతి
దీపావళి 5-11-2010



**డా॥ ముదివేడు ప్రభాకరరావు**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం

తిరుపతి,
07-11-2010
(R) 0877-2262114
(M) 94418 72536

---

# జీవిత సమగ్రదార్శనికుడు - అన్నమయ్య

"ఎల్లవారు నెఱుఁగ రెల్లవానిని, భిన్న
విషయు లెల్లవారు విద్యలందు

అంటారు ఆదికవి నన్నయ అరణ్యపర్వంలో (2-174). ఒక వ్యక్తి అన్ని విద్యలలో నిష్ణాతుడు కాలేడు. ఒక్కొక్క విద్యలో ఒక్కొక్క వ్యక్తి నిపుణుడుగా రాణింపవచ్చును. ఇది లోకరీతి, అని నన్నయ చెప్పగా, దానికి గల కారణాన్ని అన్నమయ్య యిలా చెప్పాడు.

"హృదయంబు చంచలం, బిరవుగానదు గాన
చదువు బహుమార్గములఁ జాటు నటుగాన

- అధ్యాత్మ (1-145)

మానవ హృదయం చంచలమైనది. స్థిరత్వం లేనిది. నిలుకడలేనిది. పైగా, చదువులు చూద్దామా అంటే, అవి ఏకముఖంగాగాక, బహుమార్గాలలో బహుముఖీనంగా ఉండడంచేత, ఒకవ్యక్తి అన్నిమార్గాలలో, అనేకవిధాలుగా పయనించే సామర్థ్యం లేకపోవడం మూలాన, ఒక విద్యకే పరిమితమై అందులోనే తన నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి పాటుపడుతున్నాడు.

ఇటువంటి పరిస్థితుల్లో, ఒక వ్యక్తి తన బహుముఖీన ప్రతిభను ఎలా ప్రదర్శించగలడు? అనే ప్రశ్నకు కవిసమ్రాట్ విశ్వనాథ, కల్పవృక్ష మహా కావ్యంలో యిలా సమాధాన మిచ్చారు.

"వలయు విద్యకైకాగ్ర్య మభ్యసన వేళఁ
జనును బహుముఖత్వము ప్రదర్శనము వేళ"
- యుద్ధకాండ - నిస్సంశయ ఖండం (132)

చదివిన చదువు ఒకటే కావచ్చు. దానిని ఏకాగ్రతతో అభ్యసించాలి. ప్రదర్శించేటప్పుడు బహుముఖంగా నిరూపించాలి అంటారు. ఎలా? విద్యాభ్యాస కాలంలో విద్యార్థికి ఏకాగ్రత అవసరం. తదేకశ్రద్ధతో ఒక గురువు వద్ద చదివిన చదువును తన మేధస్సులో పదిలపరచుకోవాలి. ఇలా వివిధ గురువుల వద్ద ఎన్నెన్నో విద్యారహస్యాలు ఆకళింపుచేసుకొన్న విద్యార్థి, పండితుల సమక్షంలో ప్రసంగించేటప్పుడు తన గ్రహణ, ధారణ పటుత్వం చేత విభిన్నాంశాలను సమన్వయిస్తూ బహువిధాలుగా, బహుముఖాలుగా విద్యా విరాట్స్వరూపాన్ని ఆవిష్కరిస్తాడు. అప్పుడే చదివిన చదువుయొక్క సార్థక్యం లోకానికి వెల్లడి అవుతుంది. ఈ వాగ్రూపధార రచనారూపాన్ని కూడా సంతరించుకొన్నప్పుడు అది మరింత అన్వర్థమై పదికాలాలపాటు నిలుస్తుంది. అందుకే అప్పకవి అంటాడు -

"విరచించు శక్తి పుట్టని
పురుషుని చదువులు ప్రకాశములు కావు"

"writing makes a man perfect" అని ఆంగ్లసూక్తి!

చదివే చదువు కూడా, 'గుడ్డెద్దు చేనిలో పడినట్లు' కాకుండా, అర్థాన్ని, అంతరార్థాన్ని, ఆంతర్యాన్ని గ్రహించేవిధంగా ఉండాలంటూ అన్నమయ్య భగవంతుని కృపకూ, చదువుకూ లంకెవేసి వ్రాసిన సంకీర్తనలో యిలా చెప్పాడు-

పాటెల్లా నొక్కచో నుండు భాగ్యమొక్కచో నుండు
యీటు వెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు ॥పల్లవి॥

**సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు**
**గరిమ నీ కృప నిన్నుఁ గను నొకఁడు**
**ధరఁ బ్రయాసము తోడఁ దపము సేయు నొకఁడు**
**శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు** ॥పాటెల్ల॥

(అధ్యాత్మ 2-182)

ఇత్యాదిగా మరో రెండు చరణాలున్న పాటలో ఏమంటున్నాడంటే- సదాసర్వకాలం చదువుకుంటూ పోవడం సరైన పద్ధతి కాదు. చదివిన చదువులో ఏది కీలకమో, ఏది ప్రధానాంశమో దాన్ని పట్టుకొని బహు విషయ సమన్వయ జ్ఞానాన్ని సంపాదించడమే నిజమైన చదువు అంటున్నాడు. దానికి దేవునికృప తోడుకావాలి! పరమార్థం తెలుసు కోలేని విద్యవల్ల ప్రయోజనం లేదు. పోతన భాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో హిరణ్య కశిపుని మాటలు, దానికి ప్రహ్లాదుని సమాధానం చూస్తే సార్వకాలిక సత్యమేదో బోధపడుతుంది.

**కం॥ చదువని వాడజ్ఞుండగుఁ**
**జదివిన సదసద్వివేక చతురతఁ గలుగుం**
**జదువఁగ వలయును జనులకుఁ**
**జదివించెద నార్యు లొద్దఁ జదువుము తండ్రీ!** (7-130)

హిరణ్యకశిపుడు చెప్పినమాట అక్షరాలా సత్యాలే కాని చదివింపజేసిన చదువు పరమార్థానికి దూరమైన రాజకీయపు చదువు. "ఓం హిరణ్య కశిపాయనమః" అనే మూల మంత్రపు చదువు. దాన్ని తిరస్కరించిన ప్రహ్లాదుడు, నిజమైన విద్య ఏదో దాన్ని గురించి మాట్లాడాడు. చదువుల్లో రాజకీయాలు ఉండకూడదన్న ప్రప్రథమ విద్యార్థి ప్రహ్లాదుడు. అక్కడి నుండే ప్రహ్లాద చరిత్ర ప్రారంభమైంది.

కం॥ చదివించిరి ననుగురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు, నే
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్లఁ చదివితి తండ్రీ!** (7-166)

ప్రహ్లాదుడిచ్చిన ఈ సమాధానం. చాల చదువుకున్న ప్రహ్లాదుడు చదువుల్లో గల మర్మాన్ని, కీలకాన్ని యిట్టే పట్టుకున్నాడు. ప్రహ్లాదుని శీలమే దానికి గీటురాయి.

దేవదేవుని చింతించు దినము దినము!
**చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు!!**
కుంభినీధవు ఁజెప్పెడి గురుఁడు గురుఁడు!
తండ్రి హరిజేరుమనియెడి తండ్రి తండ్రి!!

అని చెప్పిన ప్రహ్లాదుని భక్తిమార్గమే అన్నమయ్య భక్తిమార్గం! ఈ పద్యం ప్రాచీన భారతీయ విద్యా విధానానికి సంపూర్ణ వ్యాఖ్యానం!

సరిగ్గా, అన్నమయ్య కూడా ప్రహ్లాద నారదాదుల భక్తిమార్గంలో చదువుకొన్న వాడనడానికి ఈ సంకీర్తన చరణం చూడండి -

**"వదల కిటు వేంకటేశ్వరుఁడే దైవంబనుచు,**
**జదువ గలిగిన మంచి చదువదియ పో!**
**పదిలముగ నీ విధము పట్టియ్యకుండినను**
**చదువు లసురలు మున్ను చదివేటి చదువు..."**

- అధ్యాత్మ (1-364)

ఏవిధంగా చదువుకోవాలో ఆ విధి విధానాలను విద్యార్థుల మనస్సులకు పట్టియ్యకుండా, అసురుల విద్యాబోధన దారిమళ్లించే చదువులు. చదువు ఏటి చదువు? అనే ప్రశ్నలోనే సమాధానం యిమిడ్చినాడు. అసురుల చదువులు ఏటిలో వేయవలసిన చదువులు అని సమాధానం. ప్రహ్లాదుని

చదువు ఏరును దాటింపజేసే చదువు అని నిర్ణయం. ఇది పోతన అన్నమయ్యల నిష్కర్ష!

భగవద్భక్తితో కూడిన చదువు ఎలావుంటుంది? అని ప్రశ్నించవచ్చు. భక్తితో కూడిన విద్యావిధానాన్ని అన్నమయ్య పదే పదే ప్రబోధించాడు. అన్నమయ్య తొలుత తండ్రివద్ద, తిరుమలపై ఘనవిష్ణువు వద్ద, ఆ తర్వాత అహోబలంలో ఆదివణ్శరకోపయతివద్ద చదివిన చదువు శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యాలు, విశిష్టాద్వైత సిద్ధాంత విచారమైనప్పటికీ దాన్ని బహుముఖీనంగా అన్నికోణాలలో విస్తృతపరచి, లోకశాస్త్ర కావ్యాద్య వేక్షణంతో వ్యాఖ్యానించడం చేతనే 'పదకవితా పితామహుడు'గా పిలువ బడినాడు.

ఒక సందర్భంలో ఆయన 'హృదయంబు చంచలంబు' (1-145) అన్నమాట చాల అర్థవంతమైనది. ఇది భగవద్గీతలో అర్జునుడు, శ్రీకృష్ణపరమాత్మతో - "చంచలం హి మనః కృష్ణ!" (6-34) అనేమాటతో సంవదిస్తూ ఉంది. గీతాచార్యుడే దానికి జవాబు చెప్పాడు.

"అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే"

"కుంతీ పుత్రుడైన ఓ అర్జునుడా! అభ్యాస వైరాగ్యాల చేత
చంచలమైన మనస్సును స్వాధీనపరచుకోవచ్చు" నన్నాడు.

అభ్యాస మంటే సాధన, మనస్సును దారిలోపెట్టే యోగసాధన! వైరాగ్య మంటే, ఈ జీవితం, ఈ సంపదలు శాశ్వతాలు కావు. ఒకనాటికి తప్పక నశించిపోయేవే! అనే నిశ్చయభావనమే వైరాగ్యం. సాధనతో కూడిన ఈ వైరాగ్య భావన మనస్సులో మెదలుతూ ఉండడమే, అష్టాంగ యోగానికి మొదటిమెట్టు.

పతంజలి యోగదర్శనంలోని ప్రథమ సూత్రమే - "యోగః చిత్తవృత్తి నిరోధః" - "ఇష్టానుసారంగా సంచరించే చిత్తాన్ని స్వాధీనపరచుకొని సరైన

మార్గంలో పెట్టడమే యోగం" అని చెబుతూ, "మనస్సును నిరోధించడం ఎలాగా" అంటే "అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః అని గీతాచార్యుని సమాధానమే యిక్కడ ఉపదేశింపబడింది.

ఈ అష్టాంగయోగం, ధ్యానధారణలు, ఆసనాలు అందరికీ సాధ్యమయ్యేవి కావు. అందుకే, శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు, శివానందలహరిలో –

"హే కపాలిన్! భిక్షూ! మేహృదయకపి మత్యంతచపలం
దృఢం భక్త్యాబధ్వా శివ! భవదధీనం కురువిభో!" (శ్లో.20)

అని శివునితో మొరపెట్టుకొన్నాడు.

"ఓ కపాలీ! ఆది భిక్షూ! నామనస్సనే కోతి అతి చంచలమైనది. నేను దానిని నా అధీనంలోకి తీసుకురాలేకపోతున్నాను. నీవే, 'భక్తి' అనే త్రాడుతో దాన్ని గట్టిగా కట్టి నీ అధీనంలో పెట్టుకోవయ్యా! అప్పుడే నా మనస్సు స్థిరంగా చెప్పిన మాటవింటుంది" అని శివునికే ఈ క్లిష్టకార్యాన్ని అప్పగించారు. అంటే ఏమిటి? 'భక్తి' అనే త్రాడుతో మనస్సును బంధించి మన అధీనంలో పెట్టుకోవచ్చునన్న మాట!

ఇక్కడ వేదాంత ప్రస్థానంలో తొట్టతొలిసారిగా 'భక్తి' అనేమాట మనకు వినబడుతూ ఉంది. దీనినే వివేకచూడామణి అనే గ్రంథంలో శ్రీఆది శంకరులు–

"మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవగరీయసీ
స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే"

జీవునికి భౌతిక జీవిత బంధాలనుండి, జన్మజరాదుఃఖాల నుండి శాశ్వతమైన విడుదలను ప్రసాదించడమే 'మోక్షం' అంటారు. ఇటువంటి మోక్షాన్ని సాధించే సామగ్రులలో 'భక్తి' యే సర్వశ్రేష్ఠమైనది. జీవుడు తన యొక్క స్వరూపాన్ని తాను చక్కగా తెలుసుకోవడమే 'భక్తి' అనబడుతుంది.

ఎందుకిలా 'భక్తి'ని నిర్వచించారంటే అద్వైతం, "బ్రహ్మసత్యం, జగన్మిథ్యా, జీవోబ్రహ్మైవ నాపరః" (బ్రహ్మమొక్కటే సత్యం, ఈ భౌతికమైన జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మమే తప్ప వేరొకటి కాదు) అని ప్రతిపాదించేది కనుక జీవునితత్త్వం ఏమిటో జీవుడు తెలుసుకుంటే బ్రహ్మమంటే ఏమిటో వెంటనే తెలుస్తుంది. జీవస్వరూపతత్త్వ విచారణమే "స్వస్వరూపాను సంధాన" మంటే! దీనికి 20వ శతాబ్దంలో "నాన్ యార్! నేనెవరిని? Who am I? అనే ప్రశ్న వేసుకొని జీవస్వరూపాన్ని దానితో బాటు బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందిన మహర్షి పుంగవులే అరుణాచల వాసియైన శ్రీరమణమహర్షి! ఆదిశంకరుల అద్వైత మార్గంలోని నిర్వచనాన్ని తపోయోగ సాధనచే నిరూపించిన ఆధునిక మహర్షి శ్రీరమణులవారు. ఆధునిక విజ్ఞానవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడ మానవాతీతమైన ఒక శక్తి ఉన్నదని అంగీకరించాడు. దానితో భగవంతుని ఉనికి 20వ శతాబ్దంలో సైన్సు స్థాపించింది. శ్రీరమణమహర్షి ఈ ఉపాసనకు అందించిన మూల సూత్రమిది!

దేహం? నాఽహం!<br>
కోఽహం? సోఽహం!!

ఆత్మ అనేది దేహమా? కాదు!<br>
అప్పుడు 'నేను' అనే ఈ ఆత్మ ఎవరు?

సోఽహం. 'సః అహం!' అరుణాచల స్థితుడైన ఆ శివుడే నేను' అని సమాధానం!

శివుడే జీవాత్మ! శివుడే పరమాత్మగా ఈ లోకంలో సంచరిస్తున్నాడు. జీవుడు తన భక్తితో భగవంతుని ఎలా బంధించగలడు?' 'అవిద్య'చేత ఆవరింప బడిన ఈ జీవుడు శివుని ఎలా సాక్షాత్కరింపజేసుకోగలడు?

అంకోలం నిజ బీజసంతతి రయస్కాంతోపలం సూచికా<br>
సాధ్వీ నైజవిభుం లతాక్షితిరుహం సింధు స్సరిద్వల్లభమ్!

ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవింద ద్వయం
చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తి రిత్యుచ్యతే ॥
– శివానందలహరి (శ్లో.61)

వానకాలంలో నల్లనిమేఘం ఆకాశంలో కనబడిన వెంటనే ఊడిగ చెట్టు క్రింద రాలిపడిన గింజలు చెట్టుకు అంటుకుంటున్నాయి. సూది అయస్కాంతానికి ఆకర్షింపబడుతున్నది. పతివ్రత తనభర్తకు సర్వాత్మనా అంకితమౌతున్నది. లత చెట్టును అల్లుకుంటున్నది, నది సముద్రంలో లీనమై పోతున్నది. ఆయా స్థానాలకు చేరిన యివన్నీ అక్కడే స్థిరంగా ఎలా ఉంటున్నాయో ఎవని మనస్సు యొక్క ప్రవృత్తి ప్రేరణ లేకుండా తనంతట తానుగా పరమేశ్వరుని పాదారవిందాల జంటను పొంది అక్కడే ఎల్లప్పుడు ఉంటుందో అది 'భక్తి' అనబడుతుంది.

"భక్తిః కిం న కరోత్యహో! వనచరో భక్తావతంసాయతే" అని మరోశ్లోకంలో అంటారు ఆదిశంకరులు. అది తిన్నని కథ! ముగ్ధభక్తికి ఉదాహరణం. ఆహా! భక్తి ఏమేమి చేయదు? ఒక ఆటవికుడైన వాడు కూడ భక్తాగ్రగణ్యుడుగా పరిగణింపబడ్డాడు కదా! అన్నారు.

ఆదిశంకరులపై శ్లోకంలో యివ్వబడిన ఉదాహరణ లన్నింటిలో ఒకటి మరొక దానియందు విలీనం కావడమే పరమార్థంగా చెప్పబడినప్పుడు వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కోల్పోయి ఒక ఉన్నత దశలో ఉదాత్తస్థాయిని చేరుకొని దానిలో లీనమై పోవడం. 'భక్తి' యొక్క పార్యంతికఫలంగా అనుభవానికి వస్తున్నది.

'చిత్తము భగవంతుని ఆకారంతో సమానంగా రూపాంతరం చెందడమే భగవద్రతి' అని భక్తి వాదులు చెపుతున్నారు. ఒక్క శృంగారంలోనే వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని విస్మరించి తన కత్యంతము యిష్టమైన విషయంలో నిమగ్నుడై పోతాడు. ఈ సందర్భంలో భక్తికీ శృంగారానికీ పెద్ద భేదమేమీ లేదు.

కాబట్టి శ్రీ వైష్ణవ సంప్రదాయంలో భక్తి, శృంగారంలో ఎప్పుడూ కలిసే ఉంటుంది తప్ప భక్తి శృంగారాలు విడివిడిగా ఉండవు. ఈ స్థితిని వేదాంతులు, మనస్తత్త్వ శాస్త్రవేత్తలు, విగ్రహశిల్ప రహస్య వేత్తలు కూడ అంగీకరించారు. ఆలంకారికులు ఈ భక్తి శృంగారాన్నే 'మధురభక్తి' అనిచెప్పారు.

అద్వైత తత్త్వానికీ మధురభక్తికీ గల సాన్నిహిత్యం మరి చెప్పవలసిన పనిలేదు. అందుకే, ఆదిశంకరులు (క్రీ.శ. 782-820) బ్రహ్మసూత్ర భాష్యంలో భక్తిని వివరిస్తూ- "తథా ధ్యాయతి ప్రోషితనాథా పతిం ఇతి యా నిరంతర స్మరణా పతిం ప్రతి సోత్కంఠా సైవ మభిధీయతే". (4-1-1)

ఒక ప్రోషిత భర్తృక యైన నాయిక, భర్తవిరహంతో కృశించినది. ఆ నాయిక తన పతినే సదా సర్వకాలమూ స్మరిస్తూ, నిరంతరం తన భర్తనే ధ్యానిస్తూ, ఆయన రాక కోసం ఎలా ఉత్కంఠితురాలై ఉంటుందో, భగవద్విరహంతో ఉన్న భక్తుడు భగవంతుని దర్శనం కోసం ఆవిధంగా నాయికవలె ఉత్కంఠలో ఉండడమే 'భక్తి' అనబడుతుంది.

శ్రీమద్రామానుజాచార్యులవారు (క్రీ.శ. 1017-1137) కూడ బ్రహ్మ సూత్ర భాష్యమైన 'శ్రీభాష్యంలో' (1-1-1) - భక్తిని వివరిస్తూ -

"ధ్యానంచ తైలధారావదవిచ్ఛిన్న స్మృతి సంతానరూపంధ్రువా స్మృతిః స్మృతి లంభే సర్వగ్రంథీనాం విప్రమోక్షః" అని వ్రాశారు.

భక్తిలో విశేషించి మధురభక్తికి ఈ పై చెప్పబడిన నిర్వచనం చక్కగా అన్వయిస్తుంది. భక్తిలో నిమగ్నుడైనవాడు భగవంతుని స్మరణలో ఉంటాడు. ధ్యానావస్థితుడైనయోగి మనస్సులో భగవద్భావన ఒకపాత్రలోని నూనెను మరొక పాత్రలో పోస్తున్నప్పుడు తైలధార ఎలా ఎడతెగకుండా, ఏకధారగా ప్రవిస్తుందో ఆవిధంగా ధారతెగిపోకుండ స్మృతిరూపంగా స్థిరపడడమే కాకుండా, ఆ స్థిరరూపాన్ని దాల్చిన స్మృతులు అన్నిసందేహాలను పటాపంచలు చేస్తుంది" అన్నారు.

భగవంతుని యందలి 'శ్రేష్ఠమైన ప్రేమ', లేదా 'పరమప్రేమ', 'భక్తి' అని నారదభక్తి సూత్రాలు చెప్పడంచూస్తే, 'భగవద్రతి'యే ప్రేమ అని చెప్పాలి.

దివ్యమైన ఆర్ద్రమైన ప్రేమమయ చిత్తవృత్తి 'భక్తి'. 'ప్రేమై'క చిత్తవృత్తి శృంగార రసస్థాయిగా చెప్పబడింది. 'భగవద్రతి అన్నా, 'శృంగారం'లోని స్థాయీ భావం 'రతి' అన్నా ఒక్కటే!

రసగంగాధరకర్త జగన్నాథుడు 'రతి'ని నిర్వచిస్తూ –

"స్త్రీ పుంసయోః అన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తి విశేషః" స్త్రీ పురుషుల యొక్క పరస్పర సాన్నిహిత్యంతో కూడిన 'ప్రేమ' అనే పేరుతో పిలువబడే చిత్తవృత్తి విశేషమే 'రతి' అన్నాడు.

దీనికి నారద భక్తి సూత్ర నిర్వచనానికి తేడా ఏమీలేదు! 'భగవద్రతి యే ప్రేమ! ఆ ప్రేమయే భక్తి! అని సారాంశం.

ఈ ప్రేమ, రతి దంపతీ నిష్ఠం, దైవనిష్ఠం అని రెండుగా ఆలంకారికులు, భక్తివాదులు చెప్పడం లేదు. కారణం శృంగారం రెండింటిలో ఒకే విధంగా ప్రవర్తిస్తున్నది కనుక దంపతులైన సీతారాముల మధ్యగల ప్రేమ తత్త్వాన్ని అభినవ గుప్తులు యిలాచెప్పారు. **"అత ఏవాహ శ్వాసాయ విడంబనైవవపుషి ప్రాణాః పునర్జానకీ"** – రాముడంటున్నాడు. "శరీరం శ్వాసిస్తోంది తప్ప, ప్రాణం జానకి తోనే పోయింది" అని. ఇది దంపతుల మధ్య విడదీయరాని శృంగార రస స్వరూపాన్ని లోతుగా నిరూపించే వాక్యం!

ఇదేవిధంగా, ఒక భక్తునికీ భగవంతునికి మధ్య కూడ ప్రవర్తించడమే 'మధురభక్తి' అనబడుతుంది. ఇక్కడ స్త్రీ పురుష వివక్ష అడ్డుకాదు. అడ్డురాదు. అసలా భావనకే తావు లేదు.

"భక్తి స్తు కామ ఇవ తత్కమనీయ రూపే
తస్మాన్మ నే రజని కాముక వాక్యభంగీ"

అని ద్రవిడోపనిషత్సార సంగ్రహం చెబుతున్నది. భక్తి కూడ ఒక కాముక వ్యాపారం వలె కమనీయమే అవుతున్నది. "కామోత్కంఠిత గోపికల్..." అనికదా భాగవత మహాపురాణం! కాముక వాక్యరీతులన్నీ భక్తిలోనే అంతర్భవిస్తాయి తప్ప అశ్లీలమని అవాచ్యమని చెప్పడానికిక్కడ హద్దులు సూచింపబడలేదు. ఈ రోజు సమాజంలో దేనినైతే మనం అవాచ్యము, అశ్లీలము, అనాగరికమని అంటున్నామో అవన్నీ 'మధురభక్తిమార్గం'లో చెల్లవు. ఎందుకంటే, అన్నమయ్య ఎన్నుకొన్న పదకవితల్లోని నాయికలు ఒకేస్థాయికి చెందినవారు కారు. సమాజంలోని భిన్న భిన్న వృత్తులలో నిమగ్నులైనవారు. కాయకష్టంచేసుకొని బ్రతికేవారు. వారికి జీవితంలోని భిన్న విభిన్న పార్శ్వాలతో సంపూర్ణ పరిచయం ఉంది. ఈ గ్రామీణ స్త్రీలు గొల్లలు, చల్లలమ్ముకొనే వారు, మేదరులు, కుమ్మరులు, దొమ్మరులు, బొమ్మ లాట వారు, సాలెవారు, కూలీలు, కష్టజీవులు, వీరు కల్లాకపటం లేనివారు. మనసులోని మాటను పచ్చిగా దాపరికం లేకుండా వాచ్యంగా అనేస్తారు. నగరవాసులు, పట్టణ వాసులు ఎబ్బెట్టుగా భావించే మారుమూల మాటలన్నీ వీరు ఇట్టే అలవోకగా, అవలీలగా అనేయగలరు. చాటుమాటులు లేని వారి గ్రామ్య శృంగార ధోరణిని పదకవితలో అన్నమయ్య పట్టం కట్టాడు. కాని, పద్యకవులవలె ఔచిత్య విచార చర్చలు చేసి, శబ్దాలను, భావాలను, భాషను, యాసను కాచి వడబోసి నవనాగరకుల వలె నగిషీలు పట్టిన భాషలో భంగ్యంతరంగా, ధ్వని పూర్వకంగా, రసధ్వనుల కోసం ఆరాట పడలేదు. పుట్టతేనె వంటి జానపదుల నిసర్గ రమణీయ సహజశృంగారాన్ని వారికి సహజమైన గ్రామీణ భాషలోనే, వారియాసలోనే వ్రాశాడు. ఇది అన్నమయ్య బహుముఖ ప్రాభవానికి అద్దంపడుతున్నది.

ఆలంకారికులు గ్రామ్య శృంగారాన్ని గుర్తించక పోలేదు. ఆచార్య దండి, కావ్యాదర్శంలో గ్రామీణుల పచ్చిశృంగార భాషణం ఎలావుంటుందో యిలా చెప్పాడు- (కావ్యాదర్శం – పరిచ్ఛేదం-I, శ్లో.52-56)

చూ॥ బాలానందినీవ్యాఖ్య - పుల్లెల శ్రీరామచంద్రుడు (పుటలు 32-34)

కామం సర్వో౽ ప్యలంకారో రసమర్థే నిషించతి ।
తథాప్యగ్రామ్యతైవైనం భారం వహతి భూయసా ।
**కన్యే! కామయమానం మాం నత్వం కామయసేకథమ్ ।**
**ఇతి గ్రామ్యో౽యమర్థాత్మా వైరస్యాయ ప్రకల్పతే ॥**

కామం కందర్ప చండాలో మయి కామాక్షి నిర్దయః ।
త్వయి నిర్మత్సరో దిష్ట్యేయ త్యగ్రామ్యో౽ర్థో రసావహః ॥

**శబ్దే౽పి గ్రామ్యతా స్త్యేవ సా సభ్యేతర కీర్తనాత్ ।**
**యథా యకారాది పదం రత్యుత్సవ నిరూపణే ॥**

పదసంవృత్త్యావా వాక్యార్థత్వేన వాపునః ।
దుష్ప్రతీతి కరం గ్రామ్యం యథా యాభవతః ప్రియా ॥

అని ఆచార్య దండిపండితుడు దాక్షిణాత్యుడైనా గ్రామ్య భాషను గ్రామీణ శృంగార భావాలను, పదాలను, వాక్యాలను, సున్నితంగా త్రోసిపుచ్చాడు అవి సభ్యేతర కీర్తన మన్నాడు. క్రీ.శ.630-700 మధ్య కాలంలో గల దండి గ్రామ్య శృంగారాన్ని గుర్తించినా అంగీకరించలేదుగాని, క్రీ.శ.14 - 15 శతాబ్దాల మధ్య జీవించిన తాళ్లపాక అన్నమాచార్యులు సంకీర్తన లక్షణంలో-

కం॥ పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థత గ్రామ్యోక్తులు
పదిలముగా పొంకమెఱిగి పలుకం జెల్లున్

కం॥ వల్లవ నారీమ్లేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞ బంధురంబులు చవియై

చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్యనాటకాదిక ఫణితిన్

అన్నమయ్య పదకవితలో యిటువంటి గ్రామ్య పదజాలాన్ని గ్రామీణ శృంగార ప్రవృత్తిని అత్యంత సహజంగా వర్ణించడంలోనూ, గ్రామ్య భాషా ప్రయోగం లోను ధైర్యాన్ని కల్గించిన గ్రంథం, కాకతీయుల కాలంనాటి జాయ సేనాపతి వ్రాసిన నృత్తరత్నావళిలో ఆంధ్ర దేశీయ నృత్య రీతులేనని నా దృఢాభిప్రాయం. నృత్తరత్నావళి క్రీ.శ.12-13 శతాబ్దాల మధ్యకాలంలో వ్రాయబడిన ఆంధ్ర నృత్త కళావివరణ గ్రంథం. హల్లీసక ముఖ్యనాటకాదిక ఫణితులు ఆ గ్రంథంలో వివరించబడినాయి.

ఈనాటి సమాజంలో సభ్యం, సభ్యేతర మనేది మనం ఏర్పరచుకొన్న వలయాలు తప్ప ఒకనాటి సభ్యేతరమైన వస్త్రధారణ ఈనాడు సభ్య సమాజం అంగీకరించింది కదా! అసభ్యమైన మాటలు వ్యవహారంలో వాడడం లేదా! వైయాకరణులు వ్యాకరణాది గ్రంథాలచేత ఎంత శబ్దానుశాసనం చేసినా కవులు నిరంకుశులై వాడడం లేదా? పద్య కవిత్వంలో నాటకాలలో, పాత్రోచిత భాష అనేపేరుతో నేడు గ్రామ్యశబ్దాలు వాడడం లేదా? గ్రామీణ జీవన విధానంలోని శృంగారాదులు వర్ణింపబడుతున్నప్పుడు పదకవితలో సమకాలీన ప్రజల జీవన విధానానికి, హావభావాలకు, ఆచార వ్యవహారా లకు, సంస్కృతికి అద్దం పట్టేలా అన్నమయ్య గ్రామ్య భాషను గ్రామీణ శృంగారాన్ని అప్పటంగా అభిమానించి వర్ణించడంలో ఏమాత్రం తప్పులేదని, అది ఆయన లోకాద్యవేక్షణ శీలత్వానికి గీటురాయి యని, ఆయన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించేవిగా ఉన్నవని చెప్పవచ్చు.

శ్రీవైష్ణవమతం విశ్వజనీనమైనప్పుడు, శ్రీవైష్ణవంలో జాతి - మత - కుల వివక్షలులేనప్పుడు, పైగా అన్నమయ్య

వైష్ణవులు గానివార లెవ్వరు లేరు
విష్ణు ప్రభావ మీ విశ్వమంతయుగాన (1-36)

అని స్పష్టంగా చెప్పిన తర్వాత కూడ, గ్రామీణుల శృంగార తత్త్వం 'మధుర భక్తి'లో పర్యవసించక ఎక్కడికి పోతుంది? ఏమౌతుంది? అది కేవలం సామాజిక జీవన చిత్రణతో ముగిసిపోయేటట్లయితే అన్నమయ్య ప్రబోధించిన విశాల వైష్ణవమంతా వ్యర్థమైనట్లే లెక్క! సమాజంలో అన్నివర్ణాల వారికి, అన్నివర్గాల వారికి వైష్ణవంలో సమాన ప్రాధాన్యముంటే, శ్రీవేంకటేశ్వర స్వామి విషయంలో 'ఏనెపాననైనా నాతడియ్యకొనుభక్తి' అన్నమయ్య చెప్పిందే నిజమైతే, శృంగార సంకీర్తనల్లోని 'పచ్చిశృంగారం', 'పచ్చశృంగారం' అనే తేడాలేవీ లేకుండా అవన్నీ 'మధురభక్తి' శృంగారంలో పర్యవసించి స్వామిలో విలీనమౌతాయని ఘంటాపథంగా చెప్పవలసి ఉంటుంది. శ్రీ వైష్ణవంలో సమాజ బాహ్యులెవ్వరూ లేరు. అందరూ దేవుని సేవాసమాజంలోని వారే! అందరూ శ్రీ వేంకటేశ్వర భక్తి సామ్రాజ్యంలోని సభ్యులే! ఆయన కృపకు పాత్రులైన వారే! కాబట్టి, శృంగారంలో సామాజిక శృంగారమని, వైష్ణవ శృంగారమని, శిష్టశృంగారమని భ్రష్టశృంగారమనే, భేదాలు లేవు! ఉన్నది ఒక్కటే శృంగారం అది శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రతిపాదించిన 'మధురభక్తి శృంగారం' అందులో అన్ని రకాల శృంగారాలు అంతర్భవిస్తాయి! అందరి శృంగారాలను శ్రీవేంకటేశ్వరుడు స్వీకరిస్తాడు. మోక్షాన్ని అనుగ్రహిస్తాడు.

## II

**"అన్నమయ్య బహుముఖ ప్రాభవం"** అని ప్రస్తుత వ్యాస సంకలనం పేరు. దీని సంకలన కర్త ఆచార్య చిట్రాజు గోవిందరాజుగారు ప్రాచ్య పరిశోధన సంస్థలో మా సహోద్యోగి, ఆత్మీయమిత్రుడు. రాజుగారు చాలా పట్టుదల, కార్యదీక్ష, సమయపాలన, శ్రద్ధాసక్తులు గల విలక్షణ వ్యక్తి. ఏ పని చేపట్టినా అది పూర్తయ్యేంత వరకు దాని వెంటబడడమేకాదు, అవాంతరంగా వచ్చే పనుల్లో ఏ పని ఎవరి చేతచేయించాలో వారిచేత వెంటనే చేయించి ఒక కొలిక్కి తీసుకురాకుండా నిద్రపోడు, విశ్రాంతి తీసుకోడు. ఆయన ఇదివరకే ఎన్నో ఉత్తమ వ్యాస సంపుటాలు వెలువరించి

ఉన్నారు. అవి (1) విద్య - మానవ హక్కులు 2003లో ఆచార్య గుత్తికొండ సాయిబాబా గారి షష్టిపూర్తి అభినందన గ్రంథం. (2) గ్రంథ పరిష్కరణ విధానాలు (Methods of Editing) (2008) ఇది, 2006 డిసెంబరు 15 - 16 తారీఖులలో యు.జి.సి. వారి పాక్షికమైన ఆర్థిక సహకారంతో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో **'వ్రాతప్రతుల పరిష్కరణ - అధ్యయనం'** అనే అంశంపై నిర్వహింపబడిన జాతీయ సదస్సులో పాల్గొన్న 25 పండితులు సమర్పించిన పరిశోధన వ్యాసాల సంకలన సంపుటి. ఈ సదస్సు సంచాలకులు ఆచార్య చిట్రాజు గోవిందరాజుగారు. ఇది చాల విలువైన సమాచారాన్ని, పరిశోధనాంశాలను, ప్రతిపాదించిన గ్రంథంగా పలువురు పండితుల ప్రశంసలు పొందింది.

ప్రస్తుతం వెలువడుతున్న గ్రంథం కూడ చాల ఉత్తమ గ్రంథ సంకలనం. అన్నమయ్యపై ఆంధ్రదేశంలో ఎన్నో జాతీయసదస్సులు, జయంతులు వర్ధంతులు జరిగాయి. జరుగుతున్నాయి. కాని, ఎవరు కూడ శ్రద్ధాభక్తులతో పండితులు వ్రాసిన వ్యాసాలను క్రోడీకరించి, ఒక ఆనుపూర్వి (Sequence)ని కల్పించి అచ్చుతప్పులు లేక చక్కగా ముద్రించి, రమణీయంగా, పఠన యోగ్యంగా పాఠకుల కందించిన జాడలు లేవు. ఆచార్య గోవిందరాజు గారు ఈ శ్రమకంతా ఓర్చి కూర్పునేర్పులు పాటించి, వెలువరిస్తున్న వ్యాస సంపుటి పేరు **'అన్నమయ్య బహుముఖ ప్రాభవం'** (The Multi-dimensional personality of Annamayya) ఇదికూడ 2009 మార్చినెల 12 - 14 తేదీలలో అన్నమయ్య 600 సంవత్సర జయంతి సందర్భంగా తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన సంస్థ తరపున ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలసాఫికల్ రిసెర్చ్, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహాయంతో **"తాళ్లపాక అన్నమాచార్యుల వైష్ణవభక్తితత్త్వం"** అనే అంశం మీద మూడురోజుల పాటు నిర్వహించిన జాతీయసదస్సులో పాల్గొన్న ముప్పై మంది పండితులు సమర్పించిన పరిశోధన వ్యాసాల సంకలన సంపుటి.

**'అన్నమయ్య బహుముఖ ప్రాభవం'** అనే ఈ వ్యాస సంకలన సంపుటి అన్నమాచార్యుల భక్తితత్త్వాన్ని బహుముఖంగా ప్రదర్శించడంలో సఫలీకృత మైందని నేను భావిస్తున్నాను.

పదకవితా పితామహుడుగా, ప్రధమాంధ్ర వాగ్గేయకారుడుగా అన్నమయ్య బహుముఖీనంగా తన ప్రతిభాపాటవాలను 32,000 సంకీర్తనల్లో వెలార్చినాడు. మనం చేసుకొన్న పుణ్యం కొద్దీ మనకు 12,000 కీర్తనలు మాత్రమే లభించాయి. లభించిన వాటిని వివిధ శీర్షికల క్రింద వర్గీకరించి, వింగడిస్తే అన్నమయ్య భాషాపరశేష భోగి యని స్పష్టమౌతుంది. ఆదిశేషుడు తన రెండువేల నాల్కలతో శ్రీమహావిష్ణువును ప్రశంసచేసినట్లుగా అన్నమయ్య అన్నమయకోశం నుండి ఆనందమయ కోశం వరకు, జీవ స్వరూపం మొదలుకొని వైకుంఠప్రాప్తి వరకు, అక్షరాభ్యాసం మొదలు కొని ఆనంద నిలయుని దర్శనం వరకు, జీవుడు సంసార సాగరాన్ని దాటి అవతలిగట్టు చేరేంత వరకు గల సకల విధ వస్తు సంచయ, సాధక బాధక, బహుపద ద్వంద్వ సమాహార సంకీర్ణ సంక్లిష్ట సంకుల సమరమైన జీవిత ఉత్థాన పతనాల సుదీర్ఘ చరిత్రను పదకవితల్లో రసరమణీయంగా పాడి, ఆడి మనకందించిన అమృతభాండమే, సంకీర్తన భాండాగారమే **పదకవితా** సాహిత్యం! శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారన్నట్లుగా, **"తాళ్లపాక** అన్నమాచార్యుల పదకవిత ఒక సారస్వత క్షీరసాగరం. వారి రచన**లు భావ** ప్రధానములు తప్ప నాద ప్రధానములు కావు" అన్నారు.

"అన్నమయ్యను చదవనివాడు తెలుగు చదివినట్లే కాదని" వేటూరి ప్రభాకరశాస్త్రిగారు స్పష్టీకరించారు.

నామట్టుకు నాకు ఒక ఊహ కల్గుతోంది. ఇదివరకే నేను అన్నమయ్యను **'భాషాపరశేషభోగి'** అన్నాను. రామరాజభూషణుడు తిక్కన సోమయాజిని గురించి చెప్పిన మాటనే నేను అన్నమయ్యకు

అన్వయిస్తున్నాను. అదే అన్నమయ్య బహుముఖీన ప్రాభవానికి విజయ వైజయంతిక!

మ॥ మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్, గుండలీంద్రుండు ద
న్మహనీయస్థితి మూలమై నిలువ, శ్రీనాథుండు ప్రోవన్, మహా
మహులౌ సోముడు, భాస్కరుండు వెలయింపన్, సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తి మయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్

అనే పద్యంలో, ఆంధ్రమహాభారతంలో 15 పర్వాలు వ్రాసిన కవిబ్రహ్మ తిక్కన సోమయాజిని ఆదిశేషునితో సమానంగా రామరాజభూషణుడు ప్రశంసించాడు. బహుముఖ ప్రజ్ఞకు ఆదిశేషుడు ప్రతీక. కుండలీంద్రుడంటే ఆదిశేషుడని, సోమయాజి అని అర్థాలు. కవిసమ్రాట్ విశ్వనాథవారు 'తిక్కనగారి శేషత్వ'మనే వ్యాసంలో తిక్కనను ఆదిశేషునితో పోలుస్తూ, "ఈ సర్వ మహా ప్రపంచకమును ఆదిశేషుడు తన వేయి శిరసులమీద నెట్లు ధరించెనో, పడిపోకుండ నెట్లు పట్టుకొనుచున్నాడో, ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమును తిక్కన అట్లు ధరించి యున్నాడని అర్థము. ఆదిశేషువు ఈ భూమిని తన సహస్రఫణా మండలమున ధరించు చున్నాడని పౌరాణికోక్తి! తిక్కన గారు కుండలీంద్రుడు. కుండలములు ధరించినవాడు కుండ లీంద్రుడు. యజ్ఞయాగాదులను చేసిన సోమయాజులు కుండలములు ధరింతురు. తిక్కన సోమయాజిని రామరాజ భూషణుడు అందుచేత కుండలీంద్రుడన్నాడు" అని వ్రాశారు.

పద్యకవితా ప్రపంచానికి తిక్కన సోమయాజి 'ఆదిశేషు'డయితే, పద కవితా ప్రపంచానికి తాళ్లపాక అన్నమాచార్యుల వారు బహుముఖ ప్రాభవాన్ని ప్రకటించే భాషాపరశేషభోగి, సహస్ర ఫణామండలముపై సంగీత సాహిత్య సరస్వతిని నిల్పి వేయి శిరస్సులతో, రెండువేల నాల్కలతో, శ్రీహరిని సన్నుతించిన ఆదిశేషువు అని నా నిష్కర్ష! శ్రీహరికి పాన్పుగా ఉన్న ఆదిశేషువే అన్నమయ్యగా అవతరించినాడని ఆయన బహుముఖీన ప్రతిభాపాట

వాలను, మహత్వ కవిత్వ పటుత్వ సంపదలను పరిశీలించిన ఎవరైనా అంగీకరిస్తారని నా నమ్మకం! అంటే ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచానికి సంగీత కళారహస్య నిధిగా సేవచేసిన రామరాజభూషణుని కంటే ముందే దాని సంగీతాత్మను ఆవిష్కరించి పదకవితా ప్రపంచంలో బహుముఖ ప్రాభవాన్ని వెలార్చిన ఆదిశేషుడే అన్నమయ్య.

తిక్కన సోమయాజి 'కుండలీంద్రుడుగా చెప్పబడినాడంటే
ఆయన యోగస్థిరుడైన ఆదిశేషువనే మహార్థం స్ఫురిస్తున్నది
ఇదే కుండలీంద్ర శబ్దాన్ని అన్నమయ్యకు అన్వయిస్తే
ఆయన 'భక్తియోగ స్థిరుడైన ఆదిశేషువని సమన్వయించవచ్చు

అందుకే ఈ వ్యాస సంకలన సంపుటి అన్నమయ్య భక్తితత్వాన్ని బహుముఖంగా ఆవిష్కరించడంలో అన్నమయ్య బహుముఖ ప్రాభవాన్ని వేనోళ్ల చాటిచెప్పిందని నేను భావిస్తున్నాను.

## III

ఈ సంపుటిలోని విషయ విశ్లేషణమే దాన్ని నిరూపిస్తుంది. మొదటి వ్యాసం పరిచయాత్మకం కాగా, వేదము, ఉపనిషత్తు, భగవద్గీత, నాలాయిర దివ్య ప్రబంధం శీర్షికల్లో ప్రస్థాన త్రయంలోనివి రెండు మూడు అంశాలైతే, వేదము, ద్రావిడ వేదము సమానస్థాయిలోని గ్రంథాలు. దానికి అనుబంధంగా ఆగమం వచ్చింది. అన్నమయ్య జన్మతః అద్వైతి స్మార్తుడు కనుక. అద్వైత వాసనలున్న ఆయన సంకీర్తనలు కొన్ని వివరించబడ్డాయి. సిద్ధాంతం విశిష్టాద్వైతం, సంప్రదాయం శ్రీవైష్ణవమైనా, చెప్పే ధోరణిలో అక్కడక్కడ ఆయనకు తెలియకనే అద్వైతం తొంగిచూస్తున్నదనడం వాస్తవమే!

రెండవ వింగడింపులో నిలిచేవి పురాణేతిహాసాలు, రామాయణ భారతాల ప్రసక్తి లేదా ప్రభావం ఎంత బలీయమో, పురాణ గాథలు–ప్రతీకల ప్రాబల్యాన్ని ఏ రచయితా ప్రాచీనుడైనా ఆధునికుడైనా త్రోసి రాజన లేదు. అది రక్తంలో కలిసిపోయిన ప్రతీకలు. రక్త నిష్ఠమైన గుణాన్నే సంప్రదాయం అంటారు.

"సంప్రదాయాగత జ్ఞాన సహితుడైన
మనుజుసత్కవితయు వేదమంత్ర సమము"

అని తాళ్లపాక చినతిరువేంగళనాథుడు సంకీర్తన లక్షణంలో అన్నమయ్యను గూర్చి వ్రాశాడు. "యోఽనూచానః సనో మహాన్" వేదము చెప్పినది. "పెద్దల అడుగుజాడల్లో నడిచే వాడే మహాత్ముడు" అని అర్థం.

ఈ సంపుటిలోని మరో విశేషమేమంటే ఒకరిద్దరు రచయితలు రెండు పరిశోధన పత్రాలు సమర్పించి యుండడం. డా॥ బూదాటి వెంకటేశ్వరులు గారు అన్నమయ్య ఆధ్యాత్మికతపైన, తాత్త్వికతపైన రెండువ్యాసాలు సమర్పించి యుండడం, అలాగే మదీయసహోద్యోగి మిత్రుడు డా॥ ఎలవర్తి చంద్రమౌళి గారు విష్ణుభక్తులపైన, నైచ్యానుసంధానంపైన రెండు వ్యాసాలు వ్రాసి యుండడం. ఒక వ్యాసం వ్రాసిన వారు ఏకముఖులైతే రెండు వ్యాసాలు వ్రాసిన వారు ద్విముఖులవుతారు. ఇవి విషయ సమగ్రతకోసం వేసినవే తప్ప ప్రముఖులని వేయలేదు. ఈ దృష్టితో నేను ప్రస్తుత పీఠికా కర్తగా ద్విముఖుణ్ణే అవుతున్నాను. నా వ్యాసం, భక్తిరస ప్రస్థానం మీద. ఈ పీఠికతో కలిపితే నేను రెండు ముఖాల వాణ్ణే. ఈ త్రిమూర్తులనే కాదు ఎందరినో ప్రోత్సహించి వ్యాసాలు వ్రాయించిన మా గోవిందరాజు మాత్రం చతుర్ముఖుడని మనవి చేస్తున్నాను. కారణం ఈ గ్రంథ సృష్టికర్త కనుక.

మూడవ వింగడింపులో వేంకటేశ్వర తత్త్వం, సామాజిక శృంగార తత్త్వం, ప్రాపంచిక దృక్పథం అనే వ్యాసాలు వస్తున్నాయి. వేంకటేశ్వర తత్త్వం అనకుండా రచయిత దానికి 'వైభవం' అని చేర్చడంచేత వ్యాసాన్ని క్షేత్ర, నామ, రూప, అర్చాతత్త్వ వైభవాలుగ వింగడించడానికి వీలైంది. తత్త్వ వైభవాన్నే ప్రధానీకరించుకొని మరికొంత వ్రాసివుంటే బాగుండేది. క్షేత్ర వైభవంలో "కట్టెదుర వైకుంఠము...." అనే పాట ఉట్టంకించారు. ఆ పాటలో 'వేదములే శిలలై వెలసినదీ కొండ' అని ఉన్నప్పటికీ, మరోపాట కూడ చేర్చి వ్యాఖ్యానించి ఉంటే అందగించి ఉండేది.

ఆతడె పో మా యేలిక ఆతఁడే జగన్మాల
మాతఁడే శ్రీవేంకటాద్రి యందు మీది దైవము అనే సంకీర్తనలో

**కొండలకు నెక్కుడైన గురుతు శ్రీవేంకటాద్రి!**
**కొండ రూపుదానె పో కోరిన మా దైవము !** (4-109)

'కొండ' అనే మాటకు రూఢిగా నిల్చినది శ్రీవేంకటాద్రి! 'కొండగుర్తు' అంటామే ఆ విధంగా రూఢి కెక్కినది తిరుమల 'కొండ' అని అర్థం! రెండవ వాక్యం చాల గొప్పది- 'స్వామియే కొండ! కొండయే స్వామి! కొండకు స్వామికి అభేద ప్రతిపత్తి! అందుకే ఏడుకొండలు, ఏళుమలై, మలైయప్పన్, కొండలయ్య, కొండయ్య, కొండమ్మ, కొండ అని ప్రజలు నామకరణం చేసుకొంటున్నారు. సంస్కృతంలో 'వేంకటాచలం', 'వేంకటాచలపతి' ఇత్యాదులు.

సామాజిక శృంగార తత్త్వాన్ని గురించి నా వ్యాసంలో కొంత, పీఠికలో మరికొంత చర్చించాను. ఎందుకో ప్రియమిత్రుడు ఆచార్య చలపతి, అన్నమయ్య సమగ్రదృష్టి (Integral or holistic view) గలవాడనే విషయాన్ని క్షణకాలం విస్మరించినారేమో నని నా అనుమానం!

ఇక్కడ సందర్భం వచ్చింది కాబట్టి, 'జీవిత సమగ్ర దార్శనికుడు' అనే పీఠికా శీర్షికను గురించి కొంత చెబుతాను.

జన్మతః అన్నమయ్య అద్వైతి, స్మార్తుడు కనుక చిన్నతనం నుండి మదిలో వైరాగ్యభావన కలవాడుగా మనకు అన్నమయ్య చరిత్ర వల్ల తెలుస్తుంది. ఈ 'విరాగి' యైనవాడు, రక్తి విరక్తులనే ఊడల ఉయ్యాలలో ఊగుతూ చివరికి 'రక్తి' జయించగా, 'సంసారం'లో పడ్డాడు. ఒకరు కాదు ఇద్దరు భార్యలతో సంసారం సాగించాడు. మరలా అనతికాలంలోనే భార్యా వియోగం కలిగి వైరాగ్యంలోకి వెళ్లిపోయాడు. ఈ విధంగా వైరాగ్యం -

సంసారం - వైరాగ్యం, జీవితంలోని మూడు ఘట్టాలలో వైరాగ్యానిదే పైచేయి అయింది. జీవిత ప్రారంభాంత దశల్లో అధ్యాత్మ సంకీర్తనలు, సాంసారిక దశలో మధ్యవయస్సులో శృంగార సంకీర్తనలు రాసి వుంటాడు. మనకు అలభ్యమైన కీర్తనల్లో అధ్యాత్మ సంకీర్తనలు, యోగ సంకీర్తనలే అత్యధిక భాగం ఉంటుందని నా నమ్మకం.

సంక్షిప్తంగా చెబితే మానవ జీవిత తత్త్వాన్ని గురించి, దుఃఖ రాహిత్య దశయైన మోక్షాన్ని గురించిన స్పష్టమైన అవగాహన గలవాడు అన్నమయ్య అని చెప్పాలి.

వివిధ బాధనాయోగాత్ దుఃఖమేవ జన్మోత్పత్తిః (4-1-55)

అని గౌతమ న్యాయ సూత్రం. వివిధములైన బాధలకు తావలమైన మానవుని యొక్క పుట్టుక దుఃఖకరమైనది" అన్న గౌతముని దర్శనాన్ని అక్షరాల అర్థం చేసుకున్న అన్నమయ్య జీవుని అంతర్గత దుఃఖాన్ని, ఆక్రోశాన్ని, వేదనను బహుముఖాలుగా తన కీర్తనల్లో ఆవిష్కరించి అవి ఆధ్యాత్మ సంకీర్తనలన్నాడు. వివిధ శృంగార భావాలను, వివిధ నాయికా రూపాలుగా అభివర్ణించి శృంగార సంకీర్తనలన్నాడు. దీనిపై భారతీయ అలంకార శాస్త్ర ప్రభావంతోపాటు శ్రీవైష్ణవ సంప్రదాయంలోని మధురభక్తి, రక్తులను ముఖ్యంగా నమ్మాళ్వార్ తిరువాయ్‌మొళి ప్రభావం కనబడుతుంది.

'సావిద్యా యా విముక్తయే!' అని ఉపనిషద్వాక్యం. ఏది జీవుని నిరంతర జన్మదుఃఖం నుండి జరాదుఃఖం నుండి విడుదలను శాశ్వతంగా ప్రసాదిస్తుందో అదే నిజమైన విద్య" అని చెప్పిన ఉపనిషత్ వాక్యానుసారంగా, జీవునికి విముక్తిని ప్రసాదించే మోక్ష విద్యను అధ్యాత్మ, శృంగార సంకీర్తనల్లో 'మధురభక్తి'తో ముడిబెట్టి శ్రీవైష్ణవ సంప్రదాయ మార్గాన్ని స్థాపించాడు. కేవలం వైరాగ్యం చేత మోక్షాన్ని ఆయన చెప్పలేదు. వైరాగ్యమే పునాదిగ వైష్ణవ మధురభక్తికి పెద్దపీట వేసినాడు.

ఇక, ప్రాపంచిక దృక్పథంలో ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు కులవ్యవస్థ, నీతి, నిజాయితీలైన నైతిక విలువల దృష్ట్యా చక్కగా చెప్పారు. కాని, నా దృష్టిలో అన్నమయ్య భక్తి ఉద్యమానికి చేసిన దోహదం అంతా యింతా కాదు. అసలు మనదేశంలో వేదాంతులు ఎక్కువమంది పుట్టడానికి వెనుకగల సామాజిక పరిస్థితులు అంచనా వేస్తే, దారిద్ర్యం, కరుడుగట్టిన కులవ్యవస్థలే కాదు, ఈతిబాధలు, అనారోగ్యం, ఆకలిచావులు, కరువులు, వరదలు యివన్నీ మానవ జీవితాన్ని అతలాకుతలం చేసి అల్పాయుష్కులుగానే జీవితాన్ని పూర్తిచేసుకోవడం నిన్న మొన్నటి వరకే కాదు, ఈనాటికీ కొన సాగుతూనే ఉండడం వలన వేదాంతం భారతీయులకు ఒంటబుట్టిన, ఒంట బట్టిన 'నైష్కర్మ్యసిద్ధి'గా చెప్పాలి. వేదాంతాన్ని 'భక్తి' అనే రసగుళికగా తయారుచేసి అన్నమయ్య, పేదవారు, బీదవారు, దరిద్రులు, దిక్కులేని వారందరూ 'భక్తి'తో దేవుని నమ్ముకోండి, ఏదో ఒకరోజు మీ మొరలు విని ఆ ఏడుకొండల స్వామి మీకు మోక్షమిస్తాడనే భరోసా కల్గించాడు. ఇది మత్తుమందు అనండి, మహామంత్ర మనండి. ఆ కాలానికే కాదు ఈ కాలానికి కూడ ఇది చాల అవసరం. వేదాంతపు పునాదిమీద లేచిన మహా సౌధమే భక్తిసౌధం! దాన్ని మనం భక్తిసౌరభం అని అందంగా చెప్పినా తప్పులేదు. 'దిక్కులేనివారికి దేవుడే దిక్కు' అనే సామెతను అన్నమయ్య 'భక్తి' ద్వారా నిరూపించారు. అందుచేత అన్నమయ్య కేవలం భావవాదికాదు. ప్రజాకవి, ప్రజల కవి, ప్రజల భాషలో పద కవితలు వ్రాసిన కవి. దీన్ని ఎన్నివిధాలుగా నైనా నిరూపించవచ్చు. అనాథులను ఆదుకొనేవారు లేనికాలంలో 'అదిగో అల్లదిగో శ్రీహరివాసము' అన్ని దిశా నిర్దేశం చేసిన అన్నమయ్య సమకాలీన సమాజపు జీవనాడి తెలిసినవాడు. అది ఈరోజు కూడా మూలమంత్రంగా కొనసాగు తుండడం వలన అధోగతికిపోతున్న నేటి సమాజాన్ని అన్నమయ్య ఉద్ధరిస్తున్నాడనే చెప్పాలి.

అన్నమయ్య ఈ దృష్టితో జీవిత సమగ్ర దార్శనికుడంటే భగవంతుని ఉనికిని, సమాజపు ఉనికిని విస్మరించకుండా, వ్యక్తిగా అహంకరించకుండా, తాను నమ్మిన, సిద్ధాంతాన్ని బహుముఖీనంగా వ్యాఖ్యానిస్తూ, సాధించిన ఫలితాలను సమాజానికీ, దేవునికి సమర్పించి, జీవిత సత్యాన్ని దర్శించిన వాడు కనుక సమగ్ర దార్శనికుడు. జీవితంలోని అన్ని పార్శ్వాలను, కోణాలను, చీకటి కోణాలతో సహా దర్శించడమే సమగ్రత్వానికి నిదర్శనం! అన్నమయ్య బహుముఖీన ప్రజ్ఞా పాటవాలే దానికి సాక్ష్యం! అందుకే ఈ పీఠికకు 'జీవిత సమగ్ర దార్శనికుడని పేరు పెట్టడం జరిగింది.

విశేషించి, విశిష్టాద్వైతంలో జగత్తు మిధ్య కాదు. సత్యం. జగత్తు అంటే ప్రపంచం. అది పరిణామశీలమైనది. అన్నమయ్య నేల విడిచి సాముచేసిన భావవాది కాదు. అనుష్ఠాన వేదాంతి (Practical Philosopher).

ఈ సంపుటిలోని వ్యాసాలన్నీ అన్నమయ్య భక్తితత్త్వానికే చెందినవైనా వివిధ దృక్కోణాలలో నిష్ణాతులైన పండితులు వ్రాసినవి. ప్రతివ్యాసాన్ని గురించి చెప్పవలసిన పనిలేదు. స్థాలీపులాక న్యాయంగా కొన్ని మాత్రమే స్పృశించి చెబుతున్నాను. ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావుగారి 'భక్తి-మూలతత్త్వం' అనే వ్యాసం పారిభాషిక పదాల సంస్కృత నిర్వచనాల గడబిడ, గజిబిజి లేకుండా మనకు మనం ఆలోచించుకొనే తీరులో భక్తి యొక్క పుట్టు పూర్వోత్తరాలను ప్రస్తావిస్తూ, బౌద్ధ మత నేపథ్యాన్ని బాగా విచారించి వ్రాసిన రచన. ఈయన రచనా ధోరణి అరటిపండులో మెత్తగా సూదిని దింపినట్టుగా ఉంటుంది. చదువుతూ పోతే పాఠకుని చెవులు పట్టుకొని తన వాదాన్ని ఔననేట్లు చేసే సున్నితమైన రచన. వారి వాదాన్ని ఎవరూ కాదనలేరు.

ఇక నా వ్యాసం భక్తిరస ప్రస్థానానికి అన్నమయ్య చేసిన దోహదాన్ని గురించి నేను చెప్పవలసిన తీరులో చెప్పలేదనే అసంతృప్తి నాకున్నది. అది

సమగ్ర వివేచన కాదు. ఇంక ఎన్నో సాక్ష్యాధారాలు క్రోడీకరించి, పరిష్కరించి, పునారచన చేయవలసిన వ్యాసం. 'విబుధవరుల వలన విన్నంత కన్నంత తెలిసివచ్చినంత' అన్నట్లుగా ఉంది అంతే! చేర్చవలసినవి కొన్ని ఈ పీఠికలో అక్కడక్కడ చెప్పాను. ఇక ఈ గ్రంథంలోని తక్కిన వ్యాసాల్లో విషయ వివేచన సమృద్ధిగా ఉన్నది. ఈనాటి విద్యార్థులకు ఎంతో గొప్ప కనువిప్పును కల్గించే అంశాలందులో ఎన్నో ఉన్నాయి. నామీది ప్రేమతో ఆచార్య గోవిందరాజు గారు నన్ను పీఠిక వ్రాయమన్నారు. నాకంటే సమర్థులెందరో ఉన్నా నన్ను వ్రాయమనడం నామీద వారికిగల అవ్యాజ ప్రేమానురాగాలే కారణం అనుకొంటాను.

ఆచార్య గోవిందరాజుగారి కర్తవ్యనిష్ఠ, శ్రద్ధాసక్తులు నన్నెప్పుడూ ఆశ్చర్య పరుస్తూ ఉంటాయి. ఒక క్రమశిక్షణతో కూడిన కర్తవ్య పరాయణతను ఆయన దగ్గర నుండి ప్రతివారు నేర్చుకోవాలి. ఆయన పేరు విన్నప్పుడంతా నాకు సంస్కృత వాఙ్మయంలో ప్రసిద్ధుడైన వాల్మీకి రామాయణ వ్యాఖ్యాత గోవిందరాజు జ్ఞాపకానికి వస్తాడు. ఆయన తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఒకసారి సందర్శించినప్పుడు హఠాత్తుగా 'నీవు వాల్మీకి రామాయణంపై వ్యాఖ్య వ్రాయుమని ఆదేశం విన్పించింది! అంతే! ఆయన ఆ కార్యం వెన్వెంటనే పూర్తిచేసి స్వామికి సమర్పించాడు. గోవిందరాజీయ వ్యాఖ్య ఈనాటికీ పరమ ప్రామాణికమైన వ్యాఖ్య!

మన గోవిందరాజు కూడ అంతటి కర్తవ్యనిష్ఠుడే! అన్నమయ్య చెప్పినట్లు కోరి పవ్వళించితే గోవిందరాజవునీవు, "చేరి నిలుచున్నచో శ్రీనివాసుడవు" అన్నట్లు కాక ఈయన నిలుచున్న గోవిందరాజుగా, కొలువు తీర్చిన గోవిందరాజుగా నేను అభివర్ణిస్తాను. ఈ గ్రంథాన్ని వెలుగులోకి తీసుక రావడంలో ఆయన పట్టుదలను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇలాగే శ్రీకృష్ణదేవరాయలపై ఆయన జరిపిన సదస్సు పత్రాలు కూడా వెలుగులోకి తెస్తారని ఆశంస!

## ముక్తాయింపు!

1) ప్రపంచ సాహిత్య చరిత్రలోనే నిబద్ధత (Commitment) అవిచ్ఛిన్న కార్యసాధన (Consistency) నీతి, నిజాయితీ (transparancy) గల్గిన ఏకైక కవి కుటుంబీకులు తాళ్లపాక కవులు!

2) ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఏడుతరాల వంశకవులందరూ ఒకే సిద్ధాంతానికి కట్టుబడి, ఒకే దైవానికి అంకితమై వైష్ణవ పద కవిత్వ మహా దీక్షావిధి నవలంబించిన వారు తాళ్లపాక కవులు.

3) ప్రపంచ సాహిత్యచరిత్రలోనే, రాజాస్థానాలను ఆశ్రయింపక రాజులను పొగడక, తాము నమ్మిన దేవుని ఆస్థానకవులుగా ఆత్మగౌరవంతో స్వతంత్రజీవనం గడిపినవారు తాళ్లపాక కవులు.

4) ప్రపంచ సాహిత్య చరిత్రలోనే కవులు గ్రామాలు కొని దేవునికి ధారాదత్తం చేసిన వారు లేరు. దానికి అపవాదంగా నిలిచే మహాభక్త శిఖామణులు వదాన్యశేఖరులు తాళ్లపాక కవులు.

5) ప్రపంచ సాహిత్య చరిత్రలోనే గ్రామీణ ప్రజల భాషలో, ప్రజల యాసలో పదకవిత్వం వ్రాసి అది పద్యకవిత్వానికే మాత్రం తీసిపోదని నిరూపించిన ప్రయోగశీలులైన కవులు తాళ్లపాకవారు.

6) ప్రపంచ సాహిత్యచరిత్రలోనే సాహిత్యంతోపాటు సంగీతానికి సమప్రాధాన్య ముందని గుర్తించి అజంతమైన తెలుగుభాషలోని 'సంగీతాత్మ'ను వెలికి దీసి లక్ష్య లక్షణాలతో వాగ్గేయకారత్వంతో సంగీత సరస్వతీ సమారాధనం చేసిన వారు తాళ్లపాక కవులు.

7) ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ప్రజల మనుగడ 'భక్తి'తో ముడిబడి నప్పుడే అనేకానేక, భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక సమస్యలు పరిష్కార మౌతాయని, 'భక్తి'కి పెద్ద పీటవేసి, తమ పద సాహిత్య సృష్టిచే స్వామిని మెప్పించి వశపరచుకొన్న మహాభక్తాగ్రేసరులు తాళ్లపాక కవులు.

8) అన్నిటికంటే మించి ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఏ కవి రచనలు తామ్రఫలకాలమీద చెక్కబడలేదు. దీనికి ఏకైక సాక్ష్యంగా పదకవితా సృష్టిచేసిన తాత, తండ్రి, మనుమల మూడుతరాల రచనలు రాగి రేకులపై చెక్కబడి, తాము దేవస్థాన కవులనేదానికి దాఖలాగా తిరుమల దేవాలయంలో 'తాళ్లపాకఅర'లో భద్రపరచబడి ఉండడం అపూర్వం! అద్భుతం!! ఆశ్చర్యం!!!

ఇటువంటి తాళ్లపాక కవులు ఆంధ్రులై విశేషించి రాయలసీమ కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాక గ్రామ వాస్తవ్యులు కావడం ఈ సీమ వారందరికీ ఎంతో గర్వకారణమైన విషయం.

"భక్తి యింతా నొక ఘంటాపథము, నీసేవలే
యుక్తిఁ, బాత్రాబాత్రములు యూహించనేల?
ముక్తికి శ్రీవేంకటేశ మూలము నీ పాదములు
సక్తులయి నమ్ముటగాక చలపద మేటికి? - ఆధ్యాత్మ (1-497)

తిరుపతి
7-11-2010

## శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర - విశేషాలు

కర్మ - భక్తి, జ్ఞాన యోగాలనే మూడుమార్గాలు ఆధ్యాత్మిక క్షేత్రంలో సుప్రసిద్ధాలు. మన భారతదేశంలో భక్తిమార్గం విశేషవ్యాప్తిని పొందినది. భక్తిమార్గాన్ని నారదుడు, శాండిల్యుడు, వ్యాసుడు మొదలైన మహర్షులు ప్రబోధించారు. ఉత్తరభారతదేశంలో తులసీదాస్, కబీరు, మీరా, సూరదాసు, జయదేవుడు, లీలాశుకుడు భక్తితత్త్వాన్ని కావ్యాలుగా, గీతాలుగా రూపొందించిన ధన్యజీవులు.

దక్షిణభారతదేశంలో భక్తిమార్గాన్ని ప్రపత్తి రూపంలో ప్రబోధించిన వారు భగవద్రామానుజులు. తమిళంలో పన్నిద్దరు ఆళ్వార్ల పాశురాలు, కన్నడంలో హరిదాసుల పదగళు భక్తిమార్గాన్ని వెల్లడించే రచనలుగా ప్రసిద్ధిచెందాయి.

తెలుగులో క్రీ.శ. 12శతాబ్దంలో శైవవాఙ్మయం పదాలుగా వెలసినది. క్రీ.శ.13 శతాబ్దంలో కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనములు, తర్వాత యాగంటవారి పదాలు తత్త్వార్థ బోధకాలైన రచనలుగా గుర్తింపు పొందాయి. క్రీ.శ.15శతాబ్దంలో 'పదకవిత' క్రొత్తపుంతలు తొక్కింది. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరాంకితంగా 32,000 పదాలను రచించి ఆంధ్రవాఙ్మయ చరిత్రలో 'పదకవితా పితామహుడని' కీర్తిని పొందిన అన్నమయ్య క్రీ.శ.15శతాబ్దికి చెందినవాడు.

'నామసంకీర్తనం యస్య సర్వపాప ప్రణాశనమ్' అని భాగవతంలో పేర్కొన్నట్లు సర్వ పాపాలను ప్రక్షాళనం చేసే భగవన్నామ పరమార్థాన్ని

విశాల పదసాహిత్యంలో వెలయించిన తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర ఎందరికో మార్గదర్శకం.

అన్నమాచార్యుల జీవితచరిత్రను వీరి మనుమడు తాళ్లపాక చినతిరువేంగళనాథుడు ద్విపదకావ్యంగా రచించాడు. ఇతడు తాళ్లపాక పెదతిరుమలాచార్యుని నాలుగోకుమారుడు.

చిన్నన్న అని వ్యవహార నామం. తాతగారి జీవితచరిత్రను ప్రామాణికంగా రచించినవాడు.

తెలుగు వాఙ్మయచరిత్రలో కవులచరిత్రను గ్రంథస్థం చేయడం అరుదు. తెలుగుసాహిత్యచరిత్రలో ప్రసిద్ధులైన తిక్కనగూర్చి కేతన, శ్రీనాథుని గూర్చి దగ్గుపల్లి దుగ్గన, రాధామాధవకవి, పండితారాధ్యుల గూర్చి సోమనాథుడు పేర్కొన్నట్లు వారిగ్రంథాల ఆధారంతో వెల్లడి అవుతున్నది. కొందరు కవులు కావ్యాలలో కృతికర్తృ వంశం అనే శీర్షికలో తమ వంశ చరిత్రను సంగ్రహంగా చెప్పివున్నారు.

తాళ్లపాక వంశఖ్యాతికి మూలపురుషుడు తాళ్లపాక అన్నమాచార్యుడు-హరికీర్తనా చార్యుడు, పదకవితా పితామహుడు, పంచమాగమ సార్వభౌమ బిరుదాంకితుడు. అన్నమాచార్యచరిత్రను అన్నమయ్య మనుమడైన చిన్నన్న రచించినది కాబట్టి చారిత్రక, సాహిత్యపు విలువలుగల ప్రామాణిక గ్రంథమని చెప్పవచ్చును. తనవారే తనకథ వ్రాయునంతటి చరిత్ర, ప్రశస్తికలవాడు అన్నమయ్య. కవి జీవితాన్ని ఇతివృత్తంగా స్వీకరించి జీవిత చరిత్రను ఒక కావ్యంగా రచించిన తొలితెలుగు కవికూడా తాళ్లపాక వంశీయుడే కావడం విశేషం.

## ద్విపదప్రతి

అన్నమాచార్యచరిత్ర ద్విపద వ్రాతప్రతిని కడపజిల్లా రాయచోటి తాలూకా మడితాడు గ్రామవాసి శ్రీతాళ్లపాక సూర్యనారాయణయ్య గారు పాత తాటాకు ప్రతిని అనుసరించి క్రీ.శ. 1940 సంవత్సరంలో వ్రాసినారట.

వీరు ఈ వ్రాత ప్రతిని తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య గ్రంథాలయానికి అందజేశారు. ఒ.ఆర్.ఐ. సంఖ్య 6615/ వ.సం.9384. తాళ్లపాక వాఙ్మయ పరిష్కర్తగా జగత్ప్రసిద్ధులైన కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారి 1949 సంవత్సరంలో ఈ ద్విపద వ్రాతప్రతిని పరిష్కరించి దేవస్థానం తరపున విపుల పీఠికతో ముద్రించారు. 552 ద్విపదలలో వ్రాయబడిన అన్నమాచార్య చరిత్ర ద్విపద 47 పుటలతో ముగియగా, శ్రీ శాస్త్రిగారి పీఠిక 133పుటలతో విస్తరిల్లినది. తి.తి.దే. అన్నమాచార్య జీవితచరిత్రను 1949, 1966 సం॥ లోను, శ్రీ గౌరిపెద్దిగారి పరిష్కరణతో 1978 సం॥లోను ముద్రించినది. అన్నమాచార్య చరిత్ర ద్విపదకు వచనగ్రంథాన్ని 1990 సం॥లో తి.తి.దే. అన్నమాచార్య ప్రాజెక్ట్ పక్షాన ప్రకటించింది.

## కృత్యవతరణిక

అన్నమాచార్య జీవితచరిత్ర ద్విపదకావ్యం యథావిధిగా కృత్యవతరణికతో ప్రారంభమైనది. కథా ప్రారంభంలో చిన్నన్న అలమేల్మంగను, తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని స్మరించి -

"జలజాతవాసిని చనుబాలపుష్టిఁ
బలికెద నా నేర్పుపరిపాటి నిపుడు"[1]

అని ద్విపద కావ్యాన్ని రచించినట్లుగా సవినయంగా ప్రకటించాడు.

అరలేక యీయన్నమాచార్యచరిత
వెలివక నీకు నే విన్నవించెదను
మన్నించి యలమేలు మంగతో నీవు
నినుఁబాయని భక్తనికరంబుతోడ
నవధారు శ్రీవేంకటాచలధీశ[2] - అని కృత్యవతరణిక ముగించ బడినది.

## అన్నమాచార్య జీవితచరిత్ర - సంక్షిప్తంగా

అన్నమాచార్య జీవితచరిత్ర కథా ప్రారంభమున తాళ్లపాకకు మండల కేంద్రమైన పొత్తపినాడునన్న, తాళ్లపాక గ్రామం వర్ణించ బడినది. తదుపరి

భరద్వాజగోత్రులు, ఆశ్వలాయన సూత్రులైన తాళ్లపాక వంశీయులను గూర్చి ప్రస్తావింపబడినది. అన్నమాచార్యుల పూర్వీకు లైన నారాయణయ్య, విఠలయ్య, నారాయణయ్య, విఠలుడు, నారాయణయ్య మరియు అన్నమయ్య తండ్రియైన నారాయణసూరి పేర్లు ప్రస్తావింపబడినవి. మనకు లభించిన తాళ్లపాకవారి ఇతర గ్రంథములలో ఎక్కడా అన్నమయ్య పూర్వీకుల ప్రస్తావన కన్పించదు.

అన్నమయ్యకు తాతయైన నారాయణయ్యతో కథ ప్రారంభ మవుతుంది. నారాయణయ్యకు చిన్నతనంలో చదువు అబ్బలేదు. తండ్రి విఠలయ్య ఊటుకూరులో బంధువుల ఇంట ఉంచాడు. గురువులు శిక్షలకు గురిచేసినా చదువు అబ్బలేదు. అవమానభారంతో ఊటుకూరు నందలి చింతలమ్మ అనే గ్రామశక్తి ఆలయంలోని పుట్టలో చెయ్యి పెట్టాడు. చింతలమ్మ ప్రత్యక్షమై నారాయణయ్యను అనుగ్రహించి మూడవతరంలో పరమ భాగవతుడు జన్మిస్తాడని వెల్లడిస్తుంది. అట్లే నారాయణయ్య కుమారుడైన నారాయణ సూరి లక్కమాంబ దంపతులకు శ్రీవేంకటేశ్వరస్వామి వరంగా నందకాంశ సంభూతుడుగా తాళ్లపాక అన్నమాచార్యులు జన్మిస్తాడు. అన్నమయ్య వైశాఖ, విశాఖనక్షత్రంలో జన్మించినట్లు ద్విపదలో పేర్కొనబడినది. సంవత్సరాదులు పేర్కొనబడలేదు. తాళ్లపాక వాఙ్మయ పరిష్కర్తలు నిర్ధారించిన ప్రకారం తి.తి.దే. 9-5-1408 సంవత్సరము అన్నమయ్య జనన కాలంగా ప్రామాణికంగా స్వీకరించినది.

హరి నందకాంశసంభూతుడైన అన్నమయ్య వేంకటపతి మీది ధ్యాసతో ప్రొద్దులు గడిపేవాడు. 5వ సంవత్సరంలో ఉపనయనం, విద్యాభ్యాసం జరిగాయి. ఒకసారి ఇంటి వారలు పురమాయించగా గడ్డికోసం అడవికి వెళ్ళాడు. వేంకటపతి మీద ధ్యాసతో గడ్డికోయ బోయిన అన్నమయ్యకు కడవేలు తెగి రక్తంకారింది. వేదనలో విరక్తి, భక్తి కలిగాయి. కుటుంబాన్ని వదలి యాత్రికుల వెంట తిరుమలకు పయనమయ్యాడు. మొదట తిరుపతి తాళ్లపాక గంగమ్మను దర్శించి, కాలినడకన అలిపిరి, తలయేరు గుండు,

పెదయెక్కుడు, కపురంపు కాలువ, మోకాళ్ళముడుపు చేరుకొని సొమ్మసిల్లుతాడు. జగదంబయైన అలమేల్మంగ ప్రత్యక్షమై దివ్యప్రసాదాలు అందించి పాదరక్షలు లేకుండా తిరుమల చేరుకొమ్మని ఉపదేశిస్తుంది. అమ్మవారి అనుగ్రహంతో సారస్వతపారీణుడై శతకం సమర్పిస్తాడు. తిరుమల చేరి దివ్యస్థలాలను దర్శిస్తాడు. స్వామిని దర్శించి శతకాలు సమర్పిస్తాడు. స్వామి ఆదేశంపై ఘనవిష్ణువనే యతిచే పంచసంస్కార దీక్ష పొందుతాడు. తదుపరి స్వామి ఆదేశం మేరకు తల్లితో తాళ్లపాక చేరి తిరుమలమ్మ, అక్కలమ్మలను వివాహం చేసుకొంటాడు. స్వామి ఆదేశం మేరకు అన్నమయ్య తన 16వఏట నుండి సంకీర్తనాయజ్ఞాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాడు. గృహస్థుడైన అన్నమయ్య అహోబల పీఠాధిపతి ఆదివన్ శఠగోపయతి వద్ద వేదాంతరహస్యాలను తెలుసుకొన్నాడు. దేహాత్మేశ విచారాదులను, జీవాత్మ పరమాత్మలు తదైక్యాన్ని తెలిపే అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు రచించాడు. అన్నమయ్య విఖ్యాతిని సాళువనరసింహరాయలు విని మొదట టంగుటూరుకు, తదుపరి పెనుగొండకు ఆహ్వానిస్తాడు. రాజాశ్రయంలో అన్నమయ్య పదకవిగా జగత్ప్రసిద్ధుడౌతాడు. రాయలను కీర్తిస్తూ కీర్తన రచించనందులకు సంకెలబడుట, విముక్తుడగుట, రాజాశ్రయం వీడి శేషాద్రివాసుని సేవించడం, మహిమాన్వితుడవడం, పురందరదాసుల చెలిమి, అన్నమయ్య రచనలు, సంతతిగూర్చి చిన్నన్న వివరించాడు.

చిన్నన్న ద్విపద ఆధారంగా తెలుస్తున్న అన్నమయ్య సంక్షిప్త చరిత్ర ఇది. ఇక ద్విపదలో విశేషాంశాలు.

అన్నమాచార్య జీవితచరిత్ర ద్విపదలో తిరుపతి - తిరుమల ఆలయ, పరిసరాల వివరాలు, వేంకటేశ్వరస్వామి వారి తిరుమూర్తి వర్ణనలు, మహిమాన్విత సన్నివేశాలు, అన్నమయ్యను గూర్చిన వర్ణనలు, అన్నమయ్య గురువులు, సంగీతాంశాలు, అన్నమయ్య రచనలు, అన్నమయ్య సంతతి, సంకీర్తనలతో సమన్వయం, చిన్నన్న ద్విపదశైలి, భాషా విషయాలను క్రమానుగతంగా పరిశీలిద్దాం.

## తిరుపతి

అన్నమయ్య తిరుమలకు ప్రయాణమైనపుడు మొదటగా తిరుపతి పొలిమేరల్లోని గంగమ్మను దర్శించుకొంటాడు. ఈ గంగమ్మయే తాళ్లపాక గంగమ్మగా ప్రసిద్ధికెక్కింది.

## కొండఎక్కుడు మార్గం

తిరుమల కొండఎక్కుడు మార్గం ఏనాటినుండో జగత్ప్రసిద్ధ మైనది. బాల అన్నమయ్య తిరుమలకు నడక మార్గంలో బయలుదేరి నపుడు

అళిపుళి సింగరి నర్చించి మ్రొక్కి
తలయేఱుగుండు సందర్శించి . .
పెద్దయెక్కుడు గూర్చి పెనగొననెక్కి
కప్పురంపుఁగాలువ గడచి యంతంత
నామహాచలవీథి నలరారు పుణ్య
భూమిజంబులఁ బుణ్యభూముల జనులఁ
సేవించి కొనుచు . . . . . . . . . . . . . .
మోకాళ్లముడుపు నిమ్ముల జేరవచ్చి[3]

తదుపరి తిరుమల చేరుకొన్నట్లు పేర్కొనబడినది. ఈ వర్ణనల వల్ల ఆనాటి కొండ ఎక్కుడు మార్గం విదితమవుతున్నది. సాలగ్రామ మయమైన మోకాళ్ల ముడుపును చిన్నన్న శ్రీరామకృష్ణ లక్ష్మీ నృసింహాది మూర్తిమయంగా[4] వర్ణించడం మోకాళ్లముడుపు ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తుంది.

## తిరుమల పుష్కరిణి

తిరుమల చేరిన అన్నమయ్య స్వామిపుష్కరిణిని, తదుపరి వరాహస్వామి ఆలయాన్ని, సందర్శించి నట్లు పేర్కొన్నాడు చిన్నన్న-

పెనుసోబనాలు చూపెడు సోబనాలు
గనుపట్టు స్వామి పుష్కరిణి సోయగము

వెండియుఁజూచె . . . . . . . . . . . . . . . .

ఆదరిఁ బెంపొందు నాదివరాహు

నాదరంబున ఁగొనియాడి సేవించి[5] ॥ అని పేర్కొనడంచే మొదటగా ఆదివరాహ స్వామిని దర్శించుకొన్న తర్వాతనే శ్రీవారిని దర్శించుకోవాలనే సంప్రదాయం ప్రస్ఫుటంగా చెప్పబడినది.

## ఆలయ పరిసరాలు

వరాహస్వామి సందర్శనం తర్వాత అన్నమయ్య తిరుమల ఆలయంలోకి ప్రవేశించి ఆలయ పరిసరాలన్నింటిని దర్శించిన తీరు కడు హృద్యంగా వర్ణించాడు చిన్నన్న.

. . . . . . . . . . పెద్దగోపురము సేవించి

నీడ తిరుగని చింత వర్తిల నమ్రుడగుచు

పరుసల కిష్టసంపద లిచ్చు పసిడి

గరుడగంబము పేర్మిఁగని సాగిమ్రొక్కి

. . . . . . . . . . . . . . . . . . . . . . .

గనుపట్టు నాచంపకపు ఁబ్రదక్షిణము

చనుదెంచి . . . . . . . . . . . . . . . . [6]

ప్రసాదశాల, నడగోపురం, భాష్యకారులను, శ్రీనృసింహుని, అలమేల్మంగను, యాగశాలను, ఆనంద నిలయాన్ని, కల్యాణ మంటపం, వాహనశాలను, పరిమళపుఅర, బంగారు నగల బండారము, గాదెలను సందర్శించుకొన్నట్లు వర్ణించాడు చిన్నన్న.[7] పైన వర్ణించిన ఆలయ పరిసరాల వర్ణనవల్ల చిన్నన్న ఆనాటి తిరుమల స్వరూపాన్ని పేర్కొన్నట్లైనది.

స్వామివారి ప్రసాదశాలలోని భక్ష్యములు, భోజ్యములు, వెన్నఁగాచిన వింత పచ్చళ్ళు, సన్నరాజనపు ప్రసాదాలు, వెన్నెలవలె చల్లనైన పెరుగన్నములు, వడలు, అప్పాలు, పాలు, అతిరసాలు, పరిమళ ద్రవ్యాలను వర్ణించి –

. . . . అవ్వేల్పు తళిఘలక్రింద
జిందగా జేత నూర్చిన నంటివచ్చు
నొకనాఁటి నెయ్యి వేఱొక దేవళమున
నొకయేట నైనను నున్నదే యనుచు . . . [8] అని వర్ణించడంవల్ల ఆనాడు తిరుమలలో శ్రీవారి ప్రసాదాలకు నేయి ఎంత అధికంగా వినియోగింప బడేదో తేటతెల్లమవుతున్నది.

ఇక స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని తొలిసారి దర్శించి నపుడు అన్నమయ్య

. . . . కన్నులెల్ల కరవెల్ల ఁదీర
సేవించి తనివోక శ్రీవేంకటేశు
దేవుని మఱియు గీర్తింప దొణఁగె[9] -

అని ప్రస్తావించి శ్రీవత్సకౌస్తుభాది అనుపమ దివ్యభూషాదివైఖరులు కలిగిన దివ్యమంగళ విగ్రహాన్ని ఆసాంతం వర్ణించాడు చిన్నన్న.

## మహిమాన్విత సన్నివేశాలు

తాళ్లపాక అన్నమాచార్యులు పరమభాగవతోత్తముడు. భగవత్, భాగవతుల చరిత్రల్లోని సన్నివేశాలు లోకోత్తర విషయాలుగా వుండడం సహజం. భగవత్సంకల్పం వల్ల జరిగే సంఘటనలు లోకంలో మహిమాన్విత సన్నివేశాలుగా రూఢికెక్కుతాయి. ఇలాంటి సంఘటనలు అన్నమాచార్య చరిత్రలో నారాయణయ్యకు చింతలమ్మ ప్రత్యక్షమై అనుగ్రహించడం[10], అన్నమయ్య తల్లియైన లక్క మాంబతో మాడుపూరు మాధవ స్వామి సంభాషించడం[11], నంద కాంశసంభూతుడుగా అన్నమయ్య జన్మించిడం[12], అన్నమయ్య కొండ ఎక్కునపుడు అలమేల్మంగ ప్రత్యక్షమవడం[13], అన్నమయ్య కవితాశక్తిని పొందడం[14], స్వామివారి ముత్యాలహారం పొందడం[15], సాళ్వ నరసింహరాయలు అన్నమయ్యకు సంకెలలు వేయించగా "సంకెల ఁబెట్టినవేళ చంపఁబిలిచిన వేళ" అనే కీర్తన ఆలపించి బంధవిముక్తుడు

కావడం[16], అన్నమయ్య వశ్యవాక్కు వల్ల ప్రజలు ఆపదలనుండి రక్షింప బడడం[17] మొదలైన సన్నివేశాలు ఎంతో మహిమాన్వితమైనవై ఈ ద్విపదలో మనకు కనిపిస్తాయి. ఇవి మనకు దివ్యస్ఫూర్తిని కలిగించే సంఘటనలని పేర్కొనవచ్చును.

## అన్నమయ్య వర్ణన

హరినందకాంశ సంభూతుడైన అన్నమయ్యను గూర్చి చిన్నన్న ద్విపదలో కథానుసారం మనోజ్ఞంగా వర్ణించాడు. అన్నమయ్య రూప వర్ణనను, స్వభావవర్ణనను ద్విపదలో మనం గమనించవచ్చును.

శ్రీవేంకటేశ్వరస్వామి ఘనవిష్ణువుతో అన్నమయ్యకు పంచ సంస్కారదీక్ష చేయించమని ఆదేశిస్తాడు. ఈ సందర్భంలో అన్న మయ్య ఆనవాళ్ళను స్వామివారే స్వయంగా ప్రకటిస్తాడు.

వడుగు నల్లని చిన్నవాడు నన్నెపుడు
నుడుఁకక సంకీర్తనము సేయు నెపుడు
ముద్దుగారెడువాఁడు మోహనంబైన
మద్దికాయల వాడు మనవాఁడె వాఁడు
గుదిగొన్న నునుపట్టు కుచ్చులదండె
ముదమున నిజభుజంబున నించువాఁడు ॥[18] ఇది బాల అన్నమయ్య రూపవర్ణన.

సాళువ నరసింహరాయని ఆస్థానకవిగా అన్నమయ్యను వర్ణించినపుడు మనకు హరి సంకీర్తనాచార్యుడుగా సాక్షాత్కరింప చేశాడు చిన్నన్న.

కనకాంబరుని గుణగణమణుల్ శ్రుతులు
గని చిక్కుగొనురీతి గను కపోలములు
. . . . . . . . . . . . . . . . . . . . .
అరవింద నయను కృపామృతధార
కరణి ఁజూపట్టెడు కంఠమాలికయు

నరహరికై కంకణము గట్టియున్న
సరణి (జూపట్టు పచ్చలకడియములు
. . . . . . . . . . . . . . . . . . . . . . . .
వాసుదేవుని యాజ్ఞ వడి (జుట్టుకొన్న

యాసత్త్వగుణమన నలరు దుప్పటము[19] అని అన్నమయ్యను వర్ణించాడు. అప్పని వరప్రసాదియైన అన్నమయ్య స్వభావవర్ణన కూడా ఎంతో ఉదాత్తమైనదిగా, హరిసంకీర్తనా సంసేవనకే కట్టుబడి నట్లుగా మనకు ఆవిష్కరించాడు చిన్నన్న. శిశుప్రాయం నుండే అన్నమయ్యకు శ్రీ వేంకటేశ్వరుని పట్లకల అనురక్తిని వేంకటపతి పేరు వివరించి పాట పొంకించ కుండినఁబో రూరడిలఁడు[20]- అని పేర్కొంటాడు చిన్నన్న. అన్నమయ్య వసుధ నటించు సంవర్తు భావముతో మెలిగేవాడని, అన్నమయ్య ఆడినమాటెల్ల అమృత కావ్యంగా, పాడినపాటెల్ల పరమగానమైనదని, పేర్కొంటాడు చిన్నన్న. చిన్ని శిశువుగా అన్నమయ్య వుండినపుడు తల్లిదండ్రులు అన్న మయ్యను అన్నయ్య, అన్నప్ప, అన్నమాచార్య, అన్న అని పిలిచే వారని తెలుస్తున్నది.

అన్నమాచార్యులను సాళువనరసింహరాయలు తన ఆస్థానానికి ఆహ్వానించినపుడు

"సహజవైష్ణవ భక్తి సలిపెడువాని
సహవాసమైన దోసములేదటంచు"[21]- అని తలపోయడం, సాళువ నరసింహ రాయలు తనపై ఒకమధుర భక్తి సంకీర్తన రచించ మని కోరినపుడు

హరి ముకుందుని (గొనియాడు నా జిహ్వ
నిను (గొనియాడంగ నేరదెంతైన[22]-

అని చెప్పడంలో అన్నమయ్యకు స్వామి వారిపట్ల కల అచంచలమైన భక్తివిశ్వాసాలు వెల్లడిఅవుతున్నాయి. పై సన్నివేశం అన్నమయ్య స్వభావ చిత్రణకు అద్దం వంటిది.

## గురువులు

అన్నమయ్య హరినందకాంశ సంభూతుడు. అందుకే అన్న మయ్యకు గురువులు లోకోత్తరచరిత్రులు కావడం గమనార్హం. స్వామి సంకల్పబలంచే అన్నమయ్యకు ఘనవిష్ణువు పంచసంస్కారదీక్ష చేయగా, అహోబల మఠాధిపతి ఆదివన్ శఠగోపయతి సకలవేదాంత రహస్యాలను వెల్లడించాడు. ఆదివన్ శఠగోపయతిని గూర్చి అన్న మయ్య -

. . . . . . . వేంకటగిరిపతికి
నిరతి అహోబల నృకేసరి (ద
తత్పరుఁడగు శఠగోపముని యితడు[23]- అని కీర్తించాడు.

## సంగీతాంశాలు

క్రీ.శ. 15శ॥ము తెలుగు వాఙ్మయచరిత్రలో ప్రబంధాలు వెలువడు తున్న కాలం. ఆదశలో తేట తెలుగులో శ్రీవేంకటేశ్వరునిపై కీర్తనలు రచించి ఆనాటిరాజుల, ప్రజల మన్నలను పొంది పదకవిగా గుర్తింపు పొందినవాడు అన్నమయ్య. శఠగోపముని వద్ద వేదాంత రహస్యాలను అభ్యసించిన అన్నమయ్య సకలవేదములను సంకీర్తనలుగా రచిస్తాడు. సకల జనులు అన్నమయ్యను తుంబురుడో, నారదుడో, గంధర్వుడో[24] అని కీర్తిస్తారు. రాజాస్థానంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించు నపుడు

తిపిరి దండెలు శ్రుతుల్ తిన్నగా గూర్చి
దండిమై నెఱగాన దండెయు వాద్య
దండెయుఁ దాన సంతానంబు చూప
స్థాయి షడ్జమును బంచమమును జేసి
తాయముల్ కడుమింత డాలుగా (జూప
. . . . . . . . . . . . . . . . . . . . . .
వేంకటపతికి (గావించిన మంచి
సంకీర్తనముల రసంబు లుట్టగను

సింగార మొకకుప్ప (జేసిన రీతి

రంగైన రాగవర్ణములు (బాడుటయు[25]- అని వర్ణించినపుడు సంగీతాంశాలు ప్రస్తావింపబడినవి.

## అన్నమయ్య రచనలు

అన్నమయ్య మోకాళ్ల ముడుపువద్ద సొమ్మసిల్లి పడిపోయినపుడు జగదంబ అలమేల్మంగ సేదతీరుస్తుంది. ఈ సందర్భంలో

తన కేల నిడు ప్రసాద ప్రభావమున

. . . . . . . . . . . . . . . . . . . . . . .

అలమేలు మంగకు ఆశు మార్గమున

సలలితంబుగ నొక్కశతకంబు జెప్ప[26] -

అని అన్నమయ్య తొలుతగా గ్రంథస్థంగా శతకాన్ని రచించినట్లు పేర్కొన్నాడు చిన్నన్న. తిరుమలను మొదటిసారిగా సందర్శించిన సందర్భంలోను వేంకటేశ్వర స్వామికి వితతవృత్తంబుల వేంకటపతికి కుతుకంబు సమకూర[27] చేసినట్లు ద్విపదవల్ల తెలుస్తున్నది.

శృంగార, అధ్యాత్మ తత్త్వ ప్రధానమైన ముప్పదిరెండువేలు కీర్తనలు, రామాయణము, సంస్కృతంలో వేంకటాచల మాహాత్మ్యము, శృంగారమంజరి, 12శతకాలు, సకలభాషల్లో ప్రబంధాలు రచించినట్లు[28] ద్విపదవల్ల స్పష్టమవుతున్నా మనకు లభించినవి దాదాపు 13,000 సంకీర్తనలు, వేంకటేశ్వరశతకం, శృంగార మంజరి మాత్రమే!

## అన్నమయ్య సంతతి

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంచే

. . . . . తనయంతవారి (బుత్రకుల

నరసయాచార్యునున్నత యశోధనుని

తిరుమలాచార్యుని ధీవిశారదుని

కాంచినట్లు . . . . . . . . . [29] పేర్కొన్నాడు చిన్నన్న.

## సంకీర్తనలతో సమన్వయం

చిన్నన్న రచించిన ద్విపద అన్నమయ్య జీవితంలోని సన్నివేశాలకు అక్షరరూపంగా ప్రామాణికతను సంతరించుకున్న కావ్యం. ద్విపదలోని సంఘటనలకు మనకు అన్నమయ్య పదరాశిలోని కీర్తనలు ఉదాహరణలుగా నిలుస్తాయి. మచ్చునకు కొన్ని కీర్తనలు.

అన్నమయ్య కొండఎక్కునపుడు సందర్శించిన తిరుమల గిరులను చూచి కట్టెదుట వైకుంఠము కాణాచయిన కొండ[30], అదివో అల్లదివో హరివాసము[31] అని కీర్తిస్తాడు. అన్నమయ్య పరుసలగుంపుతో తిరుమలకు, ప్రయాణమైనపుడు యాత్రికులు "వరములరాయఁడె, గొడ్డురాలికినైన గొమరులనొసగువాడు, వడ్డికాసులవాడని[32] గానం చేసినట్లు చిన్నన్న పేర్కొన్నాడు. ఈ ద్విపద పాదాలకు ఉదాహరణగా 'వేడు కొందామా వెంకటగిరి వేంకటేశ్వరుని'[33] అనే కీర్తన చెప్ప వచ్చును. అన్నమయ్యస్వామి వారిని దర్శించుకొన్నపుడు "కంటి నయ్యఖిలాండ కర్త నేనధికుగంటి"[34] అను పదబంధంతో కీర్తన రచించినట్లు చిన్నన్న పేర్కొన్నాడు. 'కంటి అఖిలాండ కర్తనధికుని గంటి . . . . కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తిగంటి'[35] అనే కీర్తన అన్నమయ్య పదరాశిలో కన్పిస్తుంది.

అన్నమయ్య సాళ్వనరసింహరాయల కోరికపై ఆలపించి ఏమొకొ చిగురు టధరమున యెడనెడ గస్తురి నిండెను,[36] అనే కీర్తన, రాజాజ్ఞ ధిక్కరించినపుడు సంకెళ్లతో బంధింపబడినపుడు ఆలపించిన 'ఆకటి వేళల నలపైన వేళలను'[37] అనే కీర్తనలు ద్విపదలోని కొన్ని సన్నివేశాలకు ఉదాహరణలు. ఇంకా అనేక సంకీర్తనలు ద్విపదకు సమన్వయించవచ్చును.

## చిన్నన్న - ద్విపద రచనావిశేషాలు

చిన్నన్న రచించిన ద్విపద లక్షణబద్ధమై వున్నది. కథారచనలో సారళ్యము, స్పష్టత ఈ రచనలోని ప్రత్యేకతలు. ప్రకృతివర్ణనలు, ఆలంకారికశైలి, ఆనాటి వస్తువర్ణనలు, ఆచారాలు, భాషా ప్రయోగాలు ద్విపదలో కన్పిస్తాయి.

అన్నమాచార్య చరిత్ర ద్విపదలో చిన్నన్న ఆనాటి పొత్తపినాటిని, తాళ్లపాకను హృద్యంగా వర్ణించాడు. పొత్తపి నాటిలో చెరుకు తోటలు, సరస్సులు, పూపొదలు, ముంత మామిడి తోటలు, రాజనపు పైరులతో సస్య శ్యామలంగా వుండేదని ప్రకృతి వర్ణనతో[38] పేర్కొని

. . . . . పొత్తపినాటి యొౖదుల సిరుల

పట్టుగొమ్మైతాళ్లపాక చెన్నొందు[39] అని వారి జన్మస్థలాన్ని కీర్తించాడు.

అన్నమయ్యకు అలమేల్మంగ ప్రత్యక్షమైనపుడు క్రొక్కారు మెఱుఁగు చందమున, దినుసైన లేపువ్వుఁదీగె కైవడిని, కమనీయమగు చంద్రకళ సోయగముతోనట్లు ఆలంకారికంగా రచించాడు చిన్నన్న.

ఇక ద్విపదలో ఆనాడు ఉపయోగించే గృహోపకరణాలు, వంట వస్తువులు, సంభావనా వస్తువులను, ఆభరణాలను విస్తారంగా ప్రస్తావించాడు. తిరుమల వంటశాలలోని వస్తువుల్లో పైడిపళ్యారాలు, భృంగారకలు, తళిఘలు, పరిమళపు అరలో సలాకలు, చట్టలును పేర్కొన్నాడు.

రాయలు అన్నమయ్యను సంభావించిన వస్తువుల్లో పచ్చల కడియాలు, బంగారు వ్రాతపచ్చడము, కెంబట్టుకుళ్ళాయి, అంగ దంబులు, వింజామరులు, గిండీలు, కళాచికలను చిన్నన్న పేర్కొన్నాడు. తిరుమలకు వెళ్ళే యాత్రికులను వర్ణించినపుడు కృష్ణాజినపు కిరీటాలు, బేగడపారుటాకులు, పీలికుచ్చులు, శంఖచక్ర ముద్రికలను ధరించినట్లు రచించాడు.

ప్రత్యేకించి ఆనాడు తిరుమల ఆలయంలో బంగారు వినియోగం అధికంగా వుండేదని ద్విపదరచన వల్ల తెలుస్తున్నది. బంగారుమేడ, పసిడి గరుడగంభము, పైడిపళ్యారాలు, బంగారు గరుడుడు, బంగారు శలాకలు, పసిడిపళ్ళెరాలు, కనకభూషణ వస్తుతతులు, బంగారుగాదెలు, పసిడిటక్కుల తలవాకిట, కాంచనాంబరము, బంగారు పచ్చడము, విరులు అంటూ వివిధ సందర్భాల్లో బంగారు ప్రస్తావింపబడినది.

## ఆచారాలు

అన్నమయ్యకు 5సంవత్సరముల ప్రాయంలో ఉపనయనం చేయడం, తిరుమలలో ఘనవిష్ణువు పంచసంస్కారదీక్ష చేయడం ఆనాటి సంప్రదాయాలను తెలియపరుస్తున్నవి.

## భాషావిశేషాలు

పంటవలంతి, జిడ్డుపెట్టు, వలసుట్టు, పనిమంతుడు, వాద్య దండెము, గ్రామసంతతి, ఎడనీరు, హరివాసరము, లక్ష్మణ గురుమతము మొదలగు కొన్ని ప్రయోగాలు చిన్నన్న వ్యావహారిక పదప్రీతికి, సంప్రదాయ పదప్రయోగానురక్తికి తార్కాణాలుగా చెప్పవచ్చును.

## ఫలశ్రుతి

చిన్నన్న ద్విపదకావ్యంలో ఫలశ్రుతిని, అంకితాంక విషయాల్ని పేర్కొన్నాడు.

మనసున గపటంబు మాని సద్భక్తి
ననఘమౌ నీ యన్నమాచార్య చరిత
వినిన వ్రాసిన ఁబేరుకొనిన ఁజదివిన
జనులకు నిష్టార్థ సౌఖ్యంబు లొదవు
నని యలమేలు మంగాధీశు పేర
. . . . . . . . . . . . . . . . . . . . .
ఆ లీల దాళ్లపాకాన్నమాచార్యు
నేలిన శ్రీవేంకటేశ్వరు పేర
నంకితంబుగను . . . . . . . . . . . .
. . . . . . . . . . . . . . . . . . . . .
. . . . . . . . . . తిరువేంగళనాథ
విరచిత సద్భక్తి విభవాన్నమార్య

చరితంబు జగదేక సన్నుతంబగుచు
నాచక్ర శంఖాంక యశముతో ఁగూడ
నాచంద్రతారార్కమై యుండు ఁగాత ||[40]

అని ద్విపదకావ్యం పరిసమాప్తి చేయబడినది.

## ఉపయుక్త సంఖ్యాసూచి

1. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -1
2. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -2
3. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -14,15
4. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -17
5. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -18,19
6. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -20
7. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -20, 21,22
8. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -20
9. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -23
10. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -6
11. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -8
12. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -9
13. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -16
14. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -18,24
15. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -26
16. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -38,39
17. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -44
18. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -29
19. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -35

20. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -11

21. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -31

22. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -37

23. అధ్యాత్మ సంకీర్తనలు సం. 1, కీ -117

24. అన్నమాచార్య ద్విపద పుట -30

25. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -33

26. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -18

27. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -24

28. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -45

29. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -46

30. అధ్యాత్మ సంకీర్తనలు సం. 3, కీ -471

31. అధ్యాత్మ సంకీర్తనలు సం. 1, కీ -23

32. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -19

33. అన్నమాచార్యజీవిత చరిత్ర పీఠిక పుట - 6

34. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -23

35. అన్నమాచార్య సంకీర్తనలు సం -4, పుట-399

36. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -36
శృంగార సంకీర్తనలు సం- 5, కీ - 82

37. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -38
అధ్యాత్మ సంకీర్తనలు సం- 1, కీ- 158

38. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -3

39. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -3

40. అన్నమాచార్యజీవిత చరిత్ర ద్విపద పుట -46,47


★ ★ ★

టి.అనంతనారాయణ

# అన్నమయ్య సంకీర్తనలలో ప్రతిఫలించిన వేదమంత్రాలు

## వేదాలు వాటిస్వరూపం

సమస్త భారతజాతికి వేదాలు అతి ప్రాచీనమైన పవిత్రగ్రంథాలు.

యజ్ఞేన వాచః పదవీయమాయన్తామన్వవిన్దన్ ఋషిషు ప్రవిష్టామ్।
తామాభృత్యా వ్యదధుః పురుత్రా తాం సప్తరేఖా అభిసన్నవన్తే॥
(ఋ.సం.10.71. 3)

ఇక్కడ యజ్ఞశబ్దం పరమేశ్వరవాచకం. 'యజ్ఞేన యజనీయేన పరమేశ్వరేణేతి యావత్' అని నిర్వచనం. 'వాచః' అను శబ్దం 'వేద వాక్కు'లనే అర్థాన్నిస్తుంది. 'ఋషిషు ప్రవిష్టామ్' ఋషిహృదయాలలో ప్రవేశించిన వాక్కును.

బృహస్పతే ప్రథమం వాచో అగ్రం యత్ప్రైరయత నామధేయం దధానాః।
యదేషాం శ్రేష్ఠం యదరిప్రమాసీత్ ప్రేణా తదేషాం నిహితం గుహావిః॥
(ఋ.సం.10.71. 1)

తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచస్సామాని జజ్ఞిరే।
ఛందాంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాత్ అజాయత॥
(ఋ.సం.10.90. 9)

తస్మాదృచోపాతక్షన్ యజుర్యస్మాదపాకషన్।
సామాని యస్య లోమాన్యథర్వాఙ్గిరసో ముఖమ్॥
(అ. సం. 10.7.20)

పై మంత్రాలను బట్టి యజ్ఞరూపి అయిన పరమేశ్వరుని నుండియే అన్ని వేదాలు జనించాయి. కాబట్టి, వేదాలు ఈశ్వరప్రోక్తాలు.

## వేదశబ్దనిర్వచనం

'విద్యతే - లభ్యతే జ్ఞానమ్ అనేన ఇతి వేదః' దేని వలన జ్ఞానాన్ని పొందగలమో అదే వేదం.

'వేత్తీతి వేదః, వేదయతీతి వేదః' ఇది జ్ఞానవాచకం. దేనివలన సర్వం తెలుస్తుందో, ఏది సర్వాన్ని తెలియపరుస్తుందో అది వేదం.

'విందతి లభతే ఇతి వేదః' దేనివలన మానవులు అభ్యుదయ నిశ్శ్రేయసాలను పొందగలుగుతారో అది వేదం. 'విందతి అనేన ధర్మమ్ ఇతి వేదః' సర్వధర్మాలను తెలియజేసేది వేదం.

'అస్య మహతో భూతస్య నిశ్వసితం యదృగ్వేదః' అని బృహదారణ్యకోపనిషత్. పరమపురుషుని నిశ్వాసమే వేదమని చెప్పబడింది.

## వేదప్రతిపాద్యవిషయం

'సర్వోఽప్యయం వేదః ప్రత్యక్షానుమానాభ్యాం, అనవగతేష్టానిష్ట ప్రాప్తిపరిహారోపాయప్రకాశనపరః; సర్వపురుషాణాం నిసర్గత ఏవ తత్ప్రాప్తిపరిహారయోరిష్టత్వాత్' అని శంకరభగవత్పాదులు ప్రత్యక్ష-అనుమాన ప్రమాణాలకు తెలియబడని, ఇష్టప్రాప్తికి అనిష్ట పరిహారానికి తగిన సాధనాలను తెలియచేసేదే వేదం. సర్వమానవులకు ఇష్టప్రాప్తి అనిష్ట పరిహారం సహజమైన కోరికలుగదా!

వేదాలు ప్రత్యక్షప్రమాణానికి గోచరాలయ్యే విషయాలను, అనుమానప్రమాణానికి గమ్యాలైన విషయాలను తెలపడమేగాక, కేవల ప్రత్యక్షానుమానాలకు గోచరాలుగాని, అనుభూతి విశేషాలను గూడ తెలియజేస్తాయి.

వేదాలు సత్యార్థప్రతిపాదకాలు, సర్వశంకానివారకాలు, సర్వ ప్రాణ్యుద్ధారకాలు. కాబట్టి 'వేదాలు' దైవవాక్కులు, భగవన్నిశ్వాసాలు. అనంతాలు, ప్రజ్ఞాననిలయాలు.

అపౌరుషేయాలు - పరిపూర్ణాలు - నిత్యస్మృతులు అని భారతీయులు హృదయ పూర్వకంగ భక్తిప్రపత్తులతో విశ్వసించి, సర్వ విజ్ఞానానికి పరమప్రమాణాలుగ వాటి నామోదించారు.

వేదాలు సర్వకాలసర్వావస్థలలో, సర్వప్రాంతాలలో సర్వ మానవులకు సమాన ఫలాలనే సమకూరుస్తాయి. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, నిత్యుడైన భగవంతుని జ్ఞానం గావున వేదాలు విశ్వవ్యాప్తాలు.

అర్థకామాలకులోనై సంసారచక్రాన పరిభ్రమించే జీవుల నుద్ధరించడానికి ప్రవృత్తి రూపధర్మాన్ని ఆశ్రయించడానికి అవతరించిన సనాతనశాస్త్రమే వేదం. మానవునికి దివ్యత్వాన్ని సిద్ధింపజేసే నివృత్తి ధర్మాన్ని ఉపదేశించే సనాతనశాస్త్రం వేదం అని మనుస్మృతి చెప్పింది.

## వేదభాష్యావిర్భావం

వేదవాఙ్మయం కాలగమనంలో అందరికి దురవగాహమైంది. ఆ దశలో సాయణాచార్యులు భాష్యం రాశారు. వారు చేసిన కృషి అద్వితీయం, అపూర్వం, అనన్యసాధారణం. వారి ఋగ్వేదాన్ని అనువాదం చేస్తూ విల్సన్ ఇలా అంటున్నారు.

He (Sayana) undoubtedly had a knowledge of his text far beyond the pretensions of any European scholar, and must have been in possession, either through his own learning or that of his assistants, of all the interpretation which had been perpetuated by traditional teaching from the early times.

(ఆర్షవిజ్ఞానసర్వస్వము vol. I , p. 48-49)

ప్రొఫెసర్ మాక్స్‌ముల్లర్ ఒక చోట సాయణాచార్యుని గురించి అన్న మాటలు ఇవి :

*Those who recollect the history of vedic scholarship during the last five and twenty years know best that with all its faults and weaknesses, Sayana's commentary was a sine qua non for*

*a scholar-like study of the Rgveda. I do not wonder that others who have more recently entered on that study are inclined to speak disparagingly of the scholarstic interpretations of Sayana. They hardly know how much we all owe to his guidance in effecting our first entrance into this fotress of Vedic language and Vedic religion, and how much even they, without being aware of it, are indebted to that Indian Eusthius.....*

*(Preface to his Vedic Hymns, Part I, P. 30)*

వేదాలను సరిగ్గా అర్థం చేసుకోవాలంటే సాయణభాష్యం, ఇతర భాష్యాలు చదవాలి. సంప్రదాయ బద్ధంగా వేదార్థాన్ని తెలుసుకున్న భాష్యకారులపై గౌరవాదరాలు లేకపోతే మహర్షుల అనుభూతి మనకెలా అర్థమవుతుంది? అని 'గోల్డ్ స్టుకర్' గారు, హెచ్. హెచ్. విల్సన్, రాథ్, గ్రాస్మన్ మొదలైన వారిని ఖండిస్తూ ఇలా అంటారు:

How are we to know the revelations of the sages without having any regard to the learned commentators who are qualified to interpret them! (ఆర్షవిజ్ఞాన సర్వస్వము, page no.Lxxvii)

సాయణాచార్యులపై విదేశీయులు వేసిన అభాండాలను భారతీయ పండితులు పట్టించుకోక పోయినా, 'గోల్డ్ స్టుకర్' లాంటిపండితులు వారికి సమాధానం చెప్పారు.

## అన్నమాచార్యుల ప్రస్తావం

ఇటువంటి మహత్తరమైన వైదికవాఙ్మయం భారతీయుల పంట. వేదాలను అధ్యయనం చేసి వాటిసారాన్ని గ్రహించిన ధన్యజీవి అన్నమాచార్యులు. వారు తన సారస్వతాన్నంతటినీ అధ్యాత్మ- శృంగార-వైరాగ్య కీర్తనలుగా లోకానికందించారు. వారి సంకీర్తనలలో దాగిన వేదమంత్రాలు - వాటిని వారు విశ్లేషించిన తీరు ఈ వ్యాసంలో విశ్లేషింప బడుతుంది.

## వేదప్రవృత్తి

వేదవాఙ్మయమంతా యజ్ఞయాగాదివిషయాలను బోధిస్తుంది.

యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః। తాని ధర్మాణి ప్రథమాన్యాసన్।
తేహ నాకం మహిమానస్సచంతే । యత్ర పూర్వే సాధ్యాస్సంతి దేవాః ।
(తై.ఆ. 3-12-7)

యజ్ఞపురుషుని ద్వారా దేవతలు పరమాత్మను పొందినారు. అదే ముఖ్యమైన ధర్మం. దేని వలన దేవతలందరు స్వర్గలోకానికి సంబంధించిన ఆముష్మిక ఫలాన్ని పొందారో, ఆ ఫలం స్వర్గలోక పర్యంతం వ్యాప్తమై వుంది. అందువల్ల యాగవ్యతిరిక్త కర్మలకు కూడ యాగశబ్దం చేతనే వ్యవహారం. ఉదా-పితృయజ్ఞం, మాతృ యజ్ఞం, బ్రహ్మయజ్ఞం, అనుయాగం(భోజనం) మొదలైన కర్మలను యాగశబ్దంచే వ్యవహరిస్తారు.

## కాలానుసారపరిణామం

కాలగమనంలో జ్ఞానం, శక్తి, సమయం లేకపోవుటవల్ల యజ్ఞ కర్మలను ఆచరించే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. దానికి లోకులు సులభ మార్గాన్ని ఆశ్రయించడానికి ఉపక్రమించారు.

భక్తి-ప్రపత్తి-ధ్యానం-స్మరణం-కీర్తనం అని సులభమైన మార్గాల ద్వారా యాగానుష్ఠానం చేస్తున్నారు. భక్తిసిద్ధాంతాన్నాశ్రయించిన వారు భగవంతుని ప్రధానంగా స్వీకరించి యాగాలను పూజా క్రమంగా స్వీకరించినారు. కావున, వేదవాక్యాలన్నీ భక్తిబోధకంగా మారి శబ్దాలన్నీ భగవద్వాచకాలైనాయి.

## వేదశబ్దాలు భగవద్వాచకాలు

దేవతిర్యఙ్మనుష్యేషు పున్నామా భగవాన్ హరిః।
స్త్రీనామ్నీర్లక్ష్మీ ర్మైత్రేయ నానయోర్విద్యతే పరమ్॥
(వి.పు.1.8.35)

పైవాక్యంవల్ల శబ్దాలన్ని భగవద్వాచకాలే.

యేఽప్యన్య దేవతా భక్తాః యజంతే శ్రద్ధయాన్వితాః ।
తేపి మామేవ కౌంతేయ యజన్త్యవిధిపూర్వకమ్॥ (భ.గీ.9. 23)

ఏ ఏ దేవతలనుద్దేశించి వేదప్రకరణంలో యాగం చెప్పబడునో అదంతా పరమాత్మే చెప్పినట్లు శ్రుతి -స్మృతి-ఇతిహాస- పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి. భగవంతుడు స్వయంగా భగవద్గీతలో ఈవిధంగా చెప్పినారు.

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ । (భ.గీ.9.14)

## ఈవిషయంలో దృష్టాంతం

ఋగ్వేదంలో ఇంద్రస్తుతి ప్రకరణంలో ఏ విశేషాలు చెప్ప బడ్డాయో అవి అంతా పరమాత్మవిషయాలే.

తిగ్మమాయుధం మరుతామనీకం కస్త ఇంద్ర ప్రతి వజ్రం దధర్ష ।
అనాయుధాసో అసురా అదేవాశ్చక్రేణ తాం అప వప ఋజీషిన్ ॥
మహ ఉగ్రాయ తవసే సువృక్తిం ప్రేరయ శివతమాయ పశ్వః ।
గిర్వాహసే గిర ఇంద్రాయ పూర్వీర్ధేహి తన్వే కువిదంగవేదత్॥
ఉక్థవాహసే విభ్వే మనీషామ్। (ఋ.సం. 8-96-9,10).

వజ్రాయుధం చక్రంవలె తీక్షణంగావుంది. ఇంద్ర-చక్ర-ధను శ్శబ్దాలు విష్ణు సంబంధమైన విశేషాలను చెప్పుచున్నాయి. 'ఇది పరమైశ్వర్యే' అనే ధాతువునుండి 'ఇంద్ర' శబ్దం పుట్టినది. సామాన్య మైన ఇంద్రునికి కాలనియమముంటుంది. పరమైశ్వర్య సంబంధమైన ఇంద్రశబ్దం కాలనియమంలేని పరమాత్మవాచకం. చక్ర- ధనుశ్శబ్దాలు రెండూ విష్ణువుయొక్క ఆయుధవిశేషాలు. చక్రంతో సమానమైన వజ్రాయుధాన్ని ధరించిన ఇంద్రుడు ఏ విధంగా శ్రేయస్సును పొందాడో అదే విధంగా మనం విష్ణుచిహ్నాలైన శ్రీవైష్ణవసంప్రదాయసిద్ధమైన పంచ సంస్కారాలను పొందినవారు శ్రీవైష్ణవత్వాన్ని, శ్రేయోమార్గాన్ని పొందగలరు.

## పంచసంస్కారాలు

తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః।
అమీ పరమసంస్కారా పారమైకాంత్యహేతవః॥

శ్రీవైష్ణవమతదీక్ష తీసుకొనే వారికి పంచసంస్కారాలు అతి ప్రధానాలు.

1. తాపః

తాపః-ముద్రాధారణం. రెండుభుజాలందు శంఖచక్రాలు కాల్చి ముద్రించుకోవడం. దీనినే సమాశ్రయణమని శ్రీవైష్ణవులు వ్యవహా రిస్తారు.

2. పుంౘ్రః

లలాటాన ఊర్ధ్వపుండ్రం ధరించుట. శ్రీవైష్ణవమతదీక్ష ఇచ్చే టపుడు ఆ దీక్షఇచ్చే గురువే, ముఖానికున్న ఊర్ధ్వపుండ్రం కాకుండా భుజాలు, వక్షస్థలం, ఉదరం, కంఠం మొదలైన స్థలాలలో మరో పదకొండు ఊర్ధ్వపుండ్రాలు దీక్షపొందే భక్తునికి ధరింపజేస్తారు. ముఖంపైనున్న దానితో కూడ ఈ పదకొండు కలిసి ద్వాదశోర్ధ్వ పుండ్రాలుగా ప్రసిద్ధి కెక్కాయి.

3. నామః

నామకరణసమయంలో తల్లిదండ్రులు పెట్టిన పేర్లుకాక, దీక్షాసమయంలో దీక్షానామంగా 'రామానుజదాసః' 'శ్రీనివాసదాసః' మొదలయిన పేర్లుంచి వ్యవహరిస్తారు. ఈవిషయాన్నే మంత్రశాస్త్రం 'దీక్షా జన్మ తృతీయం స్యాత్' అని చెప్పుతుంది.

4. మంత్రః

వీరికి 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరియే ప్రధాన మంత్రం. దీనినే మూల మంత్రమనీ, అష్టాక్షరీ అని వ్యవహరిస్తారు. ఇది ఆత్మస్వరూపాన్ని సర్వస్వరూపాన్ని బోధిస్తుంది.

1. శ్రీమన్నారాయణచరణౌ శరణం ప్రపద్యే. 2. శ్రీమతే నారాయణాయ నమః ఇది శరణాగతి అనుష్ఠానప్రకాశక మంత్రం. దీన్నే ద్వయమంత్రమని కూడా పేర్కొంటారు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।<br>
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

(భ.గీ.18.66)

దీనిని చరమశ్లోకమనీ, శరణాగతి విధాయకమంత్రమనీ వ్యవహరిస్తారు. ఈ మూడు మంత్రాలను రహస్యత్రయమనీ చెప్తారు. ప్రతి నిత్యం యథాశక్తి

జపించడం శ్రీ వైష్ణవ దీక్షలో ఒక భాగం. ఇది కాక షడక్షరీ, ద్వాదశాక్షరీ, హయగ్రీవమంత్రం మొదలైన మంత్రాలను కూడ ఉపదేశిస్తారు.

5. యాగః

చిట్టచివరిది యాగం. 'యజ దేవపూజాయాం' అనే ధాతువునుండి పుట్టింది. శ్రీవైష్ణవసిద్ధాంతం ప్రకారం భగవదారాధనపద్ధతినుపదే శిస్తారు.

ఈ ఐదు సంస్కారములు చాలా ముఖ్యమైనవని శ్రీవైష్ణవ సిద్ధాంతం.

తప్తచక్రాంకనాన్ని పరిహసించే ఇతరమతస్థులకు తెలివిగా అన్నమయ్య ఆచక్రాంకనం వేదప్రసిద్ధమని ఈసంకీర్తనలో తెలియ పరచినారు.

అదె శిరశ్చక్రములేనట్టిదేవర లేదు
యిదె హరిముద్రాంకిత మిందే తెలియరో ||పల్లవి||

"అనాయుధాసో అసురా అదేవాః" యని
వినోదముగ ఋగ్వేదము దెలిపెడి
సనాతనము విష్ణుచక్రధారణకును
అనాదిప్రమాణమందే తెలియరో ||అదె||

'యచ్చ యింద్రే' యని 'యచ్చ సూర్యే' యని
అచ్చుగ తుద కెక్కె నదే పొగడీ శ్రుతి
ముచ్చట గోవిందునిముద్రాధారణకు
అచ్చమయినప్రమాణమందే తెలియరో ||అదె||

మును "నేమినా తప్తముద్రాం ధారయే" త్తని
వెనువెంట శ్రుతి యదె వెల్లవిరి సేసీని
మొనసి శ్రీవేంకటేశుముద్రాధారణకు
అనువుగ బ్రమాణమందే తెలియరో. ||అదె||

(2- 485)

పైసంకీర్తనలో అన్నమాచార్యులు వేదప్రమాణసిద్ధమైనవిగా తెలిసికొనే పంచసంస్కారాల తో శ్రీవైష్ణవ మతదీక్షను పుచ్చుకొన్నాడని తెలుస్తున్నది.

కాబట్టి ఆ మతదీక్షపట్ల గాఢశ్రద్ధ గలిగి, ఆ సంప్రదాయానుసారంగానే స్వామినారాధించి,స్వామి వారిలోనే లీనమయ్యారని తెలుస్తుంది.

## వేదమంత్రాలలోని రహస్యాలు

అన్నమాచార్యులు వేదమంత్రాలలోని రహస్యార్థాలను గ్రహించిన మహాజ్ఞాని. ఇట్టి మహత్తర సిద్ధిసంపన్నుడైన అన్నమయ్య వేదసారాన్ని గ్రహించి అక్కడక్కడ వేదమంత్రార్థాలను వివరించాడు.

ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్।
సమూళ్హమస్య పాంసురే॥ (ఋ.సం. 1-22-17)

త్రివిక్రమరూపుడైన శ్రీమహావిష్ణువు ఈప్రపంచమంతా తన పాదాలతో మూడు విధాలుగా ఆక్రమించాడు. ధూళిధూసరితమైన విష్ణుపాదాలందు భూమి, ఆకాశము, స్వర్గం అనే మూడు చేరి వున్నాయని శ్రుత్యర్థం.

విష్ణువాజ్ఞయని చెప్పే విధిసంకల్ప మేడది
విష్ణుమాయయని చెప్పే విశ్వమంతా నెవ్వనిది
"విష్ణుమయం సర్వ"మనే వేదవాక్య మెవ్వనిది
విష్ణువు శ్రీవేంకటాద్రివిభుడే ఆదేవుడు. (2-404).

అన్నమాచార్యులు పై శ్రుత్యర్థమును ఆధారముగా చేసుకొని శ్రీమహా విష్ణువుయొక్క సర్వాన్తర్యామిత్వాన్ని సూచించాడు.

## నమకచమకహితనారసింహా

కృష్ణయజుర్వేదసంహితలోని చతుర్థకాండ ఐదవప్రశ్నకు 'నమక' మని పేరు. 'నమః' శబ్దం ప్రతి పదంతో ఆవృత్తిఅవడం వల్ల ఈభాగానికి ఈపేరు వచ్చింది. చతుర్థకాండ ఏడవప్రశ్నంలో మొదటి పదకొండు అనువాకములకు 'చమకము' అని పేరు. 'చమే' శబ్దాలు ప్రతిపదంతో ఉచ్చరింపబడటంవల్ల ఈభాగానికి చమకం అని పేరు. నమక చమకాలు రెంటికీ కలిపి రుద్రమని పేరు.

నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవే నమః ।
నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముత తే నమః ॥

ఓ రుద్రుడా! నీ కోపానికి నమస్కారం. ఆకోపాన్ని శత్రువుల పై ప్రసరింప చేయుము. మామీద ఆకోపాన్ని వదలిపెట్టుము. మీ బాణానికి నమస్కారం. నీ ధనుస్సుకు నమస్కారం. ధనుర్బాణాలతో కూడిన చేతులకు నమస్కారం.

'నమో వృక్షేభ్యో హరికేశేభ్యః'

ఆకుపచ్చని కేశాలుగల వృక్షాలకు నమస్కారం. అనగా వృక్షాల రూపంలోనున్న పరమేశ్వరునికి నమస్కారం.

పచ్చని ఆకులతోనున్న కొమ్మలన్నింటినీ జటాజూటంవలె, వృక్షాన్ని పరమశివుని వలె దర్శించిన భక్తిభావన ఈ మంత్రంలో గ్రహించవచ్చు. వేదవాఙ్మయం ఆధారంగానే - 'కేశములు' అంటే 'కిరణములు' అని అర్థం తీసుకొని దిక్కులలో వ్యాపించిన కిరణాలతో ఒక కాంతివృక్షంగా విస్తరించిన సూర్యభగవానుని ఈమంత్రంలో దర్శించవచ్చు.

సూర్యునే శివునిగా, శివునే సూర్యునిగా ఉపాసించడం మన సంప్రదాయం. ఈ విభిన్నార్థాలన్నిటికీ నమస్కరించి - వృక్షాలనే దైవంగా భావించే గొప్పదనాన్ని మాత్రమే స్వీకరించి ఈ మంత్రాన్ని పరిశీలిస్తాం.

పచ్చనిచెట్లు భగవంతుని రూపాలని భావించడం మన అనాది సంప్రదాయం. అనవసరంగా చెట్లను నరకడం మహాపాపం. తప్పనిసరై ఒక చెట్టును నరికితే - దానికి బదులుగా మరికొన్ని చెట్లు సముచిత స్థలంలో నాటాలని, నరికినపాపం పోవడానికి ప్రత్యేకయాగం చేయాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. బిల్వం, మేడి, తులసి, ఉసిరిగ మొదలైనవి దేవతావృక్షాలు. వీటి పరిసరాల్లో సంచరిస్తే దైవశక్తి, ప్రాణశక్తి మనకు లభిస్తుంది. భౌతిక - ఆధ్యాత్మిక సాధనలను ఫలవంతం చేసుకోవచ్చు. మహర్షులు వృక్షాల నీడల్లోనే జపతపాలు, అధ్యయనాలు, యాగాలు చేసేవారు. ప్రకృతిసిద్ధమైన

పచ్చదనాన్ని చూస్తే మెదడుకి చురుకుదనం, జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెరుగుతాయని ఆధునిక విజ్ఞానం.

ప్రకృతిలోని వృక్షసంపదను దైవంగా ఆరాధించే విధానంలో తులసి, వేప, వటవృక్షం, అశ్వత్థవృక్షం మొదలగు చెట్లను దేవతలుగా పూజించడం కనబడుతుంది. కొన్ని చెట్లు కొన్నిదేవతలకు ప్రత్యేక నివాసాలు. బిల్వం శివునికి, కదంబం జగన్మాతకు, తులసి నారాయణు నికి, మేడి దత్తాత్రేయునికి, రావి విష్ణువుకు ప్రత్యేకనివాసాలు. 'రామవృక్షం' అంటూ రామశక్తిని వృక్షస్వరూపంగా వాల్మీకి అభి వర్ణించారు. 'ధర్మమయ మహాతరువు' గా ధర్మరాజును, 'రోషమయ విషవృక్షం'గా దుర్యోధనుని వ్యాసమహర్షి కీర్తించినారు.

'వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేకః' అని భగవంతుని వేదం వృక్షంగా వర్ణించింది. ఈవిధంగా ఈనాడు మనం చెప్పుకునే 'పచ్చదనం- పరిశుభ్రత' నమకంలో వర్ణించబడింది.

'నమశ్శంకరాయ చ మయస్కరాయ చ' అనే మంత్రంలో 'మయ' స్థితిని కలిగించేది ఈశ్వరానుగ్రహమేనని విశదమౌతుంది. ఈమయత్వమే కైవల్యం. అదే సత్యం. అదే మోక్షం.

'యో రుద్రో విశ్వా భువనా వివేశ తస్మై రుద్రాయ నమో అస్తు' ఏ రుద్రుడు సమస్తభువనాలందు అంతటా ప్రవేశించి ఉన్నాడో ఆరుద్రునకు నమస్కారం.

పరమేశ్వరుడైన ఆరుద్రుడే అన్నిభువనాలలో, ప్రత్యణువునా వ్యాపించి ఉన్నాడు. ఈమంత్రం అగ్ని, జలం, ఓషధులలో వ్యాపించిన పరమేశ్వరుని స్తుతించింది. ఈ తత్త్వమే యజుర్వేదంలో నమకచమక మంత్రాలలో (రుద్రం) విస్తారంగా కనిపిస్తుంది.

ఈశ్వరచైతన్యం ప్రపంచమంతా వ్యాపించి ఉంది. 'వ్యాపించిన ఈశ్వరుని' విష్ణువు అంటారు. కనుక ఈశ్వరుడే విష్ణువు. ఈ భావమే "ఓం

నమో భగవతే రుద్రాయ విష్ణవే" అని శ్రుతి మరొక చోట చెప్పింది. దీనినే 'శివాయ విష్ణురూపాయ' అన్నారు. ఆయన ప్రపంచంలో ఘోర- అఘోర రూపాలతో వ్యాపించివున్నారు. ఈఘోర- అఘోరస్వరూపుడైన శివుడే 'రుద్ర' నామంతో వ్యవహరింపబడుతున్నాడు.

'రుద్ర' శబ్దానికి ఘోరపరమైన అర్థం 'దుఃఖకారకుడు'

అఘోరపరమైన అర్థం 'శాంతస్వరూపుడు'. ఆ రుద్రుడు సుఖ దుఃఖాలకు అతీతమైన పరమాత్మ (శివుడు).

'శివుడు రుద్రుడై విష్ణువైనారు' అనేది చక్కని సమన్వయం. కనుక ఘోర- అఘోర రూపాలతో ప్రపంచాన్ని శాసిస్తున్న ఈశ్వరుడై (రుద్రుడై) విశ్వమంతా వ్యాపించి (విష్ణువై) నిర్వహిస్తున్నాడు.

పై రుద్రమంత్రంలో 'వివేశ' శబ్దం - 'ప్రవేశించుట' అనే అర్థంలో ప్రయోగింప బడింది. వేదమతం ప్రకారం 'శివ- రుద్ర- విష్ణు' శబ్దాలు ఒకే పరమేశ్వరునికి చెందినవి.

అన్నమాచార్యులు పుట్టుకతో పైవిషయములన్నీ తెలిసినందున నరసింహావతార వర్ణనలో ఈవిధంగా కీర్తించినారు.

నగధర నందగోప నరసింహా వో
నగజ వరద శ్రీనారసింహా ॥పల్లవి॥

నమో నమో పుండరీక నారసింహా వో
నమితసురాసురనారసింహా
నమకచమకహిత నారసింహా వో
నముచి సూదనవంద్య నారసింహా (1-259).

స్మార్తసంప్రదాయంలో పంచాయతన పూజలోను, విశేష పూజలలోను నమక చమకాలతో భగవంతుని అభిషేకించడం కద్దు. నృసింహజయంతి సందర్భంలో కూడ నరసింహస్వామిని పై మంత్రాలతో అభిషేకించి, పూజిస్తారు. మంత్ర శాస్త్రంలోను, అద్వైతసంప్రదాయంలో నరసింహస్వామి హరిహరావతారం.

ఆకంఠం విష్ణురూపాయ అత ఊర్ధ్వం శివరూపిణే అని వాక్యం. అన్నమాచార్యులు నందవరీకవంశానికి చెందిన స్మార్త బ్రాహ్మణుడు. పుట్టుకతో అద్వైతి. అది తనపుట్టుకతో గట్టివైష్ణవంగా మారింది. కాని, కొన్ని చోట్ల వంశక్రమంగా వచ్చిన అద్వైతవాసన వీరిని వదల లేదని తెలుస్తుంది.

విశిష్టాద్వైతంలో మాయాశబ్దం అజ్ఞానపర్యాయంగా పేర్కొనరు. అన్నమాచార్యులు మాయా శబ్దాన్ని అజ్ఞానపర్యాయంగా అనేకచోట్ల ప్రయోగించాడు. అదే విధంగా కైవల్యానుభవం కేవల నికృష్టమైన ఆత్మానుభవంగా చెప్పబడింది. శ్రీవైష్ణవంలో కైవల్యం మోక్షంగా స్వీకరించబడదు. ఆ విషయాన్ని అన్నమాచార్యులు విశేషంగా చెప్పడం వల్ల జన్మతో వచ్చిన అద్వైతవాసన వీరిని విడిచి పెట్టలేదని తెలుస్తున్నది. అందువలన 'నమకచమకహిత నారసింహా' అని అన్నమాచార్యులు స్తోత్రం చేశారు.

## జీవాత్మపరమాత్మల స్వరూపం

ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।
తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥
(ఋ 1-164- 20)

పదకవితాపితామహుడైన అన్నమాచార్యులు వేదమంత్రాలను సంకీర్తనలుగా రచించిన రూపశిల్పి. వారు వేదమంత్రాలను కొన్నిచోట్ల యథాతథంగా స్వీకరించారు.

నిండిన యీ జీవులు నీవే యన వెలితును
దండనే బద్ధులు వీరు 'ద్వాసుపర్ణ' వున్నది గాన
మెండగు యీ జీవులను మీరు గారన వెలితును
వుండెడి వీరలు నిత్యులు ———————— (2-121)

ఈసంకీర్తనలో జీవునకు పరమాత్మకు గల సంబంధాన్ని అన్నమయ్య సూచించినారు.

ఈమంత్రాన్ని వేరొకచోట ఈ కింది విధంగా విశ్లేషించారు.

'అందమైన రెక్కలు గల పక్షులవంటి ఇద్దరు చేతనులు' అని మంత్రార్థం. ఆ పక్షులలో ఒకటి జీవాత్మ. మరొకటి పరమాత్మ. జీవాత్మ కర్మఫలాన్ని అనుభవిస్తాడు. పరమాత్మ ఆ సుఖదుఃఖరూపమైన ఫలాల్ని అనుభవింపక దేదీప్యమానంగా ప్రకాశిస్తాడు. ఇది జీవునికి దేవునికి గల సంబంధాన్ని సూచిస్తున్నది. జీవుని కర్మకు దేవుడు కర్త గాడు. కనుక అన్నిటికి ప్రేరకుడైన ఈశ్వరుని తెలిసి జీవించడమే జ్ఞానమని అన్నమాచార్యుల భావన.

చేతులార జేసేటి చేకొన్న కర్మానకు
ఘాతల గర్తగానంటే కట్టువడడు. (2-288)

ఇంతే కాక మరోకచోట ఈమంత్రార్థాన్ని మరొక విధంగా ప్రస్తుతించాడు.

నాలికకు జవియైతే నమలుటే సహజము
నాలి అభోజ్యపునింద నాకుబనేమి
మూలవాసనగొనేది ముక్కుకు సహజము
జోలిబంధములు నన్ను జుట్టగజోటేది. (2-398)

జీవుడు శరీరధారి. పరమాత్మ సాక్షి. అనగా జీవుడు చేసే పనులకు పరమాత్మ సాక్షి అని భావం. పై కీర్తనలో చెట్టుపైనున్న జీవాత్మ పరమాత్మలను పక్షులలో ఒక పక్షి (జీవాత్మ) తినకూడని పండ్లను తినుట. మరొక పక్షి (జ్ఞాని యగుటచే) ఆ పండ్లను తిన కుండా శోభించేవిషయం ఇక్కడ సూచింపబడింది. సుఖదుఃఖాదులనే ఫలాన్ని జీవుడు అనుభవించును. పరమాత్మ ఆ ఫలాన్ని స్వీకరించక నిర్వికారుడై వుండును. అన్నమాచార్యుల వేదవిజ్ఞానానికి ఈఘట్టం ఒక ఉదాహరణం.

## అక్షరశబ్దవిశ్లేషణ

'అక్షర' శబ్దం పరమాత్మబోధకం. అక్షరమనగా నాశరహితమని అర్థం.

తద్విష్ణోః పరమం పదమ్। ఋచో అక్షరే పరమే వ్యోమన్।
యస్మిన్ దేవా అధి విశ్వే నిషేదుః। (ఋ.సం.1-164-39)

ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి (బృ. ఉ. 3.9)
యేనాక్షరం వేద సత్యమ్ (ము.1-2-13)
అక్షరమంబరాంతధృతేః (బ్ర.సూ.1.3.9).

పై మంత్రాలలో అక్షర శబ్దం బ్రహ్మవాచకం. ఆ పరమాత్మలోనే దేవతలందరూ ఉన్నారు. "ఋచః అక్షరే" అనగా 'ఋక్కులో చెప్ప బడిన బ్రహ్మమందు' అని అర్థం. తైత్తిరీయారణ్యకం ఈమంత్రాన్ని ప్రణవ పరంగా వివరించింది. అన్నమాచార్యులు అకారాది క్షకారాంత వర్ణ స్వరూపుడైన పరమాత్మయొక్క వైశిష్ట్యాన్ని

అరయ నక్షరవాచి యతఁడట యిలలోనఁ
బరమమంత్రాలెపో పలుకులెల్ల
నిరతపునుతి యేది నిందయేది యిందులోన
వెరవెరఁగవుగాక వివేకమా (4-341)

అని స్తుతించాడు.

పై విధంగా అన్నమాచార్యులు వేదోపనిషత్తులలోని అక్షర శబ్ద స్వరూపాన్ని సామాన్య మానవాళికి అందించిన పుణ్యమూర్తి.

## బ్రహ్మసార్వాత్మ్యం

సర్వం ఖల్విదం బ్రహ్మ (ఛా. ఉ. 3.14.1)
ఏకమేవాద్వితీయమ్ (ఛా.ఉ . 6.2.1)

ఈ ప్రపంచమంతా బ్రహ్మస్వరూపం. ఉపనిషత్తులన్నీ బ్రహ్మం ఒకటే అని చెప్తున్నాయి. ఆ బ్రహ్మకు నామరూపాలు లేవు. ఆ బ్రహ్మం అద్వితీయం. ఏకైకం. ఈ విషయాన్ని అన్నమాచార్యులు -

తందనాన ఆహి- తందనాన పురే
తందనాన భళా - తందనాన

బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే పర
బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే (2-385).

అనే సంకీర్తనలో బ్రహ్మం ప్రపంచమంతా వ్యాపించి వుందని ఉపపత్తి పూర్వకంగా నిరూపించాడు.

## ఉపసంహారం

అన్నమాచార్యుల వారు ప్రప్రథమంగా వేదవాఙ్మయంలోని విజ్ఞానాన్ని సంకీర్తనల ద్వారా లోకానికి అందించిన మహనీయుడు. వారు ప్రతివిషయాన్ని వేద ప్రామాణ్యంగా ప్రతిపాదించారు. ఈవిషయాలనే 'నిగమ నిగమాంత వేద్యా' 'బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే' మొదలయిన సంకీర్తనలలో స్పష్టంగా తెలిపాడు. సముద్రంవంటి ఈవాఙ్మయంలో అన్నమయ్య సంకీర్తనలలో ప్రతిఫలించిన వేదమంత్రాలు అనే వ్యాస విషయం స్థాలీపులాక న్యాయంగా వివరించడం జరిగింది.

★ ★ ★

టి.యస్.ఆర్. నారాయణన్

## అన్నమాచార్యులు - ఉపనిషత్తత్త్వాలు

### ఉపోద్ఘాతం

వేదంనుండే అన్ని శాస్త్రాలు జనిస్తాయి. అన్నిటికి మూలం వేదమే. వ్యాస మహర్షి "వేదాత్ శాస్త్రం పరం నాస్తి" అని చెప్పినారు. "పరం" శబ్దానికి వేదంకంటే శాస్త్రం మరొకటి లేదు అని అర్థం. వేదంకంటే గొప్పది ఏదీలేదని మరొక అర్థం. ధర్మానికి "వేదోఽఖిలో ధర్మ మూలమ్" అని గౌతముడు వేదమూలకత్వాన్ని చాటిచెప్పినాడు. ఇక్కడ ధర్మ శబ్దం నిశ్శ్రేయసఫలప్రాప్తి సాధనం. ఈ విషయాన్నే అన్ని శాస్త్రాలు ప్రతిపాదిస్తున్నాయి. శ్రేయస్సును గూర్చి చెప్పే టప్పుడు మహర్షులు ఆచార్యులు వారి బుద్ధిసూక్ష్మంతో పరిశీలించి ఆ శ్రేయః పదార్థనిర్ణయంలో విప్రతిపత్తిని పొందినారు. దానికి కారణం వారి గ్రాహకశక్తి అని సామాన్యంగా చెప్పవచ్చును. "ఏకయాపి కలయా విశుద్ధయా" అను న్యాయాన్ననుసరించి ఏది ప్రధానాంశంగా తీసుకుంటారో దానిపై మాత్రమే వారి మనస్సు కేంద్రీకృతమై మిగిలిన వాటిని ప్రమాణాలతోను, యుక్తితోను ఎదుర్కొని వారి సిద్ధాంతాన్ని స్థాపించినారు.

ఇటువంటి శాస్త్రాలలో సాంఖ్యదర్శనం, న్యాయదర్శనం, మీమాంసాదర్శనం, వేదాంతదర్శనం ప్రధానంగా చెప్పబడినవి. మిగిలిన శాస్త్రాలన్నీ పై దర్శనాలలోనే అంతర్లీనమవుతాయి.

సాంఖ్యదర్శనంలో ప్రకృతివర్ణన, గుణత్రయవర్ణన ప్రధానాలు. లోకంలోని సూక్ష్మ ప్రవృత్తి అంతా ప్రకృతివల్లనే జనిస్తుంది. అందువలన 'ప్రకృతి'ని మాత్రమే ప్రధానంగా సాంఖ్యులు చెప్పు చున్నారు.

లోకంలోని పదార్థాలు, వాటి స్వరూపస్వభావాలు వాటి ప్రవృత్తి నివృత్తి, విశేషాలు స్థూల సూక్ష్మవిశేషాలతో వివేచన చేసినవారు న్యాయదర్శనవేత్తలు.

వేదచోదితమైన దానం, హోమం, యాగం వీటి విషయమై ఏది దేనికి అంగం, అనుష్ఠానక్రమ విశేషాలు, ద్రవ్యస్వరూపం, దేవతాస్వరూపం, యజమానస్వరూపం, ఋత్విగ్వివరాలు మొదలగు అన్ని విషయాలను విశ్లేషించి వాటి సాధకబాధకాలను నిశ్చయించి చెప్పునది మీమాంసాదర్శనం.

సాంఖ్యదర్శనం, న్యాయదర్శనం, మీమాంసాదర్శనాలలో ఒక్కొక్క విషయాన్ని తీసుకొని దానిని విశదీకరించినారు. ఈ శాస్త్రాలన్నిటికి ఉపజీవ్యమైంది వేదాంతశాస్త్రం. కారణమేమనగా అన్నిటికీ ఆశ్రయభూతమైన బ్రహ్మను గూర్చిన చర్చ వేదాంత శాస్త్రంలో చెప్పడంవల్ల ఈ శాస్త్రం సర్వోపజీవ్యం. ఈ శాస్త్రంలోనే లోకంలోని పదార్థాల సృష్టి, స్థితి, లయాల, స్వరూపాలు చెప్ప బడినాయి. నైయాయికులు, సాంఖ్యులు కూడ ఆయా సందర్భాలలో వేదాంతవాక్యాలను ఉదాహరిస్తారు. మీమాంసకులు కర్మకాండంలో దేవతల నుద్దేశించి చెప్పబడిన కర్మలు ఆరాధనంగా ఉన్నాయి. ఆరాధనంవలన ఆరాధ్యమేది అనే ప్రశ్న జనించును? వేదాంతం పరబ్రహ్మమును ఆరాధ్యంగా ప్రతిపాదించినది. భగవద్గీతలో కృష్ణపరమాత్మ "అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ" (భ.గీ. 9.24) అని ఉపదేశించారు. కర్మలన్నీ పరబ్రహ్మాన్ని ఆశ్రయించడంవల్లను అదే విధంగా పదార్థాలన్నీ పరబ్రహ్మంలో లీనమైనందువల్లను వేదాంతశాస్త్రం గొప్పవైశిష్ట్యాన్ని పొందింది.

ఇటువంటి శాస్త్రాన్ని చాలా సులభంగా తెలుసుకోవడానికి సాధ్యం కాదు. దానికై ఇతిహాస, పురాణాలు ఆవిర్భవించాయి. ఉపాఖ్యానాల ద్వారా జీవుడు, పరమాత్మ మొదలగు వేదాంత విషయాలను పురాణాలు బోధించాయి. జ్ఞానం లేకుండా ఈ విషయాలు తెలుసుకొనలేం. బుద్ధిమంతులైన మేధావులు స్తోత్రాలద్వారా, సంకీర్తనలద్వారా తత్త్వసిద్ధాంతాలను సామాన్యులకు కూడ లోకంలో చాటిచెప్పడానికే అవతరించినారు. స్తోత్రాలు,

సంకీర్తనలు ఈ రెంటిలో సంకీర్తనలకు వైశిష్ట్యం ఎక్కువ. కారణం, "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణీ" (సంగీతలక్షణ సంగ్రహః పు.56) అని చెప్పినట్లు ఆబాల గోపాలానికి సంగీతంలో అభిరుచి మెండు. స్వరంలో మనం చెప్పే టప్పుడే గొప్ప మాధుర్యాన్ని అనుభవించే టప్పుడు సంకీర్తనలో ఆ మాధుర్యం అనుభవైకవేద్యం. అందుకే ఒక కవి ఈ విధంగా చెప్పినాడు.

సంగీతమథ సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయమ్।
ఏకమాపాతమధురమ్ అన్యదాలోచనామృతమ్॥

(సుభాషితరత్నభాండాగారమ్ పు. 29. శ్లో.8)

సామాన్యంగా శాస్త్రాన్ని చదివేటప్పుడు పాఠకునికి మాత్రమే ఆ శాస్త్రంలో రసానుభూతి కలుగుతుంది. సంగీత విషయంలో పాడేవానికి, శ్రోతకు రసానుభూతిలో భేదంలేదు. ఇంద్రియభేదం మాత్రమే ఉంటుంది. ఇది ఒక సంగీతశాస్త్రంలో మాత్రమే మనం చూడ గలిగిన ఒక అద్భుతవిశేషం.

ఈ విధంగా తాను అనుభవించి, ఇతరులను అనుభవింపజేసి భక్తిసాగరంలో అన్ని రసాలను చూచి ఆనందపరవశులైన భక్తకోటిలో సంకీర్తనాచార్యులుగా కీర్తింపబడిన ధన్యజీవి తాళ్లపాక శ్రీఅన్నమా చార్యులు.

శ్రీభగవద్రామానుజాచార్యులవారి విశిష్టాద్వైతాన్ని ఆశ్రయించిన అన్నమాచార్యులు బ్రహ్మసూత్ర భాష్యంలోని తత్త్వాలను వారి సంకీర్తనలలో స్తుతిరూపంగా చెప్పినారు. ఉదా: 1.సగుణ నిర్గుణ వాదం 2. పరదేవత ఎవరు? 3. బ్రహ్మస్వరూపమ్, 4. అంతర్యా మిత్వమ్, 5. జీవనిత్యత్వమ్, 6. జీవనానాత్వమ్, 7. దేహ అనిత్యత్వమ్, 8. పుణ్యాపాప సంబంధమ్, 9. జీవపరమాత్మ సంబంధమ్, 10. మోక్షోపాయమ్, మోక్షము. ఈవిధంగా అనేక విషయాలనుద్దేశించి సంకీర్తనలు రచించారు.

## 1. సగుణనిర్గుణవాదం

అన్నమాచార్యుల సంకీర్తనలలో ప్రధానాంశం స్తోత్రం. స్తోత్ర మనగా గుణినిష్టగుణాభిధానమ్. గుణాలు లేకుండ స్తోత్రం చేయడం అసాధ్యం.

శంకరభగవత్పాదులు వ్యావహారిక దశలో గుణి నిష్ఠ గుణాభిధానరూపమైన అనేకస్తోత్రాలు రచించినారు. శ్రీశంకరుల వారి వ్యావహారికదశ; శ్రీరామానుజులవారి సిద్ధాంతంలో పారమార్థిక దశ.

ఉపనిషత్తులలో నిర్గుణశ్రుతులు, సగుణశ్రుతులు అని రెండు కలవు. రెండు శ్రుతులకు పరస్పరవిరోధంలేకుండా ప్రమాణం చెప్పాలి. అదేవిధంగా భేదాభేదశ్రుతికూడ. నిర్గుణ శ్రుతివలన బ్రహ్మకు దోషరాహిత్యం, సగుణశ్రుతి వలన కల్యాణగుణాకరత్వం చెప్పబడినది. దీనినే బ్రహ్మ సూత్రవేత్త - "పరస్య ఉభయలింగం సర్వత్ర హి" అని చెప్పినారు.

ఉపనిషత్తులలో బ్రహ్మవిద్య అనేక స్థలములందు చెప్పబడింది. బ్రహ్మగుణానుసంధానమే దాని వైభవం.

వ్యాసుడు రచించిన వేదాంతశాస్త్రంలో నిర్గుణబ్రహ్మోపాసనం, దాని ఫలంగాని చెప్పబడలేదు. వేదాంతదేశికులు ఈ విషయాన్ని అధికరణ సారావళిలో ప్రస్తావించినారు.

శాస్త్రేఽస్మిన్న్యాసమాప్తేః క్వ ఫలమభిహితం నిర్గుణోపాస్తి సాధ్యం
నోచ్ఛాస్త్రం చ ప్రకల్ప్యం గుణనియమనతః ఖ్యాతిమాంశ్చైష పాదః।
(అ.సా. అ.3.పా.3.శ్లో.50)

దీనినే అన్నమాచార్యులు

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకలమునీంద్రులు పూజించే యీ సాకారమే ప్రమాణము ॥పల్లవి॥
సగుణంబుని నిను గొందరు సరి నిర్గుణమని కొందరు
అగు 'నిర్గుణాయ గుణాత్మనే' యని ఆనతి ఇచ్చుటే ప్రమాణము.
(2-412)

తే శరణమహం తే శరణమహం శైశవ కృష్ణ తే శరణం గతోఽస్మి
దశవిధావతార ధర్మరక్షకమూర్తి దశమస్తకాసురదళన
దశదిశాపరిపూర్ణ తపనీయస్వరూప దశావరణలోక తత్త్వాతీత!

సహస్రలోచన సన్తతవినుత సహస్రముఖశేషశయనా
సహస్రకోటిసమ్పూర్ణతేజా సహస్రారదివ్యచక్రాయుధ।
అనన్తచరణ సర్వాధారాధేయ అనన్తకరదివ్యాయుధ
అనంత నిజ కల్యాణగుణార్ణవ అనన్తశ్రీవేంకటాద్రినివాస!
(అ.సం. 7.167).

నమో నారాయణాయ! నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ
పారాయణాయ

శోభనమూర్తయే నమో నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యా దిత్యాయ
మునిగణ ప్రత్యయా

సత్యాయ ప్రత్యక్షాయ సన్మానససాంగత్యాయ జగదవన కృత్యాయ
తే నమో! (5.172)

దేవ నమో దేవ పావనగుణగణభావ।
జగదాకార చతుర్భుజ గగన నీలమేఘశ్యామ।
నిగమపాదయుగ నీరజనాభా అగణితలావణ్యానన।
ఘనవేదాంతైర్గణన ఉదార కనకశంఖచక్రకరాంక।
దినమణిశశాంకదివ్యలోచన అనుపమ రవిబింబాధర। (2-377)

మొదలగు కీర్తనలలో బ్రహ్మాన్ని సగుణంగా వర్ణించినారు.

## 2. పరదేవత ఎవరు?

పురుషసూక్తంలో 'పురుషః, పురుషః' అను పదం అనేక పర్యాయాలు చెప్పబడింది. ఆ పురుషుడు ఎవరు? అని ప్రశ్నించి నపుడు సూక్తం చివర "హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ, అహోరాత్రే పార్శ్వే" అను వాక్యంవలన పురుషునికి లక్ష్మీపతిత్వం సిద్ధించింది. 'పురుష' శబ్దం వలననే 'విష్ణువు' చెప్పబడినప్పటికి కొన్నిచోట్ల కొంతమందికి సందేహం జనించును. లక్ష్మీపతిత్వంసిద్ధించినందున ఆ సందేహానికి తావులేదు. లక్ష్మీపతిత్వ సిద్ధాంతాన్ని మనస్సులో ఉంచుకొని

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు
కమలాసతీముఖకమల కమలహిత కమలప్రియ కమలేక్షణా 'కమలేక్షణా' (1-155)

అనుపదప్రయోగంలోని స్వారస్యం. 'పుండరీకాక్ష' శబ్దానికి శబ్దరత్నాకర కోశంలో 'విష్ణువని' పేరుంది. ఛాందోగ్యోపనిషత్తులో "అథ య ఏషో అన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే తస్య యథా కప్యాసం పుండరీకం ఏవం అక్షిణీ" అని చెప్పబడింది. విష్ణువుకు ఈ శ్రుతి వలన పుండరీకాక్షత్వం, సుప్రసిద్ధం. ఆ పుండరీకాక్షునకు హిరణ్మయరూపమైన ఉజ్జ్వలితాకారంకూడ అక్కడే చెప్పబడివుంది. మేఘ శ్యామలవర్ణంతో కూడిన పుండరీకాక్షునకు ఉజ్జ్వలితాకారం ఎలా సిద్ధిస్తుంది?

నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా (తై.ఉ).

హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజామ్ (శ్రీసూక్తం.1)

అను ఉపనిషద్వాక్యంవల్ల లక్ష్మీసాన్నిధ్యంవల్ల పుండరీకాక్షునకు ఉజ్జ్వలితాకారం సుసాధ్యం. "అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా" (వా.రా) అని ఈ విషయం రామాయణంలో కూడ చెప్పబడింది.

శ్రీభాష్యమంగళశ్లోకమందుకూడ 'బ్రహ్మణి శ్రీనివాసే' అని లక్ష్మీసాన్నిధ్యం చెప్పబడింది. అధికరణసారావళిలో "శ్రీమతి బ్రహ్మతోక్తేః" అని శ్రీవేదాంతదేశికులు కీర్తించారు.

అందువల్ల 'శ్రియః పతిత్వమ్' 'పుండరీకాక్షత్వమ్' అను పద ప్రయోగం బట్టి శ్రీమన్నారాయణుడే పరదేవత అని 'శ్రీమన్నారాయణ కమలేక్షణా' అను కీర్తనద్వారా సుసాధ్యం.

'ఇతడొకడే సర్వేశ్వరుడు
సితకమలాక్షుడు శ్రీవేంకటేశుడు'

'గరుడాచలాధీశ ఘనవక్షముననుండి
పరమానంద సంభరితవై

అని పలుచోట్ల పరదేవతా నిర్ణయం సువిదితం.

## 3. బ్రహ్మస్వరూపం

"మానాధీనా మేయసిద్ధిః, మేయసిద్ధిశ్చ లక్షణాత్" అని చెప్పిన విధంగా బ్రహ్మ స్వరూపమేమి? ఆ స్వరూపం లక్షణం వల్ల తెలుస్తుంది. వ్యాసులవారు 'జన్మాద్యస్య యతః' (బ్ర.సూ.1.1.2) అని బ్రహ్మసూత్రాన్ని సూత్రీకరించాడు. ఈ ప్రపంచానికి సృష్టి, స్థితి, లయాలు ఎక్కడనుండి వుందో అదే 'బ్రహ్మ' అని సూత్రార్థం.

ఈ లక్షణాన్ని వ్యాసులవారు తాను స్వయంగా చెప్పలేదు. "యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభి సంవిశన్తి, తద్విజిజ్ఞాసస్వ తత్ బ్రహ్మేతి" అని తైత్తిరీయ భృగువల్లిలో చెప్పబడింది. ఛాందోగ్యపనిషత్తులో "సదేవ సోమ్యే దమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్" అని ప్రతిపాదించబడింది. ఈ విధంగా శ్రుతి వాక్యాలలో అనేకస్థలాలందు 'బ్రహ్మ'కు జగత్కారణత్వం చెప్పబడింది. ఇతరత్ర జగత్కారణత్వం అంగీకరించబడదు.

శ్రీభాష్యం మొట్టమొదటి మంగళశ్లోకంలో 'అఖిలభువన జన్మ స్థేమ భంగాదిలీలే' (శ్రీభా.1) అని చెప్పబడింది.

వేదాంతదేశికులు వరదరాజపంచాశత్ స్తోత్రంలో

సామాన్యబుద్ధిజనకాశ్చ సదాదిశబ్దాః తత్త్వాన్తరభ్రమకృతశ్చ శివాదివాచః।

నారాయణే త్వయి కరీశ వహంత్యనన్యంఅన్వర్థవృత్తిపరికల్పిత మైకకణ్ఠ్యమ్॥ (వ.ప. శ్లో.15.) విషయాన్ని రచించినారు.

మట్టినుండి కుండ జనించినట్లు 'బ్రహ్మ' నుండి స్థూలాకారమైన సమస్తప్రపంచం సృష్టింపబడింది. విశిష్టాద్వైత సిద్ధాంతంలో 'బ్రహ్మ' అంతట

'అంతర్యామి' రూపంలో ప్రకాశిస్తున్నది. అందువల్ల అంతా 'బ్రహ్మ' శబ్దవాచ్యమే. కావున అంతా సత్యమే. ఈ విధంగా చెప్పడం వల్ల అన్ని వస్తువులకు పరస్పరవైలక్షణ్యం సిద్ధిస్తున్నది.

అన్నమాచార్యులవారు వారి సంకీర్తనలో 'బ్రహ్మ'కు జగత్కారణ త్వాన్ని స్థాపించినారు. 'జయమంగళం నీకు సర్వేశ్వరా' అనే సంకీర్తనలో 'అరుదయిన సృష్టికి నాది మూలమా వో హరి నమో పరమపుటాలవాలమా' (2–431)

'నేమే బ్రహ్మమను కోనేరము నేము
కామించిన స్వతంత్రము గడులేదుగాన' (2–30) అనే సంకీర్తనలలో భగవంతునికి మాత్రమే జగత్కారణత్వం సుస్పష్టం.

'నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు' అనే సంకీర్తనలో బ్రహ్మకు సత్యత్వం నిత్యత్వం, బ్రహ్మనుండి జనించినవారికికూడ సత్యత్వం, నిత్యత్వం, సర్వసృష్టికారణత్వం ప్రపంచితం.

సృష్టిచేయడానికి కావలసిన గుణాలు బ్రహ్మకు కలవా? 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అని తైత్తిరీయోపనిషత్తు చెబుతుంది. అక్కడ సత్యత్వం, జ్ఞానత్వం, అనంతత్వం, బ్రహ్మత్వం కీర్తితం. సత్యత్వ మంటే వికారరాహిత్యం. జ్ఞానత్వమంటే ప్రకాశకత్వం. కాల- వస్తు- దేశ భేదాలవల్ల పర్యాప్తం కానిది అనంతత్వం. స్వరూపంలోను, గుణంలోను బృహద్రూపంగా భాసించేది బ్రహ్మ.

'అక్షరాత్ పరతః పరః పరాత్పరమ్' అనే వాక్యంలో భగవంతునికి పరత్వం తెలుస్తున్నది. పరత్వమనగా సర్వోత్కృష్టమైంది, సమానుడు కాని - అధికుడు కాని కానటు వంటిది. 'న తత్సమశ్చాభ్యధి కశ్చ దృశ్యతే' అని ఉపనిషద్వాక్యం.

సృష్టిచేయడంలో తనకు దోషంలేకపోవుటవల్ల, అన్ని కాలాలలో స్వప్రకాశంగా, సర్వవ్యాపిగా, సర్వోత్కృష్టంగా వుండటంవల్ల భగవంతునకు

పై చెప్పిన గుణాలు అతి ముఖ్యాలుగా పరిగణింప బడినాయి. అందువల్ల, అన్నమాచార్యులు ఈ గుణాలనుద్దేశించే తన సంకీర్తలలో అక్కడక్కడ ప్రస్తావించాడు. 'సత్యాత్ముడైయుండి'(87) 'విశ్వప్రకాశునకు వెలి యేడలోనేడ' (126) 'తస్య భాసా సర్వమిదం విభాతి' అను ఉపనిషద్వాక్య జన్యమైన 'విశ్వ ప్రకాశునకు . . .'అనే సంకీర్తనలో విశ్వప్రకాశం చెప్పడం వల్ల కైముతికన్యాయంచే స్వప్రకాశత్వం తనకు తానే సిద్ధిస్తున్నది. శ్రుతిలో చెప్పిన 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అనువాక్యంలోని 'అనంత' శబ్దానికి అన్నమయ్య 'ఆది పురుషుడు, ఆదిదేవా, ఆదిపురుషా, అచ్యుతుడు, అచలుడు, అనంతుడు' అని 'ఆదిమపూరుషుడచ్యుతుడు' అనే కీర్తనలో వర్ణించాడు. 'ఆదిదేవ పరమాత్మా' సంకీర్తనలో 'ఆది' శబ్దవాచ్యుడైన పరబ్రహ్మ సృష్టి-ప్రళయసమయాలలో వారిస్థితిని చాటినాడు. అందువల్ల సర్వకాలాలో వారి ఉనికి సిద్ధిస్తున్నది. వారి కీర్తనలలో 'పరిపూర్ణ' శబ్దం చాలాచోట్ల ప్రయోగింపబడింది. అన్నిచోట్ల పూర్ణంగా పరమాత్మ నివసించి ఉన్నాడు. కాబట్టి వారికి పరిపూర్ణత్వం సిద్ధమౌతున్నవి. 'అణురేణు పరిపూర్ణమైన రూపము' 'పరిపూర్ణ గరుడాద్రి పంచాననం' మొదలైన చోట వర్ణితం.

'బృహత్వాత్ బ్రహ్మణత్వాచ్చ తద్ బ్రహ్మేత్యభిధీయతే' అని బ్రహ్మశబ్దనిర్వచనం. శ్రీభాష్యంలో 'బృహత్వం చ స్వరూపేణ గుణైశ్చ యత్ర అనవధితాతిశయం సోఽస్య ముఖ్యోఽర్థః' అని బ్రహ్మస్వరూపం. బృహత్వంగా చెప్పడంవల్ల అనంతమని చెప్ప బడింది. గుణాలచే స్వరూపంచే బ్రహ్మ అనంతమని పూర్వమే వ్యాఖ్యానింపబడింది.

సర్వోత్కృష్టంగా చెప్పబడిన పరత్వం అనేకస్థలాలలో అన్నమా చార్యులు పరాత్పర, పరమపురుష, పరమేశ్వర, పరమ పదాలద్వారా కీర్తించాడు. 'నందనందన వేణు నాద వినోద' అనే కీర్తనలో పై విషయం సుస్పష్టం.

## 4. అంతర్యామిత్వం

పరమాత్మ సర్వాంతర్యామి అని ఉపనిషత్తులలో సుస్పష్టంగా చెప్పబడివుంది. బృహదారణ్యకోపనిషత్తులో అంతర్యామి బ్రాహ్మణమని

ప్రత్యేకంగా చెప్పబడింది. ఈ విషయమై అన్నమయ్య అన్నిటికి హరియంతర్యామి మూలమను కీర్తనలోను, తందనాన ఆహి తందనాన... అందరికి శ్రీ హరే అంతరాత్మ అనీ, అనేకచోట్ల పరమాత్మకు సర్వాంతర్యామిత్వాన్ని వర్ణించాడు. ఈ విధంగా పరమాత్మ సర్వకర్మసమారాధ్యుడు. సిద్ధోపాయుడు, సర్వోపాస్యుడు, సర్వఫలప్రదాత అని ఉపనిషత్సారాంశాన్ని అనేక స్థలాలలో అన్నమాచార్యులు కీర్తించాడు.

## 5. జీవనిత్యత్వం

జీవతత్త్వం నిరూపింపబడుచున్నది. జీవుడు పరమాత్ముడు. నిత్యుడు. వ్యాసుడు 'న ఆత్మాశ్రుతేః నిత్యత్వాచ్చ తాభ్యః' అని చెప్పాడు. ఆత్మకు ఉత్పత్తిలేదు.

ఆత్మనిత్యం అని శ్రుతివల్ల తెలుస్తుంది. 'న జాయతే మ్రియతే వా విపశ్చిత్' 'ద్వావజౌ ఈశనీశౌ' 'నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానామ్' మొదలైన శ్రుతులవలన ఆత్మనిత్యుడు అని స్పష్టంగా తెలుస్తుంది. నిత్యత్వాన్ని ప్రతిపాదించారు. జననమరణాలు శరీరానికి మాత్రమే గాని ఆత్మకు కాదు. దేహం అనిత్యం. అనిత్యమైన దేహం గురించి చర్చ అవసరం లేదు. దేహి నిత్యుడు. నిత్యత్వం విషయమై నిరంతర ఆనందాన్ని పొందడానికి, మోక్షసిద్ధికి ప్రయత్నం చేయాలి. 'వాసాంసి జీర్ణాని' అనే భగవద్గీతావిషయాన్ని అన్నమయ్య 'దేహి నిత్యుడు' అనే సంకీర్తనలో 'గుదిపాతచీరమాని కొత్తచీర కట్టినట్టు' అనుచోట ఆత్మమాత్రమే శాశ్వత మైందని నిరూపించారు.

## 6. జీవనానాత్వం

జీవుడు ఒక్కడు మాత్రమే కాడు. జీవులు అనేకులు. 'నిత్యో నిత్యానాం చేతన శ్చేతనానామ్ ఏకో బహూనామ్' 'తోయేన జీవాన్ వ్యససర్జ భూమ్యామ్' మొదలైన బహు వచనాంత శ్రుతి వాక్యాల వల్ల జీవనానాత్వం సిద్ధిస్తుంది.

'నిత్యులు ముక్తులు

'నీ దాసుల భంగముల నీవు జూతువా

'నేమే బ్రహ్మమను' కీర్తనలో
'క్షణము లోపలనె సర్వజీవావస్థలూను'

అనే స్థలాలందు అన్నమయ్య జీవనానాత్వాన్ని కీర్తించినాడు.

## జీవజ్ఞానస్వరూపం

జీవుడు జ్ఞానస్వరూపుడు. శాస్త్రాలన్నీ జీవుని అనుసరించి పుట్టినవి. అందు వల్ల జిజ్ఞాసా, జిజ్ఞాసా అని వ్యాసుడు, జైమిని మొదలైనవారు సూత్రీకరించారు. కావున జ్ఞానపిపాస గలవారిని జిజ్ఞాసువులు బుభుత్సువులు అని వ్యవహరిస్తారు. పై విషయాలు అర్థాపత్తి బోధకాలు. "యోయం విజ్ఞానమయః, విజ్ఞాతారమరే కేన విజానీయాత్ జానాత్యే వాయం పురుషః ఏష హి ద్రష్టా శ్రోతా ఘ్రాతా రసయితా మన్తా బోద్ధా కర్తా విజ్ఞానాత్మా పురుషః" ఈ విధంగా అనేక స్థలాలలో జీవునికి జ్ఞానస్వరూపత్వం, జ్ఞానగుణకత్వం శ్రుతి సిద్ధం. ఈ విషయాలను అన్నమయ్య జ్ఞాన నిరూపణకై అనేక కీర్తనలలో స్తుతించారు.

## సంసారబంధం

జీవుడు నిత్యుడు. ఆత్మస్వరూపం విషయంలో జీవునికి సుఖదుఃఖాలు లేవు. కనుక పరమాత్మవలె ఆనందస్వరూపుడై ఉండవలెను. ఏదేని సుఖమున్నా అదీ దుఃఖంగా పరిణామాన్ని పొందుతున్నది. దానికి కారణం కర్మబంధమే, సంసార సంబంధమే. ఇది సమస్త శృతి-స్మృతి సిద్ధమైన విషయం. ఛాందోగ్యోపనిషత్తులో పంచాగ్నివిద్యలందు కర్మ వల్ల అనేక రకాలైన శరీరావస్థలను పొందుతున్నాడు. దీనికోసం ఉపనిషత్తులు బ్రహ్మ విద్యను ఉపదేశిస్తున్నాయి. ప్రతి బ్రహ్మవిద్యలోను చివరగాని, మధ్యలోగాని ఫలశ్రుతి చెప్పునపుడు పుణ్యాపాపరూపకర్మనాశం చెప్పబడింది. 'సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః' 'తద్యధా ఈషికా తూలమగ్నౌ ప్రోతం ప్రదూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే' 'న కర్మ లిప్యతే నరే' ఇత్యాది ఉపనిషద్వాక్యాలలో పుణ్యాపాపరూప కర్మనాశం చెప్పబడింది. అన్నమాచార్యులవారు

కర్మసంబంధంవల్ల జీవుడు సుఖదుఃఖాలను అనుభవిస్తున్నాడు అని 'నిగమ నిగమాంత వర్ణిత మనోహరరూప' అనే కీర్తనలో "చీకాకుపడిన నాచిత్తశాంతము చేయ - లేకకా నీవు బహులీలనన్ను - కాకు సేసెదవు బహుకర్మముల బడువారు" అనే చోట అనేక కర్మలవల్ల మనశ్శాంతి లేకవున్నాం. మమ్మల్ని ఈ కర్మ బంధంనుండి విముక్తి చేయమని పాడినారు. ఇదే విధంగా "దైవమా నీకు వెలితా తలపు వెలితేకాక - వేవేలు కర్మాల వేసారగవలసె" అనే కీర్తనలోను స్తుతించారు.

'నారాయణ నీ నామమె గతి యిక' అనే కీర్తనలో "పైపైముందట . . . . నీదుటకు" (4—388) అనేచోట దుఃఖసాగరాన్ని, సంసార సాగరాన్ని అనుభవిస్తున్నామని అన్నమయ్య స్తోత్రం చేశారు.

మానవులందరు కర్మసంబంధంవల్ల జన్మిస్తున్నారు. జన్మించిన వారు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించినపుడు కొందరు అధ్యాత్మికంగాను, మరికొందరు భక్తితత్త్వం లోను జీవిస్తున్నారు. భక్తిరసమందున్న వాడను నేను భక్తుడను మొదలైన ఆలోచనలు మనస్సులో జనించరాదు. అలాంటి ఆలోచనవలన అహంకారమమకారా లేర్పడును. అది పాపానికి కారణమవుతుంది. కావున పరమాత్మకంటే, భగవంతునికంటే నేను పాపుడను, నేను కర్మబద్ధుడను నేను అశుచిని అని సంప్రదాయవేత్తలు తనను నీచస్వభావునిగా చెప్పు కుంటారు. 'అహమప్యపరాధానామాలయోఽ కిఞ్చనోఽ గతిః' అని అహిర్బుధ్న్యసంహితలోను, 'ధిగశుచిమవినీతం—' 'అమర్యాదః క్షుద్రః' స్తోత్రరత్నంలో యామునాచార్యులవారు దయాశతకంలో వేదాంతదేశికులు 'అహమస్మపరాధచక్రవర్తీ' 'జానన్నానాది విహితానపరాధ వర్గాన్' తనను నీచస్వభావునిగా చెప్పుకుంటారు.

పై విధంగా అన్నమాచార్యులవారు "పురుషోత్తముడ నీవు పురుషాధముడనేను పరమపాతకుడ భవబంధువు శ్రీ హరి నినుదలచ నేనరుహుడనా" మొదలగు చోట నైచ్యానుసంధానంలో గానం చేశాడు.

ఇన్ని జన్మాలేటికి "హరిదాసులున్న పూరదానుండిన జాలు" అనే కీర్తనలో భగవంతునికంటే నేను నైచ్యుడనని స్తుతించాడు. కర్మసంబంధం, సంసారబంధం, నైచ్యానుసంధానం ఇవన్నీ కర్మ విముక్తికి, మోక్షప్రాప్తికొరకే.

తనకు కర్మలవల్ల అశుచిత్వం, భగవంతునికి కర్మరాహిత్యం, సుపావనత్వం అనే విషయాల సంబంధాన్ని తెలుసుకొని, జీవ పరమాత్మల మధ్యఉండే సంబంధాన్ని తెలుసు కోవాలి. స్వామి దాసభావం, రక్ష్యరక్ష్యకభావం మొదలైన సంబంధాలను తెలుసుకొంటే అంతాపరమాత్మే నాదంటూ ఏమీ లేదనే జ్ఞానాన్ని పొందగలడు.

పరమాత్మను పొందడానికి ఉపాయమేమిటి? అని చింతిస్తాడు. దీనికి ఉపాయం భక్తి, శరణాగతి. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానే వృక్షే పరిషస్వజాతే, తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి" అని ముండకోపనిషత్తులో జీవునకు కర్మ ఫలభోక్తృత్వం, పరమాత్మకు కర్మఫలరాహిత్యం చెప్పబడింది. "ఏషహి మాతా పితా సుహృత్" అనే సుబాలోపనిషత్తు అంతా పరమాత్మే అని బోధించింది. ఉపనిషత్తులు ఉపాసనాపరమైన అనేక బ్రహ్మవిద్యలు మోక్షోపాయత్వ రూపమైన భక్తియోగంగా ప్రపంచితాలు.

"ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" అని శ్వేతాశ్వతరోపని షత్తులో శరణాగతి చెప్పబడింది. భగవద్గీతలో పరమాత్మే 'మామేకం శరణం వ్రజ' అని శరణాగతిని ఉపదేశించినారు.

ఈ విధంగా జీవపరమాత్మ సంబంధాన్ని, మోక్షోపాయాన్ని అన్నమాచార్యులు సువిస్తరంగా తన సంకీర్తనలలో చెప్పినాడు.

"నీవు నా సొమ్మువు నేను నీ సొమ్ము" అను కీర్తనలో స్వామి దాసభావాన్ని స్తుతించాడు. "ఈతని మరచివుంటి" అను కీర్తనలో "తల్లియై పోషించు తండ్రియై రక్షించు" అను చోట రక్ష్య రక్షక సంబంధాన్ని కీర్తించినాడు.

'అణురేణు' అను కీర్తనలో 'వేదాంత .... యోగీంద్రులు భావించు రూపము' అని భక్తియోగులనుద్దేశించి చెప్పినాడు.

'భక్త్యాదౌ శక్త్యభావః' అని వేదాంతదేశికులు కలియుగంలో భక్తి యోగాన్ని పొందుటకు శక్తిలేదు, జ్ఞానంలేదు, శరణాగతి ఒక్కటే ముక్తి మార్గం అని చెప్పినారు. శరణా గతిని చాలకాలంనుండి అందరు ఆచరిస్తున్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో శరణాగతి మోక్షోపాయానికి ప్రధానమైంది.

రామానుజాచార్యులు శ్రీభాష్యంలో 'తస్య చ వశీకరణమ్ తచ్ఛరణా గతిరేవ' అని శరణాగతిని మోక్షోపాయంగా చెప్పారు. "ఆనుకూల్యశ్చ సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్.

రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా

ఆత్మనిక్షేప కార్పణ్యం షడ్విధా శరణాగతిః" అని శరణాగతి లక్షణం. పైన చెప్పబడిన లక్షణాన్ని అన్నమాచార్యులవారు తన కీర్తనలలో పలుచోట్ల పేర్కొన్నాడు.

శ్రీ వైష్ణవ సంప్రదాయంలో శరణాగతి అను మంత్రం ద్వయశబ్దంచే వ్యవహరింపబడుతూవుంది. శరణాగతి మంత్రం శరణాగత్యనుష్ఠాన ప్రకాశకం.

'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే

శ్రీమతే నారాయణాయనమః' అను వాక్యంలో మొదటిది ఉపాయదశ. రెండవది ఉపేయదశ. ఈ రెండింటికి ద్వయమనిపేరు. ద్వయమంత్రాన్ని ఆధారంగా చేసుకొని అన్నమయ్య 'శ్రీమన్నారా యణ .... శరణు' అను కీర్తనలో శరణాగతిని స్తుతించారు.

1. భగవంతునికి అనుకూలంగా ఉంటాను, "అనుజ్ఞానం ఆనుకూల్యశ్చ సంకల్పః?" అని చెప్పబడుతుంది. 'కదసియాతడు' అను కీర్తనలో 'సభలో ద్రౌపదిగాచె సర్వేశుడెవ్వడు' అనుచోట ఆనుకూల్య విషయం వర్ణింపబడింది.

2. భగవంతునికి ప్రతికూలమైన విషయాలను విడిచిపెట్టుట 'ప్రాతికూల్యస్య వర్జనమ్' అని శరణాగతి లక్షణంలో రెండవది. 'మాదృశానాం భయామయ

దేహానాం' అనే సంకీర్తనలో అన్నివిషయాలు విడిచి భగవంతుని మాత్రమే శరణు వేడుకో దానికంటే గొప్పది ఏదీ లేదు అని స్తుతించారు.

3. ఈయన మాత్రమే రక్షించగలడు. ఈయనే తప్పక కాపాడుననే గొప్ప విశ్వాసం మూడవది. 'అస్మదాదీనామ్ అన్యేషామ్' అను కీర్తనలో శ్రీవేంకటపతి మాత్రమే మనలను కాపాడగలడని అన్నమాచార్యులు గొప్ప విశ్వాసంతో స్తోత్రం చేశారు.

4. 'అప్రార్థ్య న గోపాయేత్ రక్షాపేక్షామపేక్షతే' నన్ను రక్షించు, నన్ను కాపాడు అని కోరినప్పుడు భగవంతుడు మనకు ప్రసన్నుడౌతాడని శరణాగతిలో తురీయమార్గం.

'మర్ద మర్దమమ బంధాని' అను కీర్తనలో 'ఇతరాన్ విభజ్య ఇహమాం రక్ష' అని శరణాగతి తత్త్వాన్ని తెలియజేస్తున్నాడు అన్నమయ్య.

5. 'నా భారమును (ఆత్మభారః) నా రక్షణ భారమును (ఆత్మరక్షణభారశ్చ) నీవే వహించు' అని భగవంతునికి సమర్పించుట. 'తథా కురుష్వ' అను కీర్తన ద్వారా నా భారం, నా రక్షణభారమంతా నీవే అని స్తుతించారు.

6. నాకు వేరుగతి లేదు, అంతానీవే అని చెప్పుటేకార్పణ్యం. 'అంతయు నీవే హరి పుండరీకాక్ష '. . . . 'గతియింక నీవే నీవే ఈతని మూలమె పో' . . . . 'శ్రీ వేంకటాద్రిపతియే మా ధనము' అను కీర్తనల ద్వారా నీవేమాకు గతి అనిస్తోత్రం చేసినారు. షడ్విధాలైన శరణాగతి తత్త్వాలను అన్నమాచార్యుల వారు పలుకీర్తనలలో స్తుతించారు.

మోక్షోపాయం రెండువిధాలు 1. సిద్ధోపాయం, 2. సాధ్యోపాయం. సాధ్యోపాయం నిరూపించబడింది. భగవంతుడే సిద్ధోపాయం. ఉపాయం అనుష్ఠించినా భగవంతుడు లేక ఫలం సిద్ధించదు. ఫలప్రదాత భగవంతుడేకదా! "ఏష హ్యేవానందయాతి" అని తైత్తిరీయోపనిషత్. ఐశ్వర్యప్రదాత, ఔదార్యశీలుడు అని ఉపనిషత్తులు చెప్పుచున్నాయి.

'అహం సర్వఫలప్రదః' అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు స్వయంగా చెప్పినాడు. 'ఫలం అత ఉపపత్తేః' అని సూత్రకర్త వ్యాసుడు కీర్తించినాడు. ఈ విషయాలను అన్నమాచార్యుల వారు 'పొడగంటిమయ్య . . . రాయడా', 'సర్వోపాయముల . . . డితడే' అను కీర్తనలలో సిద్ధోపాయాన్ని నిరూపించినాడు.

భగవంతుడు సర్వఫలప్రదాత. అందువల్ల అతడు సిద్ధోపాయుడు. ఆ సర్వఫల ప్రదాతృత్వం రెండుగుణాల ద్వారా మాత్రమే సిద్ధిస్తుంది. ఆ రెండు గుణాలు తత్త్వటీకలో వేదాంతదేశికులు ఈ విధంగా చెప్పినారు. పరత్వం, సౌలభ్యం అని రెండు గుణాలు. 'పరత్వం' పూర్వము చెప్పబడింది. సౌలభ్యాన్ని అన్నమాచార్యులు 'భక్తసులభుడు పరతంత్రుడు హరి' అనే కీర్తనలో వర్ణించారు. దీనిచే కారుణ్యంకూడ చెప్పబడింది.

ఇటువంటి సిద్ధోపాయాన్ని, సాధ్యోపాయాన్ని ఆశ్రయించడం వల్ల ముముక్షువు మోక్షాన్ని పొందుతాడు. అదే దేశవిశేషాన్ని బట్టియేఉంటుంది. "తద్విష్ణోః పరమ పదమ్ సదాపశ్యంతి సూరయః సోఽ ధ్వనః పారమాప్నోతి, తద్విష్ణోః పరమంపదమ్ యత్తత్కవయో వేదయన్తే" అని ఉపనిషత్తులు మోక్షస్థానాన్ని చెప్పుతున్నాయి. అన్నమాచార్యులు కూడ మోక్షస్థానాన్ని గూర్చి"కట్టెదుట వైకుంఠము" అనేకీర్తనలో పేర్కొన్నారు. అన్నమాచార్యులు తిరుమలను వైకుంఠమన్నారు. భగవంతుడు అర్చావతారంలో వేంకటేశ్వరస్వామి నిల్చుకొని వున్నారు. శ్రీరంగంలో రంగనాథస్వామి శయనించి వున్నారు. తిరుపతిలో గోవింద రాజస్వామి శయనించి వున్నారు. కావున, భగవంతునిలో భేదముందా అనే ప్రశ్నజనిస్తుంది. దానికి సమాధానం. దివ్యమంగళ విగ్రహంలోనే భేదం. దివ్యాత్మ స్వరూపంలో భేదలేశంకూడ లేదు. కనుక సందేహానికి స్థానంలేదు.

దేశ విశేషమందే మోక్షంచెప్పబడింది. అందు అనుభవం ఎటువంటిది? 'సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణావిపశ్చితేతి' అని తైత్తిరీయోపనిషత్.

ఇక్కడ మోక్షదశలో భగవంతుని దివ్యకల్యాణగుణాలను బ్రహ్మతోకూడ అనుభవిస్తున్నాడు. కామశబ్దం 'కామ్యన్త ఇతి కామాః కల్యాణగుణాః' అని శ్రీభాష్యవ్యాఖ్య. అన్నమాచార్యులు హరికథాశ్రవణంలోను, హరికథా సంకీర్తనంలోను కలిగిన అనుభవాలను కీర్తించారు. శ్రవణకీర్తనలవల్ల ఇంతటి ఆనందానుభవ ముంటే, నేరుగా భగవంతుని దర్శించినప్పుడు, ఆ గుణాలననుభవించే టప్పుడు ఎంతటి ఆనందముంటుందో వేరుగా చెప్పనక్కరలేదు.

'కలిగెనిదే మాకు కైవల్యము' అనే కీర్తనలో ఇది స్పష్టం.

## ఉపసంహారం

"ఛాందోగ్యోపనిషత్తులో తన్మూలాఃసోమ్య ఇమాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః" అని ఈ వాక్యంలో అన్నిటికి మూలం బ్రహ్మ అని చెప్పబడింది. అంతా బ్రహ్మలోనే ప్రతిష్ఠింపబడిందనే ఈ తత్త్వాన్నిఅన్నమాచార్యులు "బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి . . . . సులభ ఇతి" అని స్తుతించారు. అన్ని తత్త్వాలను వేంకటేశ్వరునిలోనే స్థాపించారు. ఉపనిషత్తత్త్వాలను అన్నమాచార్యులు అనేక స్థలాలలో కీర్తనలో పొందుపరచడం గమనించ దగ్గ అంశం.

★ ★ ★

కాసల నాగభూషణం

## అన్నమయ్య సంకీర్తనలపై నాలాయిర దివ్యప్రబంధ ప్రభావం

అనాదిగా మానవ సమాజాన్ని నడిపిస్తున్న బలీయమైన శక్తులు రెండు. ఒకటి మతం, మరొకటి అధికారం. ఈ రెండింటిలో ప్రారంభంలో మానవులను సదాచార సంపన్ను లనుగా తీర్చిదిద్ది మానవ సమూహాల మధ్య సామరస్య పూర్వకమైన చక్కని సయోధ్యను సాధించడానికి ప్రయత్నించింది మతం. కాని, కాలక్రమంలో దురహంకార దూషితుడైన మనిషికి కులం, ప్రాంతం, భాష మొదలైన అంశాలతోపాటు మతం కూడ మరో విద్వేష కారణం కావడం విషాదం. అత్యద్భుతమైన సాంకేతిక ప్రగతితో ప్రపంచమే ఓ పరిమిత కుటుంబంగా మారిపోతున్న ఈ రోజుల్లోను మతం పేరున దారుణ మారణకాండ కొనసాగడం శోచనీయం. ఏ మంచి ఆశయంతో తానో ఆచారాన్ని పాటించడం మొదలుపెడతాడో ఆ మహదాశయాన్ని కాలాంతరంలో మరిచిపోవడం మనిషినైజం. ఏది ఏమయినా ఏ మత మయినా మానవ సమూహాన్ని ఓ క్రమ పద్ధతిలో నడపడానికి ప్రారంభమయిందన్నది మాత్రం నిజం. అలాంటి మతాలలో మన భారతదేశంలో ఒక విశిష్టధర్మంగా భాసిల్లిన హిందూమతంలో ముఖ్యమైన శాఖలుగా విస్తరిల్లినవి శాక్తం, గాణాపత్యం, కౌమారం, సౌరం, శైవం వైష్ణవం. ఇవి ప్రాచీనమైనవి. వాటి తరువాత పేర్కొనదగ్గవి బౌద్ధజైనాలు. ఇవి అర్వాచీనమైనవి. వీటిలో బౌద్ధ జైనాల విజృంభణకి విరుగుడుగా పునరుత్తేజం పొందిన శైవవైష్ణవాలు ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో వీరవిహారం చెయ్యడం ఒక చారిత్రక యథార్థం. తత్ఫలితమే వీరశైవం, వీరవైష్ణవం. ఈ రెండు ప్రధాన మతాల ప్రచారానికి తమ జీవితాలను మీదు కట్టిన శివభక్తులు - నాయన్మార్లు, విష్ణు భక్తులు - ఆళ్వారులు! కాగా మహిమాన్వితమైన జీవిత

విశేషాలలోను, విష్ణుభక్తి పారమ్యంలోను, సంకీర్తన కైంకర్యం లోను, సామాజిక దృక్పథంలోను అటు ఆళ్వారులకి, ఇటు అన్న మయ్యకి ఉన్న సామ్యాలను, అన్నమయ్య సంకీర్తనలలో గోచరించే ఆళ్వారుల భావజాల ప్రభావ ప్రసారాలను దిఙ్మాత్రంగానయినా ప్రదర్శించడం ఈ పరిశోధన వ్యాస లక్ష్యం. అందుకు నాందిగా ఆళ్వారుల గురించి, వారి జీవిత విశేషాలను గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.

ముందుగా ఆళ్వారులన్న మాటకున్న అర్థాన్ని చూద్దాం!

ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మగారు 'తమిళ సాహిత్యచరిత్ర'లో "ఆళ్వారు అనే మాటకు జ్ఞాన సంపన్నుడని అర్థం" అంటూ "అతని హృదయం ప్రేమకు నెలవు. అతడు ధ్యానసిద్ధుడు. శ్రీమన్నారాయణుడే పరమదైవమని అతని ప్రగాఢవిశ్వాసం" అని కొంత వివరణ కూడ ఇచ్చారు. అలాగే పులవర్ కా.రా. గోవిందరాజ మొదలియార్ గారు "ఆష్వావార్‌గళ్-ఇరైవ నిడత్తిల్ ఆషన్త అన్బు ఉడైయవర్‌గళాయ్ ఇరుందమైయాల్ ఇవర్ గళక్కు ఆష్వావార్‌గళ్ ఎన్బదు సిరప్పుప్పెయరాయ్ అమైందు విళంగు గిరదు" (భగవంతునిపట్ల ప్రగాఢమైన ప్రేమ ఉన్నందువల్ల వీరికి ఆళ్వార్లు అన్నది విశిష్టనామ ధేయమై విరాజిల్లుతోంది) అని వివరించారు. వైష్ణవులు వీరిని దివ్యసూరులుగా సంభావిస్తారు. వీరు పన్నెండుగురు - పొయ్‌గై యాళ్వార్ (సరోయోగి) భూతత్తాళ్వార్ (భూతయోగి), పేయాళ్వార్ (మహాయోగి), తిరుమళిశై ఆళ్వార్ (భక్తసారయోగి ), తొండరడిప్పొడి యాళ్వార్ (భక్తాంఘ్రిరేణుయోగి - విప్రనారాయణులు), కులశేఖరాళ్వార్ (కులశేఖరులు), తిరుమంగైయాళ్వార్ (పరకాలయోగి), తిరుప్పాణాళ్వార్ (మునివాహన యోగి), పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు), మధురకవి ఆళ్వార్ (మధురకవియోగి), నమ్మాళ్వార్ (శఠకోప యోగి ), ఆండాళ్ (గోదాదేవి). వీరందరు క్రీ.శ. 8,9 శతాబ్దాలలో జీవించినవారు.

ఇక వీరి సంఖ్యకి సంబంధించిన ఓ చిన్న విశేషం! 'నిత్యాను సంధానం' లో వైష్ణవులు

భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీ భక్తిసార కులశేఖర యోగివాహాన్
భక్తాంఘ్రిరేణు పరకాల యతీంద్ర మిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్ – అంటూ పదిమంది ఆళ్వారులను మాత్రమే ప్రస్తుతిస్తారు. అయితే మధురభక్తి మార్గంలో శ్రీరంగనాథునిలో లీనమై పోయిన గోదాదేవిని, గురుభక్తిమార్గంలో నమ్మాళ్వార్‌ను సేవించి తరించిన మధురకవిని అనంతర కాలంలో ఆళ్వారుల కోవలో చేర్చారు. అప్పటి నుంచి ఆళ్వారులు పన్నెండుగురుగా ప్రసిద్ధు లయ్యారు. ఈ ఆళ్వారు లందరూ విష్ణుమూర్తి ఆయుధాలు, ఆయన పరివారం తాలూకు అంశలతో జన్మించారంటారు.

వీరిలో మొదటి ముగ్గురు - పొయ్‌గైఆళ్వార్, భూతత్తాళ్వార్, పేయళ్వార్- ఒకే సంవత్సరం అంటే క్రీ.శ. 719లో జన్మించారు. తమిళంలో వైష్ణవవాఙ్మయం వీరితోటే మొదలు. కాబట్టి ఈ ముగ్గుర్ని ముదలాళ్వారులుగా పరిగణిస్తారు. వీరిలో పొయ్‌గైఆళ్వార్ కాంచీపురంలో ఓ సరోవరంలోని తామర పూవులో విష్ణుమూర్తి శంఖం - పాంచజన్యం - అంశతో జన్మించారు. భూతత్తాళ్వార్ మహాబలి పురంలో గురువింద పొదలో మహావిష్ణువు గద - కౌమోదకి - అంశతో జన్మించారు. పేయాళ్వార్ మైలాపూర్ సెల్వకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని బావిలో చెంగలువ పువ్వులో విష్ణుఖడ్గం-నందకాంశతో జన్మించారు.

ఈ ముగ్గురు ఆళ్వార్లు ఎవరికి వారు విడివిడిగా వైష్ణవక్షేత్రాలు సేవిస్తూ తిరిగి తిరిగి చివరికి చిత్రంగా తిరుక్కోవిలూర్‌లో వర్షపురాత్రి ఓ ఇంటి ముందరి వసారాలో కలుసు కుంటారు. వారిలో ముందుగా అక్కడికి పొయ్‌గైఆళ్వార్ చేరుకుంటారు. కాసేపటికి భూతత్తాళ్వార్ వస్తారు. "ఒకరయితే పడుకోవచ్చు. ఇద్దరం ఉన్నాం కదా ! కూచుంటే సరిపోతుంది. రా!" అని పిలిచి అతనికి చోటిస్తారు. మరి కాసేపటికి పేయాళ్వార్ రావడంతో

"ఇద్దరం కాబట్టి కూచున్నాం. నుంచుంటే ముగ్గురికీ సరిపోతుంది. ముగ్గురూ నుంచుందాం రా!" అని పిలుస్తారు.

అలా ఆ వసారా కింద చేరిన ముగ్గురూ విష్ణులీలా విలాసాలను గురించి ముచ్చటించుకుంటూ ఉంటారు. ఆ సమయంలో తమ మధ్య మరో వ్యక్తి ఎవరో ఉన్న అనుభూతికి లోనవుతారు. జ్ఞానదృష్టితో వీక్షిస్తారు. వారికి విష్ణుమూర్తి సాక్షాత్కరిస్తారు. ఆ ఆనంద పారవశ్యంలో వారు ముగ్గురు ఆశువుగా 'ఇయర్పా' ఛందంలో అంతాది ప్రణాలికతో ఒక్కొక్కరు వంద చొప్పున పాశురాలు చెబుతారు. 'వైయం తగళియా' అని ప్రారంభిస్తూ పొయ్‌గైఆళ్వారు, 'అన్బేతగళియా' అని ప్రారంభిస్తూ భూతత్తాళ్వారు, 'తిరుక్కండేన్ పొన్‌మేని కండేన్' అని ప్రారంభిస్తూ పేయాళ్వారు పాడిన ఈ ప్రబంధాలు వరుసగా ముదల్ తిరువంతాది, ఇరండాం తిరుంతాది, మూన్ఱాం తిరువంతాది అన్న పేర్లతో ప్రసిద్ధికెక్కాయి.

ఇక ఆళ్వారులలో నాల్గవవారైన తిరుమళి శై యాళ్వార్ పూనమల్లి సమీపంలోని తిరుమళిశై క్షేత్రంలో సుదర్శనచక్రం అంశతో మహర్షి దంపతులకు కాళ్ళుచేతులులేని పిండాకారంలో జన్మించారు. వారాబిడ్డను ఓ పేముపొదలో వుంచి వెళితే లక్ష్మీనారాయణులు విచ్చేసి, సంపూర్ణ శరీరాకృతినిచ్చి జీవం పోసి వెళతారు. తరువాత పేముల కోసం వచ్చిన మేదరి ఆ బిడ్డను చూసి తనభార్యకిస్తాడు. పిల్లలు లేని ఆ దంపతులు ఆ పిల్లవాణ్ణి అల్లారుముద్దుగా పెంచు కుంటారు. ఆయన చిన్నప్పటినుంచి ఎన్నో మహిమలు ప్రదర్శిస్తారు. పిల్లలు లేని వృద్ధదంపతులకు యౌవనాన్ని అనుగ్రహించడం, ముక్కంటి కంటి మంటని తన కుడికాలి బొటనవేలి కంటి మంటతో ఎదుర్కొని ఆ ఈశ్వరునిచేతే భక్తిసారుడన్న బిరుదు పొందడం, దేశ బహిష్కృతుడైన కణికణ్ణన్‌తో కలిసి వెళుతూ క్షేత్రాది దైవతమైన విష్ణువును కూడ తమవెంట తీసుకెళ్ళడం, రాజు క్షమాభిక్ష కోరడంతో స్వామిని యథా ప్రకారం కంచిలోని తిరువెహ్కాలో శయనమూర్తిగా వేంచేయ మనడం - ఇత్యాది మహిమలెన్నో ప్రదర్శించారు.

తిరుచ్ఛంద విరుత్తమ్, నాన్ముగన్ తిరువంతాది అన్న ప్రబంధాలను రచించారు.

తొండరడిప్పొడి యాళ్వార్ తంజావూరు జిల్లా మండంగుడిలో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో మహా విష్ణువనమాలాంశతో జన్మించారు. ఒక వేశ్య పట్టిన పంతంవల్ల ఆమె పట్ల ఆకర్షితులై పడరాని పాట్లుపడి చివరకి శ్రీరంగనాథుని అనుగ్రహంవల్ల బంధవిముక్తులై పాప పరిహారార్థం విష్ణు భక్తుల పాద ధూళిని తలదాల్చి వారి పాదోదకాన్నే తీర్థంగా సేవించారు. తొండర్ - అడిప్పొడి - ఆళ్వార్ - భక్త - అంఘ్రి - రేణువుగా ప్రసిద్ధులయ్యారు. తిరుమాలై, తిరుప్పళ్లి ఎళిచ్చి అన్న ప్రబంధాలను కూర్చారు.

కులశేఖరాళ్వార్ చేరరాజు కుమారుడిగా కౌస్తుభమణి అంశతో జన్మించారు. పెరుమాళ్ తిరుమొళిఅన్న తమిళ ప్రబంధంతో పాటు సంస్కృతంలో ‘ముకుందమాల ’ అన్న గ్రంథాన్ని కూడ రచించారు.

తిరుప్పాణాళ్వార్ శ్రీరంగ సమీపంలోగల ఉరయూరులో మహావిష్ణువు పుట్టుమచ్చ శ్రీవత్సం అంశతో జన్మించారు. వీరిని పాణర్ కులానికి చెందిన వాళ్లు పెంచడం వల్ల తిరుప్పాణర్ అయ్యారు. లోకసారంగముని ఇతని ఫాలభాగాన్ని గాయపరిస్తే స్వామి విగ్రహం ఫాలభాగం నుండి రక్తం స్రవించిందట! పశ్చాత్తాప తప్తుడైన లోక సారంగముని రంగనాథుని ఆజ్ఞమేరకు వీరిని స్వామి సన్నిధికి రమ్మంటే తాను అంత్యకులజుడైనందువల్ల అక్కడ పాదంమోపలే నన్నాడు. అప్పుడు ముని వీరిని ప్రాధేయపడి తన భుజాలమీది కెక్కించుకొని రంగని సన్నిధికి మోసుకెళ్లారు. అందువల్ల ఈయన మునివాహనయోగి అయ్యారు. ‘అమలనాదిపిరాన్’ అని మొదలయ్యే పదిపాశురాల ప్రబంధాన్ని గానం చేసి ఆ రంగని దివ్యమంగళ విగ్రహంలో ఐక్యమయ్యారు.

తిరుమంగై యాళ్వార్ ప్రాచీన చోళదేశంలో ప్రస్తుత తంజావూరు జిల్లా తిరువాలి ప్రాంతం తిరిక్కుఅయలూర్‌లో కళ్ళర్ కులంలో మహావిష్ణు కార్ముకాంశతో జన్మించారు. పెరియ తిరుమొళి తిరుక్కురుందాండగమ్,

తిరునెడుం దాండగమ్, తిరువెళు కూట్రిరుక్కై, సిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్ అన్న ఆరు ప్రబంధాలను రచించారు.

విష్ణుచిత్తుడు, పట్టర్ పిరాన్ అన్న నామాంతరాలున్న పెరియాళ్వార్ శ్రీవిల్లి పుత్తూరులో గరుత్మంతుని అంశతో జన్మించారు. తులసీవనంలో దొరికిన గోదాదేవిని పెంచి పెద్దచేసి శ్రీరంగనాథుని కిచ్చి వివాహం జరిపించి ఆ శ్రీమహావిష్ణువుకే మామగారుగా మన్ననలందుకున్నారు. తన ఊరేగింపు ఉత్సవంలో తనని చూడడానికి లక్ష్మీసమేతంగా విచ్చేసిన శ్రీమన్నారాయణ మూర్తిని ప్రత్యక్షంగాదర్శించి అతనికి దృష్టి దోషం తగులు తుందన్న భయంతో 'పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు పలకోడి నూరాయిరమ్...' అంటూ మంగళాశాసనం ఆలపించారు. ఈ 'తిరుప్పల్లాండు'తో పాటు వీరు పెరియాళ్వార్ తిరుమొషి అన్న ప్రబంధాన్ని కూడ రచించారు.

ఈ పెరియాళ్వారు పెంపుడు కూతురు ఆండాళ్ - గోదాదేవి - బృందావనంలో భూదేవి అంశతో అయోనిజగా అవతరించారు. తాను ధరించిన పూలమాలల్ని శ్రీరంగనాథునికి సమర్పించి చూడికొడుత్త నాచ్చియార్‌గా ఆయన మనసుదోచి, మనువాడి ఆ మూలవిరాట్టు చెంతనే అదృశ్యురాలై అక్కడే ఆశ్రయం సంపాదించారు. మార్గశిర మాసవ్రత విశేషాలను వివరించే తిరుప్పావై అన్న గ్రంథాన్ని, స్వామిపట్ల తనకున్న తపనని తెలుపుతూ నాచ్చియార్ తిరుమొళి అన్న ప్రబంధాన్ని సంతరించారు. ఇంత మంది ఆళ్వారుల మధ్య ఏకైక విష్ణుభక్తురాలై, అనురక్తురాలై తరించారు.

నమ్మాళ్వార్ తిరునెల్వేలి జిల్లాలో ఆళ్వార్ తిరునగరిలో విష్ణు దేవుని సేనాని విష్వక్సేనుని అంశతో శూద్ర దంపతులకు జన్మించారు. మధురకవి ఆళ్వారులకు గురు స్థానం వహించి వారిని ఆళ్వారుల స్థాయికి తెచ్చారు. నమ్మాళ్వార్ తిరువిరుత్తమ్, తిరువాసిరియమ్, పెరియ తిరువంతాది, తిరువాయ్‌మొషి అన్న ప్రబంధాలు రచించారు.

ఆళ్వారులలో చివరివారు మధురకవి ఆళ్వార్ తిరునెల్వేలి జిల్లా తిరుక్కోళూర్ గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో కుముద గణేశాంశతో

జన్మించారు. నమ్మాళ్వార్ శిష్యులై వారి అర్చామూర్తిని ప్రతిష్ఠించి నిత్యపూజలు, ఉత్సవాలు జరిపించారు. నమ్మాళ్వారును నుతిస్తూ 'కణ్ణినుణ్ సిరుత్తాంబు .. ' అని మొదలయ్యే ఒకే ఒక్క ప్రబంధాన్ని రచించారు. దైవం మారుగా గురువునే దైవంగా ఆరాధించి ఆ గురు పరంపరలో స్థానం సంపాయించారు.

ఇలా ఈ పన్నిద్దరాళ్వారుల జీవితాలు రకరకాల వింతలు విశేషాలతో, మహిమలతో, స్వప్నవృత్తాంతాలతో, అలౌకికమైన అనుభవాలతో సిద్ధ పురుషులందరి జీవితాలమల్లే విలక్షణమైన రీతిలో గోచరిస్తున్నాయి.

ఇక అన్నమయ్య జీవితాన్ని పరికిస్తే ఆయన 15వ శతాబ్ది ప్రారంభంలో కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్లపాకగ్రామంలో నందవరీక వైదిక బ్రాహ్మణ కుటుంబంలో నమ్మాళ్వార్‌లాగా విశాఖమాసం విశాఖా నక్షత్రంలో, పేయాళ్వార్‌లాగా నందకాంశతో జన్మించారు. తిరుపతి కొండ ఎక్కుతూ అలసటతో నిద్రపోయి, అలమేలు మంగమ్మ చేతి అన్నప్రసాదాలారగించే అదృష్టానికి నోచుకున్నారు. పదహారవ యేట తన సంకీర్తన యజ్ఞం ప్రారంభించారు.

అన్నమయ్య సంకీర్తనల గాన మహిమకి మూసిఉన్న ఆలయ కవాటాలు తెరుచుకోవడం, స్వామి కంఠహారం జారి కిందపడడం, సాళువ నరసింగరాయల భటులు తనని బంధించడానికి వేసిన సంకెళ్ళు తెగిపోవడం, జీడిమామిడి చెట్టు తియ్యని పళ్ళుకాయడం- ఇలా ఆళ్వారుల జీవితాలలో లాగే ఎన్నో అద్భుతాలు జరిగాయి.

ఇక అన్నమయ్య మీద నాలాయిర దివ్యప్రబంధ ప్రభావం మాట కొస్తే–తమిళ నాట వైష్ణవమత వ్యాప్తిలో గణనీయమైన పాత్రను నిర్వహించి తమ తరువాతి విష్ణుమతానుయాయులందరికి ఆరాధ్యులైన ఆళ్వారులు అన్నమయ్యకు సైతం ఆదర్శప్రాయులయ్యారు. వారి దివ్య ప్రబంధ పాశురాలను అన్నమయ్య పలుమార్లు ఆలకించారు - ఆలపించారు! ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ డా॥ జక్కంపూడి మునిరత్నంగారు "అహోబిల

మతస్థాపకులైన ఆదివన్ శఠకోపయతిని గురించి అన్నమయ్య విన్నాడు. అయన్ను సందర్శించాడు. ఆయన శిష్యుడై వైష్ణవాగమాలన్నిటినీ అభ్యసించాడు. ఆళ్వారుల పాశురాల అంతరార్థాన్ని బోధపరచుకున్నాడు" అన్నారు. పైగా అన్నమయ్య

వాడె వెంకటేశు డనే వాడె వీడు
వాడి చుట్టుకైదువ వలచేతివాడు – (1- 121) అన్న సంకీర్తనలో

కారి మార సుతుని చక్కని మాటలకు ‹చొక్కి
చూరగా వేదాల గుట్టు చూపిన వా‹డు
తీరని వేడుకతో తిరుమంగ యాళువారి
ఆరడి ముచ్చిమి కూటి కాస పడ్డవాడు ॥వాడె॥

పెరియాళువారి బిడ్డ పిసికి పైవేసిన -
విరుల దండల మెడ వేసినవా‹డు ... అంటూ

నమ్మాళ్వార్, తిరుమంగైయాళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్ పేర్లను ప్రస్తావించారు.

ఇక ఆళ్వారుల అర్చామూర్తి శ్రీరంగక్షేత్రంలోని రంగనాథస్వామి కాగా అన్నమయ్య ఆరాధ్యదైవం తిరుమల శ్రీవేంకటేశుడు. అయితే ఆళ్వారులు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ ఎన్నో పాశురాలను గానం చేశారు. అంతేగాక ఆళ్వారుల లాగే అన్నమయ్య కూడ నృసింహ, శ్రీరామ, కృష్ణాది, ఇతర అవతారాలను, హనుమ ద్విభీషణ గరుడ సుదర్శన పాంచజన్యాది పరివారజనాన్ని కీర్తించారు. ఈ రకమైన వర్ణ్య వస్తు సామ్యం వల్ల, విష్ణుభక్తి పారమ్యం వల్ల అన్నమయ్య సంకీర్తనలలో ఆళ్వారుల పాశురాల ప్రభావం కొంతవరకు ప్రేరణగా నిలిచాయని మనం ఊహించవచ్చు !

## సంకీర్తనార్చన

నవవిధ భక్తిమార్గాలు అందరూ అనుసరించ దగ్గవే ! కాని కీర్తనం అన్నప్పుడు - అందునా ఆశువుగా పాటలల్లుతూ బాణీలు కట్టి పాడడం -

అన్నది ఒక్క వాగ్గేయకారులు మాత్రమే చెయ్యగలిగిన అర్చన ! అలా తమిళంలో పన్నిద్దరాళ్వారులు గానం చేసిన నాలుగువేల పాశురాల పరిచయంతో, ప్రభావంతో అన్నమయ్య ఒక్కడే తన జీవితకాలం పొడవునా- అంటే తన 16వఏట ప్రారంభించి 95వ ఏట పరమపదించే వరకు రోజుకి కనీసం ఒక్క సంకీర్తన అయినా పాడాలన్న నియమంతో అదో అసిధారా వ్రతంగా, నిత్యకైంకర్యంగా సమకూర్చిన సంకీర్తనలు ముప్పయిరెండువేలు! వాటిలో కాలగర్భంలో కరిగిపోయినవి పోగా మనకిప్పటికి మిగిలినవి 13,719 సంకీర్తనలు మాత్రమే ! అయినా వాసిలో తెలుగులోని కావ్య ప్రబంధాలకే మాత్రం తీసిపోని అన్నమయ్య సంకీర్తనల రాశి మన మనసుల్ని ఆనంద డోలికల్లో తేలి యాడించే సాహిత్యామృతవారాశి! తరచి చూస్తున్న కొద్దీ అందులో ఎన్నెన్నో ముత్యాలున్నాయి, అనర్ఘ రత్నాలు!

శరణాగతి

వైష్ణవంలో అత్యంత ప్రాధాన్యం వహించింది శరణాగతి ! సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ - అన్న గీతావాక్యం వైష్ణవులకు పరమ ప్రమాణం. కులశేఖరాళ్వార్ -

తరు తుయరం తడాయేల్ ఉన్ శరణల్లాల్ శరణిల్లై
విరై కుషవు మనర్పొషీల్ సూషు విట్రువక్కోట్టుమ్మానే !
అరి సినత్తాలీన్ర తాయ్ అగట్రిడినం మట్రవళ్ తన్
అరుళ్ నినైందేయషుం కుష వియదులేపో న్రిరుందేనే

(పెరుమాళ్ తిరుమొషి 5-1)

(స్వామి! నీవల్ల కలిగిన దుఃఖాన్ని నీవు పోగొట్టుకున్నా నీపాదాలు తప్ప నాకు శరణంలేదు. కోపంతో కన్నతల్లి దూరంచేస్తే ఆమె కారుణ్యాన్ని తల్చు కుంటూ ఏడుస్తున్న పసిబిడ్డలా ఉన్నాన్నేను!) అని చిన్నబిడ్డ తన తల్లి కోసం పడే తపనలాంటిది శరణాగతి అని పరోక్షంగా సూచించారు. అలాగే తిరుమంగై యాళ్వార్-

అరుమా కడలముదే ఉనదడియే శరణం(పెరియ తిరుమొళి 9-9) అని ఆశ్రియఃపతిని శరణుకోరారు.

అన్నమయ్య తన సంకీర్తనల్లో -
సర్వేశ్వరుడే పొందేటి వస్తువు
శరణాగతియే ఉపాయము (10-90)

పంచల పీతాంబరు శరణాగతి
ముంచిన అజ్ఞానమునకు దీపము ( 9 -275)

తిరువేంకట గిరిపతి యగు దేవశిఖామణి పాదము
శరణని బ్రదుకుట దప్పను సన్మార్గములేదు (1-261)

అని శరణాగతి తత్త్వాన్ని అన్నమయ్య బహుధా ప్రబోధించారు.

## అన్యదైవ తిరస్కృతి

తామునమ్మిన పరతత్త్వం తప్ప తక్కిన దేవతలెవ్వరూ తమకు ఆరాధ్యులుకారన్న విశ్వాసం ఆ మతంపట్ల వారికున్న తీవ్రమైన నిబద్ధతని సూచిస్తుంది. ఈ లక్షణం ఇతర దేవతల్ని తిరస్కరించడం దాకా తీసుకెళుతుంది. ఆళ్వారుల పాశురాలలోను ఈ అంశం గోచరిస్తుంది.

తొలి ఆళ్వార్ - పొయ్‌గైయాళ్వార్ - ఇలా అంటారు.

వా యవనై యల్లదు వాయ్ త్తాదు; కై యులగం
తా యవనై యల్లదు తాన్ తొషాపేయ్ ములై నంజు
ఊణాగవుండాన్ ఉరువొడు పేరల్లాల్
కాణా కణ్ కళా సెవి (ముదల్ తిరువంతాది 11)

నోరు విష్ణువును తప్ప ఇతరులను కీర్తించదు. పుడమిని కొలిచిన వానికి తప్ప ఇతరులకు నాచేతులు నమస్కరించవు. పూతనా స్తన్యం గ్రోలినవాని రూపనామాలను తప్ప తక్కిన వాటిని నేను చూడను, వినను !

ఇలా ఇతర దేవతల రూపాలను చూడకపోవడం, నామాలను వినకపోవడమే కాదు - కనీసం భావన కూడ చెయ్యనంటారు తొండరడి ప్పొడి యాళ్వార్-

సేవియేన్ ఉన్నైయల్లాల్ సిక్కెన చ్చెంగణ్మాలే...
పావియేన్ ఉన్నైయల్లాల్ బావియేన్ బావియేన్ (తిరుమాలై 35)

ఓ కమలనయనా! నిన్ను తప్ప ఇతరులను సేవించను. నేను పాపాత్ముడను. నిన్ను తప్ప అన్యులను భావించను, భావించను!

అన్నమయ్య కూడ ఈ ధోరణిలోనే -
నిరతి శ్రీవేంకటేశ! నిన్నే నమ్మితిమి
పరదైవములతోడి పని మాకు లేదయ్యా! (10-36)

తలచరొక్కడు ధరణి భోగములు
తలచ రితర మత దైవముల (10-186)

అని కంఠోక్తిగా చెబుతారు.

## సమదర్శనం

విద్యా వినయ సంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని
శుని, చైవ శ్వపాకేచ
పండితా స్సమదర్శినః భగవద్గీత (5–18)

ఆళ్వారులు ఇలాంటి పండితులు. సమదర్శనం ఉన్నవాళ్ళు. వీరెవరూ కులభేదాన్ని, అంతస్తుల భేదాన్ని పాటించినట్టు కనపడదు. వీరిలో శూద్రులు, అంత్యజులు ఉన్నారు. అంత్య కులజులు పెంచినవారున్నారు. అందరూ ఆఖరుకి విష్ణుసాయుజ్యానికి అర్హులయ్యారు.

అలాగే అన్నమయ్య -
'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అని
'ఏకం సత్' అన్న పరమాత్మ ఏకత్వ తత్త్వాన్ని'
'కందువగు హీనాధికము లిందులే' వు, అంటూ

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రనదియు నొకటే
మెండైన బ్రహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలుండేటి సరిభూమి యొకటే ( 2-388) అంటూ

మన అనుభవంలోని దృశ్యాలనే అందుకు దృష్టాంతాలుగా చూపారు.

ఏ సత్ఫలితమయినా అందరికీ అందాలన్న తపనతో ఇలా అడ్డుగోడల్ని అధిగమించి - అది ఏదో ఒక మత పరిధికి లోబడినదయినా - పక్షపాత రహితమైన సమదర్శనంతో సర్వమానవ సౌభ్రాత్ర భావనని ప్రదర్శించడం ఒక మహోన్నతమైన ఆదర్శం. ఆళ్వారుల లోని ఈ ఆదర్శ భావజాలమే అన్నమయ్యలోను ప్రతిఫలించడం అత్యంత సహజమైన ఓ భావసామ్యం. భక్తి సామ్రాజ్యంలో వర్ణ వర్గ విభేదం లేకుండా అందరికీ అందించిన సమాన భాగస్వామ్యం!

ఇక ఈ ప్రస్తావించిన ప్రభావాల నేపథ్యంలో ఫలి తాంశాలను విశ్లేషిస్తే-

ఆళ్వారులు, అన్నమయ్య భిన్న కాలాలకు, భిన్న ప్రాంతాలకు, భిన్న భాషలకు చెందిన వారయినా వారందరిని కలిపికట్టే సమైక్యతా సూత్రం - వైష్ణవమత దీక్ష.

అనుసరించిన మార్గం - సంకీర్తనా కైంకర్యం.
ఉపకరించిన ద్రవ్యం - వాగ్గేయకార ప్రతిభ.

ఉభయ సామాన్యంగా గోచరించే విశేషాలు - క్షేత్ర సందర్శనం కోసం దేశాటన చెయ్యడం, అలౌకికమైన మహిమల్ని ప్రదర్శించడం.

ఫలితం - భక్తి ఓ ఉద్యమంగా మారడం, అనుయాయులు తయారుకావడం.

ప్రత్యక్ష ప్రయోజనం - వైష్ణవమత ప్రచారం.
పరోక్ష ప్రయోజనం - సంగీత సాహిత్యాలు పరిపుష్టంకావడం.

వీటిలో మత ప్రాచుర్యం ఒక్క వైష్ణవులకు మాత్రమే పరిమితం. సంగీతం ఆపాత మధురం. సాహిత్యం ఆలోచనామృతం. అవి" రసజ్ఞులైన వారందరికి ఆస్వాద యోగ్యాలు! అపురూపంగా దాచుకో వలసిన అక్షయ భాగ్యాలు!

## ఉపకరించిన గ్రంథాలు


1. నాలాయిర దివ్య ప్రబంధం (తమిళం)
2. వ్యాస కదంబం - ఆచార్య కె. సర్వోత్తమ రావు
3. అన్నమాచార్య, ప్రముఖ వాగ్గేయకారులు తులనాత్మక అధ్య యనం - ఆచార్య ఎస్. గంగప్ప.
4. అన్నమయ్య - ఆళ్వారులు తులనాత్మక పరిశీలన - ఆచార్య జక్కంపూడి మునిరత్నం.
5. ఆళ్వారుల దివ్య చరిత్ర వైభవం.


★ ★ ★

వేదాంతం రాజగోపాల చక్రవర్తి

# అన్నమాచార్య సంకీర్తనలలో ఆగమ విశేషాలు

వేద పురాణ ఇతిహాస ఆగమాది గ్రంథాలు మానవ ధార్మిక జీవనానికి మూలాధారాలు. మానవులకు ప్రేయస్సును, శ్రేయస్సును కలిగించడానికి మహర్షులు నిగమ మార్గంలో ఆగమాలను ఆలయాలను వ్యవస్థీకరించారు. సృష్టి, ప్రళయం, దేవతార్చన. మంత్రసాధన, మంత్రపునశ్చరణ, షట్కర్మసాధనాలు. నాలుగు విధాలైన ధ్యానయోగ పద్ధతులను తెలిపే గ్రంథాలు ఆగమాలుగా వ్యవహరింపబడతాయని శబ్దకల్పద్రుమం వివరిస్తుంది. ఆలయ నిర్మాణరీతులు, ప్రతిష్ఠా విధానాలు, అర్చన - ఉత్సవ ప్రాయశ్చిత్త విధులను తెలియ చేసే గ్రంథాలను ఆగమాలుగా మనం స్థూలంగా భావించవచ్చును. వివిధ దేవతామూర్తులకు సంబంధించిన అంశాలను నాలుగు ఆగమాలుగా వర్గీకరించటం జరిగింది. వీటిల్లో వైష్ణవాగమం ఒకటి. ఈ వైష్ణవాగమం రెండు విధాలు. 1. పాంచరాత్రం 2. వైఖానసం. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారికి అర్చనాదులు వైఖానసాగమ ప్రకారంగా జరుగుతాయి. అన్నమయ్య తన సంకీర్తనలలో తిరుమల ఆలయం గూర్చి, అక్కడ జరిగే ఆగమవిహితమైన స్వామివారి కైంకర్యాల గూర్చి సముదాత్తంగా అభివర్ణించాడు. ఇంతే కాకుండా ఆలయ సంబంధమైన కొన్ని అంశాలను తీసుకొని ప్రత్యేకమైన సంకీర్తనలు అన్నమయ్య రచించాడు. ఆగమ - ఆగమసంబంధితమైన ఈ సంకీర్తనలవలన 500 సంవత్సరాల క్రితం నాటి విశేషాలు మనకు అందివస్తున్నాయి. ఈ సంకీర్తనలే అన్నమయ్య రచించక పోయినట్లైతే ఆనాటి తిరుమల ఆలయచరిత్ర అసంపూర్ణంగా ఉండేది.

## ఆలయాలు

ఆంధ్రదేశంలో సుమారుగా 30వేలకు పైగా ఆలయాలున్నాయి. అయితే ఈ ఆలయాలు చూడడానికి గాలిగోపురం, బలిపీఠం, ధ్వజస్తంభం, గర్భగుడి, మొదలగునవి ఒకేవిధంగా ఉన్నట్లు కనిపిస్తున్నా, ఆగమ శాస్త్ర ప్రకారంగా ఐదు విధాలుగా వుంటాయి. అవి 1.స్వయంవ్యక్తం 2. దివ్యం 3. ఆర్షం 4. పౌరాణం, 5.మానుషం.

(స్వయంవ్యక్తం దివ్యమార్షం పౌరాణం మానుషమితి పంచ స్థానాని భగవతః కృపయాఽనుగృహీతాని)

1. స్వయంవ్యక్తం అంటే "భక్తానుకంపయా భగవాన్ స్వయమేవావిర్భవేత్తత్స్వయంవ్యక్తః" భక్తులమీద దయతో భగవంతుడు తనంతట తానుగా ఆవిర్భవించిన ప్రదేశానికి స్వయం వ్యక్త స్థలమని పేరు.

2. దివ్యః అంటే "బ్రహ్మరుద్ర ప్రముఖైః ప్రతిష్ఠితః దివ్యం" - బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైనవారు దేవతావిగ్రహాలను ప్రతిష్ఠించినట్లైతే అటువంటి ఆలయాలను దివ్య ఆలయాలుగా వ్యవహరిస్తారు.

3. ఆర్షము అంటే "ఋషిభిః ప్రతిష్ఠితమార్షం" అంటే ఋషులు ప్రతిష్ఠించిన ఆలయాలను ఆర్షములు అని అంటారు.

4. పౌరాణం అంటే "పురాణసిద్ధం పౌరాణం"- ప్రాచీనమైన ఆలయాలను పౌరాణములు అని అంటారు.

5. మానుషం అంటే "మనుష్యైః ప్రతిష్ఠితం స్థలం మానుషం"- మానవులచేత ప్రతిష్ఠింప బడిన ఆలయాలను మానుష ఆలయాలని పిలుస్తారు- తిరుమల ఆలయం స్వయం వ్యక్త స్థలం. స్వయంవ్యక్త దివ్యస్థలమైన తిరుమల ఆలయం, ఇక్కడ శ్రీవారికి జరిగే కైంకర్య విశేషాలు మనకు ఆధ్యాత్మికపరమైన సముదాత్తమైన భావ పరిపూర్ణతను కలుగజేస్తాయి.

## అర్చన

సర్వాంతర్యామిగా ఉన్న పరమాత్మను భజించడానికి వైదిక పరమైన నాలుగు మార్గాలున్నాయి. "అధ భగవత్ సమారాధనం చతుర్విధం భవతి" "జపహుతార్చన ధ్యానానీతి" అని చెప్పబడి వున్నది. జపము, హోమము, అర్చనా, ధ్యానము వీటి ద్వారా భగవత్ సన్నిధానానికి మనం చేరుకోవచ్చును. అయితే వీటిలో సమాజంలోని అన్ని వర్గాలవారికి అందివచ్చే మార్గం అర్చన. అర్చన - ఆలయాలు ఈ భావనకు ప్రప్రథమంగా వైష్ణవపరంగా అక్షరరూపం కల్పించిన మహనీయుడు విఖనసమహర్షి "గృహే దేవాయతనే వా భక్త్యా భగవంతం నారాయణ మర్చయేత్" అని విఖనసమహర్షి ప్రతిపాదించాడు. దీనినే మరింతగా వివరిస్తే "గృహ దేవాయతనేవా వైదికేన మార్గేణ ప్రతిమాదిషు పూజయేదత్తర్చనం" అని చెప్పవచ్చును. అర్చనలో రెండు పద్ధతులున్నాయి.

అన్యత్రత్వాం సమారోప్య యద్యుపాసనా విధీయతే
సావృత్తిః ప్రచ్యుత ప్రోక్తా తవ తత్వం తథైవ చ
త్వయి సర్వం సమారోప్య యద్యుపాసా విధీయతే
సావృత్తిః సకలజ్ఞేయా తవతత్వం తవైవహి

ఇతర దేవతలయందు నిన్ను (విష్ణువు) ఆరోపణచేస్తే ఆ విధానాన్ని 'ప్రచ్యుతము' అని అంటారు. నీ యందు (విష్ణువు) సమస్తమును ఆరోపిస్తే ఆ విధానాన్ని 'సకలము' అని అంటారు. ఇదే విధంగా సకళ - నిష్కల, సాకారా - నిరాకార మొదలైన ఆగమ అంశాలను కలిపి అన్నమయ్య ఒక చక్కని సంకీర్తన రచించాడు.

ఏదియుఁగానఁడు(గాననందు?) నేది గాదందు
ఆది పురుష నీదాస్యమే మేలు నాకు ॥పల్లవి॥

గరిమఁగొందరికి సాకారమై నిలిచితి
గురునిరాకారమై కొందరికి

సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవట నీవు
ధర నిర్గుణ మవట తగిలి కొందరికి ॥ఏది॥

వొకటేఁ గళాపూర్తి నొనరియందువట
వొకట నిష్కళుఁడవై వుడివోవట
వొకచో జీవుల (కు) నీకొరకు భేదమట
వొకటో నె(న?) భేదమట వున్నారట నీకు ॥ఏది॥

అదన నిందరిలోన నంతరాత్ముడవట
యెదుట శ్రీవేంకటేశుడవట
యిది యది యననేల యింతయును నీ మహిమ
కదిసి నీ పాదాలే తనుగొంట గాక ॥ఏది॥ (4 - 329)

సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకల మునీంద్రులు పూజించే యీ సాకారమే ప్రమాణము
(2-412)

సకల పూజ విశేషరూపధరా!
సకలార్చన సంవిధ సాధక నిరుప నిరంజన

నీలోనవె అన్నియు నిన్నర్చించిన నిఖిల తృప్తికరము
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిది మతము
అంతరంగుడను నర్చావతారము -
నింతయు శ్రీవేంకటేశ్వరుడు అరిది నీవందన
మొకర్చావతారానగాని - గురుపరంపరనైతే గోట్లాయబో
వరుసనంతరియామిత్వమునవతారములు
పరగ మూడుమూర్తుల ప్రభావము
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై
తిరమైన యాదిదేవ దేవుఁడవు నీవు

ఆగమవిహితంగా స్వామికి జరిపే పదహారు ఉపచారాలను అన్నమయ్య ఒక సంకీర్తనలో ఎంత అందంగా పొందుపరిచాడో చూడండి.

షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥పల్లవి॥

అలరు విశ్వాత్మకున కావాహన మిదె సర్వ-
నిలయున కాసనము నెమ్మి నిదె
అల గంగాజనకున కర్ఘ్యపాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జనమిదె ॥షోడ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదె
సరిశ్రీమంతునకు భూషణము లివె
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిర మిదె కోటి సూర్యతేజునకు దీపము ॥షోడ॥

అమృతమథనునకు నదివో నైవేద్యము
గమి ఁజంద్రనేత్రునకు గప్రవిడెము
అమరినశ్రీవేంకటాద్రిమీఁది దేవునికి
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడ॥ (2-134)

మరియొక ఆగమవిహితమైన షోడశోపచార సంకీర్తనను అన్నమయ్య రచించిన సొగసును గమనించండి.

ఇంతకంటే నేమిసేసే మిదే మా మానసపూజ
సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుఁడవు ॥పల్లవి॥

అంతర్యామివైనమీకు నావాహన మదివో
అంతటా విష్ణుఁడ మీకు నాసనము వేసినది
పంతపుఁకోనేరే మీకుఁ బలుమారు నర్ఘ్యము
చెంతనే గంగాజలముచల్లేమీకుఁ బాద్యము ॥ఇంత॥

జలధు లన్నియు నాచమనియ్యము మీకు
అల యా వరుణజల మిదియే స్నానము
వలనుగా మీమహిమలే వస్త్రాభరణములు
ఆల వేదములే మీకు యజ్ఞోపవీతములు ॥ఇంత॥

ఇరవుగఁ గుబ్బ తొల్లిచ్చినదే మీకు గంధము
ధర మాలాకారునిపూదండలే మీకు పువ్వులు
ఉరుగతి మౌనులహోమమే మీకు ధూపము
తరమైనమీకు రవితేజమే దీపము ॥ఇంత॥

నీనామామృతములే మీకు నైవేద్యతాంబూలములు
పూనిన భక్తి షోడశోపచారములు
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
తానకపుజపములే తగ మీకు నుతులు ॥ఇంత॥ (2 -272)

ఆలయంలో నెలకొని ఉండే పరమాత్మకు, ఆయనకు జరిగే పూజలకు, శరీరంలో నెలకొని వున్న అంతర్యామికి, ఆయనకు జరిగే పూజలకు తులనాత్మకమైన దృష్టితో అన్నమయ్య రచించిన అక్షరార్చనకు ప్రతీక!

నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టిపరమాత్మునికి ॥పల్లవి॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుఁగొన చూపులే ఘనదీపము లట
తనలోపలియంతర్యామికిని ॥నిత్య॥

పలుకే మంత్రమట పాదైననాలికే
కలకలమనుపిడిఘంటయట
నలువైన రుచులే నైవేద్యములట
తలఁపులోపల నున్న దైవమునకు ॥నిత్య॥

గమనచేష్టలే యంగరంగగతియట
తమిగలజీవుఁడే దాసుఁడట
అమరినవూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీ వేంకటరాయనికిని ॥నిత్య॥ (2-82)

ఎందాఁక నిద్ర నీ కిదె తెల్లవారెఁగదె
యిందిరారమణ నీ విటు మేలుకొనవే ||పల్లవి||

కమలనాభుఁడు నీకు గంగాదినదులెల్ల -
నమర మొకమజ్జనం బాయితము సేసె
తమితోడఁ గనకాద్రి తానే సింహాసనము
విమలమై యొప్పె నదే విచ్చేయవే ||ఎందా||

హరి నీకు నజుఁడు పంచాంగంబు వినిపించ
నిరతమగువాకిటను నిలిచినాఁడు
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు
సరవి నాఇత్తపడి సందడించేరు ||ఎందా||

కామధేనువు వచ్చె కనుఁగొనుటకై నీకు
శ్రీమహాదేవి నీచేలాగు కదివో
యీమహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె
కామించి యన్ని యునుఁ గైకొంటి విపుడు ||ఎందా||

(2-436)

## దేవతాంతరము

ఆగమాలు ఏ దేవతామూర్తిని ప్రధానంగా, చేసుకొని ఆలయ నిర్మాణము అర్చన ఉత్సవాదులు గురించి చెపుతున్నాయో, ఆ దేవతా విగ్రహాన్ని మాత్రమే ప్రధానంగా అన్నివిషయాలలో స్వీక రించాలి. ఒక దేవత యొక్క రూపాంతరాలు ఆలయంలో ఉన్నప్పటికీ వాటికి ప్రాధాన్యం ఉండదు.ఇక ఇతరదేవతార్చనకు ప్రాముఖ్యం ఇవ్వకూడదు. కాలక్రమంలో ఈ భావన మతవిషయంలో రూఢియైంది. ఒక దేవతా సంప్రదాయప్రవర్తకులు ఇతర దేవతలను ఆరాధించకూడదు. దీనినే దేవతాంతర పదబంధంతో అనేక విధాలుగా వ్యాఖ్యానించడం జరిగింది.

దేవతాంతర వన్నిత్యం శబ్దాదీనపి కుత్సయన్
విష్ణుప్రాప్తి ఫలకాంక్షీ భక్త్యుపాయో హి వైష్ణవః

విష్ణుప్రాప్తి అనే ఫలంకోరి భక్తిని ఉపాయంగా తీసుకొని అన్య దేవతలను అన్య ప్రయోజనాలను త్యజించి శబ్దాది విషయకములను గ్రహించినవాడే వైష్ణవుడు. అన్నమయ్య సంకీర్తనలలో కొన్ని ఉదాహరణలు గమనించండి.

అంతరాత్మ శ్రీవేంకటేశ్వరుడు అన్యము భజించ జోటేది
యింతట నమ్మక దేవతాంతరము లేఁటేఁటివోమరి చెప్పుదురు...

శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు

అంతయు విష్ణుమయంబట మరి దేవ
తాంతరములు గలవన నేలా
భ్రాంతిఁబొంది యీ భావము భావించి
నంతనే పుణ్యాలవుట దప్పదుగాన . . . .

అన్నమయ్య దేవతాంతర విషయంలో కరుడుగట్టిన వీరవైష్ణవుడని కొంత మంది అభిప్రాయము. ఇది సమంజసముకాదు. విశ్వమంతా వేంకటేశ్వరుడనే విశ్వాసం గలిగిన భాగవతోత్తముడు అన్నమయ్య.

సుప్రభాతసేవ

ఆలయంలో జరిగే మొదటి సేవ సుప్రభాతం. రాత్రివేళ శయనించిన స్వామివారిని శయన మంటపంలో వేంచేపుచేస్తారు. ప్రాతః కాలంలో నిద్రపోతున్న స్వామివారిని మేలు కొలిపి నివేదనలు జరుపుతారు.

శ్లో॥ ఉత్థాయోషసిసర్వవాద్య నిచయం సంఘోషయన్ సుస్వరం
శయ్యాగేహ బహిఃకవాట నికటే స్తోత్రైర్హరింబోధయేత్....

అని ఆగమవచనం. సుప్రభాతసేవ తిరుమలలో విలక్షణంగా ఉంటుంది. మంత్ర విహితమైన ఈ ప్రక్రియకు కాలక్రమంలో పద్యగద్యాలు, స్తోత్రాలు అనుసంధానం చేయబడ్డాయి. అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తలలోని ఎన్నెన్నో విశేషాలు మనకు తెలియవస్తున్నాయి.

సరగున యోగనిద్ర చాలించి లోకమెల్ల
కరుణించదలచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్య, డాయెమించి
విరివి నాలవట్టాలు విసరరే సతులు . . . .

భోగిశయనమును బుసకొట్టెడిని
యోగనిద్రపాయును మేల్కొనవే . . . .

కన్నులు దెరవక కమలబాంధవుడు
వెన్నెల రేణువు వెలయదిదే
అన్నువమలసీనరుణోదయమిదే
మిన్నక నీవిటు మేలుకొనవే
తెరవగు రెప్పలఁదెల్లవారవలె
తెరవకచీఁకటిదీరదిదే
తెరగు వేంకటాధిప నీవెలుగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే .. . . .

ఎందాక నిద్రనీకిది తెల్లవారగదె
యిందిరారమణ నీవిటు మేలుకొనవె. . . .
మిన్నకవేసాలు మాని మేలుకోవయ్యా
సన్నలయోగనిద్ర చాలు మేలుకోవయ్యా
మేదిని జీవులగావ మేలుకోవయ్యా
నీదయే మాకెల్లరక్ష నిద్రమేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ నేడు మేలుకోవయ్యా

## పవళింపు సేవ

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరిగే ఆగమ ఉపచార ప్రక్రియలలో చివరిది శయనోత్సవము. వీనినే పవళింపు సేవ అని అంటారు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి జీవస్థానం దగ్గర ఉన్న భోగ శ్రీనివాసమూర్తిని శయనబేరముగా భావించి తగు ఉపచార క్రియాదులు అర్చకస్వాములు గావిస్తారు. అన్నమయ్య అనేక విధాలుగా నాటి పవళింపు సేవను వర్ణించాడు.

వేఁగుదాఁక జిత్తగించి విద్దెలెల్ల నాదరించి
బాగుగా గృపారసము పంచిపంచి
యేగతి (బవళించెనో యెట్ల భోగించెనో
యోగేంద్రవరదుని నూచరే వుయ్యాలను

వాలుఁగన్నుల రెప్పలవడదాఁకి తనుతావి
చాలుకొన నూర్పుకలు చల్లి చల్లి
నీలవర్ణపు గుణమునెరపుచు నొకయింత
కాలము కన్నుల దీప్పి గప్పరే దోమతెర

ఈ శయనోత్సవము జరుపటం వలన కలిగే ప్రయోజనం ఈ విధంగా ఉంటుంది.

ఏవం శాయననుత్సవంచ విభవాద్యః కారయేద్భక్తిమాన్
సో భుక్త్వా భువి మండలాధిపపదం పుత్రైః ప్రపౌత్రైరార్వ్వ దనేనేర్యుతః
పశ్చాన్నాక ముపేత్య భోగమతులం భోగాననేకాన్వ్రజన్
పశ్చాదచ్యుత రూపమేతి విమలం బ్రహ్మాదిభిర్దుర్లభమ్

## శుక్రవార తిరుమంజనం

తిరుమల వారోత్సవాలలో శుక్రవారంనాడు స్వామివారికి జరిగే తిరుమంజనం విశేషమైనది. ఆగమ సంప్రదాయ ప్రకారం శుక్రవారం నాడు జరిగే స్నపనవలన సర్వసంపదలు లభిస్తాయి. వివిధ సందర్భా లలో అభిషేకం చేయవలసిన విధానాలను ఆగమగ్రంథాలు తెలియ జేస్తున్నాయి. ఆగము- రామానుజాచార్య సంప్రదాయ సమ్మేళనం ఈ శుక్రవార అభిషేకంలోని వైశిష్ట్యము.

శ్లో॥ "కిం చలత్యభిషేకస్తు వాసరే భార్గవే హరేః
సాన్నిధ్యకారీ సతతం సర్వ సంపత్ప్రదాయకః"

మదన జనకునికి మజ్జనపువేళ
పదివేలుభాగములు పరగీనదె
సందడి విడువుము సాసముఖా

మందరధరునకు మజ్జనవేళా
వేదఘోషణము విడువకసేయుదు
ఆదిమునులు నిత్యాధికులు

శ్రీదేవుండగు శ్రీ వేంకటపతి
ఆదరమున సిరులందీవాఁడె
తిరుమజ్జనపువేళ దేవునికినిదివో
పరగనారదాదులు పాడరో యిందరును

వున్నతి నలమేల్మంగ నురమున నుంచువేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలెనుండెను

## ధనుర్మాసం

మార్గశిర పుష్యమాసాలలో పవిత్రమైన ప్రఖ్యాతమైన ధనుర్మాసం వస్తుంది. ధనుర్మాసంలో తిరుప్పావై గోదావైభవం మనకుతెలుసు. ఇక మార్గశిరమాసం అర్చనా నివేదనలు గురించి ఆగమం అనేక విషయాలను అందజేస్తుంది.

అస్మిన్మాసే నిత్య గౌల్యంమౌద్గికం వా హవర్నివేదయేదితి కేచిత్
ధనుర్మాసే చైకాదశ్యాం విశేషతః వేదానధ్యాపయేత్సమ్యగ్గానై
నృత్యాదిభిః సహ అన్యత్ర చ విశేషేణ కాలపేక్షం విన్నైవచ

తిరుమలలో ఆగమసంప్రదాయం - గోదాసంప్రదాయం కలసిన సన్నివేశం హృద్యమైనది. ఈ ధనుర్మాసంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పాశురపఠనం ఉంటుంది. అన్నమయ్య సంకీర్తనలలో ఆగమ - వైష్ణవ విశేషాలు మనకు తెలియ వస్తాయి.

ఏమినిద్దిరించేవు యెందాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లగాచుకున్నా రిదివో

తోడనేగంధాక్షతలు ధూపదీపాలివిగో
కూడిన విప్రుల వేదఘోషణలివే

వాడుదేరఁ బూజించవలె (గమ్మబువ్వులివె
వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా . . . .

ముదమలర కాలముల మీరిటు మోసపోక
హృదయమలర భజింపరో మీ
రిటు ధనుర్మాసముల విధులన్ ||పల్లవి||

వేగనాలుగు ఘడియలనఁగా
వేవేద్యులు లేచి సరగున
నాగమోక్తవిధులను తమదేహానుగుణములుగా
వేగమున సంధ్యాదులొగిఁగా
వించి విమలాంబోధిశయనుని
బాగుగాఁ బూజించరో యెడ
పక ధనుర్మాసముల విధులనె ఘనులు. ||ముద||

(అ.సం. పుట 391, 4-45)

★ ★ ★

యం.గోవిందస్వామి నాయుడు

# అన్నమయ్య సంకీర్తనలపై భగవద్గీత ప్రభావం

తొలి తెలుగు వాగ్గేయకారుడుగా ప్రసిద్ధిగాంచిన సంకీర్తనచార్యుడు తాళ్లపాక అన్నమాచార్యులు (క్రీ.శ. 1408 - 1503). విష్ణుభక్తి ప్రచారం, ఆంధ్ర సారస్వతసేవ అపారంగా చేసిన భక్తవరేణ్యుడీయన. అల్ప పరిశ్రమతో అనల్పమయిన ఫలాన్ని సాధింప గలిగిన ప్రతిభాశాలి అన్నమయ్య. ఉపనిషత్, శాస్త్ర, పురాణాదులీయనకు కరతలా మలకాలు. ఉపనిషత్తుల సారాంశమయిన భగవద్గీతను సయితం అన్నమయ్య ఆపోశనం పట్టినట్టు విదితమవుతుంది.

భగవద్గీత గీతోపనిషత్తని కూడా ప్రసిద్ధమయింది. వేదవిజ్ఞాన సారమంతా ఇందుండటం వల్ల ఇది వేద వాఙ్మయంలోని అతి ప్రముఖ మయిన ఉపనిషత్తుగా పరిగణింపబడుతూఉంది. అందుకే గీత ఒక గొప్ప ధార్మిక గ్రంథమయింది. ఈశ్వరుడు, జీవుడు, ప్రకృతి, కాలం, కర్మం వంటి మూల సత్యాలను భగవద్గీత మనకు బోధిస్తుంది. భౌతిక జీవితానికి సంబంధించిన అజ్ఞానం నుంచి మానవ జాతిని ఉద్ధరించడమే భగవద్గీత ప్రయోజనం. ఇంతటి ప్రయోజనం కలిగింది కాబట్టే భగవద్గీత అన్నమయ్యను బాగా ఆకర్షించింది. అన్నమయ్య అధ్యాత్మసంకీర్తనల మీద గల భగవద్గీత ప్రభావాన్ని గురించి పరిచయం చేయడమే ప్రస్తుత వ్యాసఉద్దేశం.

అన్నమయ్య అక్కకడక్కడ భగవద్గీతను ప్రస్తావించడంతోబాటు అందలి శ్లోక భావాలను కొన్నిటిని పరోక్షంగా తెలియజేస్తూ మరికొన్ని శ్లోకాలను యథాతథంగా అనువదిస్తూ రచన చేసినట్టు బోధపడుతుంది.

## 1. భగవద్గీత ప్రస్తావన

అన్నమయ్యకు విష్ణువు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు ఒక్కరే. కృష్ణు డర్జునుని కుపదేశించిన భగవద్గీతను అన్నమయ్య బాగా జీర్ణింప జేసుకొన్నాడు. అనేకచోట్ల గీతను ప్రస్తావించాడు. అర్జునునికి రణరంగంలో కృష్ణుడు నిగమాన్ని, నియమాన్ని, బోధించినట్టు ఒక కీర్తనలో పేర్కొన్నాడు. భగవద్గీత ఆవిర్భావం, దాని ప్రాముఖ్యం పరోక్షంగా ఈ కీర్తనలో ప్రస్తావించబడ్డాయి.

బలువగు ᳚దన రూపము చూపెన్
　　కలదింతయు᳚దన ఘనతెఱిగించెన్ ॥పల్లవి॥

పాండవ రక్షణ పరుడై నరునకు
　　నండనే తెలిపె మహామహిమ
　　దండి విడిచి తన దయతో నర్జును᳚
　　డుండ᳚గ మగటిమి నొడ᳚బడ బలికె ॥బలు॥

మగుడ᳚గ కులధర్మములు᳚ బుణ్యములు
　　తెగి పార్థున కుపదేశించెన్
　　నగుచు నతనితో నానాగతులను
　　నిగమము నియమము నిజమెరిగించెన్ ॥బలు॥ (1- 295)

కృష్ణుడర్జునునికి ఆనతిచ్చిన అంశం శ్రీమద్భగవద్గీతే. దాన్నివిని అర్జునుడు తనను భజించ వలసిందిగా కృష్ణుడు తన వివేకాన్ని ఉద్బోధించాడు. ఇక్కడ ఆ విషయం స్పష్టంగా గోచరించడం గమనార్హం.

అని యానతిచ్చె ᳚గృష్ణుడర్జునితో
విని యాతని భజించు వివేకమా ॥పల్లవి॥ (2-438)

మరొక కీర్తనలో భగవద్గీత పేరును అన్నమయ్య ప్రత్యక్షంగానే ప్రస్తావించాడు. దాని ద్వారా ముక్తి పొందుమని వేంకటేశ్వర భక్తులకు విజ్ఞప్తి చేశాడు.

యిది భగవద్గీతార్థ మిది యర్జునునితోను
యెదుటనే వుపదేశ మిచ్చె (గృష్ణుడు
వెదకి వినరో శ్రీవేంకటేశు దాసులాల
బ్రదుకు(ద్రోవ మనకు పాటించి చేకొనరో (2 - 186)

## 2. పరోక్ష ప్రభావం

భగవద్గీతలోని అర్థాన్ని, పరమార్థాన్ని అన్నమయ్య పలుకీర్తనలలో సందర్భాను సారంగా తెలియజేసి ఉండటం గమనార్హం. అరిషడ్వర్గం, సమదర్శనం, భగవంతుని సర్వాధిక్యత వంటి అంశాలెన్నో అన్న మయ్య సంకీర్తనల్లో కన్పిస్తాయి.

### 2.1. అరిషడ్వర్గం

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరూ మానవునికి అంతశ్శత్రువులు. వీటినే అరిషడ్వర్గమని వ్యవహరిస్తారు. ఈ అరిషడ్వర్గాన్ని జయించ వలసిన ఆవశ్యకతను గురించి భాగవతం తెలియజేసింది. ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్య కశిపునితో ఆరుగురు అంతశ్శత్రుల్ని జయించవలసిన ఆవశ్యకతనుగురించి చక్కగా వివరించాడు.

లోకములన్నియున్ గడియలోన జయించినవా(డ వింద్రియా
నీకము( జిత్తముంగెలువ నేరవు నిన్ను నిబద్ధు(జేయు నీ
భీకర శత్రువు లార్వుర(బ్రభిన్నుల, జేసిన బ్రాణి కోటిలో
నీకు విరోధి లేడొకడు నేర్పున( జూడుము దానవేశ్వరా!

(శ్రీమహా భాగవతం 7-267)

భగవద్గీత అనేకసార్లు అనేకచోట్ల ఈ అరిషడ్వర్గాన్ని గురించి ప్రస్తావించింది. అరిషడ్వర్గానికి మూలమేమిటో కూడా తెలియజేసింది. కామ క్రోధాలెంత ప్రధానమయినవో కృష్ణుడర్జునునికి తెలియజేయడం విశేషం.

ధ్యాయతో విషయాన్ పుంసః, సఙ్గస్తేషూపజాయతే
సఙ్గాత్సఞ్జాయతే కామః, కామాత్క్రోధోఽభిజాయతే

(భగవద్గీత 2-62)

(ఇంద్రియార్థములను గురించి ఆలోచించునపుడు మానవునికి వానిపై ఆసక్తి కలుగును. అట్టి ఆసక్తి నుండి కామము జనించును. కామము నుండి కోపము ఉప్పతిల్లును)

కామఏషక్రోధ ఏష, రజోగుణ సముద్భవః
మహాశనో మహా పాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్

(భగవద్గీత 3-37)

(రజోగుణ సంపర్కము వలన పుట్టిన కామమే కోపముగ పరిణమించును. అది ఈ ప్రపంచమునకు సర్వమును మింగునట్టియు, పాపముతో కూడి నట్టియు అయిన గొప్ప శత్రువు)

కామక్రోధలోభాలు మూడూ నరకద్వారత్రయమని కూడా కృష్ణుడు పేర్కొని ఉండటం గమనార్హం. (భగవద్గీత 16-21)

అన్నమయ్య చిన్న చిన్న మాటలతో అంతశ్శత్రువు లార్గురీ్ని ప్రస్తావిస్తూ ఆ శత్రువుల వల్ల కలిగే ప్రమాదాన్ని సూక్ష్మంగా తెలియ జేశాడు.

మాలతనమువంటిది మతిఁదగులుఁగామము
ఆలరి ముట్టువంటిది అంటు ఁగ్రోధము
కేల నొదిగించు నెంగిలి వంటిది లోభము
వాలాయించి నెందుండైనా వచ్చును లోకులకు ॥ఎట్టు॥

చుట్టి మద్యము వంటిది చొక్కించు మోహము
వట్టి మాంసము వంటిది వయో మదము
పుట్టిన భ్రమ వంటిది పొదిగిన మచ్చరము
వుట్టిపడి నోరూరించు నూరకే ప్రాణులను ॥ఎట్టు॥

(2- 211)

ఇంకా కోపాన్ని గురించి అన్నమయ్య పలుచోట్ల ప్రస్తావించాడు. (2-474, 3-414, 4-196, 4-351 కీర్తనలు)

## 2.2. సమదర్శనం

మానవుడు సమదర్శిగా ఉండాలనీ, ఆత్మజ్ఞాని కావడం ఆవశ్యకమనీ అప్పుడే అతడు పండితశబ్ద వాచ్యుడవుతాడనీ భగవద్గీత ఉద్ఘోషించింది. సర్వేశ్వరుడు విద్యావినయ సంపన్నుడయిన బ్రాహ్మణునిలోనూ, గోవులోనూ, ఏనుగులోనూ, కుక్కలోనూ, చండాలునిలోనూ సమానంగానే ఉన్నాడని గ్రహించి తదను గుణంగా వ్యక్తులు వ్యవహరించాలని గీతాచార్యుని అభిమతం.

విద్యావినయ సమ్పన్నే, బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకేచ, పణ్డితాః సమదర్శినః (భగవద్గీత 5-18)

(నిజమగు పండితుడగు జ్ఞాని విద్యా వినయ సంపదగలుగు బ్రాహ్మణుని యందును, కుక్కమాంసము తిను చండాలుని యందును, గోవు, కుక్క, ఏనుగు మొదలగు జంతువుల యందును సమదృష్టి గలిగి యుండును.)

సంకీర్తనాచార్యుడు ఒక కీర్తనలో సమదర్శిత్వాన్ని చాటి చెప్పాడు. భగవద్గీత శ్లోకంలో చోటు చేసుకొన్న శబ్దాలను కొన్నిటిని ఆయన అట్లే వాడుకోవడం గమనార్హం.

తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥పల్లవి॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పర బ్రహ్మ మొకటే ॥తంద॥

కందువగు హీనాధికములిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తంద॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటె ॥తంద॥

అనుగు దేవతలకును అలకామ సుఖమొకటే
ఘనకీట పశువులకు కామసుఖమొకటే
దినమహో రాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుఁబేదకును వొక్కటే అవియు ॥తంద॥

కొరలి శిష్టాన్నములు గొను నాకలొకటే
తిరుగు దుష్టాన్నములు దిను నాకలొకటే
పరగ దుర్గంధములపై వాయువు నొకటే
వరుసఁ బరిమళముపై వాయువు నొకటే ॥తంద॥

కడగి యేనుగు మీద గాయు యెండొకటే
పుడమి శునకము మీద బొలయు నెండొకటే
కడు బుణ్యులను పాపకర్ములను సరిఁగావ
జడియు శ్రీ వేంకటేశ్వరునామమొకటే ॥తంద॥ ( 2 -385)

## 2.3. భగవంతుని సర్వాధిక్యత

ఆది మధ్యాంత రహితుడయిన విష్ణువే జీవుల ఆది మధ్యాంతాదిగా భాసిస్తున్నాడని భగవద్గీత తెలియజేసింది. భగవంతుడు తన విభూతిని అర్జునునికి తెలియజేస్తూ ప్రాణులందరి హృదయాల్లోనూ తానున్నాననీ, ప్రాణుల ఆది మధ్యాంతాలు తానేననీ చెప్పాడు.

అహమాత్మా గుడాకేశ, సర్వ భూతాశయ స్థితః
అహమాదిశ్చ మధ్యం చ, భూతానామన్త ఏవ చ

(భగవద్గీత 10-20)

(అర్జునా! సర్వభూతముల హృదయములందును నేనంతరాత్మనై యున్నాను. భూతముల కన్నింటికిని ఆది మధ్యావసానములు నేనే)

హరి సంకీర్తనాచార్యుడు కూడా విష్ణువు ప్రాణుల ఆది, మధ్య, తుదగా మసలుకుంటున్నాడని ఒక కీర్తనా ఖండంలో తెలియజేశాడు.

ఎంత చదివి చూచిన నీతడే ఘనము గాక
యింతయు నేలేటి దైవమిక వేరే కలరా ॥పల్లవి॥

మొదల జగములకు మూలమైన వాడు
తుద ప్రళయము నాడు తోచేవాడు
కదిసి నడుమ నిండి కలిగి వుండెడివాడు
మదన గురుడే కాక మతి వేరే కలరా ॥ఎంత॥ ( 2-98)

భగవద్గీత 11వ అధ్యాయం విశ్వరూప సందర్శనయోగంలో దాదాపు జగత్తులోని అన్నిఅంశాలు విష్ణుదేవుని శరీరంలోనే ఉన్నా యని చెప్పబడింది. ఈ అధ్యాయ సారాంశాన్ని ఒక చిన్న పాటలో ఆవిష్కరించాడు అన్నమయ్య.

నీ వొక్కఁడవే సర్వాధారము నిన్నే యెరిగిన నన్నియు నెఱుగుట
భావించి యింతయు ఁదెలియఁగ వలసిన బ్రహ్మవేత్తలకు నిది దెరువు
॥పల్లవి॥

నీయందె బ్రహ్మయు రుద్రుడు నింద్రుడు నీయందె దిక్పాలకులు
నీయందె మనువులు వసువులు రుషులు నీయందె విశ్వాఖ్యదేవతలు
నీయందె వురగులు యక్ష రాక్షసులు నీయందె గరుడ గంధర్వులు
నీయందె పితరలు సిద్ధ సాధ్యులు నీయందె ద్వాదశాదిత్యులు
॥నీవొ॥

నీవలననె కిన్నెర కింపురుషులు నీవలననె విద్యాధరులు
నీవలననె యచ్చరలు చారణులు నీవలననె నక్షత్రములు
నీవలననె గ్రహములు చంద్రుడును నీవలన(నె) నభోంతరిక్షములు
నీవలననె జలధులు పవమానుడు నీవలననె గిరులును భూమియును
॥నీవొ॥

నీలోననె నదులును నగ్నియు నీలోననె సచరాచరములును
నీలోననె వేదశాస్త్రము మొదలుగ నిఖిల శబ్దమయము
నీలోననె అన్నియు నిన్నర్పించిన నిఖిల తృప్తికరము
శ్రీ లలనాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిది మతము ॥నీవొ॥
(3 -222)

భగవద్గీత భావాలను పరోక్షంగా అన్నమయ్య ప్రస్తావించిన తీరును గురించి ఇంతవరకు పరిశీలించడం జరిగింది. ఇక ప్రత్యక్ష ప్రభావాన్ని గురించి పరిశీలిద్దాం.

### 3. ప్రత్యక్ష ప్రభావం

అన్నమయ్య భగవద్గీత శ్లోకాలను యథాతథానువాద మనిపించే విధంగా ఆయా భావాలను తీసుకొని తన కీర్తనలలో పొందు పరచాడు. వీటిలో భగవద్గీత మీద అన్నమయ్యకు గల అధికారం అవగత మవుతుంది. మచ్చుకు కొన్ని.

### 3.1 ఆత్మ ఉత్కృష్టత

దేహాలన్నిటిలోనూ ఉండే ఆత్మ (దేహి) నిత్యుడు. దేహాలు అనిత్యాలు. భగవద్గీత ఈ విషయాన్ని స్పష్టపరచింది.

దేహీ నిత్యమవధ్యో2యం, దేహే సర్వస్య భారత
తస్మాత్ సర్వాణి భూతాని, నత్వం శోచితు మర్హసి
(భగవద్గీత 2-30)

(అర్జునా! దేహమునందు వసించు ఆత్మ ఎప్పుడును చంపబడదు. అందుచే నీవు ఏ జీవుని కొరకును దుఃఖింపవలసిన అవసరములేదు)

చినిగి పోయిన బట్టల్ని విడిచిపెట్టి కొత్త బట్టల్ని ఎలా ధరిస్తున్నామో అదే విధంగా ప్రాణి తన జీర్ణదేహాన్ని విడిచిపెట్టి కొత్త దేహాన్ని ధరిస్తాడని భగవద్గీత చెబుతుంది.

వాసాంసి జీర్ణాని యథా విహాయ , నవాని గృహ్ణాతి నరో2పరాణి
తథాశరీరాణి విహాయ జీర్ణా , న్యన్యాని సంయాతి నవాని దేహీ
(భగవద్గీత 2 -22)

(మానవుడు పాతబడిన దుస్తులను విడిచి కొత్తవానిని ధరించినట్లు ఆత్మ కూడ నిష్ప్రయోజనములయిన దేహములను విడిచి కొత్తదేహములను గ్రహించును)

ఆత్మను శస్త్రాలు ఛేదింప జాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఎండింపజాలదు అని భగవద్గీత తెలియజేసింది.

నైనం ఛిన్దన్తి శస్త్రాణి , నైనం దహతి పావకః
న చైనం క్లేదయన్త్యాపో , న శోషయతి మారుతః
(భగవద్గీత 2 -23)

(ఈ ఆత్మను ఆయుధములు ఖండింపజాలవు. అగ్ని దహింప జాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఎండింపజాలదు).

దేహి నిత్యుడు, దేహాలనిత్యాలన్న సంగతిని స్పష్టంచేసే పై శ్లోకాలసారాంశాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో పొందుపరిచడం విశేషం.

దేహి నిత్యుడు దేహములనిత్యాలు
యీహల నా మనసా యిది మరువకుమీ ॥పల్లవి॥

గుదిఁబాత చీర మాని కొత్త చీర గట్టినట్టు
ముది మేను మాని దేహి మొగి గొత్త మేను మోచు
అదన జంపగలేవు ఆయుధము లీతని
గదిసి యగ్నియు నీరు గాలియు ఁజంపగలేవు ॥దేహి॥

యీతడు నరకు వడ డీత డగ్నిఁగాలడు
యీతడు నీటమునుగ డీతడు గాలి బోడు

చేతనుడై సర్వగతుడౌ చెలియించదేమిటను
యీతల ననాది యీత డిరవు గదలడు ॥దేహి॥

(2-419)

## 3.2. భగవంతుని జగద్రక్షణ

విష్ణువు భూభారాన్ని వహిస్తూ ప్రాణులను, చంద్రుడయి సస్యాలను సంరక్షిస్తున్నట్టు భగవద్గీత పేర్కొంది.

గామావిశ్య చ భూతాని, ధార యామ్యహ మోజసా
పుష్ణామి చౌషధీః, సోమో భూత్వా రసాత్మకః

(భగవద్గీత 15 -13)

(నేను పృథ్వియందు ప్రవేశించి సమస్త భూతజాలమును నా దివ్యశక్తి చేత భరించు చున్నాను. అమృతమయుడగు చంద్రరూపమున ఓషధి వనస్పతులను నా కిరణముల ద్వారా పోషించుచున్నాను.)

విష్ణువే అందరి ఉదరంలోనూ జఠరాగ్నిగా ఉంటూ చతుర్విధ అన్నాలను జీర్ణింపజేస్తున్నాడని భగవద్గీత తెలియజేసింది.

అహం వైశ్వానరో భూత్వా , ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః , పచామ్యన్నం చతుర్విధమ్

(భగవద్గీత 15 - 14)

(నేను జీవరాశుల దేహములయందు జఠరాగ్ని రూపమున నుండి ప్రాణాపాన వాయువులతో గూడి అవి భుజించు నాలుగు రకముల ఆహారములను జీర్ణమొనరింతును).

మరుపు, చురుకుదనం కూడా భగవంతుడేనని, సర్వప్రాణుల హృదయాల్లోనూ సంచరించే వాడతడే నని కూడా భగవద్గీత బోధపరిచింది.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో, మత్తః స్మృతిర్జ్ఞానమ పోహనం చ
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో, వేదాన్త కృద్వేద విదేవచాహమ్

(భగవద్గీత 15-15)

(సర్వప్రాణుల హృద్గుహల యందు నేనంతరాత్మగా నున్నాను. నావలననే వాటికి జ్ఞాపక శక్తియును, వస్తు జ్ఞానమును, సరియగు విచారణయు కలుగు చున్నది. వేదవేద్యడను నేనే. వేదాంత కర్తను నేనే. వేదముల యర్థమును తెలిసికొను వాడను నేనే).

ఈ అంశాలన్నిటినీ అన్నమయ్య స్వామి చెప్పిన విధంగా తెలియ జేశాడు.

అని యానతిచ్చె గృష్ణుడర్జునునితో
విని యాతని భజించు వివేకమా ॥పల్లవి॥

భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల
దీమసాననే మోచేటి దేవుడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుడనై
తేమల బండించేటి దేవుడ నేను ॥అని॥

దీపనాగ్నినై జీవ దేహముల యన్నములు
తీపుల నరగించేటి దేవుడ నేను
యేపున నిందరిలోని హృదయములోన నుందు
దీపింతు దలపు మరపై దేవుడ నేను ॥అని॥

వేదము లన్నిటిచేతా వేదాంత వేత్తల చేతా
ఆది నే నెరగ దగిన యాదేవుడను
శ్రీదేవితో గూడి శ్రీవేంకటాద్రి మీద
పాదైన దేవుడను భావించనేను ॥అని॥ ( 2- 438)

## ముగింపు

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర భక్తుడు. పరమ వైష్ణవుడు. వైష్ణవమన్నా, వైష్ణవ తత్వ మన్నా ఎనలేని అభిమానం కలవాడు. హైందవులకు అందులోనూ వైష్ణవులకు అత్యంత ప్రీతిపాత్రమైన భగవద్గీత పట్ల మిక్కిలి భక్తి ప్రపత్తులు గలవాడు. శరణాగతుడు కాబట్టి భగవద్గీత ప్రతిపాదించిన

శరణాగతి తత్వాన్ని లెస్సగా జీర్ణించు కొన్నవాడు. అందువల్ల నాలాయిర దివ్యప్రబంధంలాగే భగవద్గీత కూడా అన్నమయ్యను బాగా ప్రభావితం చేసింది. ఈ ప్రభావం మూడు విధాలుగా అన్నమయ్య సంకీర్తనల్లో కనిపిస్తుంది. మొదటిది భగవద్గీతను నామమాత్రంగా పేర్కొని పరోక్షంగా ప్రస్తావించడం. రెండవది భగవద్గీతలో అక్కడక్కడ చోటు చేసుకొన్న భావాలకు తన సంకీర్తనల్లో సముచిత స్థానం కల్పించడం. ఇక మూడవది భగవద్గీతలోని శ్లోకాలను కొన్నిటిని యథాతథంగా అనువదిస్తూ కీర్తనల్ని రచించడం. వ్యాసుని శ్లోకాలను తలపించే విధంగా అన్నమయ్య పదప్రయోగం కూడా ఇక్కడ అమరి ఉండటం మరింత చెప్పుకోదగ్గ అంశం.

## ఉపయుక్త రచనలు


1. అన్నమాచార్యులు, తాళ్లపాక - అధ్యాత్మ సంకీర్తనలు (సం 1,2,3,4) అన్నమాచార్య ప్రాజెక్టు తి.తి.దేవస్థానములు, తిరుపతి.
2. పెద తిరుమలాచార్యులు, తాళ్లపాక - శ్రీ భగవద్గీత (అనువాదం) శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
3. పోతన, బమ్మెర - శ్రీమహాభాగవతము (సం.2) తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబద్ - 500004.
4. వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీతా (వ్యాఖ్యాత శ్రీశిష్టా సుబ్బారావు) తి.తి.దేవస్థానం, తిరుపతి.
5. ఆచార్య శ్రీహరి, రవ్వా - అన్నమయ్య భాషావైభవం, వరరుచి పబ్లికేషన్స్, హైదరాబాద్.


★ ★ ★

పి.వి.సుబ్బారావు

# అన్నమయ్య సంకీర్తనలు - అద్వైత సంప్రదాయధోరణి

అన్నమాచార్య వంశంలోని పూర్వీకులందరూ అద్వైత సంప్ర దాయానికి చెందిన వారు. అందువల్ల అన్నమయ్య తొలుత స్మార్తుడు. పిదప విష్ణునామక యతి గురువు ద్వారా పంచసంస్కారాలు పొంది వైష్ణవ మతదీక్షను స్వీకరించాడని తాళ్లపాక చిన్నన్న అన్నమయ్య జీవితచరిత్రలో పేర్కొన్నాడు. "తాపఃపుండ్రం తథానామ మంత్రో యాగశ్చ పంచమః అమీ పరమ సంస్కారా పారమైకాంత్య హేతవః"[1]

1. తాపము : రెండు భుజాలపై శంఖచక్ర ముద్రాధారణము.
2. పుండ్రము : ముఖఊర్ధ్వ పుండ్రముతోపాటు శరీరభాగాలన్నిటిపై ద్వాదశ ఊర్ధ్వ పుండ్రధారణ దీక్షాధారులకు అవశ్యం.
3. నామము : తల్లిదండ్రులు పెట్టిన పేరుగాక గురుసూచన మేరకు దీక్షానామము ధరింతురు.
4. మంత్రము : ప్రధానమంత్రమైన "ఓంనమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రాన్ని అనునిత్యం జపించడం.
5. యాగము : భగవదారాధన పద్ధతి ఉపదేశం.

ఈ పంచసంస్కారాలు భగవంతునికి చాలా సన్నిహితులగుటకు కారణాలని వైష్ణవ సిద్ధాంతం. విశిష్టాద్వైతంలో అదనంగా పంచ సంస్కారాలతో పాటు శరణాగతి, ప్రపత్తులు కూడ ముఖ్యమైనవే. 'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణంమమ' అనే విశ్వాసంతో దేవుణ్ణి ఆశ్రయించడం శరణాగతి. జీవుడు దేవుడికి తన సర్వస్వాన్ని సమర్పించుకోవడం ప్రపత్తి. విశిష్టాద్వైతిగా మారిన పిదప శరణాగతి, ప్రపత్తులను నిష్ఠతో ఆచరించేవాడు.

అన్నమయ్య వైష్ణవ ప్రబోధాలైన ఆళ్వారుల, ఆచార్యుల రచనలను ఆపోశనపట్టాడు. శ్రీరామానుజుల వారి శ్రీభాష్య, గీతాభాష్యాలు అన్నమయ్యను గొప్పగా ప్రభావితం చేశాయి. అందుకే ఆయన అధ్యాత్మిక సంకీర్తనలు వైష్ణవ భక్తి స్ఫోరకాలుగా, విశిష్టాద్వైత లక్ష్యాలుగా విలసిల్లు తున్నాయి. ఆనాటి సమాజంలో ఉన్న భక్త్యావేశ ప్రభావంతో భూషణలే గాక పరమత దూషణులు కూడ ఆయన సంకీర్తనలలో సాక్షాత్కరిస్తాయి. అన్నమయ్యకు జన్మతః సంక్ర మించిన అద్వైతసంప్రదాయ ప్రభావం ఆయన సంకీర్తనల్లో అక్కడక్కడ కనిపిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో అద్వైతసంప్రదాయ ధోరణిని వివరించడమే ప్రస్తుత ప్రసంగన్యాస ముఖ్యోద్దేశ్యం.

## అద్వైత సంప్రదాయతత్త్వం

ఆచార్య శంకరులు అద్వైత తత్త్వాన్ని శంకరభాష్యంలో సవివరంగా పేర్కొన్నారు. జీవాత్మ పర మాత్మలకు భేదంలేదని, సృష్టిలో సకల జీవాత్మల్లో పరమాత్మ అంశం ఉందని చెప్పేది అద్వైత సిద్ధాంతం. శంకరులకన్నా పూర్వమే అద్వైతసిద్ధాంతం ఉంది. వేదోపనిషత్తుల్లో, బ్రహ్మ సూత్రాల్లో భగవద్గీతలో "విశ్వము యొక్క మూలతత్త్వ మొక్కటే నను భావము చాలాచోట్ల ప్రస్తావించబడింది. ఆ మూలతత్త్వమే చైతన్యము లేదా విజ్ఞానము. కనుక యావద్విశ్వము దానితో అనన్యమని చెప్పిన అద్వైతమగునని" వేదాంతుల అభిప్రాయం. సూతసంహిత శివాద్వైత సంప్రదాయాన్ని పేర్కొంది. సమంత భద్రుడనే జైనుడు 'ఆప్తమీమాంస'లో అద్వైతమతాన్ని ఉల్లేఖించాడు. శంకరుని గురువైన గౌడ పాదుడు (క్రీ.శ.550) గొప్ప అద్వైతవాది. అతడు ఉపనిషత్తుల ప్రామాణ్యాన్ని అంగీకరించాడు. ఆయన తర్క సహాయంతో వేదాంత వ్యాఖ్యలను అనుసంధానం చేసి వాటినుండి ఉత్పన్నమైన నిగమాలు, బౌద్ధదార్శనికుల సిద్ధాంతాలను బాధింపవని చెప్పే ప్రయత్నం చేశాడు. సత్యము సత్యమును బాధింపదని ఆయన విశ్వాసం. ఉపనిషత్తులు ఆధారంగా

"ఆత్మ యొక్కటే సత్తు అనియు, అది తనమాయచే భేదాలను కల్పించుకొని తానే ఎరుగు చున్నదని"[1] గౌడపాదుని సిద్ధాంతం.

మహా ప్రతిభావంతుడైన శంకరాచార్యులు క్రీ.శ. 684లో జన్మించి 716 వరకు జీవించాడు. 32సంIIరాల స్వల్పవ్యవధిలో శంకరభాష్యాన్ని ప్రామాణికంగా రచించి అద్వైతసిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. శృంగేరి వంటి మఠాలను దేశమంతటా స్థాపించి అద్వైత మత వ్యాప్తికి గణనీయమైన కృషిచేశాడు. క్రీ.శ. 19వ శతాబ్దిలో స్వామి వివేకానంద (1862-1902) శ్రీరామతీర్థ స్వామి (1873 -1906) వంటివారు తమ ప్రతిభాపాండిత్యాలతో, తమ ప్రవచనాలతో అద్వైతదర్శన వ్యాప్తికీ, అభివృద్ధికీ బహుముఖ కృషి చేశారు. పాశ్చాత్య దర్శనంచేత, ఆధునిక విజ్ఞానంచేత ప్రభావితులైన వీరు అద్వైతాన్ని సృజనాత్మకంగా వ్యాఖ్యానించి సర్వజనులకు పనికివచ్చు అధ్యాత్మిక దర్శనంగా చేసే ప్రయత్నంచేశారు. క్రియాద్వైతానికి భావా ద్వైతంతో సమానమైన ప్రాధాన్యమిచ్చి సర్వమానవ సమానత్వాన్ని వ్యావహారికంగా, పారిమార్థికంగా చాటిచెప్పారు.

అద్వైతసిద్ధాంత స్వరూపాన్ని స్వామీ వివేకానంద వివరిస్తూ "జగత్తులో బ్రహ్మమనబడే ఒక్క సద్వస్తువు మాత్రమే ఉందని అద్వైత సిద్ధాంతం. మిగిలిందంతా అసత్తు. ఆభాస మాత్రమే. మాయ మహిమ వల్ల ఇదంతా బ్రహ్మం నుండి కల్పితమవుతోంది. బ్రహ్మంలో ఐక్యభావాన్ని పొందడమే మనకు పరమగమ్యం. మనమందరం, మనలోని ప్రతివ్యక్తీ కూడ మాయచేత కప్పబడిన బ్రహ్మమే. అజ్ఞాన రూపమైన ఈ మాయను తొలగించుకొంటే మన సత్యస్వరూపాన్ని తిరిగి పొందగలం. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి మనుష్యుడు మూడు భాగాలతో కూడి ఏర్పడుతున్నాడు. 1.శరీరం 2. మనస్సు లేక అంతః కరణం 3. వీని రెండిటికిని వెనుక లేక ఆత్మ అనబడే వస్తువు. మనస్సు ద్వారా ఈ ఆత్మ శరీరాన్ని నడుపుతుంది. ఈ ఆత్మకు శరీరమనేది బాహ్యకవచం. మనస్సనేది లోపలి కవచం. నరుని శరీరంలో భౌతిక

పదార్థంకానిది ఆత్మ ఒక్కటే. అది శాశ్వతమైంది. ఆద్యంతాలు లేనిది. నిరాకారమైంది".[2]

వివేకానందుల వ్యాఖ్యానంలో ఆత్మపరమాత్మల అనుబంధం, బ్రహ్మలో ఐక్యభావాన్ని పొందడం మోక్షమన్న విషయాలు స్పష్టమవుతున్నాయి. అద్వైత సిద్ధాంత స్వరూపాన్ని గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారు "జీవాత్మ పరమాత్మలకు దశాభేదమే కాని వస్తువు ఒక్కటే అనునది అద్వైతము. జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అయినను వాటి సంబంధము శరీర శరీరి భావముతో కూడినది. శరీరి (ఆత్మ) ప్రధానము. శరీర మప్రధానము"[3] అన్నారు.

ఆచార్య శంకరులు, గౌడపాదులు, వివేకానంద వంటి అద్వైతుల సిద్ధాంతాలు ఆధారంగా అద్వైత లక్షణాలను స్థూలంగా పరిశీలిద్దాం.

1. భగవత్ స్వరూపం: భగవంతుడు నిర్గుణుడు. సచ్చిదానందమైన బ్రహ్మ మొక్కటే సత్యం. సృష్టి అంతా పరమాత్మ మయమని వారివాదం.

2. జీవుడు : అంతఃకరణ ప్రతిబింబిత చైతన్యుడైన మిధ్యాత్మకుడు. జీవుడికి బహుత్వాన్ని అంగీకరించరు.

3. వివర్తవాదులు : అద్వైతులు వివర్తవాదులు. కొన్ని కారణాలు కార్యాలుగా మారినా వాటి స్వభావాన్ని కోల్పోవు. ఉదాహరణకు బంగారం ఆభరణాలుగా మారినా వాటిలో బంగారపు స్వభావమే భాసిస్తుంది. అదేవిధంగా పరమాత్మ జీవాత్మగా వివర్తమైనా పరమాత్మ స్వభావమే స్ఫురిస్తుంది. పరమాత్మతో ఏకత్వాన్ని అనుభవ పూర్వకంగా గ్రహించిన వారికి శోక మోహాలుండవు.

4. మిథ్యావాదం (లేదా) మాయావాదం : జగత్తు సత్తుకాదు. అసత్తు కాదు. ఇంద్రజాలం లా మిథ్యారూపమైంది. మాయవల్ల కనబడే ప్రపంచ మంతా అసత్యం. భగవద్గీత ఈ భావాన్నే ప్రతిపాదిస్తుంది. ప్రకృతిలో కనబడని పరమాత్మ తత్త్వమే సత్యమని వారి భావం. అందువల్ల ఇతర మతస్థులు మాయావాదులంటారు.

5. కర్మ : చిత్తాన్ని స్వచ్ఛంగా, నిర్మలంగా చేయగలిగేది కర్మ. అది జ్ఞానానికి సాక్షాత్తు అంగంకాలేదు. అది విడువ దగిందని అర్థం.

6. మోక్షం : అవిద్యానివృత్తియే మోక్షం. జీవభావం నశించి బ్రహ్మస్వరూప ప్రాప్తి కలుగుటే మోక్షం. దానికి జ్ఞానం సాధనం. విగ్రహారాధనం సాధనం మాత్రమే.

ఈ అద్వైతసంప్రదాయ లక్షణాలను అన్నమయ్య సంకీర్తనలతో సమన్వయించి ఆయన అద్వైత సంప్రదాయ ధోరణిని పరిశీలిద్దాం.

అన్నమయ్య సంకీర్తనల్లో సృష్టి అంతా పరమాత్మమయమన్న అద్వైత భావనతో కీర్తిస్తూ

"ఇహమే పరము మరి యింతా నీమయముగాన
సహజపుసంసారమే మోక్షము సరసవిరక్తికి నెడమేదయ్యా

నీయందే బ్రహ్మ మరి నీయందే రుద్రుడు
నీయందే సచరాచరమును నీయందే యీజగము

నీచేతలే రేయింబగళ్లు నీచేతలే కాలత్రయము
నీచేతలే సర్వజంతువుల నిశ్చల చైతన్యములు (4-76)

పరమాత్మ మయమైన సకలచరాచరసృష్టిలో బ్రహ్మ, రుద్రులు కూడ ఆయన రూపులని అన్నమయ్య పేర్కొన్నాడు. ప్రకృతిలో రాత్రి, పగలు, త్రికాలాలు పరమాత్మ లీలలని నుతించుట ఆయన ఔన్నత్యాన్ని అద్వైతభావాన్ని చాటిచెపుతున్నాయి.

ప్రపంచమంతాఈశ్వరమయమని ప్రశంసిస్తూ

"కల లోపలివి జీవుని సంకల్పములన్నియు
ఇల లోపలి ప్రపంచ మింతయు నీశ్వరు సంకల్పము (4-99)

అనడంలోఅన్నమయ్య అద్వైత భావన స్పష్టమవుతుంది.

వేంకటేశ్వరుని భక్తుడైన అన్నమయ్య చూచేవారి దృష్టిననుస రించి వేంకటేశ్వరుడు విభిన్నరూపాల్లో సాక్షాత్కరిస్తాడని వర్ణిస్తూ

"ఎంతమాత్రమున నెవ్వరుదలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతము లెంచి చూడబిండంతే నిప్పటియన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుడనుచు ॥ఎంత॥

వేంకటేశ్వరుడు వైష్ణవులకు విష్ణువుగా, వేదాంతులకు పర బ్రహ్మగా, శైవులకు పరమశివునిగా, కాపాలికులకు ఆదిభైరవుడుగా సాక్షాత్కరిస్తాడని అన్నమయ్య వేంకటేశ్వరునితో ఇతర దైవాలకు అభేదం చెప్పడం ఆయన అద్వైత భావనకు నిదర్శనం.

అద్వైతులు భగవద్గీతలో, ఉపనిషత్తుల్లో ప్రస్తావించిన 'ఆత్మ మాయ' అనే భావాన్ని ఆధారంగా చేసుకొని ప్రకృతి, జగత్తు మాయగా సిద్ధాంతీకరించారు. 'అంతామాయ' అనే సిద్ధాంతాన్ని అన్నమయ్య సంకీర్తనల్లో ప్రస్తావిస్తూ

"పుట్టుమాలిన బరు బోకివి నన్నుఁ
దిట్టేవదే మోసి దిమ్మరిమాయ ॥పల్లవి॥

ఒరపులాడక పోవె వోసి మాయ నాతో
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించేవే మోసి విష్ణుభక్తినంటా -
నెరగనటే నీయేతు లిన్నియును ॥పుట్టు॥

వుదుటు చెల్లదు పోపో వోసి మాయ నా -
యెదుర మాటలు నీకు నికనేలే,
వదరేవు హరిభక్తివనిత, తెలియరు నే -
నిదురవుచ్చినవారు నీవు నా కెదురా ॥పుట్టు॥

వొల్లవటే జీవ మోసిమాయ నీ -
కల్లలిన్నియును లోక మెఱుగును
నల్లనివిభునిమన్ననభక్తినంటా
జెల్లబో పాపపు చేదు మోయకువే ॥పుట్టు॥

వూరకుండవుగా వోసిమాయ నిన్ను
బేర బిలువము గుంపెనలాడేవు
నారాయణభక్తి నాతి నన్నును నిన్ను
గోరి యిందరు నెఱుగుదు రేల పోవె ॥పుట్టు॥

వోపవు ననుజూచి వోసిమాయ నా -
తోవ వచ్చినను నొత్తువు నీవు,
శ్రీవేంకటగిరిదేవునిభక్తి నా-
హావళికే నిన్ను నలమి రిందరును ॥పుట్టు॥ (1-107)

'మాయ'తో విష్ణుభక్తి ఘనతను వినుతించే ఈ సంకీర్తన సంవాదాత్మకంగా సాగింది. అన్నమయ్య 'మాయ' వర్ణన అద్వైత భావానికి సంకేతం. పరమాత్ముని మాయను వర్ణిస్తూ

"పరమాత్ముని నోర బాడుచును యిరు -
దరులుగూడగదోసి దంచీ మాయ ॥పల్లవి॥

కొలదిబ్రహ్మాండపుకుందెనలోన
కులికి జీవులనుకొలుచు నించి
కలికిదుర్మోహపురోకలి వేసి
తలచి తనువులను దంచీ మాయ ॥పర॥

తొంగలిరెప్పలు రాత్రులుబగలును
సంగడికనుగవ సరిదిప్పుచు
చెంగలించి వెస జేతులు విసరుచు
దంగుడుబియ్యముగా దంచీ మాయ ॥పర॥

అనయము దిరువేంకటాధీశ్వరుని
పనుపడి తనలో బాడుచును
వొనరి విన్నాణిజీవులనెడిబియ్యము
తనర నాతనికియ్య దంచీ మాయ ॥పర॥ (1-130)

జీవులను బ్రహ్మాండపు కుందెనలో ఉంచి కలికి అనే దుర్మోహపు రోకలితో తనువులను దంచుట మాయ. రాత్రి పగలులను కనుసంజ్ఞల కైపుతో చేతుల అభినయంతో ప్రాణులను బియ్యంగా దంచునది మాయ. ప్రాణులను విజ్ఞానులుగా చేసి పరమాత్మకు నైవేద్యంగా సమర్పించు నది 'మాయ' అనే సంకీర్తనలో అన్నమయ్య అద్వైత సంప్రదాయమైన మాయను తాత్త్విక చింతనతో గొప్పగా వర్ణించాడు. చాలా సంకీర్తనల్లో 'మాయ' ప్రస్తావన చేశాడు. అద్వైతసిద్ధాంతంలో 'కర్మ' మనసుని నిర్మలంగా చేస్తుంది. జ్ఞానసాధన మార్గం కాదు కనుక 'కర్మ' విడువ దగిందని వారి భావన. అద్వైతుల 'కర్మ' మార్గానుగుణంగా అన్నమయ్య తన సంకీర్తనలో

"దైవమ నీవే యిక దరి చేరుతువుగాక
జీవుల వసము గాదు చిక్కిరి లోననే ॥పల్లవి॥

పుట్టుట సహజ మిది పొదలేజీవులకెల్ల
గట్టిగా జగమునందు కలకాలము
నట్టేటివరదవలె నానాటినీమాయ
కొట్టుక పారగజొచ్చె కూడినవిజ్ఞానము ॥దైవము॥

పాపమే సహజము బద్ధసంసారుల కెల్ల
కాపురపువీధులలో కలకాలము
తేపలేనిసముద్రము తెరగున కర్మమెల్లా
మాపు రేపు ముంచ జొచ్చె మతిలోని ధైర్యము ॥దైవము॥
(3-32)

పరమాత్మ మాయ నానాటికి నట్టేట వరదలా విజ్ఞానాన్ని ప్రవా హపు వేగంలో లీనం చేసుకుంటున్నందున విజ్ఞానం అంతరించి పోతుంది. మనసులోని

ధైర్యాన్ని తేపలేని సముద్రంలా కర్మసిద్ధాంతం ముంచుతుందని కర్మను నిరసించాడు. కర్మ నిరసనం అద్వైత సంప్రదాయం. అన్నమయ్య పరమాత్మ ఘనతను అద్వైత భావనతో స్తుతిస్తూ

"భావించువారలపాలిభాగ్య మిత
డావలనీవల నంతర్యామి ॥పల్లవి॥

యీశ్వరేశ్వరుడు యితడు దివిజులకు
శాశ్వతమూరితి జగములకు
విశ్వాత్మకుడీ వివిధజీవులకు
ఐశ్వర్యము మా యంతర్యామి

నిత్యుడిత డొకడె నెరిగాలములకు
సత్యం బీతడు చదువులకు
ప్రత్యక్షం బిదె భక్తకోటికిని
అత్యంతము మా యంతర్యామి
గుణి నిర్గుణితడు గురుముని జనులకు" (4-19)

పరమాత్మ 'సకల దేవతలకు జగాలకు శాశ్వతమూర్తిగా, విశ్వసించి భాసించు వారి భాగ్య మైన అంతర్యామిగా వివిధ జీవులకు విశ్వాత్మకుడిగా అన్నమయ్య అభివర్ణించుట అద్వైత సంప్రదాయం. పరమాత్మను నిత్యునిగా, చదువులన్నింటికి 'సత్య'మూర్తిగా కీర్తించాడు. 'గుణినిర్గుణీతడిని' పరమాత్మను సాకారునిగా, నిరాకారునిగా వర్ణించుటలో విశిష్టాద్వైత భావనతోపాటు అద్వైతభావన స్ఫురిస్తుంది.

అన్నమయ్య వేంకటేశ్వరుని పరమాత్మ స్వరూపంగా భావించి

"జీవుని లోపలవాడు శ్రీవేంకటేశుడు
తానై వెలినున్నవాడు తానొక్కడే" (4- - - - - -47)

పరమాత్మకు వేంకటేశ్వరునితో అభేదం చెప్పుట అన్నమయ్య అద్వైత భావనకు భక్తి తత్పరతకు నిదర్శనం.

అన్నమయ్య దశావతార వర్ణనలో బుద్ధావతారాన్ని పలుచోట్ల వర్ణించాడు. బుద్ధుని బోధనలు అద్వైతసిద్ధాంతాను గుణాలు. ప్రత్యేకించి బుద్ధావతారాన్ని వర్ణిస్తూ

"గుణవంతు నిర్గుణంపు నరితి

గృణంతిసర్వే కేవలమితిచ" అని చెప్పుట అద్వైతభావాన్ని స్ఫురింపజేస్తుంది.

అద్వైతసిద్ధాంతం జీవన్ముక్తి భావాన్ని విశ్వసిస్తుంది. అన్నమయ్య ఈ భావనతో జీవన్ముక్తిస్థితిని వర్ణిస్తూ

"బోధకులెవ్వరు లేక భోగినైతిని
శ్రీధరుడే మాకు దిక్కు చింతింప నికను ||పల్లవి||

పట్టి దిగంబరినై పాలే యాహారముచేసి
తొట్టినపంచేంద్రియములతోవ విడిచి
పుట్టితి సన్యాసినై బుద్ధెఱిగీనెఱగక
అట్టె నడుమ సంసారినైతి నేనూ ||బోధ||

గచ్చుల నన్నీ మఱచి గాలే ఆవటించుకొని
అచ్చపుబరమ యేకాంతసమాధి
నిచ్చలు నిద్రాభ్యాసనిర్మలయోగినైతి
కచ్చుపెట్టి మేలుకొని ఘనకర్మినైతి ||బోధ||

భావము పారవిడిచి బ్రహ్మాండమెల్ల నిండి
వేవేలు గోరికల వేడుకతోడ
జీవన్ముక్తుడనైతి శ్రీవేంకటేశ్వరుజేరి
ధావతు లిన్నియు మాని తన్మయుడనైతి ||బోధ|| (1-465)

అన్నమయ్య పశ్చాత్తాపంతో బోధక గురువులు లేనందునే భోగినైతినని చింతించాడు. దిగంబరిగా మారి పాలే ఆహారంగా గ్రహించాడట. సన్యాసిగా మారిన తాను మనోనిగ్రహం లేక మధ్యలో సంసారిగా మారితినని చింతించాడు.

పిదప ఏకాగ్రతతో సమాధిస్థితిలో నిర్మల యోగిగా వేంకటేశ్వరుని చేరి జీవన్ముక్తుడనైతినని చెప్పుకొన్నాడు. జీవన్ముక్తి భావన అన్నమయ్య అద్వైత సంప్రదాయాన్ని సూచిస్తుంది.

అద్వైతులు అంతా పరమాత్మమయమని చెపుతూ నీతి తప్పి ప్రవర్తించే వారిని నిరసిస్తూ

"ఆతడే సకలము అని భావింపుచు
నీతితో నడవక నిలుకడ యేది ||పల్లవి||

యెందును జూచిన యీశ్వరు డుండగ
విందుల మనసుకు వెలితేది " (3-25)

పరమాత్మే సర్వస్వమని భావించే అద్వైతులు నీతి తప్పి ప్రవర్తిస్తే పరమాత్మ రక్షించడని అధిక్షేపించాడు. సృష్టి అంతటా ఈశ్వరు డుండగా పరమాత్మ స్వరూపులైన విందుల (జీవాత్ములు) మనసుకు వెలితి ఉండదని అన్నమయ్య భావనలో అద్వైతం ఉంది. అద్వైత సంప్రదాయంలో 'నరసింహుని' హరిహరావతారంగా భావిస్తారు. అన్నమయ్య నారసింహావతార వర్ణనలో (1-259) స్మార్త సంప్ర దాయం స్పష్టమవుతుంది. 'నమక చమకహిత నారసింహ' అను వర్ణన నృసింహపూజకు సంబంధించినది. 'నమకచమక' అను వేద మంత్రంతో నరసింహుని అభిషేకించే ఆచారం ఉంది. మంత్రశాస్త్ర మందు, అద్వైత సంప్రదాయం మందు నరసింహమూర్తి హరిహరావ తారము "ఆకంఠం విష్ణురూపాయ అత ఊర్థ్వం శివరూపిణే" అనునది హరిహరావతారాన్ని సూచిస్తుంది. ఈ వర్ణనలో కూడ అన్నమయ్య అద్వైత సంప్రదాయం గోచరిస్తుంది.

"అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో పెండ్లివర్ణనల్లో తలంబ్రాలు, నాగవల్లి, ఐరేని కుండలు మొదలైన సంప్రదాయములు ఈతని సంకీర్తనములలో కొల్లలు. అవి నేటి దాక్షిణాత్య వైష్ణవులందు కాన రావు."[4] అని చెప్పిన గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి అభిప్రాయాన్ని అనుసరించి పై సంప్రదాయాలు

శైవులకు సంబంధించినవే అని అన్నమయ్య అద్వైత సంప్రదాయాన్ని సూచిస్తున్నాయి.

అన్నమయ్య తన సంకీర్తనల్లో అద్వైత సంప్రదాయమైన పరమాత్మ తత్త్వాన్ని, నిర్గుణ నిరాకార భావాన్ని, మాయను కర్మను, మోక్షాన్ని, జీవన్ముక్తిని వర్ణించాడు. మధ్యలో విశిష్టాద్వైతిగా మారినందున ఆనాటి మతాభినివేశ స్ఫూర్తితో అద్వైత మతఖండన దూషణలకు సంబంధించిన అధిక్షేపాత్మక సంకీర్తనలు రచించాడు. వేలాది సంకీర్తనలతో భక్తులను తరింపజేసిన ధన్యుడు అన్నమయ్య.

## పాదసూచికలు

1. విజ్ఞాన సర్వస్వము సంపుటి 7 - పుట 131.
2. స్వామి వివేకనంద సాహిత్య సంకలనం - పుట 1756.
3. అన్నమయ్య సంకీర్తనలు సంపుటి 1. పీఠికలు 18.
4. అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం 1. పుట 33.

## ఆధారగ్రంథాలు


1. తాళ్ళపాక పదసాహిత్యము అధ్యాత్మిక సంకీర్తనలు 1నుండి 4 సంపుటాలు
2. శ్రీతాళ్ళపాకఅన్నమాచార్యుల జీవితచరిత్రము -తాళ్ళపాక చినతిరువేంగళనాథుడు
3. విజ్ఞాన సర్వస్వము సంపుటి 7 - (వేదాంతప్రస్థానము)
4. అద్వైత విశిష్టాద్వైత భేదములు - శ్రీయస్. నరసింహాచార్యులు
5. వ్యాసభండారము - డా॥జి.చలపతి (శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయము 1999)


★ ★ ★

బూదాటి వేంకటేశ్వర్లు

## అన్నమయ్య - ఆధ్యాత్మికత

సృష్టిలో జంతువులు కడుపు నిండటంతో, ఋతుధర్మాన్ని పాటించటంతో, కావలసినంతగా నిద్రించటంతో తృప్తి పడతాయి. కాని, మానవ జీవితం అలాకాదు. ఈ మానవ జీవితంలో మూడురకాల తాపత్రయాలున్నాయి. అవి ఆధిదైవికం, ఆధిభౌతికం, ఆధ్యాత్మికం. ఏ వ్యక్తి అనుభూతికయినా, ఏజాతి అనుభూతికయినా, సమగ్రత, ఆధ్యాత్మికతా స్పర్శను తడివినప్పుడే కలుగుతుంది. ఒక వ్యక్తి చేసే ఆధిదైవిక, ఆధిభౌతిక చింతనల కంటే ఆధ్యాత్మిక చింతనకే విలువ ఎక్కువ.

అధి + ఆత్మ = "అధ్యాత్మ". దాని తద్ధితరూపం 'ఆధ్యాత్మ'. ఆత్మ పరంగా చేసే, ఆత్మకు సంబంధించినది ఆధ్యాత్మికత అవుతుంది. అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? మనిషి తన బరువుల్ని, బాధల్ని భగవంతునిపై వేయటమా? లేక దేవునికి ఆపాదించటమా? కాదు. వాటిని ఆత్మపరం చేయటమే ఆధ్యాత్మికత. మనస్సు సృష్టించే అనుకూల ప్రతి కూలాలు, ఇష్టాఇష్టాలు, ప్రేమ - ద్వేషాలు, వీటిని దాటి పోయిన స్థితిలో ఆత్మ ప్రస్తావన వస్తుంది. అంటే ఇంద్రియ సుఖాలు, మనస్సంతోషాది వికారాలు దాటిన తరువాత బాహ్య వస్తువులపై ఆధారపడని 'ఆత్మానంద స్థితి' ఒకటుంది. అదే ఆధ్యాత్మికత. మన లోచూపు పెరిగే కొద్దీ మనలో ఈఆధ్యాత్మికత పెరుగుతుంది. ఏది మానవులకు అంతరాత్మో, ఏది సమస్త జగత్తుకు అంతరాత్మో తెలుసుకోవటమే దాని 'పరమార్థం'.

అనాదిగా మానవ మేధకందని శక్తి ఒకటి ఉందని, 'లోకంబులు, లోకేశులు, లోకస్థులుఁదెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల

నెవ్వండేకాకృతి వెలుగు' నంటూ ఆ చైతన్యాన్ని గురించి, ఎన్నో చర్చోపచర్చలు చేశారు. ఆ చర్చలలో జ్ఞాతమైన ప్రకృతిని గురించి, ప్రేరకమైన పురుషుని గురించి, బహుధా చర్చ చేశారు. సాంఖ్యులు చేసిన ఈ చర్చలో ప్రకృతి, పురుషుడు అనే రెండు తత్త్వాలతోపాటు, ఆత్మశక్తిని గురించిన ప్రస్తావన కూడా చోటు చేసుకుంది. ఆత్మశక్తిని అఖండ చైతన్యానికి ప్రతిరూపంగా భావించక తప్పలేదు. స్థూలభౌతికం నుండీ, మహత్తువరకు, అన్నిపరిణామాల్లో "ప్రకృతి" చైతన్య రహితమైనది. ఆ ప్రకృతిని క్రియాశీలకంగా, మనస్సును ఆలోచించే విధంగా ప్రేరేపించే చైతన్యశక్తిని పురుషుడు అని సాంఖ్యులు పేర్కొన్నారు. ఆ చైతన్యశక్తినే భగవంతుడని ఈశ్వరుడని వేదాంతులు పేర్కొంటున్నారు.

ఈశ్వరుడే ఈ జగత్తుకు నిమిత్తకారణం, ఉపాదాన కారణం. సమస్త సృష్టి ఈశ్వరాంశమే. ఇదే భారతీయ వేదాంతానికి, ఆధ్యాత్మికతకు ప్రాతిపదిక. ఈ సృష్టినిండా పరచుకొని కనిపించే ఆ అనంతత్త్వం ఒక్కటే. దేశ, కాల పాత్రాదులతో కూడి ఆ అఖండ చైతన్యమే భౌతిక జగత్తుగ రూపుకట్టి, జంతువుగా, మనిషిగా, దైవంగా ఇలా స్థాయి భేదాలను బట్టి కనిపిస్తుంది. ఈ జగమంతా, తనను తాను సాక్షాత్కారం చేసుకోవాలని ప్రయత్నించే అనంతాత్మకు, సంకేతరూపమైన ఆత్మశక్తి స్వరూపమే. ఇదే భారతీయ వేదాంత సారాంశం. దీనినే త్రిమతాలు పేర్కొన్నాయి. ఇది ద్వైతంతో ప్రారంభమయి, విశిష్టాద్వైతం ద్వారా పరిపూర్ణాద్వైతంలో పర్యవసిస్తోంది.

అన్నమయ్య, అఖండచైతన్యాన్ని, శ్రీనివాసునిగా భావించి, చెప్పినకీర్తన ఈ భావాన్నే బలపరుస్తుంది. చూడండి.

నిత్యాత్ముఁడై యుండి - నిత్యుఁడై వెలుగొందు
సత్యాత్ముఁడై యుండి - సత్యమై తానుండు,

ప్రత్యక్షమై యుండి - బ్రహ్మమై యుండు సం
స్తుత్యుఁడీ తిరువేంక - టాద్రి విభుడు ॥పల్లవి॥

ఏమూర్తిలోకంబు - లెల్ల వెదకెడు నాతఁ
డేమూర్తి బ్రహ్మాదు - లెల్లవెదకెడు నాతఁ
డేమూర్తి నిజమోక్ష - మియ్యఁజాలెడు నాతఁ
డేమూర్తి లోకైక - హితుడు
డేమూర్తి నిజమూర్తి - యే మూర్తియునుఁగాడు
యే మూర్తి త్రైమూర్తు - లేకమైన యాతఁ
డేమూర్తి సర్వాత్ముఁ -డేమూర్తి పరమాత్ముఁ
డామూర్తి తిరువేంక - టాద్రి విభుఁడు ॥నిత్యా॥

ఏదేవు దేహమున - నిన్నియును జన్మించె
నే దేవు దేహమున - నిన్నియును నణఁగె మరి
యేదేవు విగ్రహం - బీసకల మింతయును
యే దేవు నేత్రంబు - లిన చంద్రులు
యే దేవుఁడీ జీవు - లన్నింటిలో నుండు
నే దేవు చైతన్య - మిన్నిటికినాధార
మే దేవుఁడ వ్యక్తు - డే దేవుఁడ ద్వంద్వుఁ
డా దేవుఁడీ వేంక - టాద్రి విభుఁడు ॥నిత్యా॥

ఏ వేల్పు పాదయుగ - మిలయు నాకాశంబు
యే వేల్పు పాదకే - శాంతం బనంతంబు
యే వేల్పు నిశ్వాస - మీ మహామారుతము
యే వేల్పు నిజదాసు - లీ పుణ్యులు
యే వేల్పు సర్వేశుఁ - డే వేల్పు పరమేశుఁ
డే వేల్పు భువనైక - హితమనో భావకుఁడు
యే వేల్పుకడు సూక్ష్మ - మే వేల్పు కడు ఘనము
ఆ వేల్పు తిరువేంక - టాద్రి విభుఁడు ॥నిత్యా॥ (1-75)

జగత్తు రూపరహితమైతే పరమాత్మ - అరూపం, రూపం కావటమే సృష్టి వెనుక దాగిన రహస్యం. దానినే అన్నమయ్య పై కీర్తనలో

వ్యాఖ్యానించాడు. ప్రతి పంక్తిలో శ్రుతి శాస్త్ర పురాణోక్తులు, తగులు తున్నాయి. సృష్టినిండా పరచుకొని ఉన్న పరమాత్మ తత్త్వాన్ని ఎన్నో అన్నమయ్య కీర్తనలు వ్యాఖ్యానిస్తున్నాయి. వాటిలో ఇదొకటి.

పరమాత్మ ఉనికిని సరళతరంగా చెప్పే ఈ క్రింది కీర్తనను చూడండి.

## పరమాత్మ

భక్తి కొలఁది వాఁడే - పరమాత్ముఁడు
భుక్తిముక్తిఁదానే యిచ్చు - భువి పరమాత్ముఁడు ॥పల్లవి॥

పట్టినవారిచే బిడ్డ - పరమాత్ముఁడు
బట్టబయటి ధనము - పరమాత్ముఁడు
పట్టపగటి వెలుఁగు - పరమాత్ముఁడు
యెట్టనెదుటనేవున్నాఁ -డిదే పరమాత్ముఁడు ॥భక్తి॥

పచ్చిపాలలోని వెన్న - పరమాత్ముఁడు
బచ్చనవాసిన రూపు - పరమాత్ముఁడు
బచ్చుచేతి వొరగల్లు - పరమాత్ముఁడు
యిచ్చకొలఁది వాఁడువో - యీ పరమాత్ముఁడు ॥భక్తి॥

పలుకులలోని తేట - పరమాత్ముఁడు
ఫలియించు నిందరికి - బరమాత్ముఁడు
బలిమి శ్రీవేంకటాద్రి - పరమాత్ముఁడు
యెలిమి జీవుల ప్రాణ - పరమాత్ముఁడు ॥భక్తి॥ (1-410)

"వాసనాద్వాసుదేవస్యవాసితం తే జగత్త్రయమ్
సర్వభూతనివాసోఽసి వాసుదేవనమోఽస్తుతే" - వంటి శ్లోకాల సారం, వంద ఉపనిషద్వాక్యాల సారాన్ని, అలతిఅలతి పదాలలో వ్యాఖ్యానించిన తీరు అన్నమయ్య ఆత్మను, హృదయాన్ని ఈపై కీర్తనఆవిష్కరిస్తోంది.

మాయను గురించి, విద్యలు వేదాంతాన్ని గురించి, కర్మపద్ధతిని గురించి అన్నమయ్య రచించిన వివిధకీర్తనలు, అన్నమయ్య ఆధ్యాత్మికతత్త్వాన్ని పట్టి చూపుతాయి.

## జీవుడు

ఎవ్వరెవ్వరివాడొ - యీ జీవుడు - చూడ
నెవ్వరికి నేమౌనో - యీ జీవుడు (1-97)

అనే ఈ కీర్తనలో, ఈ ప్రాణి వెనుకటి జన్మలో ఎందరికి కొడుకుగా, తోబుట్టువుగా జన్మించాడో, ఎంతమందిని కష్టపెట్టాడో, భ్రమింపజేశాడో, ఎక్కడెక్కడ తిరిగాడో, ఎప్పుడెక్కడికి వెళతాడో, ఇంకా ఎన్ని తనువులు మోయాలో అంటూ చెప్పి 'ఎన్నడును జేటులేనీ జీవుడు' - అంటాడు. ఈ కీర్తనలో చెప్పిన విషయాలన్నీ -

న జాయతే మ్రియతేవా కదాచిత్
నాయం భూత్వా భవితా వాన భూయః
అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో
నహన్యతేహన్యమానే శరీరే (గీత 2-20)

న జాయతే మ్రియతేవా విపశ్చిత్
నాయం కుతశ్చిన్న బభూవకశ్చిత్
అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో
నహన్యతే హన్యమానే శరీరే (కఠ 2-18)

వంటి ఉపనిషత్సూక్తాలలో, ఆర్షధర్మవాఙ్మయంలో ప్రస్తావించబడినవే.

"ఎందరు బ్రహ్మలో నన్ను ఇట్టు పుట్టించిన వారు
ఎందరు యములో హరియించిన వారు
ఇందుకు నందుకే కాని యిలనేఁజేసిన పాప
మందివహించుక కాచినట్టి వారు లేరు (అ.సం. 9-34)

అంటూ ఆత్మనిత్యత్వాన్ని, బ్రహ్మాదిదేవతల అసహాయత్వాన్ని ప్రస్తావిస్తాడు.

అన్నమయ్య తన ఆధ్యాత్మసంకీర్తనల్లో ఆత్మయొక్క ఔన్నత్యాన్ని ఆత్మవికాసాన్ని ఎన్నో సందర్భాలలో ప్రస్తావించాడు. ఈ శరీరాన్నే ఆధారం చేసుకొని, భగవంతుని చేరు కోవడం, మనిషికి దొరికిన అద్భుతమైన అవకాశమని, ఆ అవకాశాన్ని వినియోగించుకునే సంస్కారం మానవజాతికి సమకూరాలని పేర్కొంటూ చెప్పిన ఈ కీర్తనను చూడండి.

ఏది వలసె నీవదిసేయు - యిందులోన నోజీవాత్మ
పొదగు మనలోనంతరాత్మయై - పరగిన శ్రీహరి పనుపునను
||పల్లవి||

మనవంటి జీవులే - మహిలోన నొకకొన్ని
శునకములై కుక్కుటములై - సూకరములునైనవి,
దినదినముఁగర్మ పాశములఁ - దిరిగెడి దుర్దశలటుచూడు
సనకాదులై కొందరు జీవులు - శౌరి దాసులైరటు చూడు ||ఏది||

కన్నులుఁగాళ్ళు మనవలెఁ దనువులు - గైకొని కొందరు నరులు
పన్నిన తొత్తులు బంట్లునై మన - పనులు సేయుచునున్నారు
యెన్నఁగ శ్రీహరి నెఱఁగక - యిడుమలఁ బొరలెడి దదిచూడు
మున్నె హరిదాసులై నారద - ముఖ్యులు గెలిచినది చూడు
||ఏది||

ఇంతగాలమును యీ పుట్టుగులనె - యిటువలెఁ బొరలితిమిన్నాళ్లు
యింతట శ్రీవేంకటేశుఁడు దలంచి - యీ జన్మంబునమము నేలె,
వింతల బొరలిన నరక కూపముల - వెనకటి దైన్యములటుచూడు
సంతసమున ముందరి మోక్షము - సర్వానందంబదిచూడు
||ఏది|| (2-128)

అలాగే ఈ జగత్తు అనాదికాలం నుండీ ఉన్నది. కానీ, పుట్టుకలు మాత్రమే కొత్తవి. ఆత్మనిత్యమైనది. 'గోనెలే కొత్తలు - కోడెలెప్పటివీ'

అని తనను తాను సంస్కరించడానికి ఉపకరించని జ్ఞానం, చదువూ వృధా అని చెబుతూ ఆత్మోన్నతికై ప్రయత్నించమని పేర్కొన్నాడు.

## మాయ

సూదికి, మట్టినిఅంటించి కప్పేస్తే, సూదంటురాయి ఆకర్షించలేదు. అలాగే జీవాత్మను మాయ కమ్మేస్తే, పరమాత్మవైపు ఆకర్షితం కాదు. మాయా ప్రేరితమైన దుష్కర్మలను వీడిపోలేక, నలిగిపోతున్న ఈ జగత్తును చూచి, ఆ మాయా వి రాడ్రూపాన్ని అన్నమయ్య భావన చేసిన తీరు చూడండి.

పరమాత్ముని నోరఁ -బాడుచును యిరు
దరులు గూడఁగ దోసి - దంచీ మాయ ||పల్లవి||

కొలది బ్రహ్మాండపు - కుందెనలోన
కులికి జీవులను - కొలుచునించి
కలికి దుర్మోహపు రో - కలివేసి
తలఁచి తనువులను - దంచీ మాయ ||పర||

తొంగలి రెప్పలు రా - త్రులుఁబగలును
సంగడి కన్నుగవ - సరిదిప్పుచు
చెంగలించి వెసఁ జేతులు విసరుచు
దంగుడు బియ్యముగా - దంచీమాయ ||పర||

అనయముఁదిరువేంక - టాధీశ్వరుని
పనుపడి తనలోఁ - బాడుచును
వొనరి విన్నాణి జీ - వులనెడి బియ్యము
తనరనాతనికియ్య - దంచీమాయ ||పర|| (1-130)

మాయ అనే ఇల్లాలు, పరమాత్ముణ్ణి గురించి పాడుతూ, జీవులు అనే ధాన్యాన్ని రోట్లో వేసి దంచుతోంది. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలనే రెండు వైపుల్నీ తోసుకుంటూ మాయ దంచుతుంటుంది. బ్రహ్మాండమనే

కుందెనలో జీవులనే ధాన్యాన్ని నింపి, వ్యామోహమనే రోకలిని వేసి, తనువులనే పొట్లు ఊడిపోయేట్లు దంచుతున్నది. రెప్పలవంటి ఉభయ సంధ్యలూ గల రేయి, పగలనే జంటకళ్ళనూ, తిప్పుతూ, దిక్కులనే చేతుల్ని ఊపుతూ, జీవుల్ని మెదుగుడు బియ్యమయ్యేటట్లుగా మాయ దంచుతున్నది. ఇలా జీవుల్ని బియ్యంతో పోల్చి లోకవృత్తంలోని మాయా విలాసాన్ని పేర్కొనడం గమనించవచ్చు."మయాంతు ప్రకృతిం విద్ధి మాయినంతు మహేశ్వరమ్" (శ్వేతాశ్వతరోపనిషత్తు 4-10) వంటి ఉప నిషత్సూక్తానికి అన్నమయ్య చేసిన కవితాత్మక వ్యాఖ్య యిది.

చదివితిఁ దొల్లి కొంత - చదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను - యెంతైననయ్యో ॥పల్లవి॥

వొరుల దూషింతుఁగాని - వొకమారైన నా
దురిత కర్మములను - దూషించను,
పరుల నవ్వుదుఁగాని - పలుయోని కూపముల
నరకపు నా మేను - నవ్వుకోను ॥చదివితి॥

లోకులఁ గోపింతుగాని - లోని కామాదులనేటి
కాకరి శత్రుల మీఁదఁ - గడుఁగోపించ,
ఆకడ బుద్ధులు చెప్పి - అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ - దెలుసుకోలేను ॥చదివితి॥

యితరుల దుర్గుణము - లెంచి యెంచి రోతుఁగాని
మతిలో నాయాసలు - మానలేను,
గతిగా శ్రీవేంకటేశుఁ - గని బ్రదికితిఁగాని
తతి నిన్నాళ్ల దాఁకా - దలపోయలేను ॥చదివితి॥ (4-74)

తనను తాను సంస్కరించుకోని చదువు వృధా, అంటూ చెప్పే ఈ కీర్తనలో ఇతరులను దూషించటం, పరిహసించటం, కోపించటం, వాళ్ళకుపదేశించటం, దోషాలెంచటం వంటి వివేకరహితమైన చర్యల

కంటే తమ తప్పుల్ని తామే పరిశీలించుకోవటం, తమ జనన మరణాది దురవస్థలకు తామే నవ్వుకోవటం, అరిషడ్వర్గంపై కోపించటం, ఆత్మలోహరిని తెలుసుకోవటం,ఆశల్నివీడటం వంటి ధర్మాలను ఆచరించాలనే లోచూపును ఆవిష్కరిస్తాడు.

ఎవరైనా తనను తాను, తానుగా తెలుసుకోవటమే గొప్ప విద్య. అదే ఆత్మజ్ఞానం. భగవంతుడు, రూపం ధరిస్తే అది జగత్తు. ఈ జగత్తు రూపరహితమైతే భగవంతుడు. అరూపం, రూపం కావటమే ఈ సృష్టి వెనుక దాగిన రహస్యం. దానిని తెలుసుకోవటమే జ్ఞానం. మరి ఈ జ్ఞానయజ్ఞం, మోక్ష సాధనమెలా అవుతుందో చెప్పే, ఈ సంకీర్తనను చూడండి. అందులో యాగ ప్రక్రియలను జ్ఞానానికి అన్వయించి చెప్పటం కనిపిస్తుంది.

యజ్ఞము, ద్రవ్యయజ్ఞము, జ్ఞానయజ్ఞమని రెండు రకాలు. ద్రవ్య యజ్ఞమంటే 'అధ్వరము'; అంటే వైదిక మార్గాన్ని ఇచ్చేదని అర్థం. వైదిక మార్గమంటే జ్ఞానమే. అంటే ద్రవ్య యజ్ఞం, చిత్తశుద్ధి ప్రదమై, జ్ఞానానికి హేతువవుతున్నది. మరి, జ్ఞానయజ్ఞ మంటే జ్ఞానం ద్వారా యః = ఎవడు, జ్ఞ = తెలియదగినవాడో వానిని తెలుసుకోవడం జ్ఞానయజ్ఞం. ఈ తెలిసికొనేది ఆత్మరూపాన్నే. ఇలా ఆత్మను తెలిసికోవటానికి ప్రవర్తించే మార్గమే యజ్ఞము. ఆ మార్గం ద్రవ్య రూపంలో, జ్ఞానరూపంలోను ఉంది. ఆ జ్ఞాన యజ్ఞాన్ని గురించి చెప్పే ఈ కీర్తన. గమనించండి.

"జ్ఞానయజ్ఞమీ - గతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే - నడపె మా గురుఁడు" ॥పల్లవి॥

అలరిదేహమనేటి - యాగశాలలోన
బలువై యజ్ఞానపు - పశువు బంధించి
కలసి వైరాగ్యపు - కత్తులఁ గోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో - వేలిచె మా గురుడు ॥జ్ఞాన॥

మొక్కఁచు వైష్ణవులనే - ముని సభఁగూడబెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థ - సోమపానమునించి
చక్కగా సంకీర్తన - సామగానము చేసి
యిక్కువతో యజ్ఞముసే - యించెఁబో మా గురుడు ॥జ్ఞాన॥

తదీయ్యగురుప్రసా -దపురోడాశమిచ్చి
కొదదీరద్వయమను - కుండలంబులువెట్టి,
యెదలో శ్రీవేంకటేశు - నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూప దీక్ష యిచ్చెను మాగురుఁడు ॥జ్ఞాన॥

(2-148)

దేహాన్ని యాగశాలగా, అజ్ఞానాన్ని బలిపశువుగా, వైరాగ్యాన్ని కత్తిగా, చేసి జ్ఞానాగ్నిలో వ్రేల్చాలని చెప్పటం ఇందులోని విషయం.

భక్తి జ్ఞానకర్మయోగాలు, మూడు మోక్షానికి తెరువులే. సాధకుని సామార్థ్యాన్ని బట్టి ఆ మూడింటిలో ఒకటి ఎంచుకోవటమో, లేకుంటే ఈ మూడింటిని సోపానాలుగా, దశావస్థలుగా చేసుకొని ఎదగడమో కనిపిస్తుంది.

## కర్మ

భర్తృహరి, కర్మను గురించి మాట్లాడుతూ దేవతలు, విధికి వశమైఉంటే, విధి కర్మ విహితమైన ఫలాలనే ఇస్తుంది. కాబట్టి దేవతలకూ, విధికీ కాక విధిని సహితం అదుపులో పెడుతున్న కర్మలకే నమస్కారించాలంటూ పేర్కొంటాడు.

నమస్యామోదేవాన్నను హత విధేస్తేఽ పివశగాః
విధిర్వంద్యం సోఽ పి ప్రతినియత కర్మైక ఫలదః
ఫలం కర్మాయత్తం కిమమరగణైః కించవిధినా
నమస్తత్కర్మభ్యో విధిరపి నయేభ్యః ప్రభవతి (భర్తృ 1-91)

అలా భర్తృహరి చెప్పిన కర్మ యొక్క విరాట్ స్వరూపాన్ని చెప్పటమే కాకుండా, కర్మ-హరిదాసుల్ని ఏమి చేయలేదంటూ అన్నమయ్య పేర్కొంటాడు.

మనోకామాల్ని జయించి, తమలో తాము, రమించటం స్థితప్రజ్ఞుని లక్షణం. అటువంటి స్థితప్రజ్ఞుల్ని కర్మ ఏమీ చేయలేదు. ప్రజ్ఞాస్థైర్యం లేని సాధారణజనులు, సత్కర్మలను ఆచరించి, వాటి ఫలాలను భగవంతునికి అర్పించి, క్రమంగా కర్మవిముక్తులుగా కావాలి - అంటూ గీతాది ధర్మశాస్త్ర గ్రంథాలు చెపుతూనే ఉన్నాయి.

కర్మ కర్తారుడని కడలేని పుణ్యముల
కర్మఫలములు దనకు గైకొలుపగా,
కర్మగతిఁదెచ్చి వేంకట విభుడు మా వుభయ
కర్మములఁజెరిచె నెక్కడి దైవమితఁడు (1-293) అంటూ చమత్కారంగా చెపుతాడు.

ఎన్ని బాధలఁబెట్టి-యేఁచెదవు నీవింక నెంత కాలము దాఁకఁగర్మమా
మన్నించు మనుచునీ - మఱుగు చొచ్చితిమి మా మాటాలకించవో కర్మమా
||పల్లవి||

ప్రతిలేని దురితముల -పాలు సేయక నన్నుఁ బాలించవైతివి కర్మమా!
తతితోడ నాత్మ పరి - తాపంబు తోడుతను-తగులేల సేసితో కర్మమా!
జితకాములకు గాని - చేతికిని లోనయి చిక్కవే కాలంబు కర్మమా!
మతిహీనులైనట్టి - మాకు నొక పరిపాటి మార్గంబు చూపవో కర్మమా!
||ఎన్ని||

ఆసలనియెడి తాళ్ల - నంట గట్టుక విధికి -నప్పగించితివి గదె కర్మమా!
వాసి విడిచితిమి నీ వారమైతిమి మమ్ము-వన్నె చెడనీకువో కర్మమా!
కాసుకునుఁగొరగాని - గతిలేని పనికిఁగా కాలూద నీవేల కర్మమా!
వొసరించొక మారు - వొయ్యనే వొకరీతి నొల్లనని తలఁగు మీ కర్మమా!
||ఎన్ని||

తిరువేంకటాచలా - ధిపుని మాయలచేత దెసలఁదిరిగిన యట్టి కర్మమా!
హరిదాసులగు వారి - నాదరింతువుగాక అంతనొప్పింతువా కర్మమా!

వరుస నేనుగ మీద - వాని సున్నంబడగ వచ్చునా నీకిట్ల గర్మమా!
పరమపురుషోత్తముని - భ్రమతఁబడి నీవిట్ల బట్ట బయలైతిగా కర్మమా!
॥ఎన్ని॥ (1-284)

అయితే, ఈ కర్మమార్గ ప్రస్థానం ఎంతవరకు సాపేక్షమన్నది ఎప్పుడు చర్చార్హమవుతూనే ఉంది. ధర్మాలు, కర్మలు అన్నీ భక్తి మార్గాను సంధానాలు కావాలని కోరుకోవటమే అన్నమయ్య తాత్పర్యం. అందుకే.

నీమాయలింతే కాక - నీరజనాభుడ యివి
నామది నిజమనెట్టు - నమ్మేదయ్యా ॥పల్లవి॥

బాలుడనై నేఁజన్ముఁ -బాలుదాగేనాఁడు
వోలినను్ష్ఠానము లెందుండెనయ్యా
చాలి యానేనె బ్రహ్మ - చారినయిన మీద
వాలియవె యెందుండి - వచ్చెనయ్యా ॥నీమాయ॥

నేను దినదినమును - నిద్దరవోయే వేళ
వూని నిత్య కర్మములెం - దుండెనయ్యా!
జ్ఞానముతో మేలుకొని - సంసారినైన వేళ
అనుకొని యందుండి - అంటుకొనెనయ్యా ॥నీమాయ॥

యేడ కర్మమేడ ధర్మ - మింతలో సన్యాసైతే
వేడుకకివి యెల్లా నీ - విలాసాలు
జాడ నీ మనసు వస్తే - సరుగఁ గరుణింతువు
వోడక శ్రీవేంకటేశ !వున్న సుద్దు లేఁటికి ॥నీమాయ॥ (3-463)

కాబట్టి ఈ ధర్మకర్మాలకు నిలుకడ లేదు. అవి శాశ్వతాలు కావు. పైగా తెచ్చిపెట్టు కొన్నవే గాని, సహజసిద్ధాలు కావు. అవి భగవన్మాయా విలాసాలు. వాటిని నమ్ముకొని సాగితే, కడతేరటం కష్టం. భగవత్కృప ఒక్కటే మోక్షకారకం. బ్రహ్మచారిగా చేసే వేదాధ్యయనాదులు, గృహస్థులు చేసే పంచయజ్ఞాదులు, సన్యాసులాచరించే బ్రహ్మానుష్ఠానం, మొదలయి

నవి మోక్షసోపాన క్రమంలో, ఒకదశ వరకు ఉపకరించేవేగాని, 'మితిలేని హరి భక్తికి సాటి లేదన్నది' అన్నమయ్య భావన.

అన్నమయ్య తన ఆధ్యాత్మిక సాధనలో ప్రథమాచార్యులుగా ఎంచుకొన్న వాటిని గమనిస్తే, ప్రతి సాధకుడు తన జీవితాన్ని అలా తీర్చుదిద్దుకుంటే అందరూ హరిదాసులే అవుతారు కదా !అనిపిస్తుంది.

అవియు నాకుఁ బ్రథమాచార్యులు
తవిలి యీనెపము మిము - దలపించుఁగాన ॥పల్లవి॥

ధనవాంఛ మతిలోనఁ - దగిలినప్పటివేళ
దనుజారి మీ మీఁద - దలపుగలుగు
పొనిగి భయదుఃఖములఁ -బొరలినప్పటివేళ
పనిపూని మీ మీఁది - భక్తి గలుగు ॥అవి॥

చెలఁగి పాపములు మిం -చిన వేళ హరి మీ
నలువు నామోచ్చార - ణంబు గలుగు
బలిమి భవరోగముల - బడలినప్పటి వేళ
పలుమారు మీ సం - ప్రార్థనలు గలుగు ॥అవి॥

ఇన్నిటాఁ దొలగి మిము - నెరిఁగి కొలిచిన వేళ
మన్ననల పరిణామంబు గలుగు
వున్నతపు శ్రీవేంక - టోత్తముఁడ మిము నెదుట
గన్న యీ వేళ సౌ - ఖ్యంబులే కలుగు ॥అవి॥ (2-416)

ఇలా ధనవాంఛ, భయాలు, పాపాలు, భవాలు, ఆర్తినిరేకెత్తించి, హరిని స్మరింపచేస్తున్నాయి. ఈ విధంగా హరిని స్మరించిన వారు క్రమంగ జిజ్ఞాసువులుగా, జ్ఞానులుగా పరిణమించి ముక్తులవటానికి వీలు కలుగుతున్నది. కాబట్టి, ఆ ధనాదుల్నే ప్రథమాచార్యులుగా పేర్కొన్నాడు. భాగవతంలో కూడ కుంతి, శ్రీకృష్ణుని స్తుతిస్తూ, ఇలాగే ఆపదల్లో ఎప్పుడూ మమ్మల్ని వెన్నంటి కాచావు. నిరంతరం ఆపదలనే ప్రసాదించమంటుంది. ఎందుకంటే పరమాత్మ అండనే ఎప్పుడూ ఉండవచ్చని!

ఎంత విభవము గలిగె - నంతయును నాపదని
చింతించినది గదా - చెడని జీవనము ||పల్లవి||

చలముఁగోపంబుఁదనుఁ - జంపేటి పగతులని
తెలిసినది యదిగదా -తెలివి,
తలకొన్న పరనింద - తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా - తుదగన్న ఫలము ||ఎంత||

మెఱయు విషయములె తన - మెడనున్న వురులుగా
యెఱిఁగినది యదిగదా - యెరుక,
పఱివోని యాపదనుఁ - బట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా - విజ్ఞాన మహిమ ||ఎంత||

యెనలేని తిరువేంక - టేశుఁడే దైవమని
వినగలిగినది గదా - వినికి,
అనయంబునతని సే - వానందపరులయి
మనఁగలిగినది గదా - మనుజులకు మనికి ||ఎంత|| (1-181)

ఎంత సంపద కలిగినా, ఆ సంపదను ఆపదగా భావించి, గర్వ గ్రస్థుడుగాని వాని బ్రదుకే చెడని బ్రదుకు. మాత్సర్యం, కోపం తన శత్రువులని తెలిసికోవటమే తెలివి. పరనింద తన పాలిటి మృత్యువని తలచి, దానిని నిందించడమే చివరికి దక్కేఫలం. ఆసక్తితో ఆకర్షించే విషయాలే, తన మెడనున్న ఉరులుగా తెలుసుకోవడమే ఎఱుక లేదా జ్ఞానం. చెదరని ఆశ తన్ను పట్టుకొన్న భూతమని భయపడటమే విజ్ఞాన మహిమ. తాను దేహధారి అయినందుకు, ముఖ్యప్రయోజనం భూతదయను కలిగి ఉండటమేనని, కర్మ ఫలాలపై ఆశ పడకుండా మనస్సుకు శిక్షణనివ్వటమే కర్మకి ఫలమని, కర్మఫలాలను బ్రహ్మార్పణం చేయటమే ముఖ్యమని ఎన్నో సందర్భాల్లో పేర్కొంటారు.

లౌకిక భోగాలపై కోరికలు నశించిన తర్వాత, పరతత్త్వాన్ని తెలుసు కోవాలంటే కుదిరేపని కాదు. సముద్రంలో అలలు తగ్గాక స్నానం

చేయాలనుకుంటే కుదరదు కదా! కోర్కెలకు నెలవైన మనస్సు కూడా అంతే.

కడలుడుపి నీరాడ - గా(దల(చు వారలకు
　　కడలేని మనసునకు( గడమ యెక్కడిది　　॥పల్లవి॥

దాహ మణ(గిన వెనక - తత్త్వమెరి(గెద నన్న
　　దాహమేలణ(గు తా - తత్త్వమే మెరు(గు
　　దేహంబుగల యన్ని - దినములకు( బదార్థ
　　మోహమేలుడుగు దా - ముదమేల కలుగు ॥కడ॥ (11-226)

ఇదే భావాన్ని చాలా కీర్తనల్లో ప్రస్తావించారు.

"ఆల్ ది వరల్డ్ ఈజ్ ఎ స్టేజ్" - అన్న ఆంగ్ల కవికి కైవారాలు చేసి, కైమోడ్పులు చేసే మహానుభావులు 'సంసారపు నాటకశాలలో ప్రతిమనైతి'- అన్న అన్నమయ్య సూక్తానికి ఏ అంజలి ఘటిస్తారో మరి.

ఇందులో మొదలి కర్త - యెవ్వ(డు లే(డుగాబోలు
　　ముందు కరివరదుడే - ముఖ్యు(డు గా(బోలు　　॥పల్లవి॥

ఆడితి(బో బహు రూపా - లన్ని యోనుల( బుట్టి
　　తోడనె బ్రహ్మాదులనే - దొరలెదుటా
　　జాడలు మెచ్చలేరు - చాలునన్న వారులేరు
　　వేడుక నడవి(గాసే - వెన్నెలాయ బ్రదుకు　　॥ఇందు॥

అన్ని కర్మములు(జేసి - ఆటలో బ్రాహ్మణుడనైతి
　　నన్ని వేదములనేటి - యంగడి వీధి,
　　నన్ను(జూచే వారు లేరు - నవ్వేటి వారులేరు
　　వన్నెల సముద్రములో - వానలాయ బ్రదుకు　　॥ఇందు॥

సంసారపు నాటక - సాలలో ప్రతిమనైతి
　　కంసారి శ్రీ వేం - కటపతి మాయలోన

యింస లిన్నియునుదేరె - నిందరు జుట్టములైరి
హంస చేతి పాలు నీరు - నట్లాయ బ్రదుకు ॥ఇందు॥ (2-6)

జీవుల సంసార ప్రవృత్తికెల్ల మూలభూతుడు శ్రీహరి ఒక్కడే. ఈ సృష్టి ఆయన ఇచ్ఛామాత్రాననే ప్రవర్ధిల్లుతున్నది. బ్రహ్మాది దేవతలు, ఆయన నియమించినట్లు ఆయా పనులు చేసినప్పటికీ, దేనికీ కర్తలుకారన్న తాత్త్వికార్థం ఇందులో కనిపిస్తుంది. రంగ స్థలంలోని నటులకంటె, ప్రపంచంలోని జీవుల స్థితి దుర్భరంగా ఉందని, జనన మరణాత్మకమైన సంసారపు నాటకశాలలో బొమ్మ నైనానని, పరమాత్ముని అనుగ్రహంతో, జన్మకర్మాదులే భగవత్ప్రాప్తిని, తెలిపే చుట్టాలయ్యాయి. జ్ఞానాజ్ఞానాలు తెలిసికొనే వివేకం కలిగింది. అని చెప్పటానికి ఇందులో మనం చూడవచ్చు.

అరిషడ్వర్గాలు మోక్షద్వారాన్ని చేరుకోవడానికి విఘ్నకారకాలు. అయినప్పటికీ వాటినే భగవత్పరంగా వాడుకొని, గుణాలుగా మార్చుకొని, మోక్షాన్ని ఎలా పొందవచ్చో ఈ క్రింది కీర్తనలో పేర్కొన్నాడు.

ఇటువంటి వెల్లా నీకే - యిట్టే సెలవు సేసితి
తటుకన నీవనే ని - ధానము చేకొంటిని ॥పల్లవి॥

కామించితినాత్మనిన్నుఁ - గలసి భోగించుటకు
వేమరుఁగ్రోధించితి - నీ విరోధులపై
నేమమున లోభించితి - నీ మంత్రమన్యులకియ్య
ఆముకొని మోహించితి - హరి నీ రూపునకు ॥ఇటు॥

యెలుకతో మదించితి - యిట్టే నీ దాస్యమున
మఱినిన్నొల్లని చదువు -మచ్చరించితి,
తఱిఁజలపట్టితినీ - తప్పని భక్తి యందు
వెఱవక నిన్నొల్లని - విధుల నిందించితి ॥ఇటు॥

కలకర్మము లెల్లా నీ - కైంకర్యములందు వెట్టితి
బలుమమకారము నీ - పైఁ జేర్చితి,

యెలిమి శ్రీవేంకటేశ - యిన్నిటా నన్నేలితివి
నిలిచిన కాలమెల్లా - నీ సేవే చేసితి ॥ఇటు॥ (2-215)

హరి పరములైన దుర్గుణాలు సైతం, సుగతికి ఎలా హేతువు లవుతున్నాయో ఇందులో పేర్కొనడం గమనించవచ్చు.

చివరగా వేదాంతరహస్యాన్ని విప్పి చెప్పిన ఈ కీర్తనను చూడండి.

మూడే మాటలు - మూడు మూండ్లు తొమ్మిది
వేడుకొని చదువరో - వేదాంత రహస్యము ॥పల్లవి॥

జీవ స్వరూపము - చింతించియంతటాను
దేవుని వైభవము - తెలిసి,
భావించి ప్రకృతి సం - పద యిది యెఱుఁగుటే
వేవేలు విధముల - వేదాంత రహస్యము ॥మూడే॥

తనలోని జ్ఞానము - తప్పకుండాఁ దలపోసి
పనితోడ నందువల్ల - భక్తి నిలిపి,
మనికిగా వైరాగ్యము - మఱవకుండుటే
వినవలసినయట్టి - వేదాంత రహస్యము ॥మూడే॥

వేడుకతో నాచార్య - విశ్వాసము గలిగి
జాడల శరణాగతి - సాధనముతో
కూడి శ్రీవేంకటేశ్వరుఁ - గొలిచి దాసుఁడౌటే
వీడని బ్రహ్మానంద - వేదాంత రహస్యము ॥మూడే॥
(2-233)

ఇది విశిష్టాద్వైతపు ముఖతః వేదాంతాన్ని వివరించిన కీర్తన.

వేదాంతంలో గ్రహించదగ్గ మాటలు మూడుమూళ్ళు తొమ్మిది. పల్లవిలో చెప్పినట్లే ఒక్కొక్క చరణంలో మూడు చొప్పున, చరణాలలో మొత్తం తొమ్మిది మాటలు చెప్పబడ్డాయి. మొదటి చరణంలో చెప్పినవి.

1. జీవస్వరూపం చింతించటం, 2. సర్వాంతర్యామియైన దైవాన్ని తెలిసికోవటం, 3. ప్రకృతి సంపదను గురించి తెలుసుకోవటం.

రెండవ చరణంలో తనలోని జ్ఞానాన్ని తప్పకుండా తలపోయటం (జ్ఞానం), భక్తిని దృఢంగా నిలుపు కోవటం (భక్తి), వైరాగ్యాన్ని జీవిత సారంగా గ్రహించి మరువకుండటం (వైరాగ్యం) చెప్పబడ్డాయి.

మూడవ చరణంలో ఆచార్య విశ్వాసం, శరణాగతి, భగవద్దాస్యం ప్రస్తావించబడ్డాయి. విశిష్టాద్వైతం పేర్కొన్న తత్త్వం, హితం, పురుషార్థం-అనే మూడు విషయాలు మూడుమాటలుగా ఇందులో సూచించబడ్డాయి. ఇవే సంకీర్తనలలోని మూడు చరణాలలో విస్తరించ బడ్డాయి. జీవుడు, దేవుడు, ప్రకృతి, జ్ఞానం, భక్తి, వైరాగ్యం, ఆచార్య విశ్వాసం, శరణాగతి, భగవద్దాస్యం - అనే తొమ్మిదింటిని తెలుసుకోవటమే విశిష్టాద్వైత వేదాంత రహస్యమని అన్నమయ్య భావన.

పంచభూతాలనే నూలును, చంచలత్వమనే గంజితో సరిచేసి, గుణాలనే కండెలుగా పోసి, జీవుల కర్మధనాన్ని బట్టి, వాడ వాడలా తిరిగి చీరలమ్మే బేహారిగా, సర్వేశ్వరుణ్ణి వర్ణించిన అన్నమయ్య, తన సమస్త భావాలను, ఊహలను, ఊసులను స్వామికే అంకితం చేశాడు. ఎండకాని, నీడకాని, ఏమైనా కాని కొండలరాయుడే మాకు కులదైవమని, ప్రకటించాడు. భావంలోను, బాహ్యంలోను గోవిందుణ్ణి స్మరించటమే పరమోన్నతపదంగా భావించాడు.

"సంకెల లిడువేళ చంపెడు వేళ, అంకిలి ఋణదాతలాగెడు వేళ, వదలక వేంకటేశ్వరునామంబె, విడిపింపగతిగాని వేరొండులేదు"- అంటూ నిష్కర్షగా ప్రకటించాడు. పలుకే మంత్రంగ, పొందైన నాలుకే కలకలమనే పిడిగంటగా, దేహాన్ని దేవాలయంగా భావించిన ఆధ్యాత్మిక తత్త్వవేత్త అన్నమయ్య.

తల్లివి నీవే, తండ్రివి నీవే అంటూ కీర్తించిన కవులు చాలామంది ఉన్నారు. కానీ "ఇల్లాలివై మోహమిత్తువు నాకు" - అంటు ఇల్లాలి

మోహాన్ని కూడా దైవప్రసాదంగా భావించిన ఆధ్యాత్మికత అన్నమయ్యది. అందుకే అన్నమయ్య జీవితంలోను, ఆధ్యాత్మికత లోను అనన్య సామాన్యుడు. సిద్ధ పురుషులకు వాంఛితార్థాలుండవు. పిచ్చివాళ్లకు కూడా వాంఛితార్థాలుండవు. అయితే సిద్ధులు పరమోన్నత సోపానంలో బ్రహ్మ చైతన్య సమీప వర్తులవుతున్నారు. పిచ్చివాడు పశుతుల్యుడవు తున్నాడు. ఒకడు ముక్తుడు. మరొకడు బద్ధుడు. అన్నమయ్య అటువంటి ముక్తజీవి.

అన్నమయ్యలో ఆధ్యాత్మిక కీర్తనలకంటే శృంగార సంకీర్తనల సంఖ్యే ఎక్కువ. మరి వాటిని ఆధ్యాత్మిక దృష్ట్యా చూడటం ఎలా? శృంగార కీర్తనలలోగాని, ఆధ్యాత్మిక సంకీర్తన లలోగాని, ఒక సంవేదన అంతర్లీనంగా ఉంది. ఈ సంవేదనకు ప్రేరకము, కారకమూ జగన్మోహనుడే. సంవేదనను అనుభవించే మనస్తత్వం, ఆధ్యాత్మ కీర్తనలలో అయితే భక్తుడు, శృంగార కీర్తనలలో అయితే నాయిక. ఇక్కడి స్త్రీత్వం కేవలం భావావేశానికి సంకేతమే. కాబట్టి ఇక్కడి నాయిక ఆర్తగా, ఆర్ద్రగా నిలిచిన మధుర భావావేశ ప్రతీక. స్త్రీత్వాన్ని ఎప్పుడయితే ప్రతీకకు ఆపాదించామో, ఆకర్షించేవాడు పురుషుడనే లోక మర్యాదరీత్యా చెప్పుకుంటాం. తప్పదు. ఒక తాత్త్విక భూమికను స్త్రీ పురుషాత్మక భాష లోకి అంటే లౌకికానుభవాన్ని ఆధారంగా, అలౌకిక ఆత్మానుభవాన్ని భావన చేయటం. ఇది అర్చావతారాన్ని ఆధారం చేసుకొని మూలరూపాన్ని ఉపాసన చేయటం లాంటిది. అందు చేత ఇందులోని శృంగారం, జీవుని ఆధ్యాత్మిక వేదనే. వీటిలోని కామ ప్రతీకత జీవుని వేదనా సంబంధమే.

శృంగార సంకీర్తనలలో అన్నమయ్య భక్తి, కవిత్వ రూపాన్ని పొందింది. భక్తుడికి కామ భావన నిషిద్ధం. అయితే తాంత్రికుడైన వ్యక్తికి కామశక్తి ఆరాధ్యమే. వేదంలో ఋషి, కామ భావాన్ని లౌకికాలౌకిక సంధాన కారకంగా భావన చేయటమూ కనిపిస్తుంది. కామ భావాన్ని శృంగార రసంగా వర్ణించటం కావ్యలోకంలో ఉన్నదే. అయితే జీవేశ్వర సంబంధంలో

జీవుని భక్తిని, తపనను పరాకాష్ఠకు తీసుకొని వెళ్లి చెప్పటానికి, ప్రణయగత విరహం కంటే మించిన ఆధారం లేకపోయింది. ఆ విరహాన్నే, భగవత్ పరంగా చెప్పాల్సి వచ్చినపుడు, విరహ శృంగార భాషలోనే చెప్పక తప్పదు. అంటే శృంగారరసమే ఆధ్యాత్మికానుభవంతో ఊర్జిత మవుతున్నది. అలాగే భగవద్దర్శనాన్ని చెప్పాలంటే సంయోగ శృంగార భాషేశరణ్యం. అంటే పరమేశ్వరానుభవం, శృంగారరసానుభవం ఒకటై అభేదంగా మిగిలిపోయిన సందర్భమిది.

కామం వేరు. శృంగార రసం వేరు. కామం వైయక్తిక నిష్ఠమైన అనుభవం. శృంగారరసం విశ్వజనీనానుభవ పరిధిలోనిది. అసలు రసానుభూతి ఏదైనా స్వభావ జగత్తును అధిగమించవలసిందే. వైయక్తికం కాని కర్మ యే విధంగా కర్మయోగ మవుతుందో, అలాగే వ్యక్తి లుప్తమైనప్పుడు, జీవుని అంతశ్చైతన్యంలో ఉన్న భగవత్ సంబంధ భావనలు, శృంగార రసంగా, ఒక అనుభవ మాధురీ దర్శనంగా మిగిలి పోతాయి.

ఈ విధంగా అన్నమయ్య సృష్టించిన శృంగార సంకీర్తనలలోని శృంగారం ఆధ్యాత్మికం, ప్రతీకాత్మకమేగాని అన్యం కాదు. అన్నమయ్య శృంగార సంకీర్తనలు ఆలంకారికంగా ప్రారంభమై ఆధ్యాత్మిక పరిధిలోకి ఒదిగి పోయేవి. విరహమొక ధ్యానం. సంయోగ మొక యోగం. అదే అన్నమయ్య ఆధ్యాత్మిక శృంగార రసానంద పారవశ్య స్థితి. తాను ప్రాణమయ మనోమయ కోశాలలో సంచరిస్తూ, అంతశ్శరీరంలో భావమూర్తిగా మిగిలి చేసిన భావనాలోక ప్రయాణమే ఈ సాహిత్యమంతా. తనను తాను భగవంతుని యందు న్యస్తం చేసుకోవటానికి పడ్డ తపనే ఈ శృంగార సంకీర్తనలన్నీ. అలా కవితా రూప తపస్సు చేయటమే అన్నమయ్య ఆధ్యాత్మికత.

★ ★ ★

గుమ్మా సాంబశివరావు

## అన్నమయ్య సంకీర్తనల్లో రామాయణ భారత కథలు

వారిదేపో జన్మము వడి నిన్నుఁ దెచ్చిరి
భారతరామాయణాలై పరగె నీ కథలు ॥పల్లవి॥

భువిమీఁద రావణుఁడు పుట్టగా రాముఁడవై
తవిలి యిందరికిఁ బ్రత్యక్షమైతివి
వివరింప నంతవాఁడు వెలసితేఁగా నీవు
అవతార మందితే నిన్నందరునుఁ జూతురు ॥వారి॥

రమణఁ గంసాదియసురలు లూటి సేయఁగా
తమిఁ గృష్ణావతార మిందరి కైతివి
గములై యంతటి వారు గలిగితేఁగా నీవు నేఁడు
అమర జనించి మాటలాడదు విందరితో ॥వారి॥

యెంత వుపకారియో హిరణ్యకశిపుఁడు
చెంత నరసింహుఁడ నీసేవ యిచ్చెను
యింతట శ్రీవేంకటేశ యిన్ని రూపులును నీవే
పంతాన నీశరణని బ్రతికితి మిదివో[1] ॥వారి॥

- అన్నమయ్య జీవితం దీర్ఘ శరణాగతి తత్త్వంతో సాగింది. తాను నమ్మిన తిరుమలనాథుని గుణ గాన సంకీర్తనమే ఉచ్ఛ్వాస విశ్వాసాలుగా సాగిన భక్త కవిశేఖరుడు అన్నమయ్య.

అన్నమయ్య పౌరాణిక జ్ఞానం అపారం. అన్నమయ్య వేదవిజ్ఞానం అనంతం. అన్నమయ్య శాస్త్రవైదుష్యం అనితర సాధ్యం. అన్నమయ్య సంకీర్తన రచనా నైపుణ్యం అద్భుతం. అనుపమానం.

అన్నమయ్య సంకీర్తనల్లో మనకు ఏం కావాలో అది లభిస్తుంది. చూసే చూపును బట్టి అన్నమయ్య సంకీర్తనలు మనకు సమాచారాన్ని అందిస్తాయి. శేషాచలనాథుని నందకాంశతో జన్మించిన అన్నమయ్య ప్రతిభ అమోఘమైనది కావటంతో ఆయనకు సమస్త విషయాలు కర తలామలకాలై సంకీర్తనల్లో ఒదిగి పోయాయి. నన్నయ ఆంధ్ర మహా భారతంలో భారతం గొప్పతనాన్ని చెపుతూ "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మ శాస్త్రంబని"[2] అనే పద్యంలోని విషయాలు అన్నమయ్య సంకీర్తనలకూ వర్తిస్తాయి.

అన్నమయ్య సంకీర్తనలు "ధర్మతత్త్వజ్ఞులకు ధర్మశాస్త్రంగా, అధ్యాత్మవిదులకు వేదాంతంగా, నీతి విచక్షణులకు నీతిశాస్త్రంగా, కవి వృషభులకు మహాకావ్యంగా, లాక్షణికులకు సర్వలక్ష్య సంగ్రహంగా, ఐతిహాసికులకు ఇతిహాసంగా, పౌరాణికులకు బహుపురాణ సముచ్చయంగా గోచరిస్తాయని చెప్పటంలో అతిశయోక్తి లేదు".

అన్నమయ్య సంకీర్తనలు ఐతిహాసికులకు ఇతిహాసాలుగా స్ఫురిస్తాయని భావించినపుడు ఆ భావన ప్రత్యక్షర సత్యమనిపిస్తుంది. రామాయణ మహాభారతాలు మన ఇతిహాసాలు. ఇలా జరిగిందని చెప్పే ప్రక్రియనే ఇతిహాసమని అంటారు. ఇందులో కల్పన లేదు. వాస్తవ సంఘటనలకు అక్షరరూపమే ఇతిహాసం. రామాయణాన్ని రచించిన వాల్మీకి, మహా భారతాన్ని రచించిన వ్యాసుడు ఆయా ఇతిహాసాల్లో పాత్రలు గావటాన్ని కూడా మనం గమనించవచ్చు. రామాయణం ఆదర్శ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తే, మహాభారతం ధర్మం ప్రాముఖ్యాన్ని దుష్ట శిక్షణ, శిష్టరక్షణను స్పష్టంచేస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో ప్రతిబింబించిన రామాయణ మహాభారతాలకు, సంబంధించిన అంశాల్లోని తాత్త్వికతను పరిశీలించటమే ప్రస్తుత వ్యాసం ప్రధానోద్దేశం.

మహాభారతం, రామాయణం ఏవిధంగా చెప్పబడినాయో వివరిస్తూ అన్నమయ్య రచించిన ఒక సంకీర్తన సహృదయ రంజకంగా ఈ విధంగా సాగింది.

"పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి
నోరు మూసుకున్నఁ బోదు నున్నవినీసుద్దులు ||పల్లవి||

వేసులు మాకుఁ జెప్పె విన భారతముగాఁగ
మోస నీపాలముచ్చమి మొదలుగాను. . . . .
రంతున వాల్మీకి చెప్పె రామాయణముగాను
సంతగాఁ దాటకాదులఁ జంపిన దెల్లా . . . . ."[3]

- వ్యాసుల వారు మహాభారతాన్ని, వాల్మీకి రామాయణాన్ని రచించి విష్ణుమూర్తి కృష్ణావతారంలోను, రామావతారంలోను ప్రదర్శించిన లీలల్ని వివరించారని అన్నమయ్య ఈ సంకీర్తనలో తెలిపాడు.

అన్నమయ్య సంకీర్తనల్ని పరిశీలించినప్పుడు భాగవత కథాంశాలు ఎక్కువగా, ఆ తర్వాత రామాయణాంశాలు కొంత తక్కువగా, ఆ వెనుక భారత విషయాలు మరికొంత తక్కువగా గోచరిస్తాయి. రామాయణ సంబంధమైన సంకీర్తనల్లో రామకథను వివరించిన సన్నివేశాలు, రాముని గుణగణాల్ని ప్రశంసించిన సందర్భాలు, ఆంజనేయునికి సంబంధించిన అంశాలతో కూడిన కీర్తనలు కనిపిస్తాయి. మహాభారతానికి సంబంధించిన సంకీర్తనల్లో దుర్యోధన, కంసాదుల ప్రస్తావనలు, విదురుని విషయం, విశ్వరూప ప్రదర్శనం, గీతాబోధ మొదలైన అంశాలు సాక్షాత్కారిస్తాయి.

## రామాయణ సంకీర్తనలు

అన్నమయ్య రామాయణ సంబంధిత సంకీర్తనలనెన్నింటినో రచించాడు. ఒక్క సంకీర్తనంలోనే రాముని గుణగణాలు, రాముని బాణప్రశస్తి ఉన్నాయి. ఇంకా కొన్ని సంకీర్తనల్లో ఆంజనేయుని ప్రస్తావన ఉన్నది. రామాయణంలో ఆంజనేయుని పాత్ర ప్రాధాన్యాన్ని, ఆయన విశిష్టగుణ సంపదల్ని అన్నమయ్య పలు సంకీర్తనల్లో వర్ణించాడు.

అన్నమయ్య రామకథనంతటిని ఒక సంకీర్తనలో ఈ విధంగా వర్ణించాడు.

రాముఁ డిదే లోకాభిరాముఁ డితఁడు
గోమున పరశురాముకోప మార్చెనటరే ||పల్లవి||

యీతడా తాటకిఁ జించె యీపిన్నవాడా
ఆతల సుబాహుఁ గొట్టి యజ్ఞముఁ గాచె
చేతనే యీకొమారుఁడా శివునివిల్లు విఱిచె
సీతమ్మఁ బెండ్లాడె చెప్పఁ గొత్త కదవె ॥రాము॥

మనకౌసల్యకొడుకా మాయామృగము నేసె
దనుజుల విరాధుని తానె చెఱిచె
తునుమాడె నేడుదాళ్ళు తోడనే వాలి నడఁచె
యినకులుఁ డితాడూ యెంతకొత్త చూడరే ॥రాము॥

యీపయసుతానే యాయెక్కువజరధి గట్టి
రావణు జంపి సీత మరలఁ దెచ్చెను
శ్రీవేంకటేశుఁ డితఁడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేఁడు కంటి మిట్టె కదరే ॥రాము॥

- శ్రీరాముడు అయోధ్యానాథుడైన దశరథుని పుత్రుడు. విశ్వామిత్రుని కోరిక మేరకు రామ లక్ష్మణుల్ని దశరథుడు యాగ సంరక్షణార్థం పంపించాడు. విశ్వామిత్రుని సూచన మేరకు వారు మారీచ సుబాహుల్ని సంహరించారు. తర్వాత పర్వత గుహలాగా నోరు తెరుచుకొని వచ్చిన తాటకిని స్త్రీ అని కూడా చూడకుండా రాముడు చంపివేశాడు. శ్రీరాముడు సీతా స్వయంవరంలో శివుని విల్లు విరిచి సీతను పెళ్లాడాడు. తర్వాత వనవాసంలో మాయా మృగాన్ని కొట్టాడు. విరాధుడనే రాక్షసుని బాణంతో కొట్టి శాప విమోచనం కలిగించాడు. విరాధుడు పూర్వ జన్మలో తుంబురుడు. కుబేరుని శాపం వల్ల రాక్షసరూపాన్ని పొందాడు. రాముని బాణంతో పూర్వరూపాన్ని ధరించాడు. తర్వాత వాలిని సంహరించాడు. వారిధికట్టి, రావణుని చంపి సీతను తీసుకువచ్చాడు.

రామాయణగాథ ఈ సంకీర్తనలో సంక్షిప్తంగా ఉంది. రాముని తత్త్వాన్ని, అవతార మహత్త్వాన్ని ఈ సంకీర్తనలో అన్నమయ్య స్పష్టం చేశాడు. రాముడు ధర్మసంస్థాపన కోసం వెలసిన విష్ణుని అవతారం, దుష్ట శిక్షణ, శిష్టరక్షణ

ఆయన కర్తవ్యం. విశ్వామిత్రాది మునులు శిష్టులు, వారు చేసే యజ్ఞ కార్యకలాపాలకు ఆటంకం కలిగించే మారీచ, సుబాహాది రాక్షసుల్ని రాముడు మట్టుపెట్టాడు. అంటే తన అవతార ధర్మాన్ని నెరవేర్చాడనే సత్యాన్ని అన్నమయ్య ఈ సంకీర్తనలో భంగ్యంతరంగా తెలియజేశాడు. పరదారాపహరణం గావించిన భ్రష్టులకు రావణునిగతి పడుతుందనే తత్త్వాన్ని కూడా "రావణుజంపి సీత మరల ఁదెచ్చెను" అనే పలుకుల ద్వారా అన్నమయ్య స్పష్టంచేశాడు.

ఒక్క సంకీర్తనలో రామగాథను మొత్తం ప్రస్తావించటం సాధ్య మయ్యే పనికాదు. ఒక్కో సంకీర్తనలో కొన్నికొన్ని ప్రత్యేక ఘట్టాల్ని పొందుపరుస్తూ అన్నమయ్య పలు సంకీర్తనలు రచించాడు. ప్రతి సంకీర్తనలోనూ శ్రీరాముని అవతార తత్త్వాన్ని ప్రతిబింబింప చేశాడు. మరో సంకీర్తనలో కొన్ని విషయాల్ని ప్రస్తావించాడు.

కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసుర వరద జయపరిపూర్ణరామ ॥పల్లవి॥

మునుపు దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనుకొని హరివిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి ॥కౌస॥

సుప్పనాతి శిక్షించి సొరిది రుషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి
కప్పి హనుమంతు బంటుగా నేలుకొంటివి ॥కౌస॥

సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి
చెలఁగిత వయోధ్యలో శ్రీవేంకటేశుఁడా[5] ॥కౌస॥

- ముందు చెప్పిన కీర్తనలోని విషయాలకంటే కొన్ని కొత్త అంశాలు అన్నమయ్య ఈ సంకీర్తనలో వివరించాడు. పరశురాముని వృత్తాంతాన్ని ఇందులో పొందుపరిచాడు. విష్ణుమూర్తి దశావతారాల్లో ఏ రెండు అవతారాలు అంతకుముందుగానీ, ఆతర్వాత గానీ కలుసు కోలేదు. శ్రీరామ, పరశురామావతారాలు మాత్రమే ఏక కాలంలో ఉన్నట్లు తెలుస్తున్నది. అన్నమయ్య శ్రీరామ పరశురాముల వృత్తాంతాన్ని ఈ సంకీర్తనలో ప్రస్తావించాడు. శూర్పణఖను శిక్షించిన విషయాన్ని, హనుమంతుని బంటుగా చేసుకొన్న అంశాన్ని సుగ్రీవునితో మైత్రిని, విభీషణుని మన్నించిన విషయాన్ని ఈ సంకీర్తనలో అన్నమయ్య పొందుపరిచాడు. శూర్పణఖను శిక్షించటంలో దుష్టశిక్షణ తత్త్వాన్ని రామునిలో అన్నమయ్య ప్రదర్శింపజేశాడు. హనుమంతుని బంటుగా చేసుకొని ఆదరించాడు. సేవా తత్పరతను మన్నించే తత్త్వం రామునిలో ఉందని హనుమంతుని ఆదరించడం ద్వారా స్పష్టం చేశాడు. సాటివారితో స్నేహభావాన్ని పెంపొందించుకొనే తత్త్వాన్ని సుగ్రీవునితో మైత్రి నెరపటం ద్వారా రాముడు స్నేహశీలి అనే విషయాన్ని అన్నమయ్య పరోక్షంగా తెలిపాడు. విభీషణుని మన్నించటం ద్వారా శ్రీరామునిలోని శరణాగత వత్సల ధర్మాన్ని స్పష్టం చేశాడు. శత్రు పక్షానికి సంబంధించిన వాడని అతనికి శరణు ఇవ్వవద్దని పలికిన వారి నోళ్లు మూయించి విభీషణునికి శరణు ఇవ్వటం ద్వారా శ్రీరాముని తత్త్వం స్పష్టమవుతున్నది. ఇలాంటి సంకీర్తనమే 4- 159. ఇంకా ఎన్నో సంకీర్తనలిలాంటివి ఉన్నాయి.

అన్నమయ్య వేరొక సంకీర్తనలో శ్రీరాముని శరణాగతి వత్సలత్వాన్ని వివరిస్తూ

"కాకాసురు దోషము కడకుఁబరిహరించి
చేకొంటివి శరణంటేచేరి మగుఁడ
యీకడ మా నేరములు యింతకంటే నెక్కుడా
నీకే నేశరణంటి నీవు మమ్ముఁగాతువు"[6] అని రచించాడు. తనపట్ల తప్పుచేసిన వారిని కూడా శ్రీరాముడు రక్షిస్తాడనటానికి కాకాసుర వృత్తాంతం నిదర్శనంగా నిలుస్తుంది.

మందాకినీ తీరంలో సీత నిద్రిస్తూ ఉండగా కాకాసురుడు కాకి రూపంలో వచ్చి సీతపైట తొలగించి స్తనములమీద గోళ్లతోగీరినప్పుడు శ్రీరాముడు దాన్ని గమనించి బాణంతో కొడతాడు. ఆ బాణపు దెబ్బకు తాళలేక కాకాసురుడు శ్రీరాముని పాదాలమీద పడి రక్షించుమని ప్రార్థిస్తాడు. 'తన బాణం అమోఘమైంది కాబట్టి ఏదో ఒక అవయవాన్ని ఇస్తే గాని బాణపు బలం ఆగదని' శ్రీరాముడు చెప్పినప్పుడు కాకాసురుడు ఒక కన్నునిచ్చి ఆపదను తొలగించుకుంటాడు. తన భార్యపట్ల అనుచితంగా ప్రవర్తించిన అసురుని క్షమించిన క్షమాగుణ సంపన్నుడు శ్రీరాముడు. తప్పు తెలుసుకొన్నవారిని శిక్షించేతత్త్వం రామునికి లేదని ఈ సంకీర్తన ద్వారా గుర్తించవచ్చు.

అన్నమయ్య వేరొక సంకీర్తనలోను

"అంటరాని గద్దకుల మంటి జటాయువుకు నీ
వంటి పరలోక కృత్యములు సేసితివి . . . .
యిరవైన శబరి రుచు లివియె నైవేద్యమై
పరగెనటశేషమును బహు నిషేధములనక"[7] అని రచించాడు. జటాయువుకు శ్రీరాముడు అపకర్మలు గావించిన వృత్తాంతాన్ని, శబరి రుచిచూసి సమర్పించిన పళ్లను స్వీకరించిన విషయాన్ని ఈ చరణాల్లో వర్ణించి శ్రీరాముని భక్తవాత్సల్యాన్ని ప్రకటింప చేశాడు.

శ్రీరాముని సర్వలక్షణ తత్త్వాన్ని వివరిస్తూ అన్నమయ్య రచించిన సంకీర్తనం ఈ విధంగా సాగింది.

రాముఁడు లోకాభిరాముడు త్రైలోక్య -
ధాముఁడు రణరంగభీముఁడు వాఁడె ||పల్లవి||

వరుఁడు సీతకు ఫలాధరుఁడు మహోగ్రపు -
శరుఁడు రాక్షససంహరుఁడు వాఁడే
స్థిరుఁడు సర్వగుణాకరుఁడు కోదండదీక్షా
గురుఁడు సేవకశుభకరుఁడు వాఁడే ||రాము||

ధీరుఁడు లోకైక వీరుఁడు సకలా -
ధారుఁడు భవబంధదూరుఁడు వాడే
శూరుడు ధర్మవిచారుడు రఘువంశ -
సారుఁడు బ్రహ్మసాకారుఁడు వాఁడే ॥రాము॥

బలుఁడు యిన్నటా రవికులుఁడు భావించ ని -
ర్మలుఁడు నిశ్చలుఁ డవికలుఁడు వాఁడే
వెలసి శ్రీవేంకటాద్రి విజయనగరములోన
తలకొనెఁ బుణ్యపాదతలుఁడు వాఁడే [8] ॥రాము॥

- అంత్యాను ప్రాస విన్యాసంతో సాగిన ఈ సంకీర్తనలో శ్రీరాముని విశేషణాల ద్వారా శ్రీరాముని తత్త్వాన్ని ప్రతిబింబింపచేశాడు. రణ రంగంలో భయంకరుడని చెప్పటం ద్వారా యుద్ధభూమిలో తిరుగు లేనివాడని గ్రహించవచ్చు. అలాగే 'మహోగ్రపుశరుడు' అనే విశేషాన్ని ప్రయోగించటం ద్వారా అమోఘమైన రామ బాణంయొక్క గొప్పతనం స్పష్ట మవుతుంది. 'రాక్షస సంహరుడు' అనటం ద్వారా దుష్టశిక్షణ తత్త్వం విశదమవుతుంది. 'సేవకశుభకరుడు ' అని చెప్పటం ద్వారా తనను సేవించే శిష్టులకు మేలు చేకూర్చుతాడనే విషయం తెలుస్తుంది. ఇలా ఈ సంకీర్తనమంతా శ్రీరాముని విశిష్టగుణ ప్రతిపాదకంగా సాగింది.

అన్నమయ్య ఒక సంకీర్తనలో శ్రీవేంకటనాథుని శరణు కోరుతూ రామావతారంలో గావించిన పనుల్ని తనపట్ల కూడా కావించ వలసిందని వేడుకొంటున్న కీర్తన ఈ విధంగా సాగింది.

రామా రామాభద్ర రవివంశ రాఘవ
యేమి యరుదిది నీ కింతటివానికిని ॥పల్లవి॥

నాఁడు రావణుతలలు నఱికినలావరివి
నేడు నాపాపములు ఖండించరాదా
వాఁడిప్రతాపము తోఁడ వారిధిగట్టిననాటి -
వాఁడ విట్టినామనోవార్ధిఁ గట్టరాదా ॥రామా॥

తనిసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి
కినిసి నాయింద్రియాల గెలువరాదా
యెనసి హరునివిల్లు యెక్కు వెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా ॥రామా॥

వరుస విభీషణుఁడు శరణంటేఁ గాచితివి
గరిమ నే శరణంటిఁ గావరాదా
తొరలి శ్రీవేంకటేశు దొడ్డు గొంచ మెంచనేఁ
యిరవై లోకహితాన కేదైనా నేమీ[7] ॥రా॥

- రామావతారంలో రాక్షసుల పట్ల ప్రవర్తించిన శ్రీరామ... ...టిస్తూ అన్నమయ్య తన పాపాలను ఖండించమని, తన మ... ..., తన ఇంద్రియాలను గెలుపుమని, తనను రక్షించుమని వేడ... ...య రంజకంగా సాగింది.

రామకథను పలు సంకీర్తనల్లో వర్ణించిన అ... శ్రీరా... ...ంటు అయిన ఆంజనేయుని గూర్చి ఎన్నో స... ...చాడు. ఆంజనేయుని వర్ణన ద్వారా రామాయణాం... ...స్తావనకు వచ్చాయి.

నేల మిన్ను నొక్కటైననీబంటు వొక్క -
వేలనే యక్షునిఁ దెగవేసెఁగా నీబంటు ॥పల్లవి॥

ఉంగరమెగరవేసి యుదధిలోఁ బడకుండ
నింగికిఁ జెయిచాఁచె నీబంటు
చంగున జలధిదాఁటి జంబుమాలి నిలమీఁద
కుంగఁదొక్కి పదములఁ గుమ్మెఁగా నీబంటు ॥నేల॥

వెట్టగా రావణు రొమ్ము విరుగఁ జేతనే గుద్దె
నిట్టతాడువంటివాఁడు నీబంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగఁ దెచ్చె బాపురే నీబంటు ॥నేల॥

అలర నన్నియుఁ జేసె అజునిపట్టానకు
నిలుచున్నాఁ డదివో నీబంటు
బలువేంకటేశ ఈ పవననందనుఁడు
కలిగి లోకములెల్లఁ గాచెగా నీబంటు [10] ॥నేల॥

- ఆంజనేయుని తత్త్వాన్ని వర్ణిస్తూ ఉంగరాన్ని పైకి ఎగరవేసి సముద్రంలో పడకుండా చేతితో పట్టుకొన్నట్లు వర్ణించాడు. జంబుమాలిని హనుమంతుడు కుంగదొక్కాడని అన్నమయ్య అచ్చతెలుగు పదాల్లో చెప్పాడు. సంజీవని పర్వతాన్ని మందులకొండగా భావించిన అన్నమయ్య ప్రతిభ అమోఘం.

వివిధ వైష్ణవక్షేత్రాల్లో వెలసిన హనుమంతుని అన్నమయ్య పలుసంకీర్తనల్లో వర్ణించాడు. కలశాపురంలోని హనుమంతుని తత్త్వాన్ని అన్నమయ్య ఒక సంకీర్తనల్లో ఈ విధంగా ప్రస్తుతించాడు.

కలశాపురముకాడ గంధపు మాకులనీడ -
నలరేవు మేలు మేలు హనుమంతరాయ. ॥పల్లవి॥

సంజీవికొండ దెచ్చి సౌమిత్రి బ్రతికించితి
భంజించితి వసురుల బలువిడిని
కంజాప్తకులరాఘవుని మెప్పించితివి
అంజనీతనయ వో హనుమంతరాయ. ॥కల॥

లంక సాధించితివి నీలావులెల్లాఁ జూపితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి
అంకెలెల్లాఁ నీకుఁ జెల్లె హనుమంతరాయ. ॥కల॥

దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
మిక్కిలిప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంట వైతివి
అక్కజపుమహిమలహనుమంతరాయ [11] ॥కల॥

- ఇంకా హనుమత్ సంకీర్తనల్ని అన్నమయ్య ఎన్నిటినో రచించాడు. రామునికి ఆంజనేయునికి సీతను గూర్చి జరిగిన సంవాదం కూడా (6-97) అన్నమయ్య రచించాడు.

శ్రీరాముని గూర్చి అన్నమయ్య ఒకచోట "మరిగిన సీతా మంగళ సూత్రము, ధరలో రామావతారంబితడు"(3-419) అని వర్ణించాడు. కొన్ని సంస్కృత సంకీర్తనల్లో అన్నమయ్య రామకథను రచించటం గమనించదగిన విషయం.

అన్నమయ్య సంకీర్తనల్లోని రామాయణ సంకీర్తనలతో పోల్చు కుంటే మహాభారతానికి సంబంధించిన సంకీర్తనలు చాలా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయని చెప్పవచ్చు. రామకథ ఒకే వ్యక్తిమీద కేంద్రీ కృతమైంది కాబట్టి ఒక్క సంకీర్తనలోనే కథను చెప్పటానికి అవకాశం వుంది. కాని, మహాభారత కథ అత్యంత విస్తృతమైంది. బహుపాత్ర యుతమైంది కావటంవల్ల అన్నమయ్య ఒక సంకీర్తనలో మహాభారతాన్ని ఇమడ్చకుండా ఆయా సంకీర్తనల్లో మహాభారత సన్నివేశాల్ని, పాత్రల్ని ప్రస్తావించాడు.

శ్రీకృష్ణుని జన్మను వర్ణిస్తూ అన్నమయ్య శ్రీకృష్ణుడు ఏయేపాత్ర లతో ఎలాంటి బంధుత్వాన్ని కలిగి ఉన్నాడో ఈ విధంగా వర్ణించాడు.

అదర శ్రావణబహుళాష్టమి నేఁడితడు
  నడురేయి జనియించినాఁడు చూడఁగదరే ||పల్లవి||

గొంతిదేవిమేనల్లుఁడు గోపసతులమగఁడు
  పంతపుపాండవులకు బావమరఁది
  వంతుతో వసుదేవ దేవకులకుమారుఁడు
  ఇంతటికృష్ణుఁడు జనియించినాడుగదరే ||అద||

బలరామునితమ్ముఁడు పంచసాయకునితండ్రి
  మలసి మేటైనఅభిమన్యుని మామ
  లలి సాత్యకిసుభద్రకుఁ దోఁబుట్టినయన్న
  ఇలపైఁ కృష్ణుఁడు జనియించినాఁడుగదరే ||అద||

సూరసేనుమనుమఁ డచ్చుగ ననిరుద్ధుతాత
పౌరవయాదవలోకబాంధవుఁడు
ఆరయ శ్రీవేంకటేశుఁ డలమేల్మంగకుఁ బతి
యీరీతిఁ గృష్ణుఁడు జనియించినాఁడుగదరే[12] ॥అడ॥

- శ్రీకృష్ణునికి ఇతర పాత్రలలో ఉన్న బాంధవ్యం ఈ కీర్తనలో వుంది.

మహాభారతంలోని ధర్మరాజు, అర్జునుడు, ద్రౌపది, దుర్యోధనుడు, మొదలైన పాత్రల ప్రస్తావనలే కానీ వారిని గూర్చిన పూర్తి వర్ణనలు లేవు. విధిని ఎవరూ తప్పించు కోలేరని తెలుపుతూ ధర్మరాజును గూర్చి "అతివ నొద్దుగజూదమాడ ధర్మజుఁజేసె . . . .మతి మాలిఁకురురాజు మడుఁగుఁచొర ఁజేసె" (1-134)అని రచించాడు. విధి వ్రాతను ఎవరూ అతిక్రమించలేరనే తత్త్వాన్ని ఈ పలుకుల ద్వారా అన్నమయ్య స్పష్టం చేశాడు. కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదనే సత్యాన్ని అన్నమయ్య పలుకులద్వారా గుర్తించవచ్చు.

శ్రీకృష్ణునికి భక్తులపట్ల ఉండే పక్షపాతాన్ని వివరిస్తూ, ఆయనకు దాస్యం చేసే వారిపట్ల ఆయనే దాసుడై ఉంటాడని అన్నమయ్య ఒక సంకీర్తనలో స్పష్టం చేశాడు.

. . . యిందరి పాలిటికిని ఈశ్వరుడ వేలికవు
పందవై యర్జును బండి బంట వైతివి
వందనకు నేలే దేవతలకే దొరవు
అందపు నీదాసులకు నన్నిటా దాసుడవు" (1-473)

అని అర్జునుని రథసారథ్య విషయాన్ని, శ్రీకృష్ణుని భక్తవత్సలతను అన్నమయ్య ప్రస్తావించాడు.

ద్రౌపదీ వస్త్రాపహరణవృత్తాంతాన్ని స్మరిస్తూ అన్నమయ్య ఒక సంకీర్తనలో "ద్వారకా నగరములో తగ నెత్తమాడేనీకు బీరాన ద్రౌపది మొరవెట్టిన యట్టు" (3-266) అని చెప్పి తనను రక్షించుమని వేడుకొన్నాడు.

కంసుడూ దుర్యోధనుడు శ్రీకృష్ణునితో వైరం పెంచుకొని సమసి పోయారని భారత విషయాన్ని అన్నమయ్య ఒక సంకీర్తనలో చెప్పాడు.

శ్రీకృష్ణుని అవతార తత్త్వం దుష్టశిక్షణ శిష్టరక్షణమని తెలుపుతూ అన్నమయ్య ఒక సంకీర్తన రచించాడు.

ఎంతకత నడిపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా ॥పల్లవి॥

కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరిచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచేకొరకైతే నీచే చక్ర -
మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా[13] ॥ఎంత॥

శ్రీకృష్ణుని గూర్చి అన్నమయ్య 'ఎంత కత నడిపితివి'అని అద్భుతంగా చెప్పాడు. కౌరవ పాండవులకు కలహంపెట్టి దుష్టశిక్షణ, శిష్టరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు భావించిన అన్నమయ్య ప్రతిభ అనన్య సామాన్యం.

భగవద్గీత తత్త్వాన్ని అన్నమయ్య కొన్ని సంకీర్తనల్లో పొందు పరిచాడు. "వాసాంసి జీర్ణాని యథావిహాయ "(2-22) "నైనంఛిన్దన్తి శస్త్రాణి"(2-23) అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయం (2-24) శ్లోకాల భావాన్ని అన్నమయ్య దేహినిత్యుడు దేహము లనిత్యాలు యీహల నామనసా యిది మరవకుమ"[14] అనే కీర్తనలో వివరించాడు.

శ్రీకృష్ణుని విశ్వరూపాన్ని గూర్చి వివరిస్తూ అన్నమయ్య

"అనంత సూర్యచంద్రులు అనంతవాయువులును
అనంత నక్షత్రములనంత మేరువులు
కొనలు సాగీనన్నిటి కూటువ గూడుకొన్నట్టు
అనంతుఁడొక్కడే మించీనాది మూరితి" (2-499) అని వర్ణించాడు.

అన్నమయ్య సంకీర్తనల్లో ఎన్నో పౌరాణికాంశాలున్నాయి. ఇంకెన్నో ఐతిహాసికాంశాలున్నాయి. మహాగ్రంథాలైన భాగవత, రామాయణ భారతగ్రంథాల అంశాల్లో అన్నమయ్య సంకీర్తనల్లో భాగవతం ఎక్కువగా

ప్రస్తావితమైంది. ఆ తర్వాతిస్థానం రామాయణానికి ఆ తర్వాతస్థానం భారతానిదని చెప్పటం సముచితం.

ఎంతటివారలు నెవ్వరును హరిఁ
జింతించక నిశ్చింతులు గారు ॥పల్లవి॥

అతిజితేంద్రియులు ననశనవ్రతులు -
నతులతపోధనులగువారు
చతురాననగురుస్మరణము దొరకక
తతి నూరక పుణ్యతములు గారు[15] ॥ఎంత॥

## పాదసూచికలు

1. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 160
2. ఆంధ్రమహాభారతము - ఆదిపర్వము 1- 31
3. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 162
4. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 474
5. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 275
6. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 3- 128
7. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 399
8. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 219
9. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 437
10. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 1 - 69
11. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 3- 521
12. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 4- 160
13. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 315
14. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 2- 419
15. అన్నమయ్య అధ్యాత్మిక సంకీర్తనలు 1- 32

★ ★ ★

సి.లలితారాణి

# అన్నమాచార్య సంకీర్తనలలో ప్రతిఫలించిన పౌరాణిక గాథలు - తాత్త్వికత

## 1. ఉపోద్ఘాతం

"నాదేన వ్యజ్యతే వర్ణః పదం వర్ణాత్పదాద్వచః ।
వచసో వ్యవహారోఽయం నాదాధీనమతో జగత్"[1] ॥

అఖిల భువనకర్త సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సకల భూతపతి ఈశుని నిశ్శ్వాస రూపము, సంగీతమయం ఈ జగత్తు. పరమేశ్వరుడు స్తుతిప్రియునిగా, విష్ణువు వేణుమృదంగ వాద్య గానప్రియునిగా, బ్రహ్మ సామగాన ప్రియునిగా లోకంలో దర్శనమిస్తున్నారు. అలాగే స్తుతితో భవాని, వాద్యమంగళగీతికలతో సముద్రతనయ, వీణానాదముచే బ్రాహ్మీ ఆనందాన్ని అనుభవిస్తారని పెద్దలవచనం.

అకారం బ్రహ్మణో రూపముకారం విష్ణురూపవత్ ।
మకారం రుద్రరూపం స్యాదర్ధమాత్ర పరాత్మకమ్ ॥
వాచ్యం తత్పరమం బ్రహ్మ వాచకః ప్రణవః స్మృతః
వాచ్యవాచక సమ్బన్ధస్తయో స్యాదౌపచారికః[2] ॥

సృష్టి నాదంనుంచి ఆరంభమయినది. నాదమునుంచి అక్షరం, అక్షరంనుంచి శబ్దము, శబ్దంనుంచి వాక్యం తరువాత సంభాషణ ఇత్యాదులు ఉద్భవించాయి. శార్ఙ్గదేవాదుల అభిప్రాయము - 'లోకములు అన్నియునూ నాదస్వరూపాలే అని' 'సిరివెన్నెల' చలన చిత్రములోని పాటని మనం ఒకసారి పరిశీలిస్తే నాదము ఎంతగొప్పదో, ప్రకృతి నాదమయమనే విశేషము మనకు స్పష్టంగా తెలుస్తుంది -

'విరించినై విరచించితిని ఈ కవనం
విపంచినై వినిపించితిని ఈ గీతం
నా ఉచ్ఛ్వాసం కవనం నానిశ్వాసం గానం
వేదన పొందిన స్పందన ధ్వనించుహృదయమృదంగధ్వానమ్'[3] ॥

## ప్రకృతినాదమయం

ఇదమన్ధతమః కృత్స్నం జాయేత భువనత్రయమ్ ।
యది శబ్దాహ్వయం జ్యోతిః ఆసంసారాత్ న దీప్యతే[4] ॥

శబ్దంలేకుండా జ్యోతివెలుగదు. అంతా అంధకారభాజమే. సమస్త జగత్తు రాగ రంజితం. అందు వల్ల రాగానికి ఆకర్షితులవని వారు ప్రపంచంలో ఉండరు అని మనకు ఈశ్లోకం ఉదహరిస్తోంది.

'శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణీ।
స ఏవ శఙ్కరో వేత్తి సమగ్రం వేత్తి నాపరః'[5] ॥

## 2. వాగ్గేయకారలక్షణం

సాక్షాత్ సరస్వతీ స్వరూపము వాక్కు. గీతంలేక గేయం బ్రహ్మ స్వరూపం. ఈ వాగ్గేయాల కలబోతయే వాగ్గేయకారుడు.

వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే ।
వాచం గేయం చ కురుతే యః సః వాగ్గేయకారకః[6] ॥

### 2.1. కవిపరిచయం

దక్షిణదేశంలో శ్రీనివాసుని కీర్తనచేసిన కవులు ఎందరో దర్శన మిస్తున్నారు. కన్నడహరిదాసులలో శ్రీపాదరాయలు, వ్యాసరాయలు, పురందర, కనకదాసులు సుప్రసిద్ధులు.

ఆంధ్రవాఙ్మయంలో ప్రథమ వచన సంకీర్తనాచార్యులు శ్రీకృష్ణమాచార్యులు. సలక్షణ సంకీర్తన రచనకు ఆద్యుడు తాళ్లపాక అన్నమయ్య.

ఈయన హరికీర్తనాచార్యునిగా, సంకీర్తనాచార్యునిగా, పదకవితా పితామహునిగా, పేరుపొందిన అన్నమయ్య తెలుగులో, సంస్కృతంలో అద్భుతమైనటువంటి కీర్తనలను రచించారు.

## 3. కీర్తనలు

అన్నమయ్య 32వేల కీర్తనలలోతెలుగు కీర్తనలకు అధిక ప్రాధాన్యం యిచ్చారు. అయితే వీటిలో సంస్కృతంలో 200 పైగావున్నాయి. కలియుగంలో సంకీర్తనం వేదంగా ప్రసిద్ధి చెందినవి.

'క్రూ' వికీర్ణే ఇతి ధాతోః లూట్ ప్రత్యయే 'సం' ఉపసర్గ, సహితే సంకీర్తనం ఇతి శబ్దం నిష్పద్యతే', కృత సంశబ్దనే కీర్తనం. సమ్యక్ తయాకీర్త్యతే అనేన ఇతి సంకీర్తనం. "కలౌ స్మరణాన్ ముక్తిః" అన్నట్లు వేంకటేశ్వరుని స్తోత్రరూపంగ, పురాణ తత్త్వరీతిలో మనకు అన్నమయ్య అందించారు.

## 4. సంకీర్తనలు పౌరాణిక ప్రతిబింబం - తాత్త్వికత

అమృతతుల్యమయిన అలంకారశాస్త్రానికి అనుగుణంగా అన్నమయ్య పలుకీర్తనలు రచించారు. వీరి సంకీర్తనలలో ఎక్కువగా పురాణ తత్త్వం మనకు దర్శనమిస్తుంది. ఇహపర ముక్తి సాధనాన్నిచ్చే ప్రేమ జీవకోటికి అనుసరణీయం. నిగూఢంగా పరతత్త్వాన్ని బోధించేవి పురాణాలు. అందుకే 'పురా నవం భవతీతి పురాణమ్' అంటారు. సర్గ - ప్రతిసర్గ - వంశ - మన్వంతర - వంశానుచరితాలతో కూడినది పురాణం. అన్నమాచార్యుల కీర్తనలు పురాణానికి ప్రతిబింబం అనడానికి ఎటువంటి సందేహము లేదు.

### 4.1. కీర్తనలు పౌరాణికత

నారాయణ తే నమో! నమో![7] ॥ ------ అని

అన్నమయ్య మొట్టమొదటగా నారాయణుని స్తుతిస్తూ హేమాధవ! మురహర! భవహర! నరమృగ శరీరం గలవాడా అని స్తుతించారు।

నాద ప్రియునిగా కూడా స్తుతించారు. ఈ కీర్తనను మనం పరిశీలిస్తే సంపూర్ణంగా పురాణతత్త్వం అందులోని అవతార ప్రశస్తి భాగవత పురాణం మన కనుల ముందు కదలాడుతుంది.

ప్రత్యేకంగా నారసింహావతారం, వామనావతారం, కృష్ణావతారం మనకు అత్యంత రమణీయంగా ప్రతిఫలిస్తుంది. తాత్త్వికత - బ్రహ్మవైవర్త పురాణం, భాగవతపురాణం, వామన పురాణాలలోని విషయాలు సంకీర్తనలలో వర్ణితాలు.

4.1.1. కరుణానిధిం గదాధరం[8]॥

అన్నమయ్య ఈ కీర్తనలో భాగవతాన్ని రచించినటువంటి శ్రీశుకుని రక్షించిన వానిగా శ్రీనివాసుని దర్శింపచేసుకున్నారు. రామావతారాన్ని గూర్చి వర్ణిస్తూ లంకాహరణం, లక్ష్మీరమణం అనే పదాలతో స్వామిని స్తుతించడం ముదావహం. - విష్ణుపురాణం, భాగవత పురాణ తత్త్వం ఈ కీర్తనలో ప్రస్ఫుటిస్తుంది.

4.1.2. శ్రీశోఽయం సుస్థిరోఽయం[9]॥

లక్ష్మీసహితుడు, సుస్థిరుడు వేంకటాద్రినాథుడని రుక్మిణినాథునిగా స్వామి వర్ణించారు. "భృగు మునినా సంప్రీతోఽయం" అనే ప్రసక్తి వరాహపురాణం, భవిష్యోత్తర పురాణ విశేషాలు అన్నమయ్య ప్రదర్శించారు. నైమిశారణ్యంలో పురాణాలు పుట్టాయంటారు. కాని ఈ కీర్తన శుకుని ముఖతః మునులందరూ స్వామిని సులభంగా ప్రసన్నం చేసి కొన్నట్లుగా మనకు దర్శనమిస్తుంది. రుక్మిణీ దర్శనాపేక్ష గల స్వామిని మనం ఈ కీర్తనలో దర్శిస్తాము.

4.1.3. బ్రహ్మ కడిగిన పాదము బ్రహ్మము తానే నీపాదము[10]॥

ఈ సంకీర్తనలో అన్నమయ్య బ్రహ్మ కడిగిన పాదము, బలి చక్రవర్తి గర్వమడిచిన ఈ పాదం బలితలపై ఉంచిన పాదం, యోగులకు వరాన్ని ఇచ్చెడి పాదం శ్రీనిధి పాదం అని వర్ణించారు. - ఈ వామన పురాణం,

బ్రహ్మపురాణ, విష్ణుపురాణ, భాగవత పురాణ తత్త్వం ఈ కీర్తనలో దర్శనమిస్తుంది. రామావతార విషయం స్పష్టంగా కనిపిస్తుంది.

4.1.4. కల్కి రూపములో శ్రీనివాసుడు అశ్వాన్నిఅధిరోహించి రావటం కనిపిస్తుంది. కలియుగంలో సంకీర్తనమే వేదమని అన్నమయ్య ఇక్కడ వివరించారు.

కలియుగంబునకు గలదిదియే
వెలసిన పంచము వేదమె కలిగె ॥పల్లవి॥

పరమగు వేదము బహుళము చదివియు
హరి నెఱిఁగిన వారరుదనచు
తిరువాముడియై దివ్యమంత్రమై
వెరసిన పంచమ వేదమె కలిగె ॥

బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకెదీర దెచ్చట ననుచు
సంకీర్తనమె సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె[11] ॥

కొందరు మేము వేదపండితులం అని గర్వంగా చెప్పకోవడం చూస్తాం. కాని, వేంకటేశ్వర నామజపం చేస్తే చాలు అదే వేదం అంటారు అన్నమయ్య.

4.1.5. మర్దమర్ద మమబంధాని దుర్దాంతమహద్దురితాని[12] ॥

అన్నమయ్య ఈ కీర్తన తన భవబంధాలను, పాపాలను పోగొట్ట మని స్వామిని ప్రార్థిస్తూ, గజేంద్రమోక్ష ఘట్టాన్ని ఇక్కడ చక్కగా దర్శింప చేశారు. సుదర్శన భగవానుడు అందరిని సంహరించడాన్ని తెలియజేస్తుంది.

కిం కరిష్యామి కిం కరోమి బహుల
శంకాసమాధాన జాడ్యంపహామి

నారాయణం జగన్నాథం త్రైలోక
పారాయణం భక్తపావనం
దూరీకరోమ్యహం

ఇందులో భాగవతపురాణాన్ని అన్నమయ్య మనకు దర్శింపచేశారు.

4.1.6. మంధరధరమధుసూదన నందగోపనందన[13] ॥

ఈ కీర్తనలో నరసింహునిగా, కరివరదునిగా గరుడునిపై వచ్చే స్వామిగా, విష్ణు పురాణాంతర్గత విషయాలు మనకు దర్శన మిస్తున్నాయి. ఇక్కడ తత్త్వరహస్యాలు ఏమిటంటే దుష్టశిక్షణ చేసి మనలో ఉన్న అహంకారాన్ని పోగొట్టే విశేషాలు కనపడుతున్నాయి.

4.1.7. భావములోన బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా[14] ॥

సృష్టి ఆరంభం ఇక్కడ వర్ణింపబడినది. ఆదిలో ఒక ఆత్మతత్త్వం ఉంది. దాని నుండే అన్నీ ఉద్భవించాయి. అవి హరి అవతారములే అని మత్స్య పురాణ విషయం ఇక్కడ స్పష్టం చేశారు అన్నమయ్య. - హే మానవు లారా! మనమందరం విష్ణురూపాలమే. హరి హరి హరి అని పిలవండి, కొలవండి "ఈశావాస్యమిదం సర్వం" అన్నట్లుగా వేవేతి వ్యాప్నోతి విష్ణుః । సమస్త ప్రపంచం విష్ణుమయం, వేంకటేశ మయం అని నొక్కి వక్కాణిస్తున్నారు.

4.1.8. త్వమేవ శరణం త్వమేవ శరణం కమలోదర శ్రీజగన్నాథ[15]॥

అన్నమయ్య ఈ కీర్తనలో పరమ వాత్సల్యనిధీ పూరీజగన్నాథుని వర్ణించాడు. ఈ విషయాలు స్కాందపురాణంలో వైష్ణవఖండంలో పురుషోత్తమ మాహాత్మ్యంలో మనకు స్పష్ట పరుస్తుంది. అద్భుతమైన ఈ కీర్తనలో మనకు వాసుదేవుడైన శ్రీకృష్ణుని వర్ణన, వామన, నృసింహావతార వర్ణనలు, సుభద్రకు, బలభద్రునికి అత్యంత ప్రీతిపాత్రుడై, పాలజలనిధిలో

జన్మించి, ఏనుగును రక్షించిన స్వామి నిత్య వైభవరాయుడు శ్రీనివాసుని కన్నుల ముందు ఉంచుతుంది. పై కీర్తనలో స్కాంద, వామన పురాణముల తత్త్వం అభివర్ణితం, కలి దోషాలు పోగొట్టేస్వామి జగన్నాథుడు, ఆ జగన్నాథుడే నిత్య వైభోగములతో మనకు దర్శన మిస్తున్నారు.

4.1.9. నమో నారాయణాయ నమః
సమధి కానందాయ సర్వేశ్వరాయ
ధరణీ సతీఘనస్తనశైల పరిరంభ
పరిమల శ్రమజల ప్రమదాయ[16] ॥

నిరంతరం ఆనందజనక తత్త్వజ్ఞుడైన నారాయణునకు నమస్కరించుచున్నాను. వరాహపురాణ ఆరంభంలో ధరణీ మాతను ఉద్ధరించిన స్వామిగా వర్ణితం. సత్యభామచే పరిచర్యలందే స్వామిగా సాక్షాత్తు పరతత్త్వమున భాగవత, విష్ణు పురాణాల తత్త్వం మనకు దర్శనమిస్తోంది. విష్ణుతత్త్వం పూర్తిగా కన్పిస్తోంది. కైవల్య కాంతను ఆలింగనం చేసుకున్న మూర్తిని సాక్షాత్కరింపజేస్తున్నారు అన్నమయ్య. అంటే - వరాహపురాణ, మత్స్యపురాణ విషయాలు వర్ణితాలు.

4.1.10. అయమేవ ఆదిపురుషో జయకరం తమహం శరణం భజామి[17]॥

ఈ పురుషుడు ఆది అంత్యాలు లేనివాడుగా దర్శన మిస్తున్నారు. వటపత్ర శాయిగా, పది అవతారాలతో దుష్టరక్షణ చేస్తూ శ్రియఃపతిగా సమస్తభువనాలను ఆక్రమించి ప్రియభక్తపోషకునిగా, యాచకులకు వరదునిగా మనకు అన్నమయ్య దర్శింప చేశారు. అష్టాదశ పురాణాలలో ఈ అంశాలు మనకు కనిపిస్తాయి. - మత్స్యపురాణము నుండి అష్టాదశ పురాణలలో విష్ణువు యొక్కతత్త్వం దశావతారాల పరిణామం సుస్పష్టం. 'అయమేవ వేదవేదాన్తశ్చైవ సూచితో2ప్యయ మేవ' ఈ వాక్యం వేదాన్త తత్త్వానికి సూచకంగా విష్ణువుని దర్శింప చేశారు.

4.1.11. తిరువీధుల మెరసీ దేవదేవుడు గరిమలమించిన సింగారముల తోడను[18]॥

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవ వాహనక్రమాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో వర్ణించాడు. ఇదే వాహనక్రమాన్ని వరాహపురాణం, భవిష్యోత్తరపురాణం వర్ణిస్తున్నాయి. శ్రీపదమైనటు వంటి పురవీధులలో స్వామి శ్రీనివాసుడు భక్తులకు ఆనందాన్ని కలుగజేస్తూ సంచరిస్తారు. మొదట పల్లకీ, రెండవరోజు శేషుని, మూడవరోజు ముత్యాలపందిరి, నాల్గవ రోజు కల్పవృక్షం, సర్వభూపాల వాహనంలో, ఐదవరోజు గరుడ వాహనం, ఆరవనాడు ఏనుగు, ఏడు సూర్యప్రభ, ఎనిమిది తేరు, గుర్రాలపై స్వామి సంచరిస్తారు. - అన్నమయ్య వర్ణించని వాహనాలు భవిష్యోత్తర పురాణంలో స్పష్టంగా వర్ణించబడినవి. అవి - హంస, సింహ, సర్వ భూపాల, హనుమంత వాహనాలు. శ్రీనివాసుని దివ్య తత్త్వాన్ని వాహనములన్నీ, సేవకులుగా సేవించి భజించినట్టుగా తత్త్వదర్శి వర్ణించారు.

4.1.12. అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తనలలో మహావిష్ణువు విశేషాలను పురాణ తత్త్వాన్ని ఇలా వర్ణించారు.

మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన

లేదు వేద విధి లేశమును
మేదిని భరమై మించినది
పాదుపడదు చూపరకు భువి
గాదిలి సుతుపై గనలె జనకుడు

కనకము చవిచెడె గడు గడును
ఘన నృప బాధలు గదమినవి
ధనుజుల కతివలు దల కెదరు
ఎనయ బలాధికు లెవ్వరు లేరు

అసుర సతుల పుణ్యము ఘనము
కస (సి) మసగెడి కలికాల మహిమ
పసగల వేంకటపతి యికను
వసుధలోని నెవ్వగలుడుపగను[19] ॥

తాళ్లపాక అన్నమయ్య మేలుకొలుపు సంకీర్తనలో పాలకడలిలో శయనించిన శ్రీమహావిష్ణువు దగ్గరికి దేవతలు కదలివచ్చి స్తోత్రం చేసినట్లుగా స్పష్టం. హే ప్రభో! భూమి లేశమాత్రంగా కూడ రాక్షస భారాన్ని మోయలేక పోతుంది. కనుక రాజుల బాధలు, ప్రజలబాధలు తీర్చడానికి నీవు వసుధకు రా అని ప్రార్థనాపూర్వక కీర్తన. - ఇది మత్స్య, వామన, కూర్మ పురాణగాథ సన్నివేశ దృశ్యమిది.

4.1.13. ఇందరికి నభయంబు లిచ్చు జేయి
కందువగు మంచి బంగారుచేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
కలికి యగు భూకాంత కౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాడిచేయి ॥ఇంద॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
ఒనరంగ భూదాన మొసగు చేయి
మొనసి జలనిధి యమ్ముమొనకు దెచ్చిన చేయి
ఎనయ నాగేలు ధరియించు చేయి ॥ఇంద॥

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుబరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల తెలిపెడి చేయి[20] ॥ఇంద॥

రుచిరమైన ఈ కీర్తనలో వేంకటనాథుని అభయహస్తం వేదాలను మరలా తీసుకొని వచ్చి భూకాంతను తన కౌగిలిలో ఇముడ్చుకొని

యథాస్థితిని నిలిపినది. వామనావతార తత్త్వం, బలరామావతారం, కృష్ణావతారం, కల్కి అవతారంగా అశ్వాన్ని అదలించే చేయిగా మోక్షమిచ్చే చేయిగా ద్యోతకమవుతున్నది. - వామన, అగ్ని, పురాణాల ఈ విశేషాంశాలను మనకు వివరిస్తున్నాయి. యథాతథంగా ఈ కీర్తనలో ఆ విశేషాలను సుస్పష్టంచేశారు అన్నమయ్య. ఎన్ని జన్మలెత్తినా మానవుడు మోక్షసాధన కొరకు నిరంతరం తపించాలి. అటువంటి సులభ మోక్షోపాయాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో క్రోడీకరించారు. మోక్షాన్నిచ్చే చేయిగా శ్రీనివాసుని అభయహస్తాన్ని కొనియాడారు.

4.1.14. కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు[21]॥

శ్రీనివాసుడు బంగారు పుష్పాలతో పూజించే తొండమానుని కంటే కుమ్మర దాసుడు పూజించిన మట్టి పుష్పాలకే వరములిచ్చారు. తొండమాన్ చక్రవర్తి వీరశర్మ భార్య చనిపోగా దానిని రహస్యంగా వుంచి అస్తితీర్థంలో ఆమె శరీరాన్ని ఒకసారి స్నానం చేయించమని చెప్పి ఆమెను పునర్జీవితురాల్ని చేశారు. తప్పులు చేసిన వాడ్ని కూడా రక్షిస్తాడని అనంతాళ్వాన్‌కు స్వామి మట్టిని మోసి మంచి వాడుగా కరుణను కురిపించిన దేవునిగా శ్రియఃపతిని దర్శింపచేశారు అన్నమయ్య. సప్తగిరుల ప్రాశస్త్యం, స్వామి పుష్కరిణి మాహాత్మ్యం, బ్రహ్మ, పద్మ, మార్కండేయ, భవిష్యోత్తర, బ్రహ్మవైవర్త, వరాహ. స్కాంద, వామన, గరుడ, బ్రహ్మాండ, ఆదిత్య, హరివంశోత్తర, పురాణాలలో వివరించిన విశేషాలు, కథలు, గాథలు, పై కీర్తనలో వర్ణించబడ్డాయి. - "కలౌస్మరణాన్ ముక్తిః" అను ఆర్యోక్తి ననుసరించి కలియుగ అవతారమూర్తి శ్రీనివాసుని భక్త పరాయణునిగా వర్ణించిన వరాహ, భవిష్యోత్తర పురాణ విశేషాలు

"కృతే వరదరాజస్తు, త్రేతాయాం రంగనాయకః
ద్వాపరేతు జగన్నాథ, కలౌవేంకటనాయకః
కృతే వృషాద్రింవక్ష్యంతి త్రేతాయాం అంజనాచలం ।
ద్వాపరే శేషశైలో2యం కలౌ శ్రీవేంకటాచలం ॥"

4.1.15. జో అచ్యుతానంద జోజో । ముకుందా
రావె పరమానంద రామగోవిందా।[22] ॥

పోతన భాగవతంలోని జోలపాటను శ్లోకరూపంలో కన్పిస్తుంది. తెలుగు వారి ఇండ్లలో ఈ జోలపాట పాడని తల్లి లేదనడంలో సందేహంలేదు. జో జో కమలదలేక్షణ జో జో మృగరాజ మధ్య, జో జో కృష్ణా, జో జో పల్లవ కరపద జోజో పూర్ణేందు వదన జోజో యనుచున్

పైన వర్ణించిన జోలపాటకంటె తెలుగు తల్లులకు పదకవితలో రుచిరమైన కీర్తిని ఇచ్చిన వ్యక్తి అన్నమయ్య, భాగవత పురాణతత్త్వం మనకు గొల్లపిల్లలతో వెన్న దొంగలించిన విషయాలు మీగడ తిని కోడలి మూతిపై వ్రాసిన చందాలు, ఒకని ఆలిని తెచ్చి వేఱొకరికి కట్టబెట్టి జగడాన్ని కల్పించిన బాలుని వర్ణన, గోవర్ధన పర్వత విశేషాలు, మధురాపుర ఆగమన విశేషాలు తాళ్లపాక అన్నమయ్య శృంగార రచనగా చెప్పిన జోల తిరుపట్ల మదన గోపాలుని మకుటంతో పూర్తిచేశారు.

4.1.16. క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని నీరజాలయమునకు నీరాజనం[23]॥

ఇది మంగళహారతిగా తెలుగు మహిళలు ఎప్పటికీ పాడుకొనే చక్కని హారతిపాట. పద్మపురాణాంతర్గతమయిన ఈ కీర్తన సముద్రతనయ సంపూర్ణ అవయవ విశేషాలను శ్లాఘించే కీర్తన. దేవీభాగవతం, అగ్నిపురాణం, విష్ణుపురాణాల్లో విపులంగా వర్ణింప బడ్డాయి.

4.1.16. కంటినఖిలాండ తతి కర్తనధికుని గంటి,
కంటి నఘములు వేడుకొంటి నిజమూర్తి గంటే![24] ॥

బ్రహ్మాండ, స్కాంద, బ్రహ్మ, వరాహ, భవిష్యోత్తర పురాణ అంశాలు ఈ కీర్తనలో వర్ణితాలు, ఫణామణి ప్రదేశ విషయము

"ఫణామణి ప్రదేనో2యం వేంకటాద్రి రితి స్మృతః ।
శేషాద్రిః వృషభాద్రిశ్చ నారాయణ గిరి స్తథా"[25] ॥

4.1.17. ఆది మూలమే మాకు ఆదిరక్ష, శ్రీదేవుడే మాకు జీవరక్ష[26]॥

వ్యాసభాగవతంలోని నారాయణకవచం ఇక్కడ అభివర్ణితం. సమస్త అవతారాలు రక్ష కల్పిస్తాయి. శ్రీవేంకటేశ్వరుడు సర్వరక్షకునిగా ఇక్కడ వర్ణించడం విశేషం.

4.1.18. వెదమంత్ర మికనేల వేరు వెల్లంకులునేల,
పుడమి ధరుడు మాకు భువనౌషధము
శ్రీవేంకటేశుడే మాకు .సిద్ధౌషధము[27] ॥

వేరే మంత్రములతో పని ఏమున్నది. నారాయణ మంత్రమే దివ్యౌషధ మని కీర్తనలోని భావం పంచమవేదమైన మహాభారత అనుశాసన పర్వంలోని స్తోత్రరాజమనదగ్గ విష్ణుసహస్రనామంలో వర్ణించిన విధంగా ఈ కీర్తన మనకు కన్పిస్తుంది.

ఆర్తవిషణ్ణా శిధిలాశ్చ భీతాః ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః
సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం విముక్తదుఃఖా సుఖినో భవన్తు[28]॥

4.1.19. నీకథామృతము నిరత సేవన నాకు[29]॥

భాగవత పురాణంలోని సకల శాస్త్రమంత్రరాజ బ్రహ్మవిద్యోపదేశం, ఉపనిషద్ వాక్యపద్ధతి తపవిరహితకర్మ తిరు వేంకటనాథుని సంస్మరణం అన్నీ మనకిస్తుంది. ఇది అష్టాదశ పురాణాలసారానికి సంబంధించిన కీర్తన.

## 5. ఉపసంహారం

తెలుగు లోగిళ్ళలో హరినామ సంకీర్తనానందాన్ని వెల్లవిరియించింది 14వ శతాబ్దం. హరి అవతారం అన్నమయ్య అప్పనివర ప్రసాదం అన్నమయ్య తెలుగుతల్లి ముద్దుబిడ్డ, సకల పాపహరుడు, శ్రీనిధి ప్రియపుత్రుడు ముప్పది రెండువేల కీర్తనలు రచించి పదకవితా పితామహుడుగా, సంకీర్తనాచార్యునిగా, శ్రీహరిదాసునిగా జీవితాన్ని ధన్యం చేసికొన్న ఆంధ్రమాతకు ఎనలేని కీర్తిని తన కీర్తనల ద్వారా

సాహిత్య ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన మహనీయుడు మన అన్నమయ్య అనడంలో నాస్తి సంశయలేశం.

"ద్వాత్రింశత్ సాహస్ర్యా సుధామధుర గీతికాభి రహినగత్రయమ్।
కలియుగ దేవంశ్రశం య్యోస్తుత తస్మై నమోఽ న్నమాచార్య"[30]॥

"శ్రీరమణీమణి ప్రమద జీవన వాస వాసవా !
ధార విశేష శేష వసుధాధర నాధ విహార హారకే
యూర విరాజి రాజిత మహోన్నత దేవ భుజంగ జంగమ
స్మేర వికల్ప కల్పకమ మిమ్ము నుతించెద వేంకటేశ్వరా"![31]॥

## పాదసూచికలు

1. సంగీత రత్నాకరః VOL. 11.22.
2. బృహన్నారదీయము - పు 31
3. సిరివెన్నెల సీతారామశాస్త్రి పాట -1
4. కావ్యదర్శః- 1.4
5. సంగీతలక్షణ సంగ్రహః - పు.56
6. సంగీత రత్నాకరః VOL. 1.3.2
7. గీతికా నక్షత్ర మాలికా -పు.సం.3
8. I bid పు.సం-5
9. I bid పు.సం-6
10. N.O.A - A. పు - 176
11. I bid పు..584
12. గీ.న.మా-పు.7
13. I bid పు.9
14. తా.పా.అ.జీ.చ-పు.10
15. గీ.న.మా - పు.,9

16. I bid - పు..11
17. I bid పు..13
18. శ్రీ.తా.అ.జీ.చ -పు.65
19. తా.అ.సం.ఉ.వి -పు.21
20. N.O.A పు.544
21. I bid పు..184
22. I bid పు..474
23. I bid పు..193
24. I bid పు..552
25. బ్ర.తీ -పు.238
26. N.O.A పు.574
27. N.O.A పు.418
28 వి.స.స్తో.పు.59.శ్లో.33
29. N.O.A పు.502
30. గీ.న.మా -పు.1
31. తీ.సా-పు.133

## ఉపయుక్త గ్రంథసూచి


1. Nectar Ocean of Annamacharya, Ambica Ananth, Adviteeya N.Dixit, T.T.D 2005
2. తిరుపతి క్షేత్రసాహిత్య సమీక్ష, రాంపల్లి.నాగభూషణం,1980
3. తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవ విశేషాలు, డా.చిట్రాజు.గోవిందరాజు, 1987.
4. మనలిపి పుట్టు పూర్వోత్తరాలు, తిరుమల రామచంద్ర, 1983
5. శ్రీవేంకటేశ్వర గీతికానక్షత్రమాలికా - అన్నమాచార్య, పరిష్కర్తా, Prof. N.C.V. నరసింహచార్య T.T.D, తిరుపతి,1984

6. పదకవితా పితామహస్య తాళ్లపాక అన్నమాచార్యస్య సంస్కృత సంకీర్తనాః ఏకమధ్యయనమ్ - డా.దక్షిణామూర్తి శర్మ, 1997

7. శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర డా.కేసర్లవాణి, తి.తి.దేవస్థానములు, తిరుపతి, 2000

8. అన్నమాచార్యుల సంకీర్తనలు - స్త్రీ సంబంధిత పాటలు, ఎన్. సుగుణ, 1986

9. శ్రీవేద వ్యాస భాగవతం, షష్ఠస్కందే అష్ఠమాధ్యాయః, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్స్వామి,చిత్తూరు,1975

10. భాగవతం తెలుగు,బమ్మెరపోతన,తి.తి.దేవస్థానములు,తిరుపతి, 2005

11. విష్ణుసహస్రనామ స్తోత్రము,తి.తి.దేవస్థానము,తిరుపతి, 2006.

★ ★ ★

బూదాటి వేంకటేశ్వర్లు

# అన్నమయ్య తాత్త్వికత

తెలుగు కావ్యసరస్వతికి శ్రీకారం నన్నయ్య. పదకవితా సరస్వతికి క్రేంకారం అన్నమయ్య. నన్నయ్య మార్గం'మార్గ' పద్ధతి, అన్నమయ్య మార్గం 'దేశి' పద్ధతి. సాధారణంగా ఈ రెండుమార్గాలకు చుక్కెదురని భావిస్తారు కాని వాస్తవానికి రెండూ పరస్పర ప్రభావితాలైన సాహిత్య మార్గాలే. ఎందుకంటే, 'మార్గకు, మార్గము దేశియ' కాబట్టి; రెండు పరస్పర పరిపూరకాలే. అన్నమయ్య దేశిమార్గం చేత ప్రభావితుడైన సంప్రదాయ పండితుడు. అన్నమయ్యను గురించి సాధికారంగ మాట్లాడాలంటే కన్నడ తమిళ భాషలు కూడ తెలిసి ఉండాలి. ఎందుకంటే అన్నమయ్యకు కన్నడ తమిళ భాషలలో తలస్పర్శి పాండిత్యం ఉంది కాబట్టి.

అన్నమయ్యది స్వతంత్ర వ్యక్తిత్వం. ఈ స్వతంత్రత ఒక్క భావుకత విషయంలోనే కాదు బహుధా దర్శింపవచ్చు. అసలు కవిశబ్ద వాచ్యుడెవడైనా భావుకత లేకుండ కవి కాలేడు. "దర్శనాద్వర్ణనాచ్చాధ రూఢా లోకే కవిశ్రుతిః"- అని భట్టలోల్లటుడు చెప్పిన దానికి మూలం భావుకతే కదా!

15వశతాబ్ది సాహిత్య సంవిధానాన్ని, ప్రాచుర్యాన్నీ గమనిస్తే అదంతా కావ్యస్పృహకు కొనసాగింపుగ వస్తున్న'ప్రబంధం', పురుడు పోసుకొని రూపురేఖలు సరిదిద్దుకుంటున్న కాలం. వృత్తవైవిధ్యం, దీర్ఘసమాస బాహుళ్యం, ఊహలఉడ్డీనత ప్రబంధయుగ లక్షణాలు. పోతనంతటివాడిని తన ఇంద్రజాలంతో కావ్య స్పృహకు దూరంగా పోనీయకుండ, జగన్మోహినీ అవతారమైన శ్రీనాథుని యుగప్రభ సాగుతున్న కాలమది. ఆ మార్గంలో పడిపోకుండ విలక్షణంగా, పదకవితను అంతవిస్తారంగా నిర్మించటం,

కాలానికి ఎదురీదడమే. దానికి కేవలం కవితాకల్పన ప్రతిభ సరిపోదు. కొండంత ధైర్యం - ప్రగాఢమైన ఆత్మవిశ్వాసం - అచంచల దీక్ష అవసరం. అన్నమయ్య వ్యక్తిత్వంలో ఇవి పుష్కలంగా ఉన్నట్లు చిన్నన్న వ్రాసిన జీవితచరిత్ర వలన తెలుస్తోంది.

అన్నమయ్య పదకవితా పితామహుడైతే, ఆయన భార్య తాళ్ళపాక తిమ్మక్క తెలుగులో ప్రథమ కవయిత్రి. అదొక విశిష్టమైన కుటుంబం. ఆయన వంశంలో, తరువాతి అయిదు తరాలవారు, తమ సాహిత్యంతో శ్రీవేంకటపతిని సమర్చించటం, మరెక్కడ దర్శించలేం. అన్నమయ్య జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం, 'అహోబలమఠాధిపతి' యైన శ్రీశఠకోపయతిని ఆశ్రయించి, పంచసంస్కారదీక్షను పొంది, శ్రీవైష్ణవాన్ని స్వీకరించటం; శ్రీ వేంకటేశ్వరుని పదభక్తియే, ఈ మార్పుకి కారణమని భావించినా, ఐదు వందల ఏండ్లకు పూర్వం సంప్రదాయ పరివర్తనం - అంటే స్మార్తాన్ని వదలి శ్రీవైష్ణవాన్ని సమాశ్రయించటం - అంతతేలికైన విషయం కాదు. అదీ ఒక విధంగా ఎదురీదటమే.

అంతేకాదు, ప్రపంచాన్ని వదిలి, అంతానిస్సారమని భావించి, సర్వసంగపరిత్యాగిగా అదే పనిగా తన ఇష్టదైవాన్ని గురించి సంకీర్తనలు వ్రాయటం, ఎవరికైనా ఒకరకంగా సులువేమోకాని, గృహస్థుడైయుండి ఆ కాలంలో ఆక్షేపణీయం కాని ఇద్దరు భార్యలతో సంసారం చేస్తూ, తన మనస్సుని శ్రీపతిపదారవిందాలపై నిరంతరసంచరద్భ్రమరంగా, నిలుపగలిగిన స్థితప్రజ్ఞను కలిగి ఉండటం సాధారణ విషయంకాదు. ఇలా పరిశీలిస్తే తెలిసేదేమంటే, కవితా పద్ధతిలోను, సంప్రదాయమార్గంలోను అన్నమయ్య సర్వతంత్ర స్వతంత్రుడని.

సభాప్రశంసలకోసమో, సాహితీగోష్ఠులకోసమో, సన్మాన సంరంభాల కోసమో సముద్భవించిన సాహిత్యం కానందున, దూషణ భూషణ తిరస్కారాదులకు దూరమై, అనిందపూర్వంగా భాసించి, ఆయన నిరుపమానవ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తోంది. అన్నమయ్య, కవిత్వాన్ని

స్వాత్మోద్ధరణకు సాధనంగా భావించి, సంకీర్తనల్ని రచించి, జాతిని ధన్యం చేశాడు.

అన్నమయ్య రచించినవి 32వేల కీర్తనలా? లేక 32 వేళల పాడే కీర్తనలా? అన్న చర్చకు విరామ చిహ్నంలేకాని, భరతవాక్యం పలుకగల సాధికార సమాచారం తెలుగుజాతికి దక్కలేదు. ఒక వేళ 32వేలే అన్నమయ్య రచించాడని మనం భావించినా, మనకు దొరుకు తున్నవి మాత్రం, అందులో సగం కంటే తక్కువే. సాహితీ క్షేత్రంలో ఇది అపారమైన నష్టం. లభించిన కీర్తనలనే పరిగణనలోకి తీసుకున్నా ఏ ఇతర భారతీయ భాషా సాహిత్యాలకు లేని సంపద, తెలుగు సాహిత్యానికి దక్కిందని మనం గర్వించవచ్చు. తెలుగుభాషా నిఘంటు కారులు అన్నమయ్య పలుకుబళ్ల నన్నింటినీ సమాదరించి, స్వీకరించి ఉంటే 'ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు నిఘంటువు' పరిమాణంలో తెలుగు నిఘంటువు సిద్ధమై ఉండేది.

ద్వైత సంప్రదాయ ప్రభావంతో, కర్ణాటక ప్రాంతంలో సర్వత్ర వ్యాపించిన దాస పదావళి, అన్నమయ్యకు తెలిసిందే. ఆయన పురందరదాసునకు సమకాలికుడు. అన్నమయ్యకు తెలుగు, కన్నడం, తమిళం, సంస్కృతాలలో తలస్పర్శిపాండిత్యం ఉందని, ఇంతకుముందు ప్రస్తావించాను. అన్నమయ్య కాలానికి ఆంధ్ర-కర్ణాటక భేదం లేదు. విజయ నగరాధీశులు కన్నడ ప్రభువులే. తమిళం శ్రీవైష్ణవులకు సంప్రదాయ భాష. అన్నమయ్య సంస్కృత కీర్తనలు భావంలోను, భాషాసౌకుమార్యం లోను, జయదేవుని గీతగోవింద పదా వళికి, వీసమంత కూడ తీసిపోవు. అంతే మధురంగా శృంగార సమంచితంగా ఉంటాయి.

భక్తికి ద్వైత భావమే ఆధారం. "ఆ బ్రహ్మఖ్యాతేః" అంటే బ్రహ్మానుభవం కలిగేటంతవరకు ద్వైత భావం తప్పదనీ, శ్రీశంకరులు సైతం స్తోత్ర కావ్యాలన్నింటినీ ద్వైతభావం తోనే విరచించారనీ తెలుస్తుంది. అద్వైతంలో స్తోత్రము-స్తోత-స్తుతుడు ఇటువంటి త్రిధా భిన్నమైన స్థితికి స్థానంలేదు. అందువల్ల అన్నమయ్య స్తోత్ర సాహిత్యానికి ద్వైతమే భూమిక.

నందవరీకవైదికబ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన ఆయన అద్వైతి. అద్వైత సంప్రదాయం, ఆయనకు సహజాతంగానే సంప్రాప్తమైంది. శ్రీవేంకటపతి సమర్చాప్రభావితుడై, ఆయన శ్రీవైష్ణవుడై విశిష్టాద్వైతాన్ని వరించాడు. వైదిక సంప్రదాయంలో ప్రధానమైన మూడు ప్రస్థానాలూ శ్రీ అన్నమయ్య సాహిత్యాన్ని పరిపుష్టం చేశాయి. ఈ సత్యం, ఆయన తాత్త్విక దృష్టిని నిర్వచించి చూపుతోంది.

ప్రాచీనభారతీయ కవుల తాత్త్వికదృష్టిని పరిశీలిస్తే, వేదాలనుండి పురాణాల వరకు విస్తరించిన, వైదికధర్మసంప్రదాయ పరిప్రేక్షణంతోనే వారి దృష్టిపరిపుష్టమైనట్లు కనిపిస్తుంది. భక్త కవులందరినీ పరిశీలిస్తే వారిలో కొన్ని మౌలికాంశాలు సమానంగా కనిపిస్తాయి.

1. ఈశావాస్య మిదగ్ం సర్వం
2. భగవంతుని చిద్విలాసంగా జగత్తును చూడాలి
3. ఆత్మ నిత్యం, దేహం అనిత్యం
4. ప్రపంచం - ప్రాపంచిక భోగాలు నశ్వరాలు.
5. భగవత్పదార్చనయే ధర్మం
6. స్థావర జంగమాత్మకమైన ఈ జగమంతా భగవదంశమే
7. సమస్తప్రాణికోటి, బ్రహ్మచైతన్యం యొక్క వివృతస్వరూపాలే. జాతికుల భేదాలకు తావులేదు.
8. ప్రాక్తనకర్మఫలితమే పుట్టుకను నిర్ణయిస్తుంది.
9. భగవద్భక్తి కలగటం, ఎన్నోజన్మల పుణ్యఫలం
10. నిష్కామకర్మద్వారాలేదా భక్తి సాధనంగా లేదా జ్ఞానమార్గంలో మోక్షాన్ని సాధించవచ్చు. కాని 'భక్తి రేవగరీయసి'.
11. మోక్షమే లక్ష్యం - కాని మోక్షంకంటే భగవంతుని భజనానందమే మిన్న.

ఈ అంశాలన్నీ ఏ భక్తకవి కవితలలోనైనా సమానధర్మాలుగానే కనిపిస్తాయి. అలాగే అన్నమయ్య లోను.

జగత్తు - శరీరం అనిత్యమైనా, పరిణామశీలమైనా, అది భగవంతుని అనుగ్రహమే కాబట్టి, దాన్నే ఉపాదేయంగా గ్రహించి మోక్షసాధనంగా రూపొందించుకోవాలి. అంతటా బ్రహ్మచైతన్యం విద్యమానమై ఉన్నందున ఉచ్చనీచభేదం లేకుండ సమభావం నెలకొని ఉండాలి. దీన్నే 'సమదర్శన'-మని భగవద్గీత చెపుతోంది. పూర్వకర్మ ఫలితంగా, ఈ శరీరం లభ్యమైనప్పటికీ, దీనివలననే భగవదర్చన సాధ్యమైనందున దీనిని నిందింపరాదు. నిర్గుణ మైనందున, భక్తకవుల దృష్టికి మోక్షం కూడ నీరసంగా భాసిస్తుంది. మోక్షంకంటే భగవ దారాధనమే వారికి ప్రధానమైంది. వారు మోక్షాన్ని కోరరు సరికదా! దానిని గొప్పగా వర్ణింపరుకూడ. భగద్గుణానుసంధానమే భక్తి కవిత్వానికి, పరమ ఆధారమైన వస్తువు. మరి దీనికి మూలం ఏమంటే సగుణోపాసనే. 'యచ్చకించిజ్జగత్సర్వందృశ్యతే శ్రూయతే2పివా'- అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః అని భగవత్కైంకర్యానికే వినియోగమవుతుంది. సర్వకర్మలు, సకలభావాలు, సమస్త వస్తు వైవిధ్యమూ అర్చాసామగ్రియే.

శ్రీశంకరులవారు వైదిక ధర్మాన్ని నిర్వచిస్తూ "ద్వివిధోహివేదోక్తో ధర్మః ప్రవృత్తి లక్షణోనివృత్తి లక్షణశ్చ" - అని సిద్ధాంతం చేశారు. ప్రవృత్తి లక్షణాన్ని వివరిస్తూ "అభ్యుదయార్థోఽపి ప్రవృత్తి లక్షణో ధర్మః'.... ఈశ్వరార్పణ బుద్ధ్యా అనుష్ఠీయమానః సత్వశుద్ధయే భవతి ఫలాభిసంధివర్జితః"- అని వ్యాఖ్యానించారు. ఫలాపేక్షా కాతరత్వం లేకుండ, భగవదర్పణ బుద్ధితో ప్రాపంచిక జీవనంలో ప్రవృత్తి లక్షణ ధర్మాన్ని ఆచరించటంచేత కలిగిన సత్త్వశుద్ధి వలన, మోక్షాన్ని పొందవచ్చని తెలుస్తోంది. పాంచభౌతికమై, పంచేంద్రియాధీనమై, సుఖదుఃఖ సమన్వితమై, అపరిహార్యమైన సంసారాన్ని పరిహరించాలన్న వ్యర్థ ప్రయత్నం చేయకుండ, సమస్త భావజాలాన్నీ భోగసముదా యాన్నీ భగవదర్చనకై

ఉపకరణాలుగా రూపొందించి, భక్తియే సాధనంగా పరమ పదాన్ని పొందటం అన్నమయ్య తాత్త్వికదృష్టిగా కనిపిస్తుంది.

భక్తి సంప్రదాయకవులు, ప్రవృత్తి - నివృత్తి భేదనియమాన్ని పాటించినట్లు కనిపించదు. ప్రవృత్తి మార్గం, ఫలాభిసంధివిరహితమైతే, నివృత్తేకదా! నివృత్తి ప్రధానవైరాగ్యంతో సాధించే దేముంది? నీరస నిర్గుణ స్థితిని అన్వేషించడమే కదా! పరిదృశ్యమాన ప్రపంచాన్నంతా భగవల్లీలా విభూతిగా దర్శిస్తే కలిగేఆనందం, ప్రమోదం, నివృత్తిలో లభ్యం కావు. అరిషడ్వర్గం మూలాన కలుషితమైన మనస్సుతో ప్రపంచాన్ని సంకుచిత ప్రయోజన పరంగా స్వసుఖాపేక్షకే వినియోగిస్తే వాడు అఘాయుష్కుడౌతాడని, 'అఘాయురింద్రి యారామో2మోఘుం పార్థసజీవతి' - అని గీత అటువంటి వాళ్లను గర్హించింది. ఇంద్రియ సుఖాన్ని, భగవత్కైంకర్య పరంచేస్తే, అది శుద్ధసాత్త్వికమై, నిరతి శయానంద ప్రదాయకమై ప్రపంచమంతా సౌందర్యలహరీప్లావితమై కనిపిస్తుంది. ఇంద్రియజ్ఞానానికి రసానుభూతి పర్యవసానం. శృంగారాన్ని ప్రథమరసంగా, ఉజ్జ్వలమైందిగా చెప్పారు. హాస్య కరుణ వీర రౌద్ర రసాలల్లో ఏదో ఒకటి లోపించినా, ఆ నాలుగూ లోపించినా, మానవ జీవితంలో అది వెలితిగా కనిపించదు. హాస్య రసస్పర్శలేని వాళ్లు లోకంలో కొల్లలుగా ఉన్నారు. అలాగే ఇతర రసాల విషయంలోను; అద్భుతభయానకరసాల విషయం చెప్పనవసరం లేదు. కాని శృంగారరసం లోపిస్తే, మానవజీవితం శుష్కమైపోతుంది. ఆనందానుభవం పూర్తిగా అపాస్త మౌతుంది. శృంగారం, ప్రాణి మనుగడకు మూలమైనందునే, ఆ రసప్రాధాన్యం సాహిత్యం లోనూ కనిపిస్తుంది. అది లోకస్థితికి కారణం. అందుకే నన్నయభట్టారకుల వారు భారత మంగళాచరణశ్లోకంలో, సృష్టి స్త్రీ పుంస యోగోద్భవమనీ, వక్షో ముఖాంగాల్లో శ్రీవాణీగిరిజాకాంతలను ధరించిన త్రిమూర్తులను ప్రస్తుతించారు. "అవివేకులకు విషయము లందున్న అనపాయమైన ప్రీతి, భగవదర్పితమైతే, మోక్ష సాధకమవుతుంది" అని భాగవతంలో

ప్రహ్లాద కథలో చెప్పబడ్డది. ఇంద్రియాలను దమించి, శుష్కం చేయకుండ భగవదర్పణమైతే పరనిర్వృతి కలుగుతుంది. 'పూజతే విషయోపభోగ రచనా' - అని శ్రీశంకరుల వారి విన్నపం.

మహాయోగి శ్రీఅరవిందులవారి మాటల్లో చెప్పాలంటే

*"The emotional, the sensuous, even the sensual motions of the being, before they could draw the soul, rather outward, were taken and transmuted into a physical form and, so changed, they become the element of mystic capture of the divine of the through the heart and the senses and a religion of joy of God's love, delight and beauty".*

'కనిపించే యావజ్జగత్తూ, భగవల్లీలావిభూతిగా భక్తికీ, శృంగారానికి అందుకే సన్నిహిత సంబంధం ఏర్పడింది. అనేక సందర్భాలలో భక్తికి శృంగారానికీ మధ్య విభజనరేఖ కానరాదు. సౌందర్యలహరి, గీత గోవిందం, ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. ఈ విషయం భాగవత రసికులకూ తెలిసిందే.

శ్రీచైతన్య సంప్రదాయంలో వైరాగ్యాన్ని ఇలా నిర్వచిస్తారు.

"అనాసక్త విషయాన్
యథార్థముపయుంజతః
నిర్బంధః కృష్ణ సంబంధే
యుక్తం వైరాగ్యముచ్యతే"

శ్రీకృష్ణార్పణంగా విషయోపభోగాలను యథార్థంగా ఉపయోగిస్తే అది వైరాగ్యమే. అని వారి నిర్ణయం. భగవత్ప్రీతి మిక్కుటమై, విషయాసక్తి జీర్ణపర్ణంవలె రాలిపోవాలికాని బలవత్పరిత్యాగం కూడదు. "అచ్యుత పదాంబుజయుగ్మరుక్మవ్యామోహతస్తదితరాణి తృణాయమేనే"- అని శ్రీరామానుజుల వారిని వర్ణించారు.

పరమార్థదృష్టితో విచారిస్తే, భక్తి సంకీర్తనలకీ శృంగార - సంకీర్తన లకీ భేదం లేదనే చెప్పాలి. శృంగారం కించుత్తుకూడా లేని భక్తి కావ్యాలు, స్తోత్రాలు, క్వాచిత్కంగా ఉన్నా అవేవీ విస్తృత ప్రచారాన్ని పొందలేదు. దానికి కారణం అవి సహజానుభవానికి దూరం కావటమే. అన్నమయ్య సంకీర్తనలలో శృంగారభక్తివేదాంతాలు, అవినాభావంగా రూపొందాయి.

అన్నమయ్య వ్రాసిన సంకీర్తనలలో అతి ప్రసిద్ధమైన శృంగార భక్తివేదాంతాలు అవినాభావంగా రూపొందినవే.

"ఏమొకో చిగురుటధరమున యెడనెడ గస్తురినిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రికకాదు కదా! ||పల్లవి||

కలికి చకోరాక్షికి గడకన్నులు గెంపైతోఁచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరే చెలులు
నలువున బ్రాణేశ్వరుపైనాఁటిన యాకొనచూపులు
నిలువున బెరుకఁగనంటిన నెత్తురు కాదుకదా!" (5-82)

ఆంగ్లసాహిత్యంలో అతిప్రధానమై, ఆధునికంగా భావింపబడే 'మెటా ఫిజికల్ ఇమేజరీకి' ఇంతకంటె చక్కని ఉదాహరణం మరొకటి లేదు.

మరొక సుప్రసిద్ధ సంకీర్తన భక్తి శృంగారాలు అన్యోన్యంగా లీనమై ఒప్పారేది.

"కామయాగముచేసెఁ గలికితన
ప్రేమమే దేవతాప్రీతిగాను" (5-223)

సురతతాంబూలరసం సోమపానంగా, కలరవాలే వేదమంత్రాలుగా, విరహతాపాగ్నియే హోమాగ్నిగా, రతిశ్రమతనూసంజాత స్వేదస్విన్న స్థితియే, అవబృధంగా అన్నమయ్య ఈ సంకీర్తన లో కామయాగాన్ని సంపన్నం చేశాడు.

విస్తృత ప్రచారం పొందిన మరొక సంకీర్తన

"ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపముమఱి

యిదిగాక వైభవంబికనొకటి కలదా ॥పల్లవి॥
అతివజన్మము సఫలమై పరమయోగివలె
నితరమోహాపేక్షలిన్నియును విడిచె
సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతతవిజ్ఞాన వాసనవోలెనుండె" (5-17)

దీనిలో శృంగారవేదాంతాలు కలిసిపోయినాయి.

అన్నమయ్య మరొక సంకీర్తనలో షోడశోపచారపూజను శృంగార పరంగానే చేశారు.

"ఇంతివుపచారపూజయిందేకలిగెనీకు
వంతులచేకొని నీవు వరమియ్యవయ్యా" -

ఆమె వీక్షణమే ఆవాహనం. ఆమె మనఃప్రతిష్ఠతమైన కోరికయే ఆసనం. నీపై చింతయే ధ్యానం. తాపస్వేదమే, అర్ఘ్యపాద్యాలు. కన్నీళ్ళే ఆచమనం. విరహాగ్ని ధూపం దీపం - ఇత్యాదిగా శ్రీవేంకటేశ్వర స్వామికి సమగ్రపూజ సమర్పితమైంది.

శృంగారాన్ని, ఆధ్యాత్మికాన్నీ కవిసమయాలనీ రమణీయంగా సంఘటితం చేసిన సంకీర్తన

"నిన్ను బాసినయట్లు నెలతకు వియోగదశలు
యెన్నడును దోపదిదియేమొకానీ"

ఆమె అంతర్ముఖదృష్టితో స్వామిని సాక్షాత్కరించుకొని తనయెదుట అవిష్కరించుకొన్నది.

"తనరనాకాశతత్త్వము నీమహత్త్వమని
వనితయెవ్వరి చేత వినెనొగానీ
నినుబొగడి నీరూపు కనుదోయి కెదురైన
తనివిదీరకబయలు తగజూడ దొడగె

మునుకొన్న సర్వతోముఖుడవనగనిను
వెనుకనే భావమున వినెనోగానీ
తలపునను వాక్కునను తలపదలపకనీవు
కలిసి ఆకమలాక్షికౌగిలించితివి"

ఈ సంకీర్తనను ఉదాహరిస్తూ శ్రీమాన్ శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు వ్రాశారు. "ఆయన రచించిన శృంగారపదాలు, ఒక విశాల విశ్వంవంటివి. వాటి అసాధారణ సౌందర్యం ప్రత్యేకంగా చర్చించ వలసింది. ఈ పదమొక్కటి గమనిస్తే, తరువాతి శృంగార కవుల కన్న , అతడెంత ఎత్తులో ఉన్నాడో గ్రహింపగలము".

ఇలాగే మరొక మధురసంకీర్తన; "పొలయలుక నిద్దురలు భోగించ దొరకొంటి వలరి వడి మేల్కొనవె అఖిలేశ్వరా! అనేది. ఈ మేల్కొల్పు పదాన్ని ఏకాంతంలో మననం చేసి, అన్నమయ్య కవితా సౌందర్యాన్ని ఆనందించాలి.

సంయోగశృంగారానికి, శోభనిచ్చేది విప్రలంభమే. అన్నమయ్య విరహసంయోగాల వర్ణన ఒకటి, విలక్షణమైంది. పరిశీలించదగింది. ఈ రెండింటినీ కలిపి వర్ణించటం దీని విశేషం.

"అంగనకు విరహమే సింగారమాయె
చెంగటనీవేయిది చిత్తగించినావయ్యా" (21-415)

నాయకుని తలచి, లోలోనకరిగి జలజల చెమరించగా ఆమెకు స్నానమయింది. నీ కోసం ఎదురు వచ్చిన సంభ్రమంలో కొప్పు విడిపోయి నీలిచీరకట్టినట్లయింది. నిన్ను చూచిన సిగ్గులవలన చెక్కులకు గంధం పూసినట్లయింది. నీమాటలు చెవికిసోకి, పులకించి, శరీర మంతా ముత్యాలను అలంకరించినట్లయింది. నిన్నుకలిసి కౌగిలించుకోగా చంద్రాభరణపు సొమ్ములే పెట్టినట్లయింది. సరసముల చేత నాయిక తలంబ్రాలు పోసినట్లయింది.

ఇక్కడ నాయిక కీర్తనలో ఈశ్వరానుభవంతో జీవుడు పొందిన పరమ సంయోగం క్షీరనీర న్యాయంగా ఉంది.

"తనువుతనదిగాని తలపునీది
పెనగిమాకున దీగబెరసినయట్లు
మోమున గన్నులుగాని, మోహపుఁజూపులు నీపై
కామిని భావము చెప్పఁగతలాయను
తామరలు కొలనిలోదరులఁ బరిమళము
వేమారు నిండుకొన్న విధమాయె నిపుడు" (24-117)

ఆమె నాయిక. తనదంటూ ఏమిలేదు. సర్వమూ ఆయనిదే. తలపున ఆయన నిండు కొనటంతో ఆమె కాకుండ పోయింది. చెలునిమీదనే కనులుండటంతో కన్నులు ఆమెవి కాకుండ పొయ్యాయి. ఇలా బ్రతుకంతా స్వామికి సమర్పించుకొనటంవల్ల ఆమె సాయుజ్య స్థితిని పొందింది.

నాయకుడైన శ్రీ వేంకటేశ్వరునికి పది అవస్థలు దశావతారాలైతే, నాయిక "అదియే కాదా సతత మాతనికి తనకిపుడు పదియవస్థలంబొంగి భ్రమసేగాక" - అన్న కీర్తనలో అంటుంది.

"తరుణితామరయిల్లు తపనమండలమనుచు
అరమరచికాకలనె యలసెనదివో - (24-176)

కమలాకారాన్ని కమలబాంధవస్థానమైన సూర్యమండలంగా భావించాలి. అందువల్ల తాపాన్ని పొందింది. తాను తామర, ఆయన సూర్యుడు, ఇంకొంచెం ముందుకుపోతే తాను జీవుడు, ఆయన సూర్య మండలాంతర్గతుడైన నారాయణుడు. సాధకుడుగా తాను సాధించేది అంతరాదిత్యవిద్య. ఛాందోగ్యం చెప్పిన మోక్షవిద్య. అందువల్ల ఆమెకు మట్టెల రవంకూడ మంత్రశాస్త్రమే అయింది.

శృంగార సంకీర్తనల్లో ఆయన కవితాశక్తి అవధుల్ని ముట్టింది. 'పలుకుతేనెలతల్లి పవళించెను' - 'అలరులుకురియగనాడెనదె' - 'ఏమొకో

చిగురుటధరమున' - ఇలా ఎన్నో ప్రసిద్ధమైన కీర్తనలు ఆయన నిసర్గకవితా సౌందర్యానికి దర్పణం పడుతున్నాయి.

అన్నమాచార్య సంకీర్తన పదాల్లో శ్రీవిద్యాతంత్రాన్ని దర్శించిన వారున్నారు. అది కూడా సాధ్యమే. అన్నమయ్య జన్మతః స్మార్త వైదిక విప్రుడు కదా! ఆయనకు ఆ సంప్రదాయం హృదయాంతఃస్థితమై ఉంటుంది. అది అనివార్యంగా ఆయన సాహిత్యంలో వెలుగుతుంది. అవచేతనలో సుప్తంగా ఉన్న, ఆ భావజాలం, అప్రయత్నంగా ఆయన పలుకుబడులలో, ఆవిష్కృతమౌతుందనడంలో సందేహానికి ఆస్కారం లేదు. ఆయన ద్వైతాద్వైత విశిష్టాద్వైత సంప్రదాయాలకు కూడలి.

అన్నమయ్య, నిర్మలభక్తియే సాధనంగా, సర్వత్రా దైవభావాన్ని దర్శించిన మహాను భావుడు. దైవత్వాన్ని దర్శించిన వానికి, లౌకికకృత కల్పితభేదాలేవి ఉండవు. సమత్వ దర్శనమే ఒక యోగము. నిరంతర భగవన్నామ సంకీర్తన పరవశమై పవిత్రమైన ఆయన చిత్తవృత్తి, 'అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత' మత్తమై నిరుద్ధమైంది.

"తలగరో లోకులు తడయకురో మము
కలిగినదిది మా కాపురము
నరహరి కీర్తన నానినజిహ్వ
నొరులనుతింపగ నోపదుజిహ్వ
మురహరుపదములు మొక్కిన శిరము
పరుల వందనమే ఒరగదు శిరము"

ఆమహోన్నతస్థితికి చేరిన విశాలహృదయం ప్రపంచాన్నంతా పరిష్వంగం చేస్తుంది. హరిభక్తి పరులకు అల్పభావాలు లుండవు. ఈనాటికి అందరినీ అలరించే ఈ సంకీర్తనం.

"ఏకులజుడేమి యెవ్వడైన నేమి
ఆకడనాతడె హరినెరిగిన వాడు" (1-292)

సత్యసంపన్నుడు, పరనిందాదూరుడు, భూతదయానిధి ఆత్మసంయ మన శీలి, నిరంతరహరి చింతనాపరుడు - ఆతడె హరినెరిగినవాడు, అని నిర్దేశిస్తూ కులభేద నిరాసంచేసినవాడు.

కలుషిత మనస్సుతో, దేహేంద్రియసుఖపారవశ్యాన్నాశించే మృషా జీవనాన్ని మరొక ప్రసిద్ధ సంకీర్తనలో నిరసించాడు.

బ్రహ్మమొకటె పరబ్రహ్మమొకటె
కందువగు హీనాధికములిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకులమింతానొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ. (2-385)

ఇంతకంటే పరమోదాత్త హితోపదేశం మరొకటిలేదు. ఇట్లా ఎన్ని సంకీర్తనలనైనా ఉదాహరింప వచ్చును.

ఆయన సంకీర్తన భాండారం భాషకు, పలుకుబళ్లకు, కవిత్వాంశాలకు తరగనిగని. తిక్కన పోతన్నలు కలిసివస్తే అన్నమయ్యకు సాటివస్తారనిపిస్తుంది.

పదకవితలో అన్నమయ్య ప్రవేశపెట్టిన జానపదబాణీలు వాటి వైవిధ్యం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. మేలుకొలుపు, అల్లోనేరేళ్ళు, గొబ్బి, జాజర, సోది, తుమ్మెద, చిలక, ఏల, కోలాటం, చందమామ, ఉయ్యాల, లాలి, జోల, కూగూగులు, చాంగుభళా, తాత్త్వికాలు మొదలుగా ఎన్నో ఉన్నాయి. భక్తిని సమాజంలో పాదుపరచ డానికి, జానపదుల్లో భావబలంతో మహత్తరమైన సాహిత్యాన్ని ఆయన సృష్టించి నాడు. జానపదబాణీల్లో వ్రాయ డానికి జానపదులపై ఆయనకున్న అనుకంపకూడా కారణం కావచ్చు. అన్నమయ్యకు సంస్కృతంలో విస్తారమైన పాండిత్యమున్నది. ఆయన సంస్కృత కీర్తనలని గమనిస్తే అందున్న పదబంధవైశిష్టం, శైలీ వైలక్షణ్యం భాషాసౌకుమార్యం అశ్చర్యం కలిగిస్తాయి.

ఫాలనేత్రానలప్రబల విద్యుల్లతా
కేళీవిహార లక్ష్మీనారసింహా!

ప్రళయమారుత ఘోరభస్త్రికాపూత్కార
లలిత నిశ్వాస డోలారచనయా
కులశైలకుంభినీ కుముదహితరవిగగన
చలనవిధినిపుణనిశ్చల నారసింహా!

మృదుమధుర పదసంహతికి ఈ కీర్తనని ఉదహరింపవచ్చు

సదయ మానస సరోజాత మాదృశవశం
వదముదాహం త్వయా వంచనీయాకిమ్?

జలధికన్యాపాంగ చారువిద్యుల్లతా
వలయవాగురికాంత వనకురంగ!
లలితభవదీక్షాలాసమనసిజబాణ
కులిశపాతైరహం క్షోభణీయాకిమ్?

ధరణీవధూ పయోధరకనకమేదానీ
ధరశిఖరకేళి తత్పరమయూర!
పరమభవదీయశోభనవదన చంద్రాంశు
తరణికిరణైరహం తాపనీయాకిమ్?

సౌందర్యభరితాలైన సంస్కృత కీర్తనలెన్నింటినో ఆయన రచించాడు. కవితాపటుత్వం, వేదాంతశాస్త్రవిజ్ఞానం, సంప్రదాయనిష్ఠ ఆయన సంస్కృత కీర్తనలలో పర్యాప్తంగా కన్పిస్తాయి. ఇంత పాండిత్య ప్రకర్ష కలిగినా, అన్నమయ్య పదరచన చేయడానికి కారణం - భక్తికి ఉత్సవ స్ఫూర్తిని కలిగించి తల్లీనం కావాలనే కోరికే. జానపదుల భాగస్వామితవల్లే ఏ ఉత్సవమైనా సర్వాంగీణంగా సముత్సాహంగా రూపొందుతుంది. 'స్మరణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనమ్' ఇత్యాదిగా సంపన్నమైన భక్తి, ఉత్సవరూపంలో ప్రత్యక్షమౌతుంది. తాళరాగలయసమన్వితంగా

నృత్యంచేస్తూ తద్గతభావనలో తాదాత్మ్యం చెందడానికి పదకవితయే సమర్థం, ప్రబంధకవిత్వం కాదు. నిరంతర శ్రీహరి సంకీర్తనంలో ఓతప్రోతం కావడానికి భక్తిశృంగారాల మేలు కలయిక కూడ ప్రముఖంగా సహకరించిందనవచ్చు. భక్తి శృంగారాలు సహజంగా మిళితమౌతాయనుకుంటే, వైరాగ్యం మాటేమిటి ? భక్తి కలిగితే, వైరాగ్యం తదనుషక్తమయ్యే ఉంటుంది. భక్తి శృంగార వైరాగ్యాలను తత్త్వతః తెలిసిన వాని జీవనం'కుర్వన్నపి న లిప్యతే' అనే భగవద్గీతోక్తికి నిదర్శనంగా ఉంటుంది. అన్నమయ్య వ్రాసిన వైరాగ్య సంకీర్తనల ప్రాముఖ్యం కూడా ఈ దృష్టితో పరిశీలిస్తేనే అవగతమౌతుంది.

కొన్ని పద్ధతులలో విషమించినా, వికటించినా, తంత్రసాధనలోనూ, మూలభూతమైన విషయం, భక్తిశృంగార వైరాగ్యాల సముచ్చయ ప్రభావమే.

తిరుపతిపై వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరుని కుమారస్వామిగా, శివునిగా, దేవిగా, సూర్యునిగా ఉపాసించే సంప్రదాయాలున్నాయి. శైవం, కౌమారం, సౌరం, వైష్ణవం యుగపత్తుగా కన్పించే క్షేత్ర మిదొక్కటే. అన్నమయ్య సంకీర్తనలలో ఈ సంప్రదాయాలన్నీ చోటుచేసుకొన్నాయి. తిరుమలేశుడు ద్వైతాద్వైత విశిష్టాద్వైతానుయాయులందరికీ ఇష్ట దైవంగా విరాజిల్లుతున్నందున, అన్నమయ్య జీవితంలో, సాహిత్యంలో ఈ వేదాంత సిద్ధాంతాలన్నీ లీనమైనాయి. అదియే అన్నమయ్య విశిష్టతాత్త్విక దృష్టి.

★ ★ ★

ఆర్వీయస్. సుందరం

## సృజనాత్మక తాత్త్వికుడు అన్నమయ్య

ఒక జాతి ఉన్నతోన్నత శిఖరాలను అందుకోవాలంటే మొత్తం జాతి జాగృతం కావలసి ఉంటుంది. జన సముదాయం సామూహికంగా కనే కలలే పురాణాలుగా అవతరిస్తాయి. ఆ పురాణాలలో జన హృదయాంత రాళాలలోని ఆశలు, ఆకాంక్షలు, ఆదర్శాలు, నమ్మకాలు మొదలైనవన్నీ సాంకేతికంగా ప్రతిఫలిస్తుంటాయి. అందువల్ల అత్యంత పురాతన కాలం నుండి నేటి వరకు అన్ని జాతుల్లోను పురాణాలు ఏదో ఒక రూపంలో సజీవంగానే ఉన్నాయి.

'భక్తి' అనేది కూడా ఒక సంకేతం మాత్రమే. జన సముదాయం పరమార్థ చింతనకు, పారలౌకికమైన నమ్మకాలకు భక్తి అనేది ప్రతీక అని చెప్పవచ్చు. అందువల్ల భారతదేశంలో భక్తి పంథ అన్నది భగవద్గీత తర్వాత కాని, భాగవత పురాణం తర్వాత కాని, తమిళ భక్త కవుల తర్వాత కాని ప్రచారంలోకి వచ్చిందనటం ఔపచారికం మాత్రమే. ఆదిమ మానవుని జీవితంలో కూడా పరమార్థ చింతన ఉంది. దాని లోను భక్తి కర్మ జ్ఞాన మార్గాలు ప్రాథమిక రూపంలో కనిపిస్తూనే ఉన్నాయి. ప్రపంచంలోని ఆదిమ జాతుల్లో వేటకు పోయేటప్పుడు 'ఓ సూర్యుడా ! నాకోసం ఉదయించు' అని చేసే స్తుతిలోనే భక్తి మార్గం ఉందనే విషయాన్ని సి.ఎం. బౌరా తన 'ప్రిమిటివ్ సాంగ్' అనే పుస్తకంలో స్పష్టం చేశాడు.

ఇలా అత్యంత పురాతన కాలంలోనే భక్తితత్త్వంలోని ప్రాథమిక పాఠాలను నేర్చుకున్న జాతులు ఉన్నతోన్నత శిఖరాలను అందుకోవాలంటే మొత్తం జాతి జాగృతం కావలసి ఉంటుందని మరోసారి గుర్తు చేసుకోవలసి

ఉంటుంది. జాతి పురోగతిలో ప్రతి ఒక్కరి కృషి ఇమిడి ఉంటుంది. అయితే జన సముదాయాన్ని కూడా నడిపించ గలిగిన మహనీయులు ఒక్కో యుగంలో అవతరిస్తుంటారు. అలాంటి యుగపురుషుల వల్ల సాహిత్యం ఊపిరి పోసుకుంటుంది, తాత్త్వికచింతన గాఢమవుతుంది, సంగీతం వేయి రేకులై విచ్చుకుంటుంది, భాషకు అభివ్యక్తి సామర్థ్యం అలవడుతుంది. వీటిలో ఏ ఒక్క విషయంలో సాధన చేయగలిగినా అలాంటి వారిని మహాపురుషులని పిలుస్తాం. అలాంటిది పై విషయాలన్నిటి లోనూ ఉన్నత శిఖరాలను అందుకోగలిగిన వారు అపూర్వ ప్రతిభా వంతులు, కార్యశూరులు, వినూత్న భావజాలాన్ని సృష్టించగల సమర్థులు. ఆంధ్రుల అదృష్టం వల్ల అలాంటి మహాపురుషుడు తాళ్ళపాకలో అవతరించాడు. తెలుగు సాహిత్యానికి, సంగీతానికి, తాత్త్విక దృక్పథానికి, భాషాపటిమకు ఏకమేవాద్వితీయమైన నిదర్శనం అన్నమయ్య.

ఇంతకు ముందే చెప్పినట్లు ఒక జన సముదాయం కన్న కలలే పురాణాలు. పురాణ మంటే దేవతలు రాక్షసులు పాత్రలుగా ఉండే కథలని మాత్రమే అర్థం చెప్పుకోవటానికి వీలులేదు. పురాణమంటే అత్యంత పురాతనకాలం నుండి ఒక స్థలంగురించి కాని, వ్యక్తి గురించి కాని, సంఘటనలు గురించి కాని జన సముదాయం ఏర్పరచుకుంటూ వచ్చిన నమ్మకాల రాశి. వేంకటేశ్వరునికి సంబంధించిన ఇలాంటి నమ్మకాల సంప్రదాయానికి అన్నమయ్య తన శక్తియుక్తులు ధార పోశాడు. తన సామర్థ్యాని కనుగుణంగా ఒక జీవిత కాలాన్ని సంకీర్తన రూపమైన కైంకర్యానికి వినియోగించాడు. ఇలాంటి సాంస్కృతిక సాఫల్యాన్ని పొందిన మరే వాగ్గేయకారుడు మనకు కనిపించడు.

అన్నమయ్యను గురించి చెప్పుకోవటానికి వంద విషయా లున్నాయి. అతన్ని మధుర కవిగానో, శృంగారకవిగానో, ఆధ్యాత్మిక కవిగానో, పదకవితా పితామహుడుగానో చెప్తే సరిపోదు. ఒక్క తాత్త్విక కవి గానే అతని సాధనను గురించి వంద రకాలుగా చెప్పు కోవచ్చు.

## భక్తితత్త్వం

పరమాత్మపై చూపే పరమ ప్రేమే భక్తి అని నారద భక్తిసూత్రాలు చెప్తున్నాయి. భక్తికి ఎలాంటి పరిమితులూ లేవు. భగవంతుని పాద సేవాసక్తి ఉన్న జంతువులకు కూడా భక్తిని చూపే అధికారం ఉందని ధూర్జటి లాంటి కవులంటారు.

ఏ వేదంబు పఠించె లూత, భుజంగంబే శాస్త్రముల్ సూచె, తా
నే విద్యాభ్యసనం బొనర్చె కరి, చెంచే మంత్రమూహించె, బో
ధావిర్భావనిధానముల్ చదువులయ్యా కావు, మీపాద సం
సేవా సక్తియె కాక జంతు తతికిన్ శ్రీకాళహస్తీశ్వరా.

మానవునితో సహా అన్ని జంతువులకూ భక్తికి అధికారం ఉంది. భక్తిని నవవిధాలు గానో మరెన్నో రకాలుగానో సూత్రకారులు నిరూపించినా మొత్తం మీద ఈ భక్తి ఆర్ద్రతను, ఆశ్చర్యాన్ని, అనన్యతను కలుగజేస్తుందని చెప్పవచ్చు. 'కలయో వైష్ణవ మాయయో యితర సంకల్పార్థమో సత్యమో' అని యశోదాదేవి తనలో తాననుకొని 'మహాశ్చర్యంబు చింతింపగన్' అంటుంది.

భక్తికి యుక్తాయుక్త విచక్షణ ఉండదు. కురుక్షేత్రంలో భీష్ముడు విజృంభించి యుద్ధం చేస్తుంటే యుద్ధంచేయనన్న కృష్ణుడు 'నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు విడువు మర్జున' అంటూ ముందు కురికాడు. భీష్ముడేమో 'నమ్మితి నాలావు నగుబాటు సేయకు, మన్నింపుమని క్రీడి మరల దిగువ, కరికి లంఘించు సింహంబు కరణి', చనుదెంచు దేవుడే దిక్కని చేతులు జోడించాడు. ఇవన్నీ పోతన చేష్టలేకాని భీష్ముని చేష్టలు కావు. ఇలాంటి అన్ని రకాల భావాభివ్యక్తులు భక్తిలో ఉంటాయి. అందువల్ల అన్నమయ్య రచనల్ని కూడా ఒక జీవిత కాలంలో పండిన అనుభవం పద సాహిత్యంగా ఎలా అభివ్యక్తి చెందిందనే దృష్టితోనే చూడాలి కాని దాన్ని మధుర భక్తిగానో, నాయికా రూపంలో వెలువడిన శృంగార చేష్టలుగానో పరిశీలించడం సమంజసం కాదు.

మధురభక్తి అనగానే రచయిత లేక రచయిత్రి తనను నాయికగా ఊహించుకొని వ్యక్తీకరించే భావనగా అనుకోవటమూ సరిగాదు. ఇలా అను కోవటం వల్ల 'ఇల్లాలివై మోహ మిత్తువు నాకు' అని ఇల్లాలి మోహానికి కూడా దేవదేవుడే కారణమని, ఆ భగవంతుడు ఇల్లాలి రూపంలో కూడా భక్తిని స్వీకరిస్తాడని చెప్పటానికి అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. మధురభక్తిని గురించి రూపగోస్వామి చెప్తూ శాంతానికి రుక్మిణిని వాత్సల్యానికి యశోదని చెప్పినట్లే మాధుర్యానికి గోపికల్ని ఉదాహరణంగా చెప్పటం వల్ల వచ్చిన చిక్కు ఇది. దీనివల్ల గోపికల్లాగా ప్రేమని చూపేది మధురభక్తి అని భావించటం జరిగింది. మధుర మంటే నాయికాపరమైన అర్థం ఎక్కడా లేదు. వల్లభాచార్యుల వారి మధురాష్టకంలో

అధరం మధురం వదనం మధురం
నయనం మధురం హసితం మధురం
హృదయం మధురం గమనం మధురం
మధురాధిపతే రఖిలం మధురం . . . .

అన్నపుడు కూడా మళ్ళీ మళ్ళీ కోరుకునేటట్లుగా ఉందని అర్థం చెప్పు కోవాలి. 'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు' అన్నప్పుడు కూడా మకరంద మాధుర్యాన్ని సూచించటమే కవి ఉద్దేశం. అందువల్ల గోపికా సంబంధమైన భక్తి మాత్రమే మధురమని భావించి అన్నమయ్యను మధురకవుల జాబితాకు పరిమితం చెయ్యాల్సిన అవసరం లేదు.

అన్నమయ్య తన రచనలకు ఎంపిక చేసుకున్న పరిధి చాలా విశాలమైంది. ఒక జీవితకాలంలో 32,000 సంకీర్తనలు, ఇతర రచనలు చేయడం సామాన్యమైన విషయం కాదు. ఇప్పటి వరకు దొరికిన సంకీర్తనలు ఎక్కువగా శృంగార సంకీర్తనలే. మరి దొరకని వాటిలో శృంగారం పాలు ఎంత ఉందో అధ్యాత్మం పాలు ఎంత ఉందో తెలియదు. దొరికిన వాటిని మాత్రమే ముందుంచుకొని అన్నమయ్య లౌకిక శృంగారానికే పెద్దపీట వేశాడని చెప్పటం కూడా న్యాయం కాదు. అన్నమయ్యలో ఆధ్యాత్మిక

దృష్టికన్న లౌకికదృష్టి ఎక్కువగా ఉందనటమూ న్యాయంకాదు. శృంగారాన్ని భక్తిలో పర్యవసానం చేసినా అన్నమయ్య మరీ అంత 'పచ్చిగా' శృంగారాన్ని వర్ణించ వలసిన అవసరం ఉందా అని ఆలోచించిన వారు లేకపోలేదు. నిజానికి అన్నమయ్యది జానపద మనస్తత్త్వం. అచ్చమైన జానపదుడిగా ఉండి వైష్ణవతత్త్వాన్ని అవగాహన చేసుకొని ఆధ్యాత్మిక కవిగా కూడా అవతార మెత్తిన వాడు అన్నమయ్య. అందువల్లనే అన్నమయ్యలో ముగ్ధ మనోహరమైన భావాలు, సామాజికమైన ఆలోచనలు, కుల వర్గాతీతమైన విష్ణుభక్తి దర్శనమిస్తాయి. జానపదుల్లో ఉన్న సృజనాత్మక తాత్త్విక ఆలోచనలే అన్నమయ్యలో కనిపిస్తాయి. జానపదుల్లో లాలులు, జోలలు, సువ్వాలలు, అల్లోనేరేళ్ళు కనిపిస్తాయి.ఒక్క నడకలోనే కాదు, భావజాలం, పదజాలం కూడా జానపదులకు దగ్గరగా ఉంటుంది. శృంగారం కూడా అంత 'పచ్చి' గానే ఉంటుంది.

## అభివ్యక్తిలో వైచిత్రి

అన్నమయ్యను ఎన్ని విధాలుగానైనా పరిశీలించవచ్చు. అలాగని లోకంలో ఉండే దంతా అన్నమయ్యలో ఉందనికాదు. తనకున్న అనుభవం లోనే అన్నమయ్య విశ్వరూపం చూపాడు. ఎన్నో విషయాలలో అతనే ప్రథముడు. మొదటిసారిగా ఎన్నో రాగాలను వాడాడు. అయితే అన్నమయ్య పద సాహిత్యాన్ని భావప్రధానంగా పాడితేనే దాని విలువ తెలుస్తుంది. పదానికి అర్థానికి ఉన్న విలువ తెలిసి వాడిన వాగ్గేయకారుడు అన్న. య్య. ఆయన కేవలం శాస్త్రంకోసమే రచన చేసినవాడు కాదు. అందువల్ల శాస్త్రీయ రాగాల కోసమే వెతకడం కంటె అన్నమయ్య అభివ్యక్తి సామర్థ్యాన్ని గురించి ఎక్కువగా మాట్లడటం మంచిది. అలాగని అన్నమయ్యకు సంగీతానికి సంబంధం లేదనికాదు. అన్నమయ్య ప్రారంభించిన దాక్షిణాత్య సంగీత సంప్రదాయం త్యాగరాజులో సాఫల్యాన్ని పొందింది. దాక్షిణాత్య సంగీతంలో వీరిద్దరూ ఆద్యంత గురువుల్లాగా భాసిస్తారు. సంకీర్తనం నుండి కృతి వరకు సాగిన ప్రస్థానంలో

ఈ ఇద్దరు వాగ్గేయకారులు రెండు ఉన్నత శిఖరాలై దాక్షిణాత్య సంగీతాన్ని సుసంపన్నం చేశారు.

## భాషాభివ్యక్తి

ఒక భాషను వినియోగించటంలో ఉండే సామర్థ్యాన్ని బట్టి కవి విశ్వరూపం తెలుస్తుంది. తెలుగులో కొంతమంది కవులు మాత్రమే ఆ భాషకున్న చేవను సంపూర్ణంగా వినియోగించుకోగలిగారు. అన్నమయ్య ఆ కోవలో చేరే కవి, వాగ్గేయకారుడు. పద్యంలో ఒక రకమైన భాషకు ఉపయోగం, పదంలో మరోరకమైన భాషకు ఉపయోగం. పండిత భాషకు ఎంత చేవ ఉందో పామర భాషకు కూడా అంతే ఉంది. అన్నమయ్య రెండు రకాల భాషలనీ వాడగలిగిన సత్తా ఉన్నవాడు. అయితే ఎలాంటి భాషని వాడినా అతని అభివ్యక్తి విలక్షణంగానే ఉంటుంది.

కొలది బ్రహ్మండపు గూడెన వో న
కులికి జీవులను కొలుచు నించి
కలికి దుర్మోహపు రోకలి వేసి
తలచి తనువులను దంచీ మాయ - అంటాడు.

తొంగలి రెప్పల రాత్రులు బగలును
సంగడి కన్నులుగా సరి ద్రిప్పుచు
చెంగలించి దిక్కులనే చేతులూచుచు
దంగుడు బియ్యాలుగా దంచీ మాయ - అనటంలో

సృజనాత్మక తత్త్వదృష్టి కనిపిస్తుంది. చెప్పేది భక్తి తత్త్వమైనా కొత్తగా చెప్పాలనే ఉబలాటం అన్నమయ్యది.

అన్నమయ్య అలంకార శాస్త్రమే వేరు. మామూలుగా కవులు వాడే పదాలు వాడడు. ఊహలకందని వర్ణనలు చేస్తాడు. వాన కురవటం ఆకాశం నుండి మాత్రమే అనుకుంటే దేహమంతా వాన కురిపిస్తాడు.

పడతి చెక్కుల వెంట పన్నీటి వాన గురిసె
వడి నందె మెఱుగుల వాన గురిసె

విడివడి తురుమున విరుల వాన గురిసె
చిడుముడి జవ్వనము చిగిరించెనయ్యా.

మొలక నవ్వులనె ముత్యాల వాన గురిసె
వలపుల పెను జడివాన గురిసె
కలికి సిగ్గుల దొలకరి వానలు గురిసె
పలుమారు జవ్వనము పద నెక్కినయ్యా . . . .

తిక్కన ఎన్ని రకాల నవ్వులను చెప్పాడనే దాని మీద పరిశీలన జరిగింది. అలాగే అన్నమయ్య ఎన్ని రకాల వానలు కురిపించాడు ఎన్ని రకాల పూవులు పూయించాడు, ఎన్ని రకాల అనుభూతుల్ని పరిచయం చేశాడు, ఎన్ని రకాల పోలికల్ని కనిపెట్టి చెప్పాడు అన్న విషయాల్ని పరిశీలించ వలసి ఉంది.

అన్నమయ్య వాడే అలంకారాలు మరెవ్వరికీ అందనట్లుంటాయి. స్వానుభవం, అనుభవంలోనుంచి వచ్చే వ్యక్తీకరణవైచిత్రి, అనుకున్న విషయాన్ని పలురకాలుగా చెప్పగలిగిన శక్తి ఉన్నవాడే ఇలా రాయగలడు.

ఈ రీతి వలపులె లొకటి కినుమడాయ విభుడ
కోరికలు కోటానుకోటి సతికాయ
సుదతి నీ రాక కెదురు చూచేటి యాసలను
కదిసి నగుమోమెల్లా కన్నులాయె
యిదె నీ కడకు నాకె యేతెంచు దమకమున
అదన ముని ముంగిలెల్ల నడుగులే మాయ . . . .

వీటిని ఇలా చెప్పి వదిలేస్తాడా అంటే అలా వదలడు. దీన్ని కూడా తన యిష్ట దైవానికి ఆపాదిస్తాడు, అన్వయింప జేస్తాడు, అంకిత మిస్తాడు.

గరగరని కురులతో కస్తూరి వాసనలు
విరి తావుల తోడ విసరగాను
తిరువేంకటాధిపుడ నిను గూడి నే
నర మరచి సదమదము లౌట యెన్నడురా - అంటాడు.

శృంగార సంకీర్తనలని కొన్నింటికి మనం పేరుపెట్టుకున్నా అధ్యాత్మ సంకీర్తనలనే చెప్పదగ్గవి కొన్ని ఉన్నాయి.

అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
నితర మోహాపేక్ష లన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసన వోలె నుండె

తరుణి హృదయము కృతార్థత బొంది విభుమీది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భామాయ ....

అన్నమయ్య శృంగార సంకీర్తనల్ని చిన్నతనంలో రాసి వయసు పెరిగే కొద్దీ అధ్యాత్మం వైపు మనసు మళ్ళించుకున్నాడా? లేక శృంగారం లోనే అధ్యాత్మ సంపదను కూడా చూడ గలిగాడా?

అదిగాక సౌభాగ్యమిది గాక వలపు
అదిగాక సుఖమింక నందరికి గలదా

అనటం కేవలం సుఖమని భావించ గలమా?

విరహిణి అయిన శృంగార నాయికలో ప్రత్యంశమూ పూజాసుమ మని భావించటంలో భౌతికమూ ఆధ్యాత్మికమూ ఒక్క చోటనే సమావేశ మయినట్లే ఉంటుంది.

కలికి నీ కనుచూపు కలువ రేకుల పూజ
లలన నీ నగపు మొల్లల పూజ
తలపోత చింత చిత్తపు కమలపు పూజ
చలివేడి వూర్పు నీ సంపంగి పూజ ....

ఇందులో కొన్ని భావనలు అపురూపంగా కొనసాగుతాయి.

'చెనకు నీ గోళ్ళ చిరుకేదగుల పూజ'
'కన నీదు మోవి మంకెన పూవు పూజ'

ఒక కవికి ఇన్ని మధురభావనలు వస్తాయా అనిపిస్తుంది. అత్యాధునిక కవిత్వంగా మలచినా అన్నమయ్య నెగ్గుకొచ్చే సందర్భాలెన్నో ఉన్నాయి.

'ఇదివో నీ కెమ్మోవి యెర్రశిల కనుమ
కదిసి లే జిగురుల కప్పుకొన్నది'
'వల పారగించవమ్మా వనిత నీ'
యలుక చిత్తమున కాకలి వేసినది'

పదకవితా పితామహుడుగానే కాక సృజనశీల తాత్త్విక భావాలకు కూడా ఆద్యుడిగా కనిపించే అపురూపమైన కవి అన్నమయ్య.

★ ★ ★

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

# అన్నమయ్య దర్శించిన శ్రీవేంకటేశ్వర తత్త్వవైభవం

తిరుమల పుణ్యక్షేత్రం 'కలియుగ వైకుంఠం' గా ప్రసిద్ధి పొందింది. ఈ దివ్యస్థలంలో శ్రీమహావిష్ణువు "శ్రీవేంకటేశ్వరుడు" అనే పేరుతో వెలసివున్నాడు. ఈ స్వామి శ్రీవైకుంఠం నుంచి నేరుగా దిగివచ్చి సాలగ్రామ శిలారూపంతో స్వయంవ్యక్త మూర్తిగా ఆవిర్భవించినాడు.

శేషాచలే యన్మాహాత్మ్య మన్య క్షేత్రే నతత్ క్వచిత్
తద్గత శ్రీనివాసస్య, మహిమా నాన్యగః శుభః ॥

అనంత విశ్వాలలో శేషాచల క్షేత్రానికి వున్న మహిమ ఇతర క్షేత్రాలకు లేనేలేదు. అలాగే, ఈ పుణ్యక్షేత్రం మీద వెలసివున్న శ్రీవేంకటేశ్వరుని వంటి మహిమాన్వితమైన దేవుడు ఇతర క్షేత్రాల్లో ఎక్కడా కానరాడు.

మరి ఇంతటి ప్రశస్తికి ఆ క్షేత్రవైభవం, ఆస్వామివారి నామవైభవం, రూపవైభవం, అర్చనావైభవం, తత్త్వవైభవం మున్నగునవి ప్రధానమైన కారణాలుగా చెప్పుకోవచ్చు.

## క్షేత్రవైభవం

వేంకటాచల క్షేత్రం యొక్క సత్యమైన, శాశ్వతమైన ఆధ్యాత్మిక తేజోవైభవాన్ని అన్నమాచార్యులు

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ ॥పల్లవి॥

వేదములే శిలలై వెలసినది కొండ
యే దెస పుణ్యరాసులే యేరులైన ది కొండ

గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీదేవుడుండేటి శేషాద్రి యీ కొండ ॥కట్టె॥ (3-471)

అంటూ ఆవిష్కరించగా, ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యుడు వేంకటాచలక్షేత్ర దివ్య మహత్త్వ ప్రాభవాన్ని ఇలాగ వర్ణించడం విశేషం!

కొండా! చూతము రారో! కొండుక తిరుమల కొండా
కొండని యడిగిన వరము లొసగు మా కొండల తిమ్మయ కొండా ॥పల్లవి॥

యిదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు
యిదియె నందవ్రజమనుచును మరి యిది దానయోధ్య యనుచూ
యిదియె వైకుంఠం బనుచును యిది పరతత్త్వంబనుచు
యిదియె పరమపదంబనుచు వేదములు యెన్నఁగఁగల మా కొండా॥
(5-460)

## నామవైభవం

వేంకటేశ్వరస్వామికి ఎన్నో ఎన్నెన్నో పేర్లు వున్నాయి. అవన్నీ నిజంగా ఆ స్వామి వారి అసలైన పేర్లేనా? అంటే అదీ చెప్పలేం. కాని ఒక్కటి మాత్రం నిజం. భక్తులు ప్రియాతి ప్రియంగా, ఎంతో ఇష్టంగా తమకు నచ్చిన పేర్లతో ఆయన్ను పిలుచుకుంటున్నవే! అయితే ఆ పేర్లన్నీ అద్భుతంగాను వుంటాయి. విచిత్రంగాను వుంటాయి. ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కూడా కల్గిస్తాయి.

ఆ స్వామివారు తాను ఉన్న స్థలాన్ని బట్టి "ఏడుకొండలవాడు" అనీ, 'తిరుమలేశుడు' అనీ, 'సప్తగిరీశుడు' అనీ, ఆయన చేస్తున్న పనిని, కార్యాన్ని (డ్యూటీ) బట్టి, 'వేం - పాపాలను, కటః - దహించడం వల్లా, వేం-ఐశ్వర్యాన్ని, సంపదలను, కటః - కటాక్షిస్తున్నందువల్ల, అనుగ్రహిస్తున్నందువల్ల, "వేంకటపతి " అని పిలువబడుతున్నాడు. ఇంతేగాక ఈ స్వామి మరొక విచిత్రమైన, వింత అయిన పేరును కలిగి

వుండటం ఆశ్చర్యం! అదీ, తన పత్ని పేరుతో పిలువబడటం! తన వక్షఃస్థలం మీద వెలసి వున్న శ్రీమహాలక్ష్మిని బట్టి, 'శ్రీనివాసుడు' అనీ - ఇలాగ వివిధమైన పెట్టుడుపేర్లు గల విభవాల దేవుడు వేంకటేశ్వరుడు. తన అసలు పేరేమిటో తెలియని ఈ స్వామి వారిని ఏ పేరుతో పిలిచినా, ఎలా భావించినా పలుకుతాడట!

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడ ఁబిండంతే నిప్పటి యన్నట్లు ॥పల్లవి॥

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుడనుఁచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు ॥

(2-393)

- అంటూ ఈ పాటలో శ్రీనివాసుని నామ వైభవాన్ని గూర్చి వర్ణించాడు పరమభక్తుడైన అన్నమయ్య.

## రూపవైభవం

ఆనంద నిలయంలో శ్రీనివాసుడు చతుర్భుజాడుగా, శంఖ, చక్రాలతో, కటివరద హస్తాలతో, ఒక సొంపైన భంగిమలో నిలిచి వున్న తీరు రీతి రమణీయం.

సంసార సాగర సముత్తరణైకసేతో అన్నట్లుగా, కుడి హస్తంతో పాదాలను చూపుతూ, వీటిని శరణు వేడితే చాలు. మీ సంసార సముద్రాన్ని మోకాళ్లలోతు మాత్రం చేసి సులభంగా దాటించడమే గాక, ఎడమచేత్తో మిమ్మల్ని అక్కున చేర్చుకుంటాను, అంటూ సందేశ మిస్తున్నట్లుగా వున్న శ్రీనివాస పరంధాముని భంగిమను గూర్చి ఒక అజ్ఞాత మహాకవి ఇలా ప్రశ్నిస్తాడు.

కుడి హస్తం బిటు చూపు చందమిది, వైకుంఠంబనే యందమో
జడధివ్రాత పరీక్ష భూ భువన రక్షా దక్షిణంబైన నీ
యడుగుల్ చూడు మనేవో! కాక యొక యొయ్యారంబొ? సందేహమై
యడిగే నానతి యిమ్ము, వేంకట నగాధ్యక్షా! జగద్రక్షకా!!

ఆ కవిగారి సందేహంలోనే సమాధానం దొరుకుతూ, శ్రీనివాసుని దివ్యమైన రూపవైభవం స్పష్టమవుతున్నది. మరో విశేషవైభవం ఏమిటంటే, శ్రీ స్వామి వారి విగ్రహ మూర్తికి ఆభరణాలు అలంకరిస్తే ఒక అందం ఏ ఆభరణాలు లేకపోయినా సరే మరో అందం! ఆ స్వామివారు అభిషేకంలోను, అర్చనలోను, పూలంగిసేవలోను, తిరుప్పావడ లోను, నేత్రదర్శనం లోను, ఇలాగ వివిధ వేళల్లో వివిధ అందాలతో దర్శనమిస్తూ, భక్తులను ఆనందింపజేయడం అందరి అనుభవంలో వున్న పరమసత్యం.

## అర్చనావైభవం

నిత్యకల్యాణ చక్రవర్తి, నిత్య శోభనమూర్తి అయిన శ్రీనివాస ప్రభువునకు వైఖానసాగమం ప్రకారం జరుగుతున్న అర్చనావిధానం, సేవా వైవిధ్యం కూడా వైభవ ప్రాభవాన్ని సంతరించుకుంది. షట్కాలార్చనలతో, నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో, ఆయా వేళల్లో నివేదింపబడే దివ్యాన్నాల ఆరగింపులతో, న భూతో న భవిష్యతి, అన్న ప్రఖ్యాతి పొందిన కొండలరాయని కొండంత ఈ అర్చనావైభవాన్ని తాళ్లపాక అన్నమయ్య కూడా అనేక కీర్తనల్లో వర్ణించినాడు.

## తత్త్వవైభవం

తిరుమల వేంకటేశ్వరస్వామి ఎవరు? అసలు ఆయన తత్త్వం ఏమిటి? ఆ శ్రీనివాస తత్త్వాన్ని ఎవరైనా దర్శించినారా? దర్శిస్తున్నారా? ఎలా దర్శించాలి? దర్శించడానికి ఏమైన అర్హత లుండాలా? అన్న అనేకమైన సందేహ పరంపరలకు చక్కటి సమాధానమిస్తూ, అన్నమాచార్యుల వారు తిరుమల మీద పరబ్రహ్మ తత్త్వం ఎలాంటిదో వివరిస్తున్నాడు.

నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం -
స్తుత్యుడీ తిరువేంకటాద్రి విభుడు ॥

నిరాకారమై, సర్వవ్యాపకమైన, శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన, పరబ్రహ్మ తత్త్వమే, ఈ వేంకటాచల క్షేత్రంలో, సాకారరూపంతో శ్రీ వేంకటేశ్వరుడనే పేరుతో భక్తరక్షణ అనే ప్రధానమిషగా నిలిచివున్నాడంటాడు అన్నమయ్య.

దివ్యమైన ఈ మూర్తి సమస్త లోకాల్లో వ్యాపించి పాలిస్తున్నప్పటికీ, ఆ స్వామి అంత సులువుగా అందరికీ కనపడడనీ, అందుకే, ఆలయ దర్శనం కోసం బ్రహ్మాది దేవతలు అర్రులు చాస్తూ అన్వేషిస్తారనీ, ఉపాసిస్తారనీ, సమస్తలోకాల్లోని రూపాలన్నింటిని ధరిస్తున్నప్పటికీ, ఏ రూపమూ ఆయన నిజమైన రూపం కాదనీ, త్రిమూర్త్యాత్మకుడైన ఆ పరమాత్మే ఈక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరునిగా భాసిస్తున్నాడని, "అణోరణీ యాన్మహతో మహీయాన్" అన్నట్లు వేదప్రతిపాద్యుడైన పరబ్రహ్మమే వేంకటేశ్వరుడనీ అన్నమయ్య వేదతుల్యములైన పదకవితల్లో అణురేణు పరిపూర్ణుడై వ్యాపించిన శ్రీ వేంకటేశ్వరుని తత్త్వాన్ని లోకానికి చాటినాడు.

జితేంద్రియులు కానట్టి, వైరాగ్య సంపన్నులు కానట్టి సామాన్య సంసారుల మాటేమిటి? పరిస్థితి ఏమిటి? వాళ్లు భగవంతుణ్ణి దర్శించనే లేరా! వీలు పడదా? అని అంటే, అలాంటిదేమీ లేదు. భక్తుడై వున్నవాడు ఎవడైనా దర్శించవచ్చని జవాబు చెబుతున్నాడు అన్నమయ్య.

భక్తి కొలఁది వాడే పరమాత్ముఁడు
　　భుక్తి ముక్తి ఁదానె యిచ్చు - భువి ఁబరమాత్ముఁడు ॥పల్లవి॥
పట్టిన వారి చేతి బిడ్డ పరమాత్ముఁడు
　　బట్ట బయటి ధనము పరమాత్ముఁడు

పట్టు పగటి వెలుఁగు పరమాత్ముఁడు
యెట్ట నెదుటనే వున్నా ఁడిదె పరమాత్ముడు ॥భక్తి॥ (1-410)

భక్తి వుంటే చాలట! భక్తులకు కట్టుబడి వుండటమే గాక, భుక్తినీ, ముక్తినీ ప్రసాదిస్తాడట పరమాత్ముడు! భగవంతుడు పట్టినవారి చేతిబిడ్డ వంటి వాడనీ, బయటవున్న ధనం లాంటి వాడనీ, పట్టపగటి వెలుగు లాంటి వాడనీ, ఆయన ఎక్కడో కాదు. ఎట్టఎదుటనే, వేంకటాచలంలో వున్నాడనీ వివరిస్తూ, అన్నమాచార్యులు ఇంకా ఇలా తెలియజేస్తాడు.

పాలలోని వెన్నవలె, సర్వవ్యాపకుడైన పరమాత్మ భక్తికి మాత్రమే సులువుగా లోబడతాడని అన్నమాచార్యులు వ్యాఖ్యానిస్తాడు.

భగవంతుడు పురుషోత్తముడనీ, రూపెత్తిన అనంత దయా స్వరూపమే ఆ స్వామి అంటూ ఈ క్రింది పాట ద్వారా ప్రబోధిస్తాడు పదకవితా పితామహుడు.

పురుషోత్తముఁడ నీవు, పురుషాధముఁడ నేను
ధరలో నాయందు మంచితన మేది ॥పల్లవి॥

అనంతాపరాధములు అటు నేము సేసేవి
అనంతమయిన దయ అది నీది
నిను నెఱఁగకుండేటి నీచు గుణము నాది
నను నెడయకుండే గుణము నీది ॥పురు॥ (2-53)

అనంతమైన దయ చూపడం, భక్తుని ఎడబాయక వుండడం, సకల రక్షకత్వం చూపడం, శ్రీ వేంకటేశ్వరుని లక్షణాలన్నీ, అనంత జ్ఞానమే భగవతత్త్వం అని వివరిస్తూ అన్నమాచార్యులు దానికి పూర్తిగా వ్యతిరేకమైన లక్షణాలను మానవుడు కలిగివుంటాడని పేర్కొన్నాడు.

ఇంకోచోట అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వర తత్త్వాన్ని చెప్పక చెబుతూ, స్వామీ! నిన్ను చేరడానికి ఉపాయం వుందా? వుంటే అది

ఏది? ఎందుకంటావా నీవు? ఆదీ అంత్యమూ లేని అచ్యుతమూర్తివి. మరి నిన్ను ఉపాసించే మార్గం ఏదో ! అంటూ ఇలా కీర్తిస్తాడు.

ఏ దుపాయము యే నిన్ను (జేరుటకు
అది నంత్యము లేని అచ్యుతమూరితివి ॥పల్లవి॥

వెలయ నీ గుణములు వినుతించే నంటే
తెలియ నీవు గుణాతీతుడవు
చెలరేగి నిన్ను మతి జింతించేనంటే
మలసి నీ వచింత్య మహిముడవు ॥ఏదు॥ (2-122)

స్వామీ! ఘన వేంకట ప్రభూ! నీ గుణాలను కీర్తించుదామంటే నీవు గుణాలకన్నింటికీ అతీతుడవు! నా మదిలో నిన్ను గూర్చి చింతించుదాం అనుకుంటే, నీవు చింతించుటకు సాధ్యం గాని అనంతమైన మహిమలు కలవాడివి. మరి నా చేతులతో పూజిద్దామంటే, నీవు సాధ్యం కాని విశ్వకాయుడవు. ఏదైనా నీకు సమర్పించుదామంటే, అన్ని కోరికలు తీరిన వాడివి. నా కన్నులతో చూద్దామంటే, నీవు అగోచరుడవు. అందువల్ల ఓ వేంకటేశా! అన్నింటిలో మేలైనది. నీకు శరణు అనడమే. నిన్ను శరణాగతి పొందడమే. అదే ఉత్తమ మైనది.

సాలగ్రామ శిలామూర్తి అయిన శ్రీవేంకటేశ్వరుని విగ్రహం కేవలం ఒక్కటే ! అయినా ఆ విగ్రహమూర్తిని ఆలంబనం చేసుకొని, ఆధారం చేసుకొని, చెప్పిన రీతిలో చెప్పకుండా, వర్ణించిన తీరులో వర్ణించ కుండా, వైవిధ్యభరితమైన దృక్కోణాల్లో పరమభక్తుడైన అన్నమా చార్యులు సుమారు 32వేల పదకవితల్లో శ్రీవేంకటేశ్వర తత్త్వవైభవ ప్రాభవాన్ని ఆవిష్కరించినాడు. అన్నమయ్య చూపిన బాటలో నడిచిన ఉభయ వేదాంత పండితులు తాళ్లపాక పెద తిరుమలాచార్యులు ఎరుకపరచిన శ్రీ వేంకటేశ్వరుని వైరాగ్య తత్త్వ గీతికతో ఈ వ్యాసానికి స్వస్తి వచనాలు పలుకుదాం.

**అలమేలు** మంగపతీ !
నిన్ను వెదకి కనియెదమన నెంతవారము?
నీ సుద్దులు పెద్దల నడిగి యడిగి
వైకుంఠవాసుడ వనగా నీ వూరెరింగితిమి !

విష్ణు, వాసుదేవ, నారాయణ నీ నామంబులు విని నీ పేరెరింగితిమి! శరణాగత రక్షకత్వము నీకుం గలదనంగా నీ గుణము దెలిసితిమి! శ్రీ కౌస్తుభాది చిహ్నంబులు చూచి నీ గురు తెరింగితిమి! నీలమేఘశ్యామ లక్షణంబులు గలుగంగా నీ వర్ణంబెరింగితిమి! శేషాచల నివాసంబు కతన నీగోత్రం బెరింగితిమి! పురుషోత్తమ ఖ్యాతి చేత నీ పౌరుషం బెరింగితిమి! వేణునాద వినోదివని చెప్పంగా నీ వంశం బెరింగితిమి ! మత్స్య, కూర్మాద్యవతారంబులు విని నీపుట్టువు లెరింగితిమి ! నీకు మ్రొక్కెద మన్నిట నధికుండవని నిన్ను గొలిచితిమి! యింక నీ మహిమలు గొని యాడెదము పాడెదము శ్రీ వేంకటేశ్వరా!

★ ★ ★

గల్లా చలపతి

## అన్నమయ్య శృంగార సంకీర్తనలు - సామాజిక శృంగారతత్త్వం

దొరికిన అన్నమాచార్యులవారి సంకీర్తనల్లో శృంగార సంకీర్తనల సంఖ్య ఎక్కువ. దీనికి కారణముంది. సాధారణంగా మనిషి జీవితంలో శృంగారం అనుభవంలోకి రావడం ఒక దశవరకు జరిగితే ఆ తరువాత శృంగారాన్ని గురించి ముచ్చటించుకోవడం ఉంటుంది. అనుభవదశ లోని శృంగారానికున్న తీవ్రత, ఉరవడి ముచ్చటించుకొనే దశలో ఉండవు. శృంగార విషయాలనుదగ్గరివాళ్లతో చెప్పడం తద్వారా మానసిక ప్రశాంతతను పొందడం అసహజం కాదు. ఇలాంటి విషయాలను కూలంకషంగా చెప్పడానికి ప్రయత్నించే వాళ్లు శాస్త్రకారులవుతారు. వాత్స్యాయన మహర్షి లాంటివాళ్లు ఇలాంటి శాస్త్రకారులే. వీళ్లది సమాజ దృష్టి. కామ పురుషార్థాన్ని లోకం ఎలా అర్థంచేసుకోవాలో, దాని అవసరం ఎలాంటిదో, దాని ప్రయోజనం ఎలాంటిదో వాళ్ల రచనల ద్వారా చెప్పడానికి ప్రయత్నంచేశారు. శాస్త్రవిషయాలు సమాజ అభ్యుదయకరాలు కాబట్టి శాస్త్రకారులు వాళ్ల అనుభవాలతోపాటు వివిధ ప్రాంతాల నుండి సేకరించిన విషయాలను ఆధారం చేసుకొని సిద్ధాంతాలు తయారు చేసి సమాజాని కందిస్తారు. అందువల్ల ఈ విషయాలన్నీ ఆయా శాస్త్రకారుల జీవితాల లోని రెండవ దశకు సంబంధించినవిగానే ఉంటాయి. ఇలా ఆలోచిస్తే శృంగార సంకీర్తనల్నీ అన్నమయ్య జీవితంలోని రెండవదశ లోనే చెప్పినట్లు అర్థమవుతుంది. అన్నమయ్య చిన్నతనం నుండి తిరుమల వాసుని భక్తుడు. భక్తితో స్వామివారిని సేవించాడు. వైష్ణవంలో మునిగి పునీతుడయ్యాడు. విశిష్టాద్వైత సంప్రదాయాన్ని జీర్ణంచేసుకొన్నాడు. స్వామివారి అనంతత్వాన్ని దర్శించాడు. శరణాగతి విద్యను నమ్ముకొన్నాడు. సృష్టి

అంతటా నిండిన శ్రియః పతిని నోరారా కీర్తించాడు. స్వామిసేవలో భక్తుని స్థానమేమిటో గుర్తించాడు. భగవత్తత్త్వాన్ని జీవనతత్త్వాన్ని అర్థంచేసుకొన్నాడు. భక్తుడు పయనించ వలసిన అధ్యాత్మ వీధులలో పయనించాడు. చిదచిత్తుల స్వభావాన్ని గుర్తించాడు. వీటితో స్వామికి గల తాత్త్వికసంబంధాన్ని తెలుసు కొన్నాడు. తాను నమ్మిన విషయాలను లోకానికి చెప్పాలనుకొన్నాడు. అధ్యాత్మ సంకీర్తనలు రచించాడు. ఈ కీర్తనలలో అన్నమయ్య జీవితం ఉంది. లోకపు నడత ఉంది. ఆయన ప్రచారంచేసిన భక్తి ఉంది. జీవితంలోకి తొంగి చూసుకోవడంలో దర్శనీయమైన తాత్త్వికత ఉంది. ఈ సంకీర్తనలు పునాదిగా అన్నమయ్య భక్తి సిద్ధాంతాన్ని వివేచించడానికి అవకాశముంది.

## అన్నమయ్య సంకీర్తనల స్వభావం

అన్నమయ్య సారసనేత్రునిపై రచించిన సంకీర్తనలు యోగ మార్గానికి చెందినవి కొన్ని, వైరాగ్య వాసన గలవి కొన్ని, శృంగార రసరీతిలో ఉన్నవి కొన్ని అని అన్నమాచార్య చరిత్ర కథనం. యోగానికి, వైరాగ్యానికి సంబంధించినవి ఆధ్యాత్మికాలుగా గుర్తిస్తే మిగిలినవి శృంగార సంకీర్తనలు. ఆధ్యాత్మికత భక్తికి పునాది. కాబట్టి అన్నమయ్య భక్తిని నిరూపించడానికి అధ్యాత్మ సంకీర్తనలు బాగా తోడ్పడతాయి. 'విభావానుభావ సంచారీ సంయోగాద్రస నిష్పత్తిః'అనే రస సిద్ధాంతం భక్తిపరంగా అధ్యాత్మ సంకీర్తనలలో బాగా సమన్వయ మవుతుంది. భక్తిరసానికి ఆలంబనం భగవంతుడు. ఉద్దీపనం భగవచ్చరిత్రలు. భగవదాకార చిత్త వృత్తి లేక భగవద్రతి స్థాయిభావం. తత్కాలీన నేత్ర విక్రియాదులు అనుభావాలు. నిర్వేదశంకా హర్షాదులు వ్యభిచారులు. ఇలా భక్తిరసంగా పరిణమిస్తుంది. అధ్యాత్మ సంకీర్తనల్లో ఈ భక్తి రససామగ్రి ఎక్కడ వెదకినా కనిపిస్తుంది.

భక్తి భావమని, రసమని ఆలంకారికులలో అభిప్రాయభేదాలున్నా రసంగానే నిరూపితమైంది. భక్తి భావ స్థితినుండి రసస్థితిని పొందిన విధానాన్ని రూపగోస్వామి తన 'ఉజ్జ్వల నీలమణి' అనే గ్రంథంలోను,

మధుసూదన సరస్వతి తన 'భక్తిరసాయనం' అనే గ్రంథలోను విస్తృతంగా వివరించారు. శృంగారాదులు భక్తికంటే తక్కువేనని కూడా అన్నారు. అన్నమయ్యది సగుణ సాకారభక్తి. అధ్యాత్మ సంకీర్తనలలో ఆయన వర్ణించిన దేవతా మూర్తులన్నీ అర్చామూర్తులే. అందువల్ల విభావాది సామగ్రికి లోటులేదు. ఇలా అన్నమయ్య పండించిన భక్తిరసం లౌకికస్థితి నుండి అలౌకికస్థితికి చేరుకొని భక్తులకు తన్మయత్వాన్ని కలిగించి వారిమానసాలలో భగవద్రూపాన్ని నిలుపుతున్నది.

## శృంగార సంకీర్తనలు - రసస్థితి

భారతీయ జీవన విధానానికి ధర్మార్థ కామమోక్షాలు సోపానాలు. వీటి ఆధారంగానే మానవుడు జీవిత గమ్యం పొందుతాడని -

'చతుష్పదీహి నిః శ్రేణీ బ్రహ్మణ్యేషా ప్రతిష్ఠితా
ఏతా మారుహ్య నిః శ్రేణీ బ్రహ్మలోనే మహీయతే'

అనే శ్లోకం ద్వారా (మహాభారతం శాంతి పర్వం 242-15) వ్యాసుడు స్పష్టం చేశాడు. భారతీయ సాహిత్యం ఈ విషయాన్ని గుర్తించి చతుర్విధ పురుషార్థాల సాధనను కథల ద్వారా వివరించింది. పురుషార్థాలలో కామ పురుషార్థం ముఖ్యమైంది. ఎందుకంటే కామం మానవుడుకి ఒక సహజభావం (instinct) కాబట్టి. దీని ద్వారానే జీవిత పరమార్థం నిర్ణయింపబడుతుంది. కామం ఆనందం కోసమే కాదు. సంతానంకోసం కూడా. ఇంత విలువైన ఈ పురుషార్థాన్ని ఒక కళగా భావించడం జరిగింది. అందుకే 'ధర్మా2విరుద్ధో భూతేషు కామో2స్మి భరతర్షభ' అని గీత ప్రకటించింది. కామపురుషార్థంలో రతి, ప్రేమ అనే రెండంశాలున్నాయి. రతి దేహానికి, ప్రేమ (Love) హృదయానికి సంబంధించినవి. వాత్స్యాయనుని అభిప్రాయం ప్రకారం "Human sexuality is a fine combination of Physical emotional, intellectual and social aspects."[1] కామం ఒక పురుషార్థం కావడంలోనే దాని విలువ ఏమిటో అర్థమవుతుంది.

కామ పురుషార్థాన్ని పండించే స్థాయిభావం రతి. ఇది శృంగార రసాన్ని నిష్పన్నం చేయడంలో ప్రధాన సహాయకారి. కామ పురుషార్థ ప్రాధాన్యాన్ని గుర్తించడం వల్లనే ఆలంకారికులు దానికి సంబంధించిన శృంగార రసానికి ప్రాధాన్యతనిచ్చి రసరాజమన్నారు.[2] ఈ నేపథ్యంతో శృంగార సంకీర్తనలను పరిశీలించాలి. ప్రతి శృంగార సంకీర్తన శృంగార రస నిష్పత్తికి అవసరమైన రససామగ్రిని కలిగిఉంది. ఈ సామగ్రి సాధారణీకరణాన్ని పొంది పఠితలో లేక శ్రోతలో రసానుభవస్థితిని కలిగిస్తుంది. ప్రతి సంకీర్తనలోను ఆలంబన విభావ మైన నాయికా నాయకులు తప్పకుండా ఉంటారు. లోకంలోని శృంగార రససామగ్రిని సంకీర్తన నిండా నింపి చివరి చరణంలో నాయికా నాయకులను అలమేల్మంగా వేంకట పతులుగా చెప్పడం అన్నమయ్య పద్ధతిగా కనిపిస్తుంది. చివర చరణంలో కూడితివి, కలిసితివి, ఏలితివి, ఇత్యాది క్రియలు రతి సలపడం అనే అర్థంలో తప్పకుండా కనిపిస్తాయి. ఇలా శృంగార సంకీర్తనల నిండా శృంగారం తొణికిసలాడడం వల్ల ఈ శృంగారం లౌకికశృంగార మని, అది వేంకటపతి శృంగారంగా చెప్పడంవల్ల అలౌకికమవుతుందని అన్నమయ్య భావించాడని అర్థమవుతుంది.

వివిధ అర్చావతారాల కీర్తన, భగవంతుని వివిధ నామావళికీర్తన, నిత్యవిభూతి వర్ణన, శరణాగతినిపొందడం ఇత్యాది విషయాలు భక్తికి సంబంధించినవి. ఇవన్నీ అధ్యాత్మ సంకీర్తనల అంశాలు. శృంగార సంకీర్తనలలో భక్తిని నిరూపించే అంశాలు లేవు. అయితే ఆ శృంగార సన్నివేశం అలిమేలుమంగా శ్రీనివాసులది కాబట్టి, అది అలౌకికం కాబట్టి ఆ యంశం భక్తికి సోపానమేనని భావించడానికి అవకాశముంది. శృంగారరసం లౌకిక మైంది. లైంగికమైంది అయినా భక్తియుక్తమై దైవ పరమైనపుడు పారమార్థికం, అధ్యాత్మికం అవుతుంది.[3] చాలామంది పండితులు అభిప్రాయమిదే. శిఖర శృంగోన్నతమైన సంయోగ వాంఛ శారీరకమైతే బాహ్యరతికి, ఆత్మికమైతే ఆత్మరతికి దారి తీస్తుందని, మొదటి దశ స్త్రీని స్త్రీగా, పురుషుని పురుషునిగా చూపే భౌతికదృష్టి అని, రెండవ

దశ స్త్రీ పురుషులందరూ ఆత్మలై అంటే స్త్రీలై పరమాత్మకోసం పరితపించే ఒక పారలౌకిక మధుర దృష్టి అని మరొక అభిప్రాయం.[4] ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేసిన ఎందరో పండితులు అన్నమయ్య వర్ణించిన శృంగారం ఆత్మ పరమాత్మల దివ్యశృంగారమని, దీనికి లౌకిక స్పర్శ ఉండదని, ఇది శృంగారం ద్వారా భక్తిని ప్రకటించే మార్గమని నమ్మినవారు. జీవాత్మ పరమాత్మల మధ్య ప్రవర్తిల్లే శృంగారం నిజమైన శృంగారం కాదని, అది జీవాత్మ ప్రకృతి నుండి పొటమరించే శుద్ధ సాత్విక భావమని, భక్తిగా పరిణమిస్తుందని చెప్పే అభిప్రాయమే ఇప్పటి వరకు ప్రతిష్ఠితమై ఉంది. శృంగార సంకీర్తనలలోని విషయాన్ని నిశితంగా పరిశీలించక పోవడంవల్ల విమర్శకులలో ఈ అభిప్రాయం ఏర్పడిందని అని పిస్తుంది. వీళ్లకు అన్నమయ్యను శృంగారకవిగా చెప్పడం ఇష్టంలేక పోవడం మరో కారణం. అన్నమయ్య దార్శనికుడైన కవి. దార్శనికత్వం, లోకవృత్త వర్ణనా నిపుణత్వం కవిగా ఆయనకు పుష్కలంగా ఉన్నలక్షణాలు. ఈ రెండు లక్షణాలు ఆధ్యాత్మ శృంగార సంకీర్తనల ప్రధాన లక్షణాలు. ఇవి లోక పరిశీలన వల్ల రచనలోకి ప్రసరించిన లక్షణాలు. రెండు రకాల సంకీర్తనలు ఆయన జీవితంలోని రెండు దశలను సామాజికస్థితి ఆధారంగా నిరూపిస్తున్నాయి. ఎంతటి భక్త్యావేశపరుడైన వాగ్గేయ కారుడైనా సామాజికాంశాలను స్పృశించ కుండా ఉండడం కవియైనవానికి సాధ్యం కాదు. ఏ కవిమీదైనా సామాజిక ప్రభావం లేకుండా ఉండదు. అందువల్లనే శృంగార సంకీర్తనలలో వేంకటవిభుడు అలమేలు మంగమ్మలు చివరి చరణంలో నామమాత్రంగా, పదముద్రకోసమే నన్నట్లు కనిపిస్తారు. సంకీర్తనలలోని మిగిలిన సరుకంతా సమాజం నుండి సేకరించి గంపలకొలది కుప్పలు పోసినట్లు కనిపిస్తుంది.

అధ్యాత్మ సంకీర్తనల నిర్మాణం కార్య కారణత్వాలతో నిండుగా ఉంది. సంకీర్తన నిండా ప్రకృతి తత్వం దాన్ని నియంత్రించే పరమాత్మ తత్వం కనిపిస్తుంది. ఇది అన్నమయ్య అధ్యాత్మ తత్వంనుండి బహిర్గతమైన విషయం. ఆయనలోని అధ్యాత్మతత్త్వానికి శ్రీ వైష్ణవం కారణం. దాని

వెనుక ఆళ్వారులు, ఆచార్యులు - వారి రచనలు ఉన్నాయి. స్వామివారి నందకాంశంలో జన్మించడం, చిన్నతనం నుండి వైష్ణవభక్తిలో పారవశ్యం పొందడం, వైష్ణవాచార్యుల సరసన ఉండి వైష్ణవ సంప్రదాయాన్ని ఆకళింపు చేసుకోవడం, భక్తిమార్గాలలో కీర్తన మార్గాన్ని ఎన్నుకొని నేరుగా స్వామి సేవలో పాల్గొంటూ వెన్నుని అనంత గుణాలను కీర్తించడం ఇత్యాది విషయాలన్నీ అన్నమయ్య జీవిత ప్రథమ దశకు చెందిన అంశాలు. ఇవన్నీ అధ్యాత్మ సంకీర్తనల ఆవిర్భావానికి భిత్తికలు. అన్నమయ్య శుద్ధ సాత్త్విక దశ నుండి తాత్త్విక భావోద్వేగంతో పైకుబికిన నరహరి కీర్తనలివి. శృంగారం అనుభవ గోచరమైన తరువాత లోకంలోని మిథున మిథునేతర శృంగారాంశాలను ప్రతిపాదించడానికి చెప్పినవి శృంగార సంకీర్తనలు. ఇలా ఈ రెండురకాల సంకీర్తనల నిర్మాణంలోను, స్వభావంలోను ఖచ్చితమైన భేదం కనిపిస్తుంది. ఈ భేదమే సంకీర్తనలలో వ్యక్త మయ్యే భక్తి శృంగార రసాల మధ్య కూడా ఉంది. ఈ అంశం స్పష్ట పడిన తరువాత కూడా శృంగార సంకీర్తనలలో కనిపించేది దివ్యశృంగారమని, భక్తి శృంగారమని చెప్పడం సరికాదనిపిస్తుంది.

## మధురభక్తి

శృంగార సంకీర్తనలలో ప్రపంచితమై కనిపించే శృంగారం లౌకిక స్థితికి సంబంధించినది కాదని, శృంగారం నుండి విడివడిన దివ్య శృంగారమని, భక్తులు భగవంతుని సంయోగం కోసం చేసే ప్రయత్నంలో దీనికి అస్థిత్వముంటుందని, దీనిని మధురభక్తి అనవచ్చునని విమర్శకులు బలంగా అభిప్రాయ పడుతున్నారు. సింహగిరి నరహరి వచనాలలోనే మధురభక్తి సంప్రదాయం బీజ రూపంగా ఉందని కూడా చెపుతున్నారు. కాని అందులో శరణాగతికి చెందిన అంశాలే ఎక్కువ. మధురభక్తి రాధామాధవ తత్వానికి చెందిన అంశం క్రీ.శ. పంద్రెండు, పదమూడు శతాబ్దాల్లో బెంగాలు, ఒరిస్సా ప్రాంతాలలో ఈ తత్త్వం బాగా ప్రచారమైంది. దీనికి రాధాకృష్ణుల ప్రణయమే ఆధారం. రాధ జీవాత్మ, కృష్ణుడు పరమాత్మ.

జీవాత్మ పరమాత్మను పొందడానికి ఉపకరించిన మాధ్యమం శృంగారం. ఈ సిద్ధాంతం తాత్త్విక కవులైన చండీదాసు, విద్యాపతి, జయదేవుడు, చైతన్య మహాప్రభు మొదలైన వారిద్వారా అద్వితీయంగా రూపొంది ఉత్తర భారతమంతా ప్రచారమైంది. ముఖ్యంగా జయదేవుని గీతగోవిందం ఈ తత్త్వానికి లక్ష్యప్రాయం. ఇందులో ప్రతిపాదింపబడిన రాధాకృష్ణుల ప్రణయం రస జగత్తును సమ్మోహపరచిన తాత్త్విక శృంగారం. అష్టపదుల లోని శృంగారం లౌకిక జగత్తును దాటి తాత్త్వికదశకు చేరుకొన్న మనస్సులో అనిర్వచనీయమైన ఆనందాన్ని నింపిన అద్భుత భావం. అన్నమయ్య శృంగార సంకీర్తనలలో ఇంత ఉదాత్తత (sublime feeling) కనపడదు. సరిగ్గా అన్నమయ్య కాలం వాడే పోతన. భాగవతం గోపికాకృష్ణుల ప్రణయాన్ని వర్ణించిందే కాని రాధా మాధవులను గురించి పట్టించుకోలేదు. మొదటి సారిగా రాధాకృష్ణుల ప్రణయానికి తెలుగు దేశంలో ఊత నిచ్చింది చింతలపూడి ఎల్లన రాధామాధవ ప్రబంధం. దీనిని అన్నమయ్య చూచి ఉంటాడని చెప్పడానికి వీలు గాకున్నా బ్రహ్మవైవర్త పురాణాన్ని చూడటానికి అవకాశముంది. అన్నమయ్య కాలంలో మధురభక్తికి లక్ష్యప్రాయమైన రాధామాధవతత్త్వం ప్రచారం పొందుతూ ఉండినట్లు కనిపిస్తుంది. రెండు మూడు సంకీర్తనలలో ఆయన ఈ తత్త్వాన్ని దర్శించాడు. అప్పటికది సుప్రతిష్ఠితం కాక పోవడంవల్ల అన్నమయ్య దానిని పెద్దగా శృంగార సంకీర్తనలలో వివరించలేదు. అన్నమయ్య శృంగార రససామగ్రి సమకాల సమాజంలోనిదే కావడంవల్ల, దానికి కావ్యత్వం కలిగించే ప్రయత్నం చేయడంవల్ల శృంగారం లౌకిక స్థితిని పొందిందే గాని అధ్యాత్మ వాసనా దూషితం కాలేదు. అన్నమయ్యలో గొప్ప తాత్త్వికుడు, గొప్ప భక్తుడు, గొప్ప అధ్యాత్మవేత్త ఉన్నప్పటికీ ఆయనలోని గొప్ప కవే మనకు దర్శనమిస్తాడు. లౌకికభావాలు ఆధారంగా అన్నమయ్య భక్తి ప్రపంచ సోపానాన్ని ఎక్కే ప్రయత్నం చేశాడు. అయినా రస పుష్టి దగ్గరకు వచ్చేటప్పటికి అది పూర్తిగా అలౌకికం కాలేకపోయింది. ఈ క్రింది సంకీర్తన ద్వారా ఇది ఎంత నిజమో అర్థమవుతుంది.

ఎట్టు గడిపీనో దైవ మింతికి నీ గండ మిక
ముట్టి వచ్చి ఇరుమేల మోహరించే బనులు ॥పల్లవి॥

జలజాక్షి మోమువాడె చంద్రుడు కళలు గూడె
కలికి కన్నులు మూసె కలువలు లాసె
బలు వూరువులు దాగె పయ్యెర గాలిరేగె
కులుకు మాటలణగె కోవిలలు గొణగె ॥ఎట్టు॥

చింత జెలిమేను చిక్కె చిగురుకెంజాయలెక్కె
వింత నవ్వులెల్లా గుంగె వెన్నెలలు పొంగె
దొంతి దురుమువిరిసె తుమ్మెదమూక మొరసె
మంతనాలు కరవాయ మరుడు ఎరవాయ ॥ఎట్టు॥

చనుగొంగెడలె పంచశరు టెక్కెము వెడలె
వెనువెంట బులకించె విరులెల్ల బొంచె
యెనసి శ్రీవేంకటేశుడింతి నిట్టెకూడగాను
ననుపిట్టె సేయ దమి నచ్చు గనమాయ ॥ఎట్టు॥

(శృం. సం. 22-29)

పై సంకీర్తనలో కనిపించే శృంగార నాయికకు సంబంధించిన మోము, కన్నులు, ఊర్పులు, మాటలు, మేను, నవ్వు, తురుము, చనుగొంగు ఉపమేయాలు. వీటికి చంద్రుడు, కలువలు, పయ్యెర గాలి, కోవిలలు, చిగురు, వెన్నెల, తుమ్మెదమూక, పంచశరుటెక్కెము వరుసగా ఉపమానాలు వీటిలో ఒకటి రెండు తప్ప మిగిలినవన్నీ అలంకార శాస్త్రం నిరూపించినవే.[5] ఇవన్నీ అన్నమయ్య గ్రహించిన రస సామగ్రి. ఈ సామగ్రి సంయోగంలో రసం నిష్పన్నమవుతుంది. ప్రియుని లాలన కరువైనపుడు ప్రియురాలి మోము వాడడం సహజం. అయితే కూడిక గలిగినపుడు మోముమీద చంద్రకళలు కనిపిస్తాయి. మోము వాడిపోతే చంద్రుడు కళలతో వెలగడం సంబంధం లేనిమాట. మోము కళాత్మకం కావడానికి ప్రియుడు చేసిన ననుపు - అంటే శృంగార క్రియ కారణం. కన్నులు మూతపడడం పార

వశ్యంచేత. కనులలో కలువలు ప్రకాశించడానికి కారణం సంతోషంతో కనులు వెలగడం. ఇలాగే నిట్టూర్పులతో కలిగిన అలసత్వాన్ని పైరగాలి పోగొట్టింది. అంటే అంతరంగంలోని స్థాయిని కదిలించిందని భావించాలి. ఇలాగే మిగిలిన రెండు చరణాలు చూడవచ్చు. ఉపమేయాలు చేయవలసిన పనులను ఉపమానాలు నిర్వహించడం ఈ సంకీర్తనలో కనిపించే సొగసు. ఉపమానాలన్నీ ఆ యింతిని మోహరించాయి. అది ఆమెకు ఒక గండమైంది. ఈ గండాన్ని దైవం ఆమెను పతితో కూర్చి దూరంచేశాడు. ఆమె నిలువెల్ల పులకించింది. ఉపమేయోపమానాల మధ్యలేని సంబంధాన్ని కల్పించి ఒక జిలుగు శిల్పాన్ని సాధించాడు కవి. ఆయన తరువాత వచ్చిన ప్రబంధకవులు ఈ అనితర శిల్పాన్ని అనాయాసంగా సొంతం చేసుకొని మరింత మెరుగుపెట్టి చూపారు. అన్నమయ్య సేకరించి గంపలకెత్తిన శృంగార సామగ్రిని పూర్తిగా వాడుకొన్నారు. ఈ సంకీర్తనలో మధురభక్తి ఉందనుకొనే వారికి దొరికే సాక్ష్యం చివరి చరణంలో నిద్రా ముద్రితుడైన వేంకటేశ్వర స్వామి ఇంతిని కూడడం. బాగా పరిశీలిస్తే మొదటి చరణం నుండి కనిపిస్తున్న రస సామగ్రిగాని, రస భావాలుగాని వేంకటేశ్వరునివి కావు. ప్రియుని కూడికను కాంక్షించిన సామాన్య నాయికవి. ఈ సంకీర్తనలో మనకు వెంటనే కనిపించేవి ప్రియునిలాలన కోసం తపించే ఒక నాయిక, ఆమె రస భావాలు. అన్నమయ్య తాత్త్వికత గాని, వెంకటేశ్వర స్వామి నాయకత్వం గాని కనిపించవు. మంతనాలకు మరుని, చనుకొంగుకు పంచశరు టెక్కాన్ని ఉపమానాలుగా గ్రహించడం అప్పటి కవి సమయాలకు కొత్త. శృంగార సంకీర్తనలను బాగా పరిశీలిస్తే ఇలాంటి కొత్త కవిసమయాలు ఎన్నో దొరుకు తాయి. అలంకార శాస్త్రంలో చోటు కల్పించవలసినవన్నీ అలంకార శాస్త్రాన్ని వాడుకుంటూనే దానికి కూడా మెరుగుపెట్టే ప్రయత్నంచేసిన కవి అన్నమయ్య.

ఇలా పరిశీలిస్తూపోతే 'నానృషిఃకురుతే కావ్యం', 'కవయః క్రాంత దర్శినః', 'అపారే కావ్యసంసారే కవి రేవ ప్రజాపతిః' ఇత్యాది ఆలంకారిక లక్షణాలకు అనుగుణంగా రచనలు చేసిన కవిగా కనిపిస్తాడు అన్నమయ్య.

ఇలాంటి కవికి సామాజికాంశాలను పట్టించుకోకుండా అధ్యాత్మవాసనలతో తనను తాను బంధించుకోవడం సాధ్యంకాదు. అందువల్ల అన్నమయ్య అన్నిటికంటే ముందు కవి. తరువాతనే తాత్త్వికుడు, అధ్యాత్మవేత్త. తాను అధ్యాత్మ భావాలను ప్రతిపాదిస్తున్నాననే స్పృహ కలిగినప్పుడు రూపొందిన సంకీర్తనలలో భక్తి శృంగారం లేదా శృంగారభక్తి విషయాలు కనిపించి మధురభక్తి తాలూకు భావం ప్రస్ఫుటమై ఉండవచ్చు. దీనికి సంబంధించిన విషయాన్ని తరువాత పరిశీలిద్దాం. ప్రజాకవి అన్నపదం అన్నమయ్యకు బాగా అన్వర్థమవుతుంది. ప్రజా జీవనంలోని రంగులు-పొంగులు; వయ్యారాలు - వడ్డనలు; సింగారాలు - శృంగారాలు; వావులు-వరుసలు; కులాంగనలు - పణ్యాంగనలు; విరహాలు - విడ్డూరాలు; ఇంటి సుఖాలు - బయట సరదాలు; నాయికలు - చెలికత్తెలు; సరసాలు- విరసాలు; ఆకర్షణలు - వికర్షణలు ఇత్యాది విషయాలన్నీ అతి సహజంగా శృంగార సంకీర్తనలలో విస్తారంగా కనిపిస్తున్నాయి. ఇవన్నీ సామాజిక జీవనం నుండి పై కెగసిన కెరటాలు. అన్నమయ్య కవితను అజరామరం చేసిన చైతన్య భావదీపికలు. సమాజ విరాడ్రూపాన్ని - పైగా శృంగార చిత్రాన్ని అద్భుతంగా ప్రదర్శించిన అన్నమయ్యను మధుర భక్తి శృంఖలాలతో బంధించి పెట్టడం సబబుకాదు. ఈ గొలుసులను ఛేదించుకొని ఆయన మహాకవిగానే దర్శన మిస్తున్నాడు.

## తాత్త్విక శృంగారం

భరతుడు నాట్యశాస్త్రంలో ధర్మకామం, అర్థకామం, కామకామం (స్త్రీ పురుష సంయోగానికి చెందిన కామం), మోక్షకామం అని కామాన్ని నాలుగు రకాలుగా చెప్పాడు.[6] వీటిలో మోక్షకామం మోక్ష సంబంధి శృంగారం. దీనినే మధురభక్తి అన్నారు. భాగవతంలోని గోపికాకృష్ణుల శృంగారం ఇటువంటిదే. శృంగారం ద్వారా అధ్యాత్మ భావాలను కలిగించడం, తద్వారా మనసును సమాధి స్థితికి చేర్చి దివ్యత్వపు పరిధిలో విహరింపజేయడం దీని లక్షణం.

చాలు చాలును భోగసమయమున మైమఱపు
పాలుపడునట యేటి బ్రతుకురావోరి ||పల్లవి||

ఇందుముఖి నిను గౌగిలించి లోపలి జగము
కందునని నీ బిగువు గౌగిలి వదలె
పొందైన వారితో బొసగ గౌగిట జేర్ప
బొందు గాదట యేటి పొందురా వోరి (శృం. సం. 5-45)

భోగసమయంలో మైమఱపు కలగడం - అంటే బాహ్యస్థితిని పూర్తిగా మరచిపోవడం ఆనంద స్థితినందు కోవడానికి చిహ్నం. ఈ భోగం రసాత్మకం. భగవంతుని దివ్యత్వంలో కలవడం కూడా భోగమే. ఈ రెండు భోగాలు ఒక స్థితిలో సమమవుతాయి. అందుకే కామపురుషార్థం మోక్ష పురుషార్థానికి మార్గమవుతుందని చెప్పడం. ఇందుముఖి ప్రియుని కౌగిలించుకొని లోపలున్న జగత్తు కందిపోతుందని కౌగిలి సడలించడం శృంగార జగత్తునుండి అధ్యాత్మ లోకంలోకి చేరడంగా అర్థమవుతుంది. కౌగిలి ప్రేమకు చిహ్నం. రతికి మొదటిదశ. శరీరాన్ని శరీరాన్ని కలుపుతుంది. 'కందువ నీ కౌఁగిలెల్లా కామ నిధానమే కాదా' (21-174) అంటాడు అన్నమయ్య. కౌగిలి కామనిధి. ఈ నిధినుండి జాలువారే ఇతరాంశాలు చుంబనాదులు. కౌగిలి ప్రసక్తి లేని శృంగార సంకీర్తన కనపడదు. కౌగిలి ఆకర్షణ. కౌగిలిని సడలించడం వికర్షణ. ఒకటి సంకల్పం. మరొకటి వికల్పం. శృంగారంలో మునిగిన మానసం దానినుండి విముఖత్వం చెంది తాత్త్విక దశకు చేరడం ఈ సంకీర్తన విషయం.

మెలుఁత విభు బాసియును మితిలేని వేదనల
నలరి యాతని గూడు నభిరతుల నలసె
అలిగినను గూడినను కలిగె వలపులు దనకు
నెలమి తన సుఖము లిక నెప్పుడో కాని (శృం. సం. 5-299)

అభిరతులలో అలసిపోవడం, అలిగినా కూడినా వలపులే కలగడం నిజమైన సుఖం కాదని, తనకు కావలసిన సుఖం ఎప్పుడు కలుగుతుందో

తెలియడంలేదని నాయిక వాపోతున్నది. లేదా భక్తుడు వాపోతున్నాడు. ఈ ఇద్దరికి కలగవలసిన సుఖం చిత్తశాంతి.

> విరహతాపముచేత పొరలి పొరలిన వీడి
> సరసంపు నెరివేణి జడగట్టె గాని
> అరుదైన చింతతో నలయుచును దిన దినము
> సరి జనానన మేను సగమాయగాని[7]

ఇందులో వేణి జడగట్టడం, మేను సగం కావడం కార్యాలు విరహతాపం, అరుదైన చింత కారణాలు. ఇటు శృంగారభావానికి, అటు అధ్యాత్మ భావానికి సరిపోయే అంశాలివి.

శృంగార సంకీర్తనలలో కనిపించే ఇలాంటి మరికొన్ని సంకీర్తనలను ఆధారంచేసుకొని మధురభక్తి సిద్ధాంతం తయారైంది. అయితే దీనిని విమర్శించడానికి ఉదాత్తమైన పద్ధతి ఉండగా ప్రాపంచికశృంగార వర్ణన లెందుకని ఈ సిద్ధాంత ప్రతిపాదకులైన విమర్శకులకు కూడా అనిపించింది. తాళ్లపాక వాఙ్మయ పరిష్కరణ అనగానే వెంటనే గుర్తుకు రాదగిన పండితుడైన గౌరిపెద్దిరామసుబ్బశర్మగారికి ఈ ప్రశ్న ఎదురైంది. అన్నమయ్యను శృంగారకవి అనడం ఇష్టంలేక కాబోలు శర్మగారు దాన్ని మరొక రకంగా సమర్థించారు. స్వామి విశ్వమోహన శృంగారి. భక్తిని శృంగారాత్మకంగా ప్రకటిస్తే ఆయన కిష్టం. మానవులకు శృంగారం అనుభవగోచరమైనట్లు మరొక రసం కాదు. వీళ్లను శృంగారాత్మకంగా ఆకర్షించి తరువాత అధ్యాత్మభావనా లోలురను చేయడం సులభం. అందుకే అన్నమయ్య శృంగారాన్ని విచ్చలవిడిగా వర్ణించాడు. ఆ ప్రశ్నకు శర్మగారు ఈ సమాధానం చెప్పినారే కాని ఇది పూర్తి సమాధానం కాదని ఆయనకు తెలుసు. ఆయన అంతరంగంలో ఈ శృంగారాధిక్యతకు మరొక సమాధానం ఉండి ఉంటుంది. దాన్ని బయటపెట్టకుండానే ఆయన వెళ్లిపోయారు.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో లజ్జాకర విషయ ప్రసక్తి ఉందని నమ్మినవారు కూడా మరొకరకంగా సమన్వయించే ప్రయత్నంచేశారు.

"అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చుంబన, ఆలింగన, గుహ్యాకార్య, దంతక్షత, నఖక్షత, నీవీస్రంసన, స్తనాంతర విమర్దన, జలక్రీడాది లజ్జాకరవిషయ ప్రసక్తి ఉన్నా నాట్యధర్మి సహితమైన అభినయంతో ఔచిత్యవంతాలవుతాయి. నాట్యధర్మి అన్న అంశం కవి వ్యాపారంలో, నట వ్యాపారంలో ఉన్నవైచిత్ర్యం" . ఈ సమన్వయం డా॥శొంఠి శారదా పూర్ణ గారిది.[8] ధర్మి అంటే అభినయ విధానం. ఇలాంటి శృంగార విషయాలను అభినయించి నగ్నత భాసించకుండా చూపడం అంత సులభమా? ముమ్మాటికీ సాధ్యంకాదు. ఇలాంటి సమన్వయాలన్నీ సత్యదూరాలనే నా అభిప్రాయం. శృంగార సామగ్రిని కుప్ప పోయడంలో అన్నమయ్య ఆశించిన ప్రయోజనం వేరుగా కనిపిస్తుంది. దీని విషయం తరువాత చూద్దాం. అయితే మధురభక్తి వ్యంజితాలైన ఇలాంటి సంకీర్తనల మాటేమిటి అనే అంశానికి సమాధానం వెతకాలి. అన్నమయ్యలో కవే ముందు కనిపిస్తాడు. తరువాతనే మిగిలినవన్నీ. కవిగా సమాజాన్ని దర్శించాడు. ఆయన కాలంనాటి శృంగార భంగులను సంకీర్తనల కెక్కించాడు. ఆయనలో తాత్త్వికత పైకొన్న సందర్భాల్లో చెప్పిన సంకీర్తనలలో శృంగార, అధ్యాత్మ భావాల సమ్మేళనం మధుర భక్త్యాత్మకంగా పొసగి కనిపిస్తున్నది. ఇలాంటి సంకీర్తనల సంఖ్య పరిమితంగానే ఉంది. శృంగార సంకీర్తనలలో అక్కక్కడా కనిపిస్తాయి. వీటి ప్రయోజనం వేరు. మిగిలిన సంకీర్తనల ప్రయోజనం వేరు. శృంగారాత్మకమైన అధ్యాత్మ భావాలను ప్రతిపాదించిన రచనలు అన్నమయ్యకు ఎంతో ముందు నుండి బోలెడున్నాయి.

> "కామేశ్వర ప్రేమరత్న మణి ప్రతిపణస్తనీ
> నాభ్యాలవాల రోమాళి లతాఫల కుచద్వయీ
> కామేశ జ్ఞాత సౌభాగ్య మార్దవోరు ద్వయాన్వితా
> మాణిక్య మకుటాకార జానుద్వయవిరాజితా"

ఇత్యాది శ్లోకాలు 'శ్రీలలితా సహస్రనామ స్తోత్రం' లోనివి. ఈ శ్లోకాలలో వ్యక్తమయ్యే శృంగారం జగత్పితరులు, సనాతనులు అయిన ఉమా

శంకరులకు సంబంధించినది. ఈ నామసోత్రాన్ని సాధకులు నిత్యం వల్లెవేస్తుంటారు. శృంగారమనిపించినా అధ్యాత్మ భావంలో ఇమిడి పోవడం వల్ల సాధకుడికి చిత్తశాంతి కలిగి అమ్మవారి రూపం దృగ్గోచరమవుతుందే కాని అన్య భావం కలగదు. సంకీర్తన నిండా లౌకిక శృంగారం నింపి చివర తిరుమలవాసునికి అంకితం చేసి నందువల్ల శృంగారం ఉన్నట్టుండి అధ్యాత్మికమై పోదు. ప్రదర్శించిన రస సామగ్రికి సంబంధించిన ఆలోచనలు సాగి పఠిత దృష్టి సమాజ పరిధిలో ప్రవేశిస్తుందేగాని వెంటనే దివ్యత్వాన్ని అర్థం చేసుకోలేదు. ఈ విషయం అన్నమయ్యకు బాగాతెలుసు. పాఠకులు లోకస్థితిని గమనించాలనే ఆయన ఆలోచన.

## శృంగార సంకీర్తనలు ప్రతిపాదించిన శృంగార స్వభావం

అన్నమయ్య ప్రతిపాదించిన శృంగారం సామాజికం. దీనికి లోకమే ప్రమాణం. శృంగార సంకీర్తనలలో వివిధరకాల నాయకులు, వివిధరకాల నాయికలు కనిపిస్తారు. భార్యా భర్తలు, ప్రేయసీ ప్రియులు, రసిక రాట్టులు-వాడవనితలు, బావలు - మరదళ్ళు, యజ మానులు - సేవకురాండ్రు ఇత్యాది వరుసలన్నీ సమాజానివే. శృంగారం వీళ్లదే. ఈవిషయం అన్నమయ్యకు బాగా జ్ఞాపకముంది. ఆయన వివరించే శృంగార భావాలు లోకానివే ననడానికి 'లోకులు' అనే మాటను అనేక సంకీర్తనలలో వాడడమే గుర్తు.

మదిలోనే దలచగ మరుగున దానుంటే
వదలక దయలేని వాడనరా లోకులు (శృం. సం. 11-481)

ఇత్యాది అనేక సంకీర్తనలలో లోకం విషయం గుర్తు చేస్తుంటాడన్నమయ్య.

దేశంలో ఎప్పటినుండో ప్రచారంలో ఉండిన శృంగారశాస్త్ర విషయాలు అన్నమయ్య కాలంనాటికి సాహిత్యగ్రంథాలలో కూడా తమ ఉనికిని చాటుకొన్నాయి. పోతన, శ్రీనాథుల సాహిత్యం కూడా దీనికి అపవాదం కాదు. శృంగారం సహజ భావమేనని గ్రహించిన వారు కావడం వల్ల మన కవులు రతిశాస్త్ర విషయాలను తమశృంగార రసపోషణలో

సమన్వయం చేసుకోవడమేగాక రతిబంధాలను కూడా అక్కడక్కడా సూచించక పోలేదు. శ్రీనాథుని హరవిలాసంలోని శివపార్వతుల శృంగారం, శివుని దారుకావన విహార ఘట్టాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.[9] కూచిరాజు ఎఱ్ఱన ఆంధ్రకొక్కోకం ఈ కాలంలోనే వెలువడింది. ఇంకా ముందుకు వెళితే నన్నెచోడుని కుమారసంభవంలోనే పురుషులు పురుషుల మధ్య, స్త్రీలు స్త్రీల మధ్య శృంగార సంబంధాలు కనిపిస్తున్నాయని, ఆచార్య ఎల్. బి. శంకరరావు చెబుతున్నారు.[10] ఇలాంటి వాటిని అపసవ్య పద్ధతులుగా శాస్త్రాలు పేర్కొన్నాయి. లేవని చెప్పలేదు.

అన్నమయ్య కాలంనాటి సమాజం సహజంగా శృంగారాత్మకం. ఇలాగని సమాజంలో వ్యక్తులందరిలో శృంగారం ఉందనికాదు. శృంగారం వయస్సులో ఉన్నవాళ్లకు. 'కామంచ యౌవనే' అంటుంది శాస్త్రం. బహుభార్యాత్వం, వేశ్యాప్రియత్వం, భోగలాలసత్వం అప్పటి సమాజాన్ని పీడించిన లక్షణాలు. సాంసారిక వ్యవస్థలో కుటుంబ స్త్రీల దుర్బలత్వాన్ని, సహనాన్ని ఆసరా చేసుకొని పురుషుల వైశికత్వం (బహుళ వేశ్యోపభోగ రసికుడు వైశికుడు) ప్రబలిన రోజులవి. తమ భర్తల శృంగారావసరాలను ఇతర స్త్రీల సహాయంతో తీర్చడానికి కూడా అప్పటి స్త్రీలు పూనుకొన్నట్లు అనేక సంకీర్తనలు తెలుపు తున్నాయి. అప్పటి శృంగారం ఇప్పుడను కొనేంత రహస్యమూ కాదు, బూతూ కాదు. శృంగార విషయాలను బాహాటంగా ముచ్చటించు కోవడం, అనుభవానికి తెచ్చుకోవడం ఆనాటికి అతి సహజం. అది మానవ స్వభావమని, దేహధర్మమని, దాంపత్యం - దానివల్ల కలిగే సుఖం కళంక విషయం కాదని కాలౌచిత్యాన్ని బట్టి భావించవలసి ఉంటుంది.

ఇట్టి చన్నులంటకుర యిస్సీ యిందరు జూడ

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

తొడమీద వేయకుర తోతో యిందరు నవ్వేరు

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

పచ్చిమాట లాడకుర పడతులెల్ల వినేరు (శృం. సం. 11-303)

అంగన బాగాలిచ్చి ఆకుమడిచీయగా నా
యెంగిలి చేసేవు మోవి యిందరిలోన (శృం. సం. 8 -102)

శృంగార సంకీర్తనలలోని ఇలాంటి ఉదాహరణలెన్నో అప్పటి శృంగారం అందరిలో శృంగార మనే విషయాన్ని తెలుపుతున్నాయి.

అన్నమయ్య లోకజ్ఞుడు. సమాజంలో తాను దర్శించిన విషయాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజెప్పాలని ఆయన సంకల్పం. ఈయన సాహిత్యం పైకి తేటగా కనిపించినా లోతుకు దిగితే అనితరసాధ్యమైన భావ పరంపరలు దొంతర దొంతరలుగా మానసాన్ని తాకుతాయి. వేదోపనిషత్తుల సారాన్ని సామాన్య ప్రజలకు అధ్యాత్మ సంకీర్తనల ద్వారా అందించాడు. ఆ ప్రజలకోసమే - వాళ్లకు తెలియడం కోసమే వాళ్ల బ్రతుకులలో అతి సహజంగా అల్లుకు పోయిన శృంగారాంశాలను శృంగార సంకీర్తనల ద్వారా అందించాడు. వాత్స్యాయన మహర్షి కామసూత్ర గ్రంథ ఉపసంహార వాక్యాలుగా ఈ రెండు శ్లోకాలు రాశాడు.

"రక్షన్ ధర్మార్థకామానాం స్థితిం స్వాం లోకవర్తినీం
అన్య శాస్త్రస్య తత్త్వజ్ఞో భవత్యేవ జితేంద్రియః
తదేతత్కుశలో విద్వాన్ ధర్మార్థవలోకయన్
నాతి రాగాత్మకః కామీ ప్రయుంజానః ప్రసిద్ధ్యతి"

ఈ శాస్త్ర తత్త్వాన్ని గ్రహించినవాడు పురుషార్థాల స్థితిని, లోక పరిస్థితిని తనస్థితిని గమనించ గలుగుతాడు. ఈ శాస్త్రంలో మంచి ప్రావీణ్యం సంపాదించి, పురుషార్థాలకు అనుగుణంగా ప్రయోగాలను, ప్రతిక్రియలను అనుసరించి ఇష్టార్థసిద్ధిని పొందుతాడు - అని మహర్షి అభిప్రాయం. కామసిద్ధి జీవితానికి అవసరం కాబట్టి అది కలగాలంటే కామశాస్త్రం తెలిసి ఉండాలని కూడా మహర్షి చెప్పాడు. ఇది యువతీ యువకులకేనని, శాస్త్రం తెలియని వారికి పొందు ప్రయోజన రహితమని శాస్త్రం చెప్పింది.

శృంగార సంకీర్తనలలో శృంగారం అతివేలంగా కనిపిస్తున్నప్పటికి అది అసహజం మాత్రంకాదు. మహర్షి భావించినట్లు ఈ విషయాలను శృంగారం అవసరమైన వాళ్ళంతా తెలుసుకోవాలనే అన్నమయ్య గూడా అభిప్రాయపడినట్లుంది. వయసుండగానే అనుభవింప దగినవాటిని అను భవించాలన్నది (శృం. సం. (12-361) ఈ సంకీర్తనల లక్ష్యం. మైథునాన్ని ఛాందోగ్యం (5-9-1), బృహదారణ్య కోపనిషత్తులు (6-2-13) ఒక యజ్ఞ కార్యంగా పేర్కొన్నాయి. దీనికి ఆనంద ప్రయోజనంతోపాటు సత్సంతాన ప్రయోజనం కూడా ఉండడం కారణం. మంచి సంతానం వల్ల మంచి సమాజం రూపొందు తుందనే విశ్వాసంతోనే కామ శాస్త్రాలొచ్చాయి. అన్నమయ్య శృంగారాన్ని పవిత్రంగా భావించాడు కాబట్టే -

అంగన నిన్నుగూడగ నటు నీపై వడి సేటి
అంగపు జెమట నీకు నభిషేకము
వుంగిట గొప్ప విరులు వుపరి సురతవేళ
సంగతి రాలేటి చల్లు వేదపూజ (శృం. సం. 19-531)

అంటూ రతిని వేద పూజగా భావించాడు. ఉపస్థయజ్ఞమనే ఉపని షద్విషయం ఇక్కడ ధ్వనిస్తున్నది. తన ప్రియుని జాడ్యం పోవడానికి ఒక ప్రియురాలు 'మదనవేద మంత్రాలతో' మంత్రిస్తా నంటుంది (శృం. సం. 12-353). మదనవేదం అనేమాట శృంగార కార్యంలోని పవిత్రతను చెప్పడానికే వాడబడింది. ఇలా పరిశీలిస్తూపోతే అన్నమయ్య వివరించిన శృంగార విషయప్రాధాన్యతను తెలిపే ఉదాహరణలెన్నైనా దొరుకుతాయి. ఇవన్నీ అన్నమయ్య లౌకిక శృంగారస్థితిని చూపడానికే గాని మధుర భక్తికి సంబంధించినవి కావని ఋజువు చేస్తాయి.

## అన్నమయ్యనాటి సమాజం - శృంగారం

జీవితాన్ని అందంగా ఆకర్షకంగా మలచుకోవడంలో శృంగారాని కున్న ప్రాధాన్యత ను, అవసరాన్ని శృంగార సంకీర్తనలలో అన్నమయ్య గుర్తించాడు. శృంగారాన్ని అందమైన అనుభవంగా, ఒక కళగా

భావించాలని స్ఫురింపజేయడానికి భావపుకళ (16-380), రతిరాజ విద్య(16-526), కాయజ విద్య (16- 533), మదనశాస్త్రం(14-4), పూటపూట రతులివి పుష్పయోగము (14-396), రతికళ (18-223), మదన కళ (18-343), సమరతి సంపద (18-252), కామతంత్రపు సంపద (18-583), రతి తపము వంటిది (21-350) ఇత్యాది పదాల ప్రయోగం చేశాడు. ఈ పదాలలో చాల రతిశాస్త్ర గ్రంథాలలో కనిపిస్తాయి. దీనిని బట్టి అన్నమయ్య శాస్త్రగ్రంథాల సారాంశాన్ని తనధోరణిలో చెప్పేప్రయత్నం చేసినట్లు అర్థం చేసుకోవాలి. రతులలో భేదాలు, చుంబనాలు, నఖక్షతాలు, స్తన విమర్దనాలు ఇత్యాది రతివిషయ సామగ్రిని సంకీర్తనలన్నిటా చూపించడానికి కారణం కూడా మనసిజతంత్రాన్ని అందంగా మలచుకోమని చెప్పడానికే.

ఒక సంకీర్తనలోని విషయం మరొక సంకీర్తనలోకి ప్రసరించదు. దేని కది ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటుంది. ముక్తక రచన ఇది. మరి, రస నిష్పత్తి మాటేమిటనిపిస్తుంది. ప్రతి సంకీర్తనలోని రససామగ్రి సాధారణీకరణత్వాన్ని పొంది రసపర్యవసాయిగా మారుతుంది. అమరుక శతకం విషయంలో రసస్థితి ఎలాగో సంకీర్తనలోనూ అంతే. ఉత్తమ పాత్రల మధ్య వర్ణింపబడిన విభావాది సామగ్రి రసాన్ని నిష్పన్నం చేసినపుడు అది అలౌకిక స్థాయికి ఎదుగుతుందని అలంకారశాస్త్రం నిరూపించింది. రసానందం బ్రహ్మానంద సహోదర మన్నది ఈ ఉద్దేశంతోనే. శృంగార సంకీర్తనలలో భార్యా భర్తలున్నారు. వారవనితలున్నారు. చెలికత్తెల శృంగారముంది. కేవలం భోగేచ్ఛతో ప్రవర్తించే పురుషులున్నారు. పురుషుని ఉసి గొలిపే స్త్రీలున్నారు. ఆనాటి విచ్చలవిడి శృంగారంలో భాగస్వాములు వీళ్లంతా. సంయమన మెరుగని శృంగారం వీళ్లది. ఈ విభావాదులు ఆధారంగా ఏర్పడే రసం శాశ్వతమైనది కాదు. శృంగార సంకీర్తనలలో రసాన్ని గురించి ఆలోచించడం కంటె ఆనాటి సామాజిక శృంగార చిత్రాన్ని గురించి ఆలోచిస్తే సరిపోతుంది.

సమాజ వ్యవహారంలో ఉండే దాపరికంలేని శృంగార విషయాలను తెలుసుకోవడం ద్వారా కామ పురుషార్థ ప్రాధాన్యత అర్థమై ఇతర పురుషార్థాల సాధనకు ఇది ఎలా దోహద పడుతుందో లేక సామాజిక జీవన వైవిధ్యంలో అవసరమైన క్రమశిక్షణకు ఎలా ఉపయోగ పడుతుందో వాత్స్యాయన మహర్షి తన గ్రంథంలో నిరూపించాడు. భారతీయ సంస్కృతికి మూలస్తంభాలైన చతుర్విధ పురుషార్థాలలోని మూడవ దానిని ఒక పురుషార్థంగా భావించి సాధనచేసే వాళ్ల విషయమిది, ఈ పురుషార్థాన్ని అపమార్గాలలో పయనింపజేసే వాళ్లు కూడా క్రమక్రమంగా దీని పవిత్రతను గుర్తించి తదనుగుణంగా తమను తాము మార్చుకుంటారని కూడా మహర్షి ఆశించాడు. ఈ పురుషార్థానికింత పవిత్రత, ప్రాధాన్యత ఉండడం వల్లనే దీనినొక కళగా భావించడం జరిగింది. ఈ విషయం అన్నమయ్య శృంగార సంకీర్తనల ద్వారా నిరూపిత మవుతుంది. శృంగారం కళాత్మకమనే విషయాన్ని స్ఫురింప జేసే కామకళ, మదన కళలాంటి మాటలెన్నో శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నాయి. భారతీయ సాహిత్య శృంగార ప్రాధాన్యతను గుర్తించి దీనినొక కళగా మలుచుకోవాలని ఆయా సందర్భాల్లో స్ఫురింప జేసింది. అన్నమయ్య ఒక మహాకవిగా దీనిని గుర్తించాడు. అందుకే శృంగార సంకీర్తనలు మన్మథ వేదాలుగా, కాయజోపనిషత్తులుగా రూపొందినాయి.[11] సామాజిక శృంగారం కవిత్వీకరించబడింది.

అన్నమయ్య సమాజంలో దర్శించిన శృంగారం మూడువిధాలుగా శృంగార సంకీర్తనల కెక్కింది. 1. దాంపత్య శృంగారం, 2. పుంశ్చలీ శృంగారం 3. సమయానుకూల శృంగారం. శృంగార సంకీర్తనలు ప్రదర్శించిన పనిచేసే స్త్రీలతో గృహస్థులు నెరిపే శృంగారం, వావివరుసలు లేని శృంగారం ఇత్యాదులు ఈ మూడవ తరగతికి చెందిన అంశాలుగా కనిపిస్తాయి. అన్నమయ్య కాలంనాటి సమాజంలో ఇప్పటికంటె ఎక్కువగా శృంగారానికి ప్రాధాన్యత, అవసరం ఉన్నాయనడంలో సందేహం అవసరంలేదు. శృంగార విషయాలను అందరూ వింటుండగా

చర్చించుకోవడం అప్పటికి అసహజం కాదు. పైగా, వేశ్యాశృంగారానికి బాగా అలవాటు పడిన కాలమిది. వేశ్యా సంపర్కం మగసిరికి గుర్తుగా, కొందరు కులస్త్రీలు సహించి మెచ్చుకొనే తమ భర్తల విలాసంగా భావింప బడినట్లు చెప్పడానికి ఎన్నో ఆధారాలున్నాయి. సమాజపు శృంగార పోకడలను శృంగార సంకీర్తనలు స్పష్టంగా చూపాయి. మధురభక్తి వాదులు కొందరు అన్నమయ్య నాయికలలో వేశ్యలు లేరని చెపుతున్నారు.[12] కాని ఇది పూర్తిగా నిజం కాదు. వేశ్యాసంపర్కం కుల స్త్రీలకు తమ పతులవల్ల ఎదురైన అనేక సమస్యలకు కారణమని అన్నమయ్య గుర్తించాడు. దాంపత్య బంధం బీటలు వారడం సహించ లేకపోయాడు. వేశ్యా సంపర్కం కులస్త్రీలు సంపర్కం కంటె అధమ మని భావించాడు. ఇంటి ఆలు భర్తకు ఎన్నిరకాల ఊడిగాలైనా చేస్తుంది కాని 'పొత్తుల యెంగిలితోడి బోగము సయించదు' (11-556). సానబట్టే సరసాలు ఆమెకు చవిగావు సరసంలో సంత జాణతనాలు పనికిరావు (13-237). వారకాంతలు నిన్ను మెప్పించినట్లు కులస్త్రీలు మెప్పించ లేరా (13-176) అంటూ ఒక సంసార స్త్రీ తన భర్తను నిలదీస్తున్నది. ఆడదానికి ఆశగల్పించి పరాకు చేయడం పాపం. వలచిన వారున్నపుడు వేశ్యలవెంట తిరగడం పాపం (16 -147) అని స్త్రీ గొంతుకతో అన్నమయ్యే అంటున్నాడు.

బహుభార్యత్వాన్ని శృంగార సంకీర్తనలు బాగా ఎత్తిచూపినాయి. దీనివల్ల స్త్రీలు మానసికంగా ఎంతగా నలిగిపోయారో, అపరిహార్యమైన ఈ వ్యవస్థ నుండి తప్పించు కోవడానికి వీలుగాక ఎలా సర్దుకు పోయారో. ఇద్దరు ముగ్గురు భార్యలున్న భర్తలను ఎలా సహించారో నన్న విషయాలను అన్నమయ్య గమనించాడు. ఈ పద్ధతి పురుషుల లౌల్యాన్ని బాగా పెంచింది. దీనికి తోడు అప్పటి సమాజంలో విరివిగా దొరుకుతూ ఉండిన స్వేచ్ఛా ప్రణయం (Free love), రహస్యప్రణయం (Secret love) కులస్త్రీల పాలిట శాపాలైనాయి. ఎదిరించ లేని అశక్తతతో సంసార స్త్రీలు పురుషుల స్వేచ్ఛా ప్రణయాన్ని మూగ బాధతో ఆమోదించిన వైనాలను

కూడా శృంగార సంకీర్తనలు స్పష్టం చేస్తున్నాయి. ముందు యుగాలలో 'కోరిక' అనే అర్థంలో కనిపిస్తూ ఉండిన 'కామ' శబ్దం ఈ సమాజంలో లైంగికతకు గుర్తుగా మారిపోయింది.[13] మగవాడి విశృంఖల విహారాలు, వేశ్యాప్రణయాలు బహు భార్యాత్వానికి తోడై సమాజం శృంగారపు కంపుతో నిండిపోయింది.

చెప్పనానే నప్పుడే చిత్తిణి వాడితడని
చిప్పిల నెందో పొందు సేసి వచ్చెను (13-3)

పెల్లుగా నీకిట్టె యింట బెట్టుకుండవలసితే
చెల్లునా సవతి పోరు చెప్పుమా యెందైననూ (16-361)

పంతమాడే దానగాను పతితోడ సారెసారె
నెంతైనా నిచ్చకురాల నింతే కాని (14-433)

మారు సవతులు రాని మనువొకటే మంచిది (14-471)

వరుసతో బెండ్లాడిన వనిత మాటాడగాను
పొరుగాపెతో నవ్వేవు పోరచిగాను (19-92)

ఇలాంటి ఎన్నో ఉదాహరణలు సంసార స్త్రీల ఆవేదనను రూపు కట్టిస్తున్నాయి. వీళ్లమీద అన్నమయ్యకు ఎంతో సానుభూతి ఉంది. ఓర్పుగా నేర్పుగా భర్తల ప్రణయాన్ని పొందాలని ఇలాంటి స్త్రీలకు ఇచ్చిన సలహాలు శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నాయి. విచ్చలవిడి శృంగారానికి అలవాటైన మగవాళ్లను కూడా అంగడి సరుకులని (14-68), పొత్తుల మగళ్లని (16-391) ఎద్దేవా చేశాడు. వేశ్యాశృంగారం కుల స్త్రీల శృంగారం కంటె హేయమైనదని -

కాయకపు వావుల కాంతల సరయ్యేరా
చేయి మీదై సేసపాల చెలులకు
యెరవుల సతులెల్ల యీడుజోడు వచ్చేరా
తిరమైన పట్టంపు దేవులకును (21-214)

ఇత్యాది అనేక సంకీర్తనలలో మగవాళ్లకు తెలిపే ప్రయత్నంచేశాడు అన్నమయ్య.

వేశ్య కులకాంతలకు రూపుగొన్నశోకం. పురుషుల వేశ్యా ప్రియత్వం పట్టపుస్త్రీలకు భరింపరాని దుఃఖం. సమాజంలో ఇది అపరిహార్యమైన అంశం. దీనికితోడు బహు భార్యాత్వం. అయినా ఆనాటి సమాజంలో మాంగల్యానికి ఎంతో గౌరవ పవిత్రతలున్నాయి. సంసార స్త్రీకున్న విలువ చెక్కు చెదరలేదు. స్వేచ్ఛా ప్రణయాలు, రహస్య ప్రణయాలు గృహస్థురాలి స్థానాన్ని ఏమాత్రం చలింప జేయలేకపోయాయి. భారతీయ వైవాహిక వ్యవస్థకు, గృహస్థ ధర్మానికి గల పవిత్రత దీనికి కారణం. ఈ విషయం అర్థం కావడం కోసమే అన్నమయ్య సంసార స్త్రీని 'పట్టపుదేవి' అన్నాడు. శృంగార సంకీర్తనలు చిత్రించిన పట్టపు దేవులు కూడా శృంగార రసలోలురుగా కనిపిస్తున్నారు. ఆనాటి సామాజిక ప్రభావం దీనికి కారణం. భర్తల ప్రణయాన్ని పదిల పరచుకోవాలంటే వీళ్లుకూడా అతివేలమైన శృంగార వతులు కాకతప్పలేదు. ఆనాటి కది ఔచిత్యం. దేశ కాల పాత్రములను బట్టి ఔచిత్యానౌచిత్యాలను మదింపు వేయాలి.

ముప్పరి నితవుతోడ ముచ్చట లచ్చట లాడి
యెప్పుడూ బాయ కుండేదే యిల్లాలు
యిచ్చక మెరిగి తన యిలు వరుస నెరపి
నిచ్చ బతి గూడినదే నెరవాది (22- 524)

నేరవలె రతి లేదా నేరుప నైనా వలె
యేరీతికి జొరకుంటే నేటి యాటదే (13- 511)

ఇలాంటి అనేక సంకీర్తనలలో అన్నమయ్య కులస్త్రీల శృంగార విషయాలను స్పృశించాడు. ఇల్లాలు నేర్పరిగా ఉండాలని, తాను పరవశించి పతిని పరవశింపజేయాలని, వలచి వలపింప జేసుకోవాలని సూచించాడు. ఆనాటి వ్యవస్థలో ఇల్లాలు తన అస్తిత్వాన్ని, సంసార గౌరవాన్ని నిలుపుకోవాలంటే

శృంగార విషయంలో కూడా తన పెనిమిటి దగ్గర బిడియం కొంత వదులుకొని ప్రవర్తించాలని చెపుతూ

అందరు నెఱిగినవే నన్ని పనులు
అందియ్యరాదా వీడె మంత సిగ్గులేటికి (13-513)

అంటూన్నాడన్నమయ్య. తన వలపులో మెలిగే పతి ఉన్నపుడు స్త్రీకి వలపే ధనమవుతుందని, యౌవనం సతతం శృంగారంలో మునిగితే సుదతికి సురతమే సంపదవుతుందని (18-399) తెలుసుకోమని స్త్రీలకు చేసిన బోధ అనేక శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్నది.

## అన్నమయ్య దర్శించిన సామాజిక శృంగారచిత్రం

ఇప్పటి వారమైన మనం ఇప్పటి దృష్టితో శృంగార సంకీర్తనలలో కనిపిస్తున్న అతి వేలమైన శృంగార విషయాలను గమనిస్తే కొంత ఎబ్బెట్టుగా తోచకపోదు. ఈ విషయాన్ని ఆనాటి సామాజిక వ్యవస్థ ఆధారంగా పరిశీలించాలి. అన్నమయ్య కాలం ప్రబంధ పూర్వయుగం. ఈ యుగపు శృంగారం ప్రబంధయుగానికి ప్రసరించి నవ్య దీధితులతో కామపురుషార్థాన్ని ఆకర్షకంగా మార్చి చరితార్థం చేసింది. ప్రబంధాల శృంగారం పోతన శ్రీనాథాది కవుల గ్రంథాలలో కనిపించే శృంగారం కంటె ఎక్కువకాదు. ప్రబంధాల పడకింటి శృంగారానికి మూలాలు ముందునుండే ఉన్నాయి. శృంగార విషయాలను బాహాటంగా చర్చించుకోవడం, అనుభవానికి తెచ్చుకోవడం ఆనాటి సమాజంలో రహస్య విషయం కాదు. సామాజిక నిబద్ధతగల కవి అలాంటి విషయాలకు తన కవిత్వంలో గతి కల్పించడం కూడా అసహజంకాదు. మధ్యయుగంనాటి సాహిత్యంలో మితిమీరి కనిపిస్తున్న శృంగారాన్ని గురించి పుట్టపర్తి వారి మాటలివి. "సాధారణముగా విలాసమన్న మాత్రముననే యొక విముఖత, అసహ్యము మన కలవాటైనది. అది మనమే అడిగి తెచ్చిన వరము. మన మనో రథము లల్పములు.మన ప్రవృత్తి నివృత్తులల్పము లగుటయే యందులకు కారణము. అది (శృంగారం) మానవ స్వభావ

మనియు, దేహధర్మ మనియు, దాంపత్యమును తజ్జనిత సౌఖ్యము లును కళంకములు కావనియు వ్యాఖ్యానము గావించువాడు దానికై యంతగా భయపడనవసరము లేదు."[14] సమకాలీన విషయాలను కాలనుగుణంగా అర్థం చేసుకోవాలనే విషయాన్ని స్ఫురింపజేస్తున్న ఈ అభిప్రాయం ఎంతో విలువైంది. ఇంకా ముందు తరాలకు వెళ్లి అప్పటి సమాజాలను పరిశీలిస్తే శృంగారం విషయంలో ఆసక్తి కరమైన విషయాలెన్నో కనిపిస్తాయి.

ఋగ్వేదకాలంలోనే స్త్రీలలో 'సాధారణీ' అనే మాట Public Woman అనే అర్థంలో కనిపిస్తున్నది. కృష్ణయజుర్వేదం (30-22), అధర్వణవేదం (15-2) పుంశ్చలిని పేర్కొన్నాయి. 'జార' అనేమాట ఆ కాలంలో ప్రేమికులకు వర్తించే విధంగా ఉంది. 'కుమారీ పుత్ర' అన్నది అప్పటికి సహజమైనమాట. ఒక స్త్రీ ఐదుమంది పురుషులతో సంబంధం కలిగి ఉన్నా పవిత్రురాలేనని వాత్స్యాయనునికంటె పూర్వుడైన బాభ్రవ్యుడు తన కామ శాస్త్ర గ్రంథంలో ప్రకటించాడు.[15] ఇవన్నీ ఆయా కాలాల సామాజిక విషయాలే. దేశాభ్యుదయం సత్సంతానంపైన ఆధారపడి ఉంటుందని, సత్సంతానం సరైన కామ పురుషార్థం వల్ల ఉత్పన్నమవు తుందని, ఈ పురుషార్థ సాధకులు దీనిని గురించి సరిగా అర్థంచేసుకోవాలని, అలాంటి అర్థబోధ కలిగించడానికే కామశాస్త్రాలు వెలువడినాయని కామశాస్త్రకారులు వాళ్ల గ్రంథాలలో స్పష్టంచేశారు.[16] ఈ విషయాలు అర్థమైతే శృంగార సంకీర్తనలలోని శృంగారం, దాని ఉరవడి ఆ సమాజానికి అవసరం కాబట్టే చిత్రితమైనట్లు తెలుసుకో గలుగుతాము.

తనవులేకములైన తప్పులు నొప్పులు లేవు
మనసులేకములైన మరుగులే లేవు (19-484)

అనే విషయాన్ని శాస్త్రదృష్టితోను, అప్పటి సమాజదృష్టితోను పరిశీలిస్తే ఔచిత్యవంతంగా అనిపిస్తుంది.

పూట పూట రతులివి పుష్పయాగము (14-396)

అంగన నిన్నుగూడగ నటునీపై వడిసేటి
అంగపు జెమట నీకు నభిషేకము
వుంగిటి గొప్పవిరులు వుపరి సురతవేళ
సంగతి రాలేటి చల్లువేదపూజ (19-531)

రతి తపము వంటిది రచనలు మీఱగాను
చతురత గాగిటిలో సఫలమౌను (21-350)

శృంగార సంకీర్తనలు ప్రదర్శిస్తున్న ఈ అంశాలన్నీ కామపురుషార్థ పవిత్రతను తెలియజెప్ప డానికి ఉద్దేశింపబడినవే. ఛాందోగ్య (5-9-1), బృహదారణ్యక (6-2-13) ఉపనిషత్తులు మైథునాన్ని ఒక యజ్ఞ కార్యంగా చర్చించి ఉండడం అన్నమయ్య అభిప్రాయాలకు బలాన్ని చేకూర్చే అంశం. కామపురుషార్థం మోక్ష పురుషార్థానికి మార్గాన్ని నిర్దేశిస్తుందని కూడా శాస్త్రగ్రంథాలు ప్రకటించాయి. గాఢ పరిష్వంగంలోని మిథున సంయోగం మోక్షానికి ప్రతీకగా చెప్ప బడింది.[17]

శృంగార సంకీర్తనలలో కామశాస్త్రాలలోని విషయాలెన్నో కనిపిస్తున్నాయి. సురత విద్య (19- 250), మదన శాస్త్రములెన్ని చదివినా (14-4), అంగన మంచము మీద నభ్యసించిన విద్యలు (21-351), కామ తంత్రం (21-399) మొదలైన విషయాలన్నీ అప్పటి సమాజంలో ఈ శాస్త్రాల ప్రాధాన్యతను, ప్రాచుర్యాన్ని వివరిస్తున్నాయి. ప్రాచీన దశలో ఇతర శాస్త్రాల అధ్యయనంలో కామశాస్త్రం గూడా ఉండడం గమనించ వచ్చు. వాత్స్యాయనుని గ్రంథం వచ్చిన తరువాత ఈ విషయం మరీ స్పష్టంగా కనిపిస్తుంది. అన్నమయ్య కాలంనాటికి దీని ప్రాధాన్యత కొంత తగ్గినా గుర్తింపు, గౌరవం లేకుండా పోలేదు.

సురతాంతమున నీ సోకిన గురుతులెల్ల
పరగ జెలుల కెల్ల బయలు సేసీని (11-204)

అనడంలో అన్నమయ్య చూపిన నఖాంకురాలు, చంద్రవంకలు స్ఫురిస్తాయి. శృంగార సందర్భాలలో ప్రతి శృంగార సంకీర్తన శారీరక

అవయవాల ప్రాధాన్యతను వర్ణించింది. శృంగారోద్దీపనకు అవసరమైన భాగాలను ఆయాలని (11-302), ఇక్కువలని (11-317), కందువలని (11-378) శృంగార సంకీర్తనలు పేర్కొన్నాయి. వీటిని కళాస్థానాలని, రతి స్థానాలని వాత్స్యాయనుడు పేర్కొన్నాడు. కాలివేళ్లనుండి తలవరకు గల పదునైదు కళా స్థానాలను (Anatomical Parts) శాస్త్రం చూపింది. శాస్త్రవిషయాలను అవసరమైన వాళ్లకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో కాబోలు ఇవి శృంగార సంకీర్తనల కెక్కినాయి.

అన్నమయ్య జన జీవన శృంగార భంగులను అతి సహజంగా చూపించడం ఆనాటి పామరుల శృంగార విషయాలను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. చెరుగుమాసిన దానిని కూడడం (16-241, 20-147), సమయానికి దొరికిన స్త్రీని వదలకపోవడం (12-398), సవతులు కొట్లాడు తుంటే పతి నడుమవచ్చి వారించడం (18-450), ఇద్దరు సతులున్నపుడు వంతులవారిగా కూడడం (21-1), నిద్రిస్తున్న స్త్రీతో సరసమాడడం (19-338), ఆయాల సాక్షిగా ఒట్టుపెట్టుకోవడం (11-385), చెలికత్తెలతో రతులు (14-25), వదిన - మరిది శృంగారం (18-45), శృంగారంలో న్యాయా న్యాయాలు పనికిరావనుకోవడం (11-26) మొదలైన విషయాలన్నీ పామరుల శృంగార జీవితంనుండి సేకరించినవే. అన్నమయ్య శృంగార విషయాలను చిన్న సన్నివేశాలుగా మలచి చూపిస్తాడు. అవి చిన్న సంఘటనలుగా మారి సాధారణ విషయాలవుతాయి.

వేట వోయిన మగడు వీధి రాగాఁ గిన్నెర
మీటుచు దా నిక్కి చూచి మేడపై నుండి
గాటపు గుబ్బల కొంగు గప్పదు జారిన నింత
ఆటది వలచెనేని ఆపరాదు ప్రియము (5-336)

వేటకుపోయి వస్తున్న మగని రత్యాసక్తితో చూస్తున్న భామ శృంగార భంగిమ ఈ సంకీర్తనలో కనిపిస్తున్నది. శృంగార సంకీర్తనలలో ఇలాంటి

నిశ్చల చిత్రాలెన్నో కనిపిస్తాయి. ఇవన్నీ జానపదుల జీవితాలలోని సజీవ శృంగార శిల్పాలు.

అన్నమయ్య శృంగార సంకీర్తనల మీద ఆయన అధ్యాత్మ సంకీర్తనల మీద జరిగినంత పరిశోధన జరగలేదు. జరిగిన అరకొర పరిశోధన కూడా అందులో మధుర భక్తిని దర్శించి, అన్నమయ్య చూపిన శృంగారవిషయాలు అధ్యాత్మ భావాలకు వేసిన సోపానాలని తేల్చి, ఆయనను అధ్యాత్మ కవిగానే భావించింది. కొందరు శృంగార సంకీర్తనలలో కామ శాస్త్ర విషయాలున్నట్లు గుర్తించారు.[18] కాని ఆ విషయాలను తూర్పారబట్టి అవి శృంగార సంకీర్తన కెందుకు ఎక్కినాయో, వాటి సామాజికత ఏమిటో వివరించే ప్రయత్నం చేయలేదు. ఈ విషయాలను సమాజ పరంగా పరిశీలిస్తే వాటి విలువ అర్థమవుతుంది. అన్నమయ్య కున్న నిబద్ధత, సామాజిక స్పృహ వెల్లడవుతాయి. అన్నమయ్యది కేవలం మధురభక్తే అయితే ఇన్ని వేల శృంగార సంకీర్తనలు చెప్పవలసిన అవసరంలేదు. 'పచ్చిదైన పనులకు పాడి యేల పంతమేల' (11-26) అన్న అభిప్రాయం ఆనాటి సామాజిక శృంగార చిత్రం. సమాజంలో అన్నమయ్య గమనించిన పచ్చిదైన పనులు అన్నీ ఇన్నీ కావు. ఆయన పేర్కొన్న రతులు కొన్ని వందలున్నాయి. రతిని, సురతం వేర్వేరు అర్థాలలో కనిపిస్తాయి. తలపులోని వలపును దాచనవసరంలేదు (18- 25) అని చెబుతున్న అన్నమయ్య ఆ భావంతోనే శృంగార విషయాలను ప్రదర్శించాడు. శృంగారం కోసం వరస కలుపుకొన్న స్త్రీలెందరో శృంగార సంకీర్తనలలో చుట్టమరాండ్రుగా కనిపిస్తున్నారు. శృంగార సంకీర్తనలు ప్రదర్శించిన పచ్చిదనం మధుర భక్తికి సంబంధించినదీ కాదు, అన్నమయ్యకు సంబంధించిన తాత్త్విక శృంగారమూ కాదు. ఇది పూర్తిగా ఆనాటి సమాజానిది. అప్పటి స్త్రీ పురుషుల జీవితాలలో ప్రముఖంగా కొనసాగిన అంశమిది. దీనిని అన్నమయ్య కవిత అజరామరం చేసింది. దీనిని ప్రయోజనకరంగా వ్యాఖ్యానించిన అన్నమయ్య గొప్ప సామాజిక కవి.

## పాదసూచికలు

1. Dr .V.K.Hampiholi -"Sex Education -Indian View" 1966. p.4
2. 'శృంగార ప్రకాశిక'లో భోజుడు శృంగారరసాన్ని వివరిస్తూ శృంగార ఏవ ఏకోరసః అని నిర్ణయించాడు. శృంగారాన్ని అభిమాన రసమని, అహంకార రసమని పిలిచాడు. జీవి అహం కారాన్ని నిర్ణయించేది శృంగారమేనని, అందువల్ల అదొక్కటేరసమని అభిప్రాయపడినాడు.
3. తాళ్లపాక పదసాహిత్యం 12వ సంపుటంలో పరిష్కర్త పి.టి. జగన్నాథాచార్యుల అభిప్రాయమిది.
4. వి.పార్వతీదేవి-'అన్నమయ్య సంకీర్తనలు - నాయికా నాయకతత్వం' పిహెచ్.డి సిద్ధాంతగ్రంథం. పుట282. ఈమె ప్రతి శృంగార సంకీర్తనలోను నాయకుని విటత్వం, విశృంఖల శృంగారం వెల్లడవుతున్నాయని చెపుతూనే ఆత్మరతిని, పారలౌకిక మధుర దృష్టిని గురించి మాట్లాడడంలో అంతపొంతన కనిపించదు.
5. కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానంలో సన్నిధానం సూర్య నారాయణశాస్త్రి నాయిక అవయవాలను ఏయే ప్రకృతిద్రవ్యాలతో పోలుస్తారో వివరించాడు. అలాగే నాయిక వాక్కు, నవ్వు, ఊర్పులకు కూడా ఉపమాన ద్రవ్యాలను చూపించాడు. 1976 నాటి ప్రతి. పుటలు 85-88.
6. ధర్మకామోర్థకామశ్చ మోక్ష కామస్తథైవచ స్త్రీ పుంసయోస్తు సంయోగో యః కామస్సతు సంస్మృతః - నాట్యశాస్త్రం.
7. 'అముద్రితములైన తాళ్లపాకవారి సంకీర్తనలు -ఒక పరిశోధనాత్మక పరిశీలన' అనే వ్యాసంలో వ్యాసకర్త వేటూరి ఆనందమూర్తి ఈ సంకీర్తనను అన్నమయ్యదిగా చూపారు. ఈ వ్యాసంలో కనిపించే సంకీర్తనలన్నీ తాళ్లపాక వారివని, ఇవి ముద్రిత ప్రతులకెక్కలేదని వారు చెపుతున్నారు. ఈ అముద్రిత సంకీర్తనలు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన సంస్థవారి 6609A ప్రతిలో ఉన్నట్లు వారు

గుర్తించారు. ఈ వ్యాసం 'అక్షర' అనే డి.ఆర్. అభినందన సంచిక (నవంబరు, 2005-కావలి)లో ముద్రింపబడింది. పుటలు 889-913.

8. 'శారదావిపంచి' ఆచార్య కోలవెన్ను మలయవాసిని షష్టిపూర్తి ప్రత్యేకసంచికలోని వ్యాసం -అన్నమయ్య పదాలలో ధర్మి శౌంఠి శారదాపూర్ణ. విశాఖ.2004, పుట 123.

9. హరవిలాసం 4-101 "గాఢాలింగనంబులును, నీవీబంధ సంస్పర్శనంబులును, బింబాధర చుంబనంబులును, నఖాంకుర వ్యాపారంబులును, దంతక్షత వేదనా ప్రపంచిత కిలకించితంబులును వెలయ బాహ్యాంతరోత్సవంబులను సంధించి మన్మథుం గృతార్థుజేసి ...." ఈ వచనంలో రతి బంధాల విషయముంది.

10. 'చందనం' ఆర్వీయస్ అభినందన గ్రంథం (జూలై 2008) లోని తెలుగుభాషా విన్యాసం అనే వ్యాసం పుట.79 అందులోని విషయం-నన్నెచోడుడు "మనోజు జూచి మగలు కరము బ్రీతి దగిలి గండ బేటంబు గొని" (4-36) అని ప్రయోగించాడు.గండ బేటం అంటే మగవారికి మగవారిపై కలిగే ప్రేమ. అంటే Homosexual లాంటిది. ఇంకొక చోట "కలచుట దోషమే మగల గల్వక యుండుదు దొల్లి యాండురం గలతురె "(8-151) అనడం విశేషం. ఇది Lesbianism లాంటిది.

11. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం 4వ సంపుటంలో అన్నమయ్య శృంగార సంకీర్తనలను గురించి చెప్పిన మాటలివి.

12. అన్నమయ్య సంకీర్తనలు - నాయికా నాయక తత్త్వం. పుట.102.

13. S.K.De.""Ancient Indian Erotics and Erotic Literature'" Calcutta 1969. p.88.

14. పుట్టపర్తివారి 'గిరిక' అనే వ్యాసంలోనిదీ విషయం. వారి కుమార్తె పుట్టపర్తి నాగపద్మిని ప్రచురించిన పుట్టపర్తివారి వ్యాస సంకలనం

'వ్యాసవల్మీకం' 2004, పుట 63. ఇదేగ్రంథంలోని 'వరూధిని' అనే మరో వ్యాసంలో కూడా పుట్టపర్తివారు కవి సమాజంలోని విషయ వికారాలను అనుభవించి తన పాత్రలను మాత్రం ఉన్నతాదర్శ మూర్తులుగా తయారుచేయడం సహజం కాదని వివరించారు. పుట.117.

15. ఈ విషయాన్ని "Ancient Indian Erotics and Erotic Literature' అనేగ్రంథం నుండి గ్రహించబడినాయి.

16. రతిశాస్త్రమ్ (The Hindu System of Sexual life) అనే గ్రంథాన్ని ఆంగ్లలోకి అనువదించిన అవినాష్ చంద్రఘోష్ ఆ గ్రంథ preface లో రాసిన పంక్తులు రతిశాస్త్రాల ప్రయోజనాన్ని చక్కగా వివరిస్తున్నాయి. as the progress of the world depends upon coming generations, their bodily and mental energies, so the production of healthy progeny is of the greatest moment to us, and the Rati Sastra deals upon those features of sexual enjoyment as are productive of good progeny.
-Delhi,1977.

17. 'గుడిలో సెక్స్' అనే గ్రంథంలో ఆరుద్ర బృహదారణ్యకోపనిషత్తు (1-4-3) లోని సంయోగ ప్రాధాన్యాన్ని వివరించారు. విశాలాంధ్ర ఎడిషన్ 2000, పుట.105.

18. 'తాళ్లపాక శృంగార సంకీర్తనలలో నాయిక భేదాలతోపాటు రతి రహస్యాది కామశాస్త్ర గ్రంథములందు ప్రవచింపబడిన హస్తిన్యాది చతుర్విధ నాయికా భేదాలు గూడా కనబడతాయి, ఈ అభిప్రాయం వేటూరి ఆనందమూర్తిగారిది. 'తాళ్లపాక కవితలు - భాషా ప్రయోగ విశేషాలు' హైదరాబాదు, 1976,పుట.103.

★ ★ ★

సముద్రాల లక్ష్మణయ్య

## అన్నమాచార్య సంస్కృత సంకీర్తనలు

సంగీతమథ సాహిత్యం సరస్వత్యాఃస్తనద్వయమ్
ఏక మాపాత మధుర మన్యదాలోచనామృతమ్ ॥

సంగీత సాహిత్యాలు సరస్వతిదేవి స్తనాలు. అందులో ఒకటి ఆపాత మధురం కాగా మరొకటి ఆలోచించే కొద్దీ అమృతప్రాయ మవుతుంది.

సంగీత సాహిత్య కళావిహీనః సాక్షాత్పశుః పుచ్ఛవిషాణహీనః. సంగీతం, సాహిత్యం - అనే కళలలో ప్రవేశం లేనివాడు తోక, కొమ్ములు లేని పశువు.

ఇలా సంగీతానికీ, సాహిత్యానికీ గల ప్రాభవం బహుధా ప్రశంసా పాత్రమయింది. మన ప్రాచీనులు 64కళలను పేర్కొన్నారు. అందులో సంగీతం, కవిత్వం, శిల్పం, నాట్యం, చిత్రం - ఇవి సుప్రసిద్ధ లలితకళలు.

కళలన్నీ భగవంతుని విభూతులే. వాటిని భగవంతుని ఆరాధనకే వినియోగించాలి. తద్వారా భగవత్కృపకు పాత్రులై ధన్యాత్ములు కావాలి. పోతన తన కవితాకళను భగవదంకితం చేశాడు. ఆయన భగవద్భక్తి అందుకు కారణమయింది. త్యాగరాజాదులు గూడ తమ సంగీత సాహిత్య జ్ఞానాన్ని భక్తితో మేళవించి భగవదర్పితంగా కృతులుపాడి కృతకృత్యు లయ్యారు.

వాగ్గేయకారులలో అగ్రగణ్యుడు తాళ్లపాక అన్నమయ్య. పదకవితా పితామహుడుగా ప్రసిద్ధుడైన ఈ భక్త కవిశేఖరుడు సంగీత సాహిత్యాల రాశి అనదగిన తన సంకీర్తన వాఙ్మయాన్ని కలియుగ ప్రత్యక్ష దైవమైన

శ్రీ వేంకటేశ్వరుని కంకితం చేశాడు. సంకీర్తనలు భగవంతుని పాదాల కర్పించిన పూజాపుష్పాలుగా భావించిన మహానుభావుడు అన్నమయ్య.

ఈ సంకీర్తనాచార్యుడు ముప్పదిరెండువేల సంకీర్తనలు వ్రాసినట్లు ప్రసిద్ధి. కాని, మనకు లభించినవి ఇంచుమించు పదునాల్గువేలు మాత్రమే. శృంగార - ఆధ్యాత్మిక భేదంతో సాగిన ఈ రచనలలో తెలుగు పదాలతోపాటు సంస్కృతంలో రచించిన పాటలు గూడా కొన్ని ఉన్నాయి. శత సంఖ్యకు దగ్గరగా లెక్కింప బడిన ఈ సంస్కృత కీర్తనలు తెలుగు పాటల మధ్యలో ఎడనెడా కానవస్తున్నాయి.

ప్రాచీన కవులందరూ సంస్కృతాంధ్రాలలో సిద్ధహస్తులే. అచ్చ తెనుగులో కృతులు రచించినవారు సైతం అవసరం వస్తే స్వచ్ఛ సంస్కృతంలో కావ్యరచన సాగించగల నేర్పరులే. అన్నమాచార్యులు గూడా ఈ కోవకే చెందుతారు. ఆయన సృష్టించిన కొన్ని సంస్కృత సంకీర్తనల తత్త్వాన్ని పరిశీలించడానికే ఈ వ్యాసం ఉద్దేశింప బడింది.

'సకల వేదములను సంకీర్తనలు చేసి
ప్రకటించి నిను బాడి పావనుడైన
అకలంకుడు తాళ్ళపాకన్నమాచార్యులు' -

అని చెప్పినట్లు వేదార్థాలనే అన్నమయ్య సంకీర్తనలుగా పాడాడు. సంస్కృత రచనలలో గూడా ఈ అర్థాలే గోచరిస్తాయి.

వేదాలలోనూ, తదనుగుణమైన ప్రాచీనసారస్వతంలోనూ కర్మ - భక్తి - ధ్యాన - జ్ఞాన యోగాలు విపులంగా నిరూపింప బడ్డాయి. అవి మోక్షసౌధారోహణ కనువైన సోపానాలు. మానవ జీవితానికి మోక్షమే పరమలక్ష్యం. అన్నమయ్య తెలుగులో వలె సంస్కృతంలో గూడా మోక్ష ప్రాప్తి కనుగుణమైన తాత్త్వికాంశాలనే నిబంధించాడు.

వేదాలలో సంసార సాగర తరణోపాయం బోధించేటప్పుడు కొన్ని క్లిష్టమైన ఉపాయాలూ, మరికొన్ని సులభోపాయాలూ ప్రతిపాదింపబడి

వున్నాయి. జ్ఞానమార్గం క్లేశావహం కాగా భక్తిమార్గం, అందులోనూ ప్రపత్తిమార్గం సులభోపాయాలుగా నిరూపింప బడ్డాయి.

సంకీర్తన మార్గ ప్రాముఖ్యం

భక్తి నవవిధాలని భాగవతం బోధించింది.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్ ॥

శ్రవణాదులైన తొమ్మిదింటిలో కీర్తనం రెండవది. కీర్తనంలో శ్రవణ - స్మరణాలు గూడా గర్భితమై వుంటాయి. ఇది ముక్తికి అత్యంత సులభోపాయం. విశేషించి, కలియుగంలో ప్రముఖ మోక్ష సాధనమని పేర్కొన బడింది.

ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞైస్త్రేతాయాం ద్వాపరే2ర్చయన్।
యదాప్నోతి తదాప్నోతి కలౌకేశవ కీర్తనాత్ ॥

కృతయుగంలో ధ్యానంతో, త్రేతలో యజ్ఞాలతో, ద్వాపరంలో అర్చనలతో ఏ ఫలం పొందబడుతుందో, అది కలిలో కేశవకీర్తనంతోనే లభిస్తుంది. నారదాదులు సంకీర్తనంతో తరించారు.

అన్నమయ్య ఈ సంకీర్తన మార్గాన్నే ఒకయోగంగా చేపట్టాడు. వేదమతం సంకీర్తనమే అంటూ ఒక సంస్కృత సంకీర్తనంలో ఉద్ఘాటించాడు.

ఏవం శ్రుతి మత - మిదమేవ త
ద్భావ యితు మతః - పరం నాస్తి ॥

అతులజన్మ భోగాసక్తానాం - హిత వైభవ సుఖమిదమేవ,
సతతం శ్రీహరి సంకీర్తనం త - ద్వ్యతిరిక్త సుఖం వక్తుంనాస్తి ॥

బహుళ మరణ పరిభవ చిత్తానాం - ఇహ పర సాధన మిదమేవ,
అహిశయన మనోహర సేవా త - ద్విహరణం వినా విధిరపినాస్తి॥

సంసార దురిత జాడ్యపరాణాం - హింసావిరహిత మిదమేవ ।
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర - శంసైవా పశ్చాదిహ నాస్తి ॥

దీని తాత్పర్య సంగ్రహమిది - ఇదే వేదమతం. ఇంతకంటే ఏమీలేదు. జన్మభోగాలలో ఆసక్తి గలవారికి హితము గల్గించేది శ్రీ హరి సంకీర్తనమే. మరణ పరాభవానికి గురి అయిన వారికి శేషశయనుని సేవయే విధి, అదే ఇహపర సాధనం. సంసార పీడితులకు హింసలేని మార్గం శ్రీవేంకటేశ్వరుని ప్రశంసయే.

సంకీర్తనమునే ఒకచోట బ్రహ్మముగా అన్నమయ్య పేర్కొన్నాడు. (చాలదా బ్రహ్మమిది సంకీర్తనం)

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్ ।
నాతఃపరతరోపాయః సర్వవేదేషు దృశ్యతే ॥

హరినామాన్ని మించిన ఉపాయం సమస్త వేదాలలో కనిపించడం లేదన్న వచనం అన్నమయ్య పై సంకీర్తనలో చెప్పిన విషయానికి అనుగుణంగా ఉన్నది.

## మత సమన్వయం

లోకంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో దేవతలు ఆరాధింప బడుతున్నారు. హిందువులు బహు దేవతల నారాధిస్తున్నారు. ఈ విధానాన్ని కొందరు విమర్శిస్తున్నారు.

కాని, తత్త్వజ్ఞులైన వారు అనేకత్వంలో ఏకత్వం దర్శనీయ మంటారు. జీవుల సంస్కారాలు భిన్న భిన్నంగా వుంటాయి. అందుకనువుగా వారు వివిధ దేవతలను పూజించ వచ్చు. నదులు వివిధ మార్గాలలో ప్రవహించి చివరికి సాగరంలోనే ప్రవేశిస్తాయి. అట్లే నానా దేవతలకు చెందిన ఉపాసనామార్గాలు ఒకే పరతత్త్వ ఉపాసనలో పర్యవసిస్తాయి.

'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' అని వేదవచనం. ఒకే సత్యతత్త్వాన్ని విప్రులు నానా విధాల ప్రతిపాదిస్తారు. గీతలో -

యే యథామాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్ ।
మమ వర్త్మానువర్తన్తే మనుష్యాః పార్థ! సర్వశః ॥

అని భగవంతుని మాట. ఎవరేయే పద్ధతిలో ప్రపన్నులైనా, వారినట్లే నేను అనుగ్రహిస్తాను, మనుజులు అన్ని విధాలా నామార్గాన్నే అనుసరిస్తున్నారని భగవంతుడు ప్రకటించాడు.

అన్నమయ్యకు ముందటి పెద్దలు గూడ -
యంశైవాస్యముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాంతినః
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవః కర్తేతి నైయాయికాః ।
అర్హన్నిత్యథ జైన శాసనరతాఃకర్మేతి మీమాంసకాః
సో2యం వో విదధాతు వాంఛితఫలం త్రైలోక్యనాథో విభుః ॥

అని శైవులు, వేదాంతులు, బౌద్ధులు, నైయాయికులు, జైనులు, మీమాంసకులు తమతమ సంప్రదాయాన్ని అనుసరించి ప్రతిపాదించే 'శివుడు, బ్రహ్మ' ఇత్యాది తత్త్వాలన్నీ ఒకే పరతత్త్వాన్ని నిర్దేశిస్తున్నాయి అని నిరూపించారు.

ఈ మార్గమునే అనుసరించిన అన్నమయ్య వివిధ మతాలకు సమన్వయం ప్రతిపాదిస్తూ ఒక చక్కని సంస్కృత సంకీర్తనం పాడాడు-

బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్తువంతి భక్తా స్సులభ ఇతి ॥పల్లవి॥

గదంతి కిల సాంఖ్యాస్త్వాం పురుషం - పదవాక్యజ్ఞాః పదమితిచ
విదంతి త్వా వేదాంతిన - స్సదా బ్రహ్మల సత్పదమితిచ ॥

జపంతి మీమాంసకాస్త్వాంచ - విపుల కర్మణో విభవ ఇతి
లపంతి నయ సకలాస్సతతం - కృపాళు కర్తా కేవలమితిచ ॥

భణంతి వేంకటపతిమునయో - హ్యణి మాది తులమితి
గుణవంతం నిర్గుణం పునరితి - గృణంతి సర్వే కేవల మితిచ॥

దీని భావమిది - బౌద్ధులు బుద్ధుడనీ, భక్తులు సులభుడనీ, సాంఖ్యులు పురుషుడనీ, పద వాక్యజ్ఞులు పదమనీ, వేదాంతులు బ్రహ్మమనీ, మీమాంసకులు కర్మయనీ, తార్కికులు కర్తయనీ, మునులు అణిమా

ద్యైశ్వర్యప్రదుడనీ, గుణవంతుడనీ, నిర్గుణుడనీ - ఇలా నానావిధాల నిన్ను స్తుతిస్తున్నారు.

'యద్భావం తద్భవతి' - అన్నట్లు భావనానుసారంగా భగవంతుడు ఉంటాడన్న విషయాన్ని "ఎంతమాత్రమున నెవ్వరు దలచిన - అంత మాత్రమే నీవు" అన్న ప్రసిద్ధమైన తెలుగుపాటలో అన్నమయ్య తేటపరచియున్నాడు. ఆరువందల సంవత్సరాలనాటి అన్నమయ్య మతసమన్వయ దృష్టి మత కలహాలతో సతమతమయ్యే మనకు తప్పక అనుసరణీయం.

## మధురభక్తి

అన్నమయ్య సారస్వతంలో మరొక ముఖ్యాంశం మధురభక్తి. భాగవతంలో గోపికలు భగవంతుణ్ణి ప్రేమించారు. ఈ వ్రజగోపికల ప్రేమ ఉత్తమస్థాయికి చెందిన భక్తి అని నారదుడు తన భక్తిసూత్రాలలో వివరించాడు. జీవులందరూ నాయికలనీ, దేవుడొక్కడే నాయకుడనీ, భక్తులైన లౌకిక పురుషులందరూ భగవత్ప్రేమ విషయంలో స్త్రీలక్రిందే పరిగణింప బడతారనీ మధురభక్తి తత్త్వజ్ఞు లంటారు.

దీనిననుసరించి అన్నమయ్య రచించిన సువిశాలమైన శృంగార సంకీర్తనలు ఈ మధురభక్తినే వ్యక్తీకరిస్తున్నాయి. జయదేవుడు అన్నమయ్యకు ముందే రాధాకృష్ణులను నాయికా నాయకులుగా చేసి శృంగార గీతాలను రచించాడు. అవి అనన్య సామాన్యమైన ప్రచారం పొందాయి. అన్నమయ్యకు జయదేవుడు మార్గదర్శకుడైన వాడని ఇరువురి రచనలలో గల సామ్యం స్పష్టం చేస్తున్నది.

నందుడు కృష్ణుణ్ణి యింటివద్ద వదలి వచ్చుటకు రాధను పంపగా యమునాతీరంలో రాధామాధవులు రహఃకేళీ పరులయ్యారని జయదేవుడు వర్ణించాడు. ఆ పద్ధతిననుసరించి అన్నమయ్య గూడ వారి రతిని సుభగ సుందరంగా చిత్రించాడు.

రాధా మాధవ రతి చరిత మితి
బోధావహం శ్రుతి భూషణమ్ ॥రాధా॥

గహనే ద్వావపి గత్వా గత్వా
రహసి రతిం ప్రేరయతి సతి,
విహరతస్తదా విలసంతే
విహితగృహా శౌ వివశౌతౌ ॥రాధా॥

ఈ సంకీర్తన పదమూడు చరణాలు గలిగి నాయికా నాయకుల సంభోగ శృంగారాన్ని వివిధ భంగిమలతో వర్ణిస్తున్నది. విరహోత్కంఠితలు, ఖండితలు మున్నగు ఇతరనాయికల విప్రలంభ శృంగారాన్ని వర్ణించిన ఘట్టాలుగూడా అనేకం ఉన్నాయి. దేవుని వియోగం సహింపలేని జీవుని విన్నపాలుగా వాటిని గ్రహించాలి.

జగత్పితరులైన దేవీదేవుల సంయోగ వర్ణన మాతాపితల సంయోగ వర్ణనవలె అనుచితం కదా అన్న ప్రశ్న ఆలంకారికులలో పొడసూపింది. కుమారసంభవ కావ్యంలో కాళిదాసు గూడా ఆక్షేపానికి గురి కాక తప్పలేదు. ఐతే కవి లోకోత్తర ప్రతిభ ఆ దోషాన్ని కప్పివేస్తున్నదని ఆనందవర్ధను డన్నాడు. ఈ న్యాయాన్ని అన్నమయ్య విషయంలో గూడా మనం సమన్వయించుకోవాలి. లేకపోతే ఆయన కావించిన పచ్చి శృంగార మొలికించే వర్ణనలు అనౌచిత్య దోషభూయిష్ఠాలు కాక తప్పదు కదా!

ఒక ఖండిత నాయిక శ్రీ వేంకటేశ్వరుణ్ణి సవ్యాజంగా స్తుతించే పదనొకండు చరణాల సంకీర్తనలో సచమత్కారంగా దశావతారాలు వర్ణింపబడ్డాయి.

దశ విధాచరణం తన్నభవతి
దశవిధావస్థాం తే తత్ర ॥దశ॥

స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన
దీపితోఽయం మత్స్య దేహఃపురా ।

వ్యాపారో2య మేవం నచ తరుణ్యా
రూప జలధౌ కేలి రుచయే తత్ర ॥దశ॥

## గుణ కర్మ నామకీర్తనం

భక్తుడు భగవంతుణ్ణి నానావిధాల స్తుతిస్తాడు. భగవంతుడు స్తుతి ప్రియుడు. ఈ స్తుతులలో భగవానుని గుణాలు, కర్మలు, నామాలు విరివిగా ప్రస్తావించ బడతాయి.

భాగవతం అజామిళోపాఖ్యానంలో
"ఏతావతా2ల మఘ నిర్హరణాయ పుంసాం
యత్కీర్తనం భగవతో గుణ కర్మ నామ్నామ్ ।"

అని వ్యాసునిమాట. భగవంతుని గుణాలను, ఆయన వివిధావతారాలలో కావించిన చర్యలనూ, ఆ దేవుని నామాలను కీర్తిస్తే సమస్త పాపాలు తొలగి పోతాయని తాత్పర్యం. అన్నమయ్య రచనలన్నీ భగవద్వర్ణన పరాలే.

భగవంతుడు కల్యాణగుణ సంపూర్ణుడు. జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు మున్నగు ఎన్నో గుణాలకు ఆ దేవుడు ఆలవాలం. అవతారం దాల్చినప్పుడు లోకోత్తరమైన చర్యలెన్నో లోకానుగ్రహ కాంక్షతో చేశాడు. భగవన్నామాలు అనంతంగా ఉన్నాయి. ఇట్టి గుణకర్మనామాలు అన్నమయ్య సారస్వతంలో కోకొల్లలుగా ప్రశంసింప బడ్డాయి.

ఉదాహరణకు శ్రీరామావతారంలో ఆయన వైభవాన్ని ఇలా సంకీర్తనాచార్యుడు వర్ణించాడు -

దేవ దేవం భజే - దివ్య ప్రభవం
రావణాసుర వైరి - రఘు పుంగవమ్ ॥దేవ॥

రాజవరశేఖరం - రవికుల సుధాకరం
ఆజాను బాహునీ - లాభ్రకాయం

రాజారి కోదండ - రాజ దీక్షా గురుం
రాజీవలోచనం - రామచంద్రమ్ ॥దేవ॥

ఈ కీర్తనలో రామ పరమైన వర్ణన స్పష్టమే. 'రాజీవనేత్రాయ రాఘ వాయ నమో' వంటి కీర్తనలు గూడా ఇట్టివే. 'నమో నమో లక్ష్మీ' నరసింహా ఇత్యాది కీర్తనలు నృసింహావతారాన్ని వర్ణిస్తున్నాయి. ఇలా సంసారతారణ కారణమైన భగవత్ స్తుతి అన్నమయ్య సంకీర్తనలలో అనంతంగా గోచరిస్తున్నది.

'నారాయణతే నమోనమో' ఇత్యాది కీర్తనలలో సంబోధన ప్రథమా విభక్త్యంతంగా భగవన్నామాలు పేర్కొనబడ్డాయి.

కరుణానిధిం గదాధరం
శరణాగత వత్సలంభజే ॥

ఇత్యాది పదాలలో ద్వితీయా విభక్త్యంతంగా భగవన్నామ ప్రయోగం కనిపిస్తుంది.

నమో నారాయణాయ నమః
సమధికానందాయ సర్వేశ్వరాయ ॥

ఇత్యాదులలో చతుర్థీవిభక్త్యంత పదాలు వస్తాయి. 'తేనమః, త నమామి, తస్మైనమః' అన్నట్లు ఆయా వాక్యాలకు సంబంధం కలుపుకోవడం ద్వారా మనం శ్రీవేంకటేశ్వరస్వామికి నమస్కృతులు అర్పించినట్లు సిద్ధిస్తుంది. 'ఓం నమో నారాయణాయ' ఇత్యాది మంత్రాలలో గూడా నమశ్శబ్దం ఉండనే ఉన్నది. భగవంతుడు నమస్కార ప్రియుడు. "నమః పురస్తాదథపృష్ఠతస్తే నమో2స్తుతే సర్వత ఏవసర్వ।" అని భగవద్గీతలో అర్జునుడు అనేక పర్యాయాలు కృష్ణునికి నమస్కరించడం చూస్తాం. ఈ ప్రక్రియ భక్తి మార్గంలో అత్యావశ్యకమైనది. అందువల్లనే సంస్కృత సంకీర్తనలలో అన్నమయ్య ఇట్టి ప్రయోగాలు విరివిగా చేశాడు.

## శరణాగతి

భక్తిమార్గం కంటే సులభమైన మార్గం శరణాగతి, భగవద్గీత చరమ శ్లోకంలో శరణాగతిని భగవంతుడే కర్తవ్యంగా బోధించాడు-

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥

సమస్త ధర్మాలు వదిలి దృఢమైన నమ్మకంతో భగవత్పాద పద్మాలను శరణ్యంగా ఆశ్రయిస్తే ఆ దేవుడు పాపాలనుండి విముక్తి కల్గిస్తాడు. తుదకు మోక్షం కూడా ప్రసాదిస్తాడు.

తథా కురుష్వముదా మామద్యైవ
అధోక్షజ! తే అను దాసో2హమ్ ॥తథా॥

వ్రజామి శరణం వరద! తవాహం
త్య జాతానుబంధ ధర్మ మమ,
భుజ కృతాం(?) పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యా మీతి ॥తథా॥

అన్న సంకీర్తనలో పై చరమ శ్లోకార్థాన్నే అన్నమయ్య నిరూపించాడు.

శరణు శరణు దేవ సర్వ పోషక
కరుణానిలయ రామ కౌసల్యా నందన ॥శర॥

ఇత్యాది కీర్తనలలో 'శరణం' అనడానికి బదులుగా 'శరణు' అని దేశ్య ప్రయోగం చేసినాడనీ, తక్కిన సంకీర్తన మంతా సంస్కృతమే అని భావించి ఇట్టి కీర్తనలను విమర్శకులు సంస్కృత రచనలుగా పేర్కొన్నారు. కాని, కేవల సంబోధనాంతాలయిన పదాలు సంకీర్తనలను తెలుగు సంకీర్తనలుగా గూడా గుర్తించవచ్చు. పై పెచ్చు 'దశరథ రామా'! అన్నట్లు ఆకారాంతంగా వచ్చే సంబోధనలు తెలుగులోనే సముచితాలు.

తెలుగు సంకీర్తనలలో వలనే సంస్కృత సంకీర్తనలలో గూడా అన్నమయ్య పైన నిరూపించినట్లు భక్తి తత్త్వాన్నీ, సర్వమత సమన్వయాన్నీ, మధురభక్తినీ, శరణాగతినీ నిరూపిస్తూ జానపద ధోరణిలో పాడు కోవడానికి అనుగుణంగా పదాలు రచించి పాఠకులకు, శ్రోతలకు అమందమైన ఆనందం కల్గించినాడు. ఆ మహామహుడు సదా స్మరణీయుడు.

సకల వేదములను సంకీర్తనములుగా
సంఘటించి హరిని సన్నుతించి
ముక్తి చూరగొన్న మునివర్యు నన్నమా
చార్యు భక్తితోడ సంస్మరింతు.

★ ★ ★

బి.కల్పన

# అన్నమయ్య సంకీర్తనల్లో స్థితిపంచకం

విశాలవిశ్వంలో సృష్టి, స్థితి, లయాలు ప్రధానంగా సాగే పనులు. ఒకే దేవుడు తనను మూడు మూర్తులుగా విభజించుకొని సృష్టి, స్థితి, లయాలు సాగిస్తాడని ప్రతీతి. సృష్టించేవాడు బ్రహ్మ అయితే, స్థితి నిర్వహించేవాడు లేదా పరిపాలించేవాడు విష్ణువు. సృష్టినంతా లయం చేసేవాడు పరమేశ్వరుడు. విష్ణువును, పరమేశ్వరుణ్ణి మోక్షదాతలని విశ్వం విశ్వసిస్తుంది. అందువల్లనే వీరిని ఆరాధించే శాఖలు సనాతన ధర్మంలో లేదా సనాతన సంప్రదాయంలో ఏర్పడ్డాయి. అవే వైష్ణవం, శైవం. హైందవ ధర్మంలో ఆవిర్భవించిన ఆరుశాఖల్లోనూ శాక్తంతోబాటు ఈ రెండుశాఖలకు ప్రత్యేక ప్రాముఖ్యంఉంది. సర్వాత్మకుడు, సర్వ శక్తిసంపన్నుడు, మోక్షప్రదాత శివుడని శైవులు భావిస్తే ; విష్ణువని వైష్ణవులు విశ్వసిస్తారు.

విష్ణువు సర్వవ్యాపకుడు. ఆయన లేనిచోటు లేదు. భాగవతంలో ప్రహ్లాదుడు ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశాడు.

ఇందుఁగలడందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే! (భాగవతం-7-275)

అందువల్ల ఆది మధ్యాంత రహితు డైన విష్ణువును ఆరాధించడం అత్యంత దుష్కరం. కాబట్టి, ప్రధానంగా అయిదుచోట్ల ఉంటాడని వైష్ణవులు భావిస్తారు. అయిదు చోట్ల ఉన్న స్వామి ఆకారాన్ని ఆరాధిస్తారు. ఆ

అయిదు స్థానాలను 'స్థితి పంచకమ్' అని వ్యవహరిస్తారు. వైష్ణవులకు స్థితి పంచకం పట్ల అపారభక్తి శ్రద్ధలున్నాయి. అవి పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ. ఈ స్థితుల్లో ఉన్న స్వామిని వైష్ణవులు కొనియాడారు. ఆళ్వార్లు అభి నుతించారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో స్థితిపంచకంలో ఉన్న దేవదేవుణ్ణి ఊహించి పరవశించాడు. అన్నమయ్య తీరుతెన్నులను ఆవిష్కరించేందుకు ఈ వ్యాసం ప్రయత్నిస్తుంది.

## పరస్థితి

విష్ణువు అన్ని లోకాలను పరిపాలిస్తూ ఉంటాడు. దిక్పాలకులను, దేవతలను, తదితరులను సహాయకులుగా తీసుకొంటాడు. అన్ని లోకాలూ అతని సామ్రాజ్యమనుకుంటే; వైకుంఠం ఆ సామ్రాజ్యానికి రాజధాని. విష్ణువు వైకుంఠాన్ని తనకు నివాసంగా ఏర్పరుచుకొని లోకపాలన సాగిస్తాడు. సారూప్య, సామీప్య, సాలోక్యస్థితిని పొందిన నిత్యశూరులు, ఇతర విష్ణుభక్తులు వైకుంఠంలోని ప్రజలు. విష్ణువు కౌస్తుభాన్ని లక్ష్మీదేవిని, వక్షంమీద ధరిస్తారు. శేషతల్పం మీద పడుకొంటాడు. విష్ణుదేవుని ఈ స్థితినే వైష్ణవులు 'పర' అని వ్యవహరిస్తారు. చాలామంది ఆళ్వారులు విష్ణుదేవుని ఈ స్థితిని కొనియాడారు. అన్నమయ్య కూడా ఆళ్వారుల లాగే విష్ణుదేవుని ఈ స్థితిని అనేక కీర్తనల్లో ప్రస్తావించాడు.

"వైకుంఠమందున్న వనజనాభుడు"

"సురలు లేరా మింట శోధించ ఘనుడొక్కడే
పరమపద మేలు శ్రీపతియే కాక "

"అయమేవ వైకుంఠాధీశ్వరస్తు "

## వ్యూహస్థితి

భువన పరిపాలనా భారాన్ని వహించిన శ్రీమహావిష్ణువు అప్పు డప్పుడు విశ్రాంతి తీసుకుంటాడు. పాలసముద్రంలో శేషతల్పంమీద పడుకొని

విశ్రమిస్తారు. దీన్ని యోగనిద్ర అని చెబుతారు. ప్రతి సంవత్సరమూ ఆషాఢశుద్ధ ఏకాదశినాడు శయనించి కార్తీకశుద్ధ ఏకాదశినాడు విష్ణువు నిద్రలేస్తాడని చెబుతారు. స్వామి శయ నిస్తున్నట్టుగా చెప్పబడే ఆషాఢశుద్ధ ఏకాదశిని 'శయనైకాదశి'అని, స్వామి నిద్రలేస్తున్నట్టు చెప్పబడే కార్తీకశుద్ధ ఏకాదశిని 'ఉత్థానైకా దశి'అని వ్యవహరిస్తారు. మహావిష్ణువు క్షీరసాగరంలో శయనించే స్థితినే వైష్ణవులు వ్యూహస్థితికి సంబంధించి కూడా ఆళ్వార్లనేకులు పలుపాశురాలు రచించారు. వారి అడుగు జాడల్లోనే పయనించిన అన్నమయ్య కూడా వ్యూహస్థితిని స్మరించాడు. శ్రీదేవి, భూదేవి సేవి స్తుండగా బ్రహ్మాదుల వినుతిని వింటూ పద్మనాభుడు పడుకొన్న దృశ్యాన్ని అన్నమయ్య అందంగా చిత్రించిన వైనం గమనార్హం.

> "క్షీర పయోనిధి లోపల శేషుడు పర్యంకముగా
> ధారుణియును, సిరియునుఁ బాదము లొత్తగను
> చేరువఁదను బ్రహ్మాదులు సేవింపగ జెలుఁవొందెడి
> నారాయణు డితఁడే వున్నత వేంకటవిభుడు " (1-80)

## విభవస్థితి

విష్ణువు సర్వాంతర్యామి అయినప్పటికీ త్రిలోకపాలన సవ్యంగా సాగేందుకు అనేక చర్యలు తీసుకొంటాడు. దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించేందుకు అదనపు శరీరం ధరించి లోకంలో సంచ రిస్తాడు. దీన్నే అవతారమని వ్యవహరిస్తారు. విష్ణుదేవుని వైష్ణవులు విభవస్థితి అని వ్యవహరిస్తారు.

అవతారమంటే దాటడం, దాటించడం అని అభిప్రాయం. భగవంతుడు కష్టాల్లో ఉన్న వాళ్లమధ్యకు వచ్చి, వాళ్లను ఉద్ధరించడానికి ప్రయత్నించడం, తాను ఆ కష్టాలు దాటడమే గాక వాటిలో కూరుకు పోతున్న ఇతరులను కూడా దాటించడం అవతారమన బడుతుంది. అవతారమంటే దిగడం,

పైనుండి క్రిందికి రావడం, దేవుడు మనుష్యాది రూపాలను ధరించడం అవతారమనబడుతుంది.

లోకక్షేమార్థమై విష్ణువు ధరించిన అవతారాలు అసంఖ్యాకం. అయినా వాటిలో ఇరవైఒక్క అవతారాలు ప్రసిద్ధమైనవి. విష్ణుదేవుని ఈ ఏక వింశత్యవతారాల గురించి భాగవతంలో ప్రస్తావింపబడి ఉండటం గమనించ దగి ఉంది. భాగవతంలో పేర్కొనబడిన విష్ణుదేవుని ఏక వింశత్యవతారాలు 1. బ్రాహ్మణుడు 2. వరాహము 3. నారదుడు 4. నరనారాయణులు 5. కపిలుడు 6. దత్తాత్రేయుడు 7. యజ్ఞము 8. ఉరుక్రముడు 9. పృధు చక్రవర్తి 10. మత్స్యావతారము 11. కూర్మము 12. ధన్వంతరి 13. మోహిని 14. నృసింహ వామన 15. పరశరాముడు 17. వ్యాసుడు 18. రాముడు 19. బల రాముడు 20. కృష్ణ 21. కల్కి .

భగవంతుని ఏకవింశత్యవతారాలు అనే శీర్షిక క్రింద ఇరవైరెండు అవతారాలు చెప్పబడ్డాయి. బుద్ధావతారానికి ఇరవైఒకటి సంఖ్య ఇవ్వబడింది. కానీ కల్క్యవతారానికి ఏ సంఖ్యా ఇవ్వబడలేదు. నర నారాయణులకు ఇవ్వబడలేదు. నరనారాయణుల లాగే బల రామకృష్ణులు కూడా ఒకే అవతార సంఖ్య సరి పోగలదు. ఈ ఇరవైఒక్క అవతారాలలో పది అవతారాలు చాలా ప్రసిద్ధమైనవి; ముఖ్యమైనవని విజ్ఞులు విశ్వసిస్తారు.

విష్ణుదేవుని అవతారాలు పది అనే విషయంలో మాత్రం అందరికీ అంగీకారం కుదిరింది. కానీ అవి ఏవేవి అనే విషయంలో కొంత భిన్నాభిప్రాయం కనిపిస్తూ ఉంది. కొందరు దశావతార జాబితాలో బల రాముణ్ణి చేరుస్తారు. మరికొందరు కృష్ణుని చేరుస్తారు. అన్నమయ్య ఈ రెండు విధాల జాబితాను పాటించి కీర్తనలు రచించారు.

ఇందరికి నభయంబు లిచ్చు ౘేయి
కందువగు మంచి బంగారము చేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి కిందఁజేర్చు చేయి
కలికియగు భూకాంత గాఁ(గౌ?)గిలించిన చేయి
వలనైన కొనగోళ్ల వాడి చేయి ॥ఇంద॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
వొనరంగ భూదాన మొసఁగు చేయి
మొనసి జలనిధి యమ్ము మొనకుఁదెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరియించు చేయి ॥ఇంద॥

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబు ఁబరపెడి దొడ్డ చేయి
తిరువేంకటాచలాధీశుండై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల ఁదెలిపెడి చేయి ॥ఇంద॥ (1-334)

ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేడు
బట్ట బాయిటనే నీవు పదిరూపు లైతివి ॥పల్లవి॥

చదువుల చిక్కుదిద్ది చక్కఁగ జేసితివి
మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ॥ఇట్టె॥

అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడి బడినే రాచపగ నీఁగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అదరి పాండవుల దిక్కై నిలిచితివి ॥ఇట్టె॥ (2-503)

ఈ విధంగానే అన్నమయ్య దశావతారాలు చోటుచేసుకున్న పలువిధ గేయాలను అధికసంఖ్యలో రచించాడు. వీటిలో అధ్యాత్మ పరమైనవీ

ఉన్నాయి; శృంగార పరమైనవీ ఉన్నాయి. ఇవే గాక విడిగా వివిధా వతారాలనూ కొనియాడేవీ ఉన్నాయి.

## అంతర్యామిస్థితి

విష్ణువు సర్వవ్యాపకుడు. 'వ్యాప్నోతి ఇతి విష్ణుః' అని విష్ణుశబ్దానికి వ్యుత్పత్తి చెబుతారు. వ్యాపించడం వల్ల విష్ణువు అని అభిప్రాయం. విష్ణువు అన్నిచోట్ల ఉన్నాడని ప్రహ్లాదుడు సుస్పష్టం చేసినట్లు పోతన భాగవతం చెబుతుంది.

కలఁడంభోధి గలండు గాలి గలఁడాకాశంబునంగుంభినిన్
గల డగ్నిన్ దిశలం, బగళ్ళ నిశలన్, ఖద్యోత చంద్రాత్మలన్
గల డోంకారమునం, ద్రిమూర్తులఁ, ద్రిలింగ వ్యక్తులం దంతటన్
గల డీశుండు గలండు దండ్రి ! వెదకంగా నేల నీయీయెడన్?

(భాగవతం 7- 274)

విష్ణువు విశ్వమంతా వ్యాపించి ఉన్నప్పటికీ మహర్షుల హృదయాల్లో విశేషించి భాసిస్తూ ఉంటాడు. ఈ స్థితినే వైష్ణవులు అంతర్యామి అని వ్యవహరిస్తారు. అన్నమయ్య విష్ణుదేవుని అంతర్యామిత్వాన్ని కూడా తన కీర్తనల్లో ప్రస్తావించడం గమనార్హం.

"యోగీశ్వరుల మతి నుండేటి దేవుడు "

## అర్చాస్థితి

విష్ణుదేవుని స్థితిపంచకంలో అర్చకు మిక్కిలి ప్రాముఖ్యముంది. తక్కిన నాలుగు స్థితులు చర్మచక్షువులకు గోచరించవు. అర్చ మాత్రం అందరికీ కనిపించి ఆనందం కలిగిస్తుంది. అందువల్ల భక్తులు స్వయంగా దర్శించి భగవదనుగ్రహానికి పాత్రులయ్యే అవకాశం ఇక్కడ ఎక్కువగా ఉంది. దారు, లోహ, పాషాణ విగ్రహరూపాల్లో స్వామిని దర్శించడం ఇక్కడ ప్రధాన అంశం. విగ్రహరూపాల్లో స్వామే కొలువు దీరినట్లు భక్తులు

భావించి ఆరాధిస్తారు. శైవులు లింగరూపంలో శివుణ్ణి దర్శిస్తే; ఇతర దేవతోపాసకులు ఆయా దేవతల రూపాల్లో ఆయా దేవతలను దర్శిస్తారు.

భారతదేశంలో విష్ణుదేవుని ఆలయాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నప్పటికీ వైష్ణవులు నూటఎనిమిది దివ్యక్షేత్రాలను మాత్రం ప్రధానమైనవిగా భావిస్తారు. వీటినే 108దివ్య తిరుపతులని కూడా వ్యవహరిస్తారు. వాటి లోనూ శ్రీరంగం, కంచి, తిరుమల, వీరనారాయణ పురం అధిక ఫలదాలని వారి అచంచల విశ్వాసం. వైష్ణవ వాగ్గేయ కారులందరూ ఈ ప్రదేశాల్లో వెలసిన అర్చామూర్తులనే గాక ప్రదేశాలను కూడా కీర్తించి కీర్తి పొందారు. అన్నమయ్య తిరుమలను, అహోబిలాన్ని అధికంగా సేవించినప్పటికీ గ్రామసీమల్లో ఉన్న ఇతర విష్ణుదేవుని ఆలయాలను కూడా దర్శించాడు. ఆయామూర్తుల మీద కీర్తనలు రచించి ఆలపించాడు. ఆ కీర్తనల చివర వేంకటేశ్వర ముద్ర నిక్షేపించాడు. తిరుమలను, తిరుమలేశుణ్ణి కొనియాడుతూ ఈయన రచించిన కీర్తనలు అసంఖ్యాకం. అన్నమయ్య ఒక కీర్తనలో అనేక వైష్ణవక్షేత్రాలను ప్రస్తావించిన తీరు ప్రస్తావనీయంగా ఉంది. ఈ కీర్తనలో బదరి నుంచి అనేక ఉత్తర భారత క్షేత్రాలను, దక్షిణ భారత క్షేత్రాలను అన్నమయ్య ప్రస్తావించాడు. అన్ని రూపాల్లో ఉన్న హరే తిరుమలకి విచ్చేశాడని కొనియాడాడు.

అన్ని చోట్లఁ బరమాత్మ నీవు
    యిన్ని రూపుల భ్రమయింతువుగా ||పల్లవి||

పాలజలనిధి నుండి బదరీవనాన నుండి
    ఆలయమై గయలోఁబ్రయాగనుండి
    భూలోక నిధివై పురుషోత్తమాన నుండి
    వేలసంఖ్యల రూపై విచ్చేతుగా ||అన్ని||

వుత్తర మధురలో నయోధ్య లోపల నుండి
    సత్తైన నందవ్రజాన నుండి

చిత్తగించి పంచవటి సింహాద్రిలోన నుండి
వత్తుగా లోకములు పావనము సేయగను ॥అన్ని॥

కైవల్యమున నుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీ వేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా ॥అన్ని॥ (1-278)

అన్నమయ్య పరిశుద్ధ వైష్ణవుడు. వైష్ణవాన్నీ, విష్ణుతత్త్వాన్నీ తనలో బాగా జీర్ణింప జేసుకున్నాడు. విష్ణుదేవుని ఐదు స్థితులను చక్కగా గ్రహించాడు. తన కీర్తనల్లో వాటికి స్థానం కల్పించాడు. వైష్ణవులకే గాక వైష్ణవేతరులకు కూడా వాటి పట్ల సదవగాహన కలిగించాడు.

★ ★ ★

యార్లగడ్డ బాలగంగాధరరావు

## భక్తి - మూలతత్త్వం

భక్తి పదానికి గల నిర్వచనాన్ని గూర్చి ఇతఃపూర్వం పండిత ప్రకాండులైన వారి వక్కణాలను తిరిగి ఇక్కడ ప్రస్తావించవలసిన అవసరంలేదని భావిస్తున్నాను. కారణం వాటితో తమకు ఇప్పటికే పరిచయముండటం, కాగా భక్తి మొదట వైయక్తికం. పిదప సామూహికం. దాని విషయంలో ఎవరి అనుభవం వారిది. కనుక అది వస్తుతః వైయక్తికమే. పిదప ఒకరి అనుభవం, ఇతరులకు మరింత సంపన్నతను చేకూర్చ వచ్చును గాక, కాని మౌలికంగా ఒకనిలో దానిబీజము - పోని, వాసన అందాము - అదంటూ లేకపోతే, ఇతరుల అభిప్రాయం, అనుభవమూ ఎలాంటి ప్రభావాన్ని చూపదు. ఈ వాసనకు మూలం చేతన. ఇది కేవలం శుద్ధచైతన్యమా లేక దానిపై భౌతిక స్థితిగతుల ప్రభావముందా అనేది ఒక ప్రశ్న. ఇది ఇలా వుండగా - ఇది కేవలం ఆత్మికమైన ప్రయోజనాన్ని మాత్రమే చేకూరుస్తుందా లేక సాంఘిక ప్రయోజనం కూడా ఇందులో ఇమిడి వుందా అనేది మరో ప్రశ్న. అంటే మతమనే దానికి ఇది మూలమా? అయితే దాని ప్రయోజనాలు, ఫలితాలు ఎలా వుంటాయి అన్న దానిని కూడా వివేచించవలసివుంది.

మనకు భక్తి విశ్వాసాలు అనే జంటపదముంది. ఆ పదాలు రెంటికీ ఒకటే భావనా? లేక ఒకటి మరొకదానికి కారణమవుతోందా? అంటే రెంటికీ సంబంధముందా? అయితే ఏది దేనికి మూలమవుతోంది? శబ్దశాస్త్రం ప్రకారం, భాషలో ఒక భావనకు ఒకే పదం సంకేతం, ఒక భావనను చెప్పడానికి రెండు పదాలుండవు. అంటే పర్యాయ పదాలుండవు. అలా ఏదైనా ఒక పదం మరో పదానికి పర్యాయంగా భాసిస్తుంటే -

అలా అని మనం భావిస్తూ వుంటే - దానికీ, రెండవ పదానికి భావచ్ఛాయలో భేదం వుంటుంది. అంతే తప్ప ఏ పదమూ మరో పదానికి అన్ని విధాలా సమానం కాదు. కనుక పదం వేరైతే భావమూ వేరవుతుంది. ఆ విధంగా భక్తి, విశ్వాసం, అనేవి వేర్వేరు భావనలకు సంకేతమైన భాషాపదాలు. అయితే భక్తి తత్త్వ వివేచనలో ఈ భాషాచర్చ ఎందుకు అని అనిపించవచ్చు. కాని, మన వ్యవహార మంతా భాషలోనే గనుక - ఒక జాతి భాషే, ఆ జాతి అంతశ్చైతన్యానికి ప్రతీక గనుక భాష, భాషలోని పదాలు విస్మరింప రానివి.

దానినలా వుంచితే విశ్వాసమనే పదం కృతజ్ఞతాబద్ధత అనే దానికి మారుగాను, నమ్మకమనే పద్ధతిలోను, రెండు విధాలుగా ఉపయోగ పడుతోంది. ఈ రెంటిలో ప్రస్తుతానికి అవసరమైనది కృతజ్ఞతకు ప్రతీకగా నిలిచిన సందర్భం. మనకు ఒకరు మేలు చేసిన సందర్భంలో వారి పట్ల కృతజ్ఞతతో మెలుగుతాము. ఇది వారిపట్ల మనలో భక్తిని కలిగిస్తుంది. ఋగ్వేద స్తుతులలో ఒక పార్శ్వం కృతజ్ఞతకు సంబంధించినది. అంటే - ప్రకృతి వలన తమకు కలిగిన మేలును స్తుతించిన విధానం. ఇది కావడానికి భక్తియే! ఆ స్తుతుల్లో కొట్టివచ్చినట్టు కనపడే మరోపార్శ్వం తమ జీవిక, మనుగడ సుఖంగా, సాఫీగా జరిగేపట్ల సానుకూలంగా వర్తించమని ప్రకృతిలోని పంచభూతాలకు చేసిన విజ్ఞప్తి. ఇది ఆర్తినుండి జనించింది. అంటే - ఈ ఆర్తియే భక్తి రూపాన్ని తీసుకుంటోంది. అంటే, తమ ఆర్తిని తీర్చగల సామర్థ్యం ఆ ప్రకృతి శక్తులకు కలదని వారు విశ్వసించిన కారణంగానే ఇది జరిగిందనడంలో సందేహం లేదు గదా! అంటే - ఒకరు, తత్పూర్వం మనకు చేసిన మేలు, ఇచ్చిన రక్షణలు కారణంగా, ప్రస్తుతం సంభవించిన లేదా ముమ్ముందు సంభవింపగలవేమోనన్న ఊహా జనితమైన విపత్తుల నుండి కూడా రక్షణ లభింపగలదన్న విశ్వాసమే వారి చేత ఆ పని చేయిస్తోంది. అంటే, భక్తికి మూలం ఆర్తి కాగా, ఆ ఆర్తికి గల పరిష్కారానికి ఆకరం. ఏతత్ పరిష్కర్తగా భావింప బడుతున్న

వానిపై గల విశ్వాసంగా గోచరిస్తుంది. భక్తి విశ్వాసాలు అనే జంట పదం రూపొందడానికి మూలం ఈ విధంగా దర్శనమిస్తోంది అనడంలో విప్రతిపత్తి లేదు గదా!

అది అలాంటిది కాగా, ప్రాయికంగా ప్రాణికోటి ఆర్తి అంతా ఆహారలభ్యత, ప్రాణ రక్షణతప్ప అన్యం కావు. ప్రాణికోటిలోని భాగంగా ప్రాక్తన మానవుని ఆర్తి కూడా దానికే పరిమితం కావాలి. అదే తీరు ఋగ్వేదంలోని మొదటి భాగాల్లో కనుపిస్తుంది. అంటే - అక్కడ మానవునికి, ఇతర జీవకోటికి భేదమేమీ లేదు. కాని, ఆ తరువాత వచ్చిన బ్రాహ్మణాల్లో, ఉపనిషత్తుల్లో దానికి మించిన ఆలోచనలు చోటు చేసుకొన్నాయి. దానినే మనం జ్ఞానమని, వివేచన అని సంభావిస్తున్నాము. ఆహారలభ్యత, ప్రాణ రక్షణ అనే మౌలిక అంశాలకు ఒక విధమైన హామీ ఏర్పడిన, లేక ఏర్పరుచుకున్న తరువాత, ఈ వివేచన చోటుచేసుకుంది. అంటే - మానవ కోటి సమాజాలుగా, జాతులుగా వ్యవస్థీకృతమైన తరువాత ఇది జరిగింది. ఇందులోని మౌలికాంశాలు రెండే రెండు. అవి ఒకటి వృత్తుల విభజన, రెండవది సమాజ సంరక్షణ. సమాజం యొక్క తీరైన గమనానికి వృత్తుల విభజన అవసరమైంది. ఒకనికి కావలసిన అన్ని అవసరాలకు తానై పూనుకోవడం కంటే - తాను, తనకు చేతనైన దానిని ఇతరులకు సమకూర్చి, తనకు కావలసిన వాటిని ఇతరుల నుండి పొందడం అనేదానిలో సుఖసంపాదనముంది గదా! అలా ఎవరికి వారు తమ తమ పనుల్లో నిమగ్నమైనవేళ, ఇతర మానవ సమాజాల నుండి ఏవిధమైన ఒత్తిడి, కీడు సంభవించకుండా వుండటానికి రక్షణోద్యోగం అవసరమైంది. దాని కొరకు మరో ఏర్పాటు.

వృత్తుల సజావైన నిర్వహణ, పంపిణీ - వీటిలో, ప్రాణిగతంగా, సహజాతంగా గల స్వార్థంనుండి జనించే దోపిడీ, మోసం, వంచన, కుట్ర - వీటి నివారణ కొరకు - అంటే సంఘ రక్షణ కొరకు ప్రభుత్వం అవసరమైంది. దీనితో కూడిన సమాజాన్నే వ్యవస్థీకృత సమాజం

అంటున్నాము. స్వార్థాన్ని ఫలోన్ముఖం గావించుకోవడానికి గల అనుసరణలను (దోపిడి, మోసం, వంచన, కుట్ర వగైరాలను) నియంత్రించడానికి చట్టం, శిక్షాస్మృతి అవసరమైనాయి. అయితే ఎల్లవేళలా శిక్షాస్మృతి అమలు కాగలదని అనుకోలేము. దానికి కారణం- దాని అమలు అనుసరణలు తిరిగి మానవులపైనే వున్నవి గనుక! వారికుండే సహజాతమైన స్వార్థం వారి కుంటుంది గనుక! ఉంది గనుక! నిర్ణయాధికారమే వారిపై వున్నపుడు, వారిని నియంత్రించే దెలాగ? భౌతిక ప్రపంచం నుండి ఏ ఉపాయాన్నీ ఆశించలేము. మరి మార్గమేది?

దానికి గల మార్గం ఒక్కటే. అది - ఆ అక్రమానికి నెట్టుకుంటున్న వారిలో నుండే రావాలి. అంటే మానసిక పరివర్తన. అంటే తాము చేస్తున్న దోషమేదో, నెట్టుకుంటున్న పాప మేదో తామే గుర్తెరిగేటట్లు చేయడం. దానికి నిరంతరబోధ. ఇది కేవలం నీతిబోధ వల్లనే జరగదు. అంతకు మించి పాపఫలితాల గురించిన ఎరుక అవసరం. అదీ ఉదాహరణ పూర్వకంగా వుండాలి. దానికొరకే దైవభీతి, పాపభీతి కలిగించటం. అలా దైవంపై గురి కలుగచేయడం. ఆ గురిని చేరుకోవడానికి అవసరమైంది భక్తి. దీని వలన ఉపయోగం సమాజానికి. కనుక సమాజ పరిరక్షణకు బాధ్యత వహించేవారు దీనిని ప్రోది చేయాలి. ఈ ప్రోది చేయడంలో నుండి వచ్చిందే మతం (రెలిజియన్). నిజానికి మత శబ్దం ధర్మానుసరణకు సంబంధించినది. రెలిజియన్‌కు మారుగా ఉపయోగించే మత శబ్దానికి, ధర్మానికి మారుగా ఉపయోగించే మత శబ్దానికి, ధర్మానికి భేదముంది. కాని, లక్ష్యంలోని అభేదత్వం వలన ఆ శబ్దం రెంటికీ ఉపయోగిస్తోంది. భేదం ఎక్కడుందంటే - చేరుకోవడానికి అనుసరించే విధానంలో వుంది. ఏమైనా, ఇదీ భక్తి క్రిందకే వస్తుంది. ప్రభుత్వాలు దీనిని ఎందుకు ప్రోత్సాహిస్తాయో తెలిసింది కదా!

ఇదిగాక, మరో భక్తి వుంది. ప్రధానమైనది కూడా ఇదే. భక్తికి ప్రాధాన్య వివక్ష వుంటుందా? నిజానికి వుండదు. కాని ముందు చెప్పిన విశేషాన్ని

మనసులో వుంచుకొని చేస్తున్న వివక్ష తప్ప ఇది అన్యంకాదని మనవి. అంతేకాదు, భక్తి మానవ సంబంధి మాత్రమే. మానవేతర ప్రాణికోటి సంబంధి కాదు. ఒకవేళ వుందేమో మనకు అది అగమ్యము. కారణం వాటికి అవసరమైనవి ఆహారం, ప్రాణ రక్షణలు మాత్రమే. ప్రాయికంగా ఆ రెండూ మనుగడకు సంబంధించినవి. ఆరెండింటి విషయంలో మానవకోటి కూడాఅంతే. అంటే -మనుగడకు మూలం పోషణ, రక్షణలు. ఈ రెంటితో పాటు, అన్నింటిలో కాకపోయినా జంతుకోటి కొన్నింటిలో విశ్వాసమనే లక్షణం కూడా వుంది. బహుశా మనం అలా అనుకుంటున్నామేమో. నిజానికి కొన్నింటి విషయంలో - పోషణకు సంబంధించిన నిసర్గ లక్షణాల్లో - అదొక పార్శ్వమేమో - తెలియదు. మరి మన అవగాహనకు కూడా పరిమితులున్నాయి గదా! ఇక జంతుకోటికంటే, భిన్నమైనది - అంటే వాటిలో వుందో లేదో తెలియనిది - మానవకోటిలో మాత్రం వున్నది ఆర్తి. ఈ ఆర్తి రెండు విధాలు. ఒకటి భౌతికం. రెండవది మానసికం. భౌతికమైన దానినిగూర్చిన నివేదన ఋగ్వేదంలో గమనిస్తున్నామని ముందు చెప్పుకున్నాము.

మానసికమైన దానిని గూర్చిన ఆర్తి రెండు రూపాలను తీసుకుంది. ఒకటి భక్తి, రెండవది జిజ్ఞాస. జ్ఞానానికి మూలం ఈ జిజ్ఞాసే. దీనిని ప్రోది చేసినవి బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు మొదలైనవి. వీటి బోధనల సమాహారరూపం, పర్యవసానంలో వైరాగ్యానికి దారి తీసింది. అయితే - ఇదంతా లేకుండా వైరాగ్యభావనకు స్థితి లేదని కాదు. వాసనా బలం దానికెలాగూ స్థితి కల్పిస్తుంది. అది వేరే విషయం. అది అనిర్వచనీయం. ఇది ప్రాకృతికం, లేక ప్రాపంచికం. అదీ, రెంటికీ అంతరం. దానినలా వుంచి, ఇక్కడ భక్తికి మూలమైన ఆర్తి విషయం తెలుసుకుందాము. ఇదే స్థూలంగా - లేక సూక్ష్మంగా మిగిలిన ప్రాణికోటి నుండి మానవుణ్ణి వివక్షిస్తోందని గదా అనుకున్నాము. ఇది పూర్తిగా వ్యక్తినిష్ఠము. దీనికి కారణాలు తెలుసు కుందాము.

ఒకనికి ఐహికమైన సుఖాలనుభవించడానికి వలసిన వనరులున్నాయి. అతడిని చూస్తున్న లోకం, అతడికేమీ లోటు లేదని, సుఖంగా బ్రతుకున్నాడనే భావిస్తోంది. నిజానికి అతని జీవనశైలి కూడా అలాగే వుంది కూడా. కాని అతడి అంతరంగమంతా వ్యాకులపాటే. అతడి సంపాదనపై బ్రతుకుతున్న కుటుంబ సభ్యులకు అతడి సంపాదనే ముఖ్యం తప్ప, దాని కొరకు అతడు శ్రమిస్తున్న తీరుతోగాని, అనుసరిస్తున్న పద్ధతితో గాని వారికి నిమిత్తం లేదు. అందువలన అతనిలో ఉత్పన్నమవుతున్న మానసిక సంఘర్షణలతో గాని వారికి పనిలేదు. కొండొకచో నిరాదరణ కూడా! దీనిని బోధించేదే వాల్మీకి కథ. మానసిక సంఘర్షణతో పాటు శారీరక రుగ్మతలు, వీటి వలన తనకు గల వనరుల వలన లభింపగల సుఖాలకు, ఆనందానికి కూడా దూరం అవుతున్నాడు. మరి ఈ జీవికి ఓదార్పు ఎక్కడ? ఈ ఆర్తికి సమాధానం ఎక్కడ? తన సంపాదన అక్రమమని తనకే అనిపించి నపుడు, అది పశ్చాత్తాపానికి గురి చేస్తున్నపుడు, దానికి నిష్కృతి ఎక్కడ? ఏది శరణ్యం? దేవాలయాలు, స్వామీజీ లేనా, మరేవైనా ఆశ్రయస్థానా లున్నాయా? వాటిపై, లేక వారిపై గల భక్తి నుండే కదా ఓదార్పు పొందుతున్నాడు. అంటే భక్తికి ఈ కారణాలు కూడా మూలమవుచున్నాయి.

ఇక చదువుసాముల తోడి శాస్త్రజ్ఞతతో 'బహుధా విప్రతిపత్తి ధీవిషయముల్ పొడైన శాస్త్రార్థముల్' అనే నిర్ణయానికొచ్చిన - అంటే లోకం చేత పండితుడు, జ్ఞాని అని అనిపించుకుంటున్న వాని ఆవేదన కూడా మరోవిధమైన ఆర్తియే కదా! అంటే - అందరికీ జ్ఞానబోధ చేసి, చివరకు తానెవరన్న జిజ్ఞాసకు లోనైనా వాని మాట. కప్పుకున్న అహంకారపు ముసుగును వదిలించుకున్న వాని మాట. అప్పటి అతని మానసిక స్థితికి చికిత్స ఎక్కడ? రెండే రెండుచోట్లు! ఒకటి కనుపించని దైవానికి శరణాగతి. అంటే భక్తియే. రెండవది ఆత్మహత్యా సదృశమైన వైరాగ్యము. వైరాగ్యము - తనకది మేలని తాను భావించవచ్చు గాక. సంగములను పరిత్యజించడమూ మేలైన పద్ధతే అగుగాక! కాని తానే ఆ సంగములను కొని తెచ్చుకున్నపుడు, తన వలన, తనకొరకు వాటిలో

చిక్కుకున్నవారిని వదిలి, తనపాటికి తాను పలాయనం చిత్తగిస్తే - దానిని లోకం హర్షిస్తుందా? నిందింపదా? అది ఆత్మకు సుఖాన్నిస్తుందా? మొదలు అది ధర్మమవుతుందా? కనుక దీనికంటే మేలైనది భక్తి మాత్రమే. దానికి ఆశ్రయమెక్కడ? కనుపించని దైవమే గదా!

ఇవేమీ లేని సామాన్యుని విషయం మరోవిధం. తనపాటికి తాను శ్రమిస్తూ, తన బ్రతుకు తాను బ్రతుకుతూ, తనపై ఆధారపడిన వారిని బ్రతికిస్తూ కాలం వెళ్ళదీస్తున్న వాడికి కూడా ఒకప్పుడు ఎదురు దెబ్బలు తగులుతాయి. నిస్పృహాయత, నిరాదరణల కారణంగా నిర్వీర్యుడవు తున్నాడు. దురదృష్టానికి క్రుంగిపోతున్నాడు. మానసికంగా తాను అప్రయోజకుడనే భావన, దిగులు అలము కుంటోంది. అతనిని ఆ స్థితినుండి తప్పించి అతనిలో ఆత్మ ధృతిని పెంపొందించే దివ్యౌషధం ఏది? ఎక్కడ లభిస్తుంది? ఆత్మధృతి, ఆత్మ నుండి అంటే - లోనుండే రావాలి తప్ప లోకపు ఓదార్పుమాటలతో లభించేది కాదు గదా! అలా లభించేది కేవలం తత్కాలీనమైన ఉపశమనం మాత్రమే. శాశ్వత నివారణ శరణాగతిలోనే వుంది. అంటే - భక్తే కారణమవుతోంది. భక్తి రూపంలోని శరణాగతి - మరింత లౌకికంగా చెప్పుకోవాలంటే మ్రొక్కుబడే అతనిలో అంటే సామాన్యునిలో ఆత్మశక్తిని ప్రోది చేస్తోంది గదా!

మిగిలిన ప్రాణికోటి కంటే భిన్నమైన మానవునికి ఇన్ని బాధలున్నాయి. ఇవి నిసర్గమైన వేళ - తప్పించుకునే మార్గంలేదు. అంటే - అవి అనివార్యములు. మనిషికి మనసొక శాపం అన్నదిందుకే. అవి అనివార్యము లని గుర్తించడమే మానవునికి గల జ్ఞానం. ఆ జ్ఞానం నుండే, వాటి నుండి విడివడడానికి చేస్తున్న ప్రయత్నమే భక్తి. విడివడడమే మోక్షం. దానికి ఏకైక మార్గం భక్తిమాత్రమే. మరి భక్తికి ఆలవాలం, ఆశ్రయం ఒకటి అవసరం. అదే దైవం. బ్రహ్మం, సర్వాంతర్యామి, పరమాత్మ.

మొదట మొదట - అంటే ఋగ్వేదంలో అగ్నితో ప్రారంభమైన స్తుతులు లేక ఆరాధనా క్రమం, క్రమంగా పంచభూతాలకు విస్తరించి

దరిమిలా ఆ అన్నింటికీ మూలాధార శక్తిని ఇంద్రశబ్దంతో గుర్తించి, పిదప మధ్యందిన మార్తాండుని విష్ణువుగా భావించి ఆరాధించిన క్రమం కనుపిస్తుంది. అంటే - తత్పూర్వపు ఆరాధనా క్రమాన్ని త్యజించారని కాదు. అవీ వున్నాయి. ఇది కేవలం ఆలోచనలో వచ్చిన పరిణామాన్ని తెలుపడానికే ఈ వివేచన. ఆ అందరి దేవతలకు తమ ఆహుతులను కొనిపోయే వాహకంగా అగ్నినే గ్రహించడం జరిగింది. కాకపోతే, ఈ జగత్తు పోషణ అంతా సూర్యునిపైనే ఆధారపడిందని గ్రహించడం, అంటే - పోషణకు ఆవశ్యకమైన అన్నం, 'ఆదిత్యమయం' అని భావించడం, గుర్తించడం, ఆలోచనా క్రమం మరోమెట్టుకు చేరిందని చెప్పడమే ఇక్కడి ప్రధానాంశం. మిగిలినవన్నీ విష్ణు కార్యక్రమానికి సహకరించే దైవాలుగా, అంటే అతని అంగాలుగా, అతని (విశ్వ పురుషుని) ఆధీనంలోని వానిగా భావించిన వైనం కనుపిస్తుంది. అంటే అంతశ్చేతన నుండి ఉత్పన్నమైన జిజ్ఞాస, కానరాని, తన ఆధీనంలో గాని ప్రమేయంతోగాని నిమిత్తంలేని ప్రాకృతిక శక్తుల ప్రభావానికి మూలం భౌతిక అంటే కనుపిస్తున్న రూపమైన సూర్యుని గుర్తించడం జరిగింది. అంటే రూపరహితమైన భావానికి లేక భావ ప్రవాహానికి, విస్తృతికి, చైతన్యానికి, సూర్యునిరూపంలో ఆలంబన దొరికినట్లయింది. కనుకనే భౌతిక శాస్త్ర ప్రయాణపు చివరి మజిలీ భావనామయమైన దైవంలో లీనమవుతుందని ఐన్‌స్టీన్ వంటి భౌతిక శాస్త్రవేత్తలు చెప్పడంలోని అంతరార్థం. కాకపోతే ఒకరు ఆ చివర నుండి అంటే - దైవత్వం నుండి భౌతికత అనేది చీలుతున్న చోటుకు వస్తే, మరొకరు, చీలిన చోటు నుండి వెనుకకు ఆ రెండూ ఏకమై వున్న చోటుకు ప్రయాణించారనిపిస్తుంది. (ఇది నా వైయక్తిక దర్శనానికి అక్షరరూపం మాత్రమే. విజ్ఞులు దీనిని ఈ వాక్యాలుగానే భావించ నక్కరలేదు. మరో విధంగాను, వారి వారి దర్శనాన్ని బట్టి నిర్వచించవచ్చు. కాని, నిర్వచనాల సారాంశమిదే అయి వుంటుందని విశ్వసిస్తున్నాను).

పైన ముచ్చటించిన వానిలో పంచభూతాల ఉనికి ఏదో ఒక పద్ధతిలో గమనిక లేక అనుభవంలోకి వస్తున్నాయి. సూర్యుడు ఎలాగూ ప్రత్యక్షంగా

దర్శనమిస్తున్నవాడే. కనుపించని శక్తి ఒక్కటే - ఇంద్రుడు లేక ఇంద్రము. కనుపించనిది, అనుభవానికి భావన ద్వారా మాత్రమే అందివస్తున్నదీ, పంచభూతాల ద్వారా వ్యక్త మవుతున్నదీ అయిన శక్తికే ఇంద్రుడు అనేది పేరు. పై లక్షణాల కారణంగా ఆశక్తి లేదా ఇంద్ర విన్యాసాన్నే ఇంద్రజాల మంటున్నాము. బాగుంది! కాని మానవుని పరిశీలన, జిజ్ఞాస, అన్వేషణలకు ఒక పరిమితి గాని విరామబిందు స్థానం గాని లేదు గదా! అతడి పరిశీలనా పరిధిలోనికి మరో విషయం వచ్చింది, లేదా అతడు గమనించాడు. అది జీవపు పరిణామం. అవే సృష్టి, స్థితి, లయాలు. వీటికి ప్రతీకలుగా బ్రహ్మ విష్ణు మహేశ్వరుల కల్పన. ఇందులో - నిజానికి మూడింటి మూలమూ అంతుపట్టలేదు గాని సృష్టి, లయాల విషయంలో తన ప్రమేయమేమీ లేదని స్పష్టంగా గుర్తించగలిగాడు. అంతమాత్రం చేత స్థితి విషయం తన ఆధీనంలోనికి వచ్చిందని కాదు. కాని, పోషణ అనేది స్థితికి సంబంధించినది గనుక, దాని కవసరమైన పదార్థం తన కృషిలేక లభించని స్థితి వుంది గనుక, అక్కడ - ఆ విషయంలో తన ప్రమేయముందని గుర్తించాడు. అయితే - అంతుబట్టని విషయమేమంటే పదార్థలభ్యతకు మూలమెక్కడ అనేది? పదార్థమంటూ వుంటేనే గదా - తన కృషి వల్లనే అయినా లభ్య మయ్యేది. కొన్ని సందర్భాల్లో అదీ అర్థంగాకనే రాతిలోని కప్పకు ఆహారమెవ్వడిచ్చాడనే ఆశ్చర్యానికి లోనైనాడు. ఏమైతేనేమి - స్థితి ప్రాధాన్యాన్ని విస్మరించ లేని స్థితి. ఆ కారణంగా విష్ణు స్థానం సూర్యుని నుండి ఉపేంద్రునికి బదిలీ అయింది. ఈ ఉపేంద్రుడే సర్వానికీ మూలమందామంటే - ఆ పదమే (ఉప ఇంద్ర), దానికి అవకాశ మివ్వడం లేదు. అలా ఇంద్ర ప్రాధాన్యం అలాగే వుంది. అయితే ఆ ఇంద్రను నియంత్రిస్తున్న దెవరు? చింతన ఇలా సాగి, సాగి మరేమీ చెప్పలేక సర్వేశ్వరుడన్నాము. ఈశ్వర శబ్దాన్ని, సర్వాన్ని తన అధీనము నందుంచు కున్నది లేక సర్వాన్ని ప్రవర్తింపజేసేది అన్నభావనలో సంయోజించడం జరిగింది. మరి, ఈ సర్వేశ్వరునికి ఉనికి ఎక్కడ? తెలియదు? కనుకనే ఈ 'తెలియదు' అన్న దానిని గుర్తించినవానినే జ్ఞాని, ఆత్మయోగి

అన్నాము. అది అలా వుంటే - ఈ తెలియకపోవడం అనేది చీకటి సర్వేశ్వరులెక్కడ వున్నాడని ప్రశ్నిస్తే - అదిగో ఆ 'పెంజీకటికి' ఆవల అన్నారు. మరి అతనిని చేరడమెలా అంటే - ఆత్మ ద్వారా. ఆ అత్మ ఎక్కడ అంటే - నీవే లేక నేనే అనడం జరిగింది. అహం బ్రహ్మాఽస్మి అని- తత్త్వమసి అనే దాని దగ్గర ఆగింది.

ఇదంతా భాషా విన్యాసం. అంటే, అది నేర్చిన, అందులో ప్రవీణులైన- అంటే కేవల భాషావేత్తలని (లింగ్విస్ట్స్) కాదు. అయితే అందులో పారము ముట్టినవారు కాకపోరు - ఆత్మజ్ఞానులైన వారికి మాత్రమే పరిమితం. ఇది అందరికీ అర్థమవుతుందా! ఆ దిశగా కృషి చేయడానికి జీవన స్థితిగతులు సామాన్యులను అనుమతిస్తాయా? మరి వారి ఆర్తికి పరిష్కార మెక్కడ? ఈ స్థితిలో ఆలంబనమైనది ఆరాధన. ఇది పైస్థాయిలో యజ్ఞయాగాదుల రూపం తీసుకోగా, సాధారణుల విషయంలో వివిధములైన ఆరాధనా పద్ధతుల రూపం తీసుకున్నాయి. ఎలాగంటే - యజ్ఞం ఒకవిధంగా కృతజ్ఞతా నివేదనకు సంకేతమైతే సాధారణుల కృతాజ్ఞతా నివేదనం వివిధ రూపాలను పొందింది. అన్నింటి లక్ష్యం ఆహారం లభింప చేస్తున్న వానికి, లేక వాటికి కృతజ్ఞత చూపడం. వ్యవసాయదారుల్లో అది గంగానమ్మ, వారి పనిముట్లుకాగా, ఇతర వృత్తుల వారికి మరోపేరుతో సంభావింప బడే దైవాలూ. వారి వారి పనిముట్లు ఆరాధనీయాలైనాయి. అయితే - ఇది ఎట్టఎదుటి జీవితానికి, మనుగడకు సంబంధించినది. కాని ముందు ప్రస్తావించిన ఆర్తి దీనికి సంబంధించినది కాదు. అది కట్టకడపటి కైవల్యానికి సంబంధించినది. దానికి ఏది దారి?

బుద్ధునికి పూర్వం సామాన్యజనానికి తమదైన ప్రత్యకమైన ఆరాధనా విశేషమొకటి వున్నట్లు ఆధారాలు మృగ్యం. కేవలం బుద్ధి జీవుల యజ్ఞయాగాదిక కార్యకలాపాలకు తమవంతు సేవలను వస్తు రూపంగాను ఇతరత్రాను స్వచ్ఛందంగానో లేదా బలవంతంగానో అందిస్తూ వచ్చి వుండాలి. అందులోనే తమ సాఫల్యం ఇమిడి వుందని భావించారేమో

- తెలియదు. అయితే - అందులో మొదట మొదట స్వచ్ఛంద సహకారమే వున్నా కాల క్రమంలో బలవంతమే చోటు చేసుకుని వుండాలి. అలా గాకపోతే - బుద్ధుడు దానిపై నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం కనుపించదు. ఆయన జంతుబలిని నిరసించా డని చెప్పడం కుదరదు. కారణం - నాటి గ్రామదేవతా పూజాదికాల్లో అది వుంది. దాని పట్ల బుద్ధుడు విముఖత వ్యక్తంచేయడం గాని, నిరోధించడానికి ప్రయత్నం చేసినట్లుగాని కనుపించదు. మొదలు జాతరలలో జంతుబలికి వేరు కారణాలున్నాయి. వాటిని గమనించ కుండా, అహింసావాదుల మనుకున్న వారు నిరోధించే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా మానవుని ప్రవృత్తి, తనకు గల వాటిలో, తాను మేలైనదని భావిస్తున్న దానిని ఇతరులకు కృతాజ్ఞతా పూర్వకంగా సమర్పించడం జరుగుతుంది. జంతుబలి విషయంలో అంత మాత్రమే గాక, అర్పణ తరువాత దానిని ఆహారంగా గ్రహించే ఏర్పాటు కూడా ఇమిడి వుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే - గ్రామదేవతల ఆరాధనలు సాధారణంగా ఫాల్గుణ పౌర్ణమికి జరుగుతాయి. అంటే వేసవికి ముందు. ఈ సంధికాలంలో కోళ్ళకు కొక్కెర వ్యాధి వస్తుంది. అవి చనిపోవడం తప్పదు. అలా అవి నిరుపయోగం కావడం కంటే, ఆహారంగా ఉపయోగపడడం మేలు గదా! అలాగే గొర్రెలు, మేకల విషయానికి వస్తే వర్షా కాల ప్రారంభంలో దొమ్మరోగానికి గురి అవు తాయి. ఈ అంశాలతో పాటు వాటి అపరిమిత మైన వృద్ధి అనర్థానికి కారణమవుతుంది. అలా వాటి క్రయవిక్రయాల్లో మాంద్యం లేక వ్యత్యస్తస్థితి చోటుచేసుకుంటుంది. అది వాటి పెంపకందార్ల ఆర్థికస్థితిని దెబ్బతీస్తుంది. దానిని నిరోధించడానికి ఏకైక ఉపాయం, మ్రొక్కుబడి అని మిషను ప్రజానీకంలో కల్పించి సంఘంలోని ఆయా వర్గాల వారి ఆర్థికస్థితిని కాపాడటం. యాత్రకు వెళ్లి పాత్రకొనాలనే మాటలోని ఆంతర్యాన్ని వివేచించవలసిందిగా మనవి. అంటే - విషయాన్ని విడమరచ కుండా - అలా ఎందుకంటే, విడమరిస్తే దానిని ఆచరించరు. సంఘం వడిదుడుకు ల్లేకుండా నడవడానికి వలసిన అనుసరణను వ్యాప్తిలోనికి తేవడం. నిజానికి

మూఢాచారాలని మనం భావిస్తున్న వాటిల్లోని అంతర్యాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే - వాటి అనుసరణలోని ఆవశ్యకాన్ని గుర్తించ గలుగుతాము. దురదృష్టవశాత్తూ కొరవడింది అదే. వాటిని అనుసరిస్తున్న వారిని మూర్ఖులనడం, వాటిని మూఢాచారాలనడం మాత్రమే మిగిలింది. బహుశా, బుద్ధుడు దీనిని సమీక్షించే - జాతరల సందర్భంలోని జంతు బలిని నిరోధించే ప్రయత్నం చేసి వుండక పోవచ్చును. ఏమైనా ఇది ఊహ మాత్రమే. అలాగాకపోతే, అంటే యజ్ఞ యాగాదుల్లో వినిమయమయ్యే జంతువులను సమర్పించడమనేది వాటి పెంపకందార్ల నుండి, అది వారి విధి అనే మిషతో బలవంతంగా గ్రహించడం గాకపోతే దానిని ఆయన నిరోధించవలసిన అవసరం కనుపించదు. అలాగే వాటి నిర్వహణ నిర్వహించే వారి వైయక్తిక విషయం కాగా, దాని నిర్వహణకు అవసరమయ్యే వస్తుసముదాయం తమ వనరులనుండి కాక, సంఘం నుండి బలవంతంగా గ్రహించడం కూడా మరో కారణమైవుంటుంది. అంతేగాక, వాటి నిర్వహణ వలన ఏదైనా ప్రయోజనం వుందని భావించినా, అది వాటి నిర్వాహకులకు ఒనగూరేదే తప్ప, వాటికి తోడ్పడే వారికి కలిగే ప్రయోజనమేమిటి అనేది కూడా ఆయనను వేధించి, కడకు అది కొందరు స్వప్రయోజన పరులు, పరాన్నభుక్కులు తమ బ్రతుకు దెరువుకు అనువైన మార్గంగా ఎంచుకున్నదిగా ఆయనకు భాసించి, వాటిని నిరోధించడానికి పూనుకున్నాడు. అంతే తప్ప ఆయన దైవాన్ని నిరసించ లేదు. ధర్మంగా, సత్యనిష్ఠతో బ్రతకడమే పరమార్థం తప్ప, మరో మోక్షం లేదన్నాడు. ఆత్మను గూర్చిన వివేచన, ప్రాపంచిక దుఃఖాల నుండి సామాన్యుని విడుదల చేయదు కనుక ఆ విచారం అనవసర మన్నాడు. తాను సుఖంగా బ్రతుకుతూ, ఇతరులను సుఖంగా బ్రతకనిస్తూ, తాను దుఃఖానికి గురికాక, ఇతరులను గురి చేయక బ్రతుకును సాగించడమే మేలైన మనుగడకు పరమార్థ మన్నాడు. ఇందులో ఆక్షేపించదగింది ఏమి లేదు. ఇది క్రొత్తదీ కాదు. 'ఆత్మవత్సర్వ భూతాని' అన్నదానిలోనే ఇది ఇమిడి వుంది. జీవనమార్గంలో సమంగా ప్రయాణించేవానికి ఇది

అనుభవైకవేద్యమే. సమంగా బ్రతుకును కొనసాగించని వానిని, సరియైన మార్గంలోనికి తేవడానికి ఈ బోధలో అవకాశాలు మృగ్యం. ఇది గాక, ఆయన బోధించింది కోరికలే దుఃఖానికి మూలం కనుక కోరికల నుండి దూరంగా వుండమన్నాడు. ఇది మంచిమాటే! కాని సామాన్య జీవికి ఊహకు కూడా అందివచ్చేది కాదు. బహుశా జ్ఞానికి, సర్వసంగ పరిత్యాగికి సాధ్యం కావచ్చునేమో! అయినా అనుమానమే. ఆ కారణంగానే, మొదట మొదట అలాంటి వారే ఆయన అనుయాయులైనా అనంతర కాలంలో తామంటూ తమ ఆహారం కొరకు ఏ శ్రమా చేయడానికి ఇచ్ఛగించని వారే అధిక సంఖ్యలో బౌద్ధభిక్షుకులైనారనేదీ, వారివల్లనే ఈ దేశానికి ఆత్మధృతి, ఆర్జవం దూరమైనాయనేది కూడా అంతే చారిత్రక సత్యం. దానినలా వుంచితే బుద్ధుని బోధ సాదా సీదా సామాన్యునికి దూరమైంది. అంటే అతడి ఆర్తికి దానిలో పరిష్కారం కనుపించలేదు.

ఆ స్థితి అలా కొనసాగుతుండగా, బుద్ధుని బోధనలను ప్రక్కనపెట్టి, ఆయన నిర్యాణానంతరం, ఆయన్ని అనుసరించిన వారు ఆయన్నే దైవంగా పూజించడం ప్రారంభించారు. తమకు సమీప భూత కాలంలో జీవించిన వానిని దైవంగా భావించడ మెలాగా అనేది కొందరికైనా కలిగిన సందేహం. మొదలు బౌద్ధంపై నిరసన కలిగినవారు ఈ స్థితిని వినియోగించుకున్నారు. దాదాపుగా జనుల స్మృతిపథం నుండి తప్పుకొని, లీలగా మాత్రమే, అదీ జనశ్రుతిలో మిగిలిన ఆదర్శవ్యక్తి శ్రీరామచంద్రుని దైవంగా ముందుకు తీసుకువచ్చారు. ఆ విషయంలో కృతకృత్యులూ అయినారు. దీనికి ప్రధాన కారణం బుద్ధుని వలెనే అతడూ ఆదర్శంగా జీవించాడు. ఆయన వలెనే, రాముడూ, క్షత్రియుడే, ఇక్ష్వాకు వంశస్థుడే. పాత, కొన్ని విషయాల్లోనే రోత. తమకు బాగా తెలిసిన, ఎట్టఎదుటనున్న వాని గొప్పదనాన్ని అంగీకరించ నివ్వని మానవుని ఒకానొక సహజాతం, తానెరుగని, చాలా పూర్వపు వాని గొప్పదనాన్ని అంగీకరింపజేస్తుంది. పవిత్రతనూ ఆపాదింప జేసుకొని సంతృప్తి చెందుతుంది. ఇది అందరి అనుభవంలోనిదే కదా! దీనికి మూలం - దానికి ఏ పేరైనా పెట్టండి.

సంస్కార సంబంధమైన సహజాతం తప్ప మరొకటి కాదు. అలా, పాత రోతగాక ఇంపు అవుతుంది. అలా వచ్చిందే రామాయణం. రామవృత్తాంతం ఎన్నడో జరిగింది. రాముడు దేవుడు కావడం, ఆ భావనను మరింత వృద్ధి చేయడానికి వచ్చిన రామాయణం అనేవి బుద్ధుని తరువాత మాత్రమే జరిగాయి. విగ్రహారాధనా బుద్ధుని తరువాతే. బుద్ధుడు భార్యను విడిచి, తండ్రిమాటను కాదని సన్యాసం స్వీకరించాడు. రాముడు భార్యను ఎంతో శ్రమకోర్చి రక్షించుకున్నాడు. తండ్రిమాటను పాటించాడు. మునుల బోధను అనుసరించాడు. సామాన్య గృహస్థుని వలె ప్రవర్తించాడు. ఇంతకంటే సంసారంలోని వారికి కావలసిందేముంటుంది గనుక. ఆ కారణంగా సహజంగా, వాటికి వెలిగా మెలిగిన బుద్ధుని నిరసించిన వారు ముందుగాను, అనుసరించిన వారిలో కొందరు కొంత ఆలస్యంగానూ, బుద్ధునికి ప్రత్యామ్నాయంగా రాముని దైవంగా అంగీకరించారు.

బుద్ధుని అనంతరం బౌద్ధాన్ని ఆనుసరించిన వారిలో - ముఖ్యంగా పరాన్నభుక్కులు ఆ మార్గంలోనే వున్నారు. బుద్ధుడు చెప్పింది ఉత్కృష్ట ధర్మం. కాని, వీరు అనుసరిస్తున్నది స్వార్థధర్మం. కాలంలో కొంత నైచ్యమూ చోటుచేసుకుంది. అది పారతంత్ర్యానికి దారి తీసింది. దీనిని చక్కదిద్దిన వాడు ఆచార్య నాగార్జునుడు. ఆయన బుద్ధుని బోధనలను అనుసరిస్తున్నానని చెపుతూ, శక్త్యారాధనను, దానికి తోడుగా పంచమకారాలను ప్రవేశపెట్టి సంఘంలో బౌద్ధంపై ఏహ్యభావాన్ని కుదురుచేసి అతిత్వరగా ఈ దేశం నుండి అది విడిచి పోయేట్లు చేశాడు. ఎలాగంటే - ఏసుక్రీస్తు తాను ఎహోవా కుమారుడనని చెపుతూ, ఎహోవా తనకు చెప్పిన ధర్మశాస్త్ర బోధననే అనుసరిస్తున్నా నని చెప్పిన మోషేపై జనంలో తిరస్కారభావాన్ని పాదుకొల్పినట్లు! ఆదిశంకరుని ప్రచ్ఛన్న బౌద్ధునిగా పెద్దలన్నట్లు మనకు తెలిసిందే. కాని, అది ఎంత నిజమో తెలియదు కాని, ఆచార్య నాగార్జునుడు మాత్రం ప్రచ్ఛన్నశైవుడనవచ్చు. అతని బోధనల, అనుసరణల ఫలితమే క్రమంగా బౌద్ధచైత్యాలు లంజదిబ్బలుగా మారడానికి, అక్కడ ప్రవచించే మెట్టవేదాంతంగా ప్రజలు

పరిగణించడానికి కారణమైంది. అయితే ఆయన ప్రవేశపెట్టిన శక్త్యారాధనా సంబంధమైన శాక్తేయం సంఖ్యా పరంగా కొందరికే పరిమితమైంది. సామూహికంగా అది ప్రభావితం చేయలేదు. కాని, బౌద్ధం మాత్రం తుడిచిపెట్టుకుపోయింది. శైవం పలు శాఖలుగా (గాణాపత్యం, కాలాముఖ మున్నగునవి) చీలినవైనం. పరిమితంగానైనా వాటి ప్రభావం కనుపిస్తుంది. వాటి ప్రభావమే ఆత్మహననాలు. అంటే - ఇవి కూడా వ్యక్తి నిష్ఠాలే అయినాయి. సాధారణ జనానీకపు ఆర్తికి ఇక్కడా పరిష్కారం లేదు.

బౌద్ధం అమలులో వున్ననాడే పరాయి వారి దండయాత్రలు మొదలైనాయి. తమదైన సంఘటిత శక్తిని ప్రోది చేసుకోవలసిన అవసరం దేశీయపాలకులకు ఆవశ్యమైంది. ఆ దిశగా జనానీకాన్ని ఏకోన్ముఖం గావించడానికి వారిలో స్వధర్మాచరణం పట్ల అనురక్తిని ప్రోది చేసి, దానిని ఒక కర్తవ్యంగా బోధింపవలసిన తరుణం ఆసన్నమైన వేళ వారికి గోచరించిన తరుణోపాయం, వేదోక్తమైనదీ, సనాతనమైనదీ, ఆర్షమైనదీ అయిన బోధకు ఆకృతినిచ్చిన ఆదిశంకరుల బోధ ఒక్కటే. ఇది - ఇది ఒక్కటే 'భారతీయధర్మము' అనే దానిని ముందుకు తెచ్చింది. బౌద్ధ చైత్యాలకు ప్రత్యామ్నాయంగా శివమందిరాల నిర్మాణం ప్రారంభమైంది. ఆరాధనకు, స్తుతికి ఆదిశంకర విరచితమైన రచనలువిశేషంగా తోడ్పడ్డాయి. అలా సామాన్యుని ఆర్తి నివారణకు ఒక కేంద్రమంటూ లభ్యమైంది. అయితే తాను ఇంకా వున్నామంటున్న బైద్ధ, జైనాలు సంఘర్షించడం మొదలైంది. వాటి నివారణకు సంస్కర్తలు తగు ప్రయత్నాలు చేశారు. అలవిగాని చోట బలప్రయోగమూ చోటు చేసుకుంది. ఆదిశంకరుల అద్వైతమొక విశిష్టధర్మము. జీవాత్మ పరమాత్మలు వేరుకావని, రెండూ వ్యక్తి లోనే వున్నాయని, వాటి ఏకీకృత రూపాన్ని, లేక భావాన్ని దర్శించే దిశగా ప్రయత్నించమని ఫలితంగా ఆత్మ సాక్షాత్కారం కలుగుతుందని, కలిగిననాడు భవబంధాల పట్ల తాటస్థ్య భావన ఏర్పడుతుందనీ - అలా సంసారంలో వుంటూనే లౌకిక కార్యకలాపాలను నిర్వర్తిస్తూనే తామరాకుపై నీటి బొట్టువలె భౌతికవాసనలకు దూరంగా వుంటూ, జీవన్ముక్తిని

సాధింపవచ్చునని, అదే దుఃఖాల నుండి విముక్తి, అనే బోధ జరిగింది. అయితే ఈ బోధను మాత్రం సామాన్యజనానీకం వంటపట్టించు కోగలదా? మరి ఈ బోధను జనానీకానికి మరింత చేరువ చేయడం ఎలా?

బోధ ఉదాహరణ పూర్వకంగా జరిగితే తప్ప జనహృదయాలను తాకదు. నిరాకారమూ, నిర్గుణమూ అయిన సర్వాంతర్యామిని దర్శించమంటే - సామాన్యులకు అది ఎలా అందిరాదో, ఉదాహరణ రూపం లేని బోధ ఫలితం కూడా అలాగే వుంటుంది. అయితే -అలాంటి ఆలంబన మొకటి - రామాయణంగా వచ్చినట్లు తెలుసుకున్నాము. కాని, దాని వృత్తం చాల పరిమితము. రాముని, ఆదర్శజీవనం కొనసాగించిన వానిగా గ్రహించగలం. ఒకమాట, ఒకబాణం, ఒక సతి ఆయనకు సాధ్యమైనాయి. నిజమే, బాహుళ్యంలో అది సాధ్యమా? అనుసరణీయం కావచ్చు. కాని, అనుసరణీయమైనదంతా ఆచరణలోనికి రావడం కష్టం. ఒక విధంగా అసాధ్యం. కనుక రామునికంటే, జనానికి దగ్గరైనవాడు కావాలి. తమలాగే జీవించినవాడు కావాలి. తమ జీవితంలో ఎలాంటి వడిదుడుకులకు తాము గురి అవుతున్నారో, అలాగే తన జీవితంలో ఆటుపోట్లును చవి చూసినవాడు కావాలి. భోగాల విషయంలో తమ ప్రవృత్తి ఎలా పై మేతను అభిలషిస్తోందో, అలా అభిలషించిన, భోగించిన వాడు కావాలి.మంది శ్రేయస్సు ఇమిడివున్న చోట, కొంత దుర్మార్గానికి నెట్టుకున్నా ఇబ్బంది గాని, తప్పుకానిలేదన్న భావన గలవాడు కావాలి. ఇన్నెందుకు? అన్ని విధాలా తమకు అనురూపమైన జీవనం గడిపినవాడు కావాలి. వాడిలో తమను చూసు కోవాలి. వాడిని తమ వాడుగా చేసుకోవాలి. అలాంటి వాడెవరు? శ్రీకృష్ణుడు! అతని కార్యక్షేత్రం మహాభారతం! అలా శ్రీమహాభారతం ధర్మాద్వైతభావనకు ఆలంబనంగా తీసుకో బడింది.అలా అది అద్వైతానికే ఆలంబనమైనా, అందలి ప్రముఖులందరూ శ్రీకృష్ణుణ్ణి దైవంగానే భావించినా, అతని చేతలను - అవి అతిలోకవర్తనలైనా - దైవ కార్యాలుగా, మహాత్మ్యాలుగా గుర్తించినా జనులు మాత్రం దానిని వ్యవహార సంబంధమూ, రాజనీత సంబంధమూ, కేవల ధర్మప్రతిష్ఠాపన

సంబంధమూ అయిన విజ్ఞాన సంపుటీకరణంగానే భావించారు తప్ప, శ్రీకృష్ణుని పరదైవంగా తమ మనసుల్లో ప్రతిష్ఠించుకోలేక పోయారు, ఇది జనుల పొరపాటూ కాదు. వ్యాఖ్యానించిన వారి పొరపాటూ కాదు. దానిలో వున్నదదే. దానిని గుర్తించాడు గనుకనే - అంటే "జనులకు వలసినంత సన్నిహితంగా శ్రీకృష్ణుని అనుసంధించలేక పోయాను. దైవంగా వారి మనసుల్లో ప్రతిష్ఠించలేకపోయానన్న భావన తోనే, వ్యాసుడు తిరిగి భాగవతాన్ని ప్రవచింపవలసి వచ్చింది". నారదుని ప్రేరణ దానికొక సాకు మాత్రమే. భాగవత రచనతో జనులకు దైవం కృష్ణునిరూపంలో అంది వచ్చాడు. సాక్షాత్తూ విష్ణుని అవతారమూర్తిగా, అర్చామూర్తిగా గోచరించాడు. అయితే కేవలం రచనతో జనులకు దైవం కృష్ణునిపేరుతో దేవాలయాలు చాలా సకృత్తుగా కన్పిస్తాయి. విష్ణుని ప్రత్యంతరమూర్తులతో - అందునా ముఖ్యంగా నరసింహమూర్తి ఆలయాలే అధికంగా కన్పిస్తాయి. దీనికైన చారిత్రక కారణాలు వేరుగా వున్నాయి.

శివాలయాలు ప్రధానంగా పరేత నిలయాలకు సమీపంలో జలస్థానాల వద్ద కాన వస్తాయి. కారణాలు వివరించవలసిన అవసరం వుందనుకోను. అలా కాని, శివాలయాల్లో ఎక్కువభాగం, ఆయా కాలాల్లో పాలించిన ప్రభువుల సమాధులు లేదా వారి స్మృత్యంకంగా నిర్మించిన స్మృతి మందిరాలు. ఇక నరసింహ ఆలయాల విషయాని కొస్తే - ముఖ్యంగా ఇవి ఆంధ్రదేశంలోను, తమిళ దేశంలోను కన్పిస్తాయి. దీనికి మూలమైన వాడు పల్లవ చక్రవర్తి నరసింహవర్మ. పల్లవులు శాతవాహనుల కూటస్థులు. కాగా, వారి అనంతరం పాలకులై, వారు అనుసరించిన బౌద్ధం నుండి విడివడి, ఆర్షాన్ని ప్రతిష్ఠించడానికి ఉద్యుక్తులై, దానిని ఎదిరించిన వారిపట్ల 'ఉత్పత్తి పిడుగు'లైన వారు. తమ్ముతాము ఏకబ్రాహ్మణులమని చెప్పు కున్నవారు. శంకరుడు గావించిన స్తుతుల్లో విష్ణుపరమైన వాటిలో ప్రముఖమైనది నర సింహాంకితమే గావడం విశేషం. ఇక ఇంతకు మించి ఇక్కడ వివరాలు అనావశ్యకం.

ఇది భక్తితత్త్వాన్ని గూర్చి గతంలోకి మన బుద్ధిని, వివేచనను ప్రసరిస్తే అందివచ్చిన సమాచారం. అది కూడా భారతదేశానికి, ఆంధ్రదేశానికి సంబంధించినది. అయితే ఇది ఇలాగే జరిగిందా అంటే పూర్తిగా అవునని చెప్పలేము. అనంతమైన కాల ప్రవాహంలో చోటుచేసుకున్న వివిధ పరిణామ దశలను సమగ్రంగా క్రోడీకరింపగల చారిత్రక లిఖిత ప్రమాణాలు మనకు లేవు. ఉపలబ్ధమైన సమాచారాన్ని సమీక్షిస్తే అంది వచ్చిన సమాచారం మాత్రమే ఇది. కనుకనే స్థూల వివేచన అనడం. అలాగే ఆయా పరిణామ దశలను బట్టి యావత్తు ప్రజానీకం పైన చెప్పిన సోపాన ప్రకారమే నడిచిందా - అంటే, లేదనే సమాధానం. ఎందుకంటే లోకోభిన్నరుచి, అనే జాతీయం ఎలాగూ వుంది. జనుల రుచి భేదం అలా వుండగా, సమాజంలోని భాగంగా జనులందరూ ఒకటే అయినా, అవగాహనలోని అంతరువులు అనేకం వున్నాయి. అంతరువులను బట్టి ఆచరణా మారడం సహజం. కనుక అందరూ ఒకే గాటలో ఒదుగరు. కొందరు జ్ఞానమార్గాన్ని అనుసరించి అంతర్ముఖులైతే, ఒక కొందరు దైనందిన జపతపాల్లో నిమగ్నమైనారు. మరికొందరు సామూహికంగా భజన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఏమైనా తమ ఆర్తిని బాపుకొనడానికి భక్తిని ఆశ్రయించిన వారి దారులెన్నో అన్ని.

ఈ భక్తిని జనుల్లో వ్యాప్తం చేసినవారు అనుసరించిన మార్గాలు కూడా ఎన్నో. జ్ఞానమార్గంలో తలపండినవారు, అందునా తమలోని భావాలను వ్యక్తీకరింపగల ఉపజ్ఞ, ప్రతిభా వ్యుత్పత్తులు గలవారు ఆ పనిని చేశారు. అలాంటి వారు ముఖ్యంగా తత్త్వాలను గానం చేశారు. మరికొందరు సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, ఆచరణకు అనువైన రీతిలో కీర్తనం గావించారు. మొదలు వారు తమ భావాన్ని వెలువరించ డానికే అది నిర్దేశింప బడినా, అనంతరకాలంలో అవి జనానీకాని కంతటికీ అందివచ్చి అనుసరణీయతను, ప్రచారాన్ని పొందాయి. ఇది ఇలా వుండగా పాలకులు తమ పాలనా పరిధిలోని జనులను ఒక గాటలో వుంచడానికి-

అంటే ఒకవిధమైన ఉత్తమ చారిత్రక శిక్షను, తద్వారా సంఘంలో సుఖశాంతులను ప్రవర్తింప చేయడానికి కూడా భక్తిని ఒక ఉద్యమంగా ప్రచారం గావించడానికి సహకరించారు. ఇది పాలకులకు ఒక అవసరం. కాగా, జనులకు తమదైన ఆర్తికి లభించిన ఒక ఊరట. తెనుగునకు సంబంధించినంత వరకు, చాళుక్య ప్రభువు రాజరాజు నన్నయ చేత శ్రీమహాభారత బద్ధ నిరూపితార్థాన్ని తెచ్చే ప్రయత్నం ఇందులోని భాగమే. దానిని చదివి ఆనందింపగలవారు, ఆకళింపు చేసుకోగలవారు సంఘంలో చాలా కొద్దిమందే. కాని, దాని పరమార్థమేదో అది సామాన్య జనులకు అందిరావడానికి ఆయన పండిత బ్రాహ్మణులకు మహా గ్రహారాలిచ్చి పురాణ ప్రవచనం గావించాడు. అలాగే కవులను ప్రోత్సహించి భారత ఇతివృత్తం ఆధారంగా శ్రీకృష్ణుని మాహాత్మ్యాన్ని సంఘంలోని వివిధ అంతరువు (అంతరువు=స్థాయి) లలోని జనాలకు అంది వచ్చే విధంగా వివిధ ప్రక్రియల్లో రచించే దానికి తోడ్పడ్డాడు. ఇది ఒక బృహత్తర ఉద్యమం. అలా హరికథలు, భాగవత మేళాలు, యక్షగానాలు, వీధి భాగవతాలు - ఒకటని లేదు - జనుల అభిరుచులకు అనుగుణంగా ఎవరికేది హత్తుకుంటుందో వారికి ఆ విధమైన పద్ధతిలో అందివచ్చేట్లు రచింపించి, ప్రదర్శనలకు శ్రీకారం చుట్టి ప్రచారం గావించడమనేది ఇక్కడే మొదలైంది. బౌద్ధానికి సంబంధించిన ఆంధ్రనాట్యం - ఆర్షానికి సంబంధించి ఆలయ సంప్రదాయనృత్యంగా పరిణమించడానికి నాంది అక్కడే జరిగింది. ఆ తరువాత తెనుగులో భాగవత రచన మరింత తోడ్పడింది. దీనిని వైష్ణవంగా భావించిన శైవులు తమదైన పద్ధతిలో శివభక్తుల గాథలను ప్రచారం గావించారు. సంఘర్షణలను పక్కన పెడితే - అన్ని ఉద్యమాల లక్ష్యం జనులలో భక్తిని పాదుకొల్పడమే. మార్గాలే వేరు.

సంఘర్షణలను గమనించిన వారు ముఖ్యంగా వేమన, కబీర్, సంత్‌జ్ఞానేశ్వర్, వీరబ్రహ్మం గారి లాంటి తత్త్వోపదేశం గావించి, వాటి తీవ్రతను తగ్గించడానికి తోడ్పడ్డారు. ఇక మరికొందరు తమ ఇష్టదైవాలకు,

క్షేత్రాలకు ప్రాముఖ్యాన్ని ప్రాధాన్యాన్ని సంతరించి పెట్టారు. ఇందులో కూడా శైవ, వైష్ణవాలు రెండూ వున్నాయి. పాల్కురికి సోమన, శ్రీనాథుడు, ధూర్జటి వంటివారు శైవానికి ప్రాధాన్యమిచ్చి, శ్రీశైలం, కాశీ, ద్రాక్షారామం, శ్రీకాళహస్తి వంటి క్షేత్రాల ప్రాధాన్యాన్ని ఉగ్గడిస్తే, త్యాగరాజు, రామదాసు వంటివారు శ్రీరామచంద్రునికి అంకితమై తమ పుట్టుకను సార్థకం చేసుకున్నారు. తిరుమలకు, తిరుమలేశునికి అంకితమైన వాడు అన్నమయ్య, కామిగాక మోక్షగామి కాడు అన్న వేమన మాటను ఆలంబనం చేసుకొని అన్నమయ్య అటు శృంగార సంకీర్తనలను, ఇటు అధ్యాత్మ సంకీర్తనలను సంతరించాడు. ఆయనకు అన్నింటికీ అయినవారు అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులే. వారి కీర్తనంతో తాను తన్మయుడై, పునీతుడై, తిరుమల క్షేత్రానికి అనిర్వచనీయమైన పవిత్రతను ఆపాదించి, తన కీర్తనామృతంతో యావదాంధ్రదేశాన్ని పునీతం గావించిన ధన్యుడు అన్నమయ్య.

ఇట్లెందరో మహానుభావులు, తమ తోడి జనుల ఆరాటాన్ని, ఆర్తిని పోగొట్టడానికి భక్తినుద్బోధించి మానవాళి కృతజ్ఞతకు పాత్రులైనారు. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రాకృతుల పారమార్థిక జీవనయానానికి చేదివ్వెలు పట్టుకొని మార్గదర్శనం చేశారు. చేస్తున్నారు. ఎట్టఎదుటిది జీవితం, కట్టకడపటిది కైవల్యము. నట్టనడిమిది నాటకం. ఈ నాటకంలో తనవంతు పాత్రను సుఖదుఃఖమిశ్రమంగా అభినయించి, జీవుని వేదనా పరిసమాప్తికి గమ్యస్థానమైన కైవల్యాన్ని చేరుకోవడానికి, ఆత్మపరితృప్తిని సాధించడానికి అనువైన భక్తిని, తరుణోపాయంగా చూపి మార్గదర్శకులై తమ జీవితాలతో పాటు సహ మానవుల జీవితాలను పునీతం గావించుకోవడానికి ఆవిధంగా తోడ్పడి తమ పుట్టుకను సార్థకం చేసుకున్న మహానుభావులు ఎందరో.

★ ★ ★

**ముదివేడు ప్రభాకరరావు**

# భక్తి రసప్రస్థానానికి అన్నమయ్య చేసిన దోహదం

భక్తి ద్రావిడ, ఉపజీవ్యతపాయా ఉత్తర రామానంద్ ।
ప్రగత్ కియా కబీర్‌నే, సప్తద్వీప నవఖండ్ ॥[1]

భక్తి, దక్షిణ భారతదేశంలోగల ద్రావిడదేశంలో అంటే తమిళ నాడులో పుట్టింది. అది ఉత్తర భారత దేశంలో రామానందులవారి చేత ఉజ్జీవింప జేయబడింది. ఆయన శిష్యుడైన సంత్ కబీర్‌దాస్ భక్తిమార్గాన్ని ప్రగతి పథంలో పయనింపజేసి, ఏడుద్వీపాలకు, తొమ్మిది ఖండాలకు దాన్ని వ్యాపింప జేశాడు.

## మధ్యకాలీన భక్తి ఉద్యమం

పై ప్రాచీన పరంపరాశ్లోకంలో 'భక్తి' యొక్క ఆవిర్భావ, వికాసాల చరిత్ర స్థూలంగా ప్రస్తావించబడింది. మైలురాళ్ల వంటి మూడు కాలఘట్టాలు క్రీ.శ. 12వ శతాబ్దం నుండి క్రీ. శ. 18వ శతాబ్దం వరకు అంటే దాదాపు 600 సంవత్సరాల కాలాన్ని ఆక్రమించి వుందని చెప్పవచ్చు. భారతదేశ చరిత్రలో మధ్యకాలీన యుగం (medieval period)లో భక్తి ఒక ఉద్యమస్థాయికి (Bhakti movement) చేరుకొన్నదని చరిత్రకారులు నిర్ణయించారు.[2] దానితో వైష్ణవ భక్తి విశ్వవ్యాప్తమైంది. మధ్యయుగంలో అంతకుముందు ఎన్నడూ లేనంతగా అన్ని రంగాలలో మహా పురుషులు జన్మించి భారత భూమిని మరింత పునీతం చేశారు. భక్తి ఉద్యమం భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించింది. ఈ ఉద్యమం వేసిన పటిష్ఠమైన పునాది మీదనే మహాత్మాగాంధీ స్వాతంత్ర్యాన్ని సాధింప గల్గారు.

## భక్తి ఉద్యమం సాధించిన సామాజిక ప్రయోజనం

స్వాతంత్ర్యోద్యమ కాలంలో భక్తి త్రివిక్రమావతారాన్ని ధరించింది. దైవభక్తి, దేశభక్తి, ఆత్మశక్తి. దైవ భక్తిని దేశభక్తిగా మలచుకొన్న ఆత్మశక్తి గల కర్మయోగులు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టారు. ఈ విధంగా భక్తికి గల గొప్ప సామాజిక ప్రయోజనం స్వాతంత్ర్యసిద్ధిచే నిరూపింప బడింది.[3]

భక్తికి చిట్టచివరి ఫలం మోక్షం! ఇది ఆధ్యాత్మికం! వైయక్తికం! దీనితోపాటు, భౌతికమైన బానిసత్వం నుండి 'విడుదల' (liberation from slavery) కూడ 'భక్తి' సాధింపగలదని మహాత్మాగాంధీ నిరూపించారు. దీనిచే భక్తికి గల శక్తి ఒక సామాజిక చైతన్యంగా పరిణమించిన తీరు ప్రస్ఫుటమైనది.[4]

ఈ నేపథ్యంలో, భక్తి ఒక భావంగా, ఒక తత్త్వంగా, ఒక యోగంగా, ఒక రసంగా పరిణమించడానికి ఎన్నెన్ని దశాప్రభేదాలతో పయనించిందో పరిశీలించవచ్చు. విశేషించి భక్తిని ఒక రసత్వస్థాయికి తీసుకొని రావడంలో అన్నమయ్య చూపిన మౌలికప్రజ్ఞ, ఉపజ్ఞలు ప్రస్తుతాంశం!

అన్నమయ్యకు పూర్వమే భక్తి ఒక భావంగా, తత్త్వంగా యోగంగా మహాకవులచే నిరూపింపబడింది. పాల్కురికిసోమన వీరశైవభక్తిని, పోతనామాత్యుడు వైష్ణవభక్తిని బహు ముఖాలుగా నిరూపింపగా, అన్నమయ్య ప్రథమాంధ్ర వాగ్గేయకారుడుగా, శ్రీపతి పదభక్తిని పదసాహిత్యంలో నిరూపించి 'భక్తి' కూడ 'రసమే' నని ఉత్తర భారతదేశంలో భక్తిరస లక్షణ గ్రంథాలు రావడానికి కొన్ని సంవత్సరాలకు ముందే లక్ష్యాలను పదసాహిత్యంలో సృష్టించడ - మే ఆయన యొక్క మౌలికప్రజ్ఞ, ఉపజ్ఞగా ఈ వ్యాసం ప్రతిపాది స్తున్నది. ఈ దృష్టితో భక్తి రస ప్రస్థానాన్ని మూడు ఘట్టాలుగా వింగడించవచ్చు.

1. అన్నమయ్యకు పూర్వస్థితి (Pre - Annamayya period of Bhakti)

2. అన్నమయ్య పదకవితా ప్రస్థానంలోని భక్తిరస నిరూపణ (Annamayya's contribution towards Bhakti Rasa)
3. అన్నమయ్య తర్వాతి స్థితి (Post - Annamayya period of Bhakti)

## భక్తిరస ప్రస్థానం - అన్నమయ్యకు పూర్వస్థితి

ఈ పూర్వ పరిస్థితి వివేచనలో నాల్గైదు అంశాలు చోటుచేసు కొన్నాయి.

1. వేదపురాణేతిహాసాలలో భక్తి
2. సంస్కృత సాహిత్యంలో భక్తి
3. ఆలంకారికుల వివేచన - తీర్మానాలు.
   (a) అద్వైతాలంకారికులు - శాంతరసం
   (b) వైష్ణవాలంకారికులు - భక్తిరసం
4. శైవ, వైష్ణవ సంప్రదాయాలలో భక్తి
   (a) ఆళ్వారులు, నాయన్మారులు (b) ఆచార్యులు
5. తెలుగు సాహిత్యంలో భక్తి - నన్నయ నుండి అన్నమయ్య వరకు

## వేదాలలో భక్తిబీజాలు

నిజమాలోచిస్తే వేదకాలం నుండే భక్తి ఉన్నది. కాని, అవి ఏ దేవత కాదేవతా స్తుతులుగా వ్యస్తంగా ఉన్నాయి. ఉదాహరణకు ఋగ్వేదంలోని వరుణదేవతాకమైన ఋక్కులలో (VIII 86-2, 3, 4) జీవుడు తనను పాపాల నుండి విముక్తిని ప్రసాదించమని స్తుతించే ఘట్టం భగవంతుడు క్షమాగుణం కలవాడని తెలుపుతుంది. దీనిని బట్టి - "భక్తిః ప్రమేయా శ్రుతిభ్యః"[5] భక్తి ప్రమేయం గలవే వేదాలని స్పష్టమౌతున్నది. వేదస్తుతులన్నీ భక్తిబీజాలను గర్భీకరించుకొన్నవే!

## పురాణాలలో భక్తిస్వరూపం

వేదాలలోని స్తుతులు, క్షమాపణలు రూపుకట్టి భక్తి ఒక 'భావన'గా గుర్తింపబడిన కాలంలో వెలసిన పురాణాలలో భక్తిని నిర్వచించడానికి ప్రయత్నం చేయబడింది.

'భజ' ఇత్యేష వై ధాతుః సేవాయాం పరికీర్తితః ।
తస్మాత్ 'సేవా' బుధైః ప్రోక్తా 'భక్తిః' సాధన భూయసీ ॥[6]

అని 'గరుడపురాణం' లో తొలిసారిగా భక్తికి నిర్వచనం కనబడుతుంది.

"భజసేవాయామ్" అని వ్యుత్పత్తి. 'భజ్' అనే ధాతువు 'సేవ' అనే అర్థంలో ప్రయుక్తమౌతున్నది. దీనికి 'క్తిన్' అనే కృత్‌ప్రత్యయం చేరగా, భజ్ + క్తిన్ = భక్తి అనే రూపం సిద్ధిస్తున్నది. పెద్దలను సేవించు కోవడంలో 'భక్తి' ఒక సాధనంగా ఉన్నదని పండితులుచెబుతారు. "పూజ్యేషు అనురాగో భక్తిః" పూజనీయులైన పెద్దల పట్ల గల ఆదరణీయ భావమే భక్తి అనబడుతుంది.

వ్యాసుని భాగవత మహాపురాణంలోని, ప్రథమస్కంధంలో, 7వ అధ్యయం, 4, 5, 6 శ్లోకాలలో 'భక్తియోగ' మనే పదబంధం రెండుసార్లు వాడబడింది. ఈ శ్లోకాలను పోతనగారు భాగవతంలో అనువదిస్తూ- "వ్యాసుడు తన మదిం దిరంబు సేసికొని భక్తియుక్తంబైన చిత్తంబున.... నారాయణ భక్తి యోగంబునగాని అనర్థంబుల కుపశమనంబు లేదని"[7] నిశ్చయించినాడు. ఈ సందర్భంలో 'మాయా' శబ్దం రెండుసార్లు వాడబడింది. పోతనగారు అద్వైతి. స్మార్తుడు. విష్ణుదేవతాకమైన భాగవతాన్ని అద్వైత భాష్యమైన శ్రీధరీయ దృష్ట్యా నిరూపించాడు. దీన్నిబట్టి చూడగా- "అపరిపక్వమైన కర్మలు పరిపాకదశకు వచ్చేవరకు జీవులు వాసనా రూపకర్మలతో కూడుకొని 'మాయ'లో ఉంటారు. ఇటువంటి మాయా విశిష్టమైన బ్రహ్మస్వరూపం నిశ్చలం. అది తరంగాలు లేని సముద్రం వంటిది. నిర్వికారమూ, నిశ్చలమూ, స్థాణువైన ఆ బ్రహ్మమే శివుడు"[8] అని సురేశ్వరాచార్యుల నిర్వచనం. ఈ స్థాణువైన శివుడు స్థిరభక్తి యోగ సులభుడని కాళిదాస మహాకవి ఎప్పుడో విక్రమోర్వశీయం నాందీశ్లోకంలో- 'సస్థాణుః స్థిర భక్తియోగ సులభో నిశ్శ్రేయస సాయాస్తువః' అని చెప్పి ఉన్నాడు.

ఇక్కడ మరో ముఖ్య విషయం గమనించాలి. అద్వైతి, స్మార్తుడైన పోతన శివకేశవులకు భేదం పాటింపనివాడు. కనుక, శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్ అని అద్వైతుల కైవల్యానికే పెద్దపీట వేస్తూ, స్థిరభక్తియోగ సులభమైన శివ కైవల్యం చేరుకోవడానికి "నారాయణ భక్తియోగం" ఒక సాధన మార్గమని నిష్కర్షించాడు. అందుకే పోతన తన భక్తిమార్గంలోని ప్రత్యేకత చెప్పనే చెప్పాడు. శివ ధ్యానం చేస్తుండగా శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమై భాగవతం వ్రాయమని కోరగా పోతన ఏమన్నాడో చూడండి.

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని'

పూజించేది శివుణ్ణి, కీర్తించేది హరిని. ఇది అద్వైత సంప్రదాయంలోని శివకేశవులకు గల అభేద ప్రతిపత్తి. 'శివస్య హృదయం విష్ణోః విష్ణోశ్చ హృదయం శివః' అనే పురాణ వాక్యాన్నే పోతనగారు అనుసరించారు. భాగవతం లోని గోపికాగీతలు, భ్రమర గీతలు, ఉద్ధవగీత, రాసలీలలు వైష్ణవ మధురభక్తికి పతాకాలుగా రెపరెపలాడుతున్నాయి. పోతనగారి అడుగు జాడల్లో నడిచి కృతకృత్యుడైన వాడే అన్నమయ్య కూడ.

## ఇతిహాసాలలో భక్తి

రామాయణ, మహాభారతాలు ఇతిహాసాలు. రామాయణంలో రామభక్తి, మహాభారతంలో కృష్ణభక్తి నిరూపితమైంది. రాముడు భగవంతుడని వాల్మీకి సూచ్యార్థ సూచకంగాచెప్పగా, అధ్యాత్మ రామాయణాదులు రాముని సచ్చిదానంద పరబ్రహ్మముగా స్థాపించాయి. 'రామ' శబ్దం 'బ్రహ్మము'నకు పర్యాయపదంగా కవులు కీర్తించారు.[10] గుహుడు, అహల్య, శబరి, సుగ్రీవుడు, హనుమంతుడు, విభీషణుడు, చిట్ట చివరికి సీతకూడా రాముని దేవునిగా సంభావించడం కవుల భక్తి సాహిత్యసృష్టికి గొప్ప ఆధారం లభించింది. ముఖ్యంగా అధ్యాత్మ రామాయణంలోని

'అహల్యాకృత రామస్తవం' భక్తిస్తోత్రాలకు పరాకాష్ఠగా నిలుస్తున్నది. ఈ విధంగా రామభక్తి సామ్రాజ్యం ఏర్పడింది. శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీమద్రామాయణం 'దీర్ఘశరణాగతి'కి ఉపాదేయమైన మతగ్రంథంగా పరిణమించింది. ఒక ఇతిహాసం మతగ్రంథంగా మారడానికి 'భక్తి' కీలకమైన పాత్ర నిర్వహించడం ఒక్క భారతదేశానికే చెల్లింది. ప్రపంచంలో ఏ ఇతిహాసమూ మతగ్రంథంగా మారిన దాఖలాలు లేవు.[11]

కృష్ణభక్తిసామ్రాజ్యానికి పునాదులు వేసిన మరో ఇతిహాసం వ్యాస మహాభారతం. ఇందులో శ్రీకృష్ణుడే నాయకుడు. దాన్నినిరూపించే అంశం 'భగవానువాచ'గా వెలువడిన 'భగవద్గీత'. దీనితో ఆలంకారికుడైన ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకంలో "భగవాన్ వాసుదేవశ్చ కీర్త్యతేఽత్ర సనాతనః"[12] సనాతనమైన వాసుదేవ పరబ్రహ్మము ఈ మహా భారతంలో కీర్తింప బడిందని వ్రాశాడు. ఈ గీతాచార్యులవారు గీతాబోధలో భక్తియోగానికే పెద్దపీట వేశారు. యుద్ధరంగంలో 'భక్తియోగోపదేశ' మేమిటనే సందేహం వస్తుందని ముందుగానే ఊహించిన శ్రీరామానుజాచార్యుల వారు గీతాభాష్యంలో 'భక్తియోగ' మనే అధ్యాయానికి వ్రాసిన 'అవతారిక'లో దాన్ని యిలా సమర్థించారు.

"పాండుతనయ యుద్ధప్రోత్సాహన వ్యాజేన మోక్షసాధనతయా 'స్వవిషయం' భక్తియోగ మవతారయామాస."[13] పాండురాజు కుమారుడైన అర్జునుని యుద్ధానికి ప్రేరేపించే మిషతో తన భక్తులకు మోక్షాన్ని సాధించి పెట్టేదైన 'భక్తియోగ'మనే తన 'సొంత గోడు'ను చెబుతున్నాడు ! 'అవకాశం దొరికిందిరా!' అంటే దేవుడు గూడ తన 'సొంతగొడవ' చెప్పకుండా వదలడని రామానుజుల వ్యాఖ్యానం. ఆయన 'సొంతగొడవ' ఏమిటంటే తనకూ తన భక్తులకు ఉన్న సంబంధాన్ని వివరించడం. భగవంతునికి, భక్తునికి నవవిధ సంబంధా లుంటాయని భక్తియోగం అధ్యాయం9, 17-18-24 శ్లోకాలలో ప్రతిపాదిస్తూ శ్రీరామానుజులు వ్యాఖ్యానించారు. అవి పితాపుత్ర, రక్ష్యరక్షక, శేషిశేషి, భార్యభర్తృ, జ్ఞాతృజ్ఞేయ, స్వస్వామి,

ఆధారఆధేయ, శరీర ఆత్మ, భోక్తృభోగ్యములనే తొమ్మిది సంబంధాలు. వీటినే నవవిధసంబంధమనే రహస్యగ్రంథంగా తెంగలైశాఖలోని పిళ్లైలోకాచార్యులు వ్రాశారు.[14] ఈ విధంగా భగవద్గీతతో భారతఇతిహాసం 'భక్తిగ్రంథం'గా మలచ బడగా, శ్రీవైష్ణవాచార్యులు దాన్ని 'మతగ్రంథం'గా ముద్రవేశారు. దానితో కృష్ణభక్తి సామ్రాజ్యానికి ద్వారాలు తెరచినట్లయింది.

## సంస్కృతసాహిత్యంలో భక్తి

భాసుడు రామ, కృష్ణావతారాలను ప్రధానీకరించుకొని, రామాయణ, భారత, భాగవత నాటకాలు వ్రాశాడు. కాళిదాసు శివభక్తి తత్పరుడనేది స్పష్టం. నిరూపించనవసరంలేదు. కాని, ఈయన విశిష్టంగా చెప్పిన మాట రససంఖ్యకు సంబంధించినది. విక్రమోర్వ శీయనాటకంలో ఆయన భరతముని ప్రోక్తమైన రసములు ఎనిమిది అని స్పష్టంగా చెప్పాడు.[15] కాబట్టి, కాళిదాసు కాలంనాటికి 'అష్టరస' వాదమే ప్రఖ్యాతంగా ఉందని నిర్ణయింపబడింది. దీనికి తర్వాతి కాలంలో రామాయణ,భారత, భాగవతాల ప్రభావంతో అద్వైతులైన ఆలంకారికులు శాంతరసాన్ని చేర్చగా, వైష్ణవులైన ఆలంకారికులు భక్తిరసాన్ని చేర్చి రసములు 'పది'గా చేసి పదిలంగా మనకందించారు.[16] ఈ లక్ష్యాలకు లక్షణాలను సమకూర్చిపెట్టిన సాహిత్యంలో భవభూతి, దిఙ్నాగుడు, మురారి, జయదేవుని వంటి నాటక కర్తలు 'రామభక్తి'ని ఉద్దీప్తం చేశారు. శ్రీ ఆదిశంకరుల స్తోత్రసాహిత్యం భక్తిమార్గాన్ని ఎంతో ప్రభావితం చేసింది. సౌందర్యలహరి శాక్తేయ భక్తిని, శివానందలహరి శివభక్తిని, కరావలంబ స్తోత్రం నృసింహభక్తిని, భజగోవిందం విష్ణుభక్తిని నిరూపించాయి. శివ పంచస్తవి, దేవీ పంచస్తవి శివశక్తుల స్తోత్రాలు కాగా, జయదేవుని (క్రీ.శ.12వ శతాబ్దం) గీతగోవిందం, సంగీత సాహిత్య, నాట్యరంగాలలో కృష్ణభక్తి ప్రచారంలో యావద్భారత దేశాన్ని ఉఱ్ఱూతలూపిన గ్రంథం. క్రీ.శ.13వ శతాబ్దంలో లీలాశుకుని శ్రీకృష్ణ కర్ణామృతం, 'భక్తి'ని రూపుకట్టించిన మరో ఉత్కృష్టగ్రంథం.

## అలంకారికుల వివేచన - అద్వైత, వైష్ణవాలంకారికులు

భారతీయ అలంకారికుల్ని రెండు విధాలుగా వింగడించవచ్చు. 1.అద్వైతా లంకారికులు, 2. వైష్ణవాలంకారికులు . భరతముని చెప్పిన అష్టరసాలకు అద్వైతులు శాంత రసాన్ని తొమ్మిదవ రసంగా చేర్చారు. క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన సహృదయదర్పణ కర్త భట్టనాయకుని కాలంలో శాంతరసప్రకరణం వ్రాయబడి భరతనాట్యశాస్త్రంలో కలప బడిందని పరిశోధకులు నిర్ధయించారు.[17] శ్రీరామానుజాచార్యుల (క్రీ.శ. 1017-1137) కు పూర్వం అంటే క్రీ.శ.12వ శతాబ్దం వరకు ఆలంకారికు లందరూ అద్వైతులే. వీరు జగత్తు మిథ్య, బ్రహ్మమే సత్యంఅనేవారు. వివర్తవాదులు 'మాయా'వాదులు. రసతరంగిణీ కర్త భానుదత్తుడు మాయారసాన్ని చెప్పాడు. శాంతంనివృత్తి రసం. మాయ ప్రవృత్తి రసం అని చెప్పి, దానికి స్థాయీ భావం మిథ్యాజ్ఞాన మన్నాడు. కాని, ఈ వాదం నిలువలేదు.

ఆనందవర్ధనుడు (క్రీ.శ. 8వ శతాబ్ది) 'ధ్వన్యాలోకం'అనే అలంకార శాస్త్రగ్రంథంలో రామాయణంలో ఆదికవి వాల్మీకి కరుణరసాన్ని సమగ్రంగా పోషించాడని, మహాభారతంలో మోక్షమనే నాల్గవ పురుషార్థాన్ని సూచించే శాంతరసమే ప్రధానంగా పోషింపబడిందని చెప్పాడు. శ్రీకృష్ణుడే నాయకుడన్నాడు.

క్రీ.శ. 920-1020 మధ్యకాలంలో ఉన్న అభినవగుప్తపాదులు, భరతుని నాట్య శాస్త్రానికి 'అభినవ భారతీ' వ్యాఖ్య వ్రాసేనాటికి 'శాంతరసప్రకరణం' అందులో ఉన్నది. కాశ్మీర శైవ పీఠాధిపతి, బహుముఖ ప్రజ్ఞాశాలియైన ఈ అభినవగుప్తుడే ధ్వన్యాలోకానికి 'లోచన'మనే పేరుతో వ్యాఖ్యవ్రాసి, అందులో మహాభారతంలో అంగిరసం శాంతమని సమర్థించి, తొమ్మిదవ రసంగా స్థాపించాడు.

శ్లో॥ అష్టానామిహ దేవానాం శృంగారాదీన్ ప్రదర్శయేత్ ।
మధ్యేచ దేవదేవస్య శాంతం రూపం ప్రకల్పయేత్ ॥

అష్టదళపద్మం అష్టరసాలైతే, ఆ పద్మం యొక్క 'కర్ణిక' శాంత రసం అని సమన్వయించాడు. అష్టదిక్పాలురు అష్టరసాలకు ప్రతీకలైతే అష్టమూర్తియైన శివుడు 'పద్మకర్ణిక'లోని శాంతరసాధి దేవతగా చెప్పాడు. ప్రపంచ ప్రఖ్యాత మనస్తత్వ శాస్త్రవేత్త C.G.యూంగ్ దీన్ని Unifying symbol అని చెప్పగా, ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావుగారు ఇది 'తంత్రశాస్త్రార్థ గుంఫితం' అన్నారు.[18] కాకతీయ శిల్పాలలో (క్రీ.శ. 12వశతాబ్ది) నడి బొడ్డుతో అష్టదళాలున్న రాతిశిల్పాలనేకం కనబడుతాయి. బౌద్ధమతంలో అష్టదళపాద పద్మారాధనం ప్రసిద్ధం. దానికి తగినట్లుగానే శాంతరసానికి స్థాయి భావం తత్త్వజ్ఞానం లేదా తృష్ణాక్షయసుఖం అన్న ఆనందవర్ధనుని అభినవుడు సమర్థించాడు.[19] అన్ని రసాలు శాంతంలోనే పుట్టి, శాంతంలోనే పెరిగి, చివరికి శాంతంలో లయిస్తుందన్నాడు. అందుకే అది మహారస మన్నాడు.

చిట్టచివరి ఆలంకారికుడైన జగన్నాథ పండితుడు (క్రీ.శ.1620- 1700) ఆంధ్రుడైనా, ఉత్తర భారత దేశంలో మొగల్ చక్రవర్తి షాజహాన్ ఆస్థాన పండితుడైనా, శ్రీమద్రామానుజులకు తర్వాతి వాడైనా, రసగంగాధరమనే గ్రంథంలో 'భక్తి'కి రసత్వం విషయమై మొట్టమొదట సమర్థించి, చిట్టచివరికి 'భక్తి' ఒక భావమే తప్ప 'రసం' కాదన్నాడు. ఎందుకంటే, అది భరతముని అభిప్రాయానికి విరుద్ధం కాబట్టి కుదరదన్నాడు. కారణం, ఇతడు అభినవగుప్తుని వేదాంతిమతం అనుసరించినవాడు. అద్వైతి, స్మార్తుడు. "భగ్నావరణాచి దేవరసః" అని అద్వైతముఖంగా రసవివేచన చేసినవాడు. అందుకే శాంతరసాన్ని అంగీకరించాడు. నవరసాలనడమే ప్రసిద్ధి తప్ప దశరసాలు లేవన్నాడు.

దశావతారాలను అంగీకరించినప్పుడు దశరసాలు ఎందుకుండ కూడనేది వైష్ణవాలంకారికులవాదం. అష్టదిశ లేకాదు, దశదిశలు కూడా ఉన్నాయి కదా? పరతత్త్వంపై గల అనురక్తిని భక్తిగా ఎందుకు చెప్ప కూడదు అందుకే వారు భరతనాట్యశాస్త్రంలో భక్తిరస ప్రకరణం లేకపోయినా

విడిగా భక్తికి రసత్వాన్ని నిరూపిస్తూ లక్షణ గ్రంథాలు వ్రాశారు. భక్తిరసలక్షణ గ్రంథకర్తలు ఔత్తరాహికులైన చైతన్య సంప్రదాయంలోని పండితులు. వారు అన్నమయ్యకు యించుమించు సమకాలికులు కావడం విశేషం.

## అన్నమయ్యకు పూర్వకాలికులు సమకాలికులైన ఉత్తర భారతదేశపు వైష్ణవాచార్యులు

అందమైన రామానుజ సంప్రదాయాన్ని ఉత్తర భారతదేశంలో రామానందీయ సంప్రదాయంగా విలసిల్ల జేసిన ఆచార్యుడు రామానందుడు. అన్నమయ్యకు పూర్వమే ఉత్తర భారతదేశంలో రామభక్తిలో రసిక సంప్రదాయాన్ని ప్రవర్తింప జేసినవాడు రామానందుడు (క్రీ.శ. 1299-1410) భక్తి ద్రావిడ దేశంలో పుట్టినా ఉత్తర భారతంలో రామానందులచేత ఉజ్జీవింప జేయబడిందని పండితులంటారు.[20]

## రామానందుడు (క్రీ.శ.1299-1410)

శ్రీరామానుజులు చెప్పిన లక్ష్మీనారాయణుల స్థానంలో రామానందుడు సీతారాములను స్థాపించాడు. దీనితో భగవంతుడు ప్రజల కత్యంత సన్నిహితుడయ్యాడు. ఈయనకు 500 మంది శిష్యులుండే వారు. జాతి మత కుల వివక్ష లేకుండ అందరినీ శిష్యులుగా స్వీక రించాడు. రైదాస్ అనే పంచముడు, కబీర్‌దాస్ అనే మహమ్మదీయుడు వారి శిష్యులలో ముఖ్యులు. ఈయన శిష్యుడు నరహరియానంద శిష్యుడే తులసీదాసు. రామభక్తిని మాత్రమే స్థాపించడానికి వ్రాయబడిన మహాకావ్యం గోస్వామి తులసీదాస విరచిత రామచరిత మానసమైతే, రామానందీయ రహస్య సంప్రదాయంలో పుట్టిన మహాకావ్యం భుశుండి రామాయణం.[21] దీనికే రామభాగవతమని పేరు. "రామస్తు భగవాన్ స్వయమ్" రాముని సర్వోత్కృష్టతను, సర్వేశ్వరిగా సీతను నిరూపించిన సంస్కృత మహాకావ్యం. రాముని నిత్యవిభూతి, లీలావిభూతులను వర్ణించిన విలక్షణ కావ్యం.

## నింబార్కాచార్యులు (క్రీ.శ. 1100- 1162)

ఉత్తరభారతదేశంలో రామభక్తి తర్వాత కృష్ణభక్తి సంప్రదాయ ప్రవర్తకుల్లో అగ్రేసరుడు నింబార్కాచార్యులు. (క్రీ.శ.1100-1162) ఇతడు ద్వైతాద్వైత సిద్ధాంతప్రవక్త. సనకసంప్రదాయాన్ని స్వీకరించిన వాడు. ఇతడు ఆంధ్రుడు. కృష్ణభక్తుడు. కృష్ణుడు జన్మించిన మధురానగరానికి వెళ్లి అక్కడే జీవితాంతం ఉండిపోయాడు. ఇతడు మహావిష్ణువు సుదర్శన చక్రావతారమని భక్తుల విశ్వాసం. అందుకే ఈయన సిద్ధాంతానికి సుదర్శన సంప్రదాయమని పేరు.

శ్రీరామానుజులు వైష్ణవంలో లక్ష్మీనారాయణులు అధిష్ఠాన దేవతలుగా చెప్పితే వారిస్థానంలో రాధను కృష్ణుని పత్నిగా నిరూపించి రాధాకృష్ణులను అధిష్ఠాన దేవతలుగా చేసిన ఖ్యాతి నింబార్కాచార్యులకే దక్కింది. దీనిచే ప్రజలకత్యంత చేరువగా భగవంతుడు రాగలిగాడు.

శ్లో॥ నాన్యాగతిః కృష్ణ పదారవిందాత్  
సందృశ్యతే బ్రహ్మ శివాది వందితాత్ ।  
భక్తిశ్చయోపాత్త సుచింత్య విగ్రహా  
దచింత్యశక్తే రవిచింత్య శాసనాత్ ॥

శ్రీకృష్ణ పాదారవిందాల కంటే అన్యశరణ్యంలేదు. బ్రహ్మ, శివాదులచే ఆపాదాలు స్పృశింప బడుతున్నాయి. భక్తులకోసం మానవ శరీరధారణం చేసి వచ్చిన ఆస్వామి లీలలు అచింత్యములు, అద్భుతావహములు.

భారతీయుల భక్తి ప్రస్థానంలో కృష్ణభక్తి సంప్రదాయాన్ని ప్రవర్తింప జేయడమే కాదు, భక్తిలో మధురభక్తి బీజాలను నాటినవాడు, భక్తిలో మాధుర్యాన్ని, ప్రేమను, స్నేహాన్ని, వాత్సల్యాన్ని ప్రవేశపెట్టిన ఆచార్యుడు నింబార్కుడు. ఈ సంప్రదాయ ప్రభావంతో పుట్టిన మహాగ్రంథాలు రెండు 1. జయదేవుని గీతగోవిందం (క్రీ.శ. 12శతాబ్ది) 2. లీలాశుకుల శ్రీకృష్ణ కర్ణామృతం. ఉత్తర భారతదేశంలో రామభక్తి, కృష్ణభక్తి సంప్రదాయాల

స్థాపన తర్వాత, అన్నమయ్య సమకాలీనులైన ఔత్తరాహ ఆచార్యవర్యులలో వల్లభాచార్యులు (క్రీ.శ.1479- 1532) ప్రముఖులు.

## వల్లభాచార్యులు (క్రీ.శ.1479-1532)

ఈయన ఆంధ్రుడు. మాతృభాష తెలుగు. గోదావరీ తీరంలోని కాకరవాడ, లేదా కృష్ణానదీతీరంలోని కాకరపాడు వాస్తవ్యులు. వెలనాటి శాఖీయ బ్రాహ్మణులు. లక్ష్మణభట్టు, ఎల్లమ్మ వీరి తల్లితండ్రులు. కాశీ నగరానికి పోయేదారిలో జన్మించి కాశీలోనే స్థిరపడ్డారు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో 14వ ఏటనే అద్వైతాన్ని ఖండించి కృష్ణభక్తిని స్థాపించి ఘనసన్మానం పొందినవాడు. ఈయన రచించిన 84 గ్రంథాల్లో 30 గ్రంథాలు ప్రసిద్ధమైనవి. అందులో భాగవత పురాణానికి వ్రాసిన సుబోధినీవ్యాఖ్య మిక్కిలి ప్రసిద్ధం.

ఉత్తర భారతదేశంలో కృష్ణభక్తి సంప్రదాయనికి మరింత పుష్టిచేకూర్చిన వారు వల్లభాచార్యులు. ఈయన సిద్ధాంతానికి శుద్ధాద్వైతవాద మని పేరు.

అతః సర్వాత్మనా శశ్వద్ గోకులేశ్వర పాదయోః ।
స్మరణం భజనం చాపి న త్యాజ్యమితి మే మతిః ।

"గోకులేశ్వరుడైన శ్రీకృష్ణుని పాదాలు హృదయంలో శాశ్వతంగా ఎల్లవేళల ఉండాలంటే ఆయన స్మరణ భజనలు ఎప్పుడూ విడవకుండ చేయడమే గతి!" అన్నారు.

పుష్టిమార్గ ప్రవర్తకులు వల్లభాచార్యులు 'అనుగ్రహరూపో భగవద్ధర్మ పుష్టిః ' భగవంతుని అనుగ్రహ రూప ధర్మమే పుష్టి. ఈ పుష్టిమతానికి మూలం భాగవతం. భగవదనుగ్రహమంటే జీవుని వాస్తవికమైన పోషణ. ఐహికవాంఛలు నశించి, పరమాత్మానుభూతి ప్రధానంకావడమే నిజమైన పుష్టి. వల్లభులు భక్తికి ఆదర్శంగా గోపికలను చెప్పారు. వారిది విశుద్ధభక్తి; వారు గురుస్థానీయులన్నారు.

1. గొల్లెతలు: బాలకృష్ణుని వాత్సల్యభక్తితో ఆరాధిస్తారు.

2. కుమారికలు: శ్రీకృష్ణుని పతిగా భావిస్తారు. వీరిది మధురభావం. ఇదే మధురభక్తిగా ప్రసిద్ధికెక్కింది. శృంగార రసాశ్రిత మైన భక్తియే మధురభక్తి లేక కుమారికాభక్తి.

3. గోపాంగనలు: వివాహితులైన గోపస్త్రీలు. పై రెండు మార్గాలకు అతీతంగా పవిత్రప్రేమ వాహినీ నిమగ్నులై కేవలం కృష్ణప్రాప్తికోసం ఎదురు తెన్నులు చూడడం. వీరిది విరహభక్తి లేక పరకీయభక్తి.

పుష్టిమార్గంలో వాత్సల్య, మధుర, పరకీయ భక్తిమార్గాలేగాక గోపబృందానికి ఆదర్శంగా ఉండే సఖ్యభక్తి కూడ ముఖ్యం. ఈ సంప్రదాయంలో రాధకు ఎక్కువప్రాధాన్యం కనబడదు. వల్లభుడు రాధను, గోపాంగనలను ఆదర్శంగా గ్రహించినా ప్రాధాన్యమివ్వలేదు. కాని, వల్లభుల తర్వాత వచ్చిన శ్రీచైతన్యులు రాధకు ముఖ్య స్థానమిచ్చారు. పుష్టిమార్గం లోని భక్తిలో శరణాగతియే ముఖ్యం. శ్రీకృష్ణశ్శరణం మమ! భగవతే కృష్ణాయదేవాయ తవా2స్మి! దాసో2హమ్ అంటారు.

## చైతన్యమహాప్రభువు (క్రీ.శ. 1485-1533)

బాల్యకాలంలో గౌరాంగుడని, నిమాయి అనే పేర్లతో పిలువబడిన శ్రీమహాచైతన్య ప్రభువు బెంగాలు రాష్ట్రంలో గంగానదీ తీరంలోని నవద్వీపంలో జన్మించారు. జగన్నాథమిశ్ర, శచీదేవీ దంపతులకు రెండవ కుమారుడు.

ఈయన జీవించిన కాలం 47 సంవత్సరాలే అయినప్పటికీ రెండుసార్లు దక్షిణదేశ యాత్ర చేశారు. మొదటిసారి శ్రీకూర్మం, రాజమండ్రిని దర్శించారు. కొవ్వూరులో శ్రీరామానందతీర్థులతో భాషించారు. ఆ తర్వాత మంగళగిరి, తిరుపతి, కంచి, రామేశ్వరం, సేతుబంధ, అనంత శయనం, శ్రీరంగాది క్షేత్రాలను సందర్శించారు. పండరీక్షేత్రంలో తుకారాంను కలిశారు. జగన్నాథక్షేత్రంలో చైతన్యులను వల్లభాచార్యులు దర్శించారు. క్రీ.శ.1533లో సముద్ర తీరం వెంటపోతూ చంద్రబింబంలో

శ్రీకృష్ణుని దర్శించి శరీరాన్ని మరచి, సముద్రగర్భంలో నడుచుకుంటూ వెళ్లి జలసమాధి అయ్యారు.

చైతన్యుని తర్వాత ఆయన భక్తి సంప్రదాయం రెండు శాఖలైనాయి. మంత్రోపదేశం మధ్యసన్యాసి వద్ద జరిగినా, తురీయాశ్రమ స్వీకరణం. కేశవుని వద్ద జరగడంచేత, గౌరాంగుని గురువు కేశవభారతి యని, దానిచే గౌరాంగుని సంప్రదాయం రామానుజీయ వైష్ణవమని వంగీయ, వైష్ణవం (Bengal Vaishnavism) వారు చెబుతారు. ఇది ప్రాచీనశాఖ. మరికొందరు కేశవమిశ్రుడు మాధవేంద్రుని శిష్యుడనే వారు చైతన్య సంప్రదాయం మధ్వమేనని గౌడీయమఠాన్ని నెలకొల్పారు. నవద్వీపంలోని గంగ కవతల ఉండే మియాపురం దీని కేంద్రం! ఇది నవీనశాఖ. వల్లభాచార్యుల వారు రాధకు ప్రాధాన్యమివ్వ లేదు. కాని, చైతన్య సంప్రదాయంలో రాధ శ్రీకృష్ణ పరమాత్మయొక్క శక్తిస్వరూపంగా రూపొందింది.

"శ్రీకృష్ణాయ గోవిందాయ గోపీజనవల్లభాయ స్వాహా!" అని చైతన్య సంప్రదాయం వారు నిత్యము స్మరిస్తారు. కలిదోషకాలుష్యం తరించడానికి శ్రీకృష్ణసంకీర్తన ఒక్కటే మార్గమని శుకమహర్షి భాగవతంలో చెప్పినట్లు, నామసంకీర్తనతో పాటు 'ప్రేమభక్తి'ని ఉద్ధరించిన వారు చైతన్యులు.

కృష్ణుని ఏకైక తత్త్వముతానే! రాధాకృష్ణయుగళ తత్త్వాన్ని ఏకముఖంచేసి స్వరూప నిజతత్త్వంగా భాసింపజేసిన మహాయోగ సాధకుడు శ్రీచైతన్యమహాప్రభువు. ఈ సంప్రదాయంలో క్రీ.శ.16వ శతాబ్దంలో బ్రహ్మవైవర్త మహాపురాణం వ్రాయబడింది. వైకుంఠంపైన గల గోలోకం, అక్కడి రాధాకృష్ణయుగళ తత్త్వం, రాధాదేవీ సంపూర్ణ స్వరూపం ఈ పురాణంలో విపులంగా చెప్పబడింది. శాశ్వతప్రీతి, అనుభూతియే ముక్తి. తానే రాధ। తానే కృష్ణుడు॥ రాధాకృష్ణ యుగళం ధరించిన ఏకరూపావతారమే శ్రీచైతన్యమహాప్రభువు. ఈ సిద్ధాంతానికే అచింత్య భేదా భేదమని పేరు.

## వైష్ణవ పంచాచార్యులు

1. శ్రీ రామానుజాచార్యులు (1017-1137) శ్రీ సంప్రదాయం - విశిష్టాద్వైతం
2. నింబార్కాచార్యులు (1100-1162) సనక సంప్రదాయం - భేదాభేదం
3. మధ్వాచార్యులు (1238-1317) బ్రహ్మ సంప్రదాయం - ద్వైతం
4. వల్లభాచార్యులు (1479-1532) రుద్ర సంప్రదాయం - శుద్ధాద్వైతం
5. చైతన్యమహాప్రభువు (1485-1533) నామ సంకీర్తనం రాధాకృష్ణయుగళతత్త్వం - అచింత్యభేదాభేదం.

మధ్వాచార్య, వల్లభాచార్యుల మధ్యకాలంలో వచ్చిన రామానందుల వారు ఆచార్య పురుషులు కాకపోయినా రామానందీయ రహస్య సంప్రదాయాన్ని స్థాపించినవాడు.

చైతన్యభక్తి మార్గంలోని గోస్వామీ సంప్రదాయంవారు భక్తిరసానికి లక్షణగ్రంథాలను వ్రాసి సిద్ధాంతీకరించారు.

చైతన్య మహాప్రభువు అనుచరుల్లో ఐదుగురు ప్రముఖులు. వీరు కృష్ణభక్తి సంప్రదాయంలో భక్తిని రసంగా స్థాపించారు. భాష్య రచనలు చేశారు. సనాతనగోస్వామి బృహద్భాగవతామృతమ్, వైష్ణవతోషిణి అనే భాగవత పురాణవ్యాఖ్య వ్రాశారు. రూప గోస్వామి (క్రీ.శ. 1490-1563) 'భక్తిరసామృత సింధువు'[22], ఉజ్జ్వల నీలమణి[23] అనే రెండు అలంకారశాస్త్ర గ్రంథాలలో భక్తిని రసంగా నిరూపించి, శ్రీకృష్ణుడే 'ఉజ్జ్వల నీలమణి' యని రాధాకృష్ణుల భక్తితత్త్వాన్ని, 16,108 మంది గోపికల భక్తిని విశ్లేషించారు. రూపగోస్వామి ఈ గ్రంథాలేగాక లఘుభాగవతామృతమ్, అనే గ్రంథాన్నివిదగ్ధమాధవమ్, లలితమాధవమ్, నాటకచంద్రిక అనే

మూడు నాటకాలు వ్రాశారు. రూపగోస్వామి అన్నమయ్య వార్ధక్యదశలో పుట్టినవాడు.

అన్నమయ్యకు తర్వాత గోస్వామి సంప్రదాయంలో జీవగోస్వామి 'ఉజ్జ్వల నీలమణి'పై లోచన రోచనీ వ్యాఖ్యనూ, భాగవత సందర్భమ్ అనే గ్రంథాలను వ్రాశారు. విశ్వనాథ చక్రవర్తి ఉజ్జ్వలనీలమణి పై 'ఆనందచంద్రిక' టీకను, రస కాదంబిని, భావార్థదీపిక అనే భాగవత వ్యాఖ్య వ్రాశారు. బలదేవవిద్యా భూషణుడు బ్రహ్మసూత్రాలకు గోవిందభాష్యం వ్రాయగా, పరమానందుడు చైతన్య చంద్రోదయ కావ్యం వ్రాశారు.

పదకవితా ప్రస్థానంలో అన్నమయ్య భక్తిని రసత్వస్థాయికి తీసుకొనిపోయాడు. పద్య కవిత్వంలో పోతన భక్తిరసానికి పట్టాభిషేకం చేశాడు. అన్నమయ్య (1408-1503) వార్ధక్య దశలో పుట్టినవాడు రూప గోస్వామి (1490-1563). దక్షిణభారత దేశంలో పోతన, అన్నమయ్యలు భక్తిని రసంగా నిరూపించి లక్ష్యగ్రంథాలుగా భాగవతాన్ని సంకీర్తన వాఙ్మయాన్ని సృజించగా, భక్తిని రసరాట్టుగా స్థాపించి, దానికి లక్షణ గ్రంథాలను, వ్యాఖ్యలను వ్రాసినవారు గోస్వామి సంప్రదాయంలోని ఆరుమంది పండితులు[24], ముందు లక్ష్యమే ఏర్పడుతుంది. ఆ తర్వాత లక్షణం నిర్వచించ బడుతుంది. ఈ దృష్టితో చూచినప్పుడు (పోతన పద్య కవిత్వంలో) అన్నమయ్య పదకవితలో ప్రథమాంధ్ర వాగ్గేయ కారుడుగా, భక్తిరస లక్ష్యకర్తకాగా, ఉత్తర భారతదేశంలో భక్తి రసలక్షణ కర్తలుగా వైష్ణవాలంకారికులైన రూపగోస్వామి ప్రభృతులు ప్రశంసనీయు లవుతున్నారు.[25]

## తెలుగు సాహిత్యంలో భక్తి

తెలుగు సాహిత్యంలోని కవుల్ని మూడు విధాలుగా చెప్పవచ్చు. 1. శివకవులు, 2. వైష్ణవకవులు, 3. హరి హరా భేదకవులు. భారతం హరిహరాభేదాన్ని ప్రతిపాదిస్తున్నది గనుక కవిత్రయం ఆ వర్గానికి చెందిన

వారు. వ్యాసభారతంలో ఉన్న ఉదంకకృత నాగస్తోత్రంలో నన్నయ 'అనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్' అనే మకుటంతో వ్రాసిన నాల్గైదుపద్యాలు భక్తిస్తోత్రంగా చెప్పవచ్చు. ఇది భక్తిశతక సాహిత్యానికి నాంది పలికింది. వ్యాసభారతంలోని భగవద్గీతతో పాటు, భీష్మస్తవరాజం, సనత్సుజాతీయం భక్తివేదాంత ప్రతిపాదకాలు.

తెలుగులో తొలిసారిగా 'భక్తి'ని 'రసం'గా పేర్కొన్న శివకవి పాల్కురికి సోమనాథుడు.వృషాధిప శతకంలోని పద్యం చూడండి.

భక్తిరసాభిషిక్త భవపాశ వితాన విముక్త, జంగమా
సక్త, దయాభిషిక్త, తనుసంగత సౌఖ్యవిరక్త, సంతతో
ద్యుక్త, గుణానురక్త, పరితోషిత భక్త, శివైక్యముక్త ప్ర
వ్యక్తమ నీవె దిక్కు బసవా! బసవా! బసవా! వృషాధిపా![26]

క్రీ.శ.1160-1240 కాలం నాటికే భక్తిరసాభిషిక్త అనే సమాసం పాల్కురికి సోమనాథుడు ప్రయోగించాడంటే, భక్తికి రసత్వసిద్ధిఉందని కవిపండిత మేధావులందరూ సాహిత్యలోకంలో అంగీకరించినారన్న విషయాన్ని ఈ సంబోధన ధ్రువీకరిస్తున్నదా అన్పిస్తుంది. భక్తి పదియవ రసంగా పాల్కురికి కాలానికే స్థిరపడిందా? అని ప్రశ్నిస్తే శివకవుల పక్షంగా ఆలోచిస్తే పాల్కురికి తదనంతర కవులు శివభక్తిని రసత్వ స్థాయికి తీసుకు పోయినట్లే నిరూపించవచ్చు.

ఇక వైష్ణవభక్తిలో రసత్వసిద్ధిని సాధించిన కవుల్లో - ఎఱ్ఱాప్రెగడ, శ్రీకృష్ణదేవ రాయలు, పోతన, అన్నమయ్యలను చెప్పవచ్చు. ఎఱ్ఱాప్రెగడ తెలుగులో తొట్ట తొలి వైష్ణవకవి. ఈయన హరివంశం, నృసింహ పురాణం వైష్ణవభక్తికి పరాకాష్ఠగా నిలుస్తాయి. ప్రహ్లాదుని భక్తి తత్త్వానికితడు పెట్టినదే భిక్ష. పోతన దానిని భక్తిరసంలో ముంచెత్తి పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు. శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యద భక్తిరసానికే పట్టంకట్టినా, 'మాలదాసరి' కథ అందులో 'కిరీటమణి' వంటిది. నిజమైన భక్తుని లక్షణాలను రాయలు నిరూపించాడు.

వాగ్గద్గదా ద్రవతే యస్య చిత్తః - రోదిత్య తీక్ష్ణం హసతి క్వచిచ్చ।
విలజ్జ ఉద్గాయతి నృత్యతేచ - మద్భక్తి యుక్తో భువనం పునాతి॥[27]

కంఠం గద్గదం కావడం, హృదయం ద్రవించడం, గట్టిగా ఏడ్వడం, ఒక్కొక్కసారి నవ్వడం, సిగ్గును విడిచి పాటపాడుతూ నాట్యం చేయడం, ఇలా నాభక్తులు జగత్తును పునీతం చేస్తున్నారు అని హరిభక్తి విలాసం. సరిగ్గా మాలదాసరి కథలో కూడ -

గండాభోగములన్ ముదశ్రులహరుల్ గప్పన్ నుతుల్ పాడి యా
దండన్ వ్రేగులు డించి భక్తి జనితోద్యత్తాండవంబాడు నా
చండాలేతర శీలుఁడుత్పులకియై చాండాలికన్ మీటుచున్
గుండుల్ నీరుగ నెండ గాలిపసితాకుంజూడ కా ప్రాహ్ణమున్[28]
(ఆముక్తమాల్యద, 6-7)

అని రాయలు వర్ణించడం ఎంతో వాస్తవమైన వర్ణన! ఈ విధంగా ప్రహ్లాద, నారద, హనుమదాదులు, మీరాబాయి, చైతన్య మహాప్రభువు, శ్రీరామకృష్ణ పరమహంస భక్తిజనితోద్యత్తాండవం బాడినవారే! యథావాక్కుల అన్నమయ్యగారి సర్వేశ్వరశతకంలో "అమరంగా స్ఫుటభక్తి నాటకము ..."[29] అనే పద్యంలో, "సర్వేశ్వరా! భక్తి అనే నాటకాన్ని వాగభినయం తోను, చేష్టాభినయంతోను, ఎంతో రమణీయంగా చూపితే, నీవుబలే, యని మెచ్చుకోగా, జీవి అనేక స్త్రీల గర్భాలలో జన్మిస్తూ, నటుడుగా సంసారమనే రంగస్థలంపై అనేక వేషాలు వేస్తుంటాడు" అన్నాడు.

ఈ భావాన్నే గ్రహించి తాళ్లపాక అన్నమయ్య నిజమైన భక్తి ఆంతరంగికం కాని, బాహ్య ప్రదర్శనలు భక్తికాదని చెబుతూ -

"నానాటి బ్రదుకు నాటకము - కానక కన్నది కైవల్యము
పుట్టుటయునిజము - పోవుటయు నిజము
నట్ట నడిమి పని నాటకము - ఎట్టఎదుటగలదీ ప్రపంచము
కట్టకడపటిది కైవల్యము ......"[30] అన్నాడు. (3-576)

భక్తికి చిత్తశుద్ధి అవసరమని అన్నమయ్య అభిప్రాయం.శివకవుల్లో పాల్కురికి తర్వాత నన్నెచోడుడు, శ్రీనాథుడు, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు పోతనలు పేర్కొనదగిన వారుకాగా, వైష్ణవకవుల్లో ఎఱ్ఱాప్రగ్గడ, పెద్దన, శ్రీకృష్ణ దేవరాయలు, పోతనలు చెప్పదగినవారు. హరిహరనాథ కవుల్లో తిక్కన, నాచనసోమన, ఎన్నదగిన వారు.

## భక్తిరస ప్రస్థానంలో అన్నమయ్య ప్రజ్ఞ - ఉపజ్ఞ

శ్రీవైష్ణవ ఆచార్యులలో మొట్టమొదటి వారైన నాథమునిని గూర్చి "నాథోపజ్ఞం...."[31] అని ప్రశంసించినట్లు, 'అన్నమాచార్యోపజ్ఞం ప్రవృత్తం పదకవితా భక్తిరసం' అని ప్రథమాంధ్ర వాగ్గేయకారుని విషయంలో మనం సంభావించవచ్చు.

అన్నమయ్య అధ్యాత్మ, శృంగార, యోగ సంకీర్తనలు వ్రాసినట్లు తెలుస్తున్నది. మొదట సంకీర్తన లక్షణాన్ని సంస్కృతంలో వ్రాసి, తాను వ్రాయబోతున్న సంకీర్తన యొక్క లక్షణాన్ని నిర్వచించాడు. అధ్యాత్మ, శృంగార సంకీర్తనలకు విడివిడిగా లక్షణాలు చెప్పాడు.

సంకీర్తన లక్షణాన్ని తెలుగులో అనువదించిన అన్నమయ్య మనుమడు తాళ్లపాక చినతిరువేంగళ నాథుడు తన తాతగారి సంకీర్తనల గొప్పతనాన్ని గూర్చి చెప్పిన మాటలు అన్నమయ్య ప్రజ్ఞాపాటవాలను చెబుతున్నాయి.

కం॥ వేదంబులు, పౌరాణిక
వాదంబులు, పదకవిత్వవాణీవీణా
నాదంబులు కృత సుజనా
హ్లాదంబులు తాళ్లపాక యన్నయ పదముల్

కం॥ మది దాళ్లపాక యన్నయ
పదములపై భక్తిగలిగి పాడిన విభవా
స్పదములగు వివిధ సంప
త్పదములు శ్రీవేంకటేశు పదములు దెలియున్[32]

'వేదంబులు' అంటే వేదార్థములతోపాటు వేదమంత్రతుల్యములనీ, 'మంత్రమయవాణి'ని వరకవిత్వవాణీ వీణా నాదంబులుగా ఆహ్లాదకరంగా చెప్పినాడని, ఆయన సంకీర్తనలు బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన భాండాగారములని ప్రశంసించాడు.

అటువంటి అన్నమయ్య పదాలను భక్తికలిగి పాడితే సంపదలకు ఆలవాలమైన వివిధ ఐశ్వర్యస్థానాలే కాదు, శ్రీవేంకటేశ్వరుని పాదార విందాలను కూడ దర్శింపజేస్తాయి అన్నారు. దీనికి ఉపబలకంగా 'సంప్రదాయా గత జ్ఞానసహితుడైన, మనుజుసత్కవితయు వేదమంత్ర సమము' అని మరొక చోట చెప్పిన మాట అన్నమయ్యకు అక్షరాల అన్వయిస్తుంది.

"ప్రజ్ఞానవనవోన్మేషశాలినీప్రతిభామతా" ఎప్పటికప్పుడు కొత్తకొత్త అర్థాలను స్ఫురింపజేసే శబ్దప్రయోగ దక్షతగల ప్రజ్ఞనే ప్రతిభ అంటారు. 'ఉపజ్ఞ' అంటే ఆ ప్రతిభ హఠాత్తుగా పొటమరించేవేళ. 'సృజనక్షణం', దీనినే కుంతకుడు ప్రతిభాప్రథమోద్భేద సమయం అన్నాడు. ప్రతిభయొక్క ప్రథమాంకురం ప్రథమస్పందం, ప్రథమస్ఫోటమే ఉపజ్ఞ. అన్నమయ్య శబ్దశక్తిప్రకాశం ఉపజ్ఞకు చెందినది.

అధ్యాత్మమంటే ఏమి? జీవాత్మకు - పరమాత్మకు గల సంబంధాన్ని గురించి వివరించేది అధ్యాత్మము. అధి ఆత్మన్ ఆత్మను గురించి చేయబడే విచారము, వివేచనము. అది జీవుని దృష్ట్యా చేయబడుతుంది. దీన్నే సంకీర్తన లక్షణంలో -

దేహాత్మేశ వివేకో
త్సాహంబను లోకవేద ధర్మాధర్మా
ద్యూహాపోహంబులగల
యా హరిసంకీర్తనంబులధ్యాత్మంబుల్[33]

దేహము, ఆత్మ, ఈశ వివేకము- జిజ్ఞాసతో కూడిన ఉత్సాహం ఈ లక్షణాలతో లోకజ్ఞత, వేదవిజ్ఞత, ధర్మాధర్మములు, ఊహాపోహలు గల్గిన శ్రీహరి సంకీర్తనల్నే అధ్యాత్మ సంకీర్తనలన్నారు.

## అన్నమయ్య అనన్య భక్తి

అన్నమయ్య పుట్టుకతో 'అద్వైతి'యైనా, శ్రీవైష్ణవదీక్ష స్వీకరించినా, ఆయన భక్తిమార్గం అత్యంత విలక్షణమైంది. పోతన భాగవతాన్ని ప్రారంభిస్తూ - "శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్" అని తన అధ్యాత్మచింతను ప్రకటించగా - అన్నమయ్య

"కలిగె నిదె మాకు కైవల్యము

ఎన్నడూ ఎవరికీ దొరకనిదీ!"[34] అని విస్పష్టంగా కైవల్యప్రాప్తి అయిందని చెప్పాడు. అన్నమయ్య తర్వాతివాడైన శ్రీత్యాగరాజ స్వామి, "తెలియలేదు రామభక్తి మార్గము" అని భక్తిమార్గంలో విశేషించి 'రామభక్తిమార్గం'లో గల క్లిష్టతను గురించి చెప్పగా - అన్నమయ్య తన మార్గం'నవ్యమార్గం' అంటూ -

నడవరో జడియక నవ్యమార్గ మిదె
మడుఁగిది వైష్ణవమార్గ మిదె ||పల్లవి||

ఘనశుకముఖ్యులు గన్న మార్గ మిది
జనకాదుల నిశ్చలమార్గ మిది
సనత్కుమారుఁడుజరపుమార్గ మిది
మనువుల వైష్ణవమార్గ మిది ||నడవ||

నలుగడవసిష్ఠు నడుచు మార్గమిది
యిల వేదవ్యాసులమార్గం బిది
బలిమిగలుగుధ్రువపట్టపుమార్గము
మలసినవైష్ణవమార్గ మిది ||నడవ||

పరమమార్గం బిదె ప్రపంచమార్గము
గురుమార్గం బిదె గోప్య మిదే
గరిమెల శ్రీవేంకటపతి మాకును
మరిపెను వైష్ణవమార్గమిదే ॥నడవ॥ [35]

అన్నమయ్య భక్తిమార్గానికి స్ఫూర్తిదాతలు, మార్గదర్శకులు వీరు 1.శుకుడు, 2. జనకుడు, 3. సనత్కుమారుడు, 4. మనువులు, 5. వశిష్ఠుడు, 6. వేద వ్యాసుడు, 7. ధ్రువుడు. శుకునికి ప్రప్రథమ స్థానమివ్వడంచేత "శుకముఖ సుధా ద్రవమున మొనసి యున్న" భాగవత భక్తి మార్గానికే , అన్నమయ్య పెద్దపీట వేశాడని చెప్పాలి. 'భాగవతం శ్రవణం చేతనే ముక్తినిచ్చేది', ఆవిధంగా అన్నమయ్య పాటలు కూడ విన్నంతనే 'శ్రీవేంకటేశు పదములు చూపేది'. ఇదే భక్తికి పార్యంతికఫలం!

ఇన్ని భక్తిమార్గాలకు కీలకమైన మంత్రమొక్కటే! అదే శ్రీవేంకటేశు మంత్రము!

అన్నిమంత్రములు నిందే యావహించెను
వెన్నతో నాకుఁ గలిగె వేంకటేశుమంత్రము ॥పల్లవి॥

నారదుండు జపియించె నారాయణమంత్రము
చేరెఁ బ్రహ్లాదుఁడు నారసింహమంత్రము
కోరి విభీషణుఁడు చేకొని రామమంత్రము
వేరె నాకుఁగలిగె వేంకటేశుమంత్రము ॥అన్ని॥

రంగగు వాసుదేవమంత్రము ధ్రువుఁడు జపించె
నంగవించెఁ గృష్ణమంత్ర మర్జునుఁడు
ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె
వింగడమై నాకునబ్బె వేంకటేశుమంత్రము ॥అన్ని॥

యిన్ని మంత్రములకెల్ల యిందిరానాథుఁడే గురి
పన్నినదిదియే పరబ్రహ్మమంత్రము

నన్నుఁ గావఁ కలిగెఁబో నాకు గురుడియ్యగాను
వెన్నెలవంటిది శ్రీవేంకటేశు మంత్రము ॥అన్ని॥[36]

ఈ పాటలో గల భావ సంపుటిని, దీనికి ముందు గల 'నవ్యమార్గ'మనే పాటతో తులనాత్మక పరిశీలన చేస్తే, అన్నమయ్య నవ్యమార్గంలోని ఆంతర్యం బోధపడుతోంది. ఆ నవ్యమార్గం సమన్వయ మార్గమని తెలుస్తుంది.

1. నారదుడు - నారాయణ మంత్రము - 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రం

2. ప్రహ్లాదుడు - నారసింహమంత్రము - అన్నమయ్య అహో బలంతో ఆదివణ్ శఠకోపయతి వద్ద శిష్యుడై నారసింహమంత్రాన్ని ఉపదేశంగా పొందాడు. ఇవి రెండువిధాలైన మంత్రాలు. 32 బ్రహ్మవిద్యలకు ప్రతీకగా ముప్పైరెండు మంత్రములు గలది నారసింహ సాక్షాత్కార మంత్రము. 32 అక్షరములు గలది నృసింహ గాయత్రీమంత్రము.

ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్
నృసింహం భీషణం భద్రం మృత్యు మృత్యుం నమామ్యహమ్!
-నృసింహతాపిన్యుపనిషత్తు (1-6)

ఈ రెండు మంత్రాలు ఆదివణ్ శఠకోపయతివద్ద అన్నమయ్యదీక్షతో స్వీకరించినాడు. నృసింహసాక్షాత్కారానికి ఆయన జీవితంలో దాఖలాలున్నాయని 'అన్నమాచార్య జీవితచరిత్ర'లో చిన్నన్న వ్రాశాడు.

3. విభీషణుడు - రామమంత్రము - 'ఓం నమో రామాయనమః'

4. ధ్రువుడు - వాసుదేవ మంత్రము - 'ఓ నమో భగవతేవాసు దేవాయ' (వాసుదేవద్వాదశాక్షరి)

5. అర్జునుడు - కృష్ణమంత్రం - 'ఓం కృష్ణాయనమః'

6. శుకుడు - విష్ణుమంత్రం - నారాయణాయ విద్మహే। వాసుదేవాయ ధీమహి। తన్నోవిష్ణుః ప్రచోదయాత్॥

ఇన్ని మంత్రాలలో నారసింహ, రామ, కృష్ణమంత్రాలు విష్ణువు యొక్క అవతార తత్త్వానికి, నారాయణ, విష్ణు, వాసుదేవ శబ్దాలు నృసింహతత్త్వాన్ని వ్యాఖ్యానిస్తాయి.

మొదటి కీర్తన 'నవ్యమార్గం' లో చెప్పిన -'గురుమార్గం బిదె గోప్యమిదె' అనే పాదంలో గురుమార్గ మంటే రెండర్థాలు వస్తాయి. 1. గొప్పమార్గము, ఘన మార్గము, 2. గురువైన ఘన విష్ణువు చూపిన వైష్ణవ భక్తిమార్గము గోప్యమిదె అంటే -

గురుం ప్రకాశయేత్ ధీమాన్
మంత్రం యత్నేన గోపయేత్ ।
అప్రకాశ ప్రకాశాభ్యాం
క్షీయతే సంపదాయుషీ॥ [37]

గురువు శిష్యునికనుగ్రహించిన మంత్రం గోప్యంగా, రహస్యంగా రక్షించుకోవాలి అనే గురు శిష్య సంప్రదాయాన్ని చెబుతుంది. ఇంక చెప్పాలంటే -

యస్యదేవే పరాభక్తిః యథాదేవే తథా గురౌ ॥
మంత్రే తద్దేవ తయాచ తథా మంత్ర ప్రదేగురౌ॥ [38]

మంత్రము మంత్రాధి దేవత గురువు ఈ ముగ్గురు సమానస్థాయి లోని వారు కాబట్టి శిష్యుడు వారి ముగ్గురిని ఒకే విధంగా గౌరవించి పూజించాలి.

'వేంకటేశు మంత్రము' అనే పాటలో కూడ చివరి చరణంలో -

'ననుగావ గలిగెబో  నాకు గురుడియ్యగాను
వెన్నెల వంటిది శ్రీ వేంకటేశు మంత్రము'

అనే పంక్తులకు 'వెన్నతో నాకు గలిగె వెంకటేశు మంత్రము' అనే పల్లవిలోని పంక్తికి సంబంధమున్నది. అదే గురుశిష్య సంబంధం. ఆ గురువులు అన్నమయ్య కిద్దరున్నారు. తిరుమలపై

1. ఘనవిష్ణువు - బాల్యదశలో (10వయేట) తప్త చక్రాంకనం చేసినవాడు ఈయన - అష్టాక్షరి మంత్రమైన 'ఓంనమో నారాయణాయ' అనే మంత్రాన్ని దీనితో సమానమైన మరో అష్టాక్షరి ఓం నమో వేంకటేశాయ అనే మంత్రాన్ని ఉపదేశించినవాడు.

2. అహోబలంలో ఆదివణ్ శఠకోపయతి. ప్రప్రథమ వైష్ణవ పీఠాధిపతి -32 మంత్రాలు గల నారసింహ సాక్షాత్కార, గాయత్రీ మంత్రాలను ఉపదేశించినవాడు.

అన్ని మంత్రములు నిందే ఆవహించెను అనే పాటలో ఆవహించెను అనే మాటలో 'కలిసిపోతాయి, ఇమిడిపోతాయి, అంతర్భవిస్తాయి' అనే అర్థం ఏర్పడుతుంది. సృష్టిలోని సర్వ జంతువుల పాదాలు ఏనుగు అడుగుజాడలో ఇమిడిపోయేటట్లుగా, సకల దేవతల మంత్రాలు వేంకటేశమంత్రంలో అంతర్భవిస్తాయి. అని అన్నమయ్య నిష్కర్ష!

'వింగడమై నాకు దొరికె వేంకటేశు మంత్రము' అనే పంక్తి కూడ సాభిప్రాయం. వింగడమంటే విలక్షణం. అనుచానమైన వింగడింపుకు వైదొలగి ప్రత్యేకంగా, వినూత్నపంథాలో లభించిందని అర్థం! వేం - కట - ఈశ్వర - భక్తుల పాపాలను పోగొట్టే ప్రభువు యొక్కమంత్రము. అంతమాత్రమే కాదు మంత్రాల కన్నింటికీ ప్రభువు అనే అర్థంకూడ స్ఫురిస్తుంది.

## అన్నమయ్య సమన్వయం

అన్నమయ్య తదితర కీర్తనల్ని పరిశీలించినా తాను నిత్యము జపించే మంత్రవిషయంలో ఎక్కడ కూడా రెండవ అభిప్రాయం చెప్పక - ఏకాభిప్రాయాన్నే ప్రకటించాడు.

1. దొరికే మాపాలికి కందువ యర్థము
   దరిదాపై యుండిన తత్త్వార్థము (2-3)

2. వెదకిన నిదియ వేదాంతార్థము
మొదలు తుదలు హరిమూలంబు (2-26)

3. ఇరవుగ శ్రీవేంకటేశ్వరు నామమె
సరవి మంత్రముల సారంబు (4-436)

4. ఇదియె మంత్రరాజము నాకునెప్పుడు
నిదియె వేద సంహిత పాఠము (4-48)

5. ఏ పురాణముల నెందు వెదకినా
శ్రీపతిదాసులు చెడరెన్నడును (2-88)

ఈ విధంగా శ్రీవేంకటేశ్వర మంత్రమే తనకు సకల శాస్త్రాలు, సంధ్య, జపం, బ్రహ్మవిద్యోపాసన (గాయత్రీ మంత్రం), దుఃఖవిరహిత మార్గం, బహులోకహిత భేషజం, ఉపనిషత్ వాక్యపద్ధతి, (మహావాక్యం) దానఫలం, తపోవిరహిత కర్మగా అభివర్ణించాడు అన్నమయ్య.

'ఇదియె తిరువేంకటేశ్వర సంస్మరణ
ఇదియె ఇదియె ఇన్నియు నటుగాన' (4-48)

అని అన్నమయ్య శ్రీవేంకటేశునిపై తనకు గల 'అనన్యభక్తి'ని నిరూపించాడు.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో సాధించిన సమన్వయాలెన్నో ఉన్నాయి.

1. అంతర్యామి - అర్చాతత్త్వాలు
2. నిరాకార - సాకార తత్త్వాలు
3. నిర్గుణ - సగుణ తత్త్వాలు

వీటి సమన్వయ స్వరూపమే శ్రీవేంకటేశ్వర భక్తి తత్త్వం.

ఈ సమన్వయానికి కీలకవాక్యం -

భావించ నిరాకారమై, పట్టితే సాకారమై
శ్రీవేంకటాద్రిమీద శ్రీపతై యున్నాడు (2-232)

అంతర్యామి తత్త్వాన్ని అన్నమయ్య చాల సంకీర్తనల్లో ప్రశంసించాడు.

1. చిక్కి శ్రీవేంకటేశుడు జీవుల కంతర్యామి ।
   ఇక్కువెరిగితే నీడ కిదే సూత్రము ॥ (2- 234)

2. శ్రీవేంకటేశ్వర! నీవు జీవాంతరాత్మవట (2- 441)

3. అంతర్యామీ! అలసితి సొలసితి
   ఇంతట నీ శరణిదె సొచ్చితిని (2- 475)

4. ఇల చీకటి వెలుగు యెంచ అహోరాత్రాల
   గలసి మెలగు ఆకాశతత్త్వమున
   చవులై శ్రీవేంకటేశు సాకార నిరాకారా
   లలరి వెలుగుచుండు నంతరాకాశమున (2- 402)

1. చీకటి - రాత్రి - ఆకాశం - నిరాకారం

2. వెలుగు - పగలు - అంతరాకాశం - సాకారం

ఫలితార్థం - ఆకాశ, అంతరాకాశ తత్త్వాలే శ్రీవేంకటేశ్వరస్వామి తత్త్వం.

ఆకాశమంటే బయలు - నిరాకారతత్త్వం - నిర్గుణం

అంతరాకాశమంటే హృదయం - అంతర్యామి తత్త్వం - సాకారం - సగుణం

ఈ రెండింటి సమన్వయ మూర్తియే శ్రీవేంకటేశ్వరస్వామి. ఈ చర్చకు ఫలితార్థాన్ని అన్నమయ్యే మరో సంకీర్తనలో ఇలా చెప్పాడు.

సారె శ్రీవేంకటపతి సగుణము దలచిన
సారపు జీవుడు దాను సగుణము !
నేర్పుల నాతని నిర్గుణము దలచిన
తారతమ్యములు లేని తాను నిర్గుణము!![39]

స్వామిని సగుణంగా భావిస్తే జీవుడు సగుణుడే!
స్వామిని నిర్గుణుడని భావిస్తే జీవుడు నిర్గుణుడే !

ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయల వారు శ్రీరంగనాథుని వర్ణిస్తూ చెప్పిన వాక్యాలతో అన్నమయ్య ఎలా ఏకీభవిస్తున్నాడో చూడండి- ఇది అంతర్యామి అర్చాతత్త్వాల సమన్వయం.

"నిర్నిమిష దృష్టి నెట్టుకొని చూచుతఱి నీలావదాతయు, ఱెప్ప వట్టుతఱి బిట్టెదుర్కొను కలధౌత గౌరగౌర మహామహఃపూరంబున మునింగి, దుర్నిరీక్ష్యయునగు నిజరుచిరమూర్తి వలనఁదనరు సాకార నిరాకారతలు వారికి ఁజూపురూపున దీపించువాని"- (వావిళ్ల ముద్రణ- 2004, పుట.595)

పరము, నిహము పంటపండిన యట్టు
ఇరవుగ దానె యెట్టయెదుట నున్నాడు (2-231)

అనే సంకీర్తనలో, అంతర్యామిగా తన హృదయాకాశంలో పొందిన ఆత్మ సాక్షాత్కార వైభవమే, అర్చామూర్తి గా ఎలా రూపుకట్టినదో అన్నమయ్య అద్భుతభావాలతో పొదిగి రచించిన పాటయిది.

అన్నమయ్య ప్రజ్ఞ - ఉపజ్ఞలకు పరాకాష్ఠగా - "ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంతమాత్రమే నీవు"[40] అనే పాటను చెప్పవచ్చు. ఈ పాటలో, "నీవలన కొరతలేదు మరి నీటి కొలది తామెరవు" అనే వాక్యం అత్యంత కీలకమైంది. ఎలాగంటే - తామరపూవు కాడ నీటి మడుగులో చాలా పొడవుగా ఉంటుంది. నీటిమట్టంపైన పూవు మాత్రమే కనబడు తుంటుంది. నీటి మట్టం పెరిగే కొద్దీ పూవు పైపైకి వస్తూనే ఉంటుంది.నీటి మట్టం తరిగే కొద్దీ క్రిందికి దిగుతూ వుంటుంది. ఆ విధంగా భక్తుడు ఉన్నతంగా భావిస్తే భగవంతుడు ఉన్నతుడు. అల్పంగా భావిస్తే అల్పుడు. నీబుద్ధి అనే నీటి మట్టం పైకి పెరిగేకొద్దీ భగవంతుడనే తామరపూవు యొక్కస్థాయి ఉన్నతస్థాయిలో ఉంటుంది. మట్టమైన బుద్ధితో తర్కిస్తే మట్టం గానే ఉంటుంది అని అర్థం!

చూచేవాడి బుద్ధిలో లోపమే తప్పు, స్వామిలో లోపం ఏ మాత్రం లేదు.ఆయన సర్వపరిపూర్ణుడు! సర్వాంతర్యామి!! దీనినే గీతాచార్యుడు, "యాదృశీభావనాయత్ర సిద్ధిర్భవతి తాదృశీ" అన్నాడు. "మూడే మాటలు మూడుమూళ్ల తొమ్మిది వేడుకొని చదువరో వేదాంతరహస్యము" అనే పాటలో (2-233) విశిష్టాద్వైత వేదాంతంలోని జీవుడు,దేవుడు, ప్రకృతిని, ఉపనిషద్వేదాంతంలోని జ్ఞాన, భక్తి, వైరాగ్యాలచేత గుణిస్తే వచ్చే తొమ్మిది ఏమిటి? అంటేశ్రీవైష్ణవ సంప్రదాయంలోని షడ్విధ శరణాగతులు, ఆచార్య విశ్వాసం, దాసత్వం, మోక్షం (బ్రహ్మానందపదవి) అనే తొమ్మిది కీలక సూత్రాలు. ఇలా సంప్రదాయాన్నీ సిద్ధాంతాన్నీ, వేదాంతాన్నీ ఒకే పాటలో సాంకేతిక పద్ధతిలో చెప్పడంలో అన్నమయ్య ప్రజ్ఞ - ఉపజ్ఞ ప్రకాశిస్తున్నది.

## శృంగార సంకీర్తనల్లో అన్నమయ్య భక్తిరస నిరూపణ

పదములు శృంగార వధూ
మృదుమధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థత గ్రామ్యోక్తులు
పదిలముగా పొంక మెఱిగి పలుకంజెల్లున్
వల్లవ నారీమ్లేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞ బంధురంబులు చవియై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసకముఖ్య నాటకాదిక ఫణితిన్[41] - సంకీర్తన లక్షణం

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో గొల్లస్త్రీలు, గ్రామాలలో వివిధ వృత్తులు చేసికొనే తక్కువజాతి వారైన పాటకజనులు గ్రామీణులైన శ్రామికులు తమ తమ శృంగారభావాలను తమకు సహజమైన ఉచ్చారణల్లో వ్యక్తీకరించినప్పటికీ, అవి అశ్లీలత్వాన్ని పొందక భగవత్పరమైన అభిలాషకే ప్రాధాన్య మివ్వ బడి 'మధుర భక్తి'గా పరిణమించింది.

భక్తి ఒక విలక్షణమైన రసం. ఇది వీర శృంగార రసాలకు చుక్కెదురు. లౌకిక పరిస్థితులు రస హేతువులైనట్లు దైవిక విషయాలు కావు. కావ్యం చర్వణ శీలమైంది. భక్తి తద్భిన్నమైన మనన శీలమైంది. కావ్యార్థ మననం రసహేతువు. భగవత్సంబంధి మననం వైరాగ్యహేతువు. ఒక కావ్యంలో తక్కిన రసాలతో పాటు భక్తిని జోడిస్తే అది రసభావాలకు అంగం కాకుండాపోతుంది. పైగా భక్తి ఎప్పుడూ తక్కినరసాలను విరిచివేస్తుంది. ఒకవేళ భక్తియే ప్రధానరసమైతే తక్కినరసాలు సేవకులై భక్తి రసానికి అడుగులకు మడుగు లొత్తవలసి వస్తుంది. కాబట్టి 'భక్తి' ఎప్పుడూ 'అంగి' కాదు. అది అంగముగానే భాసిస్తుంది అని కవిసమ్రాట్ విశ్వనాథ వారి అభిప్రాయం.

ఈ దృష్టితో చూచినప్పుడు అన్నమయ్య పదివేల పైచిలుకు శృంగార సంకీర్తనల్లో 'భక్తి'ని 'భక్తి'గా, శృంగారాన్ని శృంగారంగా ఎలా విడివిడిగా నిర్వహించగలిగాడో, 'ఉజ్జ్వల నీలమణి'లో రూపగోస్వామి చెప్పిన 360 నాయికా భేదాలను మించి, ''ఎన్ని శృంగార సంకీర్తనలో, అన్ని శృంగారనాయికలు'' అనే రీతిగా ఒక్కొక్క సంకీర్తనను ఒక్కొక్క నాయికగా చేసి అటు శృంగారాన్నీ, యిటు భక్తినీ చెక్కుచెదరకుండా పండించాడన్నది ఆశ్చర్యకరమైన అంశం. అన్నమయ్య చేసినగ్రామ్య శృంగార వర్ణన అనండి, పచ్చిశృంగార మనండి ఇవన్నీ ఆయన బహుముఖీన ప్రతిభలో ఒకపార్శ్వం మాత్రమే! (దీని విశ్లేషణ ప్రస్తుత వ్యాసరచయిత వ్రాసిన పీఠికలో చూడవచ్చు.)

శృంగారరసానికి చెందిన అనేకానేక నాయికాభేదాలు, వ్యభిచారి సాత్త్విక భావాల నిరూపణం, నాట్యానుకూలతను చక్కగా ఒకవైపు సంతరిస్తూనే, చిట్టచివరి చరణంలో ఆ శృంగార భావ సందోహమంతా నిస్సందేహంగా భగవదంకితం చేయడం చేత భక్తి భక్తిగా నిలబడుతూ ఉంది. అదే సమయంలో శృంగారానుభవం దానంతట అది విశిష్టంగా అనుభవంలోకి వస్తూ ఉంది. ఈ సమన్వయాన్ని అన్నమయ్య ఎలా

సాధించ గలిగాడంటే, దాక్షిణాత్యులైన ఆళ్వారుల మధురభక్తి సంప్రదాయాన్ని, వ్యాసభాగవత, పోతన భాగవతాలలో నిరూపితమైన భక్తిశృంగారాలను ముఖ్యంగా గ్రామ్య శృంగార చిత్రణకు స్ఫూర్తిగా గోపికా గీతలు, భ్రమరగీతలు, ఉద్ధవగీత వీటిని పోతనగారు నిర్వహించిన తీరును గమనించి శృంగారభావాలను దేశీయ భావజాలంతో నింపి, గ్రామీణుల యాసతోనే చెప్పడంచేత, వారి శృంగార చేష్టలను శ్రీవైష్ణవ సిద్ధాంతంలోని 'స్వామి సర్వజీవులకు సులభుడు' అనే సూత్రంపై ఆధారపెట్టి వర్ణించి, స్వకీయ ప్రజ్ఞతో ఉపజ్ఞను ప్రదర్శించినాడని చెప్పవచ్చు.

ఉదాహరణకు ఒకటి, రెండు సంకీర్తనలు చూద్దాం -

నవ్వేవారి నెఱఁగవు నాలుగువంకల నిన్ను
జవ్వన మదముననే సాము జేసేవు ॥పల్లవి॥

యెంతైనా గద్దు నీయాస యేమి చెప్పే దిందరిలో
కాంతవలపులకు గాదె నీమేను
చెంతల నా కుచములు చేతులనే పట్టుకొని
మంతుకెక్క నాపె తోను మాఁటలాడేవు ॥నవ్వే॥

తలఁచరాదు నీరతి తమకివి యున్నిటాను
జలజాక్షు లెంగిలి కంచము నీమోవి
అలరి యధరామృత మందు కొంటా నాపె పొత్తు
కలసిసన్నలు సేసి కాఁక రేఁచేవు ॥నవ్వే॥

పట్టరాదు నీ వయసు పడతుల కెల్ల రచ్చ
కొట్టమాయ నిదివో నీగొప్ప వురము
నెట్టన శ్రీవేంకటేశ నీవు నన్ను ఁగూడి యట్టె
కట్టి కొంటి వాపె పదకము నీ మెడను[42] ॥నవ్వే॥

"స్వామి సర్వజీవులకు సులభుడు" అనే తాత్త్విక రహస్యానికి శృంగార పరంగా కవిచేసిన వ్యాఖ్యానమే ఈ సంకీర్తన. సర్వజీవుల శృంగారానుభవం

అంతర్యామియైన స్వామిలోనే అంతర్భవిస్తుంది. 'ఇమ్మల దేహానకు భోగించిన భోగమునీదే ' అనే మాట కూడ శ్రీవైష్ణవ సంప్రదాయంలోని పరమేశ్వర స్వరూపాన్ని వ్యాఖ్యానించేవి. శూర్పణఖ కోరికను సీత మన్నించి స్వామితో ఆమెను ఏలుకో మనడంలో సర్వజీవకోటి స్వామిచే ఆకృష్టులై ఆయన యందు రమిస్తున్నారనడం తాత్త్విక సత్యం. సర్వజీవులలో రమించువాడు రాముడు. "రమించువారెవరురా! రఘూత్తమ! నిను వినా! సమాన షడ్గుణగణ! సకలభువన జనులలో " అన్న త్యాగరాజ కృతి కూడ అన్నమయ్య కోవలోనిదే!

జీవేశ్వర శృంగారాన్నే అన్నమయ్య 'మరుతంత్ర' మన్నాడు. స్వామివారి 'మరుతంత్రం' సామాన్యుల కందేదికాదు. అర్థమయ్యేది కాదు.

కలసితి మిందరము కాఁగిటి పొత్తు
చెలఁగి నీ నేమములు చెప్పనేఁటి కికను ||పల్లవి||

కాంతలందరి తోడాను కలయఁగ నవ్వేవు
సంతవావు లాయగా నీ సరసములు
యింతలో నందరి మోవు లెంగిలి నేకములాయె
చెంతల నీ నేమములు చెప్పనేటికిఁకను ||కల||

చల్లఁగా నందరితో జూజములు నీ వాడేవు
గొల్ల దోమటాయగా నీ కోరికలు
కల్లకాదు రతివేళ కాఁగిళ్లెల్లా నొక్కటాయ
చిల్లర నీ నేమములు చెప్పనేటి కికిను ||కల||

వాడిక నందరి కొక్క వరుసిచ్చి కూడితివి
యీడ ఁగలకూరగంపెయైనసె ఁబొందు
తోడనే శ్రీవేంకటేశ దొమ్మెయ మరుతంత్రము
జీడిగా నీనేమములు చెప్పనేఁటి కిఁకను [43] ||కల||

"మన్మథుని కన్నతండ్రి మరుమంత్రములు" ఎవ్వరికీ అర్థమయ్యేవి కావు. ఎన్నో అవతారాలెత్తిన నీవు ఏదో గొప్ప నియమవంతుడవని చెప్పుకోకయ్యా! అసలు నీకే నియమాలూ, వావులూ, వరసలూ లేవనేది స్పష్టమైందంటున్నాడు అన్నమయ్య.

భక్తిశృంగారం లేదా మధురభక్తి అనే ముద్రతో అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చాలచోట్ల చర్విత చర్వణంగా అతివేలమైన లౌకిక శృంగారపు పోకడలు పోయాడు కదా! అది పఠిత యొక్క మానసిక స్థాయిని దిగజార్చడం లేదా? అని ప్రశ్నించవచ్చు. సరిగ్గా ఇటువంటి ప్రశ్నే పరీక్షిన్మహారాజు శుకమహర్షికి వేశాడు. మహాభాగవతంలో -

కథం స ధర్మసేతూనాం వక్తా కర్తాఽభిరక్షితా
ప్రతీప మాచరత్ బ్రహ్మన్ <u>పరదారాభిమర్శనమ్</u>
ఆప్తకామో యదుపతిః <u>కృతవాన్ వై జుగుప్సితమ్</u>
కిం అభిప్రాయ ఏతన్మే సంశయం ఛింది సువ్రత - భాగవతమ్
(స్కంధం 10-అధ్యా 33-శ్లో.29, 30)

దీనికి శుకమహర్షి సమాధానమిది -

శ్లో॥ <u>అనుగ్రహాయ</u>భూతానాం మానుషం దేహమాశ్రితః ।
భజతే తాదృశీః క్రీడాః యాచ్ఛ్రుత్వా తత్పరో భవేత్ ॥
(స్కంధం 10-అధ్యా 33-శ్లో.38)

దీనిలో 'అనుగ్రహాయ' అనే మాటను వ్యాఖ్యానిస్తూ శ్రీధరస్వామి -

"శృంగార రసాకృష్ట చేతసః బహిర్ముఖానపి
స్వపరాన్ కర్తు మితిభావః "

భగవత్పరంగా బహిర్ముఖానందమును పొందదలచిన వారిని కూడ స్వామి తన వారినిగా చేసికోవడానికి దయచూపుతాడట! "కామోత్కంఠత గోపికల్ . . . ." అనే పద్యంలో గోపికల కామభావనయే దీని కుదాహరణం.

శ్లో॥ శృంగార రససర్వస్వం శిఖపింఛ విభూషణమ్ ।
అంగీకృత నరాకారం ఆశ్రయే భువన త్రయమ్ ॥

అని లీలాశుకుల శ్రీకృష్ణ కర్ణామృతం.

శృంగార వర్ణనలు అన్నమయ్యలో బాహ్యాముఖంగా లౌకిక చేష్టలుగా కనబడినా, అంతరంగంలో భగవత్సంబంధ మైనవి కాబట్టి పవిత్రమైనవే! దీనికి శ్రీధరస్వామి ఇలా సమాధానం చెప్పారు.

"తదేవం కామానుగ్రహముఖేన కామజయం ప్రతిపాద్య"

కామాన్ని అనుగ్రహించే విధానం చేతనే కామజయాన్ని సాధించే ప్రక్రియ ఈ శృంగార ప్రక్రియ. ఈ 'మరుతంత్ర' ప్రక్రియను అన్నమయ్య దివ్యశృంగారంలో విలీనం చేసి శ్రీవైష్ణవ సంప్రదాయంలోని ప్రపత్తి శరణాగతులతోపాటు, భక్తిరస విశిష్టమైన మధురభక్తిని సాధించి నిరూపించినాడు. "చెల్లును గ్రామ్యములైనను" అని అన్నమయ్యే చెప్పాడు. శ్రీవైష్ణవ సంప్రదాయలో భగవంతుడు సర్వజీవుల శృంగారాన్ని తనలో విలీనంచేసుకొంటాడు కాబట్టి 'పచ్చిశృంగార'మనే సమస్యే లేదు. భక్తిరసప్రస్థానంలో పద కవితకు పట్టాభిషేకం చేసిన అన్నమయ్య, భక్తికి రసత్వసిద్ధిని సంగీత, నాట్యానుకూలమైన సంకీర్తనల ద్వారా సుసంపన్నం చేశాడు. శ్రీవేంకటేస్వరస్వామిని భక్తిరసాభిషిక్తుణ్ణి చేసి, భక్తుల హృదయాలలో రసతర్పణం చేశాడు.

## పాదసూచికలు

1. ఉత్తర భారతదేశంలో సంత్‌కబీర్‌దాస్ తర్వాత పండితలోకంలో ఏర్పడిన ప్రాచీన పరంపరాభిప్రాయమే ఈ దోహా (ద్విపద)గా బహుళ ప్రచారంలో ఉన్నది.
2. Philosophical Foundations of Bengal Vaishnavism - A Critical Exposition - S.C.Chakravarti, Academic Publishers, Calcutta, 1969.

3. Bhakti Movement in Orissa - A Comparative Study - Achintyakumar Dev, Calcutta, 1984.(preface).
4. Religion,Culture and Communalism (Globalisation and the Hindu People) - Prajasakti Book House, Hyderabad, 2002.
5. వాచస్పత్యమ్ - తారానాథ తర్కవాచస్పతి, మోతీలాల్ బనారసీ దాస్, వారణాశి, 1950.
6. గరుడపురాణం - షష్ఠాధ్యాయం - శ్లో. 262.
7. పోతన భాగవతం - ప్రథమ స్కంధం - 7వ అధ్యాయం.
8. "అపరిపక్వవాసనారూప కర్మాశ్రయా యావచ్ఛిన్నం బ్రహ్మ యావత్పరిపాకం నిశ్చల తరంగ సముద్రవత్తిష్ఠతి తచ్ఛివః" - సురేశ్వరాచార్యుల తైత్తిరీయోపనిషత్ భాష్యవార్తికమ్.
9. చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరి కీర్తినుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలఁపడేని
కలుగ నేటికిఁ దల్లుల కడుపుచేటు - పోతన భాగవతావతారిక.

పోతనభాగవతం - (సంపా) రాయప్రోలు సుబ్బారావు ప్రభృతులు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1965.

10. "ఇతి రామ శబ్దేన ప్రత్యగభిన్నం బ్రహ్మ ఉచ్యతే" అని రామతాపినీ, రామ రహస్యో పనిషత్తులు చెబుతున్నాయి. అద్వైతులు చేపట్టిన నామసిద్ధాంతంలో 'రామ' శబ్దం బ్రహ్మమునకు పర్యాయపదంగా వాడబడింది. నామసిద్ధాంత ప్రవర్తకులలో ఆచార్య పురుషుడైన ఉపనిషత్ బ్రహ్మయోగి (రామచంద్రేంద్ర లేక రామబ్రహ్మేంద్ర సరస్వతి) సమకాలీనుడు, ఆయన సూచనల మేరకు సిద్ధాంతం అద్వైతంగా, భక్తి విష్ణుభక్తిగా ప్రచారంచేసినవాడు సద్గురు త్యాగరాజస్వామి. ఈయన "రామాయని బ్రహ్మమునకు పేరు"

అని పై సంస్కృతవాక్యానికి తెలుగులో వ్రాస్తూ రామచింతన తెలిసి చేయాలని, నామము తెలిసి చేయాలని బోధించాడు. వ్యాసభాగవత పురాణంలో- 'ఏతే త్వంశక లాపుంసః కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అని చెప్ప బడగా, ఉత్తరభారతంలోని రామానందీయ రహస్య సంప్రదాయంలో వెలసిన భుశుండి రామాయణమనే రామ భాగవతంలో- ఏతే చాంశకలాశ్చైవ రామస్తు భగవాన్ స్వయమ్ (1-9-18) అని చెప్పడం గమనింప దగింది. 'భగవాన్' శబ్దానికి సృష్టి, స్థితి, లయకారకత్వం తన అధీనంలో గలవాడని అర్థం.

11. వాల్మీకి రామాయణమొక సుప్రసిద్ధమైన ఇతిహాసము. భారతమువలె నిది నానా మత భావ సంపుటము కాదు. . . రాముడీ లోకంలో అధర్మాన్ని రూపుమాపడం కోసం, ధర్మాన్ని సంరక్షించే నిమిత్తం ఉదయించాడు. మొదట నితిహాసముగా బయలుదేరిన ఈ గ్రంథము వైష్ణవతత్త్వమును బోషించునదిగా మార్పునొందినది — History of Indian Philosophy (భారతీయ తత్త్వ శాస్త్రము) Dr.S.Radha Krishnan, Vol -II 1953 & తెలుగు అనువాదం, బులుసు వేంకటేశ్వరులు.

12. ఆనందవర్ధనుని ధ్వన్యాలోకమ్ - తృతీయోద్ద్యోతం

13. శ్రీమద్రామానుజాచార్యుల గీతాభాష్యమ్ - భక్తియోగం - అవతారిక.

14. అష్టాదశ రహస్యంగళ్ - పిళ్లైలోకాచార్యులు.(తెలుగుసేత) -శ్రీ టి.కె.వి.యన్. సుదర్శనాచార్యులు శ్రీవైష్ణవ సంప్రదాయ గ్రంథ మాల -1, శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

15. విక్రమోర్వశీయమ్, ద్వితీయాంకము, ప్రథమ శ్లోకం.

16. Santa Rasa - J.L.Masson and M.V.Patwardhan - Bhandarkar Oriental Research Institute,Poone,1975.

17. కావ్యస్వరూపమ్ - (సంపా) స్వామిశివశంకరస్వామీ, పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1973.

18. సంవిధానక చక్రవర్తి - నాచనసోమన ఉత్తరహరివంశం విమర్శ-ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు, మలయకూట ప్రచురణలు, అనంతపురం, 1984.

19. శాంతరసం దానిస్థాయిభావాన్ని గూర్చిన విపుల ఆలంకారిక చర్చకు చూడు - 'వాల్మీకి- విశ్వనాథ రామకథానుశీలనం' - డా॥ ముదివేడు ప్రభాకరరావు, జ్ఞానప్రసూనమాలికా ప్రచురణలు, తిరుపతి,1993.

20. సర్వసిద్ధాంత సౌరభము (వైష్ణవఖండము, సంపుటి-8)-శ్రీ అనుభవానంద స్వాములవారు, అనుభవానంద గ్రంథమాల, బాపట్ల, 1960.

21. భుశుండి రామాయణమ్ (లేక) రామభాగవతమ్(సంస్కృతం) (పూర్వ-దక్షిణ- పశ్చిమోత్తర ఖండములు) (సంపా). ఆచార్య భగవతీ ప్రసాద్ సింహ, విశ్వ విద్యాలయ ప్రకాశనమ్, వారణాశి, 1975.

22. భక్తిరసామృతము - శ్రీల రూపగోస్వామి సంస్కృతంలో రచించిన 'భక్తి రసామృత సింధువు' కు సమగ్రవ్యాఖ్య. ఆంగ్లమూలం: శ్రీ ఎ.సి. భక్తివేదాంతస్వామి ప్రభుపాదులు. తెలుగుసేత : శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు. - భక్తివేదాంత బుక్‌ట్రస్ట్, ముంబాయి, 1970.

23. ఉజ్జ్వలనీలమణి - శ్రీల రూపగోస్వామి భక్తిని రసరాట్టుగా నిరూపించిన అలంకారశాస్త్రగ్రంథం. వ్యాఖ్యాతలు - జీవ గోస్వామి, విశ్వనాథ చక్రవర్తి. (సంపా) మహామహోపాధ్యాయ పండిత దుర్గాప్రసాద్, వాసుదేవలక్షణశాస్త్రి పణసీకర్, నిర్ణయసాగర్‌ప్రెస్, ముంబాయి,1932.

24. నానాశాస్త్ర విచారణైక నిపుణౌ సద్ధర్మ సంస్థాపకౌ
లోకానాం హితకారిణౌ త్రిభువనే మాన్యౌశరణ్యాకరౌ ।

రాధాకృష్ణ పదారవింద భజనా నందేన మత్తాలికౌ
వన్దే రూప, సనాతనౌ, రఘుయుగౌ, శ్రీజీవ, గోపాలకౌ ॥

అని చైతన్య సంప్రదాయంలోని సుప్రసిద్ధ శ్లోకం. మనపురాణాలలో బ్రహ్మమానస పుత్రులైన సనక, సనందన, సనాతన, సనత్కుమారులున్నారు. వారు పదేండ్లు దాటని బాలభావంతో నిత్య యోగులైన విష్ణుభక్తులు - శ్రీవిష్ణువు యొక్క సనాతన మూర్తిమత్త్వం తత్త్వతః తెలిసిన మహానుభావులు. ఆ కోవకు చెందినవారే శ్రీచైతన్య సంప్రదాయంలోని ఆర్గురు - భక్త యోగులు. వారే 1)శ్రీరూపగోస్వామి 2)సనాతనగోస్వామి 3)శ్రీరఘునాథభట్టగోస్వామి 4)శ్రీరఘునాథదాస గోస్వామి 5) శ్రీజీవగోస్వామి 6)శ్రీగోపాలభట్టగోస్వామి. వీరు జ్ఞాన వయో వృద్ధులైన భక్తయోగ పుంగవులు.

25. రూపగోస్వామి భక్తిరసామృత సింధువులో 15 విధాలైన భక్తి ప్రభేదాలను చెప్పాడు. ఈ గ్రంథం యొక్క పూర్తిపేరు భగవద్భక్తి రసామృత సింధువు. ఇందులో మొదటగా సామాన్యభక్తిని చెప్పి, శుద్ధ భక్తిలక్షణాలు నిర్వచింపబడింది. రెండవదశగా సాధనభక్తి చెప్పి, అరవైనాలుగు అంశాలు భక్తికి అంగాలుగా నిర్దేశింప బడినాయి. వీటిలో పటిష్ఠమైన ఐదు భగవత్సేవా ప్రకారాలు వివరించ బడినాయి. ఆ తర్వాత భావభక్తి, ప్రేమభక్తి, విశదీకరింప బడ్డాయి. ఇంతవరకు పూర్వవిభాగం.

దక్షిణ విభాగంలో భక్తిరస స్వరూపం విభావ, అనుభావ, సాత్త్విక; వ్యభిచార భావ, స్థాయీభావాలు, కృష్ణభక్తుల కథలు పరిచయం చేయబడినాయి. అన్యాభిలాషితాశూన్యం జ్ఞాన కర్మాద్యనావృతమ్। ఆనుకూల్యేన కృష్ణానుశీలనం భక్తిరుత్తమా ॥ అని భక్తి నిర్వచింప బడింది.

పశ్చిమ విభాగంలో ముఖ్యభక్తిరసం - వాటి భేదాలు వివరించ బడినాయి. శాంతభక్తి, దాస్యభక్తి, ప్రేయోభక్తి, సఖ్యభక్తి, వాత్సల్యభక్తి,

మధురభక్తి తెలుప బడినాయి. ఉత్తరవిభాగం గౌణభక్తి రసం. దీనిలో హాస్యభక్తి, అద్భుతభక్తి, వీరభక్తి, కరుణ భక్తి, రౌద్రభక్తి, భయానకభక్తి, బీభత్సభక్తి, వరుసగా చెప్పి చిట్టచివరగా మిత్రవిరోధి రసాలైన రససాంకర్య, రసాభాసములు వివరించి గ్రంథసమాప్తి చేయబడింది.

26. వృషాధిప శతకము - పాల్కురికి సోమనాథుడు. ప్రచురణ: బసవ సంక్షేమసమితి, హైదరాబాదు, 1996.

27. హరిభక్తి విలాసం - ప్రథమలహరి-శ్లో - 26.

28. ఆముక్తమాల్యద - శ్రీకృష్ణదేవరాయలు (6-7) వావిళ్లముద్రణ, చెన్నై, 2004.

29. సర్వేశ్వర శతకము - యథావాక్కుల అన్నమయ్య, వ్యాఖ్యాత - ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య హైదరాబాదు, 1998, పుట-26.

30. అధ్యాత్మసంకీర్తనలు - 3-576 "....యోని గేహములన్ రూపులు వన్నుకొంచును నటుండైవచ్చి సంసార రంగములోనన్ బహురూప మాడు వెలయుంగా జీవి సర్వేశ్వరా।" అని యథా వాక్కుల అన్నమయ్య చెప్పినట్లే - తాళ్లపాక అన్నమయ్య కూడ- ఆడితిబో బహు రూపాలన్ని యోనుల బుట్టి .... సంసారపు నాటకశాలలో ప్రతిమనైతి అంటాడు (అధ్యాత్మ2-6)

31. నాథోపజ్ఞం ప్రవృత్తం బహుభి
రుపచితం యామునేయం ప్రబోధైః।
త్రాతం సమ్యగ్యతీంద్రైః ఇద
మఖిల తమః కర్షణం దర్శనం నః॥

ఇది తత్త్వముక్తాకలాపంలో శ్రీవేదాంతదేశికులశ్లోకం. శ్రీమన్నాథ మునులచేప్రవర్తింప జేయబడి, శ్రీయామున ప్రబోధ రత్నములచే పోషింపబడి, యతి సార్వభౌముడైన రామానుజుని రచనలచే సురక్షిత మైన విశిష్టాద్వైత దర్శనము చీకటిని పారద్రోలుచున్నది.

32&33. సంకీర్తన లక్షణము - తాళ్లపాక చినతిరువేంగళనాథుడు వ్యాఖ్యాత, ఆంగ్లానువాదం - ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ చెన్నై, 1993.

34. పోతన భాగవతము - అవతారికాపద్యం-1
తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2006.

35. అధ్యాత్మ సంకీర్తనలు -2-466.

36. అధ్యాత్మ సంకీర్తనలు -4-434.

37. అధ్యాత్మ సంకీర్తనలు -4-438.

38. శ్రీవైష్ణవ సంప్రదాయంలోని పరంపరా శ్లోకం.

39. శ్వేతాశ్వతరోపనిషత్తు.

40. సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము
సకల మునీంద్రులు పూజించే యీ సాకారమే ప్రమాణము
నారదాదులగు భక్తులందరును నానా గతులరసి చూచి
సారపు-శ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము (అధ్యాత్మ, 2-412).

41. అధ్యాత్మ సంకీర్తనలు 2-159.

42. సంకీర్తన లక్షణం- తాళ్లపాక చినతిరువేంగళనాథుడు, వ్యాఖ్యాత, ఆంగ్లానువాదకుడు, ఆచార్య సాళ్వ కృష్ణమూర్తి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్, చెన్నై, 1996.

43. శృంగార సంకీర్తనలు - 8-116.

44. శృంగార సంకీర్తనలు - 9-126.

★ ★ ★

ఎస్. గంగప్ప

## అన్నమయ్య సంకీర్తనలు - భక్తియోగం

భక్తిభావన భారతీయతత్త్వం. అన్నమయ్య జనన సమయానికి భారతదేశమంతటా శ్రీకృష్ణభక్తి పూరితంగా గేయసాహిత్యం వెలసింది. ద్రావిడవేదమని ప్రసిద్ధి గాంచిన ద్రావిడ ప్రబంధాలలోని కృష్ణభక్తి తత్త్వాన్ని, శ్రీరామానుజాచార్యులు ప్రతిష్ఠాపించిన శ్రీవైష్ణవమత తత్త్వాన్ని, జయదేవుని కృష్ణభక్తి స్వరూపాన్ని ఆకళించుకొన్న అన్నమాచార్యులు - ఆనాడు రాజ గౌరవపాత్రమైన పద్యకవితను వదిలి - ప్రజలకందుబాటులో ఉండే పదం స్వీకరించి, సాహిత్యానికి సంగీతం జోడించి, ఆనాటి సంక్షుభిత సమాజాన్ని సముద్ధరించడానికి కృష్ణభక్తి తత్త్వాన్ని ప్రచారంచేయ నారంభించాడు. ఆయన ప్రజలను తరింపజేశాడు. శృంగార సంకీర్తనలలో మధురభక్తిని, అధ్యాత్మిక సంకీర్తనల్లో భక్తి తత్త్వాన్ని నిరూపించాడు.

భగవద్భక్తిని భక్తియోగమని పేర్కొన్నారు పెద్దలు. వాస్తవానికి కర్మయోగము, జ్ఞాన యోగము, భక్తియోగమని నిరూపించింది భగవద్గీత. అన్నమాచార్యులు జ్ఞానయోగాన్ని జ్ఞానయజ్ఞంగా వివరించడం విశేషం. అదే మోక్షసాధన మంటాడు.

"జ్ఞానయజ్ఞమాగతి మోక్షసాధనము
నానార్థములు నిన్నే నడపె మా గురుఁడు" (2- 148)

ఇంతకంటే జ్ఞానకర్మయోగాలకంటే సర్వజనసులభమైనది భక్తియోగం. భక్తి అంటే ఏమిటి? ఎన్ని విధాలు ? అని తెలుసుకొని అన్నమాచార్యుల భక్తిప్రపత్తిని వివిధ రీతులను పరిశీలిద్దాం.

ప్రత్యేకించి అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలలో వివరించ బడిన భక్తిప్రపత్తి మన మనోనయనాలకు అందివచ్చినంత ఆనంద కందమైన రీతిని పరిశీలనార్థం.

'భక్తి '- అన్నది 'భజ్ 'ధాతువు నుంచి పుట్టింది; అంటే భజించడ మన్న మాట.

భగవద్భజనమని అర్థం. శంకరాచార్యులవారు భక్తిని నిలా నిర్వ చించారు.

"అంకోలం నిజబీజ సంతతి రయస్కాంతోపలం సూచికా
సాధ్వీనైజ విభుం లతా క్షితిరుహం సింధుస్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహయ తథా పశుపతేః పాదారవింద ద్వయమ్
చేతోవృత్తి రుపేత తిష్ఠతి సదా, సా భక్తి రిత్యుచ్యతే ॥"

(శివానందలహరి-శ్లో.51)

- అనేశ్లోకంలో సహజంగా, సముచితంగా వివరించబడింది. మనస్సు పరమేశ్వరుని పాదార విందాలకడకు పోవడమే భక్తి అని చెప్పబడింది. నారదమహర్షి భక్తి సూత్రాలలో "సా తస్మిన్ ప్రేమ రూపా"(సూ.2). భక్తి పరమేశ్వరుని పరమప్రేమరూపంగా ఉందని చెప్పబడింది. అంటే ఈశ్వరుని యెడగల ఉత్తమమైన ప్రేమయే భక్తి. దీని విశిష్టతను తెలపడానికే ఆ నారదమహర్షి "భక్తిరేవ గరీయసీ"(సూ.81) - అని స్పష్టీకరించాడు. ఇలాగే శాండిల్య భక్తిసూత్రాలలోను వివరించ బడింది. "సా పరానురక్తి రీశ్వరే" (సూ-2) - అంటే భగవంతుని యెడ గల పరమప్రీతి (గాఢానురాగం) భక్తి - అని చెప్పబడింది. పరమపూజ్యమైన ప్రీతియే భక్తి-భగవంతుని యెడగల ఆ పరమపూజ్య భావమేభక్తి. ఈ భక్తి తొమ్మిదివిధాలని భాగవతం సప్తమ స్కంధంలో చెప్పబడి వివరించబడింది.

భగవంతుని పవిత్రచరిత్ర, గుణమహిమాదుల్ని వినడం శ్రవణం తరువాత కీర్తించడం కీర్తనం. నామరూప స్వరూపాల్ని స్మరించడం స్మరణం. పాదాల్ని సేవించడం పాదసేవనం. అర్చించడం అర్చనం.

నమస్కరించడం వందనం. భగవంతునికి దాస్యంచేయడం దాస్యం; సామ్యగుణాల్ని పొంది సఖ్యమొనరించడం సఖ్యం. చివరికి ఆత్మను భగవంతుని యందు చేర్చడం అత్మనివేదనం. ఈ తొమ్మిది విధాలైన భక్తి ఒకదాని కంటే మరొకటి శ్రేష్ఠమై చివరికి భగవంతుని యందు ఆత్మనివేదనంతో పరిపూర్ణమవుతుంది.

పై భక్తి రీతులలో విశిష్టమైందనీ, కలియుగంలో హరినామ సంకీర్తనమే మానవాళికి మోక్ష సాధనమనే విషయం వివరించబడింది.

"ధ్యాయన్కృతే, యజన్ యజ్ఞైస్త్రేతాయామ్
ద్వాపరేఽర్చయన్ యదాప్నోతిదాప్నోతికలౌసంకీర్త్యకేశవమ్"
(విష్ణుపురాణం - 6 - 2 - 17)

- అంటే కృతయుగంలో ధ్యానమూ, త్రేతాయుగంలో యజ్ఞకర్మ, ద్వాపర యుగంలో అర్చనమూ ఎలాంటి ఫలాన్నిస్తాయో కలి యుగంలో హరినామ సంకీర్తనమలాంటి ఫలాన్నిస్తుందని స్పష్టం చేయబడింది. అందుకే అన్నమాచార్యులు కలియుగంలో హరినామ సంకీర్తనం పంచమవేదమని పేర్కొని, తన పదాలలో బహురీతుల సంకీర్తించాడు.

"కలియుగంబునకు గలదిదియె
వెలసిన పంచమ వేదమె కలిగె ||పల్లవి||

పరమగు వేదము బహుళము చదివియు
హరినెఱిఁగిన వారరుదనుచు
తిరువాముడియై దివ్య మంత్రమై
వెలసిన పంచమ వేదమె కలిగె ||కలి||

బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకెదీర దెచ్చుట ననుచు
సంకీర్తనమే సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమే కలిగె ||కలి|| (2-పుట 401)

- ఇలా విశ్వసించిన అన్నమాచార్యుడు ఈ నామ సంకీర్తన తాను రచించిన వేల పదాలలో సంకీర్తన చేసి చేసి తరించాడు. ఈ పదాలలోని అన్నమాచార్యుని నవవిధ భక్తి తత్త్వాన్ని ఎలా స్పష్టీకరించడం జరిగిందో తెలుసుకొంటే అన్నమాచార్యుని భక్తి యోగం విదిత మవుతుంది.

భక్తి ప్రధానమనీ, పేర్కొంటూ నవవిధ భక్తిరీతులను అన్నమా చార్యుడు ఒకేపదంలో పేర్కొనడం గమనించగలము.

"నిత్య సుఖానందమిదె నీ దాస్యము
సత్యములేని సుఖాలు చాలు (జాలునయ్యా ॥పల్లవి॥

కన్నుచూపుల సుఖము కడు నీచక్కని రూపె
యెన్నగ వీనుల సుఖమిదె నీపేరు
పన్ని నాలుక సుఖము పాదపునీ తులసి
వున్న సుఖముల తెరు వొడ( బడమయ్యా ॥నిత్య॥

తనువుతోడి సుఖము తగునీకైంకర్యము
మనసులో సుఖము నీమంచి ధ్యానము
పనివి యూర్పు సుఖము పాదపద్మము వాసన
యెనయని పెరసుఖ మేమి సేసేనయ్యా ॥నిత్య॥

పుట్టుగుకెల్లసుఖము పొల్లులేని నీభక్తి
తొట్టికాళ్ల సుఖము పాతురలాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచన వోలి చెన్నుడవై
వొట్టుకొని మమ్మేలతి వోహో మేలయ్యా ॥నిత్య॥ (4-78)

- ఈ విధంగా వివరించిన ఒకే పదంలోని నవవిధభక్తి రీతుల్ని అనేక పదాలలో అన్నమాచార్యుడు మరి మరీ స్మరించి ఉండడాన్ని పరిశీలిద్దాము.

నవవిధభక్తి రీతుల్లో శ్రవణం మొదటిది. నామశ్రవణం ముఖ్యం.

## శ్రవణం

"ఎన్నడు జెడనియీవు లిచ్చేని మాధవుడు
పన్నినయాస లితనిపైపై నిలుపవో ॥పల్లవి॥

వీనులాలా యే పొద్దు విష్ణుకథలే వినరో
ఆనినచేతు లితనికంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షు (జూడరో
యీనేటి పాపాల బారినేల పడేవి(రి?) కను ॥ఎన్నడు॥
(4 - 14)

"వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ" (3-355)

## కీర్తనం

"చాలదా బ్రహ్మ మిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడ(గించు సంకీర్తనం" (1-343)

## పాదసేవనం

"శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ శ్రీపాదమే శరణు ॥పల్లవి॥

కమలాసతీముఖకమలకమలహిత
కమల ప్రియ కమలేక్షణా
కమలాసనాహిత గరుడగమన శ్రీ -
కమలనాభ నీపదకమలమే శరణు" ॥శ్రీమ॥ (1- 155)

"విడువ విడువ నింక విష్ణుడు నీ పాదములు
కడిగి సంసారమార్ధి కడుముంచుకొనిన " (అధ్యా.సం.4-206)

## అర్చనం

"ఎన్ని చందముల నెట్టైన నుతింతు
కన్నుల నిన్నే కనుగొంటి గాన ॥పల్లవి॥

గోవిందా యని కొలిచిన నిన్నే
శ్రీవల్లభుడని చింతింతును
భూవిభుడవు యిది పునరుక్తనకుమీ
దైవమొకఁడవే ధరణికి ఁగాన (3-427)

## వందనం

"ఉన్న సుద్దులేల మాకువూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు" (4-236)

## స్మరణం

"ఎందుకు బనిగొందము యేమి సేత మివియెల్లా
చెందిన మా కిక బుద్ధి చెప్పవే నారాయణా ||పల్లవి||

హరినామమొకటనే అణగె బాపములు
వొరసి యన్నినామము లూరకున్నవి
సిరులిచ్చె గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామములెల్లా పెట్టెలలో నున్నవి ||ఎందు|| (3-297)

## దాస్యం

"పనిగొను వారల భాగ్యమిది
వెనకముందరికి వివేక మొకటే ||పల్లవి||

అర్మిలి దుఃఖము నతి సుఖములకు గురి
కర్మంబొకడే కలది
కూర్మి శ్రీవేంకటగురుదైవము ఁగను -
ధర్మమున కతని దాస్యమే కలది ||పని||" (4-7)

## సఖ్యం

"బలువగు ఁదనరూపము చూపెన్
కలదింతయు ఁదనఘన తెఱిఁగించెన్ ||పల్లవి||

పాండవరక్షణపరుడై నరునకు
నండనే తెలిపె మహామహిమ
దండి విడిచి తనదయతో నర్జును -
డుండగ మగటిమి నొడఁబడ ఁబలికె ||బలు||

మగుడఁగ కులధర్మములు బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెన్
నగుచు నతనితో నానాగతులను
నిగమము నియమమునిజ మెరిగించెన్ ||బలు||

వెరవుమిగుల నావిజయునిమనుమని
పరీక్షిత్తు దగ బ్రదికించెన్
తిరువేంకటగిరిదేవుఁడు దానై
గరిమల భారతకథ గలిగించెన్ ||బలు|| (1-295)

## ఆత్మనివేదనం

అన్నమాచార్యుల భక్తి ప్రపత్తి, శరణాగతి ప్రధానాంశాలని అతని అధ్యాత్మ సంకీర్తన లన్నింటా వ్యక్తమవుతుంది. అతని ఆధ్యాత్మిక సంకీర్తనలన్నీ ఆత్మనివేదాత్మకాలనడంలో సందేహంలేదు. సర్వం భగవదర్పితం చేసుకోవడం ఆత్మనివేదనం.

ఇంతట గావగదే ఇందిరానాయక నన్ను
పంతాన గాకాసురుని బాలించినట్లు ||పల్లవి||

దించనిపంచభూతాలదేహము మోచితిగాన
నించినయజ్ఞానమున నిన్ను నెరగ
పంచేంద్రియములచే బట్టువడ్డవాడగాన
యెంచరానిపాపములే ఇన్నియు జేసితిని ||ఇంత||

మిన్నువంటిజఠరాగ్ని మింగివున్నవాడగాన
కన్నవెల్లా వేడి వేడి కష్టపడతి

పన్నినసంసారపుభ్రమ బద్ధవాడగాన
అన్నిటా దేవతలకు సరిగాపనైతి ॥ఇంత॥

ఆతుమలో నీ వుండేభాగ్యముగల వాడగాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవేంకటేశ నీపాలివాడగాన
బాతితో సర్వము నీకొప్పనముసేసితిని ॥ఇంత॥ (3-443)

విస్తారమైన ఈ వివరణవల్ల హరినామం వినడం మొదలు ఆత్మనివేదనం వరకు గల నవవిధ భక్తిరీతులు అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలవల్ల స్పష్టమవుతున్నాయి.

ఇంతేగాక పన్నిద్దరాళ్వరుల భక్తి యోగం పునాదిగా, శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైతమతాన్ని నిరూపించడం వల్ల అందులో ప్రధానంగా శరణాగతి, ప్రపత్తి, హరిదాసు, గురువు - ఆచార్యుడు మొదలైన అంశాలు ప్రముఖంగా పరిగణించబడతాయి. ఇవన్నీ అన్నమా చార్యుల అధ్యాత్మ పదాల్లో మనకు విదితమవుతాయి.

## ఆత్మపరమాత్మలు

"కొసరనేల నాగుణము లివి
రసికత నీవిన్నిటా రక్షించుకొనుమీ ॥పల్లవి॥

నేరమి నాది నేరుపు నీదే
దూరు నాది బంధుడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమీ ॥కొస॥

నేను యాచకుడ నీవేదాతవు
దీనుఁడ నే ఁబరదేవుఁడవు
జ్ఞానరహితుఁడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిఁక నను ఁజేరి కావుమీ ॥కొస॥ (4-176)

## శరణాగతి

అరసి నన్ను (గాచినాతనికి శరణు
పరము నిహమునేలేపతికిని శరణు ॥పల్లవి॥

వేదములుదెచ్చినట్టివిభునికి శరణు
ఆదిమూలమంటేవచ్చినతనికి శరణు
యేదెసా దానై యున్నయీతనికి శరణు
శ్రీదేవిమగడైన శ్రీపతికి శరణు ॥అర॥ (3 - 374)

## ప్రపత్తి

"అన్నిటా నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను
యెన్నఁగ నీవొక్కఁడవే గతియని యెంచి కొలుచుటే ప్రపన్నసంగతి
॥పల్లవి॥

యేకాంతంబున నుండిన పతిని యెనసిరమించుటే సతిధర్మంబు
లోకము రచ్చలోనుండినపతి లోఁగొని పైకొని(న?) రానట్లు;
యీకొలఁదులనే సర్వదేవతలయిన్ని రూపులై నీవున్నప్పుడు
కైకొని నిను బహుముఖములఁగొలుచుట గాదు పతివ్రత ధర్మంబు
॥అన్ని॥ (1-386)

## గురువు - ఆచార్యుడు

"కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతి నీవే కావ గదవయ్యా (4-136)

"కైకొన్న కొలఁది కర్మము
వాకుచ్చి తనతోనే వగవఁగనేలా ॥పల్లవి॥

మచ్చిక నొడివినంతే మంత్రము
అచ్చపుభక్తి కొలఁదే యాచార్యుఁడు
నిచ్చలు గోరినయంతే నిజమైనలోకము
పచ్చివెచ్చి చదువుల భ్రమయగనేలా ॥కైకొ॥ (4- 220)

ఇలాగే హరిదాసు, దాసానుదాసు, హరి ఒక్కడే దిక్కు - అనే అంశాలను వివరించడానికి ఉదాహరణలున్నాయి.

## సర్వం విష్ణుమయం

చేరి యశోదకు శిశువితఁడు
ధారుణి బ్రహ్మకు దండ్రియు నితడు"          (3-485)

"సర్వం విష్ణుమయం" బనుభావము సత్యం సత్యం బిన్నిటను
సర్వేశ్వరుడే పొందేటివస్తువు శరణాగతియే వుపాయము
(4- 90)

ఈ విధంగా భక్తి యోగాన్ని పలుముఖాల అనుభవించిన అన్నమాచార్యులు తన పదాల్లో వివరించిన తీరు విశిష్టంగా విదితమవుతుంది.

పైరీతిగా నవవిధ భక్తిరీతులు, పంచవిధ భక్తిరీతులతో పాటు శాంతం, దాస్యం, సఖ్యం, వాత్సల్యం, మధురం - అనే పంచభావాలు అత్యంతావశ్యకమైనవిగా పెద్దల వక్కణ. వీటన్నిటికి అన్నమాచార్యుల సంకీర్తనల్లో కోకొల్లలుగా ఉదాహరణలున్నాయి. ఇవి భావాలు అని కొందరు[1] రీతి అని మరికొందరు[2] ఆసక్తి అని ఇంకొందరు[3] భక్తి అని తదితరులు[4] పేర్కొన్నా రససూర్తిని పొందిన విధం విదితం. వీటిని లాక్షణికులు రసాలుగానే నిరూపించారు. ఇతఃపూర్వమే దాస్యం, సఖ్యం, భక్తిని గూర్చి తెలుసుకొన్నాము. శాంతం, వాత్సల్యం, మధురం - రసాలు అయిన రీతిని ఉదాహరణ పూర్వకంగా తెలుసుకొందాము.

## శాంతం

శాంతం నవవిధరసాల్లో ఒకటని విజ్ఞులకు విదితమే. "పరాభక్తి యొక్క రూపమే శాంతభక్తి అంటారు. భగవంతుని ఆత్మనాగ్రహించి సర్వదా అభిన్నుడై , సమదర్శనుడై, అనన్యభావమున ప్రేమించుచు అద్వైతానందనిమగ్నుడైన బ్రహ్మజ్ఞానినే శాంతభక్తు డంటారు"[5]. ఇందుకు చక్కటి ఉదాహరణ

"నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యు డీ తిరువేంకటాద్రి విభుడు ||పల్లవి|| (1-75)

## వాత్సల్యం

వీటన్నిటా విశిష్టమైనది వాత్సల్యభక్తి. తల్లి బిడ్డమీద ఎంతప్రేమతో ఉంటుందో యశోదాదేవి కృష్ణునిపై గోపికలు నేరారోపణ చేయగా తిరస్కరించిన తీరులో విదిత మవుతుంది.

"మొత్తకురే యమ్మలాల ముద్దులాఁడు వీఁడె
ముత్తమువలె నున్నాఁడు ముద్దులాఁడు " (6-104)

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని ||పల్లవి||

బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును
చేయివెట్టకుందురా చిన్నిబిడ్డలు
మీయిండ్లు జతనాలు మీరు సేసికొనక
పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని ||కాన||

మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ
ఆసపడకుందురా ఆడేబిడ్డలు
వోసరించి మోసపోక వుండలేక మీరు
నేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని ||కాన||

చొక్కమైన కొప్పెరలజున్నులు జిన్నులును
చిక్కినవిడుతురా చిన్నిబిడ్డలు
మిక్కిలి పూజలు సేసి మెచ్చించఁ దగదా
యెక్కువైన తిరువేంకటేశుడైన బిడ్డని ||కాన|| (5-253)

ఇలాగా అన్నమాచార్యుల పదాల్లోని భక్తియోగం అనేకరీతుల మనం దర్శించగలము. ఇది ఆమహాభక్తుని భక్తితత్త్వావిష్కరణం. ఇది పలు ముఖాల భక్తి తత్త్వ స్వరూప నిరూపణం.

## పాదసూచికలు

1. Dr. Bhagavat Kumar Goswami Sastry : Bhakti Cult in Ancient Indian p.390
2. డా॥ వేటూరి ఆనందమూర్తి తాళ్లపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషాలు - ద్వి.భా.పు. 171-174.
3. ఆరుద్ర, అన్నమయ్య సమగ్రాంధ్రసాహిత్యం. సం.iv. పు.163- 169.
4. పై. దే..పు. 164.
5. అన్నమాచార్య సంకీర్తనలు; ఉత్సవగాయకోపయోగార్థ మాధృతములు-పు-112.

## ఉపకరించిన గ్రంథాలు


1. అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు - తులనాత్మక అధ్యయనం 1992.
2. అన్నమాచార్య సంకీర్తన సుధ - 1995.
3. పదసాహిత్య పరిమళం - 1994.
4. అన్నమాచార్య సంకీర్తన సౌరభం - 2002.
5. క్షేత్రయ్య పదసాహిత్యం - 1977.
6. తెలుగులో పదకవిత - 1983.
7. అన్నమాచార్య సంకీర్తన సాహిత్యవైశిష్ట్యం (అముద్రితం).
8. ప్రథమవాగ్గేయకారుడు అన్నమాచార్యుడు (అముద్రితం).


★ ★ ★

జక్కంపూడి మునిరత్నం

# అన్నమయ్య సంకీర్తనలు - భక్తిమార్గాలు

ఈ విశాల విశ్వంలో 84 లక్షల రకాల జీవరాశులున్నట్టు చెబుతారు. వీటన్నిటి లోనూ మానవజన్మ శ్రేష్ఠమైందని విజ్ఞుల విశ్వాసం. మానవ జన్మ నెత్తే ముందు జీవుడు ఈ ఎనభై మూడులక్షల తొంభైతొమ్మిదివేల తొమ్మిదివందలా తొంభైతొమ్మిది శరీరాలు ధరించిన పిమ్మటే మానవ శరీరాన్ని ధరిస్తాడని ప్రాజ్ఞుల ప్రగాఢభావన. ఇదే చివర జన్మ. మనిషి తన కర్మలను బట్టి మోక్షాన్నైనా పొందవచ్చు లేదా వెనక్కి వెళ్ళి ఇతర జీవరాశుల్లో ఏదో ఒక దేహం ధరించవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే పరమపద సోపానపటంలో నూరుసంఖ్యకు దగ్గరున్నట్టే మానవజన్మ. ప్రమాదవశాత్తు పామునోటిలో పడితే మళ్ళీ మొదటికి రావాలి. మునుపటి లాగే క్రమంగా పైకి రావాలి. ఇలా కాకుండా మానవజన్మను సద్వినియోగం చేసుకొని భగవంతుడిన్ని ఆశ్రయించి భవసాగరాన్ని తరించాలని మహాపురుషులు సెలవిస్తున్నారు.

మానవుడు బుద్ధిపుట్టినట్టల్లా మసులుకోవడానికి లేదు. మాయ అతన్ని తనచెప్పు చేతుల్లో ఉంచు కొంటుంది. కర్మాన్నిబట్టి సుఖదుఃఖాలు మారి మారి వస్తుంటాయి. ఈ మాయనుంచి, సుఖదుఃఖాల నుంచి, కర్మ బంధాల నుంచి, పుట్టుకల పరంపరనుంచి బయట పడి కేవల నిర్వికల్పానంద మయంగా భగవంతునితో తాదాత్మ్యం చెందడమే మోక్షమని చెబుతారు.

మోక్షానికి చాలా మార్గాలున్నాయి. జ్ఞానాన్ని పొంది దానితో మోక్షం పొందడం. 'జ్ఞానాదేవహి కైవల్యమ్' భక్తితో మోక్షాన్ని పొందడం సత్కర్మతో మోక్షాన్ని పొందడం ప్రధానంగా చెప్పుకోదగ్గ మార్గాలు. వీటిలో భక్తి ప్రముఖమైంది. సులభ మైంది. శ్రేష్ఠమైంది. అందుకే 'మోక్షసాధన

సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ' అన్నారు పెద్దలు. భక్తిని నాలుగు విధాలుగా చెప్పుకోవచ్చు. మొదటిది పరిచయం, రెండవది అభిమానం, మూడవది ప్రేమ, నాలుగవది భక్తి. ఒక వ్యక్తి గుణ గణాలను, మంచినడవడిని గురించి మొదట తెలుసుకోవడం పరిచయంగా పరిగణింపబడుతుంది. పరిచయం కలిగిన తరువాత ఆ వ్యక్తిపట్ల ఆకర్షితులు కావడం జరుగుతుంది. దీన్నే అభిమానమని పేర్కొనవచ్చు. అభిమానం కాస్త ఎక్కువైతే అది ప్రేమగా రూపాంతరం చెందుతుంది. మరికొంత దగ్గరయ్యేందుకు అవకాశ మేర్పడు తుంది. ఆ ప్రేమ బాగా ఎక్కువైతే అది భక్తిగా పల్లవిస్తుంది. మానవుల విషయంలోనేగాక భగవంతుని విషయంలో కూడా ఈ క్రమ పరిణామం వర్తిస్తుంది.

## భక్తి విశిష్టత

మోక్షాన్ని సంపాదించేందుకు మార్గాలెన్నో ఉన్నప్పటికీ భక్తి వాటిలో శ్రేష్ఠమైందని భాగవతం తెలియజేసింది. సద్యోముక్తిని గురించి, క్రమముక్తిని గురించి అడిగిన పరీక్షిత్తు మహారాజుకు శుకమహర్షి భక్తి విశిష్టతను తెలియజేశాడు. బ్రహ్మదేవుడు మూడుసార్లు వేదాన్ని పరామర్శించి ముక్తి వేటివల్లనూ సాధ్యం కాదని భక్తి వల్లమాత్రమే అది సాధ్యపడు తుందని జనార్దనుని ఆత్మస్వరూపాన్ని చింతించాడు - బ్రహ్మదేవుని ఈ చర్య భక్తి ఎంత విశిష్టమైందో తెలుసుకునేందుకు చక్కని ప్రమాణంకదా.

ఈ అంశాన్ని తెలియజేసే పోతనగారి పద్యమిది.

మ. వినుమంభోజభవుండుమున్ను మదిలో వేదంబు ముమ్మాఱుధ
ర్మ నయజ్ఞత్వముతోడ నెంతయుఁ బరామర్శించి మోక్షంబు ద
క్కిన మార్గంబున వెంటలేదనుచు భక్తిం జింతసేసెన్ జనా
ర్దనునాత్మాకృతి నిర్వికారుఁడగుచు దన్మార్గ నిర్ణేతయై[1]

భగవంతుడు భక్తికి కట్టుబడి భక్తునివెంట వెళుతుంటాడు. ఇది భక్తి వైశిష్ట్యానికి పరాకాష్ఠ అంబరీషోపాఖ్యానంలో దుర్వాసుడికి చెప్పిన మాటల్లో భక్తి వైశిష్ట్యం భాసిస్తుంది.

"... భక్తుడెందుఁ జనినఁ బఱతెంతు వెనువెంట
గోవు వెంట దగులు కోడె భంగి"[2]

కర్మ, జ్ఞాన, యోగాల కంటె గూడ భక్తి ఎంతో శ్రేష్ఠమైందని నారదుడు అభిప్రాయ పడ్డాడు. "సా తు కర్మజ్ఞాన యోగేభక్త్యధికతరో[3]"

నారదుడేగాక పలువురు మహాపురుషులుకూడా భక్తి మహోత్కృష్ట మైందని చెప్పినట్టు నారద భక్తిసూత్రాల్లో వుంది.

"ఇత్యేవం వదంతి, జనజల్ప నిర్గమా ఏక మతాః కుమారవ్యాసశుక శాండిల్య గర్గ విష్ణుకౌండిన్య శేషోద్ధవారుణి బలి హనుమద్వీభీషణాది యోభక్త్యా బోధ్యాః"[4]

భక్తిశబ్దాన్ని పండితులు ఈ విధంగా నిర్వచించారు. 'భజ్' ధాతువుకు 'క్తి' ప్రత్యయం చేరి భక్తి శబ్దమేర్పడింది. 'భజ్' అంటే 'భజించడం, సేవించడం, ప్రేమించడం, అర్చించడం' అని అనేకార్థాలు చెప్పబడ్డాయి.

దైవార్చనాదులపట్ల ఏర్పడే అనురక్తే భక్తి అని వ్యాసమహర్షి అభిప్రాయం. దైవకథలపట్ల కలిగే అపేక్షే భక్తి అని గర్గమహర్షి తెలియ జేశాడు. ఈశ్వరానురక్తే భక్తి అని శాండిల్య మహర్షి మతం. వీరేగాక త్రిమతాచార్యులు, తమ అమూల్యాభిప్రాయాలను సెలవిచ్చారు. వీరందరి అభిప్రాయాల్ని దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే ఎంతో ఆర్ద్రతతో, అనిర్వచనీయ మైన ప్రేమతో, పలురకాలుగా భగవంతునితో నెలకొల్పుకొనే సత్సంబంధమే భక్తి అని తేలుతుంది.

## భక్తిరకాలు

భక్తిరకాలను గురించి విభిన్నాభిప్రాయాలు వ్యాప్తిలో ఉన్నాయి. గుణభేదాలను బట్టి భక్తి మూడురకాలు. సాత్విక భక్తి, రాజసభక్తి, తామసభక్తి. శ్రీకృష్ణభగవానుడు నాలుగురకాల భక్తులు తనను భజిస్తారని శ్రీమద్భగవద్గీతలో తెలియజేశాడు. "చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ఆర్తో జిజ్ఞాసురర్థా ర్థీ జ్ఞానీచ భరతర్షభ" ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థీ, జ్ఞాని, ఆ నలుగురూ కృష్ణుడు పేర్కొన్న భక్తులు. వీరవలంబించే

భక్తే నాలుగురకాల భక్తి. విజ్ఞానసర్వస్వం ఐదురకాల భక్తిని పేర్కొంది అవి. 1.శాంతభక్తి, 2.దాస్యభక్తి, 3.సఖ్యభక్తి, 4.వాత్సల్యభక్తి, 5.మధురభక్తి. నారదుడు పదకొండు రకాల భక్తిని పేర్కొన్నాడు. అవి గుణామాహాత్మ్యా సక్తి, రూపాశక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, కాంతాసక్తి, వాత్సల్యాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయతా సక్తి, పరమవిరహాసక్తి. అన్నమయ్య కూడా పదకొండు రకాల భక్తి భేదాలను పేర్కొంటూ ఒక కీర్తన రచించాడు.

"నానా భక్తులివి నరుల మార్గములు
యేనెపానైనా నాతడియ్యకొనుభక్తి ॥పల్లవి॥

హరికిగా వాదించుటది ఉన్మాదభక్తి
పరుల గొలువకుంటే పతివ్రతాభక్తి
అరసి యాత్మ గనుటదియే విజ్ఞానభక్తి
అరమరచి చొక్కుటే ఆనందభక్తి ॥నానా॥

అతిసాహసాల పూజ అదిరాక్షసభక్తి
అతని దాసుల సేవే అదియే తురీయభక్తి
క్షితినొకపని గోర చేసుటే తామసభక్తి
అతడేగతని వుండుటది వైరాగ్యభక్తి ॥నానా॥

అట్టె స్వతంత్రుడౌటే అది రాజసభక్తి
నెట్టన శరణనుటే నిర్మల భక్తి
గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి
తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి[5] ॥నానా॥

ఈ కీర్తనద్వారా అన్నమయ్య వెల్లడించిన భక్తిరకాలు (ఉన్మాదభక్తి, పతివ్రతాభక్తి, విజ్ఞానభక్తి, ఆనందభక్తి, రాక్షసభక్తి, తురీయభక్తి, తామసభక్తి, వైరాగ్యభక్తి, రాజసభక్తి, నిర్మలభక్తి, నిజభక్తి) భాగవతంలో ప్రహ్లాదుడు తొమ్మిది భక్తిరకాలను పేర్కొనడం గమనించవచ్చు.

"శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్"

"ఇతి పుంసాऽర్పితా విష్ణౌభక్తిశ్చేన్నవలక్షణా
త్యద్ధా భగవ తన్మయేऽధీ తముత్తమమ్"[6]

ప్రహ్లాదుడు పేర్కొన్న భక్తిరకాలు శ్రవణభక్తి, కీర్తనభక్తి, స్మరణభక్తి, పాదసేవనభక్తి, అర్చనభక్తి, వందనభక్తి, దాస్యభక్తి, సఖ్యభక్తి, ఆత్మ నివేదనాభక్తి.

అన్నమయ్య రచించిన కీర్తనలన్నిటిలోను భక్తి తొణికిసలాడటం నిర్వివాదాంశం.

కొన్నిచోట్ల స్పష్టంగానూ మరికొన్ని చోట్ల అస్పష్టంగానూ, ఇంకొన్ని చోట్ల భూగర్భజల ప్రాయంగానూ ఇది కనిపిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో ఆవిష్కృతమైన భక్తిరకాలన్నిటిని సూక్ష్మంగా పరిశీలించడానికి పూనుకోవడం శక్తికి మించిన పనే అవుతుంది. సుదీర్ఘకాలం తీసుకుంటుంది. అందువల్ల అన్నమయ్య సంకీర్తనల్లో గోచరించే భక్తిమార్గాల్లో ప్రధానమైన వాటిని మాత్రమే ఈవ్యాసం ప్రస్తావిస్తుంది. అవి మధురభక్తి, వాత్సల్య భక్తి, శ్రవణభక్తి, కీర్తన భక్తి, స్మరణభక్తి, పాదసేవనభక్తి, అర్చనభక్తి, వందనభక్తి, దాస్యభక్తి, సఖ్యభక్తి, ఆత్మనివేదనా భక్తి.

## మధురభక్తి

వివిధరకాల భక్తిలో మధురభక్తికి సముచితస్థానం ఉంది. శృంగార పరంగా భగవంతుణ్ణి ఆరాధించడానికి తోడ్పడే ఈ భక్తికి శృంగారభక్తి, మధురభక్తి దివ్యప్రణయమని పేర్లు. జీవుడు లేదా భక్తుడు నాయికగా భగవంతుడు నాయకుడుగా ఈ విధానంలో ప్రధాన పాత్ర వహిస్తారు. నాయిక నాయకుణ్ణి పొందేందుకు అహర్నిశలూ ఆరాటపడుతుంది. విరహంతో వేగిపోతుంది. చివరికి సంయోగంతో కథ సుఖాంత మవుతుంది.

ఈ విధానంలో అయోగ, సంయోగ, వియోగ శృంగారాలు కీలకపాత్ర వహిస్తాయి. వియోగ శృంగారాన్నే విప్రలంభ శృంగారమని కూడా

అంటారు. నాయికా నాయకుల శృంగార జీవితంలో వివిధ దశలు చోటుచేసుకుంటాయి. వాటిలో పేర్కొనదగ్గవి.

1. మోహం, 2.విరహం, 3.మన్మథపూజ, 4.దౌత్యం, 5.స్వప్నం, 6.అపవాదు, 7.ప్రణయకోపం, 8.మాతృవచనం, 9.సఖీవచనం, 10.నాయికా వచనం. ఈ శీర్షికల క్రిందచోటు చేసుకొనే అన్నిటినీ ప్రస్తావించడం ఇక్కడ వీలుపడదు. కాబట్టి, మచ్చుకు ఒకగేయాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవచ్చు. ఇది నాయిక నాయకుడి ఆగమాన్ని అపేక్షించే గేయం. అతని ఉపేక్షను సున్నితంగా అధిక్షేపించే గేయం. స్వామి కటాక్షాన్ని కాంక్షించే గేయం. ఈగేయంలో నాయిక స్వీయ, ముగ్ధ. నాయకుడు దక్షిణుడు, మన్మథ జనకుడు, బ్రహ్మ జనకుడు, గంగాజనకుడు అని ప్రస్తావించడం వల్ల నాయకుని బహుసంతాన పరత్వం గోచరిస్తుంది. కనకాంబరుడని, శేషశయనుడని, గిరిధరుడని ప్రస్తావించడం వల్ల అతని ఘనత ప్రస్ఫుట మౌతుంది. ఈ అంశాలు రెండు నాయకుని ఉదాత్తతను ఉటంకిస్తున్నాయి. ఆకర్షణీయమైన ఈ అంశాలే నాయికను కూడా ఆకట్టుకున్నాయి కాబోలు. అందుకే ఆరాటం అధికం కాసాగింది.

విరహం విజృంభించింది. నాయక స్వీయ కాబట్టి, బయటపడలేదు. సున్నితంగా ధ్వనింపజేసింది. ఈ గేయంలో నాయిక వలపు, మోహం, విరహం, నాయకుని ఘనత గోచరిస్తాయి. ఇదే ఆ గేయం.

ఏల రాడమ్మ యింతిరో వా
    డేల రాడమ్మ నన్నేలినవాడు ॥పల్లవి॥

పచ్చని పులుగుల బండిమీద నుండు
    పచ్చవింటి పిన్నబాలుని తండ్రి
    పచ్చని చాయల బాయని బంగారు
    పచ్చడము గట్టి బాగైనవాడు ॥ఏల॥

తెల్లని పులుగుపై దిరుగ మరిగినట్టి
    తెల్లని సతిపాలి దేవరతండ్రి

తెల్లని పరపుపైఁ దేలిపొరలు వెట్టు
తెల్లని కన్నుల తెలివైన వాడు ॥ఏల॥

కొండవింటివాని గుత్తగొనిన యట్టి
కొండుక పాయపుఁ గూతురు తండ్రి
కొండలరాయడు కోనేటి తిమ్మయ్య
కొండ తలనెత్తి గుఱుతైన వాడు[7] ॥ఏల॥

## వాత్సల్యభక్తి

నిఘంటువులలో వాత్సల్యమనే మాటకు పుత్రాదుల పట్ల ప్రదర్శించే స్నేహమనే అర్థం స్ఫురిస్తుంది. కుమారుణ్ణి వత్సా అని పిలవడం అనేకచోట్ల కనిపిస్తుంది. కాబట్టి 'వత్స' పట్ల ఏర్పరచుకునే ప్రేమ భావాన్నే వాత్సల్య మంటారు. భగవంతుణ్ణి తనబిడ్డగా భావించి అతనిపట్ల ప్రదర్శింపజూపే వాత్సల్యాన్ని 'వాత్సల్యభక్తి' అనవచ్చు. వాత్సల్యభక్తిని అలంకార శాస్త్రమేకాక ప్రాచీనసాహిత్యం కూడా ఆదరించింది. తమిళ సాహిత్యంలో 'పిళ్ళై తమిళ్' అనే ఒక ప్రత్యేక శాఖే కనిపిస్తుంది. దీనికి శ్రీకారం చుట్టినవాడు పెరియాళ్వార్.

ఆరాధనమూర్తి బాల్యక్రీడలను అందునా శైశవ క్రీడలను అభివర్ణించడం ఈ శాఖ ప్రత్యేకత, పెరియాళ్వార్ తన 'పెరియాళ్వార్ తిరుమొళి' అనే ప్రబంధంలో శ్రీకృష్ణుడి శైశవ క్రీడలను, బాల్య క్రీడలను కమనీయంగా, రమణీయంగా వర్ణించాడు. కుమర గురుపరర్ 'మీనాక్షి యమ్మన్ పిళ్ళై తమిళ్ 'లో మధురమీనాక్షి శైశవ క్రీడలను, బాల్య క్రీడలను వర్ణించాడు. ఇదేవిధంగానే తమిళసాహిత్యంలో పిళ్ళైతమిళ్‌కు సంబంధించి పలురచనలు వెలువడ్డాయి. ఎఱ్ఱన, తన హరివంశంలో బాలకృష్ణుని లీలలను వర్ణించడం, పోతన తన భాగవతంలో బాలకృష్ణుని దుడుకుచేతలను వర్ణించడం ఈ కోవకే చెందుతాయి. ఇవన్నీ వాత్సల్య భక్తి కిందకే వస్తాయి. అన్నమయ్య కూడా బాలకృష్ణుడి మీద పలు సంకీర్తనలు రచించాడు. వాటిలో కన్నయ్య అల్లరి కళ్ళకు కట్టినట్టు వర్ణింపబడింది. అంతటితో ఆగాడా అన్నమయ్య!

అమాంతం అమ్మ యశోదగానే మారిపోయాడు. ఆమె ఆత్మను తనమీద ఆరోపించుకున్నాడు. కృష్ణుడిమీద తాను ప్రదర్శించదలచుకున్న వాత్సల్యాన్ని సాక్షాత్ యశోదగానే ప్రదర్శించాడు. పర్యవసానంగా వాత్సల్య రసగుళికలెన్నో ఆయన రసనాగ్రం నుంచి ఆవిర్భవించాయి.

## శ్రవణభక్తి

భాగవతం ప్రతిపాదించిన నవవిధభక్తిమార్గాల్లో శ్రవణభక్తి ప్రథమం, ప్రధానం, ఆరాధ్య దేవతల మహిమలను, లీలలను, గుణాలను, ఘనతను వినడం శ్రవణభక్తి లక్షణం, ఆయా దేవతల గురించి వినడం వల్ల వారిపట్ల భక్తి ఏర్పడి ఉన్నతస్థితికి చేరుకోవడానికి దోహదం ఏర్పడుతుంది. కాబట్టే శ్రవణభక్తి విశిష్టతను భాగవతం ఇలా తెలియజేసింది.

"...ఆత్మరూపకుడగు హరికథామృతములు
గర్ణపుటంబుల గాంక్షదీర
తే.గీ. గ్రోలుచుండెడి ధన్యులు గుటిలబహుళ
విషయ మలినీకృతాంగముల్ వేగవిడిచి
విష్ణుదేవుని చరణారవిందయుగము
కడకు జనుదురు సిద్ధంబు కౌరవేంద్ర"[8]

విష్ణుకీర్తన వినని వీనులు ఎంతవ్యర్థమైనవో కూడా భాగవతం వాక్రుచ్చింది.

"విష్ణుకీర్తనములు వినని కర్ణంబులు
కొండల బిలములు కువలయేశ"[9]

"అన్నమయ్య సౌభాగ్యకరమైన విష్ణుకథను విని తరించుమని విశ్వజనులను ఉద్బోధించాడు. వెను బలమదేనని విస్పష్టంచేశాడు.

"వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ"[10]

"వీనులాల యేపొద్దు విష్ణుకథలే వినరో"[11]

## కీర్తనభక్తి

కీర్తించడం అంటే పొగడడం, కొనియాడడం, వినుతించడం, భగవత్ కీర్తిని గానం చేయడమే కీర్తనభక్తి ప్రధానలక్షణం. వైకుంఠుని కొనియాడని వక్త్రాన్ని వక్త్రమనడం కంటే ఢక్కఅనడం సమంజసమని ప్రహ్లాదుని అభిప్రాయం.

"వైకుంఠు బొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమ ఢమ ధ్వనితోడి ఢక్కగాక"[12]

విష్ణుదేవుని వినుతించకపోతే విపత్ పరంపర వైదొలగే వీలులేదని

"ఘన విపద్గాఢాంధకారంబు లడగునే
పద్మాక్షునుతిలేని ప్రభలు లేక?" అని భాగవతం తెలియజేస్తుంది.

"విందుల కుడుపులు విష్ణుకీర్తనము
చందపువైకుంఠ సంబళము"[13]

"తగు సంకీర్తన గురి తపమునకు"[14]

"సంకీర్తనె ధనము"[15]

## సంస్మరణభక్తి

నిరంతరమూ భగవంతుని మనసారా స్మరించడమే స్మరణభక్తి. తదేకంగా దేవుని ఆకార, చేష్టలను, స్మరించడం వల్ల మనసు ఏకాగ్ర మవుతుంది. తన్మయత్వం కలుగుతుంది.

అనేకులు దైవస్మరణ, ఆవశ్యకతను తెలియజేస్తూ రచనలు చేశారు. ప్రహ్లాదుడు హిరణ్యకశ్యపునితో "దేవదేవుని చింతించుదినము దినము"[16] అన్నాడు.

విష్ణుదేవుని స్మరించని జన్మ జన్మమేకాదు పొమ్మన్నాడు.

"చక్రి చింతలేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబు గాక"[17]

అజామిళోపాఖ్యానంలో విష్ణుదూతలు యమదూతలకు హరినామ స్మరణ సమస్త కలుషహరమని తెలియజేశారు. ఈ స్మరణ ఏవిధంగా జరిగినా మంచికేనన్నారు.

బిడ్డపేరు బెట్టి పిలుచుట విశ్రామ
కేళినైన, మిగుల గేలి నైన
పద్య గద్య గీత భావార్థములనైన
గమలనయనుఁ దలపఁ గలుషహరము"[18]

అన్నమయ్య కూడా భగవంతుని స్మరించవలసిన ఆవశ్యకతను తెలుపుతూ అనేక కీర్తనలు రచించాడు, ఇందిరేశుని స్మరించేవారికి వైకుంఠం కరతలామలకమన్నాడు. జపతపాలకన్నా స్మరణే శ్రేష్ఠ మన్నాడు.

"యెవ్వరు మనసులోన నిందిరేశు దలచిన
అవ్వల బాయక వుండునదియే వైకుంఠము
దవ్వులకు నేగవద్దు తపము జపము వద్దు
యివ్వలనిదే కీలు యెరిగిన వారికి"[19]

హరిస్మరణలేని ఇతరసుఖాలు సుఖాభాసాలేకాని సుఖాలు కావని అన్నమయ్య సుస్పష్టం చేశాడు.

"ఆతుమ గల వేంకటపతి నాత్మదలచి సుఖింపక
యేతరి సుఖముల దిరిగిన నింపులు దనకౌనా"[20]

ఇతర పనులను కట్టిపెట్టి వేంకటేశ్వరుని స్మరించవలసినదిగా తన మనసును ఉద్బోధించాడు.

"విడువుము మనసా వీరిడి చేతలు
తడయక శ్రీహరి దలచవొ యికను"[21]

## పాదసేవన భక్తి

త్రికరణశుద్ధిగా భగవంతుని పాదాలను సేవిస్తూ జీవించడమే పాదసేవనభక్తి. ఆంజనేయాదులీ పద్ధతి నాశ్రయించి అనుపమ సౌఖ్యపదము

నందుకున్నారు. మహాపురుషు లనేకులు ఈ పాదసేవన భక్తిని శ్లాఘిస్తూ ఈ పద్ధతి ననుసరించవలసిందిగా ప్రజలనుద్బోధించారు.

విష్ణుసేవాభాగ్యం లేకపోతే తాపత్రయాలు నశించవని ప్రహ్లాదుడు తెలియజేశాడు. తద్వారా విష్ణుసేవా విశిష్టతను విశదం చేశాడు.

" . . . తాపత్రయాభీలదావాగ్నులాఱునే
విష్ణు సేవామృతవృష్టిలేక"[22]

భగవత్పాదసేవ చేయవలసిందిగా అన్నమయ్య తన మనసును ఉద్బోధించాడు. తద్ద్వారా ప్రపంచానికి బోధించాడు.

"చెన్నుమీఱ హరిపాదసేవసేయు మనసా"[23]

వేంకటేశ్వరుని సేవ విశ్వవిజయాన్ని సంపాదించిపెట్టడమే గాక మోక్షాన్ని గూడా కలిగిస్తుందని అన్నమయ్య అభిప్రాయం.

"శ్రీవేంకటేశ్వరు సేవ చేతిలోని మోక్షమై
కేవలపు ప్రపంచము గెలిపించును" [24]

మోక్షము, సేవ ఈ రెండింటిలో మోక్షానికన్నా సేవదే పైచెయ్యి అని పదకవితా పితామహుడు తెలియజేశాడు.

"కైవల్యమున కంటే కైంకర్యమెక్కుడు
శ్రీ విభుడ నీవు మాకు జిక్కే మర్మమిదివో"[25]

## అర్చనాభక్తి

విశ్వరూపుడైన భగవంతుని ఉపాసించడం వీలుకాదు. కాబట్టి విగ్రహారాధన అమలులోకి వచ్చింది. తమకు నచ్చిన భగవన్మూర్తిని ముందు పెట్టుకొని షోడశోపచార పూజా విధానంతో ఉపాసించే పద్ధతి ఆచరణలోకి వచ్చింది. తాను ఉపాసించే భగవన్మూర్తినే సాక్షాత్ భగవంతునిగా భావించి అర్చిస్తే మానసిక ఏకాగ్రత కుదురుతుంది. తద్ద్వారా మానవుడు ఉన్నతస్థితికి చేరుకొనేందుకు వీలవుతుంది. అర్చిస్తున్న మూర్తిని తదేకంగా చూస్తూ భావిస్తుండడం వల్ల తన్మయుడై భగవంతునికి

చేరువయ్యే అవకాశం కూడా ఎక్కువగా ఉంది. పైగా ప్రీతితో తనకు సమర్పించే పత్ర, పుష్ప, ఫల, తోయాలను తాను గ్రహిస్తున్నట్టుకూడా భగవంతుడు చెప్పాడు.

"పత్రం పుష్పం ఫలంతోయం యోమే భక్త్యాప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః"
(భగవద్గీత 9-20)

భగవంతుడే ఈ విధంగా సెలవిచ్చి ఉండటం వల్ల అర్చించే భక్తునికి అతని అనుగ్రహం తప్పకుండా సిద్ధిస్తుందని తేటపడుతూ ఉంది. అర్చనా విశిష్టతను కొనియాడుతూ, దాని విముఖతను తూలనాడుతూ భాగవతం అర్చనను బలపరిచింది. ప్రహ్లాదుడు హరిని పూజించడమే చేతులకు పరమప్రయోజనమని అభిప్రాయపడ్డాడు.

"కమలాక్షు నర్చించు కరములు కరములు" [26]

హరిపూజ చేయని హస్తము హస్తమే కాదని నిరసించాడు.

"హరిపూజనములేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్వీగాక" [27]

అన్నమాచార్యుడు కూడా అర్చనకు సంబంధించి ఎన్నో కీర్తనలు రచించాడు. వాటిలో అర్చనా విశిష్టతను అనేక రీతులుగా వ్యక్తం చేశాడు.

హరిపూజలు ఔన్నత్యాన్ని అందించి అలరిస్తాయని అన్నమయ్య తెలియజేశాడు.

"పొందుగ నచ్యుతు బూజించు పూజలు
కిందట గొనకెక్కెడి నిచ్చెనలు" [28]

ఇంద్రాదుల ఔన్నత్యానికి వారుచేసుకున్న ఇందిరేశుని పూజలే కారణమని, హరి పూజా విశిష్టతను ఆయన ఆవిష్కరించారు.

"పూని దేవేంద్రాదులై పొడవు కెక్కినవారు
శ్రీనాథ మిమ్ముఁనే పూజించినవారు హరి" [29]

## వందనాభక్తి

వ్యాసుడు భాగవతంలో ప్రతిపాదించిన నవవిధ భక్తులలో వందనాభక్తి ఒకటి. నమస్కారం, ప్రణామం, దండం మొదలయినవి సమానార్థకాలుగ, పర్యాయ పదాలుగ ప్రస్తుతం వ్యవహారంలో ఉన్నాయి. భగవంతునికి నమస్కరించడమే వందనాభక్తి ప్రధాన లక్షణం. తలవంచి నమస్కరించడం, చేతులు జోడించి నమస్కరించడం, మోకరిల్లడం, పాదాభివందనం చేయడం, సాష్టాంగ ప్రణామం చేయడం ఇవన్నీ ఈ కోవకే చెందుతాయి.

నమస్కరించబడే వారిపట్ల నమస్కరించే వారికున్న వినయము, భక్తిశ్రద్ధలు తెలియ జేసే చిహ్నంగా నమస్కారం నాగరిక సమాజంలో చోటుచేసుకొంది. భగవంతునికి మనం చేసే వందనం అనంతఫల ప్రదమని అభిజ్ఞులు అభిప్రాయపడుతారు.

భగవంతుడికి నమస్కరించే తల మాత్రమే తల. తక్కినవి కావు అని అభిప్రాయం.

"శేషశాయికి మ్రొక్కు శిరము శిరము" [30]

అన్నమయ్య ఇందిరేశునికి నమస్కరించుమని ఇలాతలవాసులకు హితవు చెప్పాడు. దాని సత్ఫలితాన్ని కూడా తెలియజేసి ప్రోత్సహించాడు.

"మొక్కరో మీరు మోసపోక మీకు
దిక్కు దెసైన ఆదిదేవునికి" [31]

"నలినాక్ష నీకు నమస్కరించిన
ఫలము వొగడనికి బ్రహ్మకు వశమా" [32]

## దాస్యభక్తి

అనన్య మనస్కులై భగవంతునికి దాస్యం నెరపడమే దాస్యభక్తి అని పెద్దలు చెబుతారు. ఈ పద్ధతిలో యజమానికి, దాసునికి మధ్య ఉన్న సంబంధాన్నే భగవంతునికి తనకు మధ్య నెలకొల్పుకొని భక్తుడతన్ని ఉపాసిస్తాడు. ఈ పద్ధతిని భాగవత సంప్రదాయం కూడా అంగీకరించింది. ప్రహ్లాదుడు కూడా దాస్యభక్తి ఆవశ్యకతను నొక్కి వక్కాణించాడు.

"సంసార జీమూత సంఘంబు లిచ్చునే
చక్రి దాస్య ప్రభంజనము లేక" [33]

అన్నమయ్య హరిదాస్యఘనతను అనేకవిధాలుగా చాటాడు. వేంకటేశ్వర దాస్యం వల్లనే తన జన్మ సార్థకమైందని తెలియజేశాడు.

"యెంచగ నీదాస్యము నా కినామిచ్చితిగాన
పంచల నాపుట్టుగు సఫలమాయనిదివో" [34]

హరిదాస్యమే సర్వోత్కృష్టమని ఎరుగజేశాడు.

" బంతుల బాత్రాపాత్రము వెదకిన
అంతట హరిదాస్యమే పో ఘనము" [35]

## సఖ్యభక్తి

భగవంతుణ్ణి మిత్రునిగా భావించి మన కష్టసుఖాలు అతనికి నివేదించి సంతృప్తి చెందే విధానాన్నే సఖ్యభక్తి అంటారు. ఈ భక్తి నవలంబించి కృతకృత్యులైన వారిలో అర్జునుడే ప్రథమ గణ్యుడు. సఖ్యభక్తిలో భగవంతునికి, భక్తునికి సమానత్వమే నెలకొంటుంది. కాబట్టి తనకు ఏలికగా, ఆత్మేశ్వరుడుగా భావించిన అన్నమయ్య సఖ్యభక్తి జోలికి వెళ్ళలేదేమో.

## ఆత్మనివేదనా భక్తి

అన్ని చింతనలూ విడిచి తన్ను సర్వాత్మనా భగవంతునికి సమర్పించుకోవడమే ఆత్మనివేదనాభక్తి. తన వ్యక్తిత్వాన్ని, ప్రత్యే కతనూ భగవంతునిలో నిక్షేపించి బాహ్యాంతర జ్ఞానానికి కూడా దూరంగా ఉండడమే దీని ప్రధానలక్షణం, దీనిని మోక్షసాధనలో చరమస్థితి అని చెప్పుకోవచ్చు. ఈ భక్తి అలవరచుకొనేందుకు అందరికి వీలుపడేదికాదు. మహామహులకు మాత్రమే ఇదిసాధ్యం.

తొలి తెలుగు వాగ్గేయకారుడు కూడా తన రచనల్లో ఆత్మనివేదనా భక్తిని ధ్వనింప జేశాడు. తన సర్వస్వము భగవంతునికే సమర్పణ మన్నాడు.

"ఒడబరుచుకొంటెని వుపేంద్ర నిన్ను నిపుడె
చిడుముడి నీ సేవకే సెలవు చేసుకొమ్మీ ॥పల్లవి॥

కన్నులఁ నే జూచేదల్లా కమలాక్ష నీపాదాలే
  విన్న వినుకులెల్లా విష్ణుఁడ నీ కథలే
  తిన్నని నామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే
  అన్నిటా నా భావము సమర్పణము నీకును ॥ఒడ॥

అట్టె నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే
  గుట్టున నాసేతలెల్లా గోవింద నీకైంకర్యాలే
  ముట్టి నే భుజించినవి ముకుంద నీప్రసాదాలే
  నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి ॥ఒడ॥

యిలనే బండబడేవి యీశ్వర నీకుమొక్కులే
  తలచే నాతలపెల్లా దామోదర నీధ్యానమె
  నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను
నెలవై నాభవము లెల్లా నీసొమ్ము చేసితి"[36] ॥ఒడ॥

శరణాగతి కూడా ఆత్మనివేదన వంటిది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆత్మనివేదన, శరణాగతి ఒకే నాణానికి చెందిన ఇరువైపుల వంటివి. తమకు భగవంతుడు తప్ప ఇతరమైన ఆధారమేదీలేదని గ్రహించి, విశ్వసించి, అతడే దిక్కని, అతని పాదాలనాశ్రయించడమే శరణాగతి తత్త్వమని స్థూలంగా చెప్పుకోవచ్చు. ఆ విధంగా శరణుజొచ్చిన వారిని అభయ మిచ్చి ఆదుకోవడం భగవంతుని స్వభావమని చెప్పబడుతూ వుంది. విభీషణ శరణాగతి సందర్భంగా రాముడు ఎవరు తనను యాచించినా వారికి అభయమిచ్చి ఆదుకుంటానని భరోసా ఇచ్చాడు. అది తన వ్రతమని కూడా అన్నాడు.

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచయాచతే
 అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతద్వ్రతం మమ"[37]

ఎవరు తనను ఆశ్రయిస్తారో వారి యోగక్షేమాలను తానే చూచు కొంటానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో తెలియజేశాడు.

"అనన్యాశ్చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే
 తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్"[38]

అన్ని ధర్మాలనూ పరిత్యజించి తనను శరణుజొచ్చిన వారిని అన్ని పాపాలనుంచి విముక్తులుగా చేస్తానని కృష్ణుడే తెలియజేయడం గమనార్హం.

"సర్వధర్మాన్పరిత్యజ్యమామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" [39]

అన్నమయ్య శరణాగతిని గురించి అనేకవిధాలుగా వివరించాడు. తనకీర్తనలెన్నిటిలోనో దాన్ని బలపరిచాడు. భగవంతుని శరణుజొచ్చిన వారికి విజ్ఞానము తద్వారా మోక్షము సిద్ధిస్తాయని అన్నమయ్య అచంచల విశ్వాసం.

"శరణన్న వారికి విజ్ఞానము దగులు
గరిమ నిందువల్లనే ఘనమోక్షమూ దగులు" [40]

## పాదసూచికలు

1. శ్రీమహాభారతము 2-35
2. శ్రీమహాభారతము 2-119
3. నారదభక్తి సూత్రాలు - సూత్రం-6
4. నారదభక్తి సూత్రాలు - సూత్రం-83
5. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2-469
6. భాగవతం సప్తమస్కంధం, అధ్యాయం 5-శ్లోకం -4
7. తాళ్లపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు 5- 235
8. భాగవతం, 2-36
9. భాగవతం, 2-50
10. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-355
11. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 4-14
12. భాగవతం 7-170
13. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-564
14. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 4-224
15. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2-457

16. భాగవతం 7- 169
17. భాగవతం 7-170
18. భాగవతం 6-122
19. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-528
20. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 4-216
21. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 4-216
22. భాగవతం 7-171
23. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2-90
24. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-341
25. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2-483
26. భాగవతం - 7-169
27. భాగవతం - 7-170
28. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-564
29. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 1-411
30. భాగవతం - 7-169
31. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 4-62 పుట.402
32. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-131
33. భాగవతం - 7-771
34. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-466
35. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-534
36. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2-201
37. వాల్మీకి రామాయణం, యుద్ధకాండ సర్గ 18, శ్లోకం 33.
38. భగవద్గీత 9-22
39. భగవద్గీత 18-66
40. తాళ్లపాక అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 3-366

★ ★ ★

**ఎలవర్తి చంద్రమౌళి**

## అన్నమయ్య సంకీర్తనలు - విష్ణుభక్తులు

1. 'వైష్ణవులుగానివార లెవ్వరు లేరు'
విష్ణుప్రభావ మీవిశ్వమంతయుఁ గాన' (1.36)
'ఎదుట నెవ్వరు లేరు యింతా విష్ణుమయమే
వదలక హరిదాసవర్గమైనవారికి' (1.502)

అన్నది అన్నమయ్య నమ్మిన సిద్ధాంతం. అందుకే అన్నమయ్య తన సంకీర్తన భాండాగారంలో ఎందరో విష్ణుభక్తుల గురించిన ప్రస్తావన చేశాడు. వైష్ణవంలో విష్ణుమూర్తికి ఎంత ప్రాధాన్యముందో విష్ణుభక్తులక్కూడా అంతే ప్రాధాన్యముంది.

ఇదే విషయం పద్మోత్తరపురాణంలో

'ఆరాధనానాం సర్వేషాం విష్ణోః ఆరాధనం పరమ్
తస్మాత్ పరతరం ప్రోక్తం తదీయారాధనం పరమ్'
(29 అ, 81శ్లో)

'అన్ని ఆరాధనలలోకి విష్ణ్వారాధన శ్రేష్ఠమైంది. దానికన్నా మహోత్కృష్టమైంది, భాగవతారాధనం.' అని చెప్పబడింది.

అంతే కాకుండా మహాభారతం అశ్వమేధపర్వంలో శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా

'మమ మద్భక్త భక్తేషు ప్రీతిః అభ్యధికా భవేత్
తస్మాత్ మద్భక్త భక్తాశ్చ పూజనీయాః విశేషతః'
(116 అ, 23 శ్లో)

'నాకు, నా భక్తుల పట్ల వారి భక్తుల పట్ల ప్రీతి అత్యధికం, అందువల్ల నా భక్తులు వారి భక్తులు కూడా పూజింపబడాలి' అని చెప్పడం కూడా భాగవతుల ప్రాధాన్యాన్నే చాటుతోంది.

విష్ణుతత్త్వాన్ని, విష్ణుభక్తుల ప్రాశస్త్యాన్ని చక్కగా ఎరిగినవాడు కాబట్టి, అన్నమయ్య ఎన్నో సంకీర్తనల్లో విష్ణుభక్తుల ప్రభావాన్ని, గొప్పతనాన్ని కొనియాడాడు.

'నేరిచి బ్రదికేవారు నీదాసులు
నేరమిఁ బాసినవారు నీదాసులు ||పల్లవి||

కామముఁ గ్రోధము రెంటిఁ గాదని విడిచి, మంచి
నేమము వట్టినవారే నీదాసులు
దోమటిఁ బాపపుణ్యాలఁ దుంచివేసి చూడఁగానే
నీమాయ గెలిచినారు నీదాసులు ||నేరి||

కిక్కిరించినయాసలఁ గిందవేసి మోక్షము
నిక్కినిక్కి చూచేవారు నీదాసులు
వెక్కసపు భక్తి తోడ వెఱపు మఱపు లేక
నెక్కొన్న మహిమవారు నీదాసులు ||నేరి||

అట్టె వేదశాస్త్రముల అర్థము దేటపఱచి
నెట్టుకొని మించినారు నీదాసులు' ||నేరి|| (1.493)

'దైవమా నీకంటే నీ దాసులే నేర్పరులు' (3.49)

'నీ దాసులున్న చోట నిత్య వైకుంఠ మిదె
—— —— —— ——
వారలతోడి మాటలు వడి వేదాంతపఠన' (3.180)

'యిరవై నీ దాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే' (3.479)

'మిక్కిలి పుణ్యులు హరి మీ దాసులే హరి' (1.411)

'ఆది నీ దాసుఁడే చాలు నందరి రక్షించను' (3.473)

అంటూ విష్ణుభక్తుల గొప్పతనాన్ని సంస్తుతించడం కనిపిస్తుంది.

విష్ణుభక్తిని కాచివడబోసిన అన్నమయ్య జీవులకు ఒక మర్మాన్ని తెలియ జేశాడు. మీరు ఎంత వెదికినా హరిని దర్శించలేరు. అందుకని హరిదాసులను కొలువండి అది అంతకన్నా శ్రేష్ఠం అంటూ.

'హరిఁ గానలేరు మీరు అరసెందు వెదకినా
హరిదాసు లెఱుగుదు రడుగరో
గరిమెఁ బ్రత్యక్షము గాఁడు దేవుఁ డెవ్వరికి
ధరఁ బ్రత్యక్షము హరిదాసులుఁ గొలువరో
చేత ముట్టి గోవిందుని శిరసు పూజించలేరు
చేతులార ప్రపన్నుల సేవ సేయరో
— — — —
అంతరంగమున నున్నాఁ డందురు విష్ణుఁడు గాని
అంతటా నున్నారు వైష్ణవాధికులు' (1.418)

అని అన్నమయ్య విష్ణుభక్తుల్ని సేవించే అదృష్టం లభిస్తేచాలు అదే మహద్భాగ్యం. హరిదాసులు ఎక్కడ అడుగుపెడితే అదే పరమపదం. వారి పాదతీర్థమే విరజానది. వారిమాటలు వేదాలు అని అంటాడు అన్నమయ్య. అదే అభిప్రాయాన్ని మరీ నొక్కి చెబుతూ భగవంతునితో

'అచ్చుత మిమ్ముఁ దలఁచే యంతపని వలెనా
యిచ్చల మీవారె మాకు నిహపరాలియ్యఁగా'

అని ఇహపరాలు కూడా ఇవ్వగలిగిన సామర్థ్యం కలిగినవారు విష్ణుభక్తులు అన్నాడు అన్నమయ్య.

భగవంతుడు నిష్పక్షపాతి. భక్తుల విషయంలో ఈ గుణం మరీ స్పష్టం. వయసు, స్త్రోమత, కులం, లింగం అన్నవి ఏవీ ఆయన చూడడు. ఆయనకు

కావలసింది భక్తిమాత్రమే. భక్తి విషయంలో అందరూ సమానం. అందుకనే అన్నమయ్య కూడా అన్నిరకాల భక్తులనూ తన సంకీర్తనలలో పొందుపరిచాడు.

విష్ణుభక్తుల్ని పౌరాణికభక్తులు, చారిత్రకభక్తులుగా విభజించి పరిశీలించవచ్చు.

## 2. పౌరాణికభక్తులు

పౌరాణికభక్తులను దేవతలు, మహర్షులు, రాజులు, స్త్రీలు, తిర్యక్కులు, బాల భక్తులు, ఇతరులుగా విభజించవచ్చు. పైన పేర్కొన్న పౌరాణికభక్తులు విష్ణువును స్తుతించి భక్తిభావాన్ని వ్యక్తంచేయడం పెక్కు సంకీర్తనలలో కనిపిస్తుంది. పై పౌరాణికభక్తులకు సంబంధించిన ఇతివృత్తాలు ప్రసిద్ధమైనవి. అందువల్లనే అన్నమయ్య కథను ప్రస్తావించ కుండా ముఖ్యమైన విషయాన్ని మాత్రం సూక్ష్మంగా ఒక మాటలో చెప్పి వదలిపెట్టాడు.

### 2.1. దేవతలు

దేవతలలో బ్రహ్మ, దేవేంద్రుడు, శివుడు, కుమారస్వామి, విష్వక్సేనుడు వంటివారు అన్నమయ్య సంకీర్తనలలో కనిపిస్తారు. వీరందరూ విష్ణుమూర్తిపట్ల భక్తిభావం వ్యక్తం చేయడం కనిపిస్తుంది. అందుకే అన్నమయ్య

'దేవతాధిపులు దివ్యులును కడుఁ
బావనులును తగఁ బరహితులు
యీ వేంకటపతి నితనిని
సేవించి సుఖాంచితమతు లైరి' (1.21)

అని దివ్యులనందరినీ చేర్చి పేర్కొన్నాడు.

బ్రహ్మకి సంబంధించిన ప్రస్తావన ఎన్నో సంకీర్తనలలో కనిపిస్తుంది.

'చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మా సేవలు నీకు నేడకువచ్చు' (3.51)

యీ పాదమేకదా యీ బ్రహ్మ గడిగినది' (1.66)

అని బ్రహ్మకు సంబంధించిన విష్ణుభక్తిని అనేక సందర్భాల్లో తెలియజేయడం జరిగింది.

ఇదేవిధంగా దేవేంద్రుని గురించి

'యీపాదమేకదా యింద్రాదులెల్ల వెదకినది' (1.66)

'నెప్పుడు నింద్రాదులు

తక్కక కొలిచియున్న తత్వమీతఁడు' (1.425) అని పేర్కొన్నాడు.

శివునికి సంబంధించి కూడా కొన్ని సందర్భాల్లో

'ఎరుఁగుదు రిందరు నెఱిఁగీ నెఱుఁగరు

హరి దానే నిజపరమాతుమని

కొలఁది శివుఁ డెఱుఁగు–' (1.253)

'సారెకు శివుఁ డెరిఁగి చాటె రాముని'

అని పరమశివుడు విష్ణుతత్త్వం ఎరిగినట్లు కూడా కొన్ని చోట్ల పేర్కోబడింది.

పార్వతీపుత్రుడైన కుమారస్వామి చేసిన తపస్సు గురించి

'నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి

కలిమిఁ దపముసేసి కన్న దేవుఁ డీతఁడే' (1.425)

అని కుమారస్వామి తపస్సు చేసి విష్ణుమూర్తిని దర్శించి నట్లు చెప్పబడింది.

విష్ణుమూర్తి సేనాధిపతి, ప్రధానఅంగరక్షకుడు విష్వక్సేనుడు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ప్రాధాన్యాన్నిబట్టి మూడవస్థానం లోనివాడు. మొదటి రెండు స్థానాలలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ఉన్నారు. అటువంటి విష్వక్సేనుని

'నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద

దేవతలఁ గనిపించే దేవుఁడవు

యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి' (1.255)

అని స్తుతించడం జరిగింది.

## 2.2. మహర్షులు

అన్నమయ్య సంకీర్తనలలో సనకాదుల, వ్యాసాదుల, వాల్మీకాదుల, నారదాదుల, శుకాదుల విష్ణుభక్తికి సంబంధించిన ప్రస్తావన అనేకచోట్ల కనిపిస్తుంది. విడిగా కొన్నిచోట్ల వసిష్ఠుడు, కపిలుడు, కౌశికునికి సంబంధించిన ప్రస్తావన కనిపిస్తుంది. కొన్ని చోట్ల సప్తఋషులు, మహాఋషులు, యోగివరులు అని చెప్పడంకూడా కనిపిస్తుంది.

దర్శించినవారు ఋషులు, అన్ని విషయాలను రహస్యాలను తెలిసిన మహాత్ములు. వారు పరమాత్మతత్త్వాన్ని తెలియజేయకుంటే మనకు ఏ విషయమూ తెలిసేదికాదు. అదే విషయాన్ని అన్నమయ్య

'తొల్లి యేరుపరచిరి దొడ్డవాఁడు హరియని
యెల్లసందేహాలు బాసె నిఁకనేల చింత
నారదుఁడు సోదించి నారాయణునెరిఁగె
వేదవ్యాసులు దెలిసే వెదకి విష్ణుని ఁజెప్పె
సాదించి (రి)తని యోగిసనకాదులు
యీదెస శుకాదులెల్ల నెరిఁగిరి మాధవుని
కాదని వీరికంటె గతి గానఁగలమా
పెక్కుగాలము చదివి పెక్కేండ్లు బదికి
పెక్కురుషు లిందుననె పెద్దలైరి' (4.239)

'ముంగిట విష్ణుమంత్రము మొగి శుకుఁడు పఠించె' (4.438)

అని మహర్షులు విష్ణుతత్త్వాన్ని, విష్ణుమంత్రప్రభావాన్ని ఎరిగి మనకు తెలియజేసిన విధానాన్ని ఎన్నో సందర్భాల్లో పేర్కొన్నాడు అన్నమయ్య.

## 2.3. రాజులు

అన్నమయ్య సంకీర్తనలలో పౌరాణిక సంబంధమైన అంబరీషుడు, అజుడు, బలి, జనకుడు, విభీషణుడు, భీష్ముడు, విదురుడు, పాండవులు వంటి రాజుల విష్ణుభక్తి కూడా ప్రస్తావింపబడింది.

'అజునకుఁ బరమాయువై యొసగినమందు' (1.237)

'అంబరీషుఁ గావఁ జక్రమంపినవానిఁ జేరరో' (4.238)

'శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు' (4.445)

'కోరి విభీషణుఁడు చేకొనె రామమంత్రము' (4.438)

'అందరి కాధారమైన ఆదిపురుషుఁ డీతఁడు
విందై మున్నారగించె విదురునికడ నీతఁడు' (1.351)

'నడవరో జడియక నవ్యమార్గమిది
మడుగిది వైష్ణవమార్గ మిది
జనకాదుల నిశ్చల మార్గమిది' (4.434)

'పాండవరక్షణపరుఁడై నరునకు
నండనే తెలిపె మహామహిమ' (1.295)

'నంగవించె ఁగృష్ణమంత్ర మర్జునుఁడును' (4.438)

'బెరసి —— భీష్ముఁడు జనకుఁడు
గురుతుగ బలియు—— ఁగాలుఁడు
వరుస నెఱుఁగుదురు వడి రహస్యముగ
హరి యితఁడే పరమాత్ముఁడని' (1.253)

అంటూ అన్నమయ్య సందర్భానికి తగినవిధంగా విష్ణుభక్తులైన పౌరాణిక సంబంధులైన రాజుల ప్రస్తావన చేయడం గుర్తించవచ్చు.

## 2. 4. స్త్రీలు

పార్వతి, అహల్య, శబరి, యశోద, గోపికలు వంటి పౌరాణిక సంబంధమైన స్త్రీలు కూడా విష్ణుభక్తులుగా అన్నమయ్య సంకీర్తనలలో దర్శనమిస్తారు.

పార్వతి చేసిన విష్ణుస్తుతి 'కాత్యాయనీ స్తోత్ర కామ కమలాక్ష', 'శాంకరీ స్తోత్రములు సతతమునుఁ గైకొనెడి', 'శంకర సతీమణి నుతుని సర్వాత్ముని సముని'

'ఘన నీ నామమె గౌరినాలిక పై
పనిగొన్న మంత్రపాఠము' (4.419)

'యితర దైవముల నెఱఁగ నేరక
ప్రతిలేనిమహిమఁ బార్వతి
మతిఁ దలపుచు హరిమంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె' (1.205) వంటి ఎన్నో చోట్ల కనిపిస్తున్నాయి.

ఇదేవిధంగా అహల్య గురించి

'యీ పాదమేకదా ఇల నహల్యకు గోరికైనది' (1.66),

శబరి గురించి

'చక్కగా ఁదపముసేసే శబరియెదుట నీవు
అక్కడ నాఁడందును ఁబ్రత్యక్షమైతివి' (4.427)

యశోద వాత్సల్యభక్తి, గోపికల మధురభక్తి కూడా అనేక కీర్తనలలో దర్శనమిస్తాయి.

'మందగొల్లెతలకెల్లా మంగళసూత్ర మీతఁడు
నందగోప యశోదల నవనిధాన మీతఁడు' (4.526)

'మెండగు గొల్లెతలతో మేలమాడి
అండనే నోరుదెరచి యశోదకు లోకములు
దండిగాఁ జూపె నితఁడె దంటయైన బాలుడు' (4.529)

అని ఎన్నో కీర్తనలు గోపికలు, యశోదకు సంబంధించిన భక్తిభావాలతో కూడి ఉన్నాయి.

## 2. 5. బాలభక్తులు

పురాణాలలో ప్రసిద్ధమైన బాలభక్తులు ప్రహ్లాదుడు, ధ్రువుడు. భక్తికి సంబంధించిన విషయంలో వీరి ప్రస్తావన లేకుంటే అది అసంపూర్ణమే. అన్నమయ్య సంకీర్తనలలో ప్రహ్లాదునికి, ధ్రువునికి సంబంధించి నవి అధిక సంఖ్యలోనే ఉన్నాయి.

'వేసరకుమీ జీవుఁడా వెదకివెదకి దైవమును
ఆసపాటుగా హరి యున్నాఁ డిదె అందుకుఁ బ్రహ్లాదుఁడు సాక్షి'
(2.41)

'మోసపోకుమీ జన్మమా ముంచిన యనుమానములను
సేసినభక్తికిఁ జేటు లేదు యీ సేఁత కెల్ల ధ్రువుఁడే సాక్షి' (2.41)

విష్ణుభక్తిని ఒక మందుగా పేర్కొంటూ అన్నమయ్య

'కొనరో కొనరో మీరు కూరిమిమందు
వునికి మనికి కెల్ల నొక్కటే మందు' (1.237)

అని చెబుతూ ఆమందును ప్రహ్లాదుడు, ధ్రువుడు కూడా స్వీకరించారన్నాడు.

'ధ్రువుఁడు గొనిన మందు తొల్లియుఁ బ్రహ్లాదుఁడు
చవిగాఁ గొనిన మందు చల్లని మందు' (1.237)

అంటూ ఆ మందురుచిని, చల్లదనాన్ని పేర్కొన్నాడు. పసిబాలుడైన ధ్రువుడు వాసుదేవ మంత్రం జపించి విష్ణుసాక్షాత్కారం పొందాడు.

ధ్రువపట్టం పొందాడు. ప్రహ్లాదుడు నరసింహమంత్రంతో భక్తాగ్రగణ్యు డైనాడు.

## 2. 6. తిర్యక్కులు

దేవతలు, ఋషులు, రాజులు, స్త్రీలు, బాలురే కాకుండా; గరుత్మంతుడు, శేషుడు, గజేంద్రుడు, హనుమంతుడు, సుగ్రీవుడువంటి తిర్యక్కులు కూడా విష్ణుభక్తి తత్పరులే. అన్నమయ్య సంకీర్తనలలో పైనపేర్కొన్న అందరు భక్తులూ దర్శనమిస్తారు.

గరుత్మంతుడు నిత్యసూరులలో ప్రధానమైనవాడు. ఆయన భగవంతునికి దాసుడు, సఖుడు, వాహనము కూడా.

'పల్లించిన నీ పసిఁడి గరుడనిని
కెల్లున నీ వెక్కినయపుడు
ఝల్లనె రాక్షససమితి నీమహిమ-
వెల్లి మునుగుదురు వేంకటరమణా' (1.92)

గరుడారూఢుడుగా స్వామి వచ్చే సందర్భాలన్నీ ఆశ్రితసంరక్షణానికే. గరుడవాహనాన్ని అధిరోహించగానే రాక్షససమితి గుండెలు ఝల్లు మంటాయని చెప్పడంజరిగింది.

నిత్యసూరులలో శేషుడు ప్రముఖుడు. భగవంతుని రక్షణం, సంతోషం తప్ప వేరేమీ కోరనివాడు శేషుడు. అందుకే అన్నమయ్య ఒకకీర్తనలో

'వీఁడుగదే శేషుఁడు శ్రీవేంకటాద్రిశేషుఁడు
వేఁడుక గరుడనితోఁ బెన్నుద్దైన శేషుఁడు
— — — —
యేయెడ హరికి నీడై యేఁగేటి శేషుఁడు
— — — —
నట్టుకొన్న రెండువేలు నాలుకలశేషుఁడు
నెట్టన హరిఁబొగడ నేరుపరి శేషుఁడు
కదిసి పనులకెల్లఁ గాచుకున్న శేషుఁడు' (3.365) అన్నాడు.

విష్ణుమూర్తిని వర్ణించడం ఎవరి తరమూకాదు. ఆయన ప్రభావాన్ని వర్ణించడం శేషునికి మాత్రమే వీలు కావచ్చని శ్రీవైష్ణవాచార్యుల అభిప్రాయం.

భక్తవత్సలుడైన విష్ణుమూర్తి కథలలో గజేంద్రమోక్ష కథ చాలా ముఖ్యమైంది. మొసలి బారినుండి గజేంద్రుని కాపాడిన ఘట్టం అన్నమయ్య కీర్తనలలో పెక్కుచోట్ల కనిపిస్తుంది. దయనీయమైన గజేంద్రుని ఆర్తనాదం. భగవంతుడు ఉన్నపళంగా ప్రత్యక్షంకావడం అన్నీ కళ్ళముందు కనిపిస్తాయి.

'కదిసి నీశరణంటే కరిరాజునెదుటను
అదివో తొల్లియుఁ బ్రత్యక్షమైతివి' (4.427)

'మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచిన వాఁడు
అరుదైన ప్రతాపపు ఆదినారాయణుఁడు' (3.523)

అని గజేంద్రునికి సంబంధించి పలుచోట్ల ప్రస్తావించడం కనిపిస్తుంది.

శ్రీరామునికి బంటు హనుమంతుడు. భక్తుని భగవంతుని దగ్గర చేర్చేది ఆచార్య స్థానం. సీతా దేవిని శ్రీరామచంద్రుని దగ్గరకుచేర్చిన బంటైన హనుమంతుడు ఆచార్య స్థానంలో నిలిచాడు. అన్నమయ్య ఈ బంటు గురించి ఒక చక్కని కీర్తనలో పేర్కొన్నాడు.

ఎవడు బంటు? బంటు ఎలా ఉండాలి? అన్నవిషయాలను వివరంగా పేర్కొన్నాడు.

'యేలికను దైవముఁగా నెంచి కొల్చే వాఁడే బంటు
తాలిమిగలిగిన యాతఁడే బంటు
పాలుమాలక యేపొద్దు పనిసేయువాఁడే బంటు
వేళ గాచుకవండేటి వెరవరే బంటు
తనమనోవంచనలెంతటా లేనివాఁడే బంటు
ధనముపట్టున శుద్ధాత్మకుఁడే బంటు
అనిశము నెదురు మాటాడనివాఁడే బంటు

అనిమొనఁదిరుగని యతఁడే బంటు
చెప్పినట్లనే నడచినయాతఁడే బంటు
తప్పులేక హితుఁడైనాతఁడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలఁగువాఁడే బంటు
యెప్పుడును ద్రోహిగానిహితుఁడే బంటు
అక్కర గలిగి కడు నాప్తుఁడైన వాఁడే బంటు
యెక్కడా విడిచిపోని యిష్టుఁడే బంటు
తక్కక రహస్యములు దాఁచినవాఁడే బంటు
కక్కసీఁడుగాక బత్తిగలవాఁడే బంటు
కానిపనులకు లోనుగానివాఁడే బంటు
ఆనాజ్ఞ మీరని యాతఁడే బంటు' (4.278)

అని హనుమంతుని విశిష్టమైన అన్ని గుణాలనూ సమగ్రంగా పేర్కొన్నాడు అన్నమయ్య. అవన్నీ భక్తుని కుండవలసిన గుణాలే.

భగవంతుడు మానవేతర ప్రాణులను అనుగ్రహించడం రామాయణంలో మాత్రమే అధికంగా కనిపిస్తుంది. ఉదాహరణకు కాకాసురుఁడు, జటాయువు, వానరులు. జాంబ వంతుఁడు. వానరజాతిలో రాజు, మంత్రి, సామాన్యవానరం అనే వ్యత్యాసం లేకుండా శ్రీరామచంద్రుడు కరుణ చూపడం తెలిసిన విషయమే. అందుకే అన్నమయ్య సుగ్రీవునికి సంబంధించి అనేకసందర్భాల్లో

'వావిరి సుగ్రీవాదివానర కోట్లు గొలువ
చేవమీరి పొగడొందు శ్రీరాముడితఁడు' (4.300)

'బలిమి సుగ్రీవుని పాలి నిధానమ రామ' (3.516) అని పేర్కొన్నాడు.

## 2. 7. ఇతరులు

పైన పేర్కొన్న భక్తులు కాకుండా మిగిలిన గుహుడు, కుచేలుడువంటి వారికి సంబంధించిన విషయాలను ఇతరులు అనే ఈ విభాగం కింద చేర్చడం జరిగింది.

సీతారామలక్ష్మణులను గంగానది దాటించిన నిషాదరాజు గుహుడు. వారు తిరిగి వచ్చేవరకు ఎదురుచూసి దర్శించి, తరించిన రామభక్తుడు. అట్టి గుహుని గురించి అన్నమయ్య

'పదునాలుగేండ్లును బాసి నీ కెదురుచూచే
యదన గుహునికిఁ బ్రత్యక్షమైతివి' (4.427)

అంటూ అన్నమయ్య

'శ్రీపతి నీ కెదురుచూచేనాకు నిట్లనే
దాపై నేఁడిపుడె ప్రత్యక్షముగావే' (4.427)

అని భగవంతుని ప్రార్థించడం కనిపిస్తుంది.

శ్రీకృష్ణునకు బాల్యస్నేహితుడు, సహాధ్యాయి, నిరుపేద, కుచేలుడు. మిత్రునికి ప్రియంగా పిడికెడు అటుకులు సమర్పించి సకలసంపదలు పొందినవాడు కుచేలుడు. ఇదేవిషయాన్ని అన్నమయ్య

'బంటులైన వారికిఁ బరతంత్రుఁడవై యీ
వెంట వెంట దిరిగేవు వెట్టివా నీవు
అంటే ననరాదు రెండు అడుకులకే చొచ్చేవు
వింటే మాకు నవ్వు వచ్చీ వెట్టివా నీవు' (2.32)

అని కుచేలుని భక్తిభావాన్ని వ్యక్తం చేస్తూ, తన సంకీర్తనలద్వారా తన గాఢమైన భక్తిని వెలువరించాడు. ఈ విధంగా అన్నమయ్య ఎందరో పౌరాణిక భక్తులగురించీ, వారి భక్తి గాఢతగురించీ వివరించాడు.

## 3. చారిత్రకభక్తులు

ఇంతవరకు అన్నమయ్య సంకీర్తనలలో పౌరాణిక భక్తుల గురించి వివరించడం జరిగింది. చారిత్రక భక్తుల గురించిన వివరణ ప్రస్తుతాంశం. ఈ విషయాన్ని రాజులు, ఆళ్వారులు, ఆచార్యులనే విభాగాలకింద పరిశీలించవచ్చు.

## 3.1. రాజులు

అన్నమయ్య సంకీర్తనలలో చారిత్రక సంబంధమైన రాజు తొండమాన్ చక్రవర్తి ఒక్కడే కనిపిస్తున్నాడు. అన్నమయ్య

'దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాఁడు' (1.151)

అని తొండమాన్ చక్రవర్తి గురించి పేర్కొన్నాడు. ఇతడు చంద్రవంశ రాజు. ఇతడు నారాయణపురాన్ని (వనం) పాలించే వాడు. తండ్రి సువీరుడు. తల్లి నందిని. పాండ్యరాజు కుమార్తె పద్మావతిని వివాహం చేసుకున్నాడు. ఇతనికి ఐదు సంవత్సరాలవయసులోనే విష్ణుభక్తి అలవడింది.

ఈ రాజు సాక్షాత్ వేంకటేశ్వరస్వామి ఆదేశానుసారం మధ్యాహ్నం నైవేద్యానంతరం స్వర్ణ పుష్పాలతో పూజచేసేవాడు. కుమ్మరదాసుడైన కురువరతినంబికి మోక్షప్రాప్తి కలిగిన తరువాత శ్రీనివాసుడనే తన కుమారునికి పట్టం కట్టి, ఆతరువాత గొప్ప తపసుచేసి జరామరణంలేని భగవల్లోకానికి చేరుకున్నాడు.

## 3.2. ఆళ్వారులు - ఆచార్యులు

తమిళదేశంలో వైష్ణవప్రపంచంలో విష్ణుమూర్తి తరువాతిస్థానం ఆళ్వారులు ఆచార్యులది. వీరు చారిత్రక మహాపురుషులు. వైష్ణవమత వ్యాప్తికి వీరు చేసినసేవ అనిర్వచనీయం. విష్ణుభక్తి తప్ప ఇతర విషయాలను వీరు దగ్గరకు రానివ్వరు. అటువంటి ఆళ్వారులను ఆచార్యులను కూడా అన్నమయ్య తగినవిధంగా స్మరించాడు, కొనియాడాడు.

### 3. 2.1. ఆళ్వారులు

'ఆళ్వార్' అంటే భగవద్భక్తి లో ఎవరూ పోనంత లోతుకు పోయిన వారు అని అర్థం. ఆళ్వార్లు తమ మాతృభాషలో పాశురాలు ఎంత గొప్పగా రచించారో ఆ ప్రభావంతోనే అన్నమయ్యకూడా సంకీర్తన రాశిని సృజించాడు. అందుకనే అన్నమయ్య ఆళ్వార్లను తన కీర్తనలలో

పొందుపరిచాడు. ఆళ్వార్లలో ముఖ్యమైన నమ్మాళ్వార్, తిరుమంగై యాళ్వార్, ఆండాళ్‌ల ప్రస్తావన అన్నమయ్య కీర్తనలలో కనిపిస్తుంది.

నమ్మాళ్వార్ ఆళ్వారులలో ప్రముఖుడు. ఇతనికే శఠగోపుడు, శఠారి, కారిమారన్, వకుళాభరణుడు అని కూడా పేర్లున్నాయి. భగవంతుడు ప్రత్యక్షమై నమ్మాళ్వారు మాటలకు పరవశుడై వేదరహస్యాలను బోధపడేట్లు చేశాడు. ఇదే విషయాన్ని అన్నమయ్య ఒక సంకీర్తనలో

'కారిమారసుతుని చక్కని మాటలకుఁ జొక్కి
చూరగా వేదాలగుట్టు చూపినవాఁడు' (1.121)

అదేకీర్తనలో తిరుమంగయాళ్వార్ కి సంబంధించిన ప్రస్తావన ఉంది.

'తీరని వేడుకతో తిరుమంగయాళువారి-
ఆరడి ముచ్చిలికూటి కాసపడ్డవాఁడు'

తిరుమంగయాళ్వార్‌కి నీలన్, పరకాలన్, అరుళ్‌మారి వంటి పేర్లున్నాయి. ఆళ్వారులలో చాలా గుళ్ళలో పాశురాలు పాడినకీర్తి ఈయనకే దక్కింది. దారిదోపిడీచేసి భాగవతసమారాధన సాగించినాడు. భాగవతులకు చేసేది భగవంతునికి చేసినట్లే. అందుకని భగవంతుడు ఈయనకు నారాయణమంత్రం ఉపదేశంచేశాడు.

అదే సంకీర్తనలో ఆండాళ్ గురించి

'పెరియాళువారి బిడ్డ పిసికిపై వేసిన
విరులదండల మెడవేసినవాఁడు'

పెరియాళువారిబిడ్డ ఆండాళ్ అని ప్రసిద్ధివహించిన గోదాదేవి. ఈమెకే సూడికొడుత్త నాచ్చియార్ (ఆముక్తమాల్యద), రంగనాయకి అని కూడా పేర్లు. ఈమె ఆళ్వారులలో ఏకైక మహిళ. పెరియాళువారిబిడ్డ అయిన గోదాదేవి ధరించిన మాలను విష్ణుమూర్తి ప్రియంగా ధరించాడు. అందుకనే అన్నమయ్య ఆమెను స్తుతించాడు.

## 3. 2. 2. ఆచార్యులు

ఆళ్వార్లు భక్తితో పాశురాలు పాడి తరించారు. ఆచార్యులు భక్తిని బోధించి ఎలా ఆచరించాలి అన్నది తామే చేసి చూపించారు. అన్నమయ్య కూడా ఆచార్యులదగ్గర ఉపదేశాలు పొందినవాడే. ఆ కారణంగానే అన్నమయ్య ఆళ్వారులలాగానే ఆచార్యులను కూడా స్తుతించడం కనిపిస్తుంది. కొన్ని కీర్తనలలో రామానుజాచార్యులను స్తుతించడం కనిపిస్తుంది.

వైష్ణవఆచార్యులలో మధ్యమణి వంటివాడు రామానుజాచార్యులు. విశిష్టాద్వైత సిద్ధాంతాలకు ప్రధాన ప్రవర్తకుడు. వ్యాసమహర్షి విరచిత బ్రహ్మ సూత్రానికి ఈ సిద్ధాంత పరంగా భాష్యం చేసినందువల్ల శ్రీభాష్యకారుడని పేరు వచ్చింది. అందుకే అన్నమయ్య

గతిలేకపోయిన కలియుగమున వచ్చి
ప్రతిపాలించఁ గలిగె భాష్యకారులు' (1.162)

అని ఒక కీర్తనలో పేర్కొన్నాడు. భగవంతుని కృప, భగవదనుభవం, భగవద్భక్తి, శిష్య సంపద, అన్నీ అతను కలిగిఉన్నందున ఆయనను తమిళంలో 'ఉడయవర్లు' అంటారు. అన్నమయ్య కూడా

'ఉన్నతోన్నతుడు వుడయవరు
యెన్న ననంతుడే యీ వుడయవరు' ॥పల్లవి॥
(Nector Ocean of Annamacharya. P.252)

అని ఆ పేరుతోనే ఆయనను కీర్తించాడు. శాస్త్ర ఉపదేశం, సంప్రదాయ ఉపదేశం రెండూ చేసినవాడు రామానుజులే. ఎన్నో దేవాలయాల్లో ఆగమసంబంధ వ్యవస్థను ఏర్పాటు చేసింది ఈయనే. తన హృదయం నిండా భక్తిభావంతో అన్నమయ్య రామానుజులను

'యీతని కరుణనేకా యిల వైష్ణవులమైతి-
మీతనివల్లనే కంటి మీతిరుమణి

యీతఁడేకా వుపదేశ మిచ్చె నష్టాక్షరి మంత్ర-
మీతఁడే రామానుజులు యిహపరదైవము
వెలయించె నీతఁడేకా వేదపురహస్యములు
చలిమి నీతఁడే చూపె శరణాగతి
నిలిపినాఁ డీతఁడేకా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడేదైవము
నియమము లీతఁడేకా నిలిపెఁ బ్రపన్నులకు
దయతో మోక్షము చూపెఁ దగ నీతఁడే' (2.372)

అని అన్నమయ్య సవివరంగా తెయజేయడం జరిగింది.

ఒక సంకీర్తనలో అనంతాళ్వారు, తిరుమలనంబి, తిరుకచ్చినంబి అన్న ఆచార్యులను గురించి చెప్పడం జరిగింది.

అనంతాళ్వారు రామానుజాచార్యుల శిష్యుడు. తన ఆచార్యుని నియమానుసారం తిరుమలలో స్వామికి పుష్పకైంకర్యం చేసేవాడు. ఈ ఆళ్వారు పూలతోట నీటికోసం ఒక చెరువు త్రవ్వాడు. ఆ బృహత్కార్యంలో స్వామివారు అయాచితంగా సహాయం చేయదలచి ఒక చిన్నబాలుడి రూపంలో వచ్చాడు. వెట్టిగా మట్టి మోశాడని అన్నమయ్య

'అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచిన వాఁడు' (1.151)

అని పేర్కొన్నాడు.

అదే కీర్తనలో తిరుమలనంబిని గురించి చెప్పడం జరిగింది. తిరుమలనంబి రామానుజాచార్యులకు మేనమామ. ఈ ఆచార్యుడు స్వామి వారికి తీర్థకైంకర్యం చేసినవాడు. స్వామితో ప్రత్యక్షంగా మాట్లాడినవాడు. ఆ విషయాన్నే అన్నమయ్య

'మచ్చిక దొలఁకఁ దిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాఁడు' అని ప్రస్తావించాడు.

అదే కీర్తనలో తిరుకచ్చినంబి ప్రస్తావన ఉంది. తిరుకచ్చినంబి కంచిలో ఉండేవాడు. ఈయన కంచి వరదరాజస్వామికి ఆలవట్టం వీచేవాడు. రామానుజాచార్యులు అడిగిన ప్రశ్నలకు కంచివరదుని దగ్గర వివరణ అడిగి తెలుసుకుని చెప్పినవాడు. ఈయనను తిరుమల నాథుడు ప్రేమతో కంచినుండి తన దగ్గరకు రప్పించుకున్నాడని అన్నమయ్య

'కంచిలోననుండిఁ దిరుకచ్చినంబిమీఁదఁ గరు-
ణించి తన యెడకు రప్పించినవాఁడు' అని పేర్కొన్నాడు.

ఇంతేకాకుండా ఒక కీర్తనలో తన గురువు శఠగోపమునిని గురించి కీర్తించడం కూడా కనిపిస్తుంది.

చూడుఁ డిందరికి సులభుఁడు హరి-
తోడునీడయగు దొరముని యితఁడు
కైవల్యమునకుఁ గనకపుతాపల-
త్రోవై శ్రుతులకుఁ దుదిపదమై
పావన మొకరూపమై విరజకు
నావై యున్నాఁడిదె యితఁడు
కాపాడఁగ లోకములకు సుజ్ఞాన-
దీపమై జగతికిఁ దేజమై
పాపా లడఁపఁగ భవపయోధులకు
తేపై యున్నాఁడిదే యితఁడు
కరుణానిధి రంగపతికిఁ గాంచీ
వరునకు వేంకటపతికి
నిరతి నహోబలనృకేసరికిఁ ద
త్పరుఁడగు శఠగోపముని యితఁడు' (1.117)

అని తనగురువు విశిష్టగుణాలను వివరించాడు. ఈ శఠగోపముని నమ్మాళ్వార్ కావచ్చునని కొందరి భావన. ఇందులో అహోబల నృకేసరి

ప్రస్తావన ఉన్నందున ఈయన అహోబల పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్రుడే ననిపిస్తుంది. తనగురువు తనకు శ్రీవేంకటేశ్వరుని పాదాలు పట్టిచ్చాడని పేర్కొన్నాడు అన్నమయ్య. తనకు గురువు బోధించిన భక్తి తత్వాన్ని దీనిద్వారా స్పష్టం చేశాడు. భగవంతునితో

'ఎట్టయినాఁ జేసుకో ఇఁక నీచిత్తము నన్ను
పట్టిచ్చె మాగురుఁడు నీపాదాలు విడువను' ( 3.95)

అని తనగురువును కృతజ్ఞతతో స్తుతించడం కనిపిస్తుంది.

## 3.3. ఇతరులు

అన్నమయ్య కీర్తనలలో చారిత్రకవైష్ణవభక్తులలో రాజులు, ఆళ్వారులు, ఆచార్యులు కాకుండా కురువరతినంబి(భీముడు) అన్న ఒక భక్తుడు కూడా కనిపిస్తాడు. ఇతడు కుమ్మరదాసుడని అన్నమయ్య

'కుమ్మరదాసుఁడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాఁడు' (1.151)

అని పేర్కొన్నాడు. ఈ కుమ్మరిభక్తుడు కుర్వపురంవాసి. అతని పేరు భీముడు. తన గుడిసెలో మట్టితో వేంకటేశ్వరస్వామి బొమ్మ చేసిపెట్టి మట్టిపూలతో పూజించేవాడు. తొండమాన్ చక్రవర్తి స్వామివారి ఆలయంలో స్వర్ణపుష్పాలతో పూజచేసే సమయంలో తులసితో కూడిన మట్టిపుష్పాలు కనిపించాయి. అప్పుడు రాజు స్వామిని ప్రశ్నించాడు. స్వామి కురువరతి నంబి గురించి చెబుతాడు. రాజు కుర్వపురం పోయి భీముని కలుస్తాడు.

నీవు స్వామికి ఎలాపూజచేస్తావని అడుగుతాడు. అతడు నాకు పూజలేవీ తెలియవంటాడు. నా పూజగురించి ఎవరు చెప్పారని అడుగుతాడు. అప్పుడు రాజు శ్రీనివాసుడు చెప్పాడని చెబుతాడు. శ్రీనివాసుని పేరు వినగానే భీమునికి తనకున్న వరం స్మరణకు వస్తుంది. కుమ్మరదాసునికి మోక్షప్రాప్తి కలుగుతుంది.

4. ఈ విధంగా అన్నమయ్య ఎందరోపౌరాణిక, చారిత్రక భక్తుల ఇతివృత్తాలు ఎరిగి తన సంకీర్తనలలో సందర్భోచితంగా వివరించాడు. తద్వారా ఆయన జన్మ ధన్యం కావడమే కాకుండా సంకీర్తనలు చదివేవారికి వినేవారికికూడా సత్ఫలితాలు లభించే అవకాశం కల్పించాడు.

'ఇన్ని జన్మము లేఁటికి హరిదాసు-
లున్న వూరఁ దానుండినఁ జాలు
హరిభక్తుల యింటియన్నము గొనువారి-
వరువుడై వుండవలెనన్నఁ జాలు
పరమభాగవత భవనంబులఁ జెడ్డ-
పురువు దానయి పొడమినఁ జాలు
వాసుదేవుని భక్తవరులదాసులు మున్ను-
రోసిన యెంగిలి రుచిగొన్నఁ జాలు
శ్రీసతీశునిఁ దలఁచినవారి దాసాన-
దాసుఁడైవుండఁ దలచినఁ జాలు
శ్రీవేంకటేశుఁ జూచినవారి శ్రీపాద-
సేవకుఁడై యండఁ జేరినఁ జాలు
యీవిభుదాసుల హితుల పాదధూళి-
పావనమై సోఁకి బ్రదికినఁ జాలు' (1.367)

అన్నది అన్నమయ్య ధృఢమైన,స్పష్టమైన అభిప్రాయంగా తెలుస్తోంది.

★ ★ ★

పర్వతనేని సుబ్బారావు

## అన్నమయ్య సంకీర్తనలు - శరణాగతి తత్త్వం

శరణాగతికి "శరణం యథాతథా ఆగతిః ' అని విగ్రహవాక్యం. కాగా అమరం శరణం గృహ రక్షిత్రోః అని చెబుతోంది. అనగా గృహం, రక్షకుణ్ణి గురించి ఈ శబ్దం చెబుతోంది. కాని

"ఉపాయే గృహ రక్షిత్రోశ్శబ్దః శరణ మిత్యయం
వర్తతే, సాంప్రతం చైష ఉపాయార్థై క వాచకః '
- అహిర్బుధ్న్య సంహిత. 3-7-29

అని ఉపాయానికి కూడా ఈ శబ్దం వాచకమనీ, శరణాగతి శబ్దంలో ఉపాయమే ప్రధానంగా గ్రహించబడిందని తెలుస్తోంది. భక్తుని పరమ పదానికి తీసుకుపోవాలంటే భగవంతు డొక్కడే సాధనమని దీని అర్థం. కాగా, శరణాగతి ఆరు విధాలు.

"ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం
రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా
ఆత్మనిక్షేప కార్పణ్యే షడ్విధా శరణాగతిః"

ఆత్మ నిక్షేపం అంగిగా మిగిలిన అనుకూల్య సంకల్పం, ప్రాతికూల్య వర్జనం, రక్షష్యతీతి విశ్వాసం, గోప్తృత్వవరణం, కార్పణ్యం అనే అయిదూ అంగాలుగా మొత్తం ఆరింటిని పేర్కొనడం జరిగింది.

ఇక శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీవైష్ణవుడిగా పుట్టిన ప్రతి ప్రాణీ శరణాగతి పొందిన వాడుగానే చెప్పడం జరిగింది.

1. ఆత్మనిక్షేపం - తనకు సంబంధించిన సర్వభారాన్ని (పోషణ, రక్షణ, ఆపదలనుంచి కాపాడటం, పరమగతికి తీసుకుపోవడం) స్వామికే సమర్పించడం.

2. ఆనుకూల్యసంకల్పం - శ్రుతి, స్మృతులలో చెప్పిన నిత్య నైమిత్తి కాలలో, భగవద్విషయాలలో శ్రద్ధ కలిగి ఉండేటట్లు సంకల్పించు కొనడం.
3. ప్రాతికూల్యవర్జనం - భగవద్వ్యతిరేకాలు, భగవంతునికి విరుద్ధమైన విషయాలను విడిచిపెట్టడం.
4. రక్షష్యతీతి విశ్వాసం - భగవంతుడు నన్ను తప్పక రక్షిస్తాడనే గాఢ నమ్మకం.
5. గోప్తృత్వవరణం - నీవు తప్ప నాకు అన్యరక్షకుడు లేడు అని భగవంతుణ్ణే తనకు రక్షకుడిగా భావించుకోవడం.
6. కార్పణ్యం - నేను అశక్తుడను, అన్యథాగతిలేని వాడను, నాకు నీవేదిక్కు, నన్ను నీవే కాపాడాలని దీనత్వాన్ని చాటుకోవడం.

## శరణాగతి పద్ధతి

అహిర్బుధ్న్య సంహిత[1] ప్రకారం, ఏ ఉపాయములేని వాణ్ణి, నన్నెవ్వరూ రక్షించే దిక్కులేని వాణ్ణి అని భావించి'నీవే నన్ను దరిచేర్చ డానికి ఉపాయభూతుడవు' అని ప్రార్థించి శరణు పొందడమే శరణాగతి. అలా భక్తుడు శరణాగతుడైనప్పుడే 'ఏ దిక్కూ లేనివాడు, నన్నే నమ్ముకున్నవాడు కాబట్టి వీణ్ణి నేను తప్పక ఉద్ధరించాల'ని ఆ భగవంతుడు భావించి ఆ భక్తుణ్ణి ఉద్ధరించడం జరుగుతుంది.

## ప్రపత్తి

శరణాగతి వేరు, ప్రపత్తి వేరు అని కొందరు భావించారు. కాగా 'ఆత్మాత్మీయ భరన్యాసోహ్యాత్మ నిక్షేప ఉచ్యతే 'అనగా శరణాగతిలో పేర్కొనబడ్డ ఆత్మనిక్షేపమే 'ప్రపత్తి' అని కొందరు భావించారు. తననూ, తన సర్వస్వాన్ని స్వామికే సమర్పించి నేటినుండి నేను నీవాడ ననడమే భరన్యాస పరమార్థం. శరణాగతికీ, ప్రపత్తికి పెద్ద భేదం లేదని తెంగల వైష్ణవులు, శరణాగతి ఉన్నా దానికంటే ప్రపత్తి విశిష్టమైనదని వడగల

వైష్ణవులు భావించడం కద్దు. అయితే అన్నమయ్య శరణాగతినీ, ప్రపత్తిని రెంటినీ అనేక చోట్ల వాడడం జరిగింది.

భగవంతుణ్ణి చేరుకోవడానికి, భగవంతుని దయకు పాత్రులు కావడానికి భక్తులు అనేక మార్గాలు అవలంబిస్తారు. ఎన్ని మార్గాలున్నా 'శరణాగతి' సర్వోత్కృష్టమైన మార్గమని చెప్పబడుతోంది. తమకు భగవంతుడు తప్ప వేరే ఆధారంలేదని గ్రహించి, పూర్తివిశ్వాసంతో ఆతడే దిక్కని భావించి అతని పాదాలను ఆశ్రయించడమే శరణాగతి తత్త్వమని స్థూలంగా చెప్పుకోవచ్చు. కాగా, శరణు జొచ్చిన వారికి అభయమిచ్చి ఆదుకోవడం భగవంతుని స్వభావమని కూడా మనకు ఎన్నో సంఘటనల వల్ల తెలుస్తోంది.

విభీషణుడు రాముణ్ణి శరణుకోరినప్పుడు ఆయన అన్న మాటల్ని పరికించండి.

'సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతిచ యాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ'

(శ్రీమద్రామయణం - యుద్ధకాండ - సర్గ. 18-శ్లో.33)

అనగా సర్వభూతాలకూ అభయప్రదానం చేస్తాననడం రాముడి దీక్షావాక్యం.

అలాగే వినయ విధేయతలతో స్వామి నియోగించిన పనిని చేయడానికి సిద్ధంగా ఉండి సర్వధర్మాలను వదిలి పెట్టి అనగా ధర్మాన్ని గురించిన మీమాంసను ఆపి ఎవరైతే శరణు పొందుతారో వారిని కాపాడతానని శ్రీకృష్ణపరమాత్మ పేర్కొనడం జరిగింది.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" -

(భగవద్గీత , అధ్యా. 18-శ్లో.66)

భగవద్రామానుజులు శరణాగతి, ప్రపత్తి మార్గాన్నే ప్రజానీకానికి బోధించారు. భక్తులనేకులు భగవంతుని శరణు కోరారు. సత్ఫలితాలను

పొందారు. వాగ్గేయకారుల రచనల్లోనూ శరణాగతి తత్త్వం మనకు కనిపిస్తుంది. అన్నమయ్య శ్రీరామానుజుల సిద్ధాంతాన్నే అనుసరించారని ప్రస్ఫుటవవౌతున్నది. ఆయున సంకీర్తనలెన్నో శరణాగతి ప్రబోధిస్తున్నాయి.

శ్రీవేంకటేశ్వరుని శరణువేడమని అన్నమయ్య తన మనస్సును, జీవుని ఉద్బోధించాడు. భక్తజనులైన లోకులకూ ఉద్బోధించాడు. తాను స్వయంగా శ్రీనివాసుని శరణువేడి కృతార్థుడయ్యాడు అన్నమయ్య శరణాగతిని గురించి అనేక విధాలుగా వివరించారు. ఈ పదకవితా పితామహుని సాహిత్యశిల్పం ఎంతో గొప్పది. పదాల మేళవింపులో, అర్థాల పోహళింపులో ఆయన కాయనేసాటి.

సాళువనరసింగరాయలు అన్నమయ్యను తనపై ఒక శృంగార కీర్తన పాడమనగా 'ముకుందు గొనియాడు నాజిహ్వ నినుగొనియాడ నేరదు' అని తిరస్కరించగా రాజు కోపించి సంకెళ్ళు వేయించాడు. దానికి అన్నమయ్య

ఆఁకటి వేళల - నలపైన వేళలను
    తేఁకువ హరినామమే - దిక్కు మరిలేదు ||పల్లవి||

కొఱమాలి వున్నవేళ - కులము చెడినవేళ
    చెఱవడి వొరులచేఁ - జిక్కినవేళ
    వొఱపైన హరినామ - మొక్కటే గతిగాక
    మఱచి తప్పిన నైన - మఱిలేదు తెరగు ||ఆఁక||

ఆపద వచ్చిన వేళ - యారడి ఁబడినవేళ
    పాపపు వేళల - భయపడిన వేళ,
    వోపినంత హరినామ - మొక్కటే గతిగాక
    మాపుదాఁకా ఁబొరలిన - మరిలేదు తెఱగు ||ఆఁక||

సంకెళఁ బెట్టినవేళ - చంపఁబిలిచిన వేళ
    అంకిలిగా నప్పులవా - రాఁగిన వేళ

వెంకటేశునామమే - విడిపించ గతిగాక
మంకుబుద్ధి (బొరలిన-మరిలేదు తెఱగు ॥అ(క॥ (1 -158)

ఆకలివేసినప్పుడు, అలసిపోయినప్పుడు ధైర్యాన్నిచ్చి రక్షించేది హరినామం తప్ప వేరే దిక్కు లేదంటాడు.

భవ రోగాన్ని పరిహరించడానికి ప్రేమ స్వరూపుడైన భగవంతు డొక్కడే సరైన ఔషధ మంటాడు అన్నమయ్య.

కొనరో కొనరో మీరు - కూరిమి మందు
వునికి మనకి కెల్ల - నొక్కటే మందు ॥పల్లవి॥

ధ్రువుడు గొనిన మందు- తొల్లియు (బ్రహ్లాదు(డు
చవిగా (గొనిన మందు - చల్లని మందు,
భవరోగములు వీడి - పార(గ(బెద్దలు మున్ను
జవకట్టి కొనిన ని - చ్చలమైన మందు ॥కొన॥

నిలిచి నారదు(డు గొ - నిన మందు జనకు(డు
గెలుపుతో (గొని బ్రది - కిన యా మందు,
మొలచి నాలుగు యుగ - ముల రాజులు ఘనులు
కల కాలము గొని- కడగన్న మందు ॥కొన॥

అజునకు (బర - మాయువై యొసగిన మందు
నిజమై లోకములెల్ల - నిండిన మందు,
త్రిజగములు నెఱ(గ - తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తి (గోనేటి - దరినున్న మందు ॥కొన॥ (1-237)

ఇంతకు పూర్వం ధ్రువుడు, ప్రహ్లాదుడు ఈ మందును ఎంతో ప్రీతితో స్వీకరించారు. ఈ మందునే నారదుడు సేవించాడు. జనకుడు ఈ మందునే సేవించి బ్రహ్మానందంతో జీవించాడు. ఈ మందే బ్రహ్మకు పరమాయువై విలసిల్లింది. ముల్లోకాలకు తెలిసి తిరు వేంకటాద్రిపై కోనేటిగట్టుపైనున్న ఈ మందు లాంటి మందు భవరోగాలను పరిమార్చడానికి మరొకటి

లేదంటాడు. కాబట్టి, ఆ పరమాత్మను శరణువేడి ఆయన అనుగ్రహానికి పాటు పడటమే ముక్తికి సరైన మార్గమంటాడు.

సర్వానికీ మూలమైన హరిని శరణు వేడక ఇతరోపాయాలను అనుసరించడం నిష్ప్రయోజనమంటాడు అన్నమయ్య.

మొదలుండ ఁగొనలకు - మోచినీళ్ళు వోయనేల
    యెదలో నీవుండఁగా - నితరములేలా ॥పల్లవి॥

నిగమ మార్గమున - నేనడచేనంటే
    నిగమములెల్లను - నీమహిమే,
    జగము లోకుల ఁజూచి - జరగెదనంటే
    జగములు నీమాయ - జనకములు ॥ మొద॥

మనసెల్ల నడ్డపెట్టి - మట్టున నుండేనంటే
    మనసు కోరికలు - నీమతకాలు,
    తనువు నింద్రియములు - తగగెలిచే నంటే
    తనువు నింద్రియములు - దైవమ నీ మహిమా ॥మొద॥

యింతలోని పనికిఁగా - యిందునందు జొరనేల
    చెంత నిండుచెరువుండ - చెలమలేలా
    పంతాన శ్రీవేంకటేశ - పట్టినీకే శరణంటి
    సంతకూటాల ధర్మపు - సంగతి నాకేలా ॥మొద॥ (1- 466)

చెట్టును పెంచి ఫలాన్ని అనుభవించాలనుకొనేవాడు చెట్టు మొదలులో నీళ్ళుపోయాలి గాని, కొన కొమ్మలకు మోసికొనిపోయి అక్కడ నీళ్ళుపోయడం వ్యర్థప్రయాసకదా! హృదయంలో నీవుండగా ముక్తికోసం ఇతరాల కోసం ప్రయత్నించడం వ్యర్థమని చెబుతున్నాడు.

వేదమార్గంలో నేను నడవాలనుకొంటే వేదాలెల్లా నీమహిమే కదా. ఈ జగంలోని జనుల ప్రవర్తన జూచి ఆ విధంగా నడవాలనుకొంటే ఈ జగాలన్నీ నీమాయా జనితాలేకదా! అంతా నీమాయా మహిమలకు లోబడి

ఉండగా, అటూ ఇటూ పరుగులెట్టి వ్యర్థ ప్రయాసలు పొందడ మెందుకు? చెంతనే నిండు చెరువుండగా చెలమల చెంతకు పోవడ మెందుకు? ఓ శ్రీనివాసా! పరమ ఫలప్రదాతవైన నిన్నే శరణు వేడు కొంటున్నాను. అలాంటప్పుడు సంతలోని జనకూటాల లాగా ప్రవర్తించే వివిధ ధర్మాలసంగతి నాకెందుకు? కాబట్టి మనో నిరోధం, ఇంద్రియ జయం మొదలైన చర్యలవల్ల పరమపదాన్ని పొందాలను కోవడం కంటే సర్వమయుడైన సర్వేశ్వరుణ్ణి నేరుగా శరణుపొందడమే మేలని అన్నమయ్య బోధిస్తున్నాడు.

భగవత్ప్రాప్తికి శరణాగతి మాత్రమే మార్గమంటూ –

ఏదుపాయము - యే నిన్ను జేరుటకు
ఆది నంత్యము లేని - అచ్యుత మూరితివి ॥పల్లవి॥

వెలయ నీగుణములు - వినుతించే నంటే
తెలియ నీవు గుణా - తీతుడవు,
చెలరేఁగి నినుమతిఁ - జింతించే నంటే
మలసి నీవచింత్య - మహిముఁడవు ॥ఏదు॥

పొదిగి చేతుల నిన్నుఁ - బూజించే నంటే
కదిసినీవు విశ్వ - కాయుఁడవు,
అదననేమైన స - మర్పించే నంటే
సదరమై అవాప్త - సకల కాముఁడవు ॥ఏదు॥

కన్నుల చేతనిన్ను - గనుఁగొనే నంటే
సన్నిధి దొరక నగో - చరుఁడవు,
యిన్నిటాను శ్రీవేంక - టేశ నీవు గలవని
వన్నెల శరణనే - వాక్యమే చాలు ॥ఏదు॥ ( 2-122)

ఆది అంతంలేని అచ్యుతమూర్తి అయిన శ్రీవేంకటేశ్వరుని చేరడానికి తగిన ఉపాయమేది? దేవా! నీగుణాలను నోరారా స్తుతించి నిన్ను చేరాలను

కొంటే నీవు గుణాతీతుడవు కాబట్టి అది అసాధ్యం. ఏకాగ్రతతో నిన్ను నా మనస్సు లో నిలిపి చింతించుదామనుకుంటే నీవు అచింత్య మహిమతో విశ్వవ్యాప్తుడవై మహిమలతో కూడి ఉన్నావు. నీకు ఏదైనా సమర్పించుకుందామనుకుంటే నీవు కోరికలన్నీ తీరినవాడవు.

నిన్ను కనులారా చూడాలనుకుంటే చూపులకు అందుబాటులో లేని అగోచరుడవు. ఏ ఉపాయంతో నిన్ను చేరాలనుకున్నా సాధ్యంకాదు. ఓ వేంకటేశ్వరా! నీవు ఎల్లెడలా ఉన్నావని నమ్మి ప్రసిద్ధమైన ప్రపత్తి మార్గాన్ననుసరించి నిన్ను శరణువేడట మొక్కటే నిన్ను చేరడానికి తగిన ఉపాయమంటూ భగవంతుడు శరణాగతి రక్షకుడని పేర్కొనడం జరిగింది.

మోక్షానికి కర్త శ్రీహరి మాత్రమే. ప్రపన్నుడు భగవంతుని శరణువేడట మొక్కటే మోక్షప్రాప్తికి తగిన ఉపాయమంటాడు అన్నమయ్య.

ఒక్కఁడే మోక్షకర్త - వొక్కటే శరణాగతి
దిక్కని హరిఁగొల్చి బ -దికిరి తొంటివారు ॥పల్లవి॥

నానాదేవతలున్నారు - నానాలోకములున్నవి
నానావ్రతాలున్నవి - నడిచేటివి,
జ్ఞానికి ( గామ్య కర్మాలు - జరపి పొందేదేమి
అనుకొన్న వేదోక్తా - లైనా నాయఁగాక ॥ఒక్క॥

వొక్కడు దప్పికిఁద్రావు - వొక్కఁడు కడవ నించు
నొక్కఁడీఁదులాడుమడు - గొక్కటి యందే,
చక్క జ్ఞానియైనవాఁడు - సారార్థము వేదమందు
తక్కక చేకొనుఁగాక - తలకెత్తు కొనునా ॥ఒక్క॥

యిది భగవద్గీతార్థ - మిది యర్జునుని తోను
యెదుటనే వుపదేశ - మిచ్చె (గృష్ణుడు,
వెదకి వినరో శ్రీ - వేంకటేశు దాసులాల
బ్రదుకుఁద్రోవ మనకు - పాటించి చేకొనరో! ॥ఒక్క॥(2 -186)

ఎంతోమంది దేవతలున్నారు, ఎన్నో లోకాలున్నాయి. ఎన్నో వ్రతాలున్నాయి. అయినా జ్ఞానికి కామ్యకర్మ లాచరించి పొంద వలసిందేమీలేదు. అనిత్యాలైన స్వర్గాది సుఖాలపై ఆతడికి ఆశవుండదు. మడుగు ఒక్కటే అయినా ఒకడు దాహాన్ని తీర్చుకోవడానికి నీరు తాగుతాడు. మరొకడు కడవ నింపుకొంటాడు. ఇంకొకడు ఈత గొడతాడు. అదే విధంగా వేదాలలో ఎన్నో విషయాలున్నా జ్ఞాని ఏది సారార్థమో దానినే గ్రహిస్తాడు గాని మిగిలిన వాటి జోలికిపోడు. భగవద్గీతార్థమైన ఈ భావాన్నే కృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు. కాబట్టి, ఓ శ్రీవేంకటేశ్వరుని దాసులారా! జీవన మార్గమైన దీనిని పాటించి, భగవంతుని శరణువేడి ధన్యులు కండని ఉపదేశిస్తున్నాడు అన్నమయ్య.

జీవుని సేవకతత్త్వాన్ని, భగవంతుని రక్షకత్వాన్ని చెబుతూ-

నేనేమి ఁజేయగలేను - నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నేనధికుఁడవి - న్నిటా నీవు ||పల్లవి||

దండము వెట్టుట నాది - తప్పులో ఁగొనుట నీది
నిండి నీవెప్పుడు దయా - నిధివి గాన,
అండ ఁజేరు కొంట నాది - అందుకు నూఁకొంట నీది
దండియైన దేవదేవో - త్తముఁడవు గాన ||నేనే||

శరణుచొచ్చుట నాది - సరుగ ఁగాచుట నీది
పరమ పురుష శ్రీ - పతివి నీవు,
విరులు చల్లుటనాది - వేవేలిచ్చుట నీది
పొరి నీవు భక్త సుల - భుఁడ వటు గాన ||నేనే||

దాసుఁడ నసుట నాది - తప్పక యేలుట నీది
ఆసదీర్చే వరదుఁడ - వటుగాన,
నీసేవ యొక్కటి నాది - నిచ్చలు గైకొంట నీది
యీసులేని శ్రీవేంక - టేశుడవు గాన ||నేనే|| (2 - 433)

నిన్ను శరణుజొచ్చుట నావంతు. నన్ను రక్షించుట నీవంతు. ఎందుకంటే శరణాగతుల రక్షణకోసం నిన్ను పురిగొల్పే లక్ష్మికి నీవు పతివి. పూలతో నిన్ను పూజించడం నావంతు. సకల సంపదలిచ్చి నాకోరికలను తీర్చడం నీవంతు. ఎందుకంటే నీవు భక్తజనసులభుడవు కదా! అంతేకాదు. దాసజనుల ఆశలు తీర్చే వరదాయకమూర్తివి. నిన్ను సేవించడమే నాపని, నా సేవల్ని అంగీకరించడం నీపని. కారణం నీవు ఈర్ష్యలేని శ్రీవేంకటేశ్వరుడవు కదా!

మరో చోట శరణాగతులైన హరిదాసులకు ముక్తిసులభ మంటా డన్నమయ్య –

అల్లనాఁడే యిదెరఁగ - మైతిమి గాని
యిల్లిదె దేవుని కృప - యీడనున్నది సుండి ॥పల్లవి॥

చేరువవో మోక్షము - శ్రీహరి భక్తికిని
ధారుణి గర్మమునకే - దవ్వు గాని,
యీరీతి నింద్రియముల - నించుకంతే దాఁటిన
దూరముగాదు జ్ఞానపు - తోవ వున్నది సుండి ॥అల్ల॥

ధర ఁజేతిది వైకుంఠమ - తని దాస్యమునకు
పరధర్మముల కగ - పడదు గాని,
అరుదైన యాసల - ఆయము వొడిచి తేనే
అరసి యాకంత గుండా - నంద వచ్చు ఁజూండి ॥అల్ల॥

తలఁపులో దక్కెముక్తి - తగు శరణాగతికి
శిలుగుఁ బుణ్యములకుఁ - జిక్కదు గాని,
తెలిసి శ్రీవేంకటేశు - తిరుమంత్రము నాలికెఁ
బలికి నాడనే దివ్య - పదమబ్బు ఁజూండి ॥అల్ల॥ (3 - 399)

ఈ భూమి మీద పడ్డప్పుడే ఈ విషయాన్ని తెలుసుకోలేక పోయాం. ఇదిగో, భగవంతుని దయ ఈ చెంతనే ఉంది. జ్ఞానమార్గం మనకు

దూరంకాదు. ఇంచుక ఇంద్రియాలను దాటితే చాలు. ఆ దారిని చేరుకో గలం.

మోక్షం కష్టసాధ్యాలైన పుణ్యాలకు చిక్కదు గాని సులభమైన శరణాగతిని అనుష్ఠించే వారికి తలచుకోగానే ముక్తి దక్కుతుంది. శ్రీవేంకటేశ్వరుని తిరుమంత్రం ఉచ్చరిస్తేచాలు, వెనువెంటనే కైవల్యం కరగతమవుతుందంటాడు. ఇంకోచోట శ్రీహరిని శరణువేడటం తప్ప ఇతరోపాయాలు తనకు నచ్చవంటాడు. (సం.11-2-14) వేరొకచోట సంసారికి భగవంతుని శరణుజొచ్చే వరకు దుఃఖం నుంచి విడుదల లేదంటాడు.

ఇట్టి సంసారి - కేదియు లేదాయ
తట్టు వడుటే కాని - దరిచేర లేదు ||పల్లవి||

ములిగి భారపు మోపు - మోఁచేటి వాఁడు
అలసి దించుకొను - నాడాడను,
అలరు సంసారికి - నదియు లేదాయ
తొలఁగని భారమెం - దును దించలేదు ||ఇట్టి||

తడవి వేఁప చేఁదు - ద్రావెడి వాఁడు
ఎడయెడఁ దినుఁ దీ - పే మైనను,
అడరు సంసారికి - నదియు లేదాయ
కడు ఁజేఁదె కాని యె - క్కడ ఁదీపు లేదు ||ఇట్టి||

దొరకొని హేయమే - తోడేటి వాడు
పరిఢవించును మేనఁ - బరిమళము,
అరిది సంసారికి - నదియు లేదాయ
ఇరవు వేంకటపతి - నెఱుఁగ లేదు ||ఇట్టి||

(సం. 4-పుట.378)

సంసారసాగరంలో పడి ఎడతెగని ఇక్కట్లకు గురవుతూ దరిచేర లేని జీవుల దుస్థితి పై సంకీర్తనలో వర్ణించాడు అన్నమయ్య. ప్రకృతి బంధాన్ని తెంచుకొని సర్వేశ్వరుని శరణు జొచ్చినవాడు క్లేశాలనుంచి విడుదలవుతాడు. సంసారాన్ని భారమైన మోపుతోను, వేప చేదుతోనూ, హేయపదార్థంతోనూ పోల్చడం వల్ల అందులో చిక్కుకున్న జీవుల క్లేశాలె లాంటివో చెప్పడం జరిగింది.

అన్నమయ్యకు ముందే తమిళంలో ఆళ్వారులు శరణాగతి తత్త్వాన్ని ఆదరించి భగవంతుని శరణు వేడటం కన్పిస్తుంది. పొయ్‌గై ఆళ్వార్ శరణాగతికి సంబంధించి ఒక పద్యాన్ని, పూదత్తాళ్వార్ ఒక పద్యాన్ని, పేయాళ్వార్ అయిదు పద్యాలను, తిరుమళిశై ఆళ్వార్ పదిపద్యాలను, తొండరడిప్పొడి ఆళ్వార్ రెండు పద్యాలను, కులశేఖ రాళ్వార్ నాలుగు పద్యాలను, తిరుమంగై ఆళ్వార్ యాభైమూడు పద్యాలను, పెరియాళ్వార్ మూడు పద్యాలను, నమ్మాళ్వార్ పదకొండు పద్యాలను చెప్పారు.[2] ఇందులో వీరు శరణాగతి తత్త్వాన్ని, శరణాగతి మహిమను వివరించడమే గాక శరణాగతితో భగవంతుని చేరుకొమ్మని ఉద్బోధించారు.

భాగవతంలో గజేంద్రుడు మొసలిచే పట్టుపడి ఎంతోకాలం పోరాడి చివరకు ఈ జగత్తుకు మూలకారకుడైన భగవంతుడే దిక్కని

'ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై;
యెవ్వనియందుడిందు; బరమేశ్వరుడెవ్వడు; మూలకారణం
బెవ్వ; డనాది మధ్యలయు డెవ్వడు; సర్వము దానయైన వా
డెవ్వడు; వానినాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్ '

(శ్రీమహాభాగవతము, అష్టమస్కంధం, సంపుటం2, పద్యం-73)

అంటూ వేడుకున్నాడు. ఇక్కడ నారాయణ - వాసుదేవ తత్త్వం ఈశ్వర నామం చేత చెప్పడం గమనార్హం.

నీవే తప్పనాకు వేరే దైవం లేదంటూ భగవంతుడికి దాసుడు కావడమనేది శరణాగతితత్త్వంలో ప్రధానమైంది. గజేంద్రుడు ఆ స్థితికి చేరుకొని

'లావొక్కింతయు లేదు; ధైర్యము విలోలంబయ్యె; బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను; మూర్ఛవచ్చె; దనువున్ డస్సెన్; శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితః పరంబెఱుగ; మన్నింపందగున్ దీనునిన్;
రావే యీశ్వర! కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా!
(అ.స్కం. సంపుటం 2. ప, 90)

అని ప్రార్థించి, ఆ తర్వాత 'శరణార్థిని నన్నుగావవే' అను వేడుకోగా ఆ జీవుని వేదన విన్న విష్ణుమూర్తి ఒక్క క్షణంలో అక్కడకు రావడం, చక్రాన్ని ప్రయోగించి గజేంద్రుణ్ణి బంధ విముక్తిణ్ణి గావించడం మనకు తెలిసిందే.

అదేవిధంగా హిరణ్యకశిపునిచేత అనేక విధాల బాధలను అనుభవించిన ప్రహ్లాదుడు; వస్త్రాపహరణ సమయంలో ద్రౌపది ఆ హరిని స్మరించి, శరణువేడి ఆపదలు తొలగి సుఖించిన విషయమూ మనకు తెలిసిందే.

మొత్తంమీద సంసారసాగరంలో పడి అనేక ఇక్కట్లకు గురవుతూ తీరం చేరలేని వారు పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకొని శరణువేడి ప్రకృతి బంధాలను తెంచుకొని క్లేశాలను వీడి భగవంతుని చేరుకొమ్మని అన్నమయ్య తన సంకీర్తనలలో శరణాగతి తత్త్వం ద్వారా మనకు ఉపదేశించాడు.

## పాదసూచికలు

1. అహమస్మ్య పరాధానా మాలయో2 కించనో 2గతిః
   త్వమేవోపాయ భూతోమే భవేతి ప్రార్థనామతిః
   శరణాగతి రిత్యుక్తాసా దేవే 2స్మిన్ ప్రయుజ్యతామ్" (36-38)
2. 'అన్నమయ్య- ఆళ్వారులు'- జక్కంపూడి మునిరత్నం, మొదటి భాగం, పుటలు -118-121

## ఉపయుక్త గ్రంథాలు

1. అన్నమయ్య - ఆళ్వారులు - డా॥ జె.మునిరత్నం, ప్రథమభాగం, కల్పనా పబ్లికేషన్స్,తులనాత్మక పరిశీలన తిరుపతి, 1996.

2. అన్నమాచార్య సంకీర్తనామృతము - సముద్రాల లక్ష్మణయ్య, ద్వితీయ ముద్రణ, 2000, వెలుగోటి అంజనమ్మ, 18-1-84, కపిలతీర్థంరోడ్, తిరుపతి - 517507.

3. తాళ్లపాక పదసాహిత్యము - అన్నమాచార్యులు - సంపుటములు, 1,2,3,4,10,15, ప్రచురణ. తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

4. శ్రీమహాభాగవతము బమ్మెరపోతన - రెండవసంపుటము, ప్రచురణ, తెలుగు విశ్వవిద్యాలయం, కళాభవన్ , సైఫాబాద్, హైదరాబాద్-500004, 1987.

## వ్యాసాలు

"గజేంద్రమోక్ష- కథారహస్యం" హెచ్. ఎస్. బ్రహ్మానంద. సప్తగిరి (తి.తి.దే. మాసపత్రిక) సంపుటి: 39, జూలై, 2008. పుటలు, 17-20.

★ ★ ★

శేషభట్టర్ వసుమతీదేవి

# అన్నమయ్య సంకీర్తనలలో జీవేశ్వర సంబంధం

(నవవిధ సంబంధాలు)

శ్రీవేంకటేశ్వర భక్తాగ్రేసరుడు, పదకవితాపితామహుడు అయిన అన్నమయ్య 32 వేల సంకీర్తనలతో స్వామిని అర్చించినాడు. ఆ స్వామిని విశిష్టాద్వైత తత్త్వసారంగా, శ్రీ వైష్ణవమార్గంలో అను సంధానించుకొని, తన కీర్తనలన్నీ 'దాచుకో నీ పాదాలచెంత' అంటూ వేంకటేశ్వరాంకితం చేశాడు.

ఆదివణ్ శఠగోపముని శిష్యుడు, నృసింహమంత్రోపాసకుడు అయిన అన్నమయ్య కీర్తనలలో అడుగడుగునా ఎన్నో ఉపనిషత్ రహస్యాలు దాగిఉంటాయి. పైకి అందమైన, అద్భుతమైన భావనలు కన్పించే వర్ణనలను తరచి చూస్తే వాటిలో వేదాంత సౌరభం చల్లగా సాగిపోతూ ఉంటుంది.

విశిష్టాద్వైతంలో శ్రీమన్నారాయణుడే పరతత్త్వం. ఆ నారాయణుని వివిధ అవతారములన్నీ పరతత్త్వ నిరూపక ధర్మములే. ఈ తత్త్వంలో పరమాత్మ అయిన శ్రీమన్నారాయణునితో జీవునికి నవవిధ సంబంధాలు భావింపబడతాయి.

'పితా చ రక్షకః శేషీ భర్తా జ్ఞేయా రమాపతిః స్వామ్యాధారో మమాత్మ చ భోక్తా చాద్య మనూదితః' - తండ్రి, రక్షకుడు, శేషి, భర్త, జ్ఞేయుడు, స్వామి, ఆధారము, ఆత్మ, భోక్త - అనే తొమ్మిది విధములైన సంబంధాలతో ఈశ్వరుడైన రమాపతి జీవుని తరింప జేస్తాడు.

ఈ నవవిధ సంబంధాలను పరమాత్మయందు భావించిన జీవుడు స్థితప్రజ్ఞతను పొందుతాడని విశిష్టాద్వైతం నిష్కర్షించింది. ఇదే రామానుజ

మతం. తనను తాను రామానుజ మతానుయాయిగా చెప్పుకొన్న అన్నమయ్య కీర్తనలలో జీవేశ్వరుల నవవిధ సంబంధాలు అన్వయించిన తీరును అనుశీలనం చేయడం ఈ వ్యాసము యొక్క ఉద్దేశ్యము. నవవిధ సంబంధాలలో మొదటిది పిత్రా - పుత్ర సంబంధము

లోకంలో పుట్టుక ఎవరివల్ల లభిస్తుందో వానిని తండ్రి అని గుర్తించి, వాని బిడ్డనుగా తనను భావించుకోవడం పితృపుత్రభావము.

'మాతా పితా భ్రాతా నివాసశ్శరణం
సుహృత్, గతిర్నారాయణః'[1]

అంటూ 'నారాయణుడే తల్లి తండ్రి, సోదరుడు, గృహము, రక్షణము, హితైక ప్రవర్తకుడు, ప్రాప్యం' అని సుబాలోపనిషత్తు పరమాత్మ అయిన నారాయణునితో జీవునికి గల సంబంధమును గూర్చి తెలిపింది. అట్లే భగవద్గీతలో -

'పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః '[2] అనీ
అహం బీజప్రదఃపితా'[3]

అనీ భగవానుడు స్వయంగా తనతో జీవునికి గల సంబంధాన్ని తెలిపినాడు.

'యతో వా ఇమాని భూతాని జాయంతే'[4] అని తైత్తిరీయోపనిషత్తు,

'భూతానాం యో2వ్యయః పితా'[5] అని విష్ణుసహస్రనామ స్తోత్రములు జీవేశ్వరుల పుత్ర - పితా సంబంధాన్ని పేర్కొన్నాయి.

అన్నమయ్య అనేక కీర్తనలలో ఆ శ్రీనివాసుని పితృభావంతో సేవించినాడు. అందు ఒక భావము.

'చేరి యశోదకు శిశువితఁడు
ధారుణి బ్రహ్మకు తండ్రియు నితఁడు' (4-485)

అని యశోదకు శిశువైన పరమాత్మ ధారుణికి, బ్రహ్మకు కూడా 'తండ్రి' అని జీవులకు పరమాత్మతో గల సంబంధాన్ని గూర్చి పాడినాడు.

అన్నమయ్య ప్రయోగాలలో మనకు అడుగడుగునా ఉపనిషత్ ప్రతిపాదిత పరమాత్మ తత్త్వం ప్రతిఫలిస్తూ ఉంటుందనడానికి ఈ పల్లవిని ఒక ఉదాహరణగా చెప్పు కోవచ్చు.

'చేరి యశోదకు శిశువితడు' అనే ఈ మొదటిపాదాన్ని పర్యాలోచనం చేస్తే, పితా పుత్ర సంబంధమే కాకుండా, మంత్రస్మరణచేత భగవంతుడు శిశువులా అధీనమౌతాడని కూడా తెలుస్తుంది.

'మంత్రో మాతా గురుః పితా'

"తల్లి మంత్రము వంటిది, తండ్రి గురువు వంటివాడు" అన్న మాటను ఇందులో భావించవచ్చు. కృష్ణునికి మంత్రముల వంటి తల్లులు ఇద్దరు. విశిష్టాద్వైత సంప్రదాయంలో ప్రధానమైన మంత్రాలు రెండు. అవి అష్టాక్షరి, వాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రాలు. ఇక్కడ 'యశోద' అనగా 'యశః'= కీర్తిని, 'ద'= ఇచ్చేది అని అర్థం. సంప్రదాయ పరంగా సంపదలు, వంశము, కీర్తి మొదలగువాటిని ఇచ్చేది మంత్రమే. కనుక 'యశోద' అనగా 'మంత్రము' అనే సంప్రదాయార్థంగా పెద్దలు చెపుతారు.

'మంత్రాధీనంతు దైవతం' కనుక చిన్నికృష్ణుడు యశోదకు అధీనుడు. అంటే మంత్రాధీనుడు. ఇట్టి యశోద వాసుదేవ ద్వాదశాక్షరిగా భావింపబడుతున్నది. ఈ మంత్రాన్ని నిరంతరం మననం చేసినవారికి పరమాత్మ శిశువులాగా చేరి, అధీనమౌతాడని అన్నమయ్య భావన. యశోదకు శిశువులా అధీనమయ్యాడు కదా!

రెండవపాదంలో 'ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు' అంటూ పిపీలికాది బ్రహ్మ పర్యంతం అన్నీ జీవతత్త్వాలే అన్న భావనను స్ఫురింప జేసినాడు. ఇంకా 'ధారుణి'అని ప్రయోగించడం ద్వారా చరాచర ప్రపంచాని కంతటికీ కూడా పరమాత్మతో గల పితృభావ సంబంధాన్ని తెలియపరిచినాడు అనవచ్చు.

ఇట్లు జీవుడు భగవంతుని తండ్రిగా భావించి సేవిస్తూ రక్షకుడిగా నిర్ణయించుకోవాలి.

## రక్ష్య - రక్షక సంబంధము

లోకంలో శరీరానికి ఆపద కలిగినపుడు కాపాడినవానిని 'రక్షకుడు' అంటారు. 'శరీర రక్షణయే గాక, ఈ జీవుడు సంసార సాగరంలో మునిగి నపుడు రక్షించేవాడు పరమాత్మయే' అనే జ్ఞానమే రక్ష్య - రక్షక భావ సంబంధమున కర్థము.

'మృత్యు సంసార సాగరాత్ - ఉద్ధరామి'[6]

'జన్మ మృత్యువులనెడి సంసార సాగరము నుండి నేనే ఉద్ధరింతును' అని కృష్ణ పరమాత్మ చెప్పినాడు.

'రక్షతే భగవాన్ విష్ణుః భక్తానాత్మ శరీరవత్' - భగవంతుడైన విష్ణువు భక్తులను తన శరీరమును వలెనే రక్షించుట.

విశిష్టాద్వైతంలో శరణాగతిని మించిన పరమోపాయం లేదు. భగవంతుని శరణు కోరితే తప్పక రక్షించగలడని ప్రబల విశ్వాసం. ఈ శరణాగతికే 'ప్రపత్తి' అని పేరు. విశిష్టాద్వైత మతావలంబియైన అన్నమయ్య ఎన్ని కీర్తనలలో స్వామిని శరణాగతి చేసి, స్వామితో రక్షకత్వ సంబంధాన్ని నెరపినాడో చూపడం కష్టం. ఎందుకంటే దాదాపుగా అన్ని కీర్తనలలో ఇదే భావన కన్పిస్తుంది.

'ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు' అనే కీర్తనలో

'గతియై మమ్ము గాచే కమలాక్షుడు' (3-577)

అంటూ కమలాక్షుడైన శ్రీకృష్ణుడు జీవులకు దిక్కై రక్షించేవాడని వర్ణించినాడు.

శ్రీకృష్ణుడు దివ్యమంగళవిగ్రహుడు. ఆ శరీరానికి వన్నెతెచ్చేవి కమలముల వంటి ఆయన నేత్రములు. ఆ నేత్రాలలో దాగియున్న దయా పరత్వాన్ని కమలాలలోని ఆ ఎరుపుదనం ప్రకాశింపజేస్తుంది. ఎరుపు దయా పరత్వానికి చిహ్నము. సంప్రదాయంలో దీనిని 'పుండరీకాక్షత్వము' అంటారు. అందుకే అన్నమయ్య రక్షించేవానిని కమలాక్షుడిగా వర్ణించాడు.

'గతియై' అంటూ ఆయన తప్ప వేరెవ్వరు రక్షించే వారు లేరు అనే అర్థాన్ని స్ఫురింపజేస్తున్నాడు మరోచోట-

'తనలో నుండిన హరి తా గొలువ డీ దేహి
యెనలేక శరణంటె అతడే రక్షించును' (2-213)

అని అంతరాత్మగా ఉన్న, (ఆగామి, సంచిత పాపహరమైన వానిని) ఆ హరిని భావించి శరణంటే చాలునని, ఆతడే రక్షించునని, పరమ విశ్వాసాన్ని ప్రకటించాడు. ఇంకోచోట,

'ఆహా! నమో నమో ఆదిపురుష నీకు
ఈహల నేనెంత వాడ ఎట్లుగాచితివి' (4-97)

అని కార్పణ్యంతో నైచ్యానుసంధానం చేసుకొన్నాడు. జీవుడు తనను తాను నీచమైన వానినిగా భావించు కొనడం వైష్ణవసంప్రదాయంలో ఒక విశేషం. పరమాత్మే అందరికంటే అధికుడు. అది తెలుసుకొని శరణంటే తప్పక రక్షిస్తాడు అని విశ్వసించడమే పరమాత్మతో జీవునికి గల రక్ష్య - రక్షక భావ సంబంధము.

ఇట్లా పరమాత్మతో రక్షకత్వ సంబంధాన్ని భావించి "చేతనులగు జీవులు అచేతనమగు ఈ శరీరములో నుండి చేయు సర్వ వ్యాపారములు ఆ పరమాత్మ యొక్క అతిశయమునకే గాని జీవునికి చెందవు. అందుచేత మనము చేసే కాయిక, వాచిక, మానసిక వ్యాపారము లన్నీ పరమాత్మకే చెందును" అన్న జ్ఞానాన్ని పొందుట శేష - శేషిభావము.

## శేష - శేషి భావము

'శేషి' అంటే స్వేతర పదార్థాలను తన ఇష్టానుసారంగా ఉపయోగించు కొనగలవాడు. అంటే తన సొత్తైన వస్తువును తయారుచేసుకొని, దానికి మంచి ఉనికిని కలిగించి, చెడి పోకుండా కాపాడుకొంటూ ఉపయోగించు కోవడం అన్నమాట.

'పరమాత్మ సర్వభూతములను సృజించి, వాటికి ఉనికిని కలిగించి, ధారక, పోషక, భోగ్య పదార్థాలన్ని కాపాడుతూ, వాటితో తాను సేవలందు కొంటూ ఆనందించుచున్నాడు' అని ఉపనిషదాదులు పేర్కొన్నాయి. కనుకనే పరమాత్మ 'శేషి' అనబడుచున్నాడు.

లోకంలో సామాన్యంగా ఏది ఎవనికి ఉపయోగించునో దాన్ని 'శేషము' అని, ఉపయోగించు వానిని 'శేషి' అనే వ్యవహారం కలదు. స్వప్రయోజనానికి గాక యజమాని సంతోషాతిశయానికి ప్రయత్నించు భృత్యుడే శేషభూతుడు. ఉపయోగాన్ని పొందు స్వామి శేషి. ఆ స్వామి కూడా తనకు శేషభూతుడైన భృత్యుని బాగోగులు గుర్తిస్తూ, అతని సంతోషాతిశయ రూప ప్రయోజనం పొందుట శేషి యొక్క స్వరూపం.

'. . .ప్రకృత్యాది సర్వభూతాంతర్యామి సర్వశేషీ చ నారాయణః '[7] అని పరమాత్మ నారాయణుని సర్వశేషిగా సుబాలోపనిషత్తు తెలిపింది. అన్నమయ్య భావించిన శేష - శేషి భావ సంబంధాన్ని ఈ కీర్తన వర్ణించింది.

'అంతయు నీవే హరి పుండరీకాక్ష
చెంత నాకు నీవే శ్రీ రఘురామా' (1-385)

అని 'అంతయు' అంటూ తనకు సంబంధించిన అన్ని విషయములు ఆ పుండరీకాక్షునికే సంబంధించినవని చెప్పుచూ, 'చెంత నాకు నీవే' అని ఆ శ్రీరామునే శేషిగా భావించాడు.

'రామో విగ్రహవాన్ ధర్మః' - ధర్మస్వరూపుడు, తారకబ్రహ్మము రాముడు. అనంత కల్యాణ గుణముల సంపూర్ణ నిధి. ధర్మాన్ని నడిపి, ఆ మార్గంలో నడచినవాడు రాముడు. రాముని నామాన్ని జపించడం, రూపాన్ని ధ్యానించడం, చరిత్రను ఆచరించడం తరణోపాయం జీవులకు. అందుకే అన్నమయ్య 'శ్రీరఘురామా' అంటూన్నాడు. తర్వాతి చరణాలలో

'కులమును నీవే గోవిందుడా, నా
కలిమియు నీవే కరుణానిధీ

తలపును నీవే ధరణీధరా, నా
నెలవును నీవే నీరజనాభా' ||అంతయు||

'తనువును నీవే దామోదరా నా
మనికియు నీవే మధుసూదనా
వినికియు నీవే విట్ఠలుడా నా
వెనక ముందు నీవే విష్ణుదేవుడా' ||అంతయు||

'పుట్టుగు నీవే పురుషోత్తమా, కొన
నట్ట నడుమ నీవే నారాయణా
యిట్టె శ్రీ వేంకటేశ్వరుడా నాకు
నెట్టన గతి యింక నీవే నీవె' ||అంతయు|| (1-385)

అని తన కులము, కలిమి, తలపు, నెలవు, తనువు మనికి, వినికి, వెనుక - ముందు, పుట్టుగు, కొన, నట్టనడుమ అంతా నారాయణ స్వరూపుడైన ఆ శ్రీవేంకటేశ్వరుడే అంటూ తనకు (జీవునకీ) ఆయనతో గల శేష - శేషి భావ సంబంధమును వర్ణించాడు. ఇంకా

'పదివేల శేషుల పడగలమయము' (1- 23)

అని అనంతమైన జీవులు శేషులై సేవిస్తున్న తిరుమలను శ్రీహరి వాసమని, ఆ తిరుమలేశుడే సర్వశేషి అని భావించాడు.

ఇట్లు సర్వశేషి అయిన పరమాత్మను భర్తృభావ సంబంధముతో జీవుడు సేవించాలి. భరించువాడు భర్త. భరింపబడునది భార్య. లోకంలో ఈ పేర్లు స్త్రీ పురుషులకు ఏర్పడినవి. కాని, వాస్తవానికి చేతనా చేతనాత్మకమగు సర్వజగత్తు పరమాత్మచే భరింపబడుతున్నది. ఈ శరీరం నిలవడానికి, నడవడానికి ఆతడు భరించుటయే కారణం.

అందుచే పరమాత్మ ఒక్కడే భర్త. ఆ విషయాన్ని తెలుసుకొని ప్రవర్తించడమే భర్తృ - భార్య భావ సంబంధము. అందుకే

'పతిం విశ్వస్య . . . . 'అని పురుషసూక్తం చెప్పింది.

'గతిర్భర్తా ప్రభుః సాక్షి నివాసః . . . .' [8]

అని పరమాత్మ తాను జీవులకు గమ్యమునని, భర్తనని, ప్రభువునని, సాక్షినని, నివాసము నని, ఆశ్రయమునని, సన్నిహితుడనని స్వయంగా చెప్పుకున్నాడు.

విష్ణుసహస్రనామ స్తోత్రంలో
'తస్యలోక ప్రధానస్య జగన్నాథస్య భూపతే ' [9]

అని సర్వలోక నియామకుడిగా పేర్కొనబడ్డ పరమాత్మ జగన్నాథుడిగా భూపతిగా చెప్పబడ్డాడు. ఇదే భావనను అన్నమయ్య

'ఇతడొకడే సర్వేశ్వరుడు
సిత కమలాక్షుడు శ్రీ వేంకటేశుడు ॥పల్లవి॥

పరమయోగులకు భావ నిధానము
అరయ నింద్రాదుల కైశ్వర్యము
గరిమ గొల్లెతల కౌగిట సౌఖ్యము
సిరులొసగేటి యీ శ్రీవేంకటేశుడు ॥ఇత॥

కలిగి యశోదకు కన్న మాణికము
తలచిన కరికిని యాపద్బంధుడు
చెలరేగిన యీ శ్రీవేంకటేశుడు' ॥ఇత॥ (4-298)

అంటూ పరమాత్మకు జీవునితో గల భర్తృ - భావ సంబంధాన్ని 'పరమయోగులకు భావ నిధానము' అని పరమాత్మయే గమ్యము అనే సంబంధాన్ని 'ఇంద్రాదుల కైశ్వర్యము' అని ఆయన పోషకత్వ మును, 'గొల్లెతల కౌగిట సౌఖ్యము' అని భర్తృసంబంధాన్ని , 'కరికిని తగు దిక్కు' అని ఆయన ఆశ్రయత్వాన్ని, 'ద్రౌపదికి ఆపద్బంధుడు' అని సన్నిహిత బంధుత్వ సంబంధాన్ని భావించాడు.

ఇట్టి పరమాత్మ తత్త్వాన్ని తెలుసుకోవడమే జ్ఞాతృ - జ్ఞేయ సంబంధ భావము.

## జ్ఞాతృ - జ్ఞేయ భావము

లోకంలో మనం ఎన్నో విషయాలు తెలుసుకుంటున్నాము. ఆ విషయాలన్నీ భిన్నభిన్నములనీ భావిస్తూ ఉన్నాము. కాని, అన్ని పదార్థాలలోనూ, బయట కనిపించే ప్రకృతిలోనూ, జీవునిలోనూ అంతర్యామిగా ఉన్నది పరమాత్మయే అని తెలిసికొనవలెను. 'సర్వ జ్ఞానములచేత తెలుసుకొనబడువాడు పరమాత్మయే' అని, జీవుల జ్ఞాన గమ్యం కూడా ఆయనయే అని భావించడమే జ్ఞాతృ - జ్ఞేయ సంబంధ భావము.

'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ'[10]

అంటూ పరమాత్మ జ్ఞానస్వరూపుడని ఉపనిషత్ తెలిపింది. ఇదే భావమును

'జ్యోతిషామపి తజ్జ్యోతిస్తమసః పరముచ్యతే
జ్ఞానం జ్ఞేయ గమ్యం హృది సర్వస్య నిష్ఠితమ్'[11]

అని జ్ఞానము, జ్ఞానవిషయము, జ్ఞానగమ్యము ఆతడే, అందరి హృదయములలో ప్రతిష్ఠితుడై ఉన్నాడని భగవద్గీతపేర్కొన్నది.

విష్ణుసహస్రనామస్తోత్రంలో 'జ్ఞానగమ్యః పురాతనః'[12] అని జ్ఞానగమ్యంగా భగవంతుడు చెప్పబడ్డాడు.

'జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ
జ్ఞానగమ్యమే సాధించు మనసు' (1-396)

అని అంటూ జ్ఞానస్వరూపుడైన జీవునిచే తెలుసుకొనబడు జ్ఞేయము పరమాత్మగను, జ్ఞానగమ్యము కూడ పరమాత్మయే గనుక, అట్టి పరమాత్మ హృదయస్థితుడు గనక దానిని సాధించునది మనసని చెప్పుచూ జీవునికి - పరమాత్మకు గల జ్ఞాతృ-జ్ఞేయ సంబంధాన్ని తెలిపాడు అన్నమయ్య.

ఇంకా

'సతతము జీవులకు చైతన్య సూత్రము
అతిశయ భక్తుల జ్ఞానామృతము' (2-244)

అని అంటూ 'సూత్రే మణి గణా ఇవ' అని భావింపబడిన పరమాత్మను జ్ఞానగమ్యమని అన్నాడు.

ఇటువంటి జ్ఞానగమ్యమైన పరమేశ్వరునికి జీవులందరూ సొంతమైన ఆస్తి వంటివారు. పరమాత్మ జీవులకు స్వామి.

## స్వామి

లోకంలో 'ఇది నా సొత్తు 'అంటూ ఉంటాం. దానిపై మనకు అధికారవముంటుంది. అట్లే పరమాత్మకు సర్వజీవులను నియమించు అధికారమున్నది. అందుచేత అతడు స్వామి. 'నేను వాని వస్తువును' అని భావించడం స్వస్వామిభావము. దాదాపుగా శేషి, స్వామి సమానార్థకాలే అయినా కొద్దిపాటి తేడా గలదు. 'స్వామి' అనగా స్వ - వ్యతిరిక్త సర్వపదార్థములపై 'ఇవి నావి' అన్న అభిమానము కలవాడు అని అర్థం. 'శేషి' అంటే వాటితో ఉపయోగము కూడా పొందువాడు. ఉపయోగపడిన వస్తువు శేషము. ఉపయోగపడకున్నా, యజమానియొక్క మమకార పరిధిలో ఉన్నది అతనికి సొత్తు అనబడుతుంది.

'ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ . . . . .' [13]

సర్వస్య ప్రభుమీశానగ్ ం' [14]

అని ఉపనిషత్తులు,

'అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే'[15]

అని భగవద్గీత జీవునిపై పరమాత్మకు గల స్వామిత్వాన్ని నిష్కర్షించినాయి.

అన్నమయ్య కీర్తన లన్నింటిలో ఆ శ్రీవేంకటేశుడే స్వామి.

'కంటి అఖిలాండ కర్త నధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి'

అని అఖిలాండకర్త - అంటే స్వామిగా ఆ వేంకటేశుని దర్శించి, ఇంకొక కీర్తనలో

'కలిగె నిదె మాకు కైవల్యము
తొలుత నెవ్వరికి దొరకనిది'

అంటూ

'నమో నారాయణ నమో లక్ష్మీపతి
నమో పుండరీకనయనా
అమిత శ్రీ వేంకటాధిప యిదె నా
క్రమమెల్లను నీ కయింకర్యమే ' ||కలిగె|| (2-466)

అంటూ ఆ పరమాత్మ కైంకర్యమనే కైవల్యం తనకు లభించిందని, ఆ కైంకర్యాన్ని 'నమో నారాయణ' అని అష్టాక్షరీ మంత్రధ్యాన రూపంలో, 'నమో లక్ష్మీపతి' అంటూ ద్వయ మంత్రానుసంధాన రూపంలో, 'నమో పుండరీకనయనా' అంటూ (పుండరీకాక్షత్వం పరమాత్మకు జీవులను తరింపజేసే దయాపరత్వానికి గుర్తు) చరమశ్లోక ఆచరణ రూపంగా చేస్తాననీ, 'యిదే నా క్రమమెల్లను' అని అంటూ తన జీవితమంతా ఆయన కైంకర్యం కొరకే అని తెలియజేస్తూ జీవునికి పరమాత్మకు గల స్వ - స్వామి సంబంధాన్ని భావించినాడు అన్నమయ్య.

ఇట్టి స్వామియైన ఆ సర్వేశ్వరుడు 'సర్వజగత్తునకు ఆధారము' అని తెలుసు కోవడమే ఆధారాధేయ భావ సంబంధము.

## ఆధార - ఆధేయ భావము

'ఆధారనిలయో ధాతా పుష్పహాస ప్రజాగరః' [16]

అని విష్ణుసహస్రనామస్తోత్రం,

'మత్థ్సాని సర్వభూతాని' [17]

అని భగవద్గీత పరమాత్మయందే సర్వభూతములు ఆధారపడి ఉన్నాయని తెలిపినవి.

అన్నమయ్య -

'అందరి కాధారమైన ఆదిపురుషు డీతడు
విందై మున్నారగించె విదురుని కడ నీతడు' (1-351)

అని,

'ఆతడే విష్ణుం డఖిలము నడపెడి
యీతల నెవ్వరి కేటికి జింతా' (2 - 319)

అనీ పరమాత్మ ఆధారత్వమును,

'దిక్కు దెసలై నాకు దేవుడవై యేలికవు
చొక్కినా మనసింత సోదించవలెనా ' (2-59)

అని జీవునికి దిక్కు, ఆధారము పరమాత్మయే అంటూ జీవాత్మ ఆధేయ భావ సంబంధాన్ని తెలిపాడు.

ఈ పరమాత్మనే జీవుల కంతరాత్మగా తెలుసుకొనుట శరీరాత్మ భావ సంబంధము.

## శరీరాత్మభావము

'అప్నోతి ఇతి ఆత్మా' అనే వ్యుత్పత్తినిబట్టి తన శరీరమునందు ప్రవేశించియుండి, దానికి ప్రవృత్తిని కలిగించు జ్ఞానస్వరూపుడు 'ఆత్మ' అని తెలుస్తున్నది. అనగా తన ఇష్టానుసారంగా శరీరాన్ని ప్రవర్తింపజేస్తూ, దానికి శాసకుడైన జీవుడు 'ఆత్మ' అనే అర్థం సిద్ధిస్తున్నది. తాను ఆత్మ. దేహము అతని సొత్తు. కర్మఫలాను భవార్థమై జీవుడు ఒక శరీరంలో ప్రవేశించి, దానిని స్వార్థమై ప్రవర్తింపజేసి, ఉపయోగించుకుంటూ, ఆమరణాంతం అందులో నివసించి, తర్వాత దానిని వదిలిపోతున్నాడు. అంతవరకు అది అతనికి శరీరము. అతడు దానికి ఆత్మ. విడిపోయిన తర్వాత ఈ శరీరాత్మ భావ సంబంధం తొలగిపోతుంది.

పృథివ్యాది పంచభూతాది పదార్థాలు, జీవాత్మలు పరమాత్మచే అంతర్వ్యాప్తములై ఆయనచే నియమింపబడుతూ ఆయనకు శరీరము లవుతున్నాయి. ఆయన వాటికి అంతరాత్మ అవుతున్నాడు.

'ఏష తే అంతర్యామీ ' [18]

అంటూ బృహదారణ్యకం తెలుపుతున్నది. జీవాత్మ పరమాత్మ రెండూ జ్ఞాన స్వరూపములే. జీవుడు ఒక్క శరీరానికే ఆత్మ. ఈశ్వరుడు చేతనాచేతన పదార్థాలతో పాటు జీవులకు కూడా అంతర్యామి. అందుకే జీవుడు కేవలము 'ఆత్మ', ఈశ్వరుడు 'ఆత్మ', 'పరమాత్మ'గా కూడా పిలువబడుతున్నాడు. ఈ శరీరము మనకెట్లు అధీనమై ఉంటుందో, ఎట్లు మనపై ఆధారపడి ఉంటుందో, అట్లే జీవులు పరమాత్మకు విధేయులై ఉంటారు. 'పరమాత్మకు నేను శరీరమును, నాకు పరమాత్మ ఆత్మ' అను భావనయే శరీరాత్మభావ సంబంధము.

'అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయస్థితః' [19]

అని భగవంతుడు స్వయంగా తెలిపినాడు.

ఇదేవిషయాన్ని,

'ఏకస్తదా సర్వభూతాంతరాత్మా . . . .' [20]

అని కఠోపనిషత్తు,

'హృదిహ్యేష ఆత్మా' [21]

అని ప్రశ్నోపనిషత్తులు పేర్కొన్నాయి.

జీవబ్రహ్మలకు తాదాత్మ్యసంబంధ రూపమగు శరీరాత్మభావమే రామానుజ సిద్ధాంతంలో అత్యంత ప్రధానమైన అంశము. ఈ అంశమును అన్నమయ్య చాలా కీర్తనలలో భావించినాడు. అందు,

'కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ' (2-385)

అనీ,

'చెంతన మాలోనున్న చిన్నికృష్ణుడు' (3-577)

అని పరమాత్మను జీవుల కంతరాత్మగా తెలుపుతూ,

'సర్వాత్మకుడవు సర్వేశ్వరుడ నా
పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి' (3-571)

అంటూ ఆ సర్వేశ్వరునికి తన సర్వస్వాన్ని సమర్పించి, శరీరాత్మభావ సంబంధాన్ని తెలిపాడు.

అట్లు సర్వాంతర్యామియైన ఆ పరమాత్మయే అన్ని పదార్థములకు భోక్త. 'మనము చేయు సర్వవ్యాపారములయొక్క ఫలమునకు భోక్త పరమాత్మ, ఆ పరమాత్మకు మనము భోగ్య పదార్థములము' అని తెలుసుకోవడమే భోక్తృ - భోగ్య భావ సంబంధము.

## భోక్తృ - భోగ్య భావ సంబంధము

'భోక్తారం యజ్ఞతపసాం - సర్వలోక మహేశ్వరం' [22]

అని యజ్ఞ తపస్సులయొక్క భోక్త అని భగవద్గీత,

'భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా . . . .' [23]

అని విష్ణుసహస్రనామ స్తోత్రము పరమాత్మయొక్క భోక్తృత్వాన్ని తెలిపినాయి.

ఈ భావనను అన్నమయ్య

'భోగము నేను నీకు, భోగివి నీవు' (2-274)

అని చెప్పి,

'ఆహా నమో నమో ఆదిపురుష నీకు
ఈహల నేనెంత వాడ నెట్లు గాచితివి'

అనే కీర్తనలో,

'అన్నిటా బ్రహ్మాదుల యజ్ఞభోక్తవైన నీవు
అన్నపానములివి యెట్లారగించితివి ' (4-97)

అంటూ పరమాత్మతో జీవునికి గల భోక్తృ - భోగ్య భావ సంబంధమును వర్ణించినాడు.

ఈవిధంగా నవవిధ సంబంధములతో పరమాత్మను భావించుట 'ప్రజ్ఞ' అనబడుతుంది. ఈ 'ప్రజ్ఞ' యందు స్థిరంగా ఉండుటయే స్థితప్రజ్ఞావస్థ. దీనివల్ల మనస్సుకు ద్వంద్వాతీత స్థితి కలుగుతుంది. ఈ స్థితప్రజ్ఞావస్థ పొందినవాడు తాళ్లపాక అన్నమాచార్యుడు అని, ఆయన కీర్తనల పర్యాలోచనం ద్వారా మనకు తెలుస్తున్నది.

## అథస్సూచికలు

1. సుబాలోపనిషత్ - ఖండః - 6, మం.శ్లో . 2
2. భగవద్గీత - అధ్యా. 9- శ్లో.16
3. భగవద్గీత - అధ్యా. 14 - శ్లో.14
4. మం-1, అను-1, అధ్యా-3
5. విష్ణుసహస్రనామస్తోత్రము - శ్లో. 16, పూర్వపీఠిక
6. భగవద్గీత - అధ్యా. 9- శ్లో.18
7. సుబాలోపనిషత్
8. భగవద్గీత - అధ్యా. 9 - శ్లో.16
9. విష్ణుసహస్రనామస్తోత్రము - శ్లో. 12
10. అధ్యా - 2, అను -1, తైత్తిరీయోపనిషత్
11. భగవద్గీత - అధ్యా. 18 - శ్లో.18
12. విష్ణుసహస్రనామస్తోత్రము - శ్లో. 53
13. మం.శ్లో -5, ఈశావాస్యోపనిషత్
14. శ్లో. 17, అధ్యా -3, శ్వేతాశ్వతరోపనిషత్

15. భగవద్గీత - అధ్యా. 10 - శ్లో.8
16. విష్ణుసహస్రనామస్తోత్రము - శ్లో. 102
17. భగవద్గీత - అధ్యా. 9- శ్లో.4
18. బృహదారణ్యకోపనిషత్
19. భగవద్గీత - అధ్యా. 10- శ్లో.20
20. మం. శ్లో. -9, వల్లి - 5, అధ్యా - 7, కఠోపనిషత్
21. శ్లో- 6, ప్రశ్న-3, ప్రశ్నోపనిషత్
22. భగవద్గీత - అధ్యా. 5 - శ్లో. 29
23. విష్ణుసహస్రనామస్తోత్రము - శ్లో. 16,

★ ★ ★

**ఎలవర్తి చంద్రమౌళి**

# అన్నమయ్య - నైచ్యాను సంధానం

అన్ని సమస్యలకీ మూలం అహంకారం. మమకారం. తనకు సంబంధించినవి, తాను చేసినవి, తాను చెప్పేవి అన్నీ గొప్పవి. తాను గుణవంతుడు. తాను ధనవంతుడు. తానే రూపవంతుడు. తనవారు ఉన్నతులు. తనవారు ఉత్తములు అన్నవి అహంకారంవల్ల, మమకారంవల్ల వచ్చేవి. తాను, తనవారు తప్ప మిగిలినవారంతా తక్కువవారు, నీచులు, నికృష్టులు అనుకోవడం వల్లనే మనస్తాపాలు, సమస్యలు ఉత్పన్నమౌతాయి.

ఈ రకమైన సమస్యలు నివారింపబడాలంటే మొట్టమొదట తను ఏమిటి? అన్నది తెలుసుకోవాలి. తన స్థానం ఏమిటి? తన నిజస్వరూపం ఏమిటి? తెలుసుకోవాలి. ఇవన్నీ ఎప్పుడు తేటతెల్లమౌతాయో అప్పుడు ఇతరులలో తప్పులు చూడడం తప్పు అన్న తన తప్పు తెలిసి వస్తుంది. అప్పుడు తన మనసులో తనపట్ల ఒక రకమైన జుగుప్స కలుగుతుంది. ఇది ఎప్పుడు కలుగుతుందో అప్పుడు ఎదుటివారిని నీచంగా చూడడం కాని, కించపరచడం కాని జరుగదు. ఎదుటివారిని ఉన్నతులుగా, గొప్పవారుగా చెప్పడంద్వారా తనను తక్కువగాను, నీచుడుగాను, నికృష్టుడుగాను భావించడం వీలౌతుంది. దీనినే శ్రీవైష్ణవ సంప్రదాయంలో నైచ్యానుసంధానం అంటారు.

శ్రీవైష్ణవసంప్రదాయమే అణువణువు అయిన అన్నమాచార్యులు ఆ సంప్రదాయంలోని ముఖ్యమైన విషయాలన్నిటినీ తన సంకీర్తనల్లో పొందుపరిచాడు. అటువంటి విషయాలలో ముఖ్యంగా కనిపించే ఒక అంశం నైచ్యానుసంధానం.

అన్నమయ్య సంకీర్తనల్లో నైచ్యానుసంధానం అనేక విధాలుగా కనిపిస్తుంది. దానిని స్వరూప సంబంధి, గుణసంబంధి, క్రియాసంబంధి, బుద్ధిసంబంధి, ఇంద్రియ సంబంధిగా వింగడించి పరిశీలించ వచ్చు.

## స్వరూపసంబంధి

స్వరూప సంబంధమైన నైచ్యానుసంధానం మొట్టమొదట పేర్కొన దగింది. ఇందులో అన్నమయ్య తన స్వరూపాన్ని రాయితోను, కీటకంతోను, పసరంతోను, పశువుతోను, పాముతోను, గుర్రంతోను, గాముతోను, శునకంతోను పోల్చుకోవడం కనిపిస్తుంది. జీవుడు జ్ఞానస్వరూపుడు. అలాంటి జీవుని అచేతన మైన రాయితో పోల్చడం గుర్తింపదగింది. తాను మహాభక్తుడైనా చైతన్యరహితమైన, చలనరహితమైన వస్తువు నంటున్నాడు. శిలలాగా ఉన్న తనమీద కూడా భగవంతుని దయ ప్రసరిస్తుందని అన్నమయ్య భావన. అందుకే

'వసుధలో రాయి వంటి వాఁడను దయదలఁచ
యెసఁగ నన్నేరీతి నీవేలితివి దైవమా!' (423) అన్నాడు.

రాయి మాత్రమే కాకుండా చలనం కలిగి జ్ఞానం లేని కీటకం వంటి ప్రాణులతో తనను పోల్చుకున్నాడు అన్నమయ్య. పైన పేర్కొన్న జంతువులు, కీటకం అన్నీ ఇతరులను బాధపెట్టేవే. కానీ అన్నమయ్య ఇతరులను ఎన్నడూ బాధపెట్టలేదు.

'పెక్కు బ్రహ్మాండములు నీ పెను రోమకూపములఁ
గిక్కిరిసున్నవందొక కీటమ నేను' (3-42)
'పసరమువంటివాఁడఁ బాలించవె' (4-227)
'నీవేడ నేనేడ నేనొక జంతువను' (2-106)
'పామువంటివాఁడ నేపట్టిన వారిఁ గరతు' (423)
'గాముపంటివాఁడ లోకమువారిఁ బీడింతు' (4-23)
'కటకటా శునక గతియాయఁ గావవే' (4–227)

అని తన స్వరూపాన్ని నైచ్యాను సంధానం చేశాడు.

## గుణసంబంధి

గుణసంబంధి నైచ్యానుసంధానం ప్రధానమైంది. స్తోత్రం, దూషణం గుణాన్ని ఆధారంగా చేసుకొనే ఉంటాయి. సుగుణం ఎక్కడ ఉంటే అక్కడ స్తోత్రం చోటుచేసుకుంటుంది. దుర్గుణం ఎక్కడ ఉంటే అక్కడ దూషణం ఉంటుంది. సుగుణాన్ని ఎంతైనా స్తోత్రం చేయవచ్చు. దుర్గుణాన్ని ఎంతైనా దూషించనూవచ్చు. వీనికి పరిమితుల్లేవు. నైచ్యానుసంధానం చేస్తున్న అన్నమాచార్యుడు తన గుణాలనుకూడా నీచాతినీచంగా పేర్కొన్నాడు. అదే తెలుపుతోంది ఆయన ఎంత సుగుణసంపన్నుడో!

'యిన్నిటా నాకంటే హీనుఁడిఁక మఱెవ్వఁడూలేడు' (3-45)

'అపవిత్రుఁడ నేనమంగళుఁడ గడు -
నపగత పుణ్యుఁడ నలసుఁడను
కపట కలుష పరికర హృదయుఁడనే
అతి దుష్టుఁడ నే నధికదూషితుఁడ
హత వివేక మతి నదయుఁడను' (1-33)

'కొంచని మూర్ఖుఁడ నాకు గుణమేలేదు' (3-121)

'అమిత దుర్గుణరాసి నన్నిటా నేను' (3-173)

అన్నాడు. పరమభక్తుడైన అన్నమయ్య గుణాలకే మకుటం వంటివాడు. అలాంటివాడు తనను నీచంగా అల్పంగా పేర్కోవడం వల్ల ఆయన మనసు ఎంత పరిపక్వత నొందిందో మనకు స్పష్టమౌతోంది.

## క్రియాసంబంధి

క్రియాసంబంధి నైచ్యానుసంధానం పరిశీలింపదగింది. బ్రహ్మజ్ఞానులలోకూడా క్రియాశీలురు మహాశ్రేష్ఠులు. అన్నమయ్య భగవంతుని సేవకే క్షణం క్షణం అంకితమైన వాడు. వాక్ కైంకర్యంతో జీవిత కాలమంతా

వేలసంఖ్యలో కీర్తనలు చేసినవాడు. ఆ విధంగా క్రియాశీలుడిగా ఉండికూడా తనను పాతకుడుగాను, అలసుడుగాను పేర్కొన్నాడు.

| | |
|---|---|
| 'పరమ పాతకుఁడ భవబంధుఁడ' | (1-33) |
| 'అతి దుష్టుఁడ నేనలసుఁడను' | (1-78) |
| 'ఘనపాపిఁ గనక నీకరుణఁగోరి' | (1-35) |
| 'అపరాధిఁ గనక నన్నరసి కావు' | (1-35) |
| 'అనంతాపరాధములు అటు నేముసేసేవి' | (2-53) |

అంటూ ఎన్నో కీర్తనలలో తనను తాను అపరాధినని, పాపాత్ముడనని అన్నమయ్య చెప్పు కున్నాడు.

## ఇంద్రియసంబంధి

ఇంద్రియ సంబంధి నైచ్యానుసంధానం చాలాముఖ్యమైంది. కఠోపనిషత్తులో ఇంద్రియాలను గుర్రాలతో పోల్చడం ప్రసిద్ధమైన విషయం. ఇంద్రియాలు నిగ్రహింప బడాలి. అన్నమయ్య ఇంద్రియాలను జయించినవాడే. కానీ, తనను తాను ఇంద్రియాలకు బానిసగా పేర్కొని నైచ్యానుసంధానం చేసుకున్నాడు.

| | |
|---|---|
| 'పంచేంద్రియాల ధనవంతుడను నేను' | (3-48) |
| 'మహిలో సంసారపు సామ్రాజ్యమేలేవాఁడను' | (3-48) |
| 'ఎప్పుడు నేము చూసిన ఇంద్రియ కింకరులము' | (3-176) |
| 'తప్పక ధనమునకు దాస్యము నేము సేసేము' | (3-176)) |
| 'పడతులకెప్పుడును పరతంత్రులము నేము' | (3-176) |
| 'నడుమ రుచులకే నాలుక అమ్ముడు వోయ' | (3-176) |
| 'జీవుడ నింద్రియాల బెంచే వాఁడను' | (3-173) |

అంటూ ఇంద్రియాల పరంగా అన్నమయ్య అనేక చోట్ల పేర్కొన్నాడు.

## బుద్ధిసంబంధి

బుద్ధి సంబంధి నైచ్యానుసంధానం పరిశీలింపదగింది. మంచి బుద్ధి ఉంటేనే మంచి రౌతు కాగలడు. మంచి రౌతు అయితేనే ఇంద్రియా లనే గుర్రాలను అదుపు చేయగలడు. అన్నమయ్య సద్బుద్ధిమంతుడు. అందువల్లనే ఆయన జితేంద్రియుడైనాడు. అందువల్లనే సద్భక్తి అలవడింది. అందువల్లనే భగవంతునికి చనవరి అయినాడు. సద్భక్తితో జీవితాంతం భగవన్నామ కీర్తన చేశాడు. తరగని సంకీర్తన రాశిని మనకు అందించాడు. అయినాకాని తనను తాను

'అతి మూఢులలోన అగ్రేసరుఁడ నేను' (3-48)
'సారెకు అజ్ఞాని నేను' (2-53)
'భావించి నేరనైతి పశుబుద్ధి నైతిని' (3-20)
ఇట్టి యవివేక బుద్ధి యే పనికి వచ్చునిఁక
జట్టిగొని నాగుణము చక్కఁ జేయఁగదవే (3-189)
మాకు వంటి వాఁడ నే మతి లేదు (4-23)

అని బుద్ధిపరంగాకూడా అన్నమయ్య నైచ్యానుసంధానం చేయడాన్ని మనం గమనించ వచ్చు.

ఈ విధంగా స్వరూప, గుణ, క్రియా, బుద్ధి, ఇంద్రియసంబంధి విషయాలలో నైచ్యానుసంధానం చేసుకున్న అన్నమయ్య భాగవతులకు తనకు మధ్య తారతమ్యాన్ని, భగవంతునికీ తనకీ మధ్య తారతమ్యాన్ని చెప్పడంలో కూడా నైచ్యాను సంధానాన్ని పాటించాడు.

భగవంతునిముందు తనను అల్పుడుగా భావించడం సరి, భాగవతుల ముందుకూడా ఆ విధంగా భావించడం ఎందుకు? అన్న ప్రశ్న కలుగ వచ్చు. శాండిల్య సంహిత 4. అ. 86 శ్లోకంలో

'అనాదృత సుతం గేహీ పురుషం నా।భినందతి।
తథా।నర్చిత సద్భక్తం భగవాన్ నా।భినందతి॥'

అని స్పష్టంగా తనబిడ్డను ఆదరించని వానిని తండ్రి ఎలా అభినందించడో అదేవిధంగా తన సద్భక్తుని అర్చించని వానిని భగవంతుడుకూడా చల్లగా చూడడు' అని చెప్పబడింది. అందువల్ల అన్నమయ్య భగవద్భక్తులనుకూడా భగవంతునితో సమంగా, కొన్నిసందర్భాల్లో అధికంగాకూడా అర్చించడం కనిపిస్తుంది.

అందుకే,

'దైవమా నీకంటె నీ దాసులే నేర్పరులు' (3-49)

'నీవే నీదాసులని నినుగంటిఁ
నీదాసుల శిరసులే నీ దివ్యశిరసులు
నీ దాసుల పాదములే నీ దివ్యపాదములు
నీ దాసుల కన్నులే నీ దివ్యనేత్రములు
నీ దాసుల రూపమే నీ విశ్వరూపము
నీ కింకరుల గుణాలే నీ దివ్యగుణములు
నీ కింకరులున్నచోటే నిత్యవైకుంఠము
నీ కింకరుల సేవ నీవు మెచ్చు నిజసేవ
నీ కింకరుల కూటమే నీకు సర్వాంగములు' (4-98)

అని అన్నమయ్య హరిదాసులను హరితో సమానంగా చూడడం కనిపిస్తుంది.

భగవద్భక్తుల ముందు తనను అల్పునిగా, అణువంతవానిగా చెప్పడం అనేక సందర్భాల్లో చూడగలం

'అచ్చపు నీ దాసులు అనంతము వారలకు
రిచ్చల నేనొక పాదరేణువ నింతే' (3-42)

'చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మాసేవలు నీకు నేడకు వచ్చు
పొంది వసిష్ఠాదులట్టె పూజలు సేయఁగాను

సందడి మా పూజలు సరికా నీకు
కిట్టి నారదాదులు నీ కింకరులై వుండఁగాను
యిట్టె నీదాసుఁడనను టెంత కెంత' (3-51)

అని భగవద్భక్తులైన బ్రహ్మాదులు, వసిష్ఠాదులు, నారదాదులుముందు తన సేవలు, పూజలు అసలు లెక్కలోనివి కావన్నాడు అన్నమయ్య.

భగవద్భక్తులముందు తన స్థానం ఏపాటిదో పేర్కొన్న అన్నమయ్య భగవంతుని ముందు తానెంతో కూడా పేర్కొన్నాడు.

'నీవెంత నేనెంత నీకునాకు నెంతదవ్వు' (3-51)
'నీవు దేవుఁడవు నేనొక జీవుఁడ' (3-116)
'దేవ! నేనొక్క నీచుఁడ దీనరక్షకుఁడవు నీవు' (3-286)
'పురుషోత్తముఁడ వీవు పురుషాధముఁడ నేను' (2-53)
'అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు' (2-389)

'యిన్నిటా నాకంటే హీనుఁడిఁక మరెవ్వఁడూ లేఁడు
వున్నతి నీకంటే ఘనులొకరూ లేరు' (3-45)

అని భగవంతునిముందు తనను తక్కువగా భావించి, తన అశక్తతను, అకించనత్వాన్ని, నైచ్యాన్ని, నిరుపాయస్థితిని వ్యక్తం చేస్తూ శరణాగతి వైపుగా మనసును మళ్లించడం గమనించవచ్చు. ఇక్కడ నైచ్యాను సంధానం శరణాగతికి దారితీయడం గుర్తించవలసిన విషయం. శ్రీవైష్ణవ సంప్రదాయంలో శరణాగతి చాలా ముఖ్యమైన అంశం. వాల్మీకి రామాయణానికి శ్రీవైష్ణవసంప్రదాయంలో శరణాగతి శాస్త్రమనేపేరు. భగవద్రామానుజులు శరణాగతి గద్యను రచించి అనుష్ఠించి చూపారు. ఆ తరువాతి ఆచార్య పురుషులందరూ అదే మార్గంలో నడచారు. అన్నమయ్యకూడా అందులో ఒక్కడు. అందుకే ఆయన తన సంకీర్తనల్లో-

'ఎందునూ నీవే కాక యేదిగతి యిఁకను' (3-221)
'ఎవ్వరు దిక్కింక నాకు నేది బుద్ధి' (3-80)

'ఏమి చేయఁగలవాఁడ నిదివో నేను
నీ మరఁగు చొచ్చితిఁగా నీ చిత్త మిఁకను' (3-200)

'శరణు వేడెఁద యజ్ఞసంభవ రామ
అరసి రక్షించు మమ్ము నయోధ్యరామా!' (3155)

'నాతప్పు లోఁ గొనవే నన్నుఁ గావవే దేవ
చేఁతలిన్నీఁ జేసి నిన్నుఁ జేరి శరణంటిని' (1-427)

'శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమేశరణు' (1-156)

'తల్లియుఁ దండ్రియు మరి దైవము నాతఁడే కాక
యెల్ల జీవులకు మరి యెవ్వరింక దిక్కు' (4-205)

అంటూ అనేక సందర్భాల్లో అన్నమయ్య తన అశక్తతను, అంకించ నత్వాన్ని చాటుతూ శ్రీమన్నారాయణుని శరణు వేడడం మనకు కనిపిస్తుంది.

భగవంతునిముందు అందరూ అల్పులే. ఇది సత్యం. లేని స్వరూపాన్ని, లేనిగుణాన్ని, లేని క్రియని, లేని ఇంద్రియాలోలత్వాన్ని తనకు ఆరోపించు కోవడం నైచ్యానుసంధానం అవుతుంది. నీవు దేవుడు నేను జీవుడ అన్నచోట యథార్థం చెప్పబడింది. అదే పురుషోత్తముడ వీవు పురుషాధముడనేను అన్నచోట యథార్థానికి భిన్నంగా ఆరోపించుకోవడం కనిపిస్తుంది.

పై విషయాలను పరిశీలిస్తే అన్నమయ్య తొలిరోజుల్లో ఇంద్రియ లోలుడుగా, చపలచిత్తుడుగా ఉండేవాడేమో! అన్న అపోహ కొందరికి కలుగువచ్చు. కానీ, అన్నమయ్య నైచ్యాను సంధానం చేసుకొని, అహం కారాన్ని వదలిపెట్టి, భగవంతుని శరణువేడి, లోకానికి ఆదర్శప్రాయంగా చిరస్థాయిగా నిలిచిపోయాడు అన్నది అక్షర సత్యం.

★ ★ ★

డి.యువశ్రీ

# అన్నమయ్య సంకీర్తనల్లో దశావతారాలు

ఆంధ్ర వాగ్గేయకారుల్లో అగ్రశ్రేణికి చెందినవాడు తాళ్లపాక అన్నమాచార్యుడు. సమగ్ర సంకీర్తనకు శ్రీకారం చుట్టినవాడుగానే గాక సంకీర్తన లక్షణాన్ని నిర్దేశించిన ఆలంకారికుడుగా కూడా అన్నమయ్య వినుతి కెక్కాడు. తన కీర్తితో, స్ఫూర్తితో తరువాతి వారికి కూడ సంకీర్తనా చైతన్యాన్ని కలిగించి రగిలించాడు. వేంకటేశ్వర భక్తుడుగా, వైష్ణవ సంప్రదాయ వ్యాపకుడుగా, విశిష్టాద్వైత విశిష్టాచార్యుడిగా, విద్వద్వరిష్టుడుగా ఈయనకెంతో ప్రత్యేతక వుంది.

అన్నమయ్య సాహిత్యాన్ని సారస్వత క్షీరసాగరమని ప్రాజ్ఞులు ప్రస్తుతించారు. అన్నమయ్య సంకీర్తనల్లో అధిక భాగం లుప్తమైనప్పటికీ శిష్టభాగం కూడా విశిష్టమైందే. విజ్ఞాన సర్వస్వ ప్రాయమైందే. ఆ సంకీర్తనల్లో కనిపించే దశావతార సౌందర్యాన్ని దిఙ్మాత్రంగా ఆవిష్కరించడమే ఈ పరిశోధనా వ్యాసలక్ష్యం.

దుష్టశిక్షణ - శిష్టరక్షణ ప్రధాన ధ్యేయంగా విష్ణుదేవుడు అసంఖ్యాక అవతారాలను ధరించాడు. వాటిలో 21, అందునా 10 చాలా ప్రసిద్ధాలు. అన్నమయ్య విష్ణుదేవుడు ధరించిన దశావతారాలను అనేక విధాలుగా కొనియాడాడు. పది అవతారాలు ఒకే కీర్తనలో వచ్చేలా రచించాడు. రామకృష్ణాది కొన్ని అవతారాలను విడివిడిగా ప్రత్యేక కీర్తనల్లోనూ ప్రశంసించాడు. దశావతారాలు జాబితాగా రూపుదిద్దుకున్న కీర్తనల్లో సంస్కృత కీర్తనలున్నాయి. తెలుగు కీర్తనలున్నాయి. వాటిలో అధ్యాత్మ, శృంగార సంకీర్తనలున్నాయి.

## సంస్కృత అధ్యాత్మ సంకీర్తన

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో అధ్యాత్మ సంకీర్తనలు ఎన్నో వున్నాయి. వాటిలో డోలోత్సవానికి సంబంధించిన కీర్తన ఒకటి. స్వామి ఉభయ నాంచారులతో కలిసి ఊయల ఊగేటప్పుడు ఈ కీర్తన ఆలపిస్తున్నట్టు తోస్తుంది. ఇది కేవలం సంబోధనలతో సాగే కీర్తన. దీని చరణాల్లో దశావతారాలు నామమాత్రంగా చోటుచేసు కున్నాయి. ఇంతకు మించి దశావతారాలకు సంబంధించిన ఏ ప్రత్యేకత దీనిలో లేదు. ఇదే ఆ కీర్తన.

డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం ॥పల్లవి॥

మీన కూర్మ వరాహా మృగపతి అవతారా
దానవారే గుణశౌరే ధరణిధర మరుజనక ॥డోలా॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగరంగా సామజ వరద మురహరణ॥డోలా॥

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
శీరపాణే గోసమాణే శ్రీ వేంకటగిరి కూటనిలయ ॥డోలా॥

(2-374)

## సంస్కృత శృంగార సంకీర్తన

అన్నమయ్య సంస్కృత శృంగార సంకీర్తనలు అనేకం రచించాడు. వాటిలో దశావతారాలకు సంబంధించింది కూడా ఒకటి కనిపిస్తుంది. ఈ కీర్తనలో 10 అవతారాలు గాక 11 అవతారాలు కనిపిస్తున్నాయి. బలరామ కృష్ణావతారాలు రెండూ చోటుచేసుకోవడమే ఇందుకు కారణం. ప్రతి అవతారానికీ శృంగారపరమైన లంకె ఉండడం గమనార్హం. ఈ గేయంలో కొన్ని అవతారాల్లో దైవసంబోధన చోటు చేసుకుంది. ఆ సంబోధనలు దనుజ హర, నిపుణ, సింహవిక్రమణ, హింసాదూర, భూతరక్షక, ధీర, వేంకట నగాధీశ. ఇవన్నీ అవతారోచితంగా, సాభిప్రాయంగా ఉన్నాయి.

పదిరూపులు ధరించి, పది విధాలుగా ఆచరించడం 'మిష' మాత్రమే. దశవిధ శృంగారావస్థల కోసమే విష్ణువు, ఈ అవతారాలు ధరించాడని అన్నమయ్య ఈ పాటలో చమత్కరించాడు.

పూర్వం వేదాలను స్థాపించడం కోసం మత్స్యదేహంతో ప్రకాశించడం వ్యాజం మాత్రమే. అది అతని వ్యాపారం కాదు. అయితే విష్ణువు 'మత్స్యావతారం' ధరించడం దేనికంటే నిత్యతారుణ్యంతో నెగడే లక్ష్మీదేవి సౌందర్య జలధిలో ఓలలాడేందుకే.

మందర పర్వతాన్ని ధరించే మిషతో అందమైన తాబేలు రూపం ధరించాడు. అది నీరసమైన బుద్ధికి తోచే అంశం. అలాంటప్పుడు 'కూర్మ రూపం' దేనికంటే ప్రియవధూ కుచమందరాలను ధరించేందుకే ఈ రూపం గైకొన్నాడు.

పూర్వం భూమిని పునరుద్ధరించే నెపంతో శ్వేత 'వరాహరూపం' ధరించాడు. ఇది ఆ వ్యవహారం కాదు. భూదేవి కుచతటి మీద దంతక్షతాలు చేసేందుకే ఈ రూపం ధరించడం జరిగింది.

పూర్వం దనుజుడైన హిరణ్యకశిపుణ్ణి హరించడం నిమిత్తంగా నరసింహ పరాక్రమం చూపడం జరిగింది. అది ఆయన మహత్త్వం కాదు. ఇందిరకు నఖక్షతాలు ప్రసాదించడం కోసమే 'నరసింహరూప ధారణ'.

పూర్వం బలివైభవాన్ని అపహరించే వ్యాజంతో కపట 'వామన రూపం' ధరించాడు. అయితే అది వాస్తవం కాదు. స్త్రీల విషయంలో కపటంగా ప్రవర్తించేందుకే అతడలాచేశాడు.

రాజులను సంహరించేందుకే 'పరశురామవతారం' ధరింప బడింది. అధిక అరుణజల ప్రాప్తి అనే మాటతో పరశురామావతారమిక్కడ సూచించ బడింది. అది అతని స్థితికాదు. స్త్రీల బాధను తెలుసుకోవడం కోసమే ఈ అవతారం. ఇక్కడ స్త్రీలంటే మరణించిన రాజుల భార్యలు కావచ్చు. లేదా విష్ణుదేవుని మోహించి విహ్వలత్వం పొందిన వనితలు కావచ్చు.

యుద్ధంలో రావణుణ్ణి జయించే నెపంతో విష్ణువు రాజభోగాన్ని స్వీకరించాడు. అంటే 'రామావతారం' ధరించాడన్నమాట. అది అలా కాదు. సావధానంగా సీతావిరహాన్ని అనుభవించడం కోసమే

ఖలుడైన కంసుణ్ణి ఖండించేందుకే కృష్ణరూపంతో పుట్టుక స్వీకరించాడు. ఈ 'కృష్ణావతారం' అందుకు కాదు. వ్రజస్త్రీలతో సంపర్కం పెట్టుకోవడం కోసమే.

ప్రలంబాసురుణ్ణి పడగొట్టే మిషతో, కోపంతో 'బలరామరూపం' ధరించడం జరిగింది. అది ఆయన ప్రభుత్వ వైఖరికాదు రేవతీదేవిని అనుభవించేందుకే బలరామావతారం.

పూర్వం త్రిపురారులను హరించే మిషతో 'బుద్ధరూపం' ధరించడం జరిగింది. అది ఆ అవతారహితం కాదు. త్రిపురాంగనల కౌగిళ్ళ కోసమే.

కలి మతాన్ని పడగొట్టాలనే మిషతో, క్రూరకోపంతో 'కల్కి అవతారం' ధరించడం జరుగుతుంది. అది యథార్థం కాదు. భయపడిన భూదేవికి సంప్రీతి కలిగించడం కోసమే ఆ అవతారం.

ఈ కీర్తనలో అన్నమయ్య భావనాశక్తి, భావసౌందర్యం మేధస్సును, హృదయాన్ని కూడా పరవశింపజేస్తాయి. ఆలోచనకు విందుగా రూపొందిన ఈ కీర్తన అవశ్యమనుసంధేయం.

దశవిధా చరణం తన్నభవతి
దశవిధావస్థార్థం తే తత్ర ॥పల్లవి॥

స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన
దీపితోయం మత్స్యదేహః పురా
వ్యాపారోయమేవం నచ తరుణ్యా
రూపజలధౌ కేళి రుచయే తత్ర ॥దశ॥

ధారయిష్యామి మందరమితి వ్యాజేన
చారుకచ్ఛప విధాచరణం పురా

నీరసేయం తవ మనీషా ప్రియవధూ -
భారకుచమందరౌ భర్తుం తత్ర ||దశ||

భువముద్ధరిష్యామి పునరితి వ్యాజేన
ధవళకిటి వైభవం ధత్సే పురా
వ్యవహృతిరియం నచ మహామహీకుచతటే
తవ దంతక్షతం దాతుం తత్ర ||దశ||

దనుజం హరిష్యామి తమితి వ్యాజేన
ఘన నారసింహ విక్రమణం పురా
దనుజహర తవమహత్త్వం తన్నచ నఖా -
ర్జన మిందిరాయా (యాం?) ప్రసర్తుం తత్ర ||దశ||

అపహరిష్యామి బలిమహమితి వ్యాజేన
కపట వామన రూపకలనం పురా
నిపుణ ఏవం నఖలు నియతిస్సతీషుతే
కపటా చరణం ఘటయితుం తత్ర ||దశ||

సంహరిష్యామి నృపజనమితి వ్యాజేన
బహ్వారుణతోయే ప్రాప్తిః పురా
సింహ విక్రమణతే స్థితిరియం నచ సతీ -
విహ్వలత్వం తదా వేత్తుం తత్ర ||దశ||

రావణం జేష్యామి రణ ఇతి వ్యాజేన
భూవరత్వే తే భోగః పురా
ఏవం నభవతి మహీసుతా విరహం
సావధానేన ప్రహర్తుం తత్ర ||దశ||

కంసం హనిష్యామి ఖలమితి వ్యాజేన
సంసారోయ మాచరితః పురా
హింసాదూర నచ హితమిదం వ్రజావధూ -
సంసరణం లీలాం ప్రసక్తుం తత్ర ||దశ||

పాతయిష్యే ప్రలంబమితి వ్యాజేన
జాతరోషస్య తే జననం పురా
భూతరక్షక తే ప్రభుత్వం తన్నఖలు
భూతలే రేవతీం భోక్తుం తత్ర ॥దశ॥

బుద్ధో భవిష్యామి పురహ్యాతి వ్యాజేన
బద్ధరోష ఇతితే ప్రాప్తిః పురా
తద్ధితం నహిఖలు తదావధూహస్త -
సిద్ధ ప్రసారేణ సేవితుం తత్ర ॥దశ॥

మారయిష్యామి కలిమతమిత వ్యాజేన
క్రూర కల్క్యవతార కోపః పురా
ధీర వేంకటనగాధీశ ఏవం నఖలు
భీరుముర్వీం సంప్రీణయితుమత్ర ॥దశ॥ (5-374)

## తెలుగు సంకీర్తనలు

అన్నమయ్య రచించిన తెలుగు సంకీర్తనల్లోనూ దశావతారల జాబితా కనిపిస్తుంది. ఈ అవతారాలను అన్నమయ్య అధ్యాత్మ పరంగానూ, శృంగారపరంగానూ కూడా అభివర్ణించాడు.

## అధ్యాత్మ సంకీర్తనలు

అన్నమయ్య అధ్యాత్మ పరంగా రచించిన దశావతార కీర్తనల్లో ఒకటి నీతిని ప్రబోధిస్తుంది. మరొకటి కర్మసిద్ధాంతాన్ని ఆవిష్కరిస్తుంది. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి భూతంగా, దొంగగా, బోయనాయడుగా, పొలంగా, తలపుగా కూడా వర్ణించాడు. స్వామి అవయవాలను భక్తితో కీర్తించాడు. వేంకటేశ్వరుని పాదాన్ని బ్రహ్మకడిగిన పాదంగా కొనియాడిన అన్నమయ్య అతని హస్తాన్ని కూడా అభినుతించాడు. దశావతారాల్లో అది నిర్వహించిన పాత్రను అభివర్ణించాడు.

ఈ హస్తమే 'మత్స్యావతారం' లో సాటిలేని మేటి వేదాలను నీటి అడుగున వెదకి తెచ్చింది. 'కూర్మావతారం' లో కవ్వపు కొండ క్రింద దానికి ఆధారంగా నిలిచింది. 'వరాహావతారం' లో భూదేవిని విష్ణు దేవుడు తన కౌగిట్లోకి తీసుకునేందుకు తోడ్పడింది. 'నరసింహావతారం' లో వాడిగోళ్ళు ధరించి కూడ భీతిగొలిపింది. 'వామనావతారం' లో బలిని దానం యాచించింది. పరశురామవతారంలో మునులకు భూమిని దానమిచ్చింది. 'రామావతారం' లో సముద్రుడి మీదికి బాణం సంధించింది. 'బలరామవతారం'లొ నాఁగలి పట్టుకుంది. 'బుద్ధా వతారం' లో త్రిపురాసురుల భార్యల పాతివ్రత్యాన్ని భంగం చేసేందుకు పూనుకుంది. 'కల్క్యవతారం'లో గుఱ్ఱాన్ని నడుపుతుంది.

ఇపుడు వేంకటాచలం మీద ప్రాణులందరికీ మోక్షమార్గాన్ని చూపిస్తూ వుంది.

ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి
కందువగు మంచి బంగారు చేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకితెచ్చిన చేయి
చిలుకు గుబ్బలికిందఁ జేర్చుచేయి
కలికియగు భూకాంతఁగా (గౌ?) గిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాఁడిచేయి ॥ఇంద॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
వొనరంగ భూదాన మొసఁగుచేయి
మొనసి జలనిధి యమ్ము మొనకుఁదెచ్చిన చేయి
యెనయ నాఁగేలు ధరియించు చేయి ॥ఇంద॥

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుఁబరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు -
తెరువు ప్రాణులకెల్లఁ దెలిపెడి చేయి (1-334) ॥ఇంద॥

అన్నమయ్య వేంకటేశ్వరుని వివిధ గుణాలను వినుతించాడు. వాటిలో కొన్నిటిని కొనియాడే కీర్తనల్లో మాత్రమే దశావతారాలు తళుక్కు మంటున్నాయి. ఈ దశావతార కీర్తనల్లో స్వామి అప్రతి మానత్వం, సర్వవ్యాపకత్వం, దుర్జయత్వం, ఘనత కనిపిస్తాయి. అన్నమయ్య వేంకటేశ్వరుని ఘనతను కొనియాడుతూనే అతడు ధరించిన దశావతారాలను ఈ కీర్తనలో అవిష్కరించాడు.

చదువుల చిక్కుదిద్ది చక్కచేయడం 'మత్స్యావతార' ప్రయోజనం. మొదట సముద్రంలో క్రుంగిపోయిన కవ్వపు కొండనుమోచి ఎత్తడం 'కూర్మావతార 'ప్రయోజనం. పొదిగి చేపట్టితెచ్చి భూమిని ఉద్ధరించడం 'వరాహావతార' ప్రయోజనం. ప్రహ్లాదుణ్ణి మన్నించి రక్షించడం 'నరసింహావతార 'ప్రయోజనం. మూడడుగులతో అఖిలాన్ని ఆక్రమించి అమరపతిని ఆదుకోవడం 'వామనావతార' ప్రయోజనం. వెంటవెంటనే రాజుల శత్రుత్వాన్ని పోగొట్టుకోవడం తద్వారా భూభారాన్ని తగ్గించడం 'పరశు రామావతార' ప్రయోజనం. లంకను విభీషణుని చేత ఏలించడం 'రామావతార' ప్రయోజనం. పాండవులకు ఆప్తుడుగా నిలిచి ఆదుకోవడం 'కృష్ణావతార' ప్రయోజనాల్లో ఒకటి. అసురకాంతల పాతివ్రత్యాన్ని అంతం చేయుడం 'బుద్ధావతార' ప్రయోజనం. కలికిరూపుతో ఉండడం 'కల్క్యవతార' స్వభావం.

ఈపాటలో దశావతార ప్రస్తావన స్పష్టంగానే గోచరిస్తుంది.

ఇట్టి మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్ట బాయిటనే నీవు పదిరూపులైతివి ||పల్లవి||

చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁగుంగిన కొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ||ఇట్టె||

అడుగులు మూఁటనే యఖిలము గొలిచితి
బడిబడినే రాచపగ నీఁగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అదరి పాండవుల దిక్కై నిలిచితివి ||ఇట్టి||

త్రిపుర కాంతల గుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికి రూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మానుతులకు నిరవైతివి ||ఇట్టి|| (2- 503)

## శృంగార సంకీర్తనలు

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో వేంకటేశ్వరుడు ధరించిన దశావతారాలు ధ్వనిస్తాయి. ఆలోచించే కొద్దీ వీటి మనోజ్ఞత అవగత మవుతుంది. ఆనందం కలిగిస్తుంది. శృంగారపరంగా వెలసిన దశావతార కీర్తనల్లో నాయకుని ఆనవాళ్ళు, అతని లీలలు, చేతలు, శృంగారావస్థలు చోటుచేసుకున్నాయి. నాయకుని లీలలను కొనియాడే నాయిక గళంలో దశావతారాలు తారాడాయి. చమత్కార విలసితంగా భాసించాయి.

ఘోషించేసాగరంలో నాయకుడు ఈదడాన్ని పేర్కొవడం 'మత్స్యావ తార' సూచన. నాయకుని మూపుమీద తిరిగిన కొండవల్ల దేవతలకు ఆహారం పుట్టిందని తెలియజేస్తూ నాయకుని ఘనతను ధ్వనింప జేసింది. ఇది 'కూర్మావతార' విధానం. మూతిమీద కత్తి అనడం 'వరాహస్వామి' కోరను సూచిస్తుంది. మొనగోరివాత అనడం 'నరసింహ స్వామి' నఖాలను స్ఫురింపచేస్తుంది. నాయకుడు 'వామనుడు' గా వెళ్ళి బలినుంచి దానాన్ని గ్రహించి దేవేంద్రునికి ఇచ్చివేశాడు. ఇది రీతిలేని దానమని నాయిక పేర్కొంది. 'పరశు రాముడు' పాపమని కూడా భావించ కుండా రాజులలో సాపరాధులనే గాక, నిరపరాధులను కూడా నిహతులు గావించిన విధాన్ని పాపము చూడని చేత అని నాయిక పేర్కొంది. నాతి మీద తలపోత అనడం సీతమీద మాత్రమే తలపు నిలిపిన 'దశరథరాముణ్ణి' తలపిస్తుంది.

నాగేటి గీత అనడం నాగలితో యుద్ధం చేసిన 'బలరాముణ్ణి భావింప జేస్తుంది. వలపు చల్లిన విధాన్ని ప్రస్తావించడం అసురవనితల వలపించిన 'బుద్ధుణ్ణి' గుర్తు చేస్తుంది. అశ్వాన్ని అధిరోహించిన అందాన్ని స్మరించడం 'కల్క్యవతారాన్ని' ధ్వనింప జేసినట్లు అయ్యింది.

ఇష్టపడీ ఇష్టపడకుండా వలపులో ఆలస్యం చేయడం ప్రాణుల మీద వలపు నిలపడానికి ఏ మేరకు తోడ్పడుతుంది? అని నాయిక నాయకుణ్ణి ప్రశంసా పూర్వకంగా అధిక్షేపించడం ఈ కీర్తనలో కనిపిస్తుంది. అంత్యాను ప్రాసలు ఈ కీర్తనను శ్రవణ శుభంగానూ, మనోహరంగానూ మలిచాయి.

పొద్దు వోకలివి నీకు భువిలో నెన్నఁగ నీ -
సుద్దులు చెప్పెదమన్న చూడఁజూడఁగొత్తలు ॥పల్లవి॥

మోఁత నీటిలోని యీఁత మూఁపునఁబుట్టిన మేఁత
మూఁతి మీఁది కత్తికోఁత మొనగోరివాఁత
బాఁతిలేని దారవోఁత పాపము చూడని చేఁత
నాఁతి మీఁది తలపోఁత నాఁగేటి గీఁత ॥పొద్దు॥

వలపు చల్లినలాగు వాజినెక్కిన బాగు
వలసి నొల్లములైన వలవని జాగు
తెలిసితిమిదె నేఁడు తిరువేంకటేశ్వర
తలఁపు ప్రాణుల మీఁదఁదగులుటేలాగు ॥పొద్దు॥ (5-275)

నాయిక నాయకుడి మీద ప్రణయకోపం ప్రదర్శించింది. నిందించింది. నిష్ఠురోక్తు లాడింది. ఎద్దేవా చేసింది. నాయకుణ్ణి హెచ్చరించింది. వీటన్నిటిలోనూ దశావతారాలు దర్శనమిస్తాయి.

నాయిక నాయకుడితో నిష్ఠూరలాడుతున్నట్టు అన్నమయ్య ఈ కీర్తనను రచించాడు. అనవసరంగా ఒట్టి జోలిబెట్టేదెందుకని నాయిక నాయకుణ్ణి నిలదీసింది. ఆయన చెప్పే సుద్దులతోనే తృప్తిపడి తాను పరవశించి వున్నట్టు తన పరిస్థితిని తెలిపింది.

మాటలు తెలుసుకోవచ్చు, కొండనైనా మోయవచ్చు గానీ మేటి దొర అయిన శ్రీవేంకటేశ్వరుణ్ణి మెప్పించడం దుస్తరమంది. ఇక్కడ 'మత్స్య, కూర్మావతారాల' సూచన గోచరిస్తుంది.

ఎక్కడైనా దూరవచ్చు, నచ్చిన చోటనే నివసించవచ్చు. కానీ ఆడదానినైన నేను నిన్ను అవునని కాదని అనలేను. ఇక్కడ 'వరాహ, నరసింహావతారాల' ప్రసక్తి ధ్వనిస్తుంది.

ఆకాశాన్నైనా అందుకోవచ్చు, శత్రువులనైనా లోబరుచుకోవచ్చు. కానీ, నాయకుడితో మనసారా నవ్వడం మహాకష్టమని నాయిక నాయకుణ్ణి అధిక్షేపిస్తుంది. ఇక్కడ 'వామన, పరశురామావతారాలు' అభివ్యక్త మవుతాయి.

సముద్రాన్నైనా వారధిగట్టి బంధించవచ్చు, మాయచూపవచ్చు. అయినా విజృంభించి నాయకుడి చేత పలికించడం దుస్తరమని నాయిక వాపోత. ఇక్కడ 'రామ, కృష్ణావతారాలు' రవళిస్తాయి.

రట్టుగా తిరుగనైనావచ్చు, రాతిరూపు అయిపోనైనా పోవచ్చు అయితే నాయకుడి రతులవల్ల కలిగే మేలును తలపోయడం తలకుమించిన పని అని నాయిక తెలియజేస్తుంది. ఇక్కడ 'బుద్ధ, కల్క్యవతారాల' ప్రసక్తి గోచరిస్తుంది.

నాయకుడైన వేంకటేశ్వరుణ్ణి వలచవచ్చు. కానీ, అతడి ఎడబాటు దుస్తరమని నాయిక తన అశక్తతను వ్యక్తపరిచింది.

వద్దు వద్దు మమ్ము నీవు వట్టిజోలిఁబెట్టనేల
సుద్దులనే తనిసి నేఁజొక్కి వున్నదానరా ||పల్లవి||

మాఁటలు నెఱఁగవచ్చు మరికొండ మోవవచ్చు
మేఁటిదొరవు నిన్నైతే మెప్పించరాదు

దూఁటుకెఁ (కెం) దైనాఁదూరి తోఁచినందే వుండవచ్చు
ఆఁటదాన నిన్ను నౌఁగాదన లేనురా ||వద్దు||

ఆకస మందుకోవచ్చు అరుల సాదించవచ్చు
నాకు నీతో నింతేసి నవ్వరాదురా
వాకుగా జలది (ధి?) గట్టవచ్చు మాయ చూపవచ్చు
పైకొని నిన్నొక యింత పలికించరాదురా ॥వద్దు॥

అట్టయి తిరుగవచ్చు ఆతరూపు గావచ్చు
యిట్టె నీరతులమేలు యెంచరాదురా
నెట్టిన శ్రీవేంకటేశ నీకు వలవఁగవచ్చు
పట్టిన చలాన నిన్నుఁబాయరాదురా ॥వద్దు॥ (20-210)

అన్నమయ్య దశావతార కీర్తనల్లో సంస్కృత కీర్తనలు, తెలుగు కీర్తనలు, అధ్యాత్మ కీర్తనలు, శృంగార కీర్తనలు కనిపిస్తాయి. వీటిలో వైవిధ్యం వుంది. చమత్కారం వుంది. భగవత్ ప్రీతివుంది. లోకరీతి వుంది. అన్నమయ్య దశావతారాల జాబితాను తెలియజేసే కీర్తనలే గాక విడివిడిగా రామకృష్ణాద్యావతారాలను కొనియాడే కీర్తనలు కూడా రచించాడు.

## ఆధారగ్రంథాలు


1. అధ్యాత్మ సంకీర్తనలు - తాళ్ళపాక అన్నమాచార్యుడు (సంపుటము - 2)
2. శృంగార సంకీర్తనలు - తాళ్ళపాక అన్నమాచార్యుడు (సంపుటము - 5)
3. అధ్యాత్మ సంకీర్తనలు - తాళ్ళపాక అన్నమాచార్యుడు (సంపుటము - 1)
4. శృంగార సంకీర్తనలు - తాళ్ళపాక అన్నమాచార్యుడు (సంపుటము - 20)


★ ★ ★

పొన్నగంటి చిన్న వెంకటేశ్వర్లు

# అన్నమయ్య స్తుతించిన దేవతామూర్తులు

"దివుక్రీడాయాం" అనే ధాతువు నుండి పుట్టిందే 'దేవతా' పదం. 'మూర్తి' అంటే రూపం అని అర్థం. 'దివ్యత్వం కలిగిన రూపం' అని దేవతా మూర్తికి వ్యుత్పత్తి చెప్పుకోవాలి. భారతీయ సంస్కృతిలో అర్చా మూర్తి సంప్రదాయం గుండెలోని దేవుణ్ని గుడిలోనో, ఇంటి గూటిలోనో ఉంచి పూజించడంతో ప్రారంభమైంది. ఈ పూజించే తీరు జానపదుల్లో ఒక రీతిగా, నాగరికుల్లో మరో రీతిగా ఉంటుంది. నాగరికులు అర్చా మూర్తిని దేవాలయంలో ప్రతిష్ఠించుకొని ఆ క్షేత్రాన్ని దేహదేహి సంబంధంగా భావించి ఆరాధిస్తారు. పూజ్యుల వాక్యమైన "దేహో దేవాలయోః ప్రోక్తః జీవో దేవస్సనాతనః" అనే సూక్తికి ప్రతిఫలంగా ఏర్పడిందే క్షేత్రం. ఇవన్నీ అధ్యాత్మిక విద్యలో అంతర్భాగం. మానవుడు వివిధ క్షేత్రాల్ని దర్శించడానికి కారణం కర్మమార్గం వైపు దేహాన్ని, మనసును వంచడానికి చేసే ప్రయత్నం. ఆ ప్రయత్నంలో భాగంగానే అన్నమయ్య తిరుమల శ్రీ వేంకటనాథుని నుండి పూరీ జగన్నాథుని వరకు ఉన్న అనేక క్షేత్రాల్ని దర్శించాడు. ఆ క్షేత్ర దేవతామూర్తుల్ని స్తుతిస్తూ రాగాలాపన చేశాడు.

శ్రీవైష్ణవుల విశ్వాసం ప్రకారం మహావిష్ణువు పంచస్థితుల్లో ఉంటూ తనను నమ్ముకున్నభక్తుల్ని ఎల్లప్పుడూ అనుగ్రహిస్తుంటాడు. ఆ పంచస్థితుల్లో ఒకటి 'అవతార స్థితి'. దీన్నే 'విభవస్థితి' అంటారు. విష్ణువు అవతార విశేషం 'విభవస్థితి' అని వైష్ణవుల నమ్మకం. ఆవైపు నుండి ఆలోచిస్తే ఆయన దశావతార తత్త్వమంతా విష్ణువు విభవమే కదా. అందుకే

విష్ణువు అవతార రూపమైన వేంకటేశ్వరుని స్తుతించే క్రమంలో వైష్ణవ భక్తాగ్రేసరుడైన అన్నమయ్య దశావతార తత్త్వాన్ని తన సంకీర్తనల్లో అనేక సందర్భాల్లో కీర్తించాడు.

తిరుమలలో వెలసిన శ్రీ వేంకటేశ్వరునితో పాటు విష్ణువు అంశతో జన్మించిన వివిధ దేవతా మూర్తుల్ని నోరారా కీర్తించాడు. ఆ దేవతామూర్తుల్ని ప్రార్థించిన కీర్తనల్లో అధ్యాత్మికశక్తి ఉంది. లోతైన నీతి ఉంది. కమ్మని కవిత్వముంది. నిత్య నూతనత్వముంది. ప్రజా జీవిత స్పందన ఉంది. అన్నింటికంటే మించి విష్ణువు పట్ల అచంచల భక్తి ఉంది. ఆ భక్తిభావంతో ఆయన స్తుతించిన దేవతామూర్తుల్ని విశ్లేషణా సౌలభ్యం కోసం మూడురకాలుగా వర్గీకరించవచ్చు.

1. దశావతార దేవతామూర్తులు 2. ఇతర దేవతామూర్తులు
3. స్త్రీ దేవతామూర్తులు

## 1. దశావతార దేవతామూర్తులు

వైష్ణవ భక్తితత్వం దశావతారాలతో అవిచ్ఛిన్న సంబంధాన్ని కల్గిఉంది. అందుకే విశిష్టాద్వైతి అయిన అన్నమయ్య దశావతార మూర్తుల్ని ఎన్నో కీర్తనల్లో వర్ణించాడు. దశావతారాలు అంటే ఎవరెవరు? ఈ అవతారాల్లో బలరామ, బుద్ధులలో ఎవరిని పరిగణనలోనికి తీసుకోవాలి అని చర్చించడం ఈ వ్యాసోద్దేశం కాదు. అన్నమయ్య కొన్నిచోట్ల బలరాముని, మరికొన్నిచోట్ల బుద్ధుని దశావతారాల్లో చేర్చారు. మొత్తంమీద ఆయన దశావతార మూర్తుల్ని అధ్యాత్మిక దృష్టితో కీర్తించాడు. అన్నమయ్య తనభక్తి తత్త్వపు లోతును 'పల్లవి' లోనే చూపిస్తాడు. ఆయన స్తుతించేది ఎవర్నో మొదట అంతుపట్టదు. అనంతదూరంలో ఉన్న వ్యక్తిని గురించి ప్రారంభిస్తాడు. కానీ, తీరాచూస్తే మదిలోని వ్యక్తే. ఆ వ్యక్తి ఎవరంటే ఒకరు కాదు. పది అవతారాల్లో మనకు అంతర్లీనంగా కన్పించే విష్ణుమూర్తి.

"ఇతనికంటే మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము దానె

మది జలధుల నొకదైవము వెదకిన మత్స్యావతారం బితఁడు
అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీవిష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకిచూచితే భూవరాహమని కంటిమి
చెదరక కొండల గుహల వెదకితే శ్రీనరసింహం బున్నాఁడు.

(3-370) – అంటూ

వరుసగా దశావతార మూర్తుల్ని ఒక్కొక్క చరణంలో స్తుతించాడు. అంతేగాదు దశావతార మూర్తుల్ని నర్మగర్భంగా కీర్తిస్తూ పాడిన కీర్తనలు ఎన్నో కలవు. విష్ణుమూర్తి ఏయే అవతారాల్లో ఏమి చేశాడో ఇలా చెప్పాడు.

వింతనా నేఁ దనకు వేసాలవాఁడు
కంతునికి గురుఁ డనఁగలిగినవాఁడు

జడిగొని మొదలుఁదా జలసూత్రపువాఁడు
వెడమాయలుగ బారి విద్యలవాఁడు
కడుసోద్యములనే కర్మపుఁ జేఁతులవాఁడు
అడరి కంబపుసూత్ర మాడెడివాఁడు

ఇలనుండి మిన్ను ముట్టే ఇంద్రజాలమువాఁడు
తలద్రుంచి బ్రదికించుతక్కులవాఁడు
తెలియఁ గొండలు నీళ్ళఁ దేలవేసినవాఁడు
కలసి పగలు రేయిగాఁ జేసేవాఁడు

మగువలభ్రమయించేమౌనవ్రతముల వాఁడు
వెగటై రాయి గంతులు వేయించేవాఁడు
చిగిరించే వరముల శ్రీవేంకటాద్రివాఁడు
బగివాయ కిట మమ్ముఁ బాలించే వాఁడు (4-352)

అన్నమయ్య తన వైష్ణవ భక్తితత్త్వాన్ని ప్రచారం చేయడానికి సంకీర్తనలను ఎన్నుకొని వాటిలో జానపద బాణీలను మేళవించాడు. అందుకే ఆయన కీర్తనలు ప్రజలకు చేరువైనాయి. జానపదుల్లోని పొదుపు

కథల ప్రక్రియను కీర్తనలో కలిపి దశావతార తత్త్వాన్ని ఎలా రంగరించాడో చూడండి.

"ఎవ్వఁడో కాని యెరగఁరాదు కడు -
 దవ్వులనే వుండు తలఁపులో నుండు
ఎడయవు తన రెక్కలెగసి పోలేఁడు
 కడు దాగు గాని దొంగయుఁ గాఁడు
 వడిఁ గింది పడును సేవకుడునుఁ గాఁడు
 వెడఁగుగోళ్ళు వెంచు విటుఁడునుఁ గాఁడు
మిగులాఁబొట్టివాఁడు మింటికినిఁ బొడవు
 జగడాలు తపసి వేషములను
 మగువకై పోరాడు మరి విరక్తుఁడును
 తగుఁ గాపుఁ బనులు నెంతయుఁ దెల్లఁదనము
తరుణుల వలపించు తగిలి పైకొనఁడు
 తురగముఁ దోలు రౌతునుఁ గాఁడు
 తిరువేంకటాద్రిపై ఁదిరుగు నెప్పుడును
 పరమమూర్తియై పరగు నీఘనుఁడు" (1-74)

దశావతార మూర్తుల్ని ఒక్కొక్కర్ని ఒక్కొక్క చరణంలో వర్ణిస్తూ అనేక సంకీర్తనలు పాడినా ఆ దశావతారాల్లోని నృసింహ, శ్రీరామ, శ్రీకృష్ణ అవతార దేవతామూర్తులకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి ఎన్నో వందల కీర్తనల్లో స్తుతించాడు అన్నమయ్య. ఇలా ముగ్గురు అవతార మూర్తుల్ని వందల సంకీర్తనల్లో కీర్తించి మిగిలినవారిని చరణాల్లో కీర్తించడానికి కారణాలు లేకపోలేదు. నృసింహ, శ్రీరామ, శ్రీకృష్ణులకు ప్రత్యేక క్షేత్రాలున్నాయి. గొప్ప గొప్ప ఆలయాలున్నాయి. ఆయాక్షేత్రాల్లో, దేవాలయాల్లో వీరు అర్చామూర్తులుగా పూజింపబడుతున్నారు. అందువల్ల అన్నమయ్య వారిని ప్రత్యేకంగా ఆయాక్షేత్రాల్ని దర్శించినప్పుడు గాని,

ఆయా దేవతల స్ఫురణ కల్గినప్పుడు గాని కీర్తించి ఉండవచ్చు. అయితే తిరుమలలో వరాహస్వామికి, అత్తిరాలలో పరశురామునికి ప్రత్యేక ఆలయాలున్నాయి కదా? అని ప్రశ్నిస్తే అవి ఆయా దేవతామూర్తుల పేరుమీద వెలసిన గొప్ప క్షేత్రాలు కాదు కదా. ఇంకా దశావతార దేవతామూర్తుల ఆలయాలు ఎక్కడైనా ఉన్నప్పటికీ అన్నమయ్య ఆ దేవతామూర్తుల్ని దర్శించక పోవడంవల్ల కీర్తించలేదని తెలుస్తోంది. కాబట్టి, అన్నమయ్య దర్శించి, స్తుతించిన దశావతారమూర్తుల్ని పరిశీలిద్దాం.

## నృసింహస్వామి

"కృతయుగే నారసింహః త్రేతాయుగే రఘునందనః
ద్వాపరే వాసుదేవ శ్చ కలౌ వేంకటనాయకః"

కలియుగ వేంకటాద్రిపతే కృతయుగంలో నారసింహరూపాన్ని కలిగిఉన్నట్లు ఈ శ్లోకం స్పష్టంగా చెప్తుంది. అందుకే కాబోలు అన్నమయ్య వేంకటేశ్వరునికి నృసింహస్వామి కి అభేదాన్ని పాటించాడు. అన్నమయ్య స్తుతించిన దశావతార దేవతామూర్తుల్లో నరసింహు నిదే అగ్రతాంబూలం. అన్నమయ్య మొదట అద్వైతి. తర్వాత విశిష్టాద్వైతిగా మారాడు. ఎంత మారినా ఆయనలో పూర్వవాసనలు పోలేదు. ఎందుకంటే నరసింహుని అద్వైతులు "ఆ కంఠం విష్ణురూపాయ అత ఊర్ధ్వం శివరూపణే " అని భావిస్తారు. ఆ వాసనలు కలిగిన అన్నమయ్య నృసింహస్వామిని అనంత తన్మయత్వంతో కీర్తించాడు. అయితే ఆ తన్మయత్వంలో కూడా నరసింహుడే వేంకటేశ్వరుడని మాత్రం మరువలేదు. వేంకటేశ్వరుడు తిరుమల గిరివాసుడు. మరి నృసింహుడు ఏ గిరివాసుడు? అని ప్రశ్నించు కుంటే ఆయన అహోబల గిరివాసి. అన్నమయ్య శ్రీమద్రామానుజా చార్యుల వారు స్థాపించిన అహోబల మఠాన్ని దర్శించాడు. ఆపాదమస్తకం పులకించాడు. నారసింహునిలో పూర్తిగా వేంకటేశ్వరుడే దర్శనమిచ్చాడు. దశావతారాల్లో ఏ అవతారమూర్తి చేయని భయంకర రీతిలో దుష్టశిక్షణ చేసిన ఆ ఘన నారసింహుని ఉగ్రరూపాన్ని ఇలా స్తుతించాడు.

"కంభమున వెడలి ఘననరసింహము
కుంభిని హిరణ్యుఁ గూలిచెను

తొడికి దైత్యుఁ దనతొడపైకిఁ దిగిచి
కడుపు చించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడఁ దగిలించుక మెరసీ వాఁడే

పెదవులు చింపుచు పెనుగోళ్ళ నదిమి
వుదుటుఁబునుక గొరి కుమియుచును
సదరపుగుండెలు చప్పరింపుచును
మెదడు గందముగ మెత్తీ వాఁడే . . ." (3-506)

అన్నమయ్య అహోబలంలోని ఒక్క నారసింహునే కాదు. నవ నారసింహుల్ని దర్శించి కీర్తించాడు. మూడు కీర్తనల్లో వారిని స్తుతించాడు.

"నవ నారసింహా నమో నమో
భవనాశితీర యహోబలనారసింహ

సతత ప్రతాపరౌద్ర జ్వాల నారసింహ
వితత వీరసింహవిదారణా
అతశయ కరుణ యోగానంద నరసింహ
మతి శాంతపుకానుగుమానినారసింహ

మరలి బీభత్సపుమట్టెమళ్ల నరసింహ
నరహరి భార్గోటినారసింహ
పరిపూర్ణశృంగారప్రహ్లాదనరసింహ
సిరుల నద్భుతపులక్ష్మినారసింహ

వదన భయానకపువరాహనరసింహ
చెదరనివై భవాలశ్రీనారసింహ" (1-453)

ఇలా నవ నారసింహుల్ని కీర్తించినా అన్నమయ్యలోని నృసింహ పిపాస తీరలేదు. అందుకే ఆంధ్ర దేశంలో ఉన్న నృసింహక్షేత్రాలన్నీ దర్శించాడు. సింహాచలం, కదిరి, జిల్లావాండ్లపల్లి, పెద్ద ముడియం, వేయి నూతులకోన, ఓగునూతుల, విజయనగరం, కనకగిరి, బొమ్మిరెడ్ల పల్లిలోని నారసింహమూర్తుల్ని తనివితీరా కీర్తించి శాంతించాడు. పోతన ప్రహ్లాదుని చేత "ఇందుగలడందులేడని సందేహము వలద" ని విష్ణుమూర్తి ఉనికిని చెప్పించాడు. అన్నమయ్య కూడా ఆ నారసింహుని "ఏ దెస జూచినా తానే వుంటాడ "ని "ఎందెందు వెదకినా" తానై కన్పిస్తాడని చెప్పాడు. కలియుగంలో వెలసిన వేంకట నాయకుడే కృత యుగంలోని నారసింహుడని భావించిన అన్నమయ్య నారసింహమూర్తి అంగారాన్ని, శృంగారాన్ని, అధ్యాత్మిక తత్త్వాన్ని, విశిష్టాద్వైతాన్ని మేళవించి కీర్తించాడు.

## శ్రీరామచంద్రుడు

"యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి".

నిజమే. ఈ భూమండలంపై పర్వతాలు, నదులు ఎంతకాలం సజీవంగా ఉంటాయో అప్పటివరకు రామకథ ప్రజల మనస్సుల్లో గుడికట్టుకొని ఉంటుంది. రామకథే కాదు శ్రీరామచంద్రమూర్తి ఆదర్శ దేవతామూర్తిగా త్రేతాయుగం నుండి నేటివరకు ప్రజల చేత సేవింపబడుతున్నాడు. శ్రీమహావిష్ణువు సప్తమావతారమైన శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడుగా, పితృవాక్య పరిపాలకుడుగా, సత్యసంధుడుగా, ఆర్త జనరక్షకుడుగా ధర్మ సంస్థాపన చేసినవాడు. ఆ రఘురాముడే అన్నమయ్యకు వెంకటాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుడు. జీవితంలో ఎన్నోకష్టాలను అధిగమించిన అవతార పురుషుడైన శ్రీరాముని తనకు పాప విమోచన కల్గించమని, ముక్తిని ప్రసాదించమని వేడుకుంటూ అన్నమయ్య ఆలపించిన అధ్యాత్మిక కీర్తన చూడండి.

"రామా రామభద్ర రవివంశ రాఘవ
యేమి యరుదిది నీ కింతటివానికిని

నాఁడు రావణుతలలు నఱకినలావరివి
నేఁడు నాపాపములు ఖండించరాదా
వాఁడి ప్రతాపముతోఁడ వారిధిగట్టిననాటి -
వాఁడ విట్టె నామనోవార్ధిఁ గట్టరాదా

తనిసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి
కినిసి నా యింద్రియాల గెలువరాదా
యెనసి హరునివిల్లు యెక్కు వెట్టి వంచితివి
ఘనము నాదుర్గుణము కడు వంచరాదా

వరుస విభీషణుడు శరణంటే ఁగాచితివి
గరిమ నే శరణంటిఁ గావరాదా
తొరలి శ్రీవేంకటేశ దొడ్డు గొంచ మెంచనేల
యిరవై లోకహితాన కేదైనా నేమి" ( 2-437)

తన పాపాలను దశకంఠుని తలలవలె నరకమని, తనమనసును సముద్రాన్ని కట్టడి చేసినట్లు చేయమనీ, రాక్షసుల వంటి తన ఇంద్రియాల్ని గెలవమనీ, శివుని విల్లులా తనలో దుర్గుణాల్ని వంచమనీ, విభీషణునిలా తననూ కాపాడమని కోరుకొనే అన్నమయ్య లోని శరణాగతి తత్త్వానికి ఈ కీర్తన ఒక మచ్చుతునక. తాను అహంభావి కాకున్నా భక్తి తత్పరు డైన తనను శ్రీరామునిలో లీనం చేసుకోమని పడేతపన ఆయనలో కన్పిస్తుంది. అన్నమయ్య అయోధ్యారామునే కాదు తాను దర్శించిన క్షేత్రాల్లో కొలువై ఉన్న ఒంటిమిట్ట రఘురాముని, గండికోట శ్రీరాముని, గుత్తి రఘురాముని, వాయల్పాడు శ్రీరామచంద్రుని, దాసరిపల్లె రఘురాముని, విజయనగరం శ్రీరాముని వేంకటేశ్వరునికి అభేదంగా చెప్తూ, రామాయణ ఘట్టాల్ని అన్వయిస్తూ మధురమైన కీర్తనల్ని ఆలపించాడు.

## శ్రీకృష్ణుడు

అన్నమయ్య శ్రీకృష్ణుని స్తుతిస్తూ ఆలపించిన -

"జోఅచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద రామ గోవిందా"

అనే సంకీర్తన ఆబాల గోపాలం వ్యాపించింది. ఈ కీర్తన వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి లేదు. అన్నమయ్యకు కృష్ణుడంటే ఎంత ఇష్టమో చెప్పడానికి సాధ్యంకాదు. దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం అవతార మెత్తినట్లు చెప్పుకొన్న శ్రీకృష్ణపరమాత్మ ముగ్ధ మనోహర రూపాన్ని, బాల్యక్రీడల్ని, శృంగార లీలల్ని అన్నమయ్య మధురభక్తితత్త్వాన్ని రంగరించి కీర్తించాడు. శ్రీకృష్ణునిపై ఎన్ని కీర్తనలు చెప్పినా అవి వేంకటేశ్వరునుద్దేశించి చెప్పినవే. శ్రీనివాసుడే శ్రీకృష్ణుడు. అన్నమయ్య శృంగార సంకీర్తనల్ని శ్రీకృష్ణతత్వం బాగా కన్పిస్తుంది. శ్రీకృష్ణుని వర్ణించిన కొన్ని సంకీర్తనల్లో స్థూలంగా పరిశీలిస్తే నాయికా నాయక అంగాంగ సౌందర్యవర్ణన, సరస సల్లాపాలు కన్పించినా, సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో ఏదో పరతత్వం కన్పిస్తుంది. తాత్త్విక దృష్టితో భగవంతుని గూర్చి తెలుసు కోకుండా కేవలం విషయ సుఖాల్లో చిక్కుకొని మానవజన్మను వ్యర్థం చేసుకుంటున్న మానవుల మనసుల్ని భగవంతుని వైపుకు మళ్ళించడానికి అన్నమయ్య ఇలాంటి కీర్తనలు రచించాడు. శ్రీకృష్ణుడు ఎలా వేంకటేశ్వరుడైనాడో అన్నమయ్య చెప్పినతీరు చూడండి.

"గోవిందుఁ డీ బాలుఁడు గోపాలుఁడు
కావింప రేపల్లెలోని కాంతాలోలుఁడు

జనియించెఁ గృష్ణుఁడు సర్వలోకజిష్ణుఁడు
దనుజాంతకుఁడు యీతఁడె విష్ణుఁడు యీ
పనివడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుఁడు
సనకాదులమతుల సంచరిష్ణుఁడు

పెరిగెఁ గంసజైత్రుఁడు భీషణతేజమిత్రుఁడు
వరవసుదేవదేవకీ పుత్రుఁడు
సరుస భావించి చూడ సర్వజీవగాత్రుఁడు
పరగ రుక్మిణీసత్యభామాకళత్రుఁడు

వెలసె భూధరుఁడు విశ్వలోక గురుఁడు
సులలిత బలభద్ర సోదరుఁడు
కలితనిశ్చల శ్రీవేంకటగిరి సంచారుఁడు
కలసిన యలమేల్మంగా మనోహరుఁడు" (12-137)

కృష్ణుడు ముగ్ధమోహన స్వరూపుడు. గోవులను పిల్లనగోవితో మరిపించినట్లు 'గొల్లెత'లను మరిపింపగలడని అన్నమయ్య అంటాడు. రేపల్లె కృష్ణుణ్ణే కాదు అన్నమయ్య విజయనగరంలోని కృష్ణుని "వేడుక కాడు గదమ్మ విజయనగరములోన" 20-194 అనీ, "ఉద్దగిరి కృష్ణుడు వుబ్బరికాడు వీడు" 25-174 అనీ ఉదయగిరి శ్రీకృష్ణుని కీర్తించడమే గాక గండవరం గోపాలకృష్ణుని, బండాత్మకూరు జనార్ధనుని దేవతామూర్తులుగా స్తుతించాడు.

## 2. ఇతర దేవతామూర్తులు

క్షేత్రంలేని దేవతామూర్తులు ఎక్కడైనా ఉంటారా? అంటే ఉండరనే చెప్పాలి. అన్నమయ్య తిరుమల క్షేత్రాన్ని, అహోబలక్షేత్రాన్నే కాకుండా ఆనాడు ఆంధ్రదేశంలోని తాను దర్శించగలిగినన్ని వైష్ణవక్షేత్రాల్ని దర్శించి ఆయా క్షేత్రాల్లోని దేవతామూర్తుల్ని స్తుతించాడు. దశావతార దేవతామూర్తులు కాని దేవతామూర్తుల్ని కూడా అన్నమయ్య స్తుతించాడు. అయితే ఏ క్షేత్ర దేవతామూర్తిని కీర్తించినా వారిని శ్రీనివాసుని నయనార విందాలతోనే తిలకించాడు. వైష్ణవభక్తి తత్పరుడైన అన్నమయ్య చెన్నకేశవుని, గోవిందరాజ స్వామిని, జగన్నాథుని దర్శించి మనసారా కీర్తించాడు.

### చెన్నకేశవుడు

చెన్నకేశవస్వామి దశావతారాల్లో అంతర్భాగం కాదు. కానీ వైష్ణవులు చెన్నకేశవుని విష్ణుమూర్తి అవతారంగా భావిస్తారు. "చెన్ను" అంటే

సౌందర్యవంతమైన అని అర్థం. అందమైన కేశవుని విష్ణుమూర్తిగా భావించి అన్నమయ్య కీర్తించాడు. అన్నమయ్య కంటే ముందు ఆంధ్రదేశంలో వీరవైష్ణవ తత్త్వాన్ని సూచించే దేవతామూర్తిగా చెన్నకేశవుడు ప్రజల పూజలందుకుంటున్నాడు. 12వ శతాబ్దంలో పల్నాటి యుద్ధం జరిగిన తీరును తర్వాత శ్రీనాథ మహాకవి గ్రంథస్థం చేశాడు. అన్నమయ్య తొలినాడు అద్వైతి అయినా మలినాడు విశిష్టాద్వైతి. అందుకే చెన్నకేశవుని వేంకటేశ్వరునిగా భావిస్తూ వందల కీర్తనలు చెప్పాడు. చెన్నకేశవుడు ఏ క్షేత్ర దేవతామూర్తి అని ప్రశ్నించకుంటే ఆయన వైకుంఠవాసి. అయితే శ్రీ మహావిష్ణువు రూపమైన చెన్నకేశవుడు ఆంధ్రదేశంలో అనేక క్షేత్రాల్లో వెలసి ఉన్నాడు. అన్నమయ్య అనేక క్షేత్రాల్లోని చెన్నకేశవుని దర్శించి స్తుతించాడు. నల్లబల్లిలో వెలసిన చెన్నకేశవుని దర్శించిన అన్నమయ్య-

"నల్లఁబల్లి చెన్నుఁడు నాపాలిటి వెన్నుఁడు
యెల్ల జీవులకు మరి యిన్నిటాఁ బ్రసన్నుఁడు

కమలావరుడు శ్రీకర మదనగురుఁడు
సమరదానవకులసంహారుఁడు
విమలగుణాకరుఁడు విజయచక్రధరుఁడు
కమనియ్యభక్తజనకరుణాకరుఁడు

వేదాంతవేద్యుఁడు విశ్వహితాపాద్యుఁడు
ఆదియునంత్యములేని యనవద్యుఁడు
సాదితయోగిహృద్యుఁడు శమితోగ్రచైద్యుఁడు
సోదించి చూచితేను సురులకు నాద్యుఁడు

కామితఫలశక్తుఁడు ఘనమహిమయుక్తుఁడు
ఆముకొన్న లోకరక్షణసక్తుఁడు
నేమాన శ్రీవేంకటాద్రి నిలిచి మమ్మేలినాఁడు
కోమలుఁడు వీఁడిగో గోపికాస(ను?)రక్తుఁడు" (4-168)

అని, యోగి హృదయాలలో ఉండే వేదాంత వేద్యుని శోధిస్తే దేవతలకే ఆద్యుడైన కేశవుడు దర్శనమిస్తాడని వివరించాడు. ఆయన చెన్నకేశవుని ఆరాధించడమే కాదు, భక్తితో కేశవుని ఆరాధించినట్లయితే సమస్త జీవులను రక్షిస్తాడని వివరించాడు. ఈ ఆరాధనా క్రమంలో అన్నమయ్య పాలకొండకోనచెన్నరాయుని, గండికోట చెన్నకేశవుని, పొట్లదుర్తి చెన్నుడిని, వత్తలూరి చెన్నకేశవునీ, పాలగిరి చెన్నకేశవమూర్తినీ దర్శించి మనసారా స్తుతించాడు. వెలుగోడులోని లక్ష్మీ చెన్నకేశవమూర్తిని దర్శించిన అన్నమయ్య కృష్ణునిగా, వేంకటేశ్వరునిగా భావించి ఆ దేవుని కుంకుమాంక వక్షునిగా ఎలా కీర్తించాడో చూడొచ్చు.

"కేవల కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా

కింకర బ్రహ్మాదిగణకేశవ నా -
మాంకిత శ్రీ వేంకటాద్రి కేశవ
కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ -
శంకాహరణ నమో జగదేక కేశవా" (4-391)

దివ్యదేహ విరాజితుడైన, బ్రహ్మాది దేవతలు కింకరులుగా సేవిస్తున్న చెన్నకేశవుని హృదయానందకరునిగా కీర్తించాడు.

## గోవిందరాజస్వామి

అన్నమయ్య తిరుమలలోని శ్రీనివాసునే కాదు తిరుపతిలోని గోవిందరాజస్వామిని కూడా దేవతా మూర్తిగా కీర్తించాడు.

అన్నమయ్య స్తుతించిన గోవిందరాజులు విభిన్నమైన మూర్తి. ఈయన శేషశయనుని పోలిన అర్చామూర్తి. జానపదుల పురాగాధ ప్రకారం వేంకటేశ్వరుని వివాహం కోసం కుబేరుని వద్ద తీసుకున్న అప్పును చెల్లిస్తూ ఆ డబ్బు కొలిచి అలసిపోయి కుంచాన్ని తలగడగా చేసుకొని విశ్రాంతి తీసుకొంటున్న మూర్తే తిరుపతి గోవిందరాజస్వామి. శయనమూర్తిగా

ఉన్న గోవిందరాజస్వామి శ్రీరంగనాథుని తలపిస్తాడు. పాదాలవద్ద శ్రీదేవి, భూదేవి విగ్రహాలున్న స్వామిని అన్నమయ్య ఎన్నో కీర్తనల్లో స్తుతించాడు. ఆయనకు జరిగే ఉత్సవాల్ని కీర్తించాడు. ఆ దివ్యమంగళమూర్తిని కళ్ళకు కట్టినట్టు ఎలా కీర్తించాడో చూడండి.

"కన్నుల పండుగలాయ కమ్మి సేవించేవారికి
సన్నల నీ దాసులము సంతసించేము

పడతులిద్దరు నీ పాదములొత్తగాను
కొడుకు బ్రహ్మదేవుడు కొలువగాను
కడుపులో లోకములు కడుజయవెట్టగాను
గుడిలోనె నీ బ్రతుకు గోవిందరాజా"

అన్నమయ్య గోవిందరాజు, శ్రీనివాసుడు వేరువేరు కాదు, ఇద్దరూ ఒకటే. అయితే రూపాలు వేరు. వెలసిన ప్రాంతాలు వేరు.

## విఠలుడు

విఠలనాథుడంటే మహారాష్ట్రలోని చంద్రభాగ నదీతీరాన పండరి పురంలో వెలసిన పాండురంగ విఠలుడు. విజయనగర రాజుల కాలం నుండి విఠలనాథుని పూజించే ఆచారం ఆంధ్రదేశంలో కనపడు తుంది. తుకారాం వంటి ఆధ్యాత్మిక భక్తులు విఠలుని విష్ణుమూర్తిగా కీర్తించారు. అన్నమయ్య విజయనగరాన్ని దర్శించినపుడు అక్కడ ప్రజల్లో విఠలారాధనా తత్పరతను గమనించాడు. దక్షిణాది వైష్ణవులకు విఠలనాథుడు శ్రీరంగనాథుడంత ప్రధాన దైవం కాకపోయినా అన్నమయ్య వైష్ణవతత్త్వ విస్తృతికి విఠలుని స్తుతించాడని ఆచార్య కె. సర్వోత్తమరావు గారంటారు. అన్నమయ్య విఠలుని కీర్తించడమే కాదు శ్రీకృష్ణునికి, వేంకటేశ్వరునికి, విఠలునికి అభేదం చెప్తూ ఎన్నో కీర్తనలు చెప్పాడు.

"వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టవచ్చు విఠలేశ్వరా

పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాలవయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయ లెల్లా యివె విఠలేశ్వరా

బల్లిదపు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా" (4-171)

ఇలాంటి కీర్తనలవల్ల ఆంధ్రదేశంలో పాండురంగ విఠలునికి ఆదరణే లభించింది. చాలా ప్రాంతాల్లో పండరినాథునికి ఆలయాలు వెలశాయి. హంపిలో విఠలనాథునికి గొప్ప ఆలయం కట్టించడం మనకు తెలిసిందే.

## జగన్నాథుడు

అన్నమయ్య కాలం నాటికి ఆంధ్రదేశంలో జగన్నాథస్వామి ఆరాధన బాగా పెరిగింది. అప్పటికే ఒరిస్సా ప్రాంతం నుండి గజపతుల ప్రభావం ఆంధ్రదేశంపై పడింది. పూరీక్షేత్రంలో వెలసిన దేవుడు విష్ణువు అవతారమైన జగన్నాథుడు. సృష్టి, స్థితి, లయ కారకుల్లో స్థితికర్త అయిన జగన్నాథుని అన్నమయ్య ప్రస్తావనా మాత్రంగా కీర్తనల్లో స్తుతించాడు. ఒకకీర్తనలో పూర్తిగా జగన్నాథుని స్తుతించకున్నా అనేక కీర్తనల్లో జగన్నాథుని స్తుతి కన్పిస్తుంది.

"దేవ జగన్నాథయంటే తెగని జన్మములేవి
కైవశము నా మనసు గాదు గాక" (1-407)

అలాగే జగన్నాథాలయంలో బలరామ, సుభద్రా సమేతుడైన జగన్నాథుని అన్నమయ్య -

"త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ -
జలధివిహార కుంజరవరద

సులభ సుభద్రాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా"　　　　(1-323)

అని కీర్తించాడు.

## 3. స్త్రీ దేవతామూర్తులు

అన్నమయ్య పురుష దేవతామూర్తుల్నే కాకుండా జగన్మాతలైన స్త్రీ దేవతా మూర్తుల్ని కూడా అనేక కీర్తనల్లో స్తుతించాడు. వాక్కు, అర్థంవలె కలసిన పార్వతీ పరమేశ్వరులను కాళిదాసు స్తుతించినట్లే పురుష దేవతామూర్తులకు సహధర్మచారిణులైన స్త్రీ దేవతామూర్తులైన అలమేల్మంగ, గోదాదేవి, లక్ష్మీదేవి, సీతాదేవి మొదలైన స్త్రీ దేవతా మూర్తుల్ని అన్నమయ్య కీర్తించాడు.

### అలమేల్మంగ

అన్నమయ్య స్తుతించిన స్త్రీదేవతామూర్తల్లో మొదట చెప్పుకోవలసింది అలమేలు మంగనే. అన్నమయ్య పద్మావతి అనేపేరు కంటే వైష్ణవ సంబంధమైన "అలమేల్మంగ" పేరునే ఎక్కువగా ప్రస్తావించాడు. 'అలమేల్మంగ' అంటే "పద్మం మీద అందమైన స్త్రీ" అని అర్థం. తిరుమలలో అమ్మవారికి ప్రత్యేక ఆలయం లేకున్నా తిరుచానూరు, శ్రీనివాస మంగాపురాల్లో ప్రత్యేక ఆలయాలున్నాయి. వేంకటేశ్వరుడు మెచ్చుకొనే విధంగా ఎలా ఆటపాటలతో నాట్యం చేసిందో అన్నమయ్య వర్ణించాడు.

"అలరులు గురియఁగ నాడెనదే
　అలకలఁ గులుకుల నలమేల్ మంగ

అరవిరి సొబగుల నతివలు మెచ్చఁగ
　అరతెర మరఁగున నాడెనదే
　వరుస పూర్వదువాళపు తిరుపుల
　హరిఁగరఁగింపుచు నలమేల్ మంగ

మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టిడి నడపుల దాఁటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిట్టు చిమ్ముచు నలమేల్ మంగ

చిందుల పాటల శిరి పొలయాటల
అందెల మోఁతల నాడెనదే
కందువ తిరువేంకటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల నలమేల్ మంగ" (5-24)

అంతేకాదు, అన్నమయ్య పెండ్లికూతురైన అలమేల్మంగ సిగ్గు మొగ్గల్ని "పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు" అనే కీర్తనలో ముగ్ధ మనోహరంగా వర్ణించాడు. వేంకటేశ్వర సమేత అలమేల్మంగను

"కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని"

అంటూ తరంగ డోలికల్లాంటి కీర్తనల్లో కీర్తించాడు.

## గోదాదేవి

ఈ అమ్మవారినే 'ఆండాళమ్మ' అనీ తమిళంలో "చూడి కొడుత్త నాచ్చియార్" అనీ పిలుస్తారు. ఆళ్వారుల్లో ప్రసిద్ధుడైన పెరియాళ్వార్ పెంపుడు కూతురైన గోదాదేవి శ్రీరంగ నాథుని వరించి వివాహం చేసుకొన్న కథ మనకు తెలిసిందే. గోదాదేవి తాను ధరించిన దండను దేవునికి సమర్పించిన తీరుని అన్నమయ్య శ్రీకృష్ణదేవరాయల కంటే ముందు తన కీర్తనలో ఇలా చెప్పాడు.

"పెరియాళువారి పిసికిపై వేసిన
విరులదండలు మెడవేసినవాడు"

శ్రీరంగంలో గోదాదేవి గొప్పగా పూజలందుకొంటుంది. మహాలక్ష్మి గోదాదేవి, వేంకటేశ్వరుడే శ్రీరంగనాథుడని భావించిన అన్నమయ్య వారి వివాహాన్ని చక్కగా వర్ణించాడు.

"చూడరమ్మ సతులాల సోబానఁ బాడరమ్మ
కూడున్నది పతిఁ జూడికుడతనాచారి

శ్రీమహాలక్ష్మియట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కఁదనాల కేమరుదు
సోముని తోఁబుట్టువట సొంపుగళల కేమరుదు
కోమలాంగి యీ చూడికుడుత నాచారి

కలశాబ్ధి కూఁతురట గంభీరాల కేమరుదు
తలఁప లోకమాతయట దయ మరి యేమరుదు
జలజ నివాసియట చల్లఁదనమేమరుదు
కొలదిమీర యీ చూడికుడుతనాచారి

అమరవందితయట అట్టె మహిమేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీవేంకటేశు ఁదానె వచ్చి పెండ్లాడె
కొమెరవయసు చూడికుడుతనాచారి." (26-246)

ఇలా ఆమెకు ఏదీ కొదవలేదని విపులంగా కీర్తించాడు అన్నమయ్య.

## లక్ష్మీదేవి

శ్రీమహావిష్ణువు ఎదపై కొలువుండే లక్ష్మీదేవి జగన్మాత. అమ్మలగన్న అమ్మ. పాల సముద్రం నుండి ఉద్భవించిన సౌందర్యరాశి. అన్నమయ్య శ్రీమహావిష్ణువును పెండ్లాడిన లక్ష్మీదేవిని ఒక విశిష్ట దేవతా మూర్తిగా కీర్తించాడు. ఆమె విలాసాన్ని, విభవాన్ని, ప్రపంచాన్ని 'ధనం మూలమిదం జగత్' అని ఆడించే తీరును అన్నమయ్య ఇలా వర్ణించాడు.

"రూకలై మాడలై రువ్వలై తిరిగీని
దాకొని వున్న చోటఁదా నుండ దదివో

వొకరి రాజుఁజేసు నొకరి బంటుగఁ జేసు
వొకరి కన్నెకల వేరొకరికినమ్మించు

వొకచోట నున్న ధాన్యమొకచోట వేయించు
ప్రకటించి కనకమే భ్రమయించీ జగము

కొందరిజాళెలు నిండు కొందరికి సొమ్ములవు
కొందరి పుణ్యులఁజేసుఁ కొందరి పాపులఁజేసు
కొందరి కొందరిలోన కొట్లాట వెట్టించు
పందెమాడినటువలెఁ బంచరించు పసిఁడీ

నిగనిగమనుచుండు నిక్షేపమై యుండు
తగిలి శ్రీవేంకటేశుతరుణియై తానుండు
తెగనిమాయై యుండు దిక్కు దెసయై యుండు
నగుతా మాపాల నుండి నటియిం ఁచు బసిఁడీ" (1-458)

లక్ష్మీదేవి అసలు తత్త్వాన్ని అన్నమయ్య సహజసిద్ధంగా స్తుతించాడు.

## సీతాదేవి

సుగుణానికి, సహనానికి నిలువెత్తు సాక్షి సీతాదేవి. భూదేవి బిడ్డగా అంతటి ఓర్పును కల్గిన ఆదర్శ శిరోమణి. లక్ష్మీదేవి త్రేతాయుగంలో సీతాదేవిగా అవతరించింది. రాముడు శివధనుస్సు సంధించడంతో ఆయన సహధర్మచారిణి అయింది. అన్నమయ్య రాముని కీర్తిస్తూ వందల సంకీర్తనలు చెప్పే క్రమంలో సీతాదేవిని కూడా ఎన్నోచోట్ల స్తుతించాడు. సీతారామ కల్యాణ సమయంలో పెండ్లికూతురైన సీతాదేవిని ఎంత ముగ్ధ మనోహరంగా వర్ణించాడో చూడండి.

"సిగ్గరి పెండ్లికూఁతుర సీతమ్మ
దగ్గరి సింగారబొమ్మ తలవంచకమ్మా

అల్లనాడే రాఘవుడు హరివిల్లు విరిచెను
యెల్లి నేఁడే పెండ్లాడీ నిదివో నిన్ను
యెల్లగా జనకుఁడు నిన్నిచ్చీనట వీఁడె
వెల్లవిరి నీ మాట వినవమ్మా

అదె పెండ్లితెర యెత్తిరండనే వశిష్ఠుఁ డుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా
మొదల రామునికంటె ముంచి తలబాలు వోసి
సుదతి యాతని మోము చూడవమ్మా

కంకణదారాలు గట్టి కాలుదొక్కితివి మీరు
పొంకాన బువ్వ మందరో పొత్తుల నమ్మ
వుంకువ వావిలిపాట నుండి శ్రీవేంకటగిరి
తెంకుల నిన్నుఁగూడి తిరమాయనమ్మా " ( 26-40)

పెండ్లి ముచ్చటనంతా ఒకే కీర్తనలో ఇమిడ్చిన అన్నమయ్య సీతాదేవి పడిన కష్టాన్ని కూడా విడవలేదు. రామాయణ కథను చెప్పే చాలా కీర్తనల్లో సీతను ప్రస్తుతించాడు.

అన్నమయ్య దశావతార దేవతామూర్తుల్ని, స్త్రీదేవతా మూర్తుల్ని కీర్తించినా ఆయన మనసులో కొలువైంది ఒకే ఒక దేవతామూర్తి. ఆయన వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసుడు. ఆయనే భక్తుల హృదయాంతరాళాల్లో అంతరాత్మ అయిన శ్రీహరి. ఆ మహిమాన్వితుని 32వేల సంకీర్తనల్లో కీర్తించిన అన్నమయ్య దివ్యస్వరూపుడు. ఎందుకంటే ఏ వాగ్గేయకారుడు చెప్పనన్ని కీర్తనలు చెప్పాడు. ఏ పదకర్తా దర్శించనన్ని దివ్యక్షేత్రాల్ని దర్శించాడు. దేవతామూర్తుల్ని స్తుతించాడు. వైష్ణవ క్షేత్రాలంటే 108 దివ్య తిరుపతులు మాత్రమే కాదు హరినామ స్మరణ చేసిన ప్రతి క్షేత్రం పవిత్రమైనదని తన కీర్తనల ద్వారా చాటిన ఆచరణ వాది అన్నమయ్య. రాజుల పొగడ్తలకు లొంగకుండా విశిష్టాద్వైత ప్రచారం కోసం శ్రీమహావిష్ణువు ఆరాధన కొరకు పదకవితాధారలను వినియోగించిన ధన్యజీవి అన్నమయ్య. తాను దర్శించిన క్షేత్రాల్లోని దేవతామూర్తుల మాహాత్మ్యాన్ని కీర్తనల ద్వారా సామాన్య భక్తులకు బోధిస్తూ, ఆ దేవతామూర్తుల వైపు ప్రజల దృష్టిని మళ్ళించేందుకు రాగాలాపన చేసిన అన్నమయ్య అన్నియుగాలకు వారధి. తెలుగు సంకీర్తనలకు వార్ధి.

## ఆధార గ్రంథాలు

1. తాళ్లపాక పదసాహిత్యము - 29 సంపుటాలు : అన్నమాచార్య ప్రాజెక్టు, తి.తి.దే.
2. అన్నమయ్య సంకీర్తనల్లో తెలుగునాడు - కె.శివప్ప
3. అన్నమయ్య సంకీర్తనల్లో ఉత్సవవిశేషాలు - ఆచార్య సి. గోవిందరాజు
4. అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ - డా॥ ఉషారాణి
5. అన్నమయ్య రామావతార సంకీర్తనలు - డా॥కానాల నలచక్రవర్తి
6. అన్నమయ్య సంకీర్తనల్లో అలంకారాలు - డా॥కేసర్లవాణి (అముద్రిత సిద్ధాంత గ్రంథం)

★ ★ ★

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

# అన్నమయ్య ప్రాపంచిక దృక్పథం

"రచయిత దృక్పథమే రచనలకు ఐక్యత నిస్తుంది".

(రాల్ఫ్ ఫాక్స్ : నవల - ప్రజలు, పు - 90)

"కళాకారుడు కళాత్మక విలువల్ని ఉత్పత్తి చేస్తూ, అదే సమయంలో భావజాల విలువల్ని కూడా ఉత్పత్తి చేస్తాడు."

(యు.ఎ.లునిన్: భావజాలం - కళ)

సాహిత్యం సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. ప్రతిబింబం యథాతథంగా కాదు, విమర్శనాత్మకంగా, కళాత్మకంగా. రచయితలు రచనకు జీవితంలోంచే వస్తువు నెన్ను కుంటారు. జీవితంలోంచి ఎన్నుకున్న వస్తువును యథాతథంగా రచనలో ప్రదర్శించరు. తమకు కనిపించిన జీవితాన్ని, తమకు లభించిన వస్తువును, తమకు తోచిన విధంగా, తమకు అర్థమైన విధంగా, తాము అర్థంచేసుకున్న విధంగా చిత్రిస్తారు.

రచయితలు ఒక జీవితాంశాన్ని వస్తువుగా ఎన్నకోవడానికి, ఎన్నుకొన్న వస్తువును అర్థం చేసుకోవడానికి, దానిని విమర్శనాత్మకంగా, కళాత్మకంగా రచనలో ప్రతిఫలించడానికి దోహదంచేసేది రచయితల ప్రాపంచిక దృక్పథమే.

సమాజంలోని జీవితవాస్తవం జీవితవాస్తవికతగా మారడానికి, ప్రాపంచికదృక్పథం ఆధారం. సమాజంలో ఉండే జీవితవాస్తవాలు రచయిత ప్రాపంచిక దృక్పథం ద్వారా విమర్శకుగురై వాస్తవికతగా మారి, రచనగా రూపొందుతాయి. అందువల్ల ప్రాపంచిక దృక్పథం రచయితలకు కళాకారులకు దివిటీ వంటిది. రచయితలకు పాఠకులకు మధ్య అనుసంధాన

కర్త ప్రాపంచిక దృక్పథం. ఎవరైనా రచయితలు కళాకారులు తమకు ఏ దృక్పథమూ లేదు, ఏ భావజాలమూ లేదు అని అన్నారంటే వాళ్ళు అమాయకులైనా అయ్యుంటారు. లేదా మోసగాళ్ళైనా అయ్యుంటారు. ఏ ప్రాపంచిక దృక్పథమూ లేకుండా రచయితలు, కళాకారులు ఎవరూ ఏమీ సృష్టించ లేరు, సృష్టించరు. సాహిత్యం, కళలు గాలిలోంచి పుట్టవు, ప్రాపంచిక దృక్పథంలోంచే పుడతాయి.

## ప్రాపంచిక దృక్పథం అంటే ఏమిటి?

ప్రపంచాన్ని గురించిన దృక్పథమే ప్రాపంచిక దృక్పథం.

మనం నివసించే ప్రకృతి, ఈ ప్రపంచం, ఈ మానవ సమాజం - వీటికి మూలం ఏది? అనే ప్రశ్నకు సమాధానమే ప్రాపంచిక దృక్పథం. ఈ సృష్టి ఎలా ఏర్పడింది? ఈ ప్రకృతి ఎలా ఆవిర్భవించింది? ఈ మనిషి పుట్టుక ఎలా జరిగింది? ఈ మానవ సమాజం ఎలా రూపు దిద్దుకుంది? ఇది ఇప్పుడున్నట్లు ఎందుకుంది? ఈ సమాజం ఎలా ఉండాలి? మొదలైన ప్రశ్నలకు మనం చెప్పే సమాధానమే మన ప్రాపంచిక దృక్పథం.

పదార్థం, చైతన్యం - ఈ రెండింటిలో ఏది ముందు, ఏది వెనుక? ప్రకృతి, ఆత్మ - ఈ రెండింటిలో ఏది ముందు, ఏది వెనుక? దేవుడు తన రూపంలో మనిషిని సృష్టించాడా? మానవుడు తన రూపంలో భగవంతుని సృష్టించాడా? మొదలైన ప్రశ్నలకు సమాధానమే ప్రాపంచిక దృక్పథం.

## రెండు సమాధానాలు

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి అతి ప్రాచీనకాలం నుంచీ తత్త్వవేత్తలు, శాస్త్రకారులు ప్రయత్నించారు. ప్రయత్నిస్తున్నారు. అనేకులు అనేక రకాలుగా సమాధానాలు చెప్పారు. అవన్నీ రెండు రకాల సమాధానాలు. అవి పరస్పర విరుద్ధ సమాధానాలు.

| పరమాత్మవాదం | పరమాణువాదం/ పరిణామవాదం |
|---|---|
| సృష్టిని భగవంతుడు సృష్టించాడు. | ప్రపంచం నిరంతరాయంగా ఉంది. |
| ఆత్మ ప్రాథమికం, ప్రకృతితర్వాత. | ప్రకృతి అలా ఉంది. ఆత్మలేదు. |
| చైతన్యం ముందు, పదార్థం తర్వాత. | పదార్థం ముందు, చైతన్యం తర్వాత |
| సృష్టి పరమాత్మ సంకల్పం. | సృష్టి పరమాణు సంకల్పం. |
| దేవుడు మనిషిని తనరూపంలో సృష్టించాడు. | మనిషే దేవుని తనరూపంలో సృష్టించాడు |
| భగవంతుడే చరిత్ర నిర్మాత | మనిషే చరిత్ర నిర్మాత |
| మనిషి విధిచేతిలో కీలుబొమ్మ. | మనిషి మనిషి చేతిలోనే బందీ. |
| భగవంతుడు సూత్రధారి, మనిషి పాత్రధారి. | సూత్రధారి, పాత్రధారి అన్నీ మనిషే. |
| కర్మ పునర్జన్మ ఉన్నాయి. | ఒక్క జన్మే సత్యం. |
| అంతామిథ్య | కనిపించేది అంతా సత్యం |

## భావవాదం - భౌతికవాదం

మొదటివాదాన్ని భావవాదం అంటారు. రెండవ వాదాన్ని భౌతిక వాదం అంటారు. మొదటివాదానికి మతగ్రంథాలు, ప్రాచీన సాహిత్యం ఆధారం. రెండవవాదానికి ఆధునిక వైజ్ఞానిక శాస్త్రాలు ప్రమాణం. భావవాదం ఉన్నది అని భావించిన వాదం. భౌతికవాదం వాస్తవంగా ఉన్నది అని భావించినవాదం.

భావ వాదానికి పునాది విశ్వాసం
భౌతిక వాదానికి పునాది ప్రశ్న

## వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం - రచయితల ప్రాపంచిక దృక్పథాలు

తెలుగు వాళ్ళకు వెయ్యేళ్ళకుమించిన లిఖిత సాహిత్య చరిత్ర ఉంది. నన్నయ్య నుంచే లెక్కవేసుకున్నా ప్రాచీన సాహిత్యానికి 850 సం॥ల

చరిత్ర ఉంది. ఆధునిక సాహిత్యానికి 150 సం॥ల చరిత్ర ఉంది. ప్రాచీన కవులంతా దాదాపు భావవాద ప్రాపంచిక దృక్పథం గలవారే. వేమన వంటి ఒకరిద్దరు కొంత మినహాయింపుతో భౌతికవాదులు. ఆధునిక రచయితలలో సగానికి సగం భావవాదులే. మరోసగం మంది భౌతికవాద ప్రాపంచిక దృక్పథం గలవారు.

ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండులీనమై
యెవ్వని యెందుడిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్

అన్న పోతనది భావవాద ప్రాపంచిక దృక్పథం.

భూమిలోన బుట్టు భూసార మెల్లను
తనువులోన బుట్టు తత్త్వ మెల్ల
శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను
విశ్వదాభిరామ వినురవేమ

అన్న వేమనది భౌతికవాద ప్రాపంచిక దృక్పథం.

"అంతా మిథ్య తలంచి చూచినన్" అన్న ధూర్జటిది భావవాద ప్రాపంచిక దృక్పథం.

"మాయంటావా అంతా మిథ్యంటావా? " అన్న శ్రీశ్రీది భౌతికవాద ప్రాపంచిక దృక్పథం.

"ఇట్టి మహాభారతంబు ననేక విధపదార్థ ప్రపంచ సంచితంబు, నుపపర్వ మహాపర్వోప పర్వసంచితంబు, నుపద్వీప మహాద్వీప సంభృతం బయిన భువనంబజుండు నిర్మించినట్లు, కృష్ణద్వైపాయ నుండు నిర్మించె" అన్న నన్నయది భావవాద ప్రాపంచిక దృక్పథం.

"ఎవరడిగినారు నిన్నీ యవకతవక సృష్టి సేయమని?" అన్న జామువాది భౌతికవాద ప్రాపంచిక దృక్పథం.

## ప్రాచీన తెలుగు కవులు - రెండురకాలు

ప్రాచీన తెలుగు కవులందరు తాత్త్వికంగా భావవాదులే. అయినా వాళ్ళు రెండు రకాల వాళ్ళు. 1. ఆస్థానకవులు, 2. ఆస్థానేతర కవులు. రాజుల ఆస్థానాలలో ఉంటూ, రాజులు కోరిన విధంగా, రాజులు మెచ్చే విధంగా కావ్యాలు రాసి, వాళ్ళకో, వాళ్ళకిష్టమైన వాళ్ళకో వాటిని అంకితం చేసి, వాళ్ళ పోషణలో బతికే వాళ్ళు ఆస్థానకవులు. రాజుల్ని ధిక్కరించి, భగవంతుని నమ్ముకుని, రచనలుచేసే వాళ్ళు ఆస్థానేతర కవులు.

తాత్త్వికంగా ఇద్దరూ భావవాదులే అయినా, వాళ్ళ సామాజికావగాహనలో సామాజిక స్వప్నంలో తేడాలుంటాయి.

| ఆస్థానసాహిత్యం | ఆస్థానేతర సాహిత్యం |
|---|---|
| దేవుడు + రాజు + ప్రజ | దేవుడు + ప్రజ |
| రాజును కీర్తిస్తుంది | రాజును ధిక్కరిస్తుంది |
| వర్ణవ్యవస్థను సమర్థిస్తుంది | వర్ణవివక్షను ధిక్కరిస్తుంది |
| అసమానతలను, వివక్షలను సమర్థిస్తుంది | వీటిని విమర్శిస్తుంది |
| మనుషుల్ని విభజిస్తుంది. | మనుషుల్ని కలుపుతుంది. |
| అనువాద సాహిత్యం | మౌలిక సాహిత్యం |
| యథాతథవాదులు | సంస్కరణవాదులు |

## తాళ్లపాక అన్నమాచార్యుడు

అన్నమయ్య అందరు ప్రాచీనకవులలాగా భావవాద ప్రాపంచిక దృక్పథంగల కవే. పాల్కురికిసోమన తర్వాత పేర్కొనదగిన గొప్ప ఆస్థానేతరకవి. పాల్కురికి సోమన శివుని నమ్మినకవి కాగా, అన్నమయ్య విష్ణువును, ఆయన మూర్తి అయిన వెంకటేశ్వరుని నమ్మినకవి.

## అన్నమయ్యది భావవాద ప్రాపంచిక దృక్పథమే

"పుట్టించి నాడవు నీవు - పుట్టిన వాడను నేను"

"కుమ్మరి వాడు లేకే కుండ దాబుట్టేనా
నెమ్మి నీవు పుట్టించక నేనే పుట్టితినా "

"ఎవ్వరు గర్తలు కారు ఇందిరా నాథుడే కర్త"

"వైష్ణవులు గాని వారలెర్వ్వరు లేరు
విష్ణు ప్రభావ మీ విశ్వమంతయు గాన"

"విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు
వైష్ణవమే సర్వంబును"

"ఉపకారి దేవుడు అపకారి కాదు"

"ఎండగాని నీడగాని యేమైన గాని
కొండలరాయుడే మాకుల దైవము"

"ఆతని మూలమే జగమంతానిది"

శరణాగతి కవిగా అన్నమయ్యను నిరూపించే ఈ వాక్యాలన్నీ అన్నమయ్యలోని భావవాదానికి నిదర్శనాలు, విష్ణువును అన్నిటికీ మూలంగా భావించడం అన్నమయ్య సాహిత్యసారం.

## భావవాదాదర్శ సంస్కరణ దృక్పథం

ఆస్థానేతర కవులంతా తాత్త్వికంగా భావవాదులైనా సామాజికంగా సంస్కరణ వాదులు.

అన్నమయ్య వెంకటేశ్వరస్వామి భక్తుడు. ఆయన మీద 32,000 పదాలు చెప్పాడు. శృంగారమైనా, ఆధ్యాత్మికత అయినా ఆయన చుట్టు తిప్పాడు. అన్నమయ్య గొప్ప నిబద్ధ కవి. ఆస్థానకవులు కీర్తించిన రాజరికాన్ని అన్నమయ్య ధిక్కరించాడు. ఆస్థానకవులు కీర్తించిన కులవ్యవస్థను

అన్నమయ్య విమర్శించాడు. మనువాదం భారతీయ సమాజాన్ని కుల సమాజంగా స్థిరీకరించిన ఫలితంగా అది భ్రష్టుపట్టిపోయిన దశలో విదేశీ పాలకులు భారతదేశంలో స్థిరపడి వాళ్ళమతాలకు అనుగుణంగా భారతదేశ ప్రజల్ని మలుచుకుంటున్న నేపథ్యంలో రాజులు నిరంకుశులై ప్రజల్ని పట్టించు కోవడం కరువౌతున్న సమయంలో జనం కుల ప్రాతిపదికన, దైవారాధన ప్రాతిపదికన చీలిపోయి జాతి నిర్వీర్యమౌతున్న సందర్భంలో అన్నమయ్య పదసాహిత్యంతో మన సమాజాన్ని సంస్కరించడానికి ప్రయత్నించాడు. ఏ దేవుని పేరు చెప్పి ఆస్థాన కవులు వర్ణవ్యవస్థను స్థిరం చేయడానికి ప్రయత్నంచారో, ఆ దేవుని మీది భక్తితోనే అన్నమయ్య కుల వ్యవస్థలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. దేవుడు మంత్రాలకు, బ్రహ్మణులకు అధీనుడనే వాదాన్ని తిరస్కరించి దేవుడు ప్రజాధీనుడని అని ప్రచారం చేశాడు. దేవునికి అల్ప సంఖ్యాకుల చెరనుంచి విముక్తి కలిగించి అధిక సంఖ్యాకుల పరం చేయడానికి ప్రయత్నించాడు.

దేవుడు ఒక సామాజిక అంశం అయినప్పుడు, ఆ దేవుని విశ్వసించే హక్కు మాత్రమే కాదు ఆ దేవుని ఆరాధించే హక్కు కూడా అందరికీ ఉందన్నాడు. వెంకటేశ్వరునికి భక్తులు కావడానికి కులం అడ్డు కాదని చెప్పాడు. వెంకటేశ్వరునికి భక్తులైన క్రింది కులాల వాళ్ళు, చెడిపోయిన పై కులాల వాళ్ళకన్నా గొప్ప వాళ్ళన్నాడు.

అన్నమయ్య 15 శ. నాటి సమస్యల కన్నిటికీ వెంకటేశ్వరస్వామి మీది భక్తి ఒక్కటే పరిష్కారమని చాటాడు. వెంకటేశ్వరుని సర్వరోగ నివారకుడిగా కీర్తించాడు. విష్ణుభక్తిని గొప్పమందుగా వర్ణించాడు. దేవుడున్నాడా లేదా అన్నది నేటి మన ప్రశ్న. అది అన్నమయ్యకు ప్రశ్న కాదు. ఆయన భగవంతుడున్నాడనుకున్నాడు. దేవుని సృష్టిలో ఆర్థిక అసమానత్వం, సాంఘికవివక్ష ఉండరాదన్నాడు. స్వార్థం ఉండకూడ దన్నాడు. దానినే ప్రచారం చేశాడు.

1910లో గురజాడ "దేశమును ప్రేమించుమన్నా" అని ఎందుకన వలసి వచ్చింది?

మనకు దేశభక్తిలేదు. గనక 15వ శ॥లో అన్నమయ్య "బ్రహ్మ మొక్కటే పరబ్రహ్మమొక్కటే " అని ఎందుకనవలసి వచ్చింది? అనవలసిన చారిత్రక అవసరం వచ్చింది గనుక. హిందూ సమాజంలో ముక్కోటి దేవతలు ప్రజల్ని చీలికలు చేసిన సమయంలో ఈ ముక్కోటి దేవతారాధన కులవ్యవస్థను పటిష్ఠంచేసి ప్రజల్ని కలవనీయకుండా చేస్తున్న సమయంలో అన్నమయ్య "బ్రహ్మమొక్కటే " అన్నాడు.

కులవ్యవస్థ వికృతరూపాన్ని సంతరించుకొని, నిరంకుశమై ప్రజల మధ్య సహజంగా ఉండవలసిన సంబంధాలు విచ్ఛిన్నమైపోయాయి. ప్రజలమధ్య సాంఘిక సంబంధాలే గాక ఆర్థిక సంబంధాలు కూడా విచ్ఛిన్నమై ధనిక పేద వైరుధ్యాలు పెరిగిపోయాయి. రాజుకు ప్రజలకు మధ్య ఉండవలసిన సంబంధాలు నిరంకుశ అధికారం కింద నలిగి పోయాయి. అందుకే అన్నమయ్య అనారోగ్య పరమైన ఆర్థిక సాంఘిక, రాజకీయాంశాలన్నిటినీ ఒక్కపదంలో మూట గట్టి ఉతికేశాడు.

తందనాన ఆహి - తందనానా పురె
    తందనానా భళా - తందనాన ॥పల్లవి॥

బ్రహ్మ మొక్కటే పర - బ్రహ్మ మొక్కటే పర
    బ్రహ్మ మొక్కటే పర - బ్రహ్మ మొక్కటే ॥తంద॥

కందువగు హీనాధికము లిందులేవు
    అందరికీ శ్రీహరే అంతరాత్మ
    ఇందులో జంతుకుల మింతా నొకటే
    అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తంద॥

నిండార రాజు నిద్రించు నిద్రయునొకటె
    అండనే బంటు నిద్ర అదియు నొకటె

మెండైన బ్రాహ్మణుడు మెట్ట భూమి యొకటే
చండాలు డుండేటి సరిభూమి యొకటే ॥తంద॥

అనుగు దేవతలకును అలకామ సుఖమొకటె
ఘన కీటక పశువులకు కామ సుఖమొకటె
దినమహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరు పేదకును అదియు నొక్కటే ॥తంద॥

కొరలి శిష్టాన్నములు గొను నాకలొకటే
తిరుగుదుష్టాన్నములు దినునాక లొకటే
పరగ దుర్గంధములపై వాయువు నొకటే
వరుస బరిమళముపై వాయువు నొకటే ॥తంద॥

కడిగి యేనుఁగు మీద కాయు నెండొకటే
పుడమి శునకము మీద పొలయు నెండొకటే
కడు పుణ్యులను పాపకర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరుని నామమొకటే ॥తంద॥

నేలకు, గాలికి, ఎండకు, కాలానికి, కామానికి, ఆకలికి, నిద్రకు లేని వైరుధ్యం, ఎక్కువ తక్కువ భేదం నేలమీద తిరిగే వాళ్ళకు, కాలంలో బతికే వాళ్ళకు, గాలిని పీల్చేవాళ్ళకు, ఎండను అనుభవించే వాళ్ళకు, కామాన్ని అనుభవించే వాళ్ళకు, ఆకలికి అన్నంతినే వాళ్ళకు, నిద్రపోయే వాళ్ళకు, ఎందుకు? అని ప్రశ్నించాడు అన్నమయ్య. అందుకే "అందరికీ హరే అంతరాత్మ " అన్నాడు. అందుకే "బ్రహ్మమొక్కటే " అన్నాడు. ఆబ్రహ్మ వెంకటేశ్వర స్వామి అన్నాడు.

"బ్రహ్మమనగ వేరె పరదేశమున లేదు
తన్నుదానెరిగిన దానె పో బ్రహ్మంబు " అన్నాడు

వేమన, 17వ శతాబ్దంలో.

అన్నమయ్య "మనసు నమ్మనేర్చితే మనుజుడే దేవుడేను
తనలోనే వున్నవాడు తావుకొని దైవము"అన్నాడు, 15వ శతాబ్దంలోనే.

"ఆతుమ సకల వ్యాపకమని తలపోసిన పిమ్మట
జాతియు కులాభిమానము జర్చింపనే రాదు"

"ఏ కులజుడేమి యెవ్వడైన నేమి
ఆకడ నాతడె హరి నెఱిగిన వాడు"

"తలమేల కులమేల తపమే కారణము
యెలమి హరిదాసులు యే జాతి వారైన నేమి"

"జాతి యిందే దంత జాతియిందేది
జాతులన్నిట నాత్మ సర్వేశ్వరుడు"

"కొంచెమును ఘనముంగను గొననేల హరిందలంచు
పంచ మహాపాతకుండె బ్రాహ్మణోత్తముండు
వేదములు చదివియును విముఖుడై హరికథల
నాదరింపని సోమయాజి కంటె
యేదియును లేని కులహీను డైనను విష్ణు
పాదసేవకుడువో బ్రాహ్మణోత్తముడు ॥

పరమమగు వేదాంతపఠన దొరికియు
సదా హరిందలంచ లేని సన్యాసి కంటె
మరగి పసురము దినెడి మాలవైనను వాడె
పరమాత్మ గొలిసినను బ్రాహ్మణోత్తముండు ॥"

ఇవన్నీ అప్పటి సామాజిక వైరుధ్యాలను తగ్గించడానికి అన్నమయ్య చేసిన ప్రబోధాలు. కులవ్యవస్థ సృష్టించిన సంఘర్షణలను తగ్గించడానికి అన్నమయ్య వెంకటేశ్వరభక్తిని ఏకైక సాధనంగా చేసుకొని కృషిచేశాడు. అగ్రవర్ణులను ఆధిక్యతా భావన నుంచి, కింది వర్ణులను ఆత్మన్యూనతా భావన నుంచి విముక్తి చెయ్యడానికి ప్రయత్నించాడు.

## రాజకీయ సంస్కారణ

అన్నమయ్య స్వతంత్రజీవి గనక రాచరికాన్ని తీవ్రంగా నిరసించాడు.

వెఱతు వెఱతు నిందు వేడుక పడ నిట్టి
  కుఱుచ బుద్ధుల నెట్టు గూడుదురయ్యా ॥

దేహమిచ్చిన వాని దివిరి చంపెడు వాడు
  ద్రోహిగాక నేడు దొరయట
  ఆహికముగ నిట్టి అధమ వృత్తికి నే
  సాహసమున నెట్టు చాలుదునయ్యా ॥

తోడ బుట్టిన వాని తొడరి చంపెడు వాడు
  చూడ దుష్టుడు గాక సుకృతియట
  పాడైన యిటువంటి పాప బుద్ధులు సేసి
  నీడ నిలువనెట్టు నేరుతునయ్యా
  కొడుకు నున్నత మతిగోరి చంపెడువాడు
  కడు బాతకుడు గాక ఘనుడట
  కడలేని యిటువంటి కలుష వృత్తికి నాత్మ
  వొడ బరపగ నెట్లోపుదునయ్యా ॥

తల్లి జంపెడి వాడు తలప దుష్టుడు గాక
  యెల్ల వారల కెల్లనెక్కుడట
  కల్లరియనుచు లోకము రోయు పని యిది
  చెల్లబో నేనేమి సేయుదునయ్యా ॥

యింటే వేలుపు వెంకటేశ్వరు దన వెంట
  వెంట దిప్పెడు వాడు విభుడట
  దంటనై యాతని దాసాను దాసినై
  వొంటి నుండెద నేమి నొల్లనోయయ్యా ॥

సాళువ నరసింగరాయలుతో అన్నమయ్యకు స్నేహముంది. అన్నమయ్య రచనా ప్రాశస్త్యాన్ని విన్నాడు రాజు. ఆయన్ని ఆహ్వానించాడు.

"సహజ వైష్ణవ భక్తి సలిపెడు వాని
సహవాసమైన దోసము లేదటంచు
నతడు పట్టించిన యందలంబెక్కి
యతడు భృత్యప్రాయుడై కొలిచి రాగా "

రాయల ఆస్థానానికి వెళ్ళాడు. వెంకన్నపై కీర్తనలు పాడాడు. రాజు ఆనందించి సన్మానించి పంపాడు. మరొకసారి ఆహ్వానించాడు. స్వామిపై పాడమన్నాడు.

"ఏమొకో చిగురుటధరమున" పాడాడు. తనపై పాడమన్నాడు. పాడలేనన్నాడు. రాజు కోపించి, బంధించాడు. స్వామిపై పాడాడు. సంకెళ్ళు తెగాయి. రాజు ఆశ్చర్య పోయాడు. ఇది చిన్నన్న చెప్పిన కథ.

మల్లికార్జునరాయలు (1446-1465) అసమర్థుడు కావడం వల్ల పిన తండ్రి కుమారుడు విరూపాక్షరాయలు మల్లికార్జునుని చంపి రాజయ్యాడు. విరూపాక్షుడు 1465 - 85 మధ్య పాలించాడు. ఇతడు దుశ్చరిత్రుడు, పాపకర్ముడని న్యూనిజ్ రాశాడు. మల్లికార్జుని చంపి స్వాధీన పరచుకున్న విశాలసామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. తండ్రి దుర్మార్గాలను భరించలేని పెద్దకొడుకు అతనిని చంపేశాడు. తమ్ముడు ప్రౌఢ రాయలను రాజును చేశాడు. తండ్రిని చంపిన వాడు తనను చంపడా అన్న అనుమానంతో ప్రౌఢరాయలు అన్నను చంపేశాడు. ప్రౌఢరాయలు కూడా మంచివాడు కాడు. సాళువ నరసనాయకుడు ప్రౌఢరాయలను చంపి రాజయ్యాడు.

ఇదంతా చూసి అన్నమయ్య పైపదం చెప్పాడు. చూచిన ఏ అకృత్యాన్నైనా అన్నమయ్య నిరసించకుండా వదల్లేదు. అధికారం కోసం, అందలం కోసం హత్యలకు వెనుకాడని రాజుల దుర్మార్గాలను సహించలేక పోయాడు అన్నమయ్య. పదాలనే ఆయుధాలుగా చేసుకొని ఖండించాడు.

## సంస్కరణాత్మక ప్రబోధాలు

నాటి సంఘాన్ని సంస్కరించడానికి అన్నమయ్య మొత్తవలసిన చోటమొత్తాడు. బుద్ధిచెప్పవలసిన చోట బుద్ధి చెప్పాడు. బుజ్జగించ వలసిన

చోట బుజ్జగించాడు. మనిషిలోని రాయితనాన్ని కరిగించే ప్రయత్నం చేశాడు. ఆయన సాహిత్యంలో పేరుకు వెంకటేశ్వరుడు నాయకుడు గాని, మొత్తం ప్రకృతిని, ప్రపంచాన్ని, మానవసమాజాన్ని నాయకుని చేశాడు.

"కోరికలుడుగక కోపంబు గాదు- కోరకుండదిక్కవ మనసు

క్రూరత్వమునకు కుదువ యీబ్రదుకు -పెరడి నేమిటి పెద్దలయ్య"

"ఆకటి వానికి నన్నమే బ్రహ్మము- లోకమే బ్రహ్మము లోలునికి"

"కులమెంత గలిగెనది కూడించు గర్వంబు
ధనమెంత గలిగెనది దట్టమౌ లోభంబు
ఘన విద్య గలిగినను కప్పు పైపై మదము
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు"

సమాజంలో కులం ధనం సృష్టిస్తున్న వైరుధ్యాలను గమనించాడు. అవి ఒక్కచోట పోగుపడడం మంచిది కాదని హెచ్చరించాడు.

"పరుల మనసునకు ఆపదలు కలుగజేయ
బరి తాప కరమైన బ్రదుకేలా
సొరిది నితరుల మేలు చూచి సైపగ లేక
తిరుగు చుండేటి కష్ట దేహమిది యేలా?"

ఈర్ష్య అసూయగ్రస్తులై సూటి పోటి మాటలతో, దుష్ప్రచారాలతో కాలం గడిపే వాళ్ళను ఇలా హెచ్చరించాడు. తిక్కనకు తర్వాత, వేమనకు ముందు అన్నమయ్య ఈ ప్రబోధం చేశాడు.

"తన్నుతానెఱిగిన వాడె పో బ్రహ్మంబు . . ."అని వేమన అనకముందే

"మానుషము గల ఫలము మంచి వాడౌట తను

దానె తెలిసిన ఫలము తత్వ పరుడౌట "అని అన్నాడు అన్నమయ్య. ఒక వ్యక్తిని మనిషిగా గుర్తించడానికి అతని మంచితనమే ఏకైక అర్హతగా గుర్తించాడు అన్నమయ్య.

"చెప్పుడు మాటలే చెప్పుగొనుట గాక
చెప్పినట్లు దాము సేయడెవ్వరును"

వేదాంతం చెప్పడమే గాని, ఆచరణశూన్యంగా నున్న జాతినుద్దేశించి అన్న మాట ఇది. జీర్ణంకాని వేదాంతాన్ని చిలక పలుకుల్ని పలికే పురోహిత వర్గానికి అన్నమయ్య పెట్టిన వాత ఇది.

"చేసుకున్న యిల్లాలు చేరువనే వుండగాను
వేసరక వెలయాలి వెదకినట్లు"

అంటూ పురుషుడి విశృంఖలత్వానికి అడ్డుకట్ట వేశాడు. వేమన కులస్త్రీ కీర్తనలో మూలాలు ఇందులో వున్నాయి.

"పాటెల్లనొక్కచో నుండు భాగ్యమొక్కచో నుండు
యీటు వెట్ట పెద్దతనాలెంచ బనిలేదు"

అంటూ ఆర్థిక అసమానతలను ఎత్తిచూపాడు. ఆర్థిక అసమానత్వం వల్ల కలిగే చెడును గుర్తుచేశాడు.

"అతి సంపదలు దేహిన జ్ఞాని సేయు"

"అన్నమదమున చిత్త మగపడదు"

"జంతురాసులకు నెల్లా జననము లొక్కటే

అంతటాను మరణములివి యొక్కటే" అని వ్యక్తి సంస్కారాన్ని ప్రబోధించాడు.

"మహినుద్యోగి గావలె మనుజుడైన వాడు

సహజివలె నుండేమి సాధింపలేడు" – అంటూ సోమరిపోతుల వీపుమీద చరిచాడు. సమాజం స్వార్థపూరితమై సంపద కూడబెట్టుకోవడమే జీవిత పరమావధిగా చలామణి అవుతున్న సమయంలో అన్నమయ్య నిరాడంబరమైన, స్వచ్ఛమైన జీవిత విధానాన్ని ప్రచారం చేశాడు.

అప్పులేని సంసార మైనపాటే జాలు
తప్పులేని జీతమొక్క తారమైన చాలు ॥పల్లవి॥

కంతలేని గుడిసొక్క - గంపంతయిన చాలు
చింతలేని యంబలొక్క - చేరెడే చాలు,
జంతలోని తరుణి యే - జాతైన నదే చాలు
వింతలేని సంపదొక్క - వీసమే చాలు ॥అప్పు॥

తిట్టులేని బ్రదుకొక్క - దినమైన చాలు
ముట్టులేని కూడొక్క - ముద్దెడే చాలు,
గుట్టు చెడి మను కంటె - కొంచెపు మేలైన చాలు
వట్టి జాలి బడుకంటె - వచ్చినంతే చాలు ॥అప్పు॥

లంపట పడని మేలు - లవలేశమే చాలు
రొంపి కంబమౌకంటె - రోయుటే చాలు,
రొంపపు కోరిక కంటె - రతి వెంకటపతి
పంపున నాతని జేరే - భవమే చాలు ॥అప్పు॥

భౌతిక వనరుల మీద పెత్తనానికి పోటీపడుతున్న స్వార్థపరులకు అన్నమయ్య చేసిన ప్రబోధమిది. సంపద మనిషి కోసమేగాని, మనిషి సంపదకోసం కాదని మెత్తగా చెప్పాడు. మనిషి మనిషిగా బతకడానికి కావలసిన సంస్కారాన్ని అందించాడు.

అన్నమయ్య అనువాద కవి కాదు గాని, సంస్కృత వాఙ్మయ సారాన్నంతా తన పదసాహిత్యంలో ప్రజావాణిలో, ప్రజాబాణీలలో ప్రజలకు అందించాడు. భగవంతుని రైతుగా చేశాడు, బోయనాయుని చేశాడు. వైద్యుని చేశాడు. నేతవానిని చేశాడు. దళిత గోవిందాన్ని ప్రారంభించాడు.

సారాంశంలో అన్నమయ్య భావవాది అయినా, సామాజికంగా సంస్కరణవాది. సంఘసంస్కరణకు భక్తిని సాధనంగా ఎంచు కున్నాడు. తంబూరమీటుతూ ప్రచారం చేశాడు. అందుకే అన్నమయ్య సంస్కరణాత్మక భావవాద కవి.

సమస్య ఎక్కడ పుడితే దానికి పరిష్కారం కూడా అక్కడే పుడుతుంది. సమస్య భారతీయ సమాజానిది. పరిష్కారం కూడా అక్కడే పుట్టింది. ఆస్థానకవులు మన సమాజాన్ని నిలవనీటిమడుగుగా చేస్తుంటే, ఆస్థానేతర కవులు దానిని ప్రవాహంగా మార్చేప్రయత్నం చేశారు. అందుకే వాళ్ళు సంస్కరణవాద కవులయ్యారు.వలసపాలన వచ్చినాక వాళ్ళ ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. ఆధునిక రూపాన్ని సంతరించు కున్నాయి. బ్రిటీష్ వాళ్ళు వచ్చేదాకా భారతీయ సమాజంలోనే చీకటిని తొలగించే యత్నమే జరగలేదన్నది నిజం కాదు. పాల్కురికి సోమన, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం వంటి వాళ్ళు వలసవాదుల కన్నా ముందే "తమసోమ జ్యోతిర్గమయ" అని నినదించారు. తమదైన దారిలో వాళ్ళ ప్రయత్నాలు వాళ్ళు చేశారు. వీళ్ళు ప్రాచీనకాలం నాటి 'అగ్రహ భార్గవులు'.

★ ★ ★

గార్లపాటి దామోదరనాయుడు

## అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకము - వర్ణనలు

ఆంధ్ర వాగ్గేయకారులలో ఆద్యుడు అగ్రగణ్యుడు, రాయలసీమ పొత్తిపినాడులో పుట్టి కొత్తపుంతలు తొక్కినవాడు, కవిపండితులకే గాక ముముక్షువులకు సహితం కొత్త దారులు చూపినవాడు భగవంతుణ్ణి గూడ తన కీర్తనలచే పులకింపజేసినవాడు తాళ్ళపాక అన్నమయ్య. అందుకే వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమయ్యను చదవనివాడు తెలుగు చదివినట్లే కాదని అన్నారు. అన్నమయ్య సంకీర్తనలు, మిగిలిన కృతుల విషయం అటుంచి మనకు లభించిన ఏకైక శతకము ప్రస్తావనే ఈ వ్యాసం. అన్నమయ్య ఈ శతకాన్ని ఏ వయస్సులో, ఏ సందర్భంలో చెప్పినాడో స్పష్టంగా నిర్ణయించడానికి వీలుకాదు. అయితే పండిత విమర్శకులు రచనా కాలానికి సంబంధించి మూడభిప్రాయాలు తెలియజేసి యున్నారు. అందు మొదటి అభిప్రాయం - అన్నమయ్య తన జీవితంలో చిన్ననాడు మొదటిసారిగా తిరుమలకొండనుచేరు సందర్భంలో కొండనెక్కువేళ అలసిపోగా అలమేలు మంగమ్మ కనికరించి నూతన శక్తిని ప్రసాదించగా అన్నమయ్య తన్మయుడై ఈ శతకాన్ని చెప్పినాడనుట విమర్శనా దృష్టితో చూచినపుడు ఈ విషయంలో కొన్ని అను మానములు రాకమానవు. అందు మొదటిది ఇది "అలమేలు మంగాబికా" శతకము కాదు. ఇందు మకుటం "వేంకటేశ్వరా" అనియే ఉంది. అయితే ప్రతి పద్యంలోను 'అలమేలు మంగమ్మ' పేరు కనబడుతుంది. అందులోను గమనింపదగిన అంశం మకుటముగా మాత్రమే కాదు, నాల్గవపాదంలో ఎక్కడ అలమేలుమంగమ్మ పేరులేదు. మొదటి పాదంలో 21పద్యాలలోను, మూడవపాదంలో 13పద్యాలలోను, మిగిలిన 66 పద్యాలలోను రెండవ

పాదంలో అలమేలుమంగమ్మ పేరు చెప్పబడింది. ఈ శతకములో వర్ణింపబడిన అలమేలు మంగాంబికా శ్రీవేంకటేశ్వరుల ప్రణయం పిన్న వయస్సుల ఊహలకు అతీతం.

ఇక రెండవ అభిప్రాయం - అన్నమయ్య తిరుమల చేరు సమయానికి ఆనాటికి పూజాది కార్యక్రమాలు ముగించి ఆలయ ద్వారాలు మూసివేసినారని అన్నమయ్య ఆశువుగా ఈ శతకం చెప్పగా ఆలయ ద్వారాలు తెరుచుకొన్నాయని ఐతిహ్య విషయం లోను అనుమానాలు కలుగకమానవు. ముందు తెలిపినట్లుగానే అన్నమయ్య అంత చిన్న వయస్సులో ఈ శృంగారాన్ని చెప్పగలిగినాడా అనేది ఒకటి. అంతేగాక శతకంలో ఎక్కడ గాని తలుపులు తీసుకోవాలనే భావనతో పలికిన ఆవేదన కనిపించదు. నిజంగా ఈ సందర్భంలో స్తుతి పూర్వకమాన విషయాలు చోటుచేసుకొని ఉంటాయి తప్ప ఈలాంటి శృంగారపద్యాలకు అవకాశం తక్కువ కాబట్టి అన్నమయ్య ఈ రెండు సందర్భాలలో చెప్పిన శతకాలు అలభ్యమైన శతకాలలోనివి కావచ్చు. ఇక మూడవ అభిప్రాయం అన్నమయ్య గృహస్థుడై తిరుమలలో కొంతకాలం నివసించిన పిమ్మట ఈ శతకరచన చేసియుండవచ్చుననుట. ఈ అభిప్రాయం కొంత హేతుబద్ధంగా కనబడుతుంది. యౌవనం లో శృంగార సంకీర్తనలు వ్రాస్తూ మొగ్గుచూపుతూ, అన్నమయ్య ఈ శతకాన్ని చెప్పి యుండవచ్చు. ఈ ఊహను బలపరుస్తూ గ్రంథస్థ ఆధారంగా కూడ ఒకటి మనం గుర్తించవచ్చు. అది శతకములోని 24వపద్యం.

"ఒక్కొక్కనాటి రాత్రి సకలోన్నతుడైన ఖగేంద్ర మూర్తిమూపు
నెక్కి వినోద లీలం జరియించుచు నయ్యల మేలు మంగ మో
మక్కున జేర్చుచున్ బహు విహారములన్ వనవీధులం బ్రియం
బెక్కువగా జెలంగు విధమేమని చెప్పుదు వేంకటేశ్వరా!"

తిరుమలలో గురుడసేవ రాత్రులలో జరుగుతుంది. అలమేలుమంగ, వేంకటేశ్వరులు ఊరేగడాన్ని అన్నమయ్య దర్శించిన అనంతరమే ఈ శతకం వ్రాసిఉంటాడని భావించ వచ్చు.

శ్రీవేంకటేశ్వర శతకములో మొత్తం వంద పద్యాలున్నాయి. అందులోని వస్తు వైవిధ్యాన్ని మూడువిధాలుగా విభజించవచ్చు.

1.పురాణ సన్నివేశాలు

2. అలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుల ప్రణయాత్మకాలు

3. మధురభక్తి ప్రదర్శకాలు

అన్నమయ్య ఈ శతకములో వేంకటేశ్వరుని అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరులు దివ్యులని స్పష్టంచేశాడు. అలమేలు మంగమ్మను

"దుగ్ధ పయోధి కన్య జలధుల్ జగముల్ దనకుక్షి నున్న సు
స్నిగ్ధ కృశోదరాంగి తులసిం బ్రియురాలలమేలు మంగ"
. .. . . . . . . . . . . . . . . . . . . .శ్రీయలమేలుమంగ భూ
ధరునకు నాదిలక్ష్మియన తత్త్వ మహత్త్వ రహస్య వేత్తలం
బరమున నుండి నీవనిత బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా -

అని శ్రీవేంకటేశ్వరుని

"ఇతడలమేలు మంగ విభుడీతడెవో కలశాబ్ధి కన్యకున్
సతతము జిత్తమిచ్చిన రసజ్ఞుడు ప్రాజ్ఞుడు సర్వవైభవో
న్నతుడు రమాపతి ప్రియుడు నందక శార్ఙధరుండటంచు ని
న్నతివలు మెచ్చిమెచ్చి కొనియాడుదు రెప్పుడు వేంకటేశ్వరా!"

అని వర్ణించిన అంశాలు పురాణ సన్నివేశాలుగా గుర్తింపవచ్చు. ఇవేగాక పాలసముద్రాన్ని చిలుకువేళ లక్ష్మి ఆవిర్భవించడం శ్రీ మన్నారాయణుడు పరిగ్రహించడం మొదలైన అంశాలు పురాణ సన్నివేశాలుగా గుర్తింపవచ్చు. ప్రణయ రంగాన నాయికా నాయకుల చూపులకు వాని ఆంతరంగిక అర్థాలకు ప్రాధాన్యతను గుర్తింపవచ్చు. అన్నమయ్య అలమేలుమంగా వేంకటేశ్వరుల దృక్ప్రణయాన్ని రసరంజితం చేశాడు. ఉదాహరణకు

"కన్నులు గల్గి కొమ్మనిను గప్పముఁజేకొన
మెఁఱుంగు ఁజూపుకనుగొల" (ప 5)

"కన్గొనల నొయ్యన ఁజూచిన నీవిభుండులోఁ
గకవికఁ దర్చుఁ జేరునల" (ప 7)

"కూరిమి సానపట్టిన చకోరపు ఁగన్నుగొనక
దళుక్కునన్ జేరువ మించులై మెఱయు" (ప 8)

"ఆ కనుఁగ్రేవల ముద్దు" (ప 9)

"సంపదల్ సువిస్తరములుగాగఁ గన్గొనల ఁజల్లెడు" (ప 11)

"నిడువాలిక కన్నుల నిగ్గుదేరగా " (ప 13)

"నీ సొలపుల చూపులే విభుని చూపుల విందులు" (ప 14)

"భూజంకెల నందలింపగనె ఁజల్లనె ఁజిత్రము" (ప 21)

"నీ చూచిన చూపులే విభుడు చూచిన చూపులు" (ప 27)

"చూపుకన్నులన్ గులుకుచు నుండ "(ప 33)

"పెడమర చూచి చూపు జళిపించిన "(ప 34)

"నగుమోము చూచి నగివెన్నెల చల్లిన" (ప 34)

"నీ చల్లని చూపు చిల్కి యెదచల్లగ "(ప 38)

"కొఱతలే యెన్న ఁజూచెదవు" (ప 39)

"అలిమేలు మంగ నేత్రాంచల గర్వ వీక్షణ సుహాసముతో" (ప15)

"రెప్పల నవ్వు "(ప 46)

"చిమ్ము జళిపించిన గొనచూపుల గర్వరేఖరా ఁజనకకు మమ్ము"
(ప 52)

"చిమ్ము జలుకం గొనచూపుల బిత్తంబుగా నులచకు మమ్ము"
(ప 53)

"నీ కరుణాకటాక్ష మెట్టిచ్చెదో నాకు నేడు" (ప 55)

"నిడునాలిక చూపు నీ నివాళి" (ప 67)

"చూపులన్ జిగి" (ప 67)

"ధళధళ మించు కన్నుగవతమ్ముల మిమ్ముల ఁజూపు చిమ్మినన్" (ప 95)

పైఉదాహరణలలో మెఱుంగు చూపు, కూరిమి సానబెట్టిన చకోరపు కన్ను మొదలైన ఆలంకారిక వీక్షణాలు, ముద్దుచూపు, చల్లచూపు ప్రశాంత వీక్షణాలు. పెడమర చూపు, చూపులన్ జిగి, సొలపులచూపు మొదలైనవి లెక్కలేనితనాన్ని వయసు పొంగును, విలాసాన్ని స్పష్టం చేస్తాయి. అన్నమయ్య వర్ణనలల్లో సల్లాప ప్రణయం పేర్కొనతగి ఉంది.

సరస సల్లాపం ప్రణయాన్ని పల్లవింపజేస్తుంది. ఈ సల్లాపం సామాన్యంగ లలిత శృంగార భరితం. ఇందు రూపప్రశంస ఎదుటివ్యక్తి చేతల ప్రస్తావన. ఎవరికినీ బాధాకరంగాని విషయ ప్రస్తావన లుండవచ్చు. ఈ ఉల్లాసానికిసమవయస్సు ఏకాంతం ఎదుటి వ్యక్తితోనున్న అనుబంధం దోహదం చేస్తాయి. ఇట్టి సల్లాప ప్రణయాన్ని అన్నమయ్య రసరమ్యంగా వర్ణించాడు.

రూపప్రశంస నాయికను లోగొనుటకై నాయకుడు చేసే ప్రయత్నంలో రూపప్రశంస ఒకటి.

"పక్ష్మలనేత్ర యోచిలుక పల్కుల కల్కి సరోజ వల్లియో
లక్ష్మి లలితాంగియో బహుకళావతియో యలిమేలు మంగనీ
సూక్ష్మవివేక లీలలకు జొక్కితి నంచున భేందు వల్లికా
లక్ష్మి వికాసతన్ సతిఁజెలంగగ ఁజేతో వేంకటేశ్వరా " (ప 19)

అన్నమయ్య వర్ణనలలో తరువాత చెప్పదగింది విరహప్రణయం. పరుగెత్తు వయసులో ప్రకృతి సౌందర్యాన్ని దర్శించి పారవశ్యం నొందడం. రమణీయం సుందర ప్రదేశంలో నాయికానాయకులు యధేచ్ఛావిహారం నెరపడం విహారప్రణయం. అన్నమయ్య సంకీర్తనలలోను శతకంలోను ఇట్టి విహార ప్రణయ సన్నివేశాలు కోకొల్లలు. ఉదాహరణకు -

"అందవుకోసి యిమ్ము విరులంచును జేరలమేలు మంగ ని
న్నుందగ (గోర (జెక్కులటు నొక్కిన నాకును నందవంచు న
య్యెందు ముఖి ప్రియం బలర నెత్తుచుం బువ్వులు కోయ (జేయని
ష్యంద మరంద ఘర్మరస సంగతు లబ్బెను వేంకటేశ్వరా!"

(ప 23)

నాయికా నాయకులు వనవిహారంలో ఉన్నారు. నాయికకు పూలంటే ప్రాణం. దగ్గరలో రంగులవాసనల విరజల్లు పువ్వులు కనబడినాయి. తనకందకుండా పోవడం నాయిక నాయకుని వేడుకుంది. తనకు ఆ పువ్వులు అందవని నాయకుడు నాయికని ఉడికించి చివరకు పువ్వులను కోయించాడు. నాయిక కోరినది పువ్వులు. నాయకుడు కోరుకుంది పువ్వులాంటి సతీమణిని. ఇట్టివి వనవిహార ప్రణయ సన్నివేశాలు. ఇవేగాక పురవీధుల్లో నాయికానాయకుల విహార ప్రణయాన్ని అన్నమయ్య వర్ణించాడు. వీనిలో వనవిహారాదులు ఉన్నాయి.

"వెలయ వసంత వేళ వన వీధుల సంపంగి పువ్వుటిండ్లలో
నలరుచు (బుష్ప వృష్టి నల పార్చుచు నీ వలమేలుమంగతో
నలరగ నేగి వచ్చి యల పారగ గస్తూరి నీట మజ్జనం
చెలిమి వహించి గంధ తతులన్నియు గ్రమ్మర మజ్జ నంబుపెం
పొలయగనాడు తీర్థమల్ నుబ్బ పయోధులు వేంకటేశ్వరా"

(ప 41)

"వెలయ(గ వేంకటాచలము వీధుల (గమ్మని పుష్ప వృష్టి కిం
పలరగా వే(గి వచ్చి పార(గ నయ్యల మేలుమంగతో
నలర(గ గోరకమ్ముల లతాంగన లిమ్ముల సేస (జల్ల(గాం
గలకల నవ్వ మిమ్ముం గలకంఠ శుకావళి వేంకటేశ్వరా
"కనకపుం బీఠినెక్కి రతి కాంత శరాకృతి నీవు వీధులం
జనునెడ నీదు చెంగటం బ్రసన్నతతో నలమేలు మంగ కాం

చన నవ కింకిణీరవము సన్నపు ధాళ గతిన్ రచింపగాఁ
గనుగవ మోక్ష రతి గౌఁగిట ఁజేర్తువు వేంకటేశ్వరా " (ప 57)

"ఒక్కొక్క నాటి రాత్రి సకలోన్నతుఁడైన ఖగేంద్రమూర్తిపై
నెక్కి వినోద లీల జరియించుచు నయ్యల మేలుమంగ మో
మక్కువ ఁజేర్చుచున్ బహు విహారములన్ వనవీధులం బ్రియం
బెక్కువగా జెలంగు విధమేమని చెప్పుదు వేంకటేశ్వరా"

(ప 24)

అన్నమయ్య కుపిత ప్రణయాన్ని వర్ణించిన తీరు అమృతం. కుపిత అనగా అలుక పూనిన అతివ అని సామాన్యార్థం స్త్రీ కుపిత కావడానికి భర్తృ తిరస్కారం ప్రధానకారణం. భర్త దక్షిణనాయకత్వ వ్యవహారం తనకు గిట్టక పోవుట కారణం కావచ్చు. శ్రీ వేంకటేశ్వర శతకంలో అలిమేలుమంగమ్మ అలుకకు పై రెండునూ కారణాలే.

మంగమ్మ వేంకటేశ్వరుని పట్ల అకారణంగా అలిగింది. ఆమె అలుక అర్థంలేనిదని చెలికత్తెలకు బాగా తెలుసు. కాబట్టి వారు మధ్యవర్తిత్వాన్ని సమ్మతించి నాయికకు ఇట్లా అనునయించారు.

"పెనగఁకు మమ్మ్మ చిమ్మ్మ జళిపించిన చూపుల గర్వరేఖ రాఁ
జెనకకుమమ్మ్మ లేఁజెమట చెక్కుల నో యలమేలు మంగ నీ
ఘనుడు కళావినోది రతికాంత విలాస సహస్ర మూర్తి వ
ద్దని పొలయల్కదీర్తురు లతాంగులు నీ సతి వేంకటేశ్వరా"

పెనుగులాట వల్ల సంసారం నడివీధుల పడక తప్పదని హెచ్చరిక. గర్వరేఖ అనర్థానికి దారితీస్తుందని మరొకసారి హెచ్చరిక. నీ ఘనుడు కళావినోది అనుటలో స్వామిలీలా వినోదాలు స్మరణకు తెచ్చుకోమని మూడవసారి హెచ్చరిక.

నాయకుడు నాయికమీద కోపగించుకొని ఇల్లు వదిలాడు. నాయిక నాయకుడు రాక పోవునాయని కొంత భరోసాతో ఊరుకున్నది. కాని

నాయకుడు రాకపోవుటతో ఆమె గుండెలో రాయిపడింది. చివరకు ఆందోళన ఆవేదనగా ఆశ్రువులుగా బయటకు పొక్కింది.

"తలచిన గుండె జల్లనును దల్లడ మందెడు నేమిసేతు నా
చెలువుఁడు రాఁడటంచు లలసీనవి వోయలమేలుమంగ నీ
తొలకరి మించు నెమ్మనము తొయ్యలి ఁజూడక యెట్టు లోర్తునో
యలుగకు మన్న మానవిట నైనను నెన్నడు వేంకటేశ్వరా"
(ప 64)

ధనవంతుడు డాబుకోసం గాని దర్పంకోసం గాని వీధులవెంట తిరిగే నైజం. కాని, సతి ఈ తిరుగుడులను సహించదు. పైగా గుట్టు చప్పుడు కాకుండా నాయకుడు తిరిగి వస్తే సతి సహిస్తుందేమో కాని సాధ్యంకాని అంశం. ఈ నేపథ్యాన్నే అన్నమయ్య

"ఎక్కడి కేఁగి వచ్చితి రమేశ్వర నీ తను దివ్య గంధ మే
చక్కని యింతి మేని దని సారెకు నీ యలమేలు మంగ నీ
చెక్కు గళంబు గోళ్ళ వడి ఁజేర్చుచు నీవలపార్చి వేడుటల్
మక్కువ గల్గు కాంతలకు మర్మరహస్యము వేంకటేశ్వరా"
(ప 34)

అని వర్ణించాడు. 'రమేశ్వర 'అనడంలో నన్ను వివాహమాడినా నీకు రమపై మనస్సు పోయిందా అని దెప్పిపొడుపు. రమ అనగా లక్ష్మి, లక్ష్మి సంపదకు చిహ్నం కాబట్టి ధనవంతులకు ఈ తిరుగుడులు సహజమని లోక నైజాన్ని చాటినట్లైంది.

పద్మావతి దగ్గర శ్రీనివాసునికి చీవాట్లు తప్పనట్లే లక్ష్మి దగ్గర తప్పలేదు. ఈ విషయాన్నే అన్నమయ్య

"అంబర మెల్ల ఁజంద్రమయమై నటు లామదనాంకముల్ మెయిన్
బంచిన నేడవంచు సిరి పల్కిన నయ్యలిమేలుమంగ పా
దంబుల యాన వెట్టితివి తమ్మి యగుళ్ళని నీకు బొంకులే
సెంబళమా యె నెవ్వరికి ఁజెల్లవు రంతులు వేంకటేశ్వరా"(ప 97)

'మును శిశువు నేడిపింపగా ముద్దురాదు' అని ప్రసిద్ధి. ఏడిపించి ఎదుటి వ్యక్తిని లోగొనుట లౌకిక వ్యాపారం. ఇట్టివి శృంగార సన్నివేశాలలో రసవత్తరం. ఈ విషయాన్నే అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునిలో ఆపాదించి రమ్య చిత్రమొకదానిని సాక్షాత్కారింపజేసాడు.

"చెఱఁగిడఁగాన దల్చెదవు చేరిన దిట్టెదు కౌగిలించినన్
గొఱతలెయెన్న జూచెదవు కోపము వద్దలిమేలుమంగ నా
వెఱపి కలైన దీర్పుమని వేడ్కల నీవు మనోజ లీలలన్
దటితరి నింతి గూడుటలు దత్తరపాటులు వేంకటేశ్వరా" (ప 39)

అట్లే విరహప్రణయం విషయం గూడ గుర్తింపదగి ఉంది. విరహమనగా ఎడబాటని అర్థం. 'విప్రలంభం వినా శృంగారపుష్టిః నవిద్యతే' అని అలంకారికోక్తి, నాయికా నాయకుల మధ్య ఎడబాటు కాలాంతరంలో ప్రణయాధిక్యానికి దారితీస్తుంది. అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకంలో అలిమేలుమంగమ్మ విరహాన్ని బహుధా వర్ణించాడు. అలంకరణలపట్ల వైముఖ్యం విరహంలో తొలిమెట్టు. అందు వలననే శ్రీవేంకటేశ్వరవిరహంతో

"తుఱుమఱ వీడె బయ్యెదయు దోడనె జాఱె మెఱుంగు ఱెప్పలన్
బరవశభావ మేర్పడియె బాయకనీ వలిమేలుమంగ నీ
వరుని దలంచితో యనుచు వాసన మేనుల దీప కామినుల్
సరగున నీలతాంగి కుపచారము సేతురు వేంకటేశ్వరా"(ప 91)

అని అన్నమయ్య వర్ణించాడు. అలంకరణల వైముఖ్యానంతరం నిరంతర నాయక ధ్యానంతో నాయిక దశావస్థలకు గురికావడం విరహంలో రెండవ మెట్టు. ఈ దశను అన్నమయ్య -

"తలఁచుఁగరంగు మైమఱచుఁ దన్మయ మందును జిత్తజాగ్నిని
న్నలయుచు దూరు నుస్సురను నర్మిలితో నలమేలు మంగ నీ
వలిగిన నంతనే కడు బ్రియం బిక నేమని చెప్ప నేడు వో
కలిగిన ప్రేమ మింతియుఁ బ్రకాశముతో చెడు వేంకటేశ్వరా"
(ప 15)

అని అలంకార శాస్త్రానుగుణంగా అభివర్ణించాడు. నాయిక విరహావస్థకు గురియయినపుడు నాయిక పరిస్థితి దినమొక గండమైనపుడు చెలికత్తెలు ఈ దురవస్థకు కారకుడైన నాయకుని అభిశంసించడం సహజం. ఈదృష్టితో అన్నమయ్య తానేచెలికత్తెయై

"మాయల మేలుమంగ చల మా యలయించెద వెంత సేసినన్
దోయజగంధి నీకు మతి తోడనె తక్కిన దల్క నోపునా
చేయగ నేర్చు లివె చేయుదు గాక లతాంగ సాయ కుం
డి యెడఁ జేయు వేదనల కిన్నియు దోడగు వేంకటేశ్వరా" (ప 78)

అని నాయకుని మందలించాడు. అలిమేలుమంగ వేంకటేశ్వరుల విరహంలో అధ్యాత్మిక రహస్యం ఉంది. జీవాత్మ పరమాత్ముని సాన్నిధ్యం కోల్పోయి పరితపించడం ఇందలి విరహం. నిరంతర ధ్యానంతో అనవరతనామ శ్రవణంతో జీవుడు తన తప్పిదమెరిగి పునః పరమాత్మ సాక్షాత్కార మొందడం ఇందలి పరమార్థమని పండిత విమర్శకుల అభిప్రాయం.

ఇక వినోద ప్రణయాన్ని కూర్చి ఆలోచిస్తే ఇంటి పట్టున నూతన దంపతుల చేతలు వినోదాత్మకాలు. ఇట్టి వినోదాలందు అన్యోన్యాను రాగం అనుకూల దాంపత్యం సుప్రతిష్ఠితమవుతుంది. ఈ వినోదాలకు చెందిన దృశ్యాలు నూతన దంపతులకే కాక ఇంటిల్లిపాదికి మనో రంజకాలు. తాళ్లపాక అన్నమయ్య ఇట్టి దృశ్యాలనెన్నిటినో శతకంలో వర్ణించాడు. వానిలో ఆరగింపు, ఆటలు, తూగుటుయ్యాల సేవలు చెప్పుకోవడానికి భోజనసమయం, శయ్యా సమయాలు మాత్రమే సాధ్యం. కాబట్టి అన్నమయ్య ఈ ఆరగింపులకు ప్రాధాన్యమిచ్చి స్త్రీ హృదయాన్ని సాక్షాత్కారింపజేసాడు. ఉదాహరణ

"నించిన పంచదారలను నేతులు దేనెలు గమ్మగాఁగఁదా
లించిన కూరలున్ బరిమళించిగ నయ్యల మేలుమంగ వ
డ్డించిన నిర్మలాన్నములుడెంద మెలర్ప నారగింతు నీ
మించిన దేయు చేతులను మేలము లాడుచు వేంకటేశ్వరా"(ప 16)

డెందమెలర్పగ నారగించుటకు డెందము నిండిన ఇల్లాలు కూడ కారణం. ఇది రోజువారి వంట. పండుగ దినాలలో కలవారి వంట తీరు తెన్నుల్ని అన్నమయ్య

"అరిసెలు నూనె బూరియలు కాఁగులు జక్కెర మండిగల్ వడల్
బురుడలు పాలమండిగలపూపము లయ్యలమేలుమంగ నీ
కరుదుగ విందు వెట్ట పరమాన్నచయంబులు సూపకోటియున్
నిరతి వినిర్మలాన్నములు నేతులు సోనలు వేంకటేశ్వరా" (ప 50)

భోజనానంతరం భుక్తాయాసముతో తూగుటూయలు ఊగడం సహజము. వైష్ణవుల వివాహతంతులో ఊయలూగుట ప్రధాన దేశీయఆచారము. అంతేగాక నిత్యపూజా కైంకర్యంలో ఏకాంతసేవ వేళ ఊయల అమరిక ఒక భాగం. వీటినన్నిట్ని సమన్వయించే తీరులో తాళ్లపాక అన్నమయ్య

"ఒప్పగు తూగుటుయ్యేలల నూగుచు నీ వలిమేలు మంగతో
నప్పుడు కౌగిట న్నతుల నాకటి పెల్లున నప్పళించుచున్
జెప్పల నవ్వుతో మనసు అచ్చలతో నఱగన్ను లార్చుచున్
దెప్పల దేలు సౌఖ్యమిది దేవ రహస్యము వేంకటేశ్వరా " (ప 46)

సంభోగావస్థకు దారితీసే ప్రణయ సన్నివేశాలన్ని దీనికిందకే వస్తాయి. సంభోగవర్ణనం దైహికాంగ ప్రస్తావన మానసికానంద ప్రస్తావన ప్రధానాంశాలు. తాళ్లపాక అన్నమయ్య తన వేంకటేశ్వర శతకంలో రెండూ వర్ణించి ఇతర కవులకన్నా మిన్న అనిపించుకున్నాడు.

"ఆయలసంబు లానడవు లాకనుగ్రేవల ముద్దు
చూపులా యామల నవ్వుమాటల ప్రియంబులు (ప 9)

అనడంలో స్వామి సంయోగ సౌఖ్యవిలాసాలు సూచించబడుతోంది.

"చెదరిన చిన్నిలేగురులు చెక్కిన జాఱగ ముద్దు
మోముతో వదలిన కొప్పుతోడ నిడువాలిక

కన్నులు నిగ్గదేరగా నుదుటున నిన్ను గూడి (ప 13) అనడంలో నాయికకు ఉన్న రత్యానురక్తి సూచింపబడింది.

"దర్పక రాజ్యసంపదలు తన్మయకోటులు రాగ లోక సం
తర్పణముల్ లతాధర సుధా పరిధానములాసన వ్రతుల్
కర్పుర గంధ సౌఖ్యములు గ్రక్కిన శ్రీ యలిమేలు మంగకుని
మార్పడు దేహ సంగతుల మర్మపుజేతుల వేంకటేశ్వరా" (ప 96)

అనడంలో అనంత ఆనందమునకు చరసీమ అవుతోంది.

అలిమేలుమంగా వేంకటేశ్వరుల కలయిక జీవాత్మ పరమాత్మల కలయికలాంటిది. జీవుడు పరమాత్ముని చేరడానికి తపించినట్లు పరమాత్ముడు కూడ భక్తుల కొరకు జీవాత్మల కొరకు తపించుననడం భక్తిమతం. ఈ తపనలో నిరీక్షణ అడ్డంకులున్నను చివరికి కలయిక చరమావస్థ అవుతుంది. భౌతిక దృష్టిలో జీవాత్మ పరమాత్మలకు భేదంగాని అలౌకిక దృష్టిలో రెండు కూడ ఒకటే. కాబట్టి, అన్నమయ్య అలిమేలుమంగ వేంకటేశ్వరుల అభేదత్వాన్ని పదేపదే ప్రస్తావించాడు.

"అతడె నీవు నీవనగ నాతడు నీ పలుకే తలం
పగా నాతని పల్కు నీ హృదయం మాతడెపో "
"సరే నలమేలు మంగకును జక్కని మీకును మీకు
మీకు లో నరుదుగా నేకత
స్ఫురణ నమ్మడ వోయితి రొక్క రొక్కరున్" (ప72)

"ఓయలమేలు మంగ యిది యొ
క్కటి పో జగదేక భర్తకున్ బాయని నీకును
గడమ ప్రాణము ప్రాణము నేకమాయె" (ప 76)

సంభోగంలోను ఉదాత్త అధ్యాత్మిక భావనలలోను ఇటువంటి స్థితి సాధ్యమవుతుంది గాని ఇతరత్రా సాధ్యం కాదు.

శ్రీవేంకటేశ్వర శతకమున అలమేలు మంగమ్మకే ప్రాధాన్యం. అనగా స్త్రీ శక్తికే ప్రాధాన్యం. ఈ శక్తిని భావించి కొలిచిన వారిని పేరుపేరున అన్నమయ్య పేర్కొలేదు గాని వాళ్ళలో దేవతానికరం, మునియోగ సమూహం, తాత్త్వికనికరం, సామాన్యులు కనిపిస్తారు.

ఈ వర్గములో బ్రహ్మాదిదేవతలు దేవయోనికి చెందిన స్త్రీలు కనిపిస్తారు. శ్రీవేంకటేశ్వరుడు అలిమేలుమంగారతుడు. అతని అనుగ్రహం కావాలంటే భక్తాదులకు అమ్మఅనుగ్రహం తప్పదు. అమ్మ అనుగ్రహం కొరకు బ్రహ్మాది దేవతలు వేచి ఉండడం తప్పనిసరైంది. అందుకే -

"అలిమేలుమంగ మమ్మేలిన తల్లి నీవిభున
కించుక మాదెస చూపుమంచు నీ పాలిటి
చేరి మొక్కుదురు పద్మభవాదులు" (ప 5)

అని అన్నమయ్య వర్ణించాడు.

"ఓ చెలియో లతా ప్రతిమ యోమృగలోచన యో చకోరిరో యో చదురాల చిలక యో అలిమేలుమంగ నీ చూపులో విభుడు చూచిన చూపులటంచు" (ప 27) అని పరిహాసం చేస్తుంటాడు.

మౌనం పాటించేవాడు ముని. లౌకిక లంపటంపట్ల మౌనం అతని ధ్యేయం. పరమాత్మ సాక్షాత్కారం అతని చింతన. ఆ ధ్యానం, ధ్యానంలో నిలిచిన మూర్తి తిరముగ ఉండడానికై మౌనం తప్పని సరి. అట్లే సురాపానంతో తనివి చెందినవారు కూడ అలౌకికాను భూతులై అమ్మను ప్రార్థింతురు. ఈ అంశమునే అన్నమయ్య

"తరుణ మహా నిధానమ సుధామయ కూప సమస్తవైభవా
భరణమ దేవదేవుని కృపామతి యో యలమేలుమంగ నీ
కరుణయ చాలు లోకములఁ గాపఁగ నంచు మునీంద్రులున్ సురల్
నిరతి నుతించి మ్రొక్కుదురు నీప్రియకాంతను వేంకటేశ్వరా"

(ప 12) అని పేర్కొన్నాడు. "అలిమేలు మంగ నీ చేతిదే సర్వ జంతువుల జీవనమంతయు" (ప 17) అని విశ్వాసం ఉంచి ప్రార్థించినారు. తాత్త్వికులు అలిమేలు మంగమ్మను ఆదిలక్ష్మిగనే భావింతురు. వినూత్న పరిమళం, విశిష్ట ప్రభావోపేతం నిర్మలాభరణం నిత్యవైభవం అనేది ఆదిలక్ష్మికే ఉంది. ఇలాంటివి అలిమేలు మంగమ్మలో కనిపించడంవల్ల

తత్త్వమహత్వ రహస్యవేత్తలు అలిమేలు మంగమ్మను ఆదిలక్ష్మిగానే సేవిస్తారు.

అలిమేలుమంగను గూర్చి ఇతరులు స్తుతించిన సందర్భాలు కలవు. "ప్రపంచ మంతకున్ తల్లి సమస్త జీవుల నిదానము నీ చల్లని చూపుచిల్కి వెదజల్లగ పుణ్యులమైత్రి మంద్రు భూమెల్లన్ (ప 38) "చొచ్చితి తల్లి నీ మరుగు సొంపుగ నీ కరుణా కటాక్ష మెట్లిచ్చెదో " (ప 55) అని "నీ చూచు కృపానిరీక్షణమె చూచెద" (ప 89) "యోగ్యతలేని కష్టుడన యోగ్యుడనన్నిట జూడ గర్భనిర్భాగ్యుడ నీ కృపామతికి ప్రాప్తుడ" (ప 99) అని సామాన్యులు అలిమేలు మంగను స్తుతించినట్లు అన్నమయ్య వర్ణించాడు.

★ ★ ★

భమిడిపాటి విశ్వనాథ్

## అన్నమయ్య - హిందీకవుల భక్తితులనాత్మక పరిశీలన

"మోక్షసాధన సామాగ్ర్యాం భక్తిరేవ గరీయసీ" అన్నది ప్రసిద్ధమైన ఉక్తి. భక్తి నవవిధములని భక్తజన నిర్ణయం. ఈ నవవిధ భక్తులు ప్రముఖ భక్తకవులైన అన్నమయ్య లోనూ, ఇతర భాషా కవులైన కబీరు, సూరదాసు, తులసీదాసు, (మీరాబాయి) మొదలైన వారందరి రచనలలోనూ భిన్న భిన్న రూపాలలో దర్శనమిస్తాయి. ఈ తొమ్మిది విధాలైన భక్తిమార్గాలు ఉత్తరోత్తరా అత్యుత్తమమై చివరకు ఆత్మ నివేదనంతో పరిపూర్ణమై పరిపూర్తి చెందుతాయి.

భక్తి భావన భారతీయుల మూలతత్త్వం. భక్తితోపాటే పదకవిత ప్రారంభమైంది. వేద సూక్తాలే మొట్ట మొదటి పదాలన్న రాళ్లపల్లి వారి మాటలు, సామవేదం గానయోగ్యమైన దన్న విషయం సర్వామోద యోగ్యమే కదా.

దాక్షిణాత్య భాషల్లో ప్రముఖ వాగ్గేయకారుడైన అన్నమాచార్యులు పదరచన చేసి భక్తితత్త్వాన్ని ప్రబోధించిన విధంగానే హిందీభాషలో సూరదాసు, కబీరుదాసు, తులసీదాసు, మీరా మొదలైన ఔత్తరాహ వాగ్గేయకారులు కూడా తమతమ పదాలు రచించి సామాన్య జనసముదాయానికి భక్తిమార్గాన్ని చూపించారు. వీరు భక్తితోపాటు నీతి, వైరాగ్య, జ్ఞానాదుల్ని సైతం ప్రబోధించారు. ముక్తికి మార్గం సుగుమం చేశారు. అన్నమయ్య రచనల్లో ప్రతిఫలించిన లక్షణాలు సూరదాసు మొదలైన ఉత్తరదేశ హిందీ కవుల్లోనూ కన్పిస్తాయి. అన్నమయ్యలోని భక్తినీ, ఇతర హిందీకవుల్లోని భక్తి తత్త్వాన్ని అధ్యయనం చేసి ఆయా భాషల్లోని సామ్య

వైషమ్యాలు తెలియ జెప్పడమే ప్రస్తుతోద్దేశ్యం. ఈ పరిశీలన వలన ఆయా భాషా సాహిత్యాల సన్నిహిత బాంధవ్యాలను మరింత స్పష్టంగా నిరూపింప వీలవుతుంది. వీటిలోని సమానతల్ని సమీక్షించి, వైషమ్యాలను విశ్లేషించ వీలవుతుంది. ఈ తులనాత్మక అధ్యయనం వల్ల, ఆయా సాహిత్యాలలోని సూక్ష్మాంశాలను తెలుసు కోవటం ఒక ఎత్తైతే, జాతీయ సమైక్యతకు (National Integration) ఎంత గానో తోడ్పడటం మరోఎత్తు. తన్మూలంగా భాషలు వేరైనా, వాగ్గేయ కారులు వేరైనా, అన్నిభాషల, సాహిత్యాల, వ్యక్తుల భావాలు ఒక్కటే అన్న ప్రధానాంశం ప్రస్ఫుట మౌతుంది.

సూరదాసు జన్మతః అంధుడు (క్రీ.శ. 1478 - 1583).'అష్టచాప్'' అనిపేరు గడించిన ఎనమండుగురు వల్లభాచార్యుల శిష్యులుగా పేరుగడించారు. అందులో సూరదాసు ప్రముఖ భక్తాగ్రేసరుడు. అక్బర్ సమకాలీనుడు. ఆగ్రా పరిసరప్రాంతాల్లో జీవనం గడిపాడంటారు.

అన్నమాచార్యులు 32వేల పదాలు రచించినా, కేవలం 14వేలు పదాలు మాత్రమే ప్రస్తుతం లభిస్తు న్నాయి. సూరదాసు లక్షాపదివేల పదాలలో ఈనాడు కేవలం పదివేల పదాలు మాత్రం లభిస్తున్నాయి.

అన్నమాచార్యులు మరియు సూరదాసుల జీవితాలలో కొన్ని సమాన అంశాలు ఉన్నాయి. ఇద్దరూ భోగభాగ్యాలను తిరస్కరించి రాజాజ్ఞను ధిక్కరించిన అభిమాన ధనులే.

"........... హరి హరీయనుచు
పరమ పతివ్రతా భావంబుఁ బూని
హరిముకుందునిఁ గొనియాడు నా జిహ్వ
నినుఁ గొనియాడంగ నేరదెంతైన
నను నెట్లు పలికితి నైచ్యంపుఁ బలుకు
నాయచ్యుతునిఁ దక్క నన్యుని వినుతి
సేయుట నా కన్న చెలియలి వావి"

అని తనపై పదాలు రచించి పాడమన్న సాళ్వనరసింగరాయల్ని అన్నమయ్య తిరస్కరిస్తే, అక్బర్ ఆజ్ఞను తిరస్కరించి తన మనమున నందనందనుడే పరిపూర్ణంగా నిండిఉన్నాడనీ, మానవ స్మరణం సముచితం గాదని ధిక్కరించిన మహామహితాత్ముడు సూరదాసు.

"నాహిఁ నరహ్యౌ మన్‌మేఠౌర్
నందనందన అభత్‌కైసె ఆనిమే ఉర్‌ఔర్
చలత్, చితవత్, దివసజాగత్, సపనసోవత్‌రాతి
హృదయతేఁ వహ్, సామమూరతి, భన్‌న ఇత ఉత జాతి
కహత కధా అనేక ఉధోలోక లాభాదిభాయ"

అని మానుష ప్రశంసను తిరస్కరించాడు.

అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలన్నీ ఆత్మనివేదనానికి, (శరణాగతి తత్త్వానికి) నిదర్శనాలు. అన్నమాచార్యుల భక్తి ప్రపత్తి శరణాగతి యేనన్న ప్రధానాంశం అతని అధ్యాత్మ సంకీర్తనలన్నింటిలోనూ వ్యక్తమౌతుంది.

"ఇంతట గావఁ గదే యిందిరా నాయక నన్ను
పంతానఁ గాకా సురునిఁ బాలించినట్లు
దించని పంచభూతాల దేహము మోచితిగాన
నించిన యజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ పట్టుపడ్డ వాడగాన
యించరాని పాపములే యిన్నియుఁ జేసితిని"

ఇలా అన్నమాచార్యుల భక్తితత్త్వాన్ని నవవిధరీతుల అనేకమైన ఉదాహరణలతో దర్శించ వచ్చు. మచ్చుకు మాత్రమే పైన వివరించడం జరిగింది.

అన్నమయ్యలోని ఈ ఆత్మార్పణా గుణాన్ని మనం సూరదాసు లోనూ దర్శింపవచ్చు. వీరిరువురి జీవనంలోని ప్రత్యణువూ ఆ స్వామికే అంకితం.

"రామ రస రీతి (రీతి), నఇ బరని అవై
ఇస రిజ మన్ద, యహ జ్ఞాన, యహ ధ్యాన హై ।
దరస దమ్పతి భజన సార గాఊఁ
హవై రహో నరదహ పాఊఁ" అని సూరదాసు తన కవితను మంత్రాలుగా అభివర్ధించి లోకార్పణ గావించుకొన్నాడు. అన్నమయ్య కూడ తన పదాలను మంత్రాలుగా అభివర్ధించడం మనకు విదితమే కదా.

సూరదాసు శ్రీకృష్ణబాల్య క్రీడల్ని వర్ణించడంలో మహాదిట్ట. అందుకు ఒక ఉదాహరణ.

"సోభిత్ కరో నవనీత్ లియే
ఘుటరన్ చలత్‌రేను తను మండిత్ ముఖ్ దధిలేప్‌కియే
చారుకపోల లోచన్ గోరోచన్ తిలక్ దియే
లట్‌లట్ కనిమను మత్తమధుప్ గన మాదక్ మధుహిపియే
కఝురాకంఠ్, వ్రజకే హరినభో రాజత్ రుచిరోహియే
ధన్యసూర్ ఏకోపల్ హరిసుఖ్ కాసత్ కలప్ జియే"

బాలముకుందుని పై సౌందర్యాన్ని వీక్షించిన ఒక్కక్షణం చాలు అంటాడు సూరదాసు. నూరు కల్పముల జీవితమేల? వ్యర్థము అని అంటాడు.

సూరదాసులోని ఈ వర్ణనా వైదగ్ధ్యాన్ని అన్నమయ్యలోని పెక్కు కీర్తనల్లో మనం దర్శించవచ్చు. ఎందరెన్ని విధాల వర్ణించినా శ్రీకృష్ణుని సౌందర్యం వర్ణనాతీతమైన సర్వకాలామోద యోగ్యమే కదా.

ఈ వాగ్గేయకారులందరి పదాల్లోనూ శృంగార రసం సందర్భశుద్ధితో వర్ణింపబడింది. అది వాత్సల్య సఖ్యస్నేహాది మధురభక్తి రీతులలో కొనసాగినది. అన్నమయ్య రచించిన భక్తి, ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలలో, శృంగార సంకీర్తనల సంఖ్యే అధికమని విమర్శకుల అభిప్రాయం. అందునా మధురభక్తి మధురమంజులంగా మనకు సాక్షాత్కరిస్తుంది. మధురభక్తిని వ్యంజింపజేయడంలో జయదేవుని తరువాతిస్థానం అన్నమయ్యదే. అన్నమయ్య వర్ణించిన శృంగారం ఐహికమైన భౌతికమైన శృంగారం

కాదు. అది అలౌకిక శృంగారం. భగవంతుని భక్తికి సంబంధించిన శృంగారం. "రసోవైసః" అన్న సిద్ధాంతానికి ప్రబలమైన తార్కాణం.

అన్నమయ్య నాయికగా, శ్రీవేంకటేశ్వరుడు నాయకునిగా రచించిన ఈ క్రింది పదాలు మధురభక్తికి పరాకాష్ఠ. చక్కని ఉదాహరణ

"అదిగాక సౌభాగ్య మదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికిఁ గలదా
ప్రాణ వల్లభునిఁ బెడబాసి మరుబాణముల
ప్రాణేశ్వరుడు దన్నుఁబాయజూచిన యపుడు
ప్రాణంబుమేనిలోఁ బాయంగ వలదా . . .."

పై పదాలలో జీవాత్మ పరమాత్మలో సంలీనం చెందటం మనం గమనించ వచ్చు.

ఈ సందర్భంగా సూరదాసు రాధామాధవ తత్త్వాన్ని ప్రస్తావించక తప్పదు. వీటికి ప్రబల తార్కాణం జీవత్ ఉదాహరణ రాధయే. రాధ స్వచ్ఛమైన మానసిక ప్రవృత్తిని సూరదాసు అద్భుతంగా చిత్రించాడు.

రాధా మాధవ మాధవ రాధా కీట భృంగగతి హ్వైజుగఈ
సూరదాస ప్రభురాధా మాధవ వ్రజబిహార - నిట నఈ నఈ

అని విస్తృతంగా వర్ణించాడు. ఆ విస్తృత వర్ణనకిది సంక్షిప్త రూపం.

"హప ఔర తుమ మేం కోఈ అన్తర నహీ హై " అని చెప్పడం ద్వారా జీవాత్మ పరమాత్మల సంలీనాన్ని వర్ణించాడు సూరదాసు. ఇది అన్నమయ్య సూరదాస్‌ల భావ సామ్యంలో భాగమే.

ఈ విధంగా పరిశీలన చేస్తే అన్నమయ్య సూరదాసు రచనల్లో, అనేకానేక సామ్యవైషమ్యాల్ని అనేక కోణాల్లో ఉటంకించవచ్చు.

అన్నమయ్య మరియు మీరాబాయి పదాల్లో కూడ అనేక తులనాత్మక అంశాలు పరిశీలనా పరిదిలో ఉన్నాయి.

మీరాబాయి మహిళగా మధురభక్తిని పండించగా అన్నమాచార్యులు పురుషుడై తన పదాల్లో మధురభక్తిని నిరూపించు కున్నాడు. మీరా భక్తిగీతాలు సుమారు 2400. ఇవన్నీ రాజస్థానీ, గుజరాతీ, వ్రజ, హిందీ భాషలలో రచింపబడినవి. ఇవన్నీ సంగీత సాహిత్యాలకు ఆటపట్టులు. కృష్ణభక్తికి ప్రతినిధులు.

మీరా చేసిన బాలకృష్ణుని వర్ణనను గమనిద్దాం.

"బసోమేరే నైననమే, నందలాల్
మోహనీ మూరత, సాంవరీ సూరతనైనా, బనే బిసాల్
అధర సుధారస మురలీ రాజత ఉర వైజయంతీమాల్
క్షుద ఘంటికా కటితట సోభిత నూపుర సబ్బరసాల్
మీరా ప్రభు సంతన సుఖదాయీ భాగతబభల గోపాల్ "

మీరా అచంచల కృష్ణభక్తి అన్నివిధాలా అన్నమాచార్యుని విష్ణుభక్తితో పోల్చదగినది. ఈ సందర్భంలో అన్నమయ్యలోని భావుకతా లక్షణానికి ఒక ఉదాహరణ

"ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తురినిండెను
భామిని విభునకుఁ వ్రాసిన పత్రిక కాదుగదా
కలికి చకోరాక్షికి గడ కన్నులు కెంపై తోచిన
చెలువంబిప్పు డదేమో చింతింపరే చెలులు
నలువున బ్రాణేశ్వరునిపై నాటిన యా కొనచూపులు
నిలువున ఁ బెరుకగ నంటిన నెత్తురు గాదుగదా ".

పై పదాలలో భావుకత ననుసరించి భావమూ, భావాన్ని అనుసరించి భాష ఒకటికి మించి మరొకటి పోటి పడుతున్నట్లు విశద మౌతోంది. ఇది అన్నమాచార్య ప్రతిభా సంపదకు చక్కటి నిదర్శనం. ఈ విధంగా మీరాబాయి కృష్ణుని వర్ణించినా అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని వర్ణించినా ఇరువురి ధ్యేయవస్తువు భగవంతుడే పరమాత్మ అయి ఉన్నాడు.

## ముగింపు

ఒకేభాషలోని కవులను గూర్చిన తులనాత్మక పరిశీలన చేయటం ఒక పద్ధతి. వేర్వేరు భాషల్లోని కవులను గూర్చిన తులనాత్మక అధ్యయనం మరోపద్ధతి. మొదటివానిలో ఒకభాషలో ప్రవేశముంటే చాలు. కాని రెండవ దానిలో వివిధ భాషలలో ప్రవేశము గలగటం చాలా అవసరం. దీనవలన పరిశోధనా పరిధి పెరుగుతుంది. ఆయా భాషల్లోని భేదసాదృశ్యాలు విశదమౌతాయి. ఈ ఆధునిక యుగంలో ఆరంభింపబడిన తులనాత్మక పరిశీలన ప్రత్యేక ప్రతిపత్తిని సంతరించుకుంది. ఇప్పటికీ దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల లోను, తులనాత్మక అధ్యయనానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటై ఆ దిశలో అధ్యయనం, పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇది ఎంతైనా ముదావహ పరిణామం. మున్ముందు ఈ రంగంలో మరింత అధ్యయనం కొనసాగాలని, ఇది జాతీయ సమైక్యతకు, భక్తి సమగ్రతకు ఉపయోగకారి కాగలదు.

★ ★ ★

T. Surendra Reddy

# CULTURAL LIFE AS REFLECTED IN ANNAMAYYA'S SONGS

Annamayya needs no introduction to the Andhras in particular and to Indians in genaral. He authored 32,000 songs, (Sankirtanas) but only 14,000 have seen the light of the day. Since about a decade research is being done extensively in different universities about his works. A comparative study of the songs of Annamacharya which those of "Purandara - dasa" in Kannada has been done by scholars. In his songs, with are dedicated to the god Venkateswara of Tirumala, Annamayya refers to beliefs and customs, traditions and folk tradition etc. of his times. The purpose of the present essay, is to present a brief account of the social life. as can be gleaned from the songs of Annamayya.

Annamayya mentions different religious sects which were in practice in his times. Of them the reference to Virasaivism is noteworthy.

వింత చదువుల వల్ల వేవేలు మతాలు గంటి 2-256

పెక్కుమతములు చూచి బె ండు పడ్డవారు లేరా 2-495

అరుత లింగము గట్టి యది నమ్మ జాలక
ఏరువత యేగినబత్తుడ నైతి 1-13

అక్కటా రావణు బ్రహ్మహత్య నీకు నేడది
పుక్కిటి పురాణ లింగపూజ నీకు నేడది 3-494

కలకాలమునకు లింగము మీది యెలుకయై
తలకొనియె నాత్మ పరితాపము 1-321

He describes the ardent devotion of Virasaivites. He disapproves theirasaivite practices like offering one's own limbs and even "self - immolation" by Virasivities which were not necessary to reach the supreme goal, that is mukti. By the descriptions, we come to know about the Virasaiva customs and belief which were in practice in Andhra even during the Vijayanagara period.

Annamayya describes the entertainments that were in vogue in his days.

He describes that in the full moon - light, people were spending time happily, by singing a particular type of songs called "Jajara patalu". He also describes the rituals and entertainments related to marriages, like pouring, Talambralu (sacred - rice) by bride and bridegroom on each other's head.

జాగుల నవ్వులు నవ్వి జాజర పాటలు వాడి
బాగుగా నప్పటిఁ గొంత భ్రమయించేవు 23- 245

తొల్లే అన్నిటా బుద్ధి మంతురాలవమ్మా
చల్లఁగా నితనికి నొజ్జల వైతివమ్మా
తొడమీఁద ఁగూచుండి దోసిలించి తలఁబాలు
విడువక చల్లేవమ్మా వేమారు నీవు
పడఁతినీవిభుని కోపము మానుమని అవే
జడియక పెట్టే మంత్రాక్షతలాయనమ్మా 13-343

The utla - utsavam is very popular during the period of Vijayanagara, This is associated with the birth day of Sri Krishna (the 8th day of the dark fortnight of the Sravana month - Sri Krishna - Jayanti)

పైకొని చూడరో వుట్ల పండుగ నేడు 3-161
ఆకడ గొల్లెతలకు నానందము నేడు

పలువురా వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను 12- 57

Kaumudi - Mahotsavam is another popular source of entertainment in the moon - lit night.

సందెకాడ బుట్టి నట్టి చాయల పంటయెంత
చందమామ జూడరమ్మ చందమామ పంట 4-342

The customs followed by the Andhras in the marriages are beautifully describe by Annamayya in one of his songs. They include the symbolic selection of the bride <u>(Knaya - varanam),</u> Kanya-danam (giving away the bride to bride groom) <u>Talambralu</u> as noted above, the removal of curtain held between bride and bride groom after the <u>Kanyadana,</u> tying of sacred thread to the wrist of the bride and bridegroom <u>(Kankana - dharana),</u> touching the big toe of each other by bride and bridegroom and such other practices which are special to Andhras.

అదె పెండ్లి తెర యెత్తిరండనే వసిష్ఠుడుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా

మొదల రాముని కంటె మునుచి తలఁబాలు బోసి
సుదతి యాతని మోము చూడవమ్మ
కంకణ దారాలు గట్టి కాలు దొక్కితివి మీరు
పొంకాన బువ్వ మందరో పొత్తులనమ్మ 26-40

Many details about various practices related to marriages in Andhra are describe by Annamayya beautifully.

పెట్టని కోటిందరికిఁ బెండ్లి కొడుకు బొమ్మ
బెట్టె నసురలకెల్లఁ బెండ్లి కొడుకు 5-186

పిడికిటి తలఁబాల పెండ్లికూఁతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లి కూఁతురు 5- 185

సుంకుల బెండ్లిపీఁట గూచుండ బెట్టరో 14- 365

ముచ్చటలే నగవుల ముంగిట ముగ్గులు వెట్టి
నిచ్చ కల్యాణములాడినే నెలత

కంకణ దారములను కట్టరో యిద్దరికిని 14- 365

ఒక్కటైరి కొంగుముళ్ళు వొనరఁగ వేయరో 14- 365

Annamayya also refers to the dowry system in his songs. Of the dress and ornaments of his times Annamayya refers to andelu (anklets) which are very much liked by woman.

చేరి యందెల మోతతో చెన్నకేశవా
యీ రీతి మాడు పూరిలో నిట్లాడేవా 3-179

Head - gear (Tala - paga) in particular was worn by men. People, both men and women, were arranging the hair in a fashionable way called "Koppu" in Telugu. References to Tambulam, garlands can be seen very often in his songs, which found favour during the Vijayanagara period.

The well known four fold caste systems was very much in practice during the period of Annamayya. He never approved the caste - system and advocated strongly that anybody, irrespective of his caste, if surrenders himself totally to the god Venkateswara is worth emulating. He condemns the caste system in quite a few songs, which shows his averseness to his social evil.

సహజపు వర్ణాశ్రమము లివెల్లా
యిహమునఁ దా ధరియించినవే 4-10

వట్టి నటరాజసాలు వర్ణాశ్రమములును 4-235

వర్ణాశ్రమములాల వడిఁ జిత్రగుప్తులాల
వర్ణించి మమ్మిఁక దడవకురో మీరు 4-229

కొఱమాలి ఉన్నవేళ కులము చెడినవేళ
చెఱపడి వొరుల చేజిక్కిన వేళ 2-158

పదిలమగు కులము గల ఫలము తాఁ జదువుట
చదివిన ఫలం బర్థ సారంబు గనుట 1- 236

Among the beliefs and customs of the Andhras during Annamayya's period is 'sode' (tradition of predicting future by women of certain social groups).This particular belief is described by Annamayya with reference to the god Venkateswara.

ఎరుక చెప్పే నీయిచ్చ యెల్లా నెరుఁగుదు
మెరుఁగైన సొమ్ములిచ్చి మెచ్చవయ్య నన్ను 7-312

The other social groups referred to by Annamayya are chenchus, boyas, yadavas, reddis, and kapus, and also the panchamas. In one of his songs Annamayya says that "brahmana" and "chandala" are equal, in the view of god.

మొల్ల లేలెనాకు తన్నె ముడుచు కొమ్మనవె నే
జెల్లపూవు కొప్పు తావి చెంచు దానను 6-108

చెంచులా గొల్లెతలా మెచ్చిన యట్టి వాఁడవు
మించి నే నొక్కతెనే మెప్పించేనా 23- 136

పొలసి మీసాల పెద్ద బోయనాయుఁడు
మలిగి వీఁపున ఁగట్టే మంకు బోయనాయుడు
పొలము రాజై తిరిగే బొయనాయు ఁడు
వెలయ మోటున నుండే వే ఁట బోయనాయుడు 1- 460

మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁడుండేటి సరిభూమి యొకటె 2-385

కులమున మొదలనే గొల్లవారము 3- 310

కైవల్య మొసగు ఘననిధి విధికిమ
హావిధి జడులకు యాదవకులుడు 1-317

తిమ్మి రెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము 4-52

కాపుటూరి మంగలోజు గది మీద రాజురాగా
కాపులెల్లో పనిమాని కాదినయట్లు

మచ్చరించి అల్లనాడు మాలవాడు కాలదన్ని
తెచ్చిన యప్పటి ధర్మదేవతవు 1-87

He refers to the profession of weaving and their expertise in the process of making different varities of cloth. He also describes the traders who sell various articles. Similarly he refers to various professions like medical, agriculture, goldsmith, pottery, weaving the cloths etc. It is importanat to note that he refers to the people of the tribe called dommaris in many of his songs.

పంచ భూతములనెడి పలువన్నె నూలు
చంచలపు గంజివోసి చరి సేసి
కొంచెపు కండెల నూలి గణముల నేసి
మంచి మంచి చీరలమ్మే మూరు బే హారి 1-275

వేద వేద్యులు వెదకేటి మందు
ఆదినంత్యము లేని మందు 1-2

కాపులము నేము కర్తవు నీవు
దాపు దండైమము నిట్టే దయ జూడవయ్యా 3-487

కుమ్మర దాసుఁడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల యిచ్చిన వాడు 1-151

దిమ్మరి జన్మము లేదు తెగని కోరిక లేదు
పమ్మి నీపైఁ బెట్టినట్టి భారమే కాని 2- 86

The dommaris are known for their acrobatics. They visit villages to entertain the people and earn their lively - hood. Many

professions are described by Annamayya in detail. A number of household articles find reference in his songs.

ఉట్ల మీఁదటనున్న పాలు వెన్నా
చట్ల తోడనే సాధించీ 23- 331

పాల కడవలను బానల వెన్నలును

గంపెడుముక దినగా నొక వరిగింజ
తెంపున గలసితే తెలియ నెట్టు వచ్చు 2-494

చాపకింది వెల్లువాయఁ జాలదా సరసము 26-113

పెక్కువగా నుట్లులో బిందెల నించిన వవే
చక్కనె యశోద బిడ్డకు జాటేరు సుండీ 1- 256

రోఁకలి వంటి వాఁడ రోటిలోని పోట్లకు
యేఁకట నన్నెటు వలె నేలితివి దైవమా 4- 23

సుదతి యుద్ధము చూచి చుక్క బొట్టు వెట్టుకోఁగా
వుదుటున నిప్పుడే వొడి వట్టేవు 22-168

అలసితి నంటా నలరుఁ బానుపుఁ మీద
పులకల మేనితో బొర లెడిని 5- 117

ఉయ్యాల మంచము మీఁద వొరసే నీ నాయకుని
కొయ్యా రతుల కాఁగిటి గూఁట బెట్టరాదా 21-144

తుద పిందె దిగినట్టు దోమతెర మరఁగున
నిదురవో తా బొంకేవు నేరు పరివయ్యా 23-130

ఎట్టు బొంకెద వె చెలి యిందాఁక బంగారు
పట్టె మంచము మీఁద బవళించి నీవు 5-184

పరపుపైఁ బవళించి పచ్చిగానే నిన్నుఁ గూడి
సరుస మోములు చూచి సారెకు నవ్వి 22-88

The cross cousin marriage (menarikam) which is common among the Andhras is referred to by Annamayya in his songs.

మేన వాఁడ వటుగాన మెడగట్టు కొనిపించె
తానె అలమేలు మంగ తమక మేలా 7- 202

నారాయణుడు భువినరుడు దా గాగానే
మేర బాండవు లెచ్చిరి మేనవావిని 3 - 258

He describes the different charecteristics of men and women in his songs.

నీవుమగవాఁడవు నీ వెట్టుండినాఁ జెల్లు
ఎనలేక యిటువంటి యెమ్మెకా డవంటానే కా 13- 51

మగవాఁడు మాయకాఁడు యీ
జగడంపు జనవులు సతము లౌనాయమ్మ 6- 54

పతితోడ సతికి పంత లాడం దగదు
మితి మీరి గర్వమున మించంగ దగదు

ఆడువారు కడుఁ గోపులవుట నీవెరగవా
నేడు గొత్తలుగా భూమి నేర్చుక వచ్చేరా

ఆఁడుదానికి సిగ్గులే అందపు సింగారాలు 13- 308

నిగిడి మగువ ఎంత నేరుపరి యైనాను
మగని కిచ్చుకురాలై మనవలెను

అటుగాన పతితోడ నలుగకు నీవు
కుటిలుడు గాడతిని గుణమెరుగుదును

In all his songs whatever the theme Annamayya chooses he relates it to Lord Venkateswara and exhorts people to surrender themselves absolutely to Him in order to get liberation

from the cycle of births and deaths. It is really astonishing that Annamayya's devotional songs paint a graphic picture of his contemporary society, and he does not hesitate to condemn the social evils like caste system. Indeed, his songs (sankirtanas) have valuable information about cultural history of the medieval Andhra.

## BIBL OGRAPHY


1. అన్నమయ్య, తాళ్లపాక : తాళ్లపాక పదసాహిత్యము సంపుటములు, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1999.
2. ఆనందమూర్తి, వేటూరి : తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు, ప్రభాకర ప్రచురణలు, హైదరాబాదు,1974.
3. గంగప్ప, ఎస్ : అన్నమాచార్య సంకీర్తన సుధ, శశీప్రచురణలు, గుంటూరు, 1995.
4. గోవిందరాజు, చిట్రాజు : తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవవిశేషాలు, శ్రీనివాస ప్రచురణలు, రామసముద్రం, 1987.
5. లీలావతమ్మ, పొన్నా : అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో స్త్రీధర్మాలు, పొన్నా పబ్లికేషన్స్, పానకం, 1994.
6. శివప్ప,దాశెట్టి : తాళ్లపాక అన్నమయ్య సాహిత్యంలో తెలుగునాడు, జోత్స్న స్రవంతి పబ్లికేషన్స్, రామాకుల పల్లె, 1990.
7. సుగుణ, ఎన్ : అన్నమాచార్యుల సంకీర్తనలు - స్త్రీసంబంధి పాటలు, పద్మావతి అర్ట్స ప్రింటర్స్, హైదరాబాదు, 1986.


★ ★ ★

# వ్యాసకర్తల చిరునామాలు

1. డా॥ వాణి, కేసర్ల
అన్నమాచార్య ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి - 517 507
09393608525

2. అనంతనారాయణ,టి
రీసర్చి అసిస్టెంట్, ప్రాచ్యపరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
0877-2252221

3. డా॥ నారాయణన్, టి.యస్.ఆర్
అసిస్టెంట్ ప్రొఫెసర్
రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం
తిరుపతి

4. డా॥ నాగభూషణం, కాసల
రీడరు, తెలుగుశాఖాధ్యక్షులు
డి. జి. వైష్ణవ కళాశాల
చెన్నై - 600 106

5. డా॥ రాజగోపాల చక్రవర్తి, వేదాంతం
విష్ణు అపార్టమెంట్స్, Ist Floor,
మాచవరం
విజయవాడ
ఫోన్‌నెం : 9440515570

6. ఆచార్య గోవిందస్వామి నాయుడు, యం
భాషాశాస్త్ర విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
0877-2243697

7. డా॥ సుబ్బారావు, పి. వి
విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ తెలుగు
సి. ఆర్. కళాశాల
చిలకలూరిపేట

8. డా॥ వేంకటేశ్వర్లు, బి
తెలుగు శాఖాధిపతి
ద్రావిడ విశ్వవిద్యాలయం
శ్రీనివాసవనం
కుప్పం-517 425
09441330511

9. డా॥ సాంబశివరావు, గుమ్మా
రీడర్, తెలుగుశాఖాధిపతి
ఆంధ్రలొయోల కళాశాల
విజయవాడ - 520 008
ఫోన్‌నెం: 9849265025

10. ఆచార్య లలితరాణి, సి 0877-2260975
అసోసియేట్ ప్రొఫెసర్, సాహిత్యవిభాగం 2287649-270
రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం
తిరుపతి

11. ఆచార్య సుందరం, ఆర్వీయస్
498, చిత్రభానురోడ్డు
కువెంపునగర్
మైసూరు - 570 023
ఫోన్‌నెం: 0821-2561038 / 09814015759

12. బాలసుబ్రహ్మణ్యం, జూలకంటి
ఇంటి నె. 6-8-918, మేడమీద
ఎన్.జి.ఓ. కాలని, తిరుపతి - 517 502
ఫోన్‌నెం: 0877- 2234306

13. ఆచార్య చలపతి, గల్లా
విశ్రాంతాచార్యులు
5-69-34, శ్రీకృష్ణనగర్
యస్. వి.యు. పోస్టాఫీసు
తిరుపతి -2
ఫోన్‌నెం: 9885826626

14. డా॥ లక్ష్మణయ్య, సముద్రాల
18-1-84, కె.టి.రోడ్డు
తిరుపతి
ఫోన్‌నెం: 0877- 2230679

15. డా॥ కల్పన, బి
పరిశోధక విద్యార్థిని
భాషాశాస్త్ర విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
0877-2248524

16. ఆచార్య బాలగంగాధరరావు, యార్లగడ్డ
13-8/1 కృష్ణనగర్
విజయవాడ - 520 007
ఫోన్‌నెం: 0866- 2552010, 9849499169

17. డా॥ ప్రభాకరరావు, ముదివేడు
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
0877-2262114, 09441872536

19. ఆచార్య గంగప్ప, ఎస్
సుధర్మ, శ్రీనివాసనగర్ కాలని
గుంటూరు - 522 006
ఫోన్‌నెం: 0863 - 2231805

20. ఆచార్య మునిరత్నం, జక్కంపూడి
విశ్రాంతాచార్యులు
తెలుగు అధ్యయనశాఖ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
ఫోన్‌నెం: 0877-2248524,

21. డా॥ చంద్రమౌళి, ఎలవర్తి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రాచ్య పరిశోధన సంస్థ

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
09441407227

22. ఆచార్య సుబ్బారావు, పర్వతనేని
తెలుగుశాఖ
ఆంధ్ర విశ్వకళా పరిషత్తు
విశాఖపట్నం - 3
ఫోన్‌నెం: 9848337287

23. డా॥ వసుమతీదేవి, శేషభట్టర్
2-6-1217, కె.ఎన్.ఎన్. రెడ్డికాలని
సుబేదారి
హనుమకొండ
ఫోన్‌నెం: 9866778206

24. డా॥ యువశ్రీ, డి
లెక్చరర్ ఇన్ తెలుగు
1-2-98, IInd Floor
ప్రకాశంరోడ్డు, తిరుపతి
09885940011

26. డా॥ వెంకటేశ్వర్లు, పి. సి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
093466991163

27. ఆచార్య చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం
తెలుగు శాఖాధిపతి
యోగివేమన విశ్వవిద్యాలయం
వేమనపురం, కడప
09440222117

28. ఆచార్య దామోదరనాయుడు, గార్లపాటి
తెలుగు అధ్యయనశాఖ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
09849621757

29. ఆచార్య విశ్వనాథం, భమిడిపాటి
తెలుగు శాఖ
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం
వారణాసి
09415447563

30. డా॥ సురేంద్రరెడ్డి, టి
అసిస్టెంట్ ప్రొఫెసర్
ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి - 517 502
09849348421

★ ★ ★

హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుఁడీతఁ డన్నమయ్య ॥పల్లవి॥

వైకుంఠనాథుని వద్ద వడిఁబాడుచున్నవాఁడు
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య
ఆకశపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

క్షీరాబ్ధిశాయి నిట్టే సేవింపుచునున్నవాఁడు
ఆరితేరి తాళ్లపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండల తేజమువద్ద నున్నవాఁడు
ఆరీతుల దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య
భావింప శ్రీ వేంకటేశు పాదములందె వున్నవాఁడు
ఆ(వశో?)వ భావమై తాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

సంపుటం 2, సంకీర్తన 100

అప్పని వరప్రసాది అన్నమయ్యా
అప్పసము మాకె కలఁడన్నమయ్యా

అంతటికి నేలికైన ఆదినారాయణుఁడన
యంత రంగాన నిలిపీ నన్నమయ్యా
సంతసానఁ జెలువొందె సనకసనందనాదు
లంతటివాఁడు తాళ్లపాకన్నమయ్యా

బిరుదు టెక్కెములుగా బెక్కు సంకీర్తనములు
హరిమీఁద విన్నవించె నన్నమయ్యా
విరివి గలిగినట్టి వేదముల యర్థమెల్లా
అరసి తెలిపినాఁడు అన్నమయ్యా

అందమైన రామానుజాచార్య మతమున
అందుకొని నిలిచినాఁడన్నమయ్యా
విందువలె మాకును శ్రీ వెంకటునాథుని నిచ్చె
అందరిలోఁ దాళ్లపాక అన్నమయ్యా

సంపుటం 10,



పేరు ఆచార్య చిట్రాజు గోవిందరాజు

జననం 01-01-1952

కళాశాల చదువు బి.ఎ. - యస్.వి. ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.
ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి., యు.జి.సి. రీసెర్చ్
అసోసియేట్, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

వృత్తి 1989 నుండి అధ్యాపకత్వం,
ప్రస్తుతం ప్రాచ్య పరిశోధన సంస్థలో ఆచార్యులు
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

ఇతర రచనలు :

- తిరుమలలో తిరునాళ్లు (1985).
- తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవ విశేషాలు (1987)
- అన్నమయ్య వ్యాసావళి (1988)
- తమిళంలోని పొడుపు కథలు (1989)
- పదార్చన (1993)
- విద్య - మానవహక్కులు (సంపాదకత్వం 2003)
- సాహితీ నవనీతం (2006)
- గ్రంథపరిష్కరణ విధానాలు (సంపాదకత్వం 2008)

ఓ.ఆర్.ఐ. ప్రచురణలు

- తిక్కన (2005)
- హితోపదేశము (మూడవభాగం - పరిష్కరణ 2006)

ముద్రిత హ్యాసాలు, ప్రసంగాలు

- వివిధ పత్రికలలో సుమారు 85 వ్యాసాలు
- రేడియో ప్రసంగాలు 53
- జాతీయ, అంతర్జాతీయ సాహితీ సదస్సులలో పత్రసమర్పణ 95

C.N. Printers, Tpt. Ph : 2251371